# అతీతం

పి.శ్రీధర్
(న్యూ ఎనర్జీ కాన్షియస్‌నెస్ మాస్టర్)

www.darmam.com

## విషయ సూచిక


1.బ్రీతింగ్ ........ 5-6

2.పన్నెండు దివ్య జాగృత లక్షణాలు ........7-10

3.ఛానెలింగ్ అంటే ఏమిటి ......11-12

4.ఇది మీ గురించే ! ......13-18

5.మీ అంతరంలోని ఆడశిశువూ మగశిశువుతో బంధాన్ని ఏర్పరుచుకోండి .....19-28

6.మీ జీవితం నుంచి కష్టాలను విడుదాల చేయండి ......29-40

7.ఆధీనం మరియు అదాపు ......41-63

8.పురుషశక్తి మరియు స్త్రీశక్తి ......64-79

9.మనోభావాలతో వ్యవహరించే విధానం ......80-95

10.పని, డబ్బు మరియు సృజనాత్మకత ....96-108

11.ఆరోగ్యరాఅనారోగ్యం .....109-121

12.సెక్సువాలిటి మరియు స్పిరిచువాలిటి .....122-137

13.మార్గదార్శకులు .....138-152

14.కొత్తశకంలోని బాంధావ్యాలు ......153-175

15.మీ సొంత చైతన్యం యొక్క సామర్థ్యం .......176-180

16.విశ్వసంబ ంధిత జన్మబాధా .......181-187

17.ఆనందాన్ని మీ మార్గద-ర్శకంగా అనుమతించండి .....188-194

18.అహంకారం నుంచి హృదాయం వైపూ మొదాటిభాగం ......195-217

19.అహం నుంచి హృదాయం వైపూ రెండవభాగం .....218-236

20.హీలర్‌గా రూపొందే మార్గంలోని ఆటంకాలు .......237-255

21.సమయం మరియు మల్టీడైమెన్షనాలిటి ......256-265

22.ఆధ్యాత్మిక మాతృత్వం ......266-275

23.మీ జన్మ కుటుంబాన్ని విడుదాల చేయండి ......276-296

24.కొత్తశకం యొక్క పిల్లలు .......297-308

25.మన పిల్లలకి గైడ్ చెయ్యడం ......309-328

26.కొత్త భూమి .....329-346

27.హృదాయం నుంచి పొట్ట వైపు (ఆత్మ యొక్క ప్రయాణాన్ని పూర్తి చేయడం) .....347-353

28. ఆనందాం మరియు సృజనాత్మకత ద్వారా మిమ్మల్ని మీరు స్థిరపర్చుకోండి ...... 354-365

29.మరణం మరియు ఆవలివైపు .....366-378

30.తెలియని ప్రదేశాలకు భయమే ఒక దిక్సూచి .....379-394

31. కొత్తశకంలో టీచర్‌గా ఉండడం .....395-401

32.అతి సున్నితత్వం నుంచి అత్యున్నత సున్నితత్వం వైపు మీరే ఏంజెల్‌గా రూపొందాడం ..... 402-410

33.శక్తి హరులు .....411-433

34.మౌన ప్రార్ధన .....434-435

35.ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడం "మూల సారాంశాన్ని భౌతిక వాస్తవంగా మార్పు చెందించడం" .....436-441

36.విరాళాలు .....442-443

37.న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్స్ .......444

# బ్రీతింగ్

మీరు ఎరుకతో లోతైన శ్వాసను మీ ముక్కు ద్వారా తీసుకోండి. మీ హృదయంలోకి, మీ పొట్టలోకి వెళ్తున్నట్టు అనుభూతి చెందండి, మీ కాళ్ళలోకి మరియు మీ పాదాలలోకి ప్రవహించడానికి అనుమతించండి. మీరు వదిలే ప్రతి నిశ్వాసను నోటి ద్వారా నెమ్మదిగాను, సున్నితంగాను విడుదల చేయండి.

ఎరుకతో పీల్చే ప్రతీ శ్వాస, మీ శరీరంలోకి జీవశక్తులను తీసుకువస్తుంది. బ్రీతింగ్ అనేది మీ కోసం మీరు చేసుకోదగిన అతి సులభమైన మరియు అతి ఉన్నతమైన పని. మీరు ఎరుకతో శ్వాసను తీసుకుంటూ, దానిని మీ శరీరం ద్వారా ప్రవహించడానికి అనుమతించినప్పుడు, మీ శరీరం తనను తాను శక్తివంతం చేసుకోవడానికి ఇది సరైన సమయమని తెలుసుకుంటుంది. ఇది మీ యొక్క ప్రతి భాగంలోను సమంగా శక్తులను ప్రవహింపజేస్తుంది.

మీరు ఎరుకతో శ్వాసించినప్పుడు, అది మీ మనసును కూడా శాంతపరుస్తుంది. మీ తలలో వినపడే మాటలు మరియు మానసికపరమైన ఆందోళనలు ప్రశాంతమవుతాయి. మీ మనసు ప్రశాంతమవుతూ, మీ వాస్తవంలోకి ఆత్మ ప్రవాహాన్ని అనుమతిస్తుంది.

ఒకసారి లోతుగా శ్వాసను తీసుకోండి. మీరు శ్వాసించినప్పుడు మీ పొట్ట భాగం నిండా గాలిని నింపండి. మీ శరీరంలోని ప్రతీ భాగం ద్వారా, ఇది ప్రవహించడానికి అనుమతించండి.

ఎరుకతో లోతైన శ్వాసను తీసుకోండి. మీరు ఎరుకతో శ్వాసించినప్పుడు, మీలోని ప్రతీ భాగానికి మీరు జీవితాన్ని ఎంపిక చేసుకుంటున్నారని ఇది తెలియజేస్తుంది. అంటే మీరు భౌతిక శరీరంలో జీవించడాన్ని మరియు జీవితం మీకు అందిస్తున్న ప్రతీ దానిని అనుభవించడాన్ని ఎంపిక చేసుకుంటున్నారు అని.

ఎరుకతో కూడిన లోతైన శ్వాస ద్వారా, మీరు ఇక్కడ ఉండడాన్ని ఎంపిక చేసుకుంటున్నట్టు, మీరు మీ శరీరానికి, మీ మనసుకి మరియు మీ ఆత్మకు చెబుతారు. మీరు ఇక్కడ ఉండడాన్ని ఎంపిక చేసుకున్నప్పుడు, మీ జీవితం అందించే బహుమతులు మీ దగ్గరకు రావడం ఆరంభిస్తాయి. మీరు మీ శ్వాస ద్వారా ఇక్కడ ఉండడాన్ని ఎంపిక చేసుకుంటున్నారనే విషయం మీ ఆత్మకి తెలిసినప్పుడు, అది మీ జీవితంలోకి ఆరోగ్యాన్ని తీసుకువస్తూ, మీ శరీరాన్ని శక్తివంతం చేస్తుంది మరియు అది మీ జీవితంలోకి సమృద్ధిని తీసుకువస్తుంది.

మీరు ఎరుకతో కూడిన లోతైన శ్వాసను తీసుకున్నప్పుడు, మీ వాస్తవంలోకి జీవితాన్ని అనుమతిస్తున్నట్టు అర్థం. మీరు పరిమితమైన జీవనశైలికి వీడ్కోలు పలుకుతూ అద్భుతమైన జీవితాన్ని గడపడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకుంటారు. మీరు జీవించాలనే వాంఛను అంతరంలోకి శ్వాసించినప్పుడు, దానికి అనుగుణంగా స్పందించాలనే విషయం మీలోని ప్రతీ భాగానికి తెలుసు. ఇది చాలా సులభం, ఇది చాలా ఉన్నతమైనది.

మీ ముక్కు ద్వారా శ్వాసను తీసుకుంటూ దానిని శరీరమంతటా ప్రవహించనివ్వండి. మీ మనసులోకి శ్వాసను ప్రవహించనివ్వండి. లోతైన శ్వాసను, ఎరుకతో కూడిన శ్వాసను తీసుకోండి. జీవించాలనే వాంఛ యొక్క శ్వాసను మీ ఆత్మలోకి ప్రవహించనివ్వండి, మరియు మీ ప్రతీ భాగంలోకి ఈ శ్వాసను స్వేచ్ఛగా ప్రవహించనివ్వండి. లోతైన మరియు ఎరుకతో కూడిన శ్వాస, మీ యొక్క అన్ని భాగాల్లోకి సమంగా శక్తిని ప్రవహింపజేస్తుంది మరియు ఇది మిమ్మల్ని జీవశక్తితో నింపుతుంది.

లోతైన మరియు ఎరుకతో కూడిన శ్వాసను తీసుకోండి. జీవించాలనే వాంఛ యొక్క శ్వాసను, సంతృప్తి యొక్క శ్వాసను, ఆనందం యొక్క శ్వాసను అంతరంలోకి తీసుకోండి.

లోతుగా మరియు నెమ్మదిగా ఎరుకతో కూడిన శ్వాసను తీసుకోండి. ఈ శ్వాసను అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి. ఇది మీ వ్యక్తిత్వం యొక్క ప్రతి భాగంలో ప్రవహిస్తున్నట్లు అనుభూతి చెందండి. ఇది మీ శరీరాన్ని, మనసుని మరియు ఆత్మను కలపడానికి అనుమతించండి.

లోతైన శ్వాసను తీసుకోండి, బ్రీతింగ్ చేస్తూ ఉండండి..... లోతైన శ్వాసను తీసుకోండి..... జీవించాలనే వాంఛ యొక్క శ్వాసను మీ అంతరంలోకి శ్వాసించండి.

దీనిని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయంలోనైనా చేయవచ్చు. ప్రతిరోజు కనీసం రెండుసార్లు  చేయవలెను మరియు చేసిన ప్రతీసారి కనీసం పది నిమిషముల పాటు చేయవలెను.

* * * *

## పన్నెండు దివ్య జాగృత లక్షణాలు

**1. ఒళ్ళంతా నొప్పులు రావడం:**

మనలో ఆత్మ చైతన్యం జాగృతమయ్యేటప్పుడు మన డీయన్యేలో విపరీతమైన మార్పులు సంభవిస్తాయి. వాటి ఫలితంగా మెడ, భుజం, వెన్నుముకలలో నొప్పులు వస్తాయి. ఇవి ఎంతో కాలం ఉండవు.

**2. కారణం తెలీకుండానే లోలోపల చాలా బాధ కలగటం:**

మనం మన గతాన్ని (ఈ జన్మ మరియు గతజన్మలను) విడుదల చేస్తాం. ఈ కారణంగా మీకు బాధ కలుగుతుంది. ఇది ఎలా ఉంటుందంటే, ఎన్నో సంవత్సరాల పాటు ఒక ఇంట్లో ఉండి ఆ ఇంటి నుంచి మరో కొత్త ఇంటికి మారుతున్నట్టుగా ఉంటుంది. కొత్త ఇంటికి మారడం ఎంత సంతోషంగా ఉంటుందో, అలాగే పాత ఇంటిని వదిలి వేస్తున్నప్పుడు ఆ ఇంటి యొక్క జ్ఞాపకాలు, అనుభవాలు మరియు అక్కడి ఎనర్జీ మీలో బాధను కలిగిస్తాయి. ఇది కూడా ఎంతో కాలం ఉండదు.

**3. నిష్కారణంగా ఏడుపు రావడం:**

ఇది పైన చెప్పుకున్న రెండవ దాని లాగే ఉంటుంది. ఆ కన్నీళ్ళను కారిపోనివ్వడమే ఆరోగ్యానికి మంచిది. ఇది మీ అంతరంలో ఉన్న పాత శక్తిని విడుదల చేయడానికి మీకు సహకరిస్తుంది. ఇది కూడా తాత్కాలికమే.

**4. ఉద్యోగంలో ఆకస్మిక మార్పులు సంభవించడం:**

ఇది చాలా సామాన్యమైన లక్షణం. మనం మారుతున్న కొద్దీ మన చుట్టూ ఉన్న పరిసరాలు కూడా మార్పు చెందుతాయి. మనకు తగిన ఉద్యోగం లేదా వృత్తి ఇప్పుడు దొరకలేదని దిగులుపడవలసిన అవసరం లేదు. ఈ పరిస్థితి కూడా ఎంతో కాలం ఉండదు. మనం ఇప్పుడు పరివర్తన ప్రక్రియలో ఉన్నాం. మన ఆసక్తికి తగిన ఉద్యోగం దొరికే లోపల మనం చాలా ఉద్యోగాలను మారవచ్చు.

**5. కుటుంబ బాంధవ్యాలకు దూరమవ్వడం:**

గత కర్మ కారణంగా మనం మన జన్మ కుటుంబంతో బంధాన్ని కలిగి ఉంటాం. మనం కర్మ చక్రాన్ని వదిలి బయటకు వచ్చినప్పుడు, పాత బాంధవ్యాల

యొక్క బంధాలు మన నుంచి విడుదలవుతాయి. మన కుటుంబ సభ్యుల నుంచి, స్నేహితుల నుంచి దూరమైనట్టుగా మనకు అనిపిస్తుంది. అయితే ఈ పరిస్థితి కూడా ఎంతో కాలం ఉండదు. వాళ్ళతో అనుబంధం సరైనదిగా మనకు అనిపించినట్లయితే, కొంతకాలం తర్వాత మనం కర్మ బంధాల మీద కాకుండా న్యూ ఎనర్జీ మీద ఆధారపడే బంధాన్ని ఏర్పర్చుకుంటాం.

**6. అసాధారణమైన నిద్ర:**

మనకు చాలా సార్లు రాత్రిపూట రెండు గంటలకు మరియు నాలుగు గంటలకు మధ్య మెలకువ వస్తుంటుంది. మన అంతరంలో చాలా పని జరుగుతుంది. మన నిత్యజీవితం యొక్క కార్యక్రమాల వలన తరచూ అలసిపోతుంటాం. వీటి నుంచి విశ్రాంతి పొందడానికి మరియు స్వేచ్ఛగా మీతో మీరు ఉండడానికి మీకు కొంత సమయం అవసరం. అందువలన మనకు ఈ సమయాలలో మెలకువ వస్తూ ఉంటుంది. దీని గురించి కంగారు పడనవసరం లేదు. మళ్ళీ తిరిగి నిద్ర పట్టకపోతే అలాగే మంచం మీద పడుకుని మనుష్యుల గురించి, సమస్యల గురించి ఆలోచిస్తూ దిగులు పడకుండా, హాయిగా లేచి మనకోసం మనం ఏదో ఒక పనిని చేసుకోవడం మంచిది. ఈ పరిస్థితి కూడా ఎంతో కాలం ఉండదు.

7. తీవ్రమైన కలలు:

నిద్రలో కలలు రావడం సహజం. యుద్ధాలకు సంబంధించిన కలలు రావచ్చు, లేదా ఎవరో తరుముతున్న కలలు రావచ్చు, లేదా భయంకరమైన జంతువులకు సంబంధించిన కలులు రావచ్చు. మన అంతరంలోని పాత ఎనర్జీని మనం విడుదల చేస్తున్నామని ఈ కలల యొక్క అర్ధం. గతం తాలూకు ఎనర్జీలు తరచూ యుద్ధాలు, తరుముతున్న ఆకృతుల యొక్క రూపాలలో కనపడుతుంటాయి. ఈ పరిస్థితి కూడా ఎంతో కాలం ఉండదు.

**8. భౌతిక గందరగోళం:**

ఒక్కోసారి మనకు భూమి మీద అస్థిరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. మనం ఆధ్యాత్మికపరంగా సవాల్ చేయబడుతున్న అనుభూతిని పొందుతాం. ఇది రెండు కాళ్ళను నేల మీద ఆన్చలేకపోతున్నట్టుగాను లేదా రెండు ప్రపంచాల మధ్య నడుస్తున్నట్టుగాను అనిపించవచ్చు. మన చైతన్యం న్యూఎనర్జీలోకి ప్రవేశిస్తున్నప్పుడు, కొన్నిసార్లు మన శరీరం దీనికి సహకరించనట్లు మనకు అనిపిస్తుంది. న్యూ ఎనర్జీని

మన అంతరంలో స్థిరపర్చుకోవడం కోసం ప్రకృతిలో ఎక్కువగా గడపాలి. ఈ పరిస్థితి కూడా ఎంతో కాలముండదు.

**9. మనతో మనం మాట్లాడుకోవడం ఎక్కువవుతుంది:**

తరచూ మనతో మనం మాట్లాడుకోవడం అధికమవుతోందని గమనిస్తాం. మనం గత 30 నిమిషాల నుంచి మనతో మనం మాట్లాడుకుంటున్నామనే విషయం మనకు ఉన్నట్లుండి అర్ధమవుతుంది. మన అంతరంలో ఒక కొత్త తరహా కమ్యూనికేషన్ ఏర్పడుతుంది. "ఆత్మ సంభాషణ" అనేది సముద్రంలో తేలే మంచు పర్వతపు (ఐస్‌బర్గ్) అగ్రభాగం లాంటిది. నీటి పైన కనపడుతున్న ఆ అగ్ర భాగాన్ని మనం చవిచూస్తున్నామని అర్ధం. ఈ సంభాషణలు పెరుగుతాయి మరియు ఇవి చాలా స్పష్టమైన అవగాహనను మనలో కలిగిస్తాయి. మనం ఏమాత్రం పిచ్చిగా ప్రవర్తించము, మనం మేల్కొంటూ న్యూ ఎనర్జీలోకి అడుగు వేస్తున్నాం.

**10. అందరిలో ఉన్నా కూడా ఒంటరితనాన్ని అనుభూతి చెందడం:**

ఎంతమంది మధ్యలో ఉన్నా, అందరికీ దూరంగా ఒంటరిగా ఉన్న అనుభూతి మనకు కలుగవచ్చు. సమూహాలు మరియు గుంపుల నుంచి దూరంగా ఉండాలని అనిపించవచ్చు. ఎందుకంటే మనం పవిత్రమైన ఒంటరి మార్గంలో పయనిస్తున్నాం. ఒంటరితనం యొక్క అనుభూతులు మనల్ని తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తున్నప్పుడు, ఆ స్థితిని ఇతరులకు వివరించడం మనకు చాలా కష్టమవుతుంది. మనం ఒంటరితనాన్ని అనుభూతి చెందడానికి మరో కారణం మన మార్గదర్శకులు మన నుంచి దూరమైపోయారన్న వాస్తవమే. మన జన్మలన్నింటి యొక్క సుదీర్ఘ జీవిత ప్రయాణంలోనూ వాళ్ళు మన వెంట ఉండినారు. వాళ్ళు మన నుంచి దూరంగా ఉండాల్సిన సమయం వచ్చింది. కాబట్టి మన సొంత దివ్యత్వంతో మనల్ని మనం నింపుకోవాలి. మీరు ఈ స్థితిని కూడా అధిగమిస్తారు. మనలో ఏర్పడిన ఆ ఖాళీని మన దివ్య చైతన్యపు ఎనర్జీతోనూ, ప్రేమతోనూ నింపుకోవటం జరగుతుంది.

**11. ఏదో సాధించాలనే ఆసక్తిని కోల్పోవడం:**

ఏదో సాధించాలనే ఆసక్తిని పూర్తిగా కోల్పోయినట్టుగా అనుభూతి చెందవచ్చు. ఇది సరైనదే. ఇది కూడా ఈ ప్రక్రియలో భాగమే. ఏమి చేయకుండా ఉండడానికి మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ విషయమై మీ అంతరంలో

ఘర్షణ పడవద్దు. ఎందుకంటే ఈ స్థితి ఎంతో కాలముండదు. ఇది కంప్యూటర్‌ని మళ్ళీ బూట్ చేయడం లాంటిది. ఉన్నతమైన జ్ఞానం గల ఒక కొత్త సాఫ్ట్‌వేర్‌ను లోడ్ చేయడానికి తాత్కాలికంగా కొంచెం సేపు మన ప్రక్రియలన్నింటిని ఆపి వేస్తూ కొంత సమయం ఏమి చేయకుండా ఉండాలి.

**12. ఇంటికి పోవాలన్న ఆత్రుత:**

మీ అనుభవాలన్నింటిలో ఇదే అతి కష్టమైనది మరియు సాహసోపేతమైనది. ఈ లోకాన్నే వదిలి పెట్టి సొంత ఇంటికి తిరిగి చేరుకోవాలన్న కోరిక మనలో కలుగవచ్చు. ఇది “ఆత్మ హత్య”కు సంబంధించిన భావన కాదు. ఇది కోపంవలనో, బాధవలనో కలిగే ఆలోచన కాదు. మన కోసం లేదా ఇతరుల కోసం దీనిని ఒక అతిపెద్ద వ్యవహారంగా గాని లేదా నాటకంగా గాని తయారు చేయడానికి ఇష్టపడరు. మన అంతరంలోని ఒక నిశ్శబ్ధపు భాగం ఇంటికి తిరిగి వెళ్ళాలనే వాంఛను కలిగి ఉంటుంది.

ఈ భౌతిక శరీరంలో ఉండగానే మరో కొత్త జన్మను మొదలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. ఈ పరివర్తనా ప్రక్రియలో ఆవలివైపున ఉండడం ఎలా ఉంటుందో అనే దానికి సంబంధించిన జ్ఞాపకం మన అంతరంలో ఉంది. ఇక్కడ ఈ భూమి మీద మరొక ప్రయాణం కోసం మన పేరును నమోదు చేసుకోవడానికి మనం సిద్ధంగా ఉన్నామా? న్యూ ఎనర్జీలోకి పయనించేటప్పుడు వచ్చే సమస్యలను ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉన్నామా? నిజానికి మనం కోరుకుంటే ఇప్పుడే ఇంటికి తిరిగి పోవచ్చు. కాని అనేక జన్మలు తీసుకుని, ఇంతదూరం ప్రయాణించిన తర్వాత ఇప్పుడు కథ మధ్యలో ఆపేసి వెనుదిరగటం సిగ్గుచేటు.

అంతే కాకుండా, ఇతరులు న్యూ ఎనర్జీలోకి రావడానికి సహాయాన్ని అందించడానికి ప్రజ్ఞాత్మకు ఇక్కడ మన అవసరం ఉంది. ఓల్డ్ ఎనర్జీ నుంచి న్యూ ఎనర్జీలోకి పరివర్తనం చెందుతున్న వారికి మనలాంటి మానవ మార్గదర్శకుల యొక్క అవసరం చాలా ఉంది. నూతన దివ్య మానవునికి టీచర్స్‌గా తయారవ్వడానికి తగిన అనుభవాలను మనం నడుస్తున్న మార్గమే మనకు అందిస్తుంది. మన ప్రయాణం కొన్నిసార్లు ఒంటరిగా చీకటిలో ప్రయాణిస్తున్నట్లు అనిపించినప్పుడు, మనం ఎన్నడూ ఒంటరిగా లేమనే విషయాన్ని గుర్తుతెచ్చుకోవాలి.

* * * *

## ఛానెలింగ్ అంటే ఏమిటి

ఛానెలింగ్ అంటే, ఇతర తలాలకు సంబంధించిన 'ఆత్మ' యొక్క సహాయంతో మీకు మీరు దగ్గరవ్వడమే. ఈ ఆత్మ లేదా ప్రాణి తాత్కాలికంగా గురువు పాత్రను పోషిస్తుంది. ఈ గురువు యొక్క శక్తి మీ యొక్క లోతులలోకి వెళ్ళడానికి సహాయం చేస్తుంది. ఈ గురువు శక్తి మిమ్మల్ని భయాల నుంచి బయటకి తీసుకువస్తూ, మీ సొంతకాంతి పొరలో సురక్షితంగా ఉంచుతుంది.

గురువు మీ సొంత కాంతిని మీకు చూపిస్తాడు. మీ కన్నా ఎక్కువగా, మీ గురువుకి మీ కాంతి యొక్క ఎరుక ఉంటుంది. ఈ కాంతి లేదా మీ అంతర్జ్ఞానం అనేది మీకు అందుబాటులో ఉన్నప్పుడు ఈ గురువు యొక్క అవసరం మీకు ఉండదు. అప్పుడు మీ సొంత కాంతి యొక్క ప్రవాహాన్ని మీకు మీరుగా అందుకోగలరు. గురువు, మీకు మరియు మీ ప్రజ్ఞాత్మకు మధ్య ఇకపై వారధిగా ఉండాల్సిన అవసరం లేదు.

నేను కొద్దిసేపు మీ సొంత కాంతిని మీకు గుర్తుచేయాలని అనుకుంటున్నాను. నేను మీ గొప్పతనానికి అద్దంపడుతూ దానిని జెషువా యొక్క రూపంలో చూపించాలని అనుకుంటున్నాను. నాలో, మిమ్మల్ని మీరు మరియు మీ క్రీస్తుతత్వాన్ని చూస్తారు. కాని దీనిని ఇంకా మీరు పూర్తిగా గుర్తించలేదు. నా శక్తి ఒక దీపపు స్థంభంలా మీకు సహకరిస్తోంది. మీ సొంత క్రీస్తుతత్వంతో మరింత లోతుగా బంధాన్ని ఏర్పరుచుకోవడానికి నేను మీకు సహాయం చేస్తాను. ఇది క్రమక్రమంగా మీ జీవితంలోకి ప్రవేశిస్తున్న కొద్దీ, నేను మాయమైపోతాను. ఇదే సరియైనది. ఇది ఇలాగే ఉండాలి. దయచేసి మర్చిపోవద్దు, ఈ బంధంలో నేను మీకోసం ఉంటాను, కాని మీరు నా కోసం లేరు. నేను మీ లక్ష్యం కాదు, కాని నేను ఒక మార్గాన్ని మాత్రమే. క్రీస్తు యొక్క పునర్జన్మ అంటే మీ క్రీస్తుతత్వం యొక్క మేల్కొల్పే గాని, నా పునర్జన్మ మాత్రం కాదు.

మీ ప్రజ్ఞాత్మకు ఏది సహకరిస్తుందో దాని ప్రకారం నేను నటిస్తాను. నా లక్ష్యం ఏమిటంటే మీరు నా అవసరం లేకుండా ఉండడమే. మీరు నన్ను ఛానెలింగ్ చేస్తున్నప్పుడు మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవడానికి లేదా మీ ఉనికి లేకుండా ఉండడానికి ప్రయత్నించవద్దు. మిమ్మల్ని మీరు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని నేను కోరుకుంటున్నాను. మీ నిజమైన శక్తి మీ ద్వారా బయటకు ప్రవహిస్తూ, ఈ ప్రపంచం మీద ప్రకాశించడాన్ని అనుభూతి చెందండి.

గురువు కేవలం మీ కోసం మార్గాన్ని చూపిస్తాడు, కాని మీరే ఆ మార్గంలో నడవాలి. కొంత సమయం తర్వాత, మీ వెనుక గురువు లేకుండా మీకు మీరు ఒంటరిగా నడవడాన్ని కనుగొంటారు. ఇది ఒక ఉన్నతమైన మరియు పవిత్రమైన క్షణం. గురువు మీతోనే ఉంటాడు, మీ హృదయంలో ఒక అంతర్ ఉనికిగా జీవిస్తాడు, కాని ఆ గురువు యొక్క ప్రత్యేకరూపం మాయమైపోతుంది.

మేము మీతో ఎల్లప్పుడూ కలుపబడి ఉంటాం, కాని మీరు ఎదుగుతున్న కొద్ది మీరు నన్ను ఎక్కువగా చూడరు. లేదా మీరు నన్ను ప్రత్యేకమైన ఆత్మగా పిలువరు. నేను క్రమక్రమంగా మీ సొంత శక్తిలో భాగంగా తయారవుతాను, మరియు ఒకానొక స్థితి దగ్గర మీరు–నేను ఒకటేనని తెలుసుకుంటారు. మీరు నిజంగా నా మాట విన్నారని మరియు నన్ను చూశారని ఈ సంఘటనే మీకు తెలియజేస్తుంది.

* * * *

## ఇది మీ గురించే !

ఈ రోజు మిమ్మల్ని ఇలా కలిసి నా శక్తిని మీతో పంచుకోవడం నాకు చాలా ఆనందంగాను మరియు సంతోషంగాను ఉంది. నేను ఎలా అయితే నా శక్తిని మీతో పంచుకుంటున్నానో, అదే విధంగా మీరు కూడా మీ శక్తిని నాతో పంచుకుంటున్నారు. మీరు ఎరుకతో దీనిని గమనించలేకపోయినా మీ కాంతి ఈ ప్రపంచమంతా వ్యాపిస్తూ విస్తరిస్తోంది. ఈ యుగంలోని ఈ ప్రస్తుత సమయాన్ని మీరు చాలా మార్పులకు గురిచేస్తున్నారు. అందువలన భూమి మీద చాలా మార్పులు సంభవిస్తున్నాయి.

ఈ సమయంలో కాంతి విస్తృతంగా అన్ని వైపులా వ్యాపిస్తోంది. భూమి మీద చైతన్యం క్రమక్రమంగా పరిణామం చెందుతూ చీకటి దాగి ఉన్న ప్రదేశాలలోకి విస్తరిస్తూ, అవి బయటపడేలా చేస్తోంది. ఈ కాంతి పాతదనాన్ని మరియు కుళ్ళుని పైకి తీసుకువస్తూ, ఇది అందరికి కనపడేలా చేస్తోంది. అందుకనే ఈ యుగం తన వ్యక్తీకరణలలో చాలా భిన్నంగా కనిపించవచ్చు. ఇప్పుడు చైతన్యం అభివృద్ధి చెందుతున్నా కూడా, కాంతి ఒక స్థానాన్ని సంపాదించుకుని మీ ప్రపంచంలో నిజంగా ప్రకాశించేంతవరకూ ఇది మరింత చీకటిగా రూపొందవచ్చు.

మీరందరూ మీ కాంతి మరియు మీ చైతన్యాల ద్వారా పాతదనం బయటకు వచ్చేలా చేస్తున్నారు. అందుకనే మిమ్మల్ని లైట్‌వర్కర్స్ లేదా కాంతి కార్మికులు అని అంటారు, అంటే కాంతి కోసం పనిచేసేవారు అని అర్ధం. మీ ఆత్మలు చాలా లోతైన లక్ష్యాన్ని కలిగిఉన్నాయి. మీరు ఇప్పుడు ఏ లక్ష్యంతో అయితే భూమి మీద జీవిస్తున్నారో, అదే లక్ష్యంతో నేను కూడా ఒకానొకప్పుడు భూమి మీద జీవించాను. మీలో చాలామంది నన్ను గతంలో అనుసరించారు. మీరు బోధనలు మరియు శక్తిని విస్తరింపజేసే విషయాలలో నన్ను అనుసరిస్తుండేవారు.

నేను మీ హృదయాన్ని, మీ ఆత్మను. నేను కేవలం భూమి మీద ఒకానొకప్పుడు జీవించిన మనిషిగా మీ ముందుకు రావడం లేదు. ఇప్పుడు నేను మీ ముందుకు క్రీస్తుశక్తి యొక్క భావప్రకటనగా వచ్చాను: నేను మీ ప్రజ్ఞాత్మను, ఈ శక్తి మీకు కలుపబడి ఉంది, ఇది మీ మూలకేంద్రం యొక్క శక్తి. ఈ శక్తిక్షేత్రం ఇప్పుడు భూమికి మరింత దగ్గరగా వస్తూ, చాలామంది మనుష్యుల యొక్క హృదయాలను స్పృశిస్తూ, వారి మనోభావాలను ప్రభావితం చేస్తోంది.

ఈ కాంతి తరంగం మార్పుకు సిద్ధంగాలేని వారిని ఆందోళనలకు గురిచేస్తోంది. వీరు తరచూ అభద్రతాభావానికి లోనవుతూ, వీరి జీవితాలు

అర్థరహితంగా ఉన్నట్లు అనుభూతి చెందుతారు. ఈ గందరగోళ మనోభావాలతో ఎలా వ్యవహరించాలో వీరికి తెలియడం లేదు. మీరొక్కరే భూమి మీద వీరికి కాంతిని చూపించగలరు. ఎందుకంటే మీరు మీ జీవితాలలో కాంతిని నింపుకున్నారు కాబట్టి. మీరు క్రొత్తయుగం యొక్క టీచర్స్‌గాను మరియు ప్రధాన అన్వేషకులుగాను పనిచేయడానికి ఇక్కడకు వచ్చారు. మిమ్మల్ని మీరు ఈ విధంగా ప్రశ్నించుకోవచ్చు: ఇది చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానా? నేను దీనిలో ఎలా పయనిస్తాను? నేను నా కాంతిని ఎలా విస్తరింపజేస్తాను? వీటన్నింటికి సమాధానం మీరు ఆలోచించే దానికంటే చాలా సులభం.

మీకు ఇన్ని సందేహాలు ఉండడానికి ఒకానొక కారణం ఏమిటంటే, మీ సొంత దివ్యత్వాన్ని ఎదుర్కోవడానికి మీరు భయపడడమే. మీ నిత్యజీవితంలో, మీరు చాలారకాల చెడు ఆలోచనలను మరియు మనోభావాలను చూసి భయపడుతున్నారు: “నేను భూమి మీద నిజంగా నా ఇంటిలో ఉన్నట్లు అనుభూతి చెందగలనా? నిజానికి ఇక్కడ నా లక్ష్యాన్ని పూర్తి చేయగలనా?” ముఖ్యంగా మీ జీవితంలో భయాన్ని, దు:ఖాన్ని లేదా విచారాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొన్నట్లయితే, మీరు తప్పకుండా మీ లక్ష్యాన్ని చేరగలరనే విషయాన్ని నేను మీకు చెప్పగలను. ఎందుకంటే ఆ ప్రదేశాలలో మీ కాంతి(జ్ఞానం) యొక్క అవసరం ఉంది కాబట్టి. మీలోని బాధను మీ కన్నా గొప్పగా ఎవరూ నయం చేయలేరు. మీ అంతర్ చీకటిని(అజ్ఞానం) ప్రేమ మరియు కరుణలతో ప్రకాశింపజేయాలి. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకుంటూ మరియు అదే విధంగా ఇతరులకు కూడా కాంతిని ప్రసరింపజేస్తూ, వారిని వారు ఉద్ధరించుకునేందుకు ప్రోత్సాహాన్ని అందివ్వాలి.

మీరు చాలా పురాతనమైనవారు. మీరు భూమి మీద చాలా జన్మలను ఎత్తారు. మీరు జీవితకాల చక్రాల యొక్క సంపూర్తికి చేరుతున్నారు. ఈ చక్రం యొక్క చివరిదశలో మీ శక్తి, పూర్తి ప్రేమగాను, జ్ఞానవంతంగాను మరియు చురుకుగాను రూపొందుతోంది. మరింత జీవంతోను మరియు సంపూర్ణమైన జీవశక్తితోను ఉండాల్సిన మాతృభూమి భాగాలైన వృక్షసంపద, జంతుసంపద మరియు మానవరాజ్యాల యొక్క ప్రస్తుతస్థితిని చూసి మీరు నిరాశకు మరియు నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఇతరులతో మీ సంబంధాన్ని గమనించినప్పుడు, దానిలో మీరు ఏదో లోటును అనుభూతి చెందుతారు. మీరు ఈ బంధాలలో ప్రేమ, స్వేచ్ఛ, అంగీకార వైఖరి యొక్క కొరత ఉంటుంది. మీరు ఒక వాస్తవానికి సంబంధించిన బెంగను కలిగి ఉన్నారు, ఇది మిమ్మల్ని బాధిస్తుంది. తరచూ మీరు ప్రపంచం గురించి, మీ సన్నిహితుల గురించి మరియు మీ గురించి బాధ పడుతుంటారు. మీరు ఈ బాధను అనుభూతి

చెందుతూ దానిలో లోతైన ప్రేమను కనుగొంటారు. మీరు ఈ ప్రేమను భూమి మీద వ్యక్తపరచడం మరియు దాని ఉనికిని నెలకొల్పడం చాలా కష్టమని తెలుసుకుంటారు.

మీరు కొత్తశకం యొక్క ప్రవేశద్వారం దగ్గర ఉన్నారని నేను మీకు తెలియజేస్తున్నాను. నేను ఇక్కడ మీతో ఉంటూ, మీకు ధైర్యాన్ని మరియు సహకారాన్ని అందిస్తాననే నమ్మకాన్ని నాపై కలిగి ఉండండి. మీరొక్కరే ఈ వారధిని దాటగలరు, మీరొక్కరే నా పనిని ముందుకు నడిపించగలరు. మీరు కొత్తశకం యొక్క క్రీస్తులు. ముఖ్యంగా మీరు అలసటకు మరియు అవిశ్రాంతికి గురై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నప్పుడు, దయచేసి కొత్త అవకాశాన్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉండండి. ఈ కొత్త అవకాశంలో ఉదయిస్తున్న కాంతికి ఆధీనమవ్వండి. దయచేసి మీ భయాలు మరియు దు:ఖాలతో యుద్ధం చేయకండి. వాటిని అలాగే ఉండనివ్వండి మరియు వాటి యొక్క భద్రతను నన్ను తీసుకోనివ్వండి. ఇప్పుడు నా శక్తిని అనుభూతి చెందండి, నేను మీతోనే ఉన్నాను.

నేనే మీరు, మీరే నేను. మనమందరం ఒక్కటే. క్రీస్తుశక్తి యొక్క కాంతిని మరియు ఓదార్పును మీతో ఉండడానికి అనుమతివ్వండి. మనమందరం ఈ శక్తివంతమైన కాంతి యొక్క వాహకంతో బంధాన్ని కలిగి ఉన్నామని అనుభూతి చెందండి. మీరే కొత్తశకం యొక్క క్రీస్తులు.

ఇప్పుడు మీ యొక్క గాయపడిన భాగమైన మీ అంతర్‌శిశువు పై దృష్టిని కేంద్రీకరించమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఇది భూమి మీద చాలా జన్మల నుంచి బాధింపబడింది మరియు అవమానింపబడింది. మీరు ఈ జన్మలోనూ మరియు గతజన్మలలోనూ చాలా బాధల ద్వారా పయనించారు. ఈ ప్రియమైన శిశువు మీ శరీరంలోని పొట్టభాగంలో ఉంది. ఇది మీ శ్రద్ధను మరియు ఆసక్తిని కోరుకుంటోంది. ముఖ్యంగా ఇది మీ నుంచి సహనాన్ని మరియు విశ్వాసాన్ని కోరుకుంటోంది. ఈ శిశువు మీ మనోభావప్రేరిత భాగానికి సంబంధించినది. ఇది ఒక్కసారిగా నయం అయ్యేది కాదు. ఇది చాలా లోతుగా గాయపడింది. అందువలనే ఇది మీ జీవితంలో చాలా చెడు మనోభావాలను సృష్టిస్తోంది. ఉదాహరణకి ఒంటరితనం, భయం, ఓడిపోయిన లేదా విసిరివేయబడిన మొదలైన భావనలు. ఈ మనోభావాలు మీ లోతైన గాయాన్ని సూచిస్తున్నాయి. ఇవి మీరు ఎక్కువగా భయపడే మరణం కన్నా తీవ్రంగా ఉంటాయి. ఇది మీ అంతరాత్మతో పూర్తిగా విడిపోయిన భావనను మీకు కలుగజేస్తూ, మీరు విచారానికి గురయ్యేలా చేస్తుంది. మీ ప్రజ్ఞాత్మ యొక్క ప్రేమస్పర్శ నుంచి వేరుచేయబడిన భావన, సృష్టి యొక్క బంధం మరియు సహజమైన కాంతి

నుంచి విడదీయబడిన భావనలు, మీ అంతరంలో భరించలేని తీవ్రమైన బాధను మరియు అలజడులను సృష్టిస్తున్నాయి. ఈ బాధను మీ అంతరంలో చూడమని మరియు మీ గాయపడిన అంతర్ శిశువును దగ్గరకు చేరదీయమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను.

మిమ్మల్ని ఒక దైవంగా, కాంతితలాల యొక్క ప్రతినిధిగా ఊహించుకోండి. మీ దివ్యశక్తి, మీ శరీరం చుట్టూ మెత్తగా హత్తుకున్నట్లు అనుభూతి చెందండి. ఇది ఒక బంగారు వర్ణపు శక్తిగా మీ చుట్టూ అల్లుకుని ఉన్నట్లు మరియు ఇది మీ చుట్టూ కాంతి వలయాకార రూపంలో తల నుంచి పాదాల వరకూ వ్యాపించి ఉన్నట్లు అనుభూతి చెందండి. మీ పొట్టభాగంలో ఉన్న అమాయకత్వంతో కూడిన మీ అంతర్ శిశువును, మీ బంగారు వర్ణపు చేతులతో ఎత్తుకున్నట్టు ఊహించుకోండి. మాటలకందని హృదయభావనతో మీరు ఆ శిశువును స్వాగతించండి.

మీ పాత బాధలను పలుకరిస్తూ మరియు అవి అక్కడ ఉండడానికి అనుమతివ్వండి. “మీరు నా జీవితంలో భాగంగా ఉంటారని, నేను మిమ్మల్ని ఏ మాత్రం తక్కువ చేయనని” వాటికి తెలియజేయండి. మీ అంతర్‌శిశువు కోరుకునేది ఈ కరుణనే. ఇదే మీకు సంపూర్ణతను కలుగజేస్తుంది. మీ అంతర్‌శిశువు తనలో తాను బాధపడడాన్ని అనుమతించకుండా, మీ సొంత గాయపడిన భాగానికి అండగా నిలబడండి. ఇదే మిమ్మల్ని క్రీస్తుగా రూపొందిస్తుంది. మీరు నిత్యజీవితంలో మీ బాధలను అడ్డుకొంటూ, మీ భయం మరియు కోపాలన్నింటి నుంచి ఒకేసారి బయటకు రావాలనుకుంటారు. తరచూ దీని గురించి మిమ్మల్ని మీరు దూషించుకుంటూ, మీ అంతర్‌శిశువును చులకన చేస్తుంటారు. మీ బాధను అడ్డుకోవడం మరియు దీని ద్వారా వచ్చిన ప్రవర్తనను నిర్ణయించడం వలన, మీ అంతర్‌శిశువును మీ నుంచి మీరు దూరం చేసుకుంటారు. మీరు ఈ విధంగా చెబుతుంటారు: “నేను ఏ విధమైన బాధను లేదా కోపాన్ని లేదా భయాన్ని కలిగిఉండాలని అనుకోవడం లేదని, నాకు ఆనందంగా ఉండడమే కావాలని, నేను వీటిని అధిగమించ లేకపోవడం వలన నన్ను నేను అసహ్యించుకుంటున్నాను అని.” కాని మీ అంతర్‌శిశువు రోధిస్తూ మీ పిలుపు కోసం ఎదురుచూస్తోంది మరియు దీని పై నిందలు మోపడం ద్వారా దీనిని మీరు బాగు చేయలేరు.

మిమ్మల్ని మీరు నయం చేసుకోవడానికి కొంత సమయాన్ని వెచ్చించండి. మీరు ప్రతిఘటనలకు లోనవుతున్నప్పుడు ఒక్కక్షణం ఆగి వాటితో కూర్చోండి. ఈ

ప్రతిఘటనల నుంచి పారిపోకుండా, మీ అంతర్‌శిశువు భద్రత కోసం వీటిని విడుదల చెయ్యండి. మీ గాయపడిన శిశువుతో ఉంటూ, మీ దివ్యత్వం యొక్క బంగారు వర్ణపు శక్తిని అనుమతిస్తూ దీనిని కౌగిలించుకోండి. మీరు ఉన్నతంగా జీవించడానికి భయపడవద్దు! వీలైనంత సమయాన్ని మరియు మీకు అవసరమైనంత ప్రదేశాన్ని కేటాయించుకుని, మిమ్మల్ని మీరు నయం చేసుకోండి. మీ అవసరాలను మరియు మీ బాధ యొక్క లోతును తక్కువగా చూడవద్దు. దీనిని అతి ముఖ్యమైనదిగా స్వీకరించండి. ముఖ్యంగా మీరు ఈ హీలింగ్ ప్రక్రియ కోసమే భూమి మీద ఈ జన్మను తీసుకున్నారు. మీరు ఏ లక్ష్యాన్నైతే సాధించాలనుకున్నారో, దేని కోసమైతే భూమి మీదకి పిలవబడ్డారో మరియు దేని కోసమైతే భూమి ఎదురుచూస్తోందో వాటి అన్నింటికి అనుగుణంగానే మీ అంతరంలో పరివర్తనం సంభవిస్తోంది.

మీ బాధ లేదా నొప్పులపై కరుణను కలిగి ఉండండి. మీ లోతైన అంతరంలోని ఒంటరితనాన్ని ఎదుర్కొంటూ దానికి ఈ విధంగా చెప్పండి "నేను నీ కోసం ఉన్నాను, నేను కాంతిని అందించే దేవతను, నువ్వు కోరుకున్న స్థలానికి నేను చేరుస్తాను, భయపడవద్దు నీ కోసం నేను నీ ప్రక్కనే నిలబడి ఉన్నాను, నేను నీ వెన్నంటి ఉన్నాను, నేను నీ ముందు మరియు నీ అంతరంలోనూ ఉన్నాను, నేను పై నుంచో లేదా క్రింద నుంచో రాలేదు, నేను నీ ఆత్మ నుంచి వచ్చాను. నేను నీ ఆత్మ సారాంశాన్ని."

మీరు రక్తమాంసాలతో కూడిన మానవశరీరాలలో దైవంగా రూపొందుతున్నారు. మీరు భౌతిక పదార్థాలలో జన్మించిన దేవతలు. మీరు ఇతరులకు ఇవ్వడానికి మరియు వారితో పంచుకోవడానికి చాలా జ్ఞానాన్ని కలిగి ఉన్నారు. కాని ఈ విధంగా పంచుకోవడం ద్వారా, మీరు ఆందోళనలకు గురికాకుండా చూసుకోండి. మీ జీవితానికి మీరే మార్గదర్శకులు. మీరు ఎల్లప్పుడూ మీ యొక్క అంతర్‌శిశువు భాగంతో బంధాన్ని కలిగి ఉండండి. ఎప్పుడైతే మీరు మీ మనోభావాలు అపసవ్యంగా ఉన్నాయని గుర్తిస్తారో, అప్పుడు మీరు అసౌకర్యానికి, ఒత్తిడికి, నిరాశకు లేదా చిరాకుకు గురవుతారు. వీటిని మీరు వెంటనే ఎదుర్కోవడానికి ప్రయత్నించండి. ఇదే మీ జీవితంలో మీరు చేయవలసిన అతి ముఖ్యమైన పని. ఇతరులకు కూడా రెండవస్థానమే. మీ జీవితం పూర్తిగా మీ గురించే. మీ యొక్క చీకటి లేదా గాయపడిన భాగాలను చేరాలనుకున్నప్పుడు మాత్రమే, మీ మానవశరీరంలోకి మీ దివ్యత్వపు కాంతిని ప్రసరింపజేసుకోగలరు.

వీలైనంత సమయాన్ని మీ సొంత హీలింగ్ కోసం తీసుకోండి. మీ సౌకర్యం లేదా సహాయం కోసం ఏదైనా చెయ్యండి: ఆధ్యాత్మిక కౌన్సిలింగ్, పుస్తకాలు చదవడం,

వ్యాయామాలు లేదా మీ కోసం మంచి ఆహారం తయారుచేసుకోవడం మొదలైనవి. మిమ్మల్ని మీరు ఆధ్యాత్మిక స్థాయిలోనూ మరియు ప్రాపంచిక స్థాయిలోనూ పోషించుకోండి. వీటిపై దృష్టిని కేంద్రీకరిస్తూ మీకు ఇష్టమైనంత సమయాన్ని కేటాయించండి. అప్పుడే మిమ్మల్ని మీరు నయం చేసుకోగలరు. ఇలానే మీరు, మీ దివ్యత్వపు కాంతికి ప్రతిరూపంగా రూపొందగలరు మరియు ఈ జీవితంలో దేనిని చేయడం కోసమైతే వచ్చారో దానిని మీరు పూర్తిచేయగలరు. ఇది మీ గురించే!

మేము మీకు నమస్కరిస్తున్నాము. ఇక్కడ మేము, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నాము. మీ ప్రతి ఒక్కరి చుట్టూ దేవతలు మరియు మార్గదర్శకులు చాలామంది ఉన్నారు. మీ జీవితంలో మీ సొంత మార్గాన్ని కనుగొనడానికి, వారు మీకు సహాయం చేయాలనుకుంటున్నారు. విశ్వతలాల నుంచి మీకు గొప్ప సహకారం, గౌరవం మరియు ప్రోత్సాహం అందించబడతాయి. మీరొక్కరే దీనిని భూమి మీద చేయగలరు. మీ కోసం మేము దీనిని ఎంత మాత్రం చేయలేము. కాని మేము మీకు ఆనందాన్ని మరియు ఓదార్పును అందివ్వగలం. నిజానికి ఇది మార్పు యొక్క సమయం. దయచేసి మమ్మల్ని పిలవండి, మేము మీ కోసమే ఉన్నాము. మనందరం కలిసి కొత్తయుగం యొక్క ఆరంభదశను దాటుతున్నాం మరియు ఇది ఒక అద్భుతమైన (కొత్త) సమయంగా రూపొందడాన్ని మీరు చూడవచ్చు.

* * * *

# మీ అంతరంలోని ఆడశిశువు – మగశిశువుతో బంధాన్ని ఏర్పరుచుకోండి

డియర్ ఫ్రెండ్స్,

మీరందరూ ఈ రోజు ఇక్కడ ఉన్నందుకు మీకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మనమందరం కలిసి కొత్తశకాన్ని ఒక వేడుకగా జరుపుకుందాం. ఇది ఎప్పటి నుంచో ఇక్కడ ఉంది. ఇది మీ అంతర్ పరివర్తనం వలన క్రమక్రమంగా పరిణామం చెందుతూ ఎదుగుతోంది. ఈ రోజు భూమి మీద కొత్త చైతన్యం జన్మించడానికి మీరు ప్రధాన అన్వేషకులుగాను మరియు మార్గదర్శకులుగాను సహాయం చేస్తున్నారు. మీ అంతర్ పరివర్తనం యొక్క ప్రస్తుత దశలో కూడా మీరు మీ అంతరంలో చాలా సందేహాలను కలిగి ఉన్నారు. మీరు ఒక పాదాన్ని కొత్త వాస్తవంలో ఉంచుతున్నారు, ఇది కొత్తమార్గంలో విషయాలను అవగాహన చేసుకోవడం మరియు అనుభవించడానికి సంబంధించినది. కాని రెండవ పాదాన్ని శూన్యంలోనూ లేదా సందేహంలోనూ ఉంచుతున్నారు. ఇది పాతదనానికి మరియు అలవాటుపడిన మార్గాలకి తిరిగి వెళ్ళలేదు. కాని అదే సమయంలో మీరు రెండు పాదాలను పూర్తిగా కొత్తదనంలో ఉంచడానికి భయపడుతున్నారు. చైతన్యం యొక్క కొత్త తలం అనేది తెలియని ప్రదేశం లాంటిది. ఇది బాహ్య ప్రపంచంతోనూ, అంటే మీ ఇంటిలో లేదా మీ పాఠశాలలో నేర్చుకున్న మీ సాంప్రదాయ విలువలకి మరియు అలవాట్లకి అనుగుణంగా స్పందించనట్టుగా అనిపిస్తుంది.

మీ సమాజం చాలా వరకూ భయం మరియు అదుపులతో కూడిన పాత నమ్మకవ్యవస్థలను ఇప్పటికి అలాగే పట్టుకుని ఉంది. కాని మీ సమాజం చాలా మార్పుచెందుతోంది. ఈ నమ్మకవ్యవస్థలు నాశనమవుతున్నాయి అనే విషయాన్ని మీరు స్పష్టంగా గుర్తిస్తారు. పాశ్చాత్యదేశాలలో చాలామంది ప్రజలు వారి జీవితాలు అర్థాన్ని కోల్పోతున్నట్టుగా అనుభూతి చెందుతున్నారు. వీరి చుట్టూ ఏం జరుగుతోందనేది తెలుసుకోవడానికి, వీరు అంతర్ ప్రయాణం పై మరింత ఆసక్తిని చూపించడం మొదలుపెట్టారు. వీరు మానసికశాస్త్రం మరియు ఆధ్యాత్మిక శాస్త్రాలపై శ్రద్ధను చూపుతున్నారు. వీరు బాహ్యపు విజయాలు మరియు భౌతికసంపదల పైన తక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ముఖ్యంగా ధనిక సమాజాలలోని ప్రజలు, బాహ్యపు విజయాలు మరియు భౌతిక సంపదల ద్వారా నిజమైన ఆనందాన్ని మరియు సంతృప్తిని పొందలేరనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. విజయం అనేది సంతృప్తికి పూర్తి భిన్నంగా ఉంటుంది.

మీ ఆత్మశక్తితో బంధాన్ని ఏర్పరుచుకుని మరియు దానిని బయటకు వ్యక్తపరచినప్పుడే, మీ జీవితంలో నిజమైన సంతృప్తిని అనుభూతి చెందుతారు. ఇదే సృజనాత్మకత అంటే: మీ ఆత్మశక్తి అంటే ఏమిటో కనుగొని, దానిని భూమి మీద మీ ప్రత్యేకమైన సామర్థ్యాలు మరియు బహుమతుల ద్వారా వ్యక్తపరచగలగడమే. ఇదే మీకు అంతరంగా నిజమైన ఆనందాన్ని కలుగజేస్తూ వెచ్చదనాన్ని మరియు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఈ స్థితిలో మీరు ఇతరులను స్పృశించినప్పుడు, మీరు కాంతి యొక్క శరీరధారులనే విషయాన్ని వారు తెలుసుకుంటారు. మీరు ఒక దేవతగా రూపొందుతూ భూమి మీదకి కాంతిని తీసుకువస్తున్నా కూడా, మీ యొక్క భ్రమలు ప్రతి మనిషిలో ఉండే అంతర్ కాంతిని చూడనివ్వకుండా మిమ్మల్ని అడ్డుకుంటున్నాయి.

మీరందరూ మీ ఆత్మశక్తికి ఒక ఆకృతిని ఇవ్వడం కోసం భూమి మీదకి వచ్చారు. ముఖ్యంగా ఇప్పుడున్న చరిత్ర యొక్క దశలో మీరు మీకోసం మాత్రమే ఇక్కడ లేరు. మీ అంతర్ అభివృద్ధి అనేది ఎక్కువగా మీరు ఇతరులతో పంచుకోవడానికే ఉంది. ప్రస్తుతం భౌగోళిక మరియు గ్రహాంతర స్థాయిలలో చాలా మార్పులు సంభవిస్తున్నాయి. అతి పెద్ద పరిమాణంలో శక్తి మార్పిడులు సంభవిస్తున్నాయి మరియు ఇవి మీ నిత్యజీవితాన్ని ప్రభావితం చేయగలవు. ప్రజలు వారి యొక్క చైతన్యాన్ని మార్పుచెందిస్తూ, ప్రత్యేకంగా ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు మరియు వారి ప్రస్తుతస్థితిని సందేహిస్తూ కొత్తగా ప్రశ్నించడం ఆరంభించినప్పుడు మాత్రమే, వారి జీవితాలలోకి కొత్తశక్తిని ఆహ్వానించగలరు. ఒక కొత్తపరిధి మీ జీవితంలోకి ప్రవేశిస్తూ, మీ జీవనశైలిని మరియు పరిస్థితులను పునాదులతో సహా కదిలిస్తుంది.

ఇప్పుడు మీలోని ఒక భాగం దీనిని కోరుకుంటోంది మరియు దీనిని నిరంతరం సాధించాలని ప్రయత్నిస్తోంది. కాని మిగతా భాగాలు కొత్తదనాన్ని అడ్డుకుంటూ, సులభంగా ముందుకు వెళ్ళడానికి ఇష్టపడటం లేదు. ఇవి మీ యొక్క తీవ్రమైన భయం మరియు అసంతృప్తికి చెందిన భాగాలు. వీటి ఫలితంగా అంతర్ ఒత్తిడి మరియు గందరగోళాలు ఏర్పడుతూ, మీ చైతన్యం ముక్కలు అవ్వడానికి కారణమవుతున్నాయి. కొన్ని కోట్లమంది ప్రజల యొక్క చైతన్యంలోనూ ఇదే ప్రక్రియ జరుగుతోంది. ఇది కొన్నిసార్లు భూమి చుట్టూ ఉన్న వాతావరణం ఆందోళనలకు మరియు ప్రతిఘటనలకు గురవుతూ అధికంగా ప్రభావితం చెందడానికి కూడా కారణమవుతోంది. ఈ ప్రతిఘటనలు అనేవి మార్పు మరియు ఎదుగుదలకు సంబంధించినవి. ఇవి ప్రతి మనిషి యొక్క జీవితంలోనూ భాగంగా ఉంటున్నాయి. మీరు పూర్తి ఎరుకతో జీవించినప్పటికీ, భూమి యొక్క అధిక సాంద్రత వలన మీరు

ప్రభావితం చెందగలరు. అందువలన మీరు భయాలు మరియు సందేహాలకు తీవ్రంగా ప్రభావితం చెందుతూ, వాటిని మీ నుండి విడుదల చేయలేకపోతున్నారు.

మీ అంతర్ ఘర్షణలతో మీరు ఎలా వ్యవహరిస్తారు మరియు మీ పాత భయాలను మరియు నమ్మకవ్యవస్థలను ఎలా విడుదల చేస్తారు? మీ సొంత ఆత్మశక్తితో ఎలా బంధాన్ని ఏర్పరుచుకుంటారు మరియు ఈ ప్రపంచంలో దానిని తెలపగలిగే మార్గాన్ని ఎలా కనుగొంటారు? ఈ రోజు నేను ఈ ప్రశ్నలన్నింటికి సమాధానాన్ని మీ అంతరంలోని స్త్రీ-పురుషశక్తుల యొక్క సమన్వయం ద్వారా తెలియజేయాలని అనుకుంటున్నాను.

ప్రతీ ఆత్మకి స్త్రీ-పురుష శక్తులలోకి ప్రవేశించే సామర్థ్యం ఉంటుంది. ముఖ్యంగా పురుషశక్తి భౌతికప్రపంచంలో మీ గురించి మీరు వ్యక్తపరుచుకోగలిగే ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది. పురుషశక్తి దృష్టికేంద్రీకరణ, గమనిక మరియు ఆధిపత్యాలకు సంబంధించిన లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ పురుషశక్తి మీకు "నేను" అనే పరిధిని స్పష్టమైన హద్దులతో ఏర్పరుచుకునే అవకాశాన్ని అందిస్తుంది. స్త్రీశక్తి, సహజంగా ప్రతీ విషయాన్ని అంతర్ దృష్టి ద్వారా గమనిస్తుంది. స్త్రీశక్తి అనుభూతులను, ఉత్తేజాన్ని మరియు మీ యొక్క సరిహద్దులను అధిగమించి ఇతరులతో బంధాన్ని ఏర్పరుచుకునే లక్షణాన్ని కలిగి ఉంటుంది. స్త్రీశక్తి ప్రవహించే గుణాన్ని మరియు ప్రతీ దానిని అంగీకరించగలిగే తత్వాన్ని కలిగి ఉంటుంది. ఇది పురుషశక్తితో కలిసినప్పుడు సృజనాత్మకత యొక్క ఉన్నత రూపంగా రూపొందుతుంది. ఈ రెండింటి మధ్య ఉండే సమన్వయం, మీ యొక్క ఉన్నతమైన సామర్థ్యాన్ని గుర్తించడానికి అవకాశాన్ని కలిపిస్తుంది.

స్త్రీ శక్తి అనేది ఒక వ్యక్తీకరింపబడని శక్తి మరియు ఇది సామర్థ్యం యొక్క తలంగా ఉంటుంది. ఇది నిజమైన ప్రోత్సాహానికి మూలకేంద్రంగా కూడా ఉంటుంది, అంటే మీ ఆత్మ నుంచి ఉద్భవించిన హృదయపూర్వక కోరికలను ప్రోత్సహించేదిగా ఉంటుంది. మీ స్త్రీశక్తి ఆత్మకు వారధిలా ఉంటుంది. మీ ఆత్మకు ఆకృతి లేదు. దీనిని అనుభూతి చెందండి. మీరు శరీరాన్ని కలిగి ఉండడం వలనే ఈ వాస్తవం యొక్క అనుభవాన్ని మీ అంతట మీరుగా పొందగలుగుతున్నారు. ఇక్కడ మీరు స్త్రీ లేదా పురుషుడిగా ఉన్నారు. కాని మీరు ఒక శరీరాన్ని కలిగి ఉంటూ దానిని మీలో భాగంగా అనుభూతి చెందుతున్నప్పటికి అదే పూర్తిగా మీరు కాదు. మీరు ఆత్మతో కూడిన శరీరాన్ని కలిగి ఉన్నారు. మీరు, మీ అంతరం నుంచి దీనికి జీవితాన్ని అందిస్తున్నారు. కాని మీ సారాంశం ప్రకారం, మీరు ఆకృతి లేనివారు మరియు

మీరు విడదీయలేని ఏకత్వంతో కూడిన ఒక స్వచ్ఛమైన చైతన్యం. మీరు దీని యొక్క స్వేచ్ఛను మరియు ఆనందాన్ని అనుభూతి చెందండి! శరీరానికి పూర్తి అతీతంగా ఉన్న చైతన్యంగా మిమ్మల్ని మీరు అనుభూతి చెందండి. ఈ వాస్తవంలో కొంత సమయం ఉండడం కోసం మీరే దీనిని స్వేచ్ఛతో ఎంపిక చేసుకున్నారు.

మీరు ఒకానొక కారణం గురించి మీ శరీరంతో తాత్కాలికంగా కలుపబడి ఉన్నారు. మీరు ఇక్కడ ఉండాలని కోరుకున్నందు వలనే ఇక్కడ ఉన్నారు. హద్దులు లేకుండా ప్రవహించే గుణం గల స్త్రీశక్తి, వ్యక్తీకరణ మరియు ఆకృతి గల పురుషశక్తితో కలిసి నాట్యం చేయాలని కోరుకుంటోంది. పురుషశక్తి, ఈ ప్రత్యేకమైన భౌతికవాస్తవంలోకి ఆత్మను ప్రవేశింపజేయడానికి మరియు ఈ వాస్తవం యొక్క అనుభవాలను పొందడానికి కావలసిన అవకాశాలను అందించగలదు. ఈ ప్రత్యేకమైన భూతలంలో, ఆత్మ తననుతాను సృజనాత్మకంగా వ్యక్తపరుచుకోవడానికి పురుషశక్తి సహాయం చేస్తుంది. స్త్రీ-పురుష శక్తులు సృష్టి యొక్క పునాదులు. ఇవి రెండూ ప్రశాంతత మరియు ఆనందాలతో కలిసి నాట్యం చేసినట్లయితే, ఇవి సృష్టికి అందాన్ని మరియు సంతృప్తిని అందజేస్తాయి.

మీలో చాలామందికి ఈ రెండు శక్తులు కృత్రిమంగా విడిపోయి ఉన్నాయి మరియు ఇవి రెండూ కలిసి పనిచేయడం లేదు. విపులంగా చెప్పాలంటే, మీరు అధికంగా పురుషశక్తిని లేదా స్త్రీశక్తిని కలిగి ఉన్నారు. మీరు పురుషశక్తిని అవసరమైన దాని కంటే ఎక్కువగా కలిగి ఉన్నట్లయితే, మీ స్త్రీశక్తి అణచి వేయబడుతుంది. మీరు ఈ విధంగా ఉన్నట్లయితే, బాహ్యప్రపంచానికి సంబంధించిన వ్యక్తీకరణలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తూ, ఇతరుల ద్వారా గుర్తింపబడాలని మరియు విలువను పొందాలని కోరుకుంటారు. దీని ఫలితంగా మీరు, మీ ఆత్మశక్తి నుంచి విడిపోతారు. మీ అనుభూతులు మరియు మనోభావాల యొక్క సజీవ ప్రవాహం, నిరంతరం మీకు ఏం కావాలనేది తెలియజేయడానికి ప్రయత్నిస్తుంటాయి. మీరు పురుషశక్తిని అధికంగా కలిగి ఉంటే, మీరు బాహ్యప్రపంచం యొక్క విలువలకు మరియు ఆశించడాలకు లోబడి ఉంటారు. ముఖ్యంగా మీరు అభద్రతాభావంతో నడుపబడతారు. ఈ అభద్రతాభావాన్ని ఎదుర్కొనడానికి మీకు సంబంధంలేని, మీకు నచ్చని పద్ధతులతో మిమ్మల్ని మీరు బలవంతం చేసుకుంటారు. మీరు నిజమైన భద్రతను అనుభూతి చెందలేరు మరియు మీ స్త్రీశక్తి యొక్క వాత్సల్యాన్ని పొందలేరు. అందువలన మీరు అదుపు మరియు పోటీతత్వంతో కూడిన బాహ్యపు భద్రతలను ఏర్పరుచుకోవాలని ప్రయత్నిస్తారు. ఇవన్నీ మిమ్మల్ని, ఇతరుల యొక్క ఆలోచనారీతి, అనుభూతులు మరియు వారి చర్యలపై ఎక్కువగా ఆధారపడేలా చేస్తాయి. మీ అంతర్ మార్గదర్శకత్వం

నుంచి విడిపోవడం వలన, మీరు ఆందోళన మరియు ఒత్తిడులకు సంబంధించిన అహంభావాన్ని పొందుతారు. ఈ అహంభావం నిరంతరం గుర్తింపు కావాలని మరియు ఎల్లప్పుడూ అదుపులో ఉంచాలని కోరుకుంటుంది. ఇది అధికారం యొక్క అవాస్తవపు భ్రమల ద్వారా జీవిస్తూ ఆత్మకు ఊపిరాడకుండా చేస్తుంది.

ఎవరైతే పురుషశక్తిని అధికంగా కలిగిఉంటారో వారు, ఆకృతి లేని స్త్రీ శక్తి స్వభావానికి ఆధీనమవ్వడానికి భయపడతారు. మీ సమాజంలో చాలామంది అవసరమైన దాని కంటే అదనంగా పురుషశక్తిని కలిగి ఉంటున్నారు. దీని వలన వీరు భయానికి లోనవుతూ అన్నివేళలా తీరిక లేకుండా పని ఒత్తిడిని కలిగి ఉంటారు. వీరి కోసం వీరు సమయాన్ని కేటాయించుకోరు. ఒక ఆశయం లేకుండా వీరు స్వేచ్ఛగా గడపలేరు. ప్రతీ విషయం పద్ధతిగా, ప్రణాళికాపరంగా విలువైన నైపుణ్యాలతో ఉండాలని కోరుకుంటారు. మీరు దేనినైనా కోరుకున్నప్పుడు మరియు మీ జీవితంలో ప్రత్యేకమైన మార్పు సంభవించాలని నిజంగా అనుభూతి చెందినప్పుడు, మీరు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే దానిని కార్యరూపంలో పెట్టాలని అనుకుంటారు.

మీరు ఒక ఆశయం లేదా ఒక ఆలోచన క్రమక్రమంగా ఎదుగుతూ పరిణామం చెందడానికి మరియు మీ వాస్తవంలో కార్యరూపం దాల్చడానికి అవసరమైన సమయాన్ని కేటాయించరు. ఇది ఒక జీవసంబంధమైన ప్రక్రియ. మీరు ఏదైనా చెయ్యాలని కోరుకున్నప్పుడు దానికి తగినట్టుగా మీ అంతరంలో మార్పులు సంభవిస్తాయి. మీరు వీటిని ఏమాత్రం బలవంతంగాని లేదా అదుపుగాని చేయలేరు. ఎందుకంటే ఇవి సహజమైన లయబద్ధత ద్వారా నడపబడుతుంటాయి కనుక. పురుషశక్తి యొక్క ఆధిపత్యం వలన లేదా పురుషశక్తితో బంధాన్ని కోల్పోవడం వలన, మీరు ఎక్కువగా ఆలోచిస్తూ ఆందోళనకు గురవుతారు. మీ ఆలోచనలు ఒక దిశ లేకుండా పిచ్చిగా పయనిస్తుంటాయి. ఈ స్థితి వలన మీరు మీ జీవితంలో అవిశ్రాంతిని, శూన్యాన్ని మరియు నిరుత్సాహాన్ని అనుభూతి చెందుతారు. మీ స్త్రీశక్తిని మీరు నిజంగా విశ్వసించడం లేదు. ఆమె మీకు వ్యతిరేక దిశలో పయనిస్తున్నట్లు అనిపిస్తుంది. మీ మనోభావాలు మీకు చెబుతుంటాయి, ఉదాహరణకి మీ చుట్టూ ఉన్న పరిస్థితులను వదిలేసి మీకోసం మీరు సమయాన్ని కేటాయించుకోమని మరియు మరింత స్వేచ్ఛగా ఇతరులతో సంభాషించమని మీకు తెలియజేస్తుంటాయి. ఒకానొక స్థితిలో మీరు, మీ ఆత్మ యొక్క పిలుపును తప్పకుండా పట్టించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మీరు పురుషశక్తి ద్వారానే జీవించాలని ప్రయత్నిస్తున్నట్లయితే, మీరు కొన్ని కష్టమైన పరిస్థితుల వైపు పయనిస్తున్నారని అర్థం. అది అనారోగ్యపరమైన సమస్య కావచ్చు లేదా వేరే అసంతృప్తికరమైన పరిస్థితి

అయిన కావచ్చు. ఈ పరిస్థితులు మీ జీవితంలో స్త్రీ-పురుష శక్తుల మధ్య కొత్త సమన్వయాన్ని కనుగొనడానికి అవకాశాలను అందిస్తాయి.

మీరు స్త్రీశక్తి పై పూర్తిగా ఆధారపడుతున్నప్పుడు మరియు పురుషశక్తితో సంతృప్తికరమైన బంధాన్ని కలిగిలేనప్పుడు ఏం సంభవిస్తుంది? దీని కారణంగా ఒత్తిడి మరియు అదుపులతో కూడిన అహంభావం, పూర్తి వ్యతిరేకంగా ఉండే బలహీనమైన మరియు సంశయంతో కూడిన అహంభావం మీలో ఏర్పడుతుంది. మీరు స్త్రీ శక్తిపై ఎక్కువగా ఆధారపడినట్లయితే, మీరు అధిక సున్నితత్వాన్ని కలిగి ఉంటారు. మీరు ఇతరుల యొక్క శక్తులకు అతిసున్నితంగా ప్రతిస్పందిస్తారు. వారికి 'కుదరదు, కాదు' అని చెప్పడానికి మరియు మీ చుట్టూ స్పష్టమైన సరిహద్దులను ఏర్పరుచుకోవడానికి చాలా కష్టపడతారు. ఎందుకంటే, మీ సొంత తలాన్ని ఏర్పరిచే పురుషశక్తి మీకు అందుబాటులో లేని కారణంగా, మీరు ఇతరులకు 'కాదు' అని చెప్పడానికి మరియు మీ చుట్టూ స్పష్టమైన సరిహద్దులను ఏర్పరుచుకోవడానికి చాలా కష్టపడతారు. మీకు ఏం కావాలో తెలుసుకోవడానికి, దానిని సులభంగా పొందడానికి కూడా కష్టపడుతుంటారు. మీరు మీ అవసరాలు లేదా కోరికల కోసం ఇతరుల యొక్క మనస్తత్వాలకు మరియు వారి కోరికలకు ఆకర్షింపబడతారు.

మీరు అధికంగా స్త్రీశక్తిని కలిగి ఉండడం అంటే, మీరు ఇతరుల మనోభావాలను సులభంగా అర్థం చేసుకునే శక్తిని కలిగి ఉండడమే. దీని వలన మీరు ఇతరులు అనుభూతి చెందుతున్న వాటిని కూడా సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. అదే విధంగా మీరు, మీ మనోభావాలలోకి మరియు మీ మనస్తత్వాలలోకి కూడా చాలా లోతుగా వెళ్ళే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. కాని మీ గురించి మీరు సృజనాత్మకంగాను మరియు మనోభావపరంగాను ఈ ప్రపంచంలో వ్యక్తపరుచుకోలేరు. మీపై మీరు ఆధారపడడంలోనూ మరియు మీ ఆత్మకేంద్రంలో ఉండడాన్ని అనుభూతి చెందే విషయంలోనూ, మీరు వ్యక్తిగత చైతన్యం యొక్క పురుషశక్తిని సంతృప్తికరంగా అనుమతించలేరు. ప్రవహించే గుణం మరియు స్వీకరించే వైఖరి గల స్త్రీశక్తి, పరిపూర్ణత్వం గల "నేను"గా రూపొందడానికి సరైన మార్గదర్శకత్వం యొక్క అవసరం ఉంది. ఈ మార్గదర్శకత్వాన్ని ఒక్క పురుషశక్తి మాత్రమే అందివ్వగలదు. అది ఎప్పుడు సంభవమంటే, స్త్రీశక్తి, పురుషశక్తిని విశ్వసిస్తూ, మరియు తన సొంత అవసరాలు మరియు స్పష్టమైన సరిహద్దులతో కూడిన 'నేను' తత్వంగా రూపొందడానికి సంబంధించిన భయాన్ని విడుదల చేసినప్పుడు మాత్రమే ఇది

సాధ్యమవుతుంది.

చాలామందిలో, ముఖ్యంగా స్త్రీలలో ఈ స్త్రీ శక్తి యొక్క భయం ఉంటుంది. ఎందుకంటే ఆడవాళ్ళకు అతిసున్నితత్వం, తియ్యదనం మరియు ఫిర్యాదువైఖరి గురించి చిన్నప్పటి నుంచే నేర్పబడతాయి. (పురుషులకు పోటీతత్వం మరియు కఠినత్వం గురించి నేర్పబడతాయి.) కేవలం స్త్రీలు తన సొంత కాళ్ళపై నిలబడే పురుషశక్తి సామర్థ్యాన్ని మాత్రమే అభివృద్ధి చేసుకున్నట్లయితే, వారి యొక్క సృజనాత్మక శక్తి వృధాగా ఖర్చు చేయబడుతూ చిన్న చిన్న ముక్కలుగా విభజింపబడుతుంది. వీరి యొక్క ఆత్మశక్తిని వీరు సంతృప్తికరంగా వ్యక్తపరచలేరు. దీని వలన వీరి ఆత్మలో బాధ ఏర్పడుతూ, ఇది విచారానికి మరియు దు:ఖానికి కారణమవుతుంది.

ఈ కొత్తశకం, స్త్రీ-పురుష శక్తుల యొక్క సమన్వయాన్ని తిరిగి ఏర్పరచమని మిమ్మల్ని అడుగుతోంది. ముఖ్యంగా మీరు స్త్రీశక్తి ప్రాధమికమైన స్థానంలో ఉందనే విషయాన్ని తెలుసుకోవాలి. దీని అర్థం ఇది మంచిగాను లేదా ఉన్నతంగాను ఉందని కాదు. స్త్రీతత్వం మరియు పురుషతత్వం “ఇన్-యాంగ్” గుర్తులులాగా, సమానంగాను మరియు ఒకదానికొకటి సంపూర్ణత్వాన్ని కలుగజేసుకుంటాయి. మీ అంతరంలోని స్త్రీశక్తి, ఆకృతిలేని మీ ఆత్మ సారాంశానికి వారధిగా ఉంటుంది. మీరు స్త్రీ తత్వంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా, మీ లోతైన ఉత్తేజం వైపుగా మీ అంతట మీరు పయనిస్తారు. ఇక్కడ మీరు ఉండడానికి సంబంధించిన ఆశయంతో కూడా కలుపబడి ఉండగలరు.

మీరు మీ స్త్రీశక్తితో బంధాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు ఊహించుకోండి. ఆమె మీ హృదయంలో స్థానాన్ని కలిగిఉన్నట్లు ఊహించుకోండి. మీ హృదయంలో సున్నితమైన మరియు వెచ్చనైన శక్తిని అనుభూతి చెందండి. ఆ శక్తి మీకు బాగా తెలిసినది మరియు మీరు ఎవరనే దానితో అతిసన్నిహితమైన బంధాన్ని కలిగిఉంది. మీ హృదయంలో ఈ శక్తిని అనుభూతి చెందండి. ఇప్పుడు ఈ స్త్రీశక్తి మీ హృదయం యొక్క వెనుక భాగాన్ని తెరుస్తున్నట్లుగా ఊహించుకోండి. అక్కడ నుంచి స్త్రీశక్తి, మూలకేంద్రం యొక్క కాంతితో, మీ ఆత్మ యొక్క కాంతితో బంధాన్ని ఏర్పరుస్తోంది. ఒక్కక్షణం దీనిని అనుభూతి చెందండి. బహుశా మీరు దేవతల యొక్క రూపాలను చూడవచ్చు. మీరు ఏమి చూసారన్నది ఇక్కడ ముఖ్యం కాదు. మీరు ప్రేమ యొక్క ఉనికిని, విశ్వసంబంధిత సహకారాన్ని, ఇంటి యొక్క ఉనికిని అనుభూతి చెందాల్సిన అవసరం ఉంది. ఇదే మీ ఆత్మశక్తితో ఛానెలింగ్ చేయడం అంటే. కాంతితత్వాన్ని

మరియు ఆ శక్తి యొక్క స్వచ్ఛతను అనుభూతి చెందండి. ఇది మీ హృదయంలోకి ప్రవేశిస్తోంది. ఇప్పుడు నిజానికి మేము, మీకు ఎంత సన్నిహితంగా ఉన్నామనేది మీరు గుర్తించవచ్చు. మేము "వేరే లోకాల నుంచి", మీ ద్వారా ఇక్కడకి వస్తూ మీ వాస్తవంలో భాగంగా ఉంటున్నాము. ప్రస్తుతం మీరు కూడా వేరే వాస్తవంలో భాగంగా ఉంటున్నారు. మీ ప్రజ్ఞాత్మ లేదా పూర్ణాత్మ వేరే లోకాలలో ఉంటూ ఇప్పుడు భూమి మీద మీతో కూడా కలిసి ఉంటోంది.

ఇప్పుడు మీ అంతరంలోని పురుషశక్తి మిమ్మల్ని పిలుస్తున్నట్టు ఊహించుకోండి. మీరు, మీ హృదయశక్తి భూమి యొక్క వాస్తవంతో సంపూర్ణమైన బంధాన్ని ఏర్పరుచుకోవడానికి అవసరమైన సహాయాన్ని అందించమని, మీ పురుషశక్తిని అడగండి. శక్తివంతమైన పురుషశక్తి, మీ చేతులు మరియు కాళ్ళలోకి సున్నితంగా మరియు సులభంగా ప్రవహిస్తున్నట్లు ఊహించుకోండి. ఇది మీలో స్పష్టతను కలుగజేస్తూ ఆత్మవిశ్వాసాన్ని మరియు పరిశీలనాదృష్టిని వృద్ధి చేస్తోంది. ఇది మీ శరీరానికి మరియు భూమికి అనుగుణంగా మీ హృదయం యొక్క శక్తిని నడిపిస్తున్నట్లు అనుభూతి చెందండి. ఈ పురుషశక్తి మీకు ధైర్యాన్ని, పరిశీలనాదృష్టిని మరియు స్థిరత్వాన్ని అందిస్తుంది. ఈ విధంగా మీ పురుషతత్వం, స్త్రీతత్వంతో ప్రేమగా కలవడానికి ఇష్టపడుతోందని గుర్తించండి. ఇది స్త్రీశక్తికి సహకరించాలని మరియు ఆత్మశక్తి తనంతట తాను ఈ తలంలో, ఈ సమయంలో మరియు ఈ భౌతికపదార్థంలో రూపొందేందుకు అవకాశాన్ని కలిపించాలని కోరుకుంటోంది. పురుషశక్తి ద్వారా కాపాడబడుతూ మరియు రక్షణ పొందడం వలన స్త్రీశక్తి భద్రతను మరియు ఆనందాన్ని అనుభూతి చెందుతుంది. మీ అంతరంలో స్వర్గం మరియు భూమి కలవడాన్ని అనుభూతి చెందండి.

మన అంతర్ ప్రయాణంలో ఇంకొంచెం ముందుకు వెళదాం. ఇప్పుడు మీరు అందమైన అడవిలో నడుస్తున్నట్టు ఊహించుకోండి. ఆకాశం నీలిరంగులో ఉంది. ఇది ఆకురాల్చే కాలం. వృక్షాలు నెమ్మదిగా వాటి ఆకులను రాల్చడం మొదలుపెడుతున్నాయి. మీ చర్మం పై వెచ్చని సూర్యకాంతి పడుతోంది. మీరు అక్కడ నడవడాన్ని చాలా ఆనందిస్తున్నారు మరియు కొంత సమయం తర్వాత కూర్చోవడానికి ఒక స్థలాన్ని గమనించారు. బహుశా అది చెట్టుక్రింద బల్లగాని లేదా మెత్తని ప్రదేశంగాని అయి ఉండవచ్చు. మీరు అక్కడ నిశ్శబ్ధంగా కూర్చోండి. మీరు ఎరుకతో శ్వాసను తీసుకుంటూ, మీ శరీరం నుంచి అన్ని ఒత్తిడులను విడుదల చేస్తున్నట్లు అనుభూతి చెందండి. భూమి, మిమ్మల్ని తన ఒడిలో ఎలా మోస్తున్నదో అనుభూతి

చెందండి. మీరు అంతరంలో ప్రశాంతతను మరియు నిశ్చలత్వాన్ని పొందుతున్నారు. ఆ సమయంలో కొంతమంది పిల్లల యొక్క ఆనందపు కేరింతలు మీకు గుసగుసల రూపంలో వినబడుతున్నాయి. అవి మిమ్మల్ని కదిలిస్తూ, మిమ్మల్ని నవ్వేలా చేస్తున్నాయి. ఇద్దరి పిల్లలు నడుస్తూ మీ వైపు రావడాన్ని మీరు గమనించారు. వారు ఒక అమ్మాయి మరియు ఒక అబ్బాయి. ఆ పిల్లలు మీకు ఏదో ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మీ వైపు వస్తున్నారు.

ఆ పిల్లలు ఇప్పుడు మీ ప్రక్కకు వచ్చి నిలబడి ఉన్నారు. వీరి ముఖాలు చాలా ఆనందంగాను మరియు ఆహ్లాదంగాను ఉన్నాయి. ఆ అమ్మాయి మీ ముందుకు వచ్చి మీకు ఏదో ఇస్తోంది. అది ఒక వస్తువు కావచ్చు లేదా మరేదైనా కావచ్చు. ఆమె తన ఉనికి ద్వారా లేదా తన కళ్ళ ద్వారా ఏదో ప్రసరింపజేస్తూ మీకు గుర్తుచేస్తోంది. ఆ అమ్మాయి మీకు ఏమి గుర్తుచేస్తోంది? ఆ అమ్మాయి మీ కళ్ళలోకి చూస్తున్నపుడు ఆమె ఏ లక్షణాన్ని ప్రకంపిస్తోంది? ఆమె మీకు భౌతికరూపంలో ఇచ్చే దాని కన్నా శక్తిరూపంలో ఇచ్చేదే అతి ముఖ్యమైనది. ఆమె శక్తిని స్వీకరించి కృతజ్ఞతలు తెలపండి. ఆమెను మీ ఎడమవైపు కూర్చోమని అడగండి. ఇప్పుడు మీరు ఆ అబ్బాయిపై దృష్టి పెట్టండి. అతను కూడా మీకు ఏదో ఇవ్వాలని అనుకుంటున్నాడు. ఆ అబ్బాయి వైపు చూస్తూ మరియు అతను ఇచ్చే బహుమతిని అందుకోండి. ఇది ఒక గుర్తుగాని, ఒక వస్తువుగాని లేదా అనుభూతిగాని కావచ్చు లేదా అతను మిమ్మల్ని స్పృశించవచ్చు. ఇది మీకు స్పష్టంగా తెలుస్తుంది. మీరు అతని సందేశాన్ని అనుభూతి చెందుతూ దానిని మీ అంతరంలోకి స్వీకరించండి. అతనికి మీ కృతజ్ఞతలను తెలుపుతూ మీ కుడివైపు కూర్చోమని అడగండి.

ఈ పిల్లలు ఇద్దరిని మీలోని భాగంగా అనుభూతి చెందండి. వీరు ఎప్పుడూ మీ ప్రక్కన ఉండి మీరు ఎవరనే దానిని గుర్తుచేస్తారు. వీరి యొక్క మూలలక్షణాలు మీకు సంబంధించినవే. వీరి చేతులను తీసుకుని మీ ఒడిలో పెట్టుకోండి మరియు మీ అంతరంలో ఉన్న పాతదనాన్ని అంతా శిధిలమవ్వనివ్వండి. భయం, ఆందోళన మరియు దు:ఖాలను భూమి తెరుచుకుని మీ నుంచి తీసుకుంటున్నట్లు ఊహించుకోండి. ఆమె ఒడిలో ఇవన్నీ గుణరహితమవుతున్నాయి. కొత్తదనం మరియు తాజాదనంతో కూడిన పిల్లల యొక్క శక్తులను మీ శక్తిక్షేత్రంలోనికి అనుమతించండి. అవి మీకు జీవితం పై ఆసక్తిని తిరిగి తీసుకువస్తూ, మీలో సహజత్వంతో కూడిన అద్భుతం మరియు విశ్వాసం యొక్క భావనలను అనుభూతి చెందేలా చేస్తాయి.

మీరు ప్రస్తుత క్షణంలోకి తిరిగి వచ్చిన తర్వాత, మీరు ఈ పిల్లలను మీ

నుండి వెళ్ళనివ్వకండి. ఎందుకంటే వీరు మీ యొక్క భాగాలే కనుక. వీరు మీ యొక్క ఉత్తేజాన్ని మూలాల్లోంచి సజీవంగా ఉంచుతారు. ఎప్పుడైనా మీరు ఆందోళనకు లేదా అసంతృప్తికి గురయ్యినప్పుడు ఈ పిల్లలతో బంధాన్ని ఏర్పరుచుకోండి. ఈ పిల్లలు మీ అంతట మీరుగా తిరిగి సమన్వయాన్ని ఎలా పొందాలో తెలియజేస్తారు. మీరు మళ్ళీ అడవికి వెళ్ళినప్పుడు లేదా మీకు నచ్చిన ప్రదేశానికి వెళ్ళినప్పుడు, ఈ సారి మిమ్మల్ని ఒక అమ్మాయి లేదా అబ్బాయి మిమ్మల్ని గుర్తించడాన్ని మీరు చూడవచ్చు. మీకు ఎలాంటి ఊహలు వచ్చినా వాటిని విశ్వసించండి. ఆ ఊహలను ప్రశాంతంగాను మరియు ఆహ్లాదంగాను ఉంచండి. ఇది కష్టమైన వ్యాయామం కాదు. ఇది కేవలం ఒక ఆట. ఇదంతా మీ అంతరంలోని స్త్రీ-పురుష శక్తుల యొక్క బలమైన మూలకేంద్రపు శక్తులతో బంధాన్ని ఏర్పరుచుకోవడం గురించే.

మీరందరూ ఈ రెండింటి శక్తుల మధ్య కొత్త సమన్వయాన్ని సృష్టించాలనే విషయం పై పని చేస్తున్నారు. ఈ శక్తులు రెండూ మీ ప్రపంచంలో చెడుగాను మరియు తప్పుగాను అర్థం చేసుకోబడుతున్నాయి. ఎప్పుడైనా తిరిగి ఈ శక్తులతో కలవాలని మరియు అంతరంలో వీటి యొక్క సమన్వయాన్ని తిరిగి సృష్టించాలని అనుకున్నప్పుడు, మీరు భూమి మీద తేలికైన, మరింత ప్రేమపూర్వకమైన చైతన్యాన్ని ఇతరులకు ప్రసరింపజేయగలరు. మీరు చేస్తున్న దానికి మేము మీకు కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాము. మేము మిమ్మల్ని చాలా ప్రియాతిప్రియంగా ప్రేమిస్తున్నాము.

* * * *

## మీ జీవితం నుంచి కష్టాలను విడుదల చేయండి

డియర్ ఫ్రెండ్స్,

మీరు ప్రస్తుతం చాలా కష్టాలను ఎదుర్కొంటున్నారు. అందువలన మేము మీకు ఈ రోజు ప్రేమ మరియు ఆశల యొక్క సందేశాన్ని ఇవ్వడానికి వచ్చాం. నేను జెషువాని మాట్లాడుతున్నాను. ఈ రోజు పూర్తిగా క్రీస్తుశక్తి యొక్క స్త్రీ తత్వానికి ప్రతినిధిగా వ్యవహరించబోతున్నాను.

ఈ సమయం మొదలయ్యే నాలుగు నెలల ముందు నుంచి, భూతలంలోకి స్త్రీశక్తి ప్రవాహం చాలా ఎక్కువగా రావడం ఆరంభించింది. ఈ తరంగపు శక్తి మీకు ఒక కొత్తజన్మని, మరియు అదే విధంగా భూమికి పునర్జన్మని తీసుకోవడానికి సహాయం చేస్తుంది. ప్రస్తుతం భూమి మీద సంభవిస్తున్న మార్పుల వలన మీ అంతరంలో ఏర్పడుతున్న అలజడులు, సమన్వయాలోపాలు మరియు అభద్రతాభావం గురించి నేను మీకు చెప్పాలనుకుంటున్నాను.

మీరందరూ చాలా లోతైన అంతర్ మార్పులతో చుట్టిముట్టి ఉన్నారు. మీరు దీనిని ఎరుకతోనే ఎంపిక చేసుకున్నారు. మీరు జన్మించక ముందు నుంచే మీ ఆత్మ ఒక కోరికను కలిగి ఉంది. అది తన గతాన్ని విడుదల చేయాలని మరియు భూమి మీద శక్తివంతమైన 'కొత్తవాస్తవం' యొక్క మార్గాన్ని నిర్మించాలనే కోరికను కలిగి ఉంది. ఎదుగుదలకు మరియు హీలింగ్‌కు గొప్ప అవకాశాలను మీకు ఈ జన్మ అందిస్తుందనే విషయం, ఈ జన్మ తీసుకోక మునుపే మీకు తెలుసు. భూమి, అధికార దౌర్జన్యాలు మరియు విధ్వంసాలకు సంబంధించిన జన్మపరంపర యొక్క చివరిదశకు వచ్చిందనే విషయాన్ని కూడా ఈ జన్మను తీసుకోక మునుపే మీరు గుర్తించారు.

మీరు భూమి మీద చాలా జన్మలను ఎత్తడం వలన, మీరు ఈ జన్మపరంపర యొక్క భాగంగా ఉన్నారు. మీరు అదే విధంగా భూమి కూడా కాలచక్రం యొక్క చివరిదశకు చేరుకున్నారు. ఈ జన్మపరంపరను పూర్తి చేయడానికి మరియు దీని నుంచి ముందుకు వెళ్ళడానికి సంబంధించిన అవకాశాన్ని మీరు ఇప్పుడు కలిగి ఉన్నారు. అందువలనే మీరు ఈ యుగంలో మరియు ఈ సమయంలో జన్మించాలనుకున్నారు. కాని మీరు ఈ అవకాశాన్ని భూమి మీద నివసించినప్పుడు మాత్రమే వినియోగించుకోగలరు. మీరు మరొకసారి మానవజన్మను ఎత్తడం ద్వారానే ఈ కాలచక్రం సంపూర్తి అవుతుంది మరియు ఈ జన్మలో మీ గతజన్మలన్నింటి

యొక్క సారాంశాన్ని కలుపుతారు. కొన్నిసార్లు మీరు ఇది ఎందుకు ఇంత భారంగా ఉంటోంది అని ఆశ్చర్యానికి గురవుతున్నారా?!

మీరు కొద్దిపాటి ఎరుకతో ఈ లక్ష్యంలోకి ప్రవేశించే ముందు, మీరు మొదటిగా మానవశరీరంలో, ఒక వ్యక్తిత్వం తోటి జన్మను తీసుకోవాలి. ఆ జన్మ పాక్షికంగా మీ తల్లిదండ్రులు, మీ సమాజం మరియు మీ వ్యవస్థల యొక్క బాహ్యపు విషయాలకు ప్రభావితమయ్యేటట్టు రూపుదిద్దుకుని ఉండాలి. సాధారణంగా మీ బాల్యంలో మీరు ఎవరనే విషయాన్ని మరిచిపోతారు. మిమ్మల్ని పెంచి పెద్దచేసిన వారి యొక్క నిర్ణయాలు మరియు చికాకుల ద్వారా హిప్నొటైజ్ చేయబడతారు. సాధారణంగా మీరు గతం యొక్క జ్ఞాపకాల నుంచి, భయం మరియు తెలియనితనం నుంచి ఆవిర్భవించిన అణచివేత శక్తులచే చుట్టుముట్టి ఉంటారు. దీని వలన మీ నిజమైన ఆత్మశక్తి పూర్తిగా క్రిందకు నెట్టివేయబడుతుంది మరియు అది కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్ళిపోతుంది.

ఈ జన్మలోని మీ వాంఛ ఏమిటంటే, ఈ అవరోధాలన్నింటిని అధిగమించి మరియు వీటి నుంచి విముక్తిని పొందాలన్నదే. ఇది కేవలం మీ కోసం మాత్రమే కాదు, భూమి మీద కొత్తచైతన్యం యొక్క స్థితిని జీవింపచేయడానికి కూడా ఒక వారధిగా ఉపయోగపడుతుంది. మీ ఎదుగుదల మరియు మీ పరిణామక్రమం కోసం మీరు ఇక్కడ ఉన్నారు. అదే సమయంలో మీరు మానవచైతన్యం అభివృద్ధి చెందడానికి కూడా సహాయం చేస్తున్నారు. మీరు ఒక ఆధ్యాత్మికవేత్తలా భూమి ఎదుగుదలకు సహకరిస్తున్నారు. మీ సూర్యమండలం మరియు దానికి అతీతంగా ఉన్న లోకాలను కూడా ప్రభావితం చేస్తూ వాటి అభివృద్ధికి సహకరిస్తున్నారు.

ఈ మార్పులలో భాగంగా ఉంటూ వీటికి సహకరించే ముందు, మీరు మొదటిగా మానవజన్మను స్వీకరించి, సంప్రదాయాల ద్వారా మీకు సంక్రమించిన బాధలన్నింటితోనూ వ్యవహరించడం అనేది మీకు తెలిసి ఉండాలి. నిజానికి మీరు చాలా ధైర్యవంతమైన యోధులు. మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. మీరు గతాన్ని విడుదల చేయాలని చాలా తీవ్రంగా కోరుకుంటున్నారు, ఇప్పుడు మీరు ఈ కోరికకు తగిన పరిస్థితికి చేరుకున్నారు. మీరు ఏమాత్రం గతం యొక్క శక్తిపై నిలబడలేరు. మీరు పురిటినొప్పుల యొక్క మధ్యలో ఉన్నారు. మీరు కొన్ని దశాబ్దాలుగా ఈ శరీరంలో జీవిస్తున్నప్పటికీ కూడా మళ్ళీ మీరు ఇదే శరీరంలో ఒక కొత్త'మీరు'గా జన్మించబోతున్నారు. నిజానికి మీరు ఇదే శరీరంలో మళ్ళీ జన్మించే ప్రక్రియలో ఉన్నారు. కానీ ఇప్పుడు మరింత ఉన్నతమైన మరియు విస్తరింపబడిన చైతన్యంగా

మీరు రూపొందబోతున్నారు. మీరు జన్మపరంపరను పూర్తిచేసే ఈ అవకాశాన్ని ఎరుకతో వినియోగించుకోవాలని అనుకుంటున్నారు.

మీ లోతైన అంతర్ జ్ఞానాన్ని, మీ నిజతత్వాన్ని భూమి మీద జన్మింపజేసి, దానిని ప్రేమ మరియు సృజనాత్మకతతో తెలియజేయాలన్నదే మీ ప్రస్తుత వాంఛ. సంపూర్ణమైన మరియు ముందే ఉద్దేశించబడిన ఈ వాంఛయే, మీరు ఇప్పుడు ఉన్న ఈ స్థితికి కారణం. ఇది చాలా కష్టమైనదని మాకు బాగా తెలుసు. మీ అంతట మీరు మీ దృష్టిని అంతరంలోకి మరలిస్తూ, మీ బాహ్య జీవితంలో ఏర్పడుతున్న ప్రతీసంఘటనను వదిలివేయకుండా వాటిని క్షుణ్ణంగా అర్థం చేసుకుంటూ, వాటి ద్వారా జ్ఞానాన్ని పొందండి. ఈ విధంగా అంతర్వాణిని వింటూ ముందుకు వెళ్ళడం అనేది ఇతరులకు పిచ్చిగా అనిపించవచ్చు.

మీ అంతరంలో పాతదనం మరియు కొత్తదనం మధ్య ఒక పెద్ద యుద్ధం జరుగుతోంది. మీ పాతదనాన్ని సమాధి చేసే ముందు, మీరు దాని కళ్ళలోకి చూస్తూ, దానిని శాంతపరచాల్సిన అవసరం ఉంది. అలా చేయకపోతే అది ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోలేదు. అందువలన మీరు మీ చీకటిని అధిగమించాలని అనుకున్నా మరియు దాని నుండి స్వేచ్ఛను పొందాలన్నా, మీలో ఉన్న మరియు ప్రపంచంలో ఉన్న చీకటిని ఎదుర్కొంటూ దానిని అంగీకరించగలగాలి. నిజానికి ఏ విధమైన చీకటి లేదు.

మీరు ద్వేషం, కోపం మరియు భయం మొదలైన అతిపెద్ద మనోభావాల వల్ల బాగా అలసిపోయారు. మీరు వీటితో వ్యవహరిస్తున్నప్పుడు, అవి మీకు చీకటి భూతాలుగా కనిపించవచ్చు. మీ అడ్డులతో వ్యవహరించేటప్పుడు, మీరు ఈ అజ్ఞానపు భూతాల కళ్ళల్లోకి 'కరుణ'తో చూస్తూ మరియు ఇవి 'స్వీకరించదగినవి'గా భావిస్తూ వీటిని ఎదుర్కొనాలి. ఇవి మీలోని భాగాలే. మీ అంతరంలో 'గాయపడిన', 'ఆందోళనకు గురైన' మరియు 'సరైన మార్గదర్శకత్వం లోపించిన' మొదలైన భాగాలు ఉన్నాయి. ఇవి, మీ సొంతవాటిగా గుర్తింపబడాలని మరియు మీ ద్వారా అర్థం చేసుకోబడాలని కోరుకుంటాయి. ఇవి మీ పిలుపు కోసం ఎదురుచూస్తాయి. మీరు వీటి యొక్క మార్గదర్శకులే గాని, వీటి యొక్క శత్రువు కాదు! మీరు ఈ భూతాలను అడ్డుకున్నట్లయితే, అవి మరింత గట్టిగా మీ తలుపును తడతాయి. మీరు ప్రేమపూర్వకమైన కరుణతో వీటిని కౌగిలించుకున్నప్పుడు మాత్రమే ఇవి ప్రశాంతతను మరియు విశ్రాంతిని కనుగొనగలవు.

మీ అంతర్ భూతాలను ఎదుర్కొనే ఆధ్యాత్మిక ప్రక్రియలో పయనిస్తూ, కొత్తదనానికి ప్రదేశాన్ని ఏర్పరుస్తున్నప్పుడు, మీ చైతన్యం యొక్క కదలికలకు మీ శరీరం ప్రభావితం చెందుతుంది. మీ శరీరం వింత పద్ధతుల్లో ప్రతిస్పందిస్తూ, మీకు అసౌకర్యాన్ని మరియు నొప్పులను కలుగజేస్తుంది. కాని ఇవి సాధారణంగానే సంభవిస్తుంటాయి. ఇదంతా మీ ఆధ్యాత్మిక ప్రక్రియలో భాగమే. మీరు ఈ ఎత్తు, పల్లాల మార్గంలో పయనిస్తూ, లోతైన భయాలను మరియు సందేహాలను ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే ఈ మార్గంలో మీకు బాగా తెలిసిన విషయాలన్నీ కూడా, మీ చేయి జారిపోవడాన్ని గమనిస్తారు కనుక. మీరు వీటన్నింటిని విడుదల చెయ్యాలి. ఇది పాతదనం మరియు కొత్తదనాలను సమన్వయ పర్చడం కాదు. ఇది పూర్తిగా కొత్త ఆరంభం. మీ ఆత్మకు అనుగుణంగా పయనించగలగాలి, ఇదే మీకు నిజమైన దిక్సూచి. ముఖ్యంగా ప్రధాన అన్వేషకులైన లైట్‌వర్కర్స్‌గా మీరు, మీ సమాజం నుంచి ఏ విధమైన గుర్తింపును, సహకారాన్ని పొందలేరు. మీ మీద మీరు పూర్తిగా ఆధారపడాలి. మీ అంతర్ ప్రయాణం యొక్క లోతుల గురించి మరియు మీరు చేరాల్సిన గమ్యం గురించి మీకు తెలుసు. మీరు జన్మ తీసుకోబోయే ముందే ఈ ప్రణాళికను వేసుకుని వచ్చారు. మీకు స్వతహాసిద్ధంగా ఉన్న మీ అంతర్జ్ఞానమే, మిమ్మల్ని ఈ భూమి మీద మీ ఇంటికి తిరిగి చేర్చగలదు.

మీరు ఒక మనిషిలా, భూమి మీద ఉన్న నమ్మక వ్యవస్థలకు మరియు భూమిని చుట్టుముట్టి ఉన్న గాయపడిన శక్తులకు ప్రభావితం చెందుతున్నారు. మానవులందరికి జీవితం పట్ల ఉన్న అభిప్రాయం: జీవితమంటే కష్టాలు మరియు బాధలు అని దృఢంగా నమ్ముతున్నారు. "మీరు బ్రతకడానికి పోరాడాలి, మీ ప్రక్కనున్న వారిని నమ్మకూడదు, ప్రతీ దానిని జాగ్రత్తగా ఎల్లప్పుడూ పరిక్షించాలి" అనే మొదలైన నమ్మకాలను కలిగి ఉంటారు. మీ అంతరపు లోతులలో దాగి ఉన్న మనోభావాలు మరియు నమ్మకాలు అన్నీ కూడా ఇప్పుడు మీ ఎరుకలోకి వస్తున్నాయి. ఎందుకంటే ఇప్పుడు మీరు, వీటిని విడుదల చేయాలని కోరుకుంటున్నారు కనుక.

మీరు మీ ఆత్మవాంఛను నమ్ముతూ మరియు దీనికి ఆధీనమవ్వాలని కోరుకున్నప్పుడు, మీ అపనమ్మకాలు మరియు అదుపుల యొక్క మీ పాతఅలవాట్లు తలెత్తుతూ, వాటిని అవి కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాయి. మీ అంతర్ ఉత్తేజాన్ని స్వేచ్ఛగా తెలియజేయాలని అనుకున్నప్పుడు, తిరస్కరణ యొక్క భయం మిమ్మల్ని అడ్డుకుంటూ, మిమ్మల్ని మాట్లాడనివ్వకుండా చేస్తుంది. మీలో అనేక అంతర్ సంఘర్షణలు తలెత్తుతాయి. ఇవి మీ మనసు మరియు హృదయంలో ఉద్రిక్తస్థితికి కారణమవుతాయి. మీ పాత ఆలోచనా పద్ధతులు అంత తేలికగా చనిపోవు. ఎందుకంటే అవి మీ

వ్యక్తిత్వంలో కలిసిపోయి భాగంగా ఉన్నాయి కాబట్టి. ఇది దశలవారీగా క్రమక్రమంగా పరిణామం చెందే ప్రక్రియ. ఈ ప్రక్రియలో మీరు ముందుకు పయనిస్తారు. ముఖ్యంగా మీరు, గతాన్ని ఘర్షణలు లేదా గొడవల ద్వారా అధిగమించలేరనే విషయాన్ని గుర్తించాలి.

**మీ జీవితం నుంచి కష్టాలను విడుదల చెయ్యండి**

మీరు భూమి మీద ఉన్న చాలా జన్మల్లో, మీ పేరు 'మధ్య భాగం'గా కష్టాలను పెట్టుకుని జీవించారు. మీరు భూమి మీద చాలాసార్లు చైతన్యం యొక్క కాంతిని ప్రసరింపజేయాలని ప్రయత్నించారు మరియు మీలో చాలామంది అనేక రూపాలలో ఉన్న క్రీస్తుశక్తి ద్వారా ఉత్తేజింపబడ్డారు. మీరు సమానత్వం, ప్రశాంతత మరియు సమన్వయం గల ఉన్నతమైన ప్రపంచాన్ని ఏర్పరచాలనే ఆశయంతో జీవించేవారు. అదే సమయంలో మీరు కష్టాలలో మునిగి ఉండేవారు: మీరు ప్రత్యేకమైనవారని మరియు జీవితంలో మీ సొంత మార్గాన్ని మీరు కనుక్కోవాలనే అభిప్రాయాలను ఎల్లప్పుడూ కలిగి ఉండేవారు. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవడానికి మరియు ఈ ప్రపంచంలో మీ గురించి మీరు వ్యక్తపరుచు కోవడానికి చాలా కష్టపడుతుండేవారు. ఎందుకంటే నిజానికి మీరు ఇతర గ్రహాలకు సంబంధించిన వారు కనుక. మీరు విషయాలను ప్రత్యేకమైన ధోరణిలో చూడడం వలన తిరస్కరింపబడుతూ, కష్టాలకు గురయ్యేవారు. అందువలన కష్టాలు మరియు ఆధ్యాత్మికత రెండూ ఒకదానితో ఒకటి మీ కోసం కలిసి పయనిస్తున్నట్టుగా ఉండేవి.

ఇప్పుడు మిమ్మల్ని కష్టాలను విడుదల చేయమని అడుగుతున్నాను. ఇది చాలా ప్రత్యేకమైన సమయం. ఇది మీ సమయం. మీరు ఇక్కడ ఉన్నది కష్టాలు పడడానికో లేదా మిమ్మల్ని మీరు సంరక్షించుకోవడానికో లేదా ఇతరులకు సర్దిచెప్పడానికో గాని కాదు. మీరు ఇక్కడ ఉన్నది మిమ్మల్ని మీరు విడుదల చేసుకుంటూ, మీ యొక్క జన్మకి మరియు మీ ప్రజ్ఞాత్మకి ఆధీనమవ్వడం కోసమే.

ఇప్పుడు మీలో చాలామంది, జీవితంలో సులభంగా సంభవించని విషయాల గురించి చాలా ఆందోళనలను మరియు ప్రతిఘటనలను ఎదుర్కొంటున్నారు. మీరు చేయవలసినది ఏమిటంటే, మీ అంతరం యొక్క లోతులలోనికి పయనిస్తూ, అవధులు లేని మరియు అపరిమితమైన ప్రేమ గల మీ అంతరాత్మ దగ్గర విశ్రాంతిని పొందడమే. మీ ఆత్మశక్తి మీకు అందుబాటులోనే ఉంది. ఇది మీ కంటికి కనిపించే భౌతికప్రపంచంలో లేదు. ఇది మీ అంతరంలో ఉంది. మీ ఆత్మశక్తి, మీరు ఇక్కడ ఉండడానికి గల

కారణాన్ని మీకు గుర్తు చేస్తుంది. మీరు ఈ జన్మ తీసుకోకముందు 'మీరు ఎవరనేది మీకు ఎంత స్పష్టంగా అయితే తెలుసో', అంత స్పష్టంగాను ఇప్పుడు మిమ్మల్ని మీరు గుర్తించగలరు. ఈ జన్మ, కష్టాలు మరియు ఆందోళనలతో ఉన్నా కూడా చాలా గొప్పగాను మరియు అర్థవంతంగాను రూపొందబోతోందనే విషయాన్ని మీరు స్పష్టంగా తెలుసుకుంటారు. మీరు ఇక్కడకి వచ్చింది కష్టాలు అనుభవించడానికి కాదని మరియు వాటిని విడుదల చేస్తూ ఇంటికి తిరిగి చేరడానికేనని తెలుసుకుంటారు. మీ ఇల్లు ఇక్కడే ఉంది, ఎక్కడైతే మీ చైతన్యం నివసిస్తుందో అక్కడ మీ ఇల్లు ఉంటుంది. మీ ప్రయాణంలో, మీరు ఎక్కడ ఉన్నా కూడా అక్కడ మీ కష్టాలను విడుదలచేసే అవకాశం ఉంటుంది. మీ ప్రస్తుతస్థితి ఎలా ఉన్నా దానిని అంగీకరిస్తూ, మీ యొక్క అంచనాలను విడుదల చేయండి. ఇదే మీరు వర్తమానంలో ఉండడమంటే. మీ పై మీరు ఆధారపడుతూ, మీరు ఇక్కడకు వచ్చిన కారణాన్ని తెలుసుకుంటూ దానికి సన్నిహితమవ్వడానికి ప్రయత్నించండి.

మీరు మీ లక్ష్యాన్ని చేరడానికి, మీ యొక్క ప్రతిఘటనలను విడుదల చేయాలి. మీరు కష్టాల ద్వారానే లక్ష్యాన్ని చేరుతారనే అభిప్రాయాన్ని కూడా విడుదల చేయాలి. మీరు 'బాధల ద్వారానే ఎదుగుదల ఉంటుంది' అనే అభిప్రాయాన్ని చాలా దృఢంగా నమ్ముతున్నారు. సాధారణంగా మీరు ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం బాగా కష్టపడి ప్రయత్నించాలనే ఉద్దేశ్యాన్ని కలిగి ఉంటారు. ఇదే సరైన పద్ధతి అని భావిస్తారు. ముఖ్యంగా మీరు, మీ గతానికి సంబంధించిన తీవ్రమైన శక్తులను ఎదుర్కొంటున్నట్లయితే, దానికి పరిష్కారం: మీ అంతరంలో "ప్రశాంతస్థితిని" కనుగొనటమే. ప్రశాంతస్థితి అంటే "ఏదో చేయడం కాదు", కేవలం నిర్గుణస్థితిలో ఉంటూ, ప్రతీ విషయాన్ని తటస్థ ఎరుకతో గమనించడమే. ఆ స్థితి నుంచి మిమ్మల్ని మీరు ఏమాత్రం మార్చాలని ప్రయత్నించకుండా, కేవలం మిమ్మల్ని మీరు గమనిస్తుండాలి. ఇదంతా మిమ్మల్ని మీరు ఉన్నదిఉన్నట్టుగా అంగీకరించుకోవడం గురించే.

మీ గతజన్మల నుంచి, మీలో బలంగా నాటుకుపోయిన ఒకానొక విషయం ఏమిటంటే, "కష్టపడి పని చేయాలనే తత్వం". ఇది బలమైన మీ పురుషశక్తి యొక్క లక్షణం. మీరు తరచూ కాంతి యొక్క యోధులుగా ఉంటూ, పరిస్థితులను మంచిగా మార్చాలనే తీవ్రమైన ఆసక్తితోనూ మరియు ప్రోత్సాహంతోనూ ఉండేవారు. దీని గురించి మీరు కష్టాలను కొంచెం ఎక్కువగా అనుభవిస్తుండేవారు. ఇప్పుడు ఈ బలమైన పురుషశక్తిని ప్రశాంతమవ్వమని మరియు స్త్రీశక్తితో కొత్త సమన్వయంలోకి

ప్రవేశించమని అడగండి. ఈ స్థితిలో స్త్రీశక్తి – స్వేచ్ఛ, తేలికతనం మరియు ఆనందాలకు వాహకంగా ఉంటుంది. ఈ స్త్రీశక్తి మీకు, మీ అనుభూతుల యొక్క ప్రవాహానికి అనుగుణంగా పయనించమని, మరియు మీరు సరైనది అని అనుభూతి చెందుతూ, చేస్తున్న వాటి యొక్క ఫలితాలపై దృష్టిని కేంద్రీకరించవద్దని చెబుతుంది.

ఈ స్త్రీశక్తిని అనుమతించడం వలన, తీసుకోవడం మరియు ఇవ్వడం యొక్క ప్రవాహాలు ఎలా ఒకదానితో ఒకటి మీ జీవితంలో బంధాన్ని కలిగి ఉంటాయి అనే ప్రశ్నలు మీలో తలెత్తవచ్చు. ఇతరుల యొక్క అభిప్రాయాలను లేదా మీకు మీరు పెట్టుకున్న ఆంక్షలను పట్టించుకోకుండా, మీరు సరైనది అని అనుభూతి చెందుతున్న వాటిని చేయగలరా? నిజానికి మిమ్మల్ని మీరు పట్టించుకోగలరా మరియు మీ జీవితంలో మీరు కోరుకున్న వాటిని మీకు మీరు అందించుకోగలరా? ఇవి లైట్‌వర్కర్స్‌ను అడిగే క్లిష్టమైన ప్రశ్నలు కాదు. మీ బాహ్య ప్రపంచంపై అధికంగా దృష్టిని కేంద్రీకరిస్తూ, ఈ ప్రపంచాన్ని మార్చాలని మరియు అభివృద్ధి చేయాలని కోరుకుంటారు. "భూమి మీద నా లక్ష్యం ఏమిటి?" మరియు "ఈ ప్రపంచాన్ని మార్చడానికి నేను ఎలా సహకరించగలను?" ఇవి మీకు చాలా ఇష్టమైన ప్రశ్నలు. మీరు ఈ పై విషయాలను ఎల్లప్పుడూ ఘర్షణవైఖరితో సాధించాలని అనుకుంటారు. ఈ వైఖరి మీ రెండవ స్వభావంగా మారుతోంది. మీరు ఇక్కడికి వచ్చినది: "మీ జీవితాన్ని ఆనందించడానికి, మీ పట్ల మీరు వాత్సల్యాన్ని చూపించుకోవడానికి మరియు జీవితం యొక్క ప్రవాహంతో పయనించడం కోసమే" అనే విషయాన్ని మీలో చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు! మీరు దీనిని గుర్తించనట్లయితే, మీ జీవితంలోని ఇచ్చే ప్రవాహం మరియు తీసుకునే ప్రవాహాల మధ్య సమన్వయాలోపం ఉందనే విషయాన్ని తెలుసుకుంటారు. దీనికి కారణం మీరు అధికంగా ఇవ్వడమే.

మీరు ఇతరుల బాగు కోసం పని చేస్తూ, వారి బాధ్యతలను స్వీకరిస్తూ, వారికి అధికంగా ఇచ్చినట్లయితే, మీరు కష్టాలకు మరియు అధిక శ్రమకు గురవుతారు. మీరు ఇతరుల నుంచి సహాయాన్ని పొందడానికి ఇబ్బంది పడతారు మరియు దీని వలన మీ వ్యక్తిగత జీవితం పై దృష్టిని కేంద్రీకరించలేరు. మీరు చివరికి ఆందోళనకు మరియు శూన్యతకు లోనవుతారు. స్త్రీ–పురుష శక్తులను సమన్వయపరచాలంటే, మీ జీవితం యొక్క సహజ ప్రవాహంలో ఉంటూ, మీరు చేసే ప్రతి పనిని ఒత్తిడితో కాకుండా, ఆనందంతోనూ మరియు ఉత్తేజంతోనూ చేయగలగాలి. ఇక్కడ ఒత్తిడి ఏమి తెలియజేస్తున్నదంటే, మీరు స్వేచ్ఛగాలేరని మరియు ఫలితాలను అంటిపెట్టుకుని ఉన్నారని. ఎప్పుడైనా మీరు ఒత్తిడికి గురైతే, దానిని విడుదల చేస్తూ నిర్మలమైన స్థితికి వెళ్ళండి.

ముఖ్యంగా ఇప్పుడు మీ అంతర్ స్థాయిలలో చాలా మార్పులు సంభవిస్తున్నాయి. (ఈ ఛానెలింగ్ 2007లో జరిగింది.) ప్రస్తుతం మిమ్మల్ని మీరు వ్యక్తీకరించుకోవడానికి లేదా వ్యక్తపరుచుకోవడానికి సరైన మార్గాన్ని కనుగొనడం అనేది చాలా కష్టంగా ఉండగలదు. ఈ స్థితిలో ప్రయత్నించడం, కష్టపడడం మరియు బలవంతం చెయ్యడం అనే వాటికి బదులు, నిశ్శబ్ధంగా ఉండడం అనేది చాలా సులభమైన మరియ తెలివైన పని. కేవలం మీ అంతరంలో జరుగుతున్న దానిని అనుభూతి చెందండి. మీరు తీసుకోబోతున్న ఈ కొత్తజన్మ, మీ యొక్క అన్ని స్థాయిలలోనూ, అంటే మనోభావ, మానసిక, భౌతిక పరమైన స్థాయిలలో మార్పును తీసుకువస్తోంది. అందువలన బాహ్య ప్రపంచంలో మిమ్మల్ని మీరు సమర్ధవంతంగా వ్యక్తపరుచుకోవడానికి ఇది సరైన సమయం కాదు. ఇక్కడ మీరు పాటించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఆధీనమవ్వడమే. ఇదంతా స్త్రీశక్తి గురించే.

మీరు సరైన మార్గంలోనే ఉన్నారు. ఇప్పుడు మీలో సంభవిస్తున్న మార్పులు ఇంతకంటే వేగంగా సంభవించడం కష్టమని మేము మీకు ఖచ్చితంగా చెప్పగలము. ముఖ్యంగా మీకు కష్టమైన పరిస్థితులలో ఇరుక్కుపోతున్నట్టు మరియు ఏమాత్రం సులభంగా వెళ్ళే మార్గం లేనట్టుగా అనిపించినా, దాని అర్ధం మీ అంతరంలో పెద్ద మార్పులు సంభవిస్తున్నాయని. దీనిని విశ్వసించండి మరియు తరచూ మిమ్మల్ని మీరు విశ్లేషించుకునే విధానాన్ని ఆపివేయండి! మీ అనుభూతుల ప్రవాహానికి అనుగుణంగా పయనిస్తూ దానిని విశ్వసించండి.

ఒకసారి శిశువు 'జననం' గురించి ఆలోచించండి. ప్రకృతి యొక్క ప్రాథమిక శక్తులు ఈ ప్రక్రియకు మార్గదర్శకత్వాన్ని వహిస్తాయి. మీరు ఈ శక్తులను అదుపు చేయలేరు మరియు ఈ సంకోచాలు లేదా నొప్పులు ఎప్పుడు వస్తాయనే విషయాన్ని కూడా నిర్ణయించలేరు. మీరు కేవలం ఏమి చేయగలరంటే, ఆ సంకోచాలను ప్రతిఘటిస్తారు లేదా వాటితో పయనిస్తారు. వాటితో పయనించడం అంటే, సంకోచాల యొక్క నొప్పులను మీ ద్వారా పయనించడానికి అనుమతిస్తూ, మరియు అవి క్రమక్రమంగా తగ్గిపోతాయని, మళ్ళీ మీ శ్వాసను మీరు అందుకోగలరని విశ్వసించడమే. దీని వలన మీ అనుభూతుల యొక్క అంతర్ ప్రవాహంతో మీకు మీరుగా అనుసంధానమవుతూ, మీ మొత్తం ప్రక్రియను చాలా సులభంగాను మరియు సున్నితంగాను చేసుకోగలరు. కాబట్టి బాహ్యదృష్టి ద్వారా మిమ్మల్ని మీరు నిర్ణయించుకోకుండా, వివిధ రకాల అంచనాలు మరియు ఆంక్షల ద్వారా మిమ్మల్ని మీరు పరిగణించుకోకుండా, మీ అంతరంలో జరుగుతున్న దానిని అనుభూతి చెందండి.

మీరు దీని యొక్క నిజాన్ని అనుభూతి చెందండి. మీ బయటి వాస్తవం దీనిని ఎలా ప్రతిబింబిస్తుందో చూడండి.

నేను మిమ్మల్ని ఒక్కక్షణం నాతో ప్రయాణించడానికి రమ్మని ఆహ్వానిస్తున్నాను. నేను మిమ్మల్ని భవిష్యత్తు యొక్క వాస్తవంలోకి తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను. అది మీకు మరింత ప్రశాంతతను మరియు వర్తమానం పై విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి తోడ్పడవచ్చు. ఇప్పుడు మీరు, మీ ఊహాశక్తితో నాతో ప్రయాణించండి. మనం కొత్తభూమిని దర్శించబోతున్నాం.

**కొత్తభూమిని సందర్శించడం**

కొత్తభూమి అనేది ఒక శక్తివంతమైన వాస్తవం. ఇది క్రమక్రమంగా అభివృద్ధిచెందుతూ మరింత స్థానాన్ని సంపాదించుకుంటోంది, మీ అంతర్‌పనికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు ఈ ప్రపంచంలోకి ప్రవేశిద్దాం మరియు దీని యొక్క శక్తిలోకి ఆకర్షింపబడదాం. మీరు అందమైన వృక్షాలతో ఉన్న అడవిలో నడుస్తున్నట్లు, చల్లని గాలులు మీ చర్మాన్ని స్పృశిస్తున్నట్లు ఊహించుకోండి. మీరు గతం మరియు వర్తమానం యొక్క బాధలను, మీ భుజాల పై నుంచి తీసివేస్తున్నట్లు అనుభూతి చెందండి. ఇప్పుడు మీకు మీరే సరికొత్తగా కనిపిస్తారు. మీరు ముందే కొత్తశకంలో జన్మించి ఉన్నారు. మీరు స్పష్టమైన అంతర్‌జ్ఞానంతో ప్రశాంతతని అనుభూతి చెందుతూ, ప్రతీది కూడా అర్ధవంతంగా ఉందని తెలుసుకుంటున్నారు.

మీ ప్రయాణంలో మీకు ఎదురైన ప్రతీ అనుభవం నుంచి మీరు నేర్చుకున్నారు. మీ ఆత్మ దీని వలన లోతైన జ్ఞానాన్ని పొందింది. మీరు ప్రశాంతతను మరియు సౌలభ్యాన్ని అనుభూతి చెందుతున్నారు. మీ హృదయం తెరుచుకుని ఆనందకరమైన అనుభూతితో ప్రతిస్పందిస్తోంది. మీరు ప్రకృతిని ఆనందిస్తూ, మీ పాదాల క్రింద ఉన్న భూమి యొక్క స్పర్శను మరియు మీ అంతరంలో ప్రశాంతతను, నిశ్శబ్దాన్ని అనుభూతి చెందుతున్నారు. భూమి యొక్క స్థితి గతులు మార్పు చెందాయి. ఇప్పుడు ప్రజలు సమన్వయంతో జీవించడాన్ని నేర్చుకున్నారు.

మీరు ఒక ఒప్పందాన్ని, ఒక చిన్న వ్యవస్థను ఇప్పుడు చేరుకుంటున్నారు. ఇది ప్రకృతిలోని ఒక విశాలమైన ప్రదేశం. మీరు ఇక్కడే జీవిస్తారు. ఇక్కడ ఉన్నవారితో మీరు జీవిస్తున్నప్పుడు, మీ హృదయం తెరుచుకోవడాన్ని అనుభూతి చెందుతారు. వీరు మీ స్నేహితులు మరియు ఆత్మ బంధువులు. మీ బంధం చాలా

పురాతనమైనది. మీరు చాలా జన్మలలో వీరిని కలిసారు మరియు వీరిని మీ అన్నదమ్ములుగా లేదా అక్కచెల్లెల్లుగా కలిగి ఉన్నారు. వీరితో ఉండడం అనేది మీకు ఒక దీవెన లాంటిది. వీరి దగ్గర మీరు ఏమి దాచనక్కర్లేదు. మీరు మీరుగా వీరితో ఉండగలరు. మీరు ఒకరినొకరు సులభంగా అర్థం చేసుకుంటారు. మీరు ఒకరితో ఒకరు మాటల ద్వారా కాకుండా, హృదయం ద్వారా సంభాషించుకుంటారు.

మీరు అక్కడ కూడా మీ సొంత ఇంటిని కలిగిఉన్నారు. ఒకసారి దానిని గమనించండి. అక్కడ మీకోసం ఒక స్థలం ఉంది. ఇప్పుడు మీరు అక్కడకి వెళ్ళండి మరియు మీ ఇంటి యొక్క విషయాలను గమనించండి. ఆ ఇల్లు పెద్దదా లేదా చిన్నదా, ఏ వస్తువుల ద్వారా అది చేయబడింది. ముఖ్యంగా మీరు ఆ ఇంటిని ఎలా అనుభూతి చెందుతున్నారు? భూమి ఈ ఇంటిని నిర్మించడానికి కావలసిన పదార్ధాలను మీకు అందించింది. ఆ ఇంటి యొక్క రంగులను, పదార్ధాలను మరియు ఆ ఇల్లు మీకు చూపించే వాత్సల్యాన్ని అనుభూతి చెందండి. ఈ ఇల్లు మీ యొక్క శక్తి విస్తరణకు సంబంధించినది. మీరు భూమి నుంచి వెళ్ళిపోవాలని అనుకున్నప్పుడు, మీరు ఆ ఇంటికి వెళ్ళి కూర్చోండి. ఇది మీ నిజతత్వంతో లోతైన బంధాన్ని ఏర్పరుచుకోవడానికి మీకు సహకరిస్తుంది. అప్పుడు మీరు భూమి ద్వారా భద్రంగా పట్టుకొనబడి ఉంటారు.

ఇప్పుడు మనం మీ చుట్టూ ఉన్న ప్రజలను అతిసన్నిహితంగా గమనిద్దాం. ఇక్కడ ఒక ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడ ప్రజలందరూ కలసికట్టుగా చేసే పనులకు సమావేశమవుతారు. ఈ ప్రదేశం మీ అందరి యొక్క శక్తిని కలుపుతుంది. ప్రస్తుతం ఇక్కడ ఏదో జరుగుతోంది. ఇది దేని గురించో ఒకసారి వెళ్ళి చూద్దాం. మీరు ఆసక్తితో ఆ ప్రదేశాన్ని చేరుకుంటున్నారు. అక్కడ చాలా పెద్దసంఖ్యలో మనుష్యులు ఉన్నారు. వారు మిమ్మల్ని చాలా ప్రేమపూర్వకమైన చిరునవ్వుతో స్వాగతిస్తున్నారు మరియు వారిలో ఇద్దరు మీరు ఆ సమావేశంలో పాల్గొనేందుకు వెంటనే అవకాశాన్ని కలిపిస్తున్నారు.

గంభీరమైన ప్రకంపనంతో కూడిన శక్తి, ఈ మనుష్యుల యొక్క సమూహం నుంచి ప్రవహించడాన్ని మరియు మీరు కూడా ఆ శక్తిలో భాగంగా ఉండడాన్ని అనుభూతి చెందుతున్నారు. మీరు ఐకమత్యాన్ని, సమానత్వాన్ని మరియు మీ అందరి కలయిక వలన ఏర్పడిన ఆనందాన్ని అనుభూతి చెందుతున్నారు. ఇప్పుడు మీరు కొత్తభూమికి సంబంధించినవారు. ఇక్కడ మీరు చేయాల్సింది చాలా ఉంది. మీరు

చాలా కార్యకలాపాలలో అంటే నిర్మాణం, ఆహారాభివృద్ధి, సమాచారవ్యవస్థ, హీలింగ్ మొదలైన భాగాలలో నిమగ్నులై ఉన్నారు. మీరు ఏ వ్యవస్థకు సంబంధించినవారైన కూడా, అన్ని వ్యవస్థలలోనూ పాల్గొంటున్నారు. ఇక్కడ ఉన్న కార్యకలాపాలు అన్నీ కూడా సర్వవ్యాపకత్వం గల సమన్వయాన్ని అనుసరిస్తాయి. ఇక్కడ ఎటువంటి ఘర్షణలు ఉండవు, కేవలం ప్రశాంతతే ఉంటుంది. మీకు మార్గదర్శకత్వాన్ని చూపించడానికి మీ ఇంగిత జ్ఞానాన్ని అనుమతిస్తున్నారు. మీరు ఆడుకోవడానికి, ఆనందించడానికి మరియు అదే విధంగా విశ్రాంతిని పొందడానికి ఇక్కడ చాలా అవకాశాలు ఉన్నాయి.

ఇక్కడ మీరందరూ కలిసి ఈ రోజు మనం చర్చించుకున్న మీ యొక్క జన్మ ప్రక్రియను అనుభూతి చెందండి. ఒక పాత గుర్తింపు, ఒక కొత్త ఉనికికి లేదా కొత్తదనానికి మార్గాన్ని ఏర్పరుస్తుంది. ఇప్పుడు మీరు కొత్తభూమి యొక్క కాంతిలో జన్మిస్తున్నారు.

ఇప్పుడు మీరు, మిమ్మల్ని ఎవరో పిలుస్తున్న పిలుపును వింటారు. మీరు ఈ పిలుపును మీ సోదరులు మరియు సోదరీమణులతో నిలబడి వింటున్నారు. ఈ పిలుపు పాతభూమి నుంచి వస్తున్నది. ఇది వర్తమానం నుంచి, మనం కూర్చున్న ఈ ప్రదేశం నుంచి వస్తున్న మీ యొక్క పిలుపే. మీరు మీ జన్మ ప్రక్రియ యొక్క తీవ్రత వలన కొన్నిసార్లు బాగా అలసటకు మరియు అవిశ్రాంతికి లోనవుతున్నారు. అందువలన ఇక్కడ మీరందరూ కలిసి మీరు మీ భవిష్యత్తుని, పైన ఉన్న మీ ఆత్మ కుటుంబాన్ని ప్రేమ మరియు సహకారం కోసం అడుగుతున్నారు. మీరు భవిష్యత్తులో ఉన్నప్పుడు ఈ పిలుపును అనుభూతి చెందగలరు. మీ గతం యొక్క 'మీరు'కి ప్రేమను మరియు జ్ఞానాన్ని అందించగలరు. ఒక్క క్షణం కళ్ళు మూసుకుని దీనిని అనుభూతి చెందండి. మీ భవిష్యత్తులో ఉంటూ, మీ వర్తమానానికి ప్రేమను పంపండి. భవిష్యత్ వాస్తవంలో ఉన్న సామూహిక శక్తికి అంటే, భవిష్యత్తులో మనుష్యులకు ఇప్పుడు మీకు ఏది అవసరమో ఖచ్చితంగా తెలుస్తుందని మీరు భావించవచ్చు. ఎందుకంటే వారు మీరే మరియు వారు మీ ఆత్మ యొక్క చీకటి రాత్రి ద్వారా పయనించినారు కనుక.

ఇప్పుడు మీ ఆలోచనారీతిని మార్చండి. మీ వర్తమానానికి తిరిగి రండి. ఇప్పుడు దీనిని అందుకునే వైపు ఉండండి. మీ ఆత్మ కుటుంబం నుంచి వస్తున్న ప్రేమను మరియు ఓదార్పును అంగీకరించండి. మీరు సాధించిన దానికి ఆనందించండి.

మీరు చేసిన దానికి వారు మీకు అందిస్తున్న ప్రేమ మరియు ఓదార్పులపై గౌరవభావాన్ని కలిగి ఉండండి. ఎందుకంటే మిమ్మల్ని మీరు విశ్వసిస్తూ, కొత్తభూమికి జన్మను ఇచ్చిన వారిలో మీరు ఉన్నారు కనుక. భవిష్యత్తులోని 'మీరు'ను మీకోసం కలిగిఉన్న సందేశాన్ని ఇమ్మని అడగండి. ప్రస్తుతం మీకు ఏది ముఖ్యమైనదో అడగండి? దీని నుంచి మీకు సమాధానాలు సులభంగా వస్తాయి. దీనికి మాటలు లేదా ఊహల అవసరం లేదు. కేవలం శక్తిని అనుభూతి చెందితే చాలు. మీ భవిష్యత్తులోని "మీరు", మీ చేతులను తీసుకుని, మీ కళ్ళలోకి లోతుగా చూస్తూ, తన నుంచి ఆశను మరియు విశ్వాసాన్ని మీకు ప్రసరింపజేస్తున్నట్లు ఊహించుకోండి. మీ నొప్పుల యొక్క ప్రవాహంతో పయనిస్తూ, వాటిని మీ నుండి విడుదల చేస్తున్నట్లు అనుభూతి చెందండి. వీలైనంత సమయాన్ని తీసుకుని కొత్త శక్తులతో కలవండి.

మేము మిమ్మల్ని విశ్వసిస్తున్నాం! ప్రతీ రోజూ మీ కోసం మీరు సమయాన్ని కేటాయించుకోండి. మిమ్మల్ని మీరు గొప్పగా అనుభూతి చెందడానికి సాహసించండి. మీ పట్ల మీరు కఠినంగా వ్యవహరిస్తున్నా, అంటే అసహనంతోనూ, బాధతోనూ మిమ్మల్ని మీరు దూషించుకుంటున్నా, మీరు పాతశక్తికి సంబంధించిన బాధలలోకి తిరిగి పడిపోతారు. ఈ బాధలను విడుదల చేయడానికి సరైన సమయం ఇదే. మీ పట్ల మీరు దయను మరియు వాత్సల్యాన్ని చూపించుకునే సమయం కూడా ఇదే. మీ పట్ల మీరు కరుణను చూపించండి మరియు అదే విధంగా మీ ప్రకాశం ఇతరులను కూడా దీవిస్తుంది. మీ నిజతత్వంతో లేదా దైవత్వంతో ఉండండి. అప్పుడు మిగతా విషయాలన్నీ యధాతథంగా ఉంటాయి.

* * * *

# ఆధీనం మరియు అదుపు

డియర్ ఫ్రెండ్స్,

నేను క్రీస్తు చైతన్యం యొక్క హృదయం నుంచి మాట్లాడుతున్నాను. నేను జెషువాని. కేవలం నేను రెండువేల సంవత్సరాల క్రితం భూమి మీద నివసించిన ఒక వ్యక్తిత్వాన్ని మాత్రమే కాదు. నేను ఇప్పుడు అంతకన్నా ఉన్నతమైన దానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. మీ అందరి హృదయాలలో ఉన్న క్రీస్తుశక్తికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. ఇప్పుడు మాట్లాడుతున్న 'నేను' మీ శక్తికి మరియు మీ ప్రకంపనాలకు కూడా ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. ఈ రోజు మాటల రూపంలో ఈ గదిలో చెప్పబడుతున్నది మీ హృదయపూర్వక వాంఛయే.

మనమందరం ఇక్కడ కేవలం ఉపన్యాసం గురించి కలవలేదు, మనం కొత్తశకాన్ని ఒక వేడుకలా జరుపుకోవడానికి కలిసాం. కొన్నిసార్లు కొత్తచైతన్యం యొక్క జాగురుకత చాలా దూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. మీ ప్రపంచంలోనూ మరియు మీ అంతరంలోనూ, సమన్వయాలోపాలు మరియు ఘర్షణలు చాలా అధికంగా ఉన్నప్పటికీ కూడా, కొత్తచైతన్యం యొక్క జాగురుకత ఇప్పటికే మొదలైంది. చైతన్యం యొక్క కొత్తతలం తననుతాను చాలా కాలం సిద్ధం చేసుకున్న తర్వాత, ఇప్పుడు భూమి మీద జన్మించింది, ఇప్పుడు క్రమక్రమంగా ఒక స్థానాన్ని సంపాదించుకుని, భూమి అంతా తన జ్ఞానకాంతి యొక్క తరంగాలను విస్తరింపజేస్తోంది. ప్రస్తుతం మీరందరూ ఈ కొత్తగా మేల్కొంటున్న చైతన్యం యొక్క తరంగంలో భాగంగా ఉంటూ భూమిని హత్తుకుంటున్నారు. చాలా విషయాలలో, మీరే ఈ శక్తి యొక్క తరంగంగా ఉంటున్నారు.

ఆధ్యాత్మిక జాగురుకత ప్రక్రియలో, "ఆధీనం మరియు అదుపు" అనేది వ్యక్తిగతస్థాయిలోనూ మరియు సామూహికస్థాయిలోనూ పెద్దసమస్యగా రూపొందుతున్నది. ప్రపంచంలోని రాజకీయ నాయకులు తరచూ ఈ విషయం దగ్గరే ఘర్షణ పడుతుంటారు. పదవిలో ఉన్న రాజకీయ నాయకులకు హృదయం నుంచి నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. రాజకీయాలు ఇంకా దీనికి సిద్ధంగా లేవు. ప్రస్తుతం భూమి మీద ఉన్న చాలా ముఖ్యమైన సమస్యలకు పరిష్కారం: హృదయం యొక్క జ్ఞానసంపత్తికి ఆధీనమవ్వడమే. ఇదే సమస్యలన్నింటి పరిష్కారానికి ప్రశాంతమైన మార్గం.

వేర్వేరు ప్రాంతాలు, కులాలు, వర్గాలు మరియు సంప్రదాయాలకు

సంబంధించిన మనుష్యుల మధ్య విశ్వవ్యాప్త సంబంధం మరియు ఐకమత్యం ఏర్పడినప్పుడు మాత్రమే ప్రపంచశాంతికి పునాది పడుతుంది. బాహ్యపు పోలికలలో తేడాలున్నప్పటికి, ప్రపంచ జనాభాల మధ్య మనమందరం ఒక్కటే అనే భావన ఏర్పడాలి మరియు ఇది మీ ఆధునిక సమాచార వ్యవస్థ ద్వారా ప్రోత్సహింపబడాలి. ఇది అసాధారణంగా ప్రపంచ దేశాల మధ్య ఉన్న కాలాన్ని మరియు దూరాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో మనుష్యుల మధ్య ఉన్న అవగాహన పెరగకుండా, పాతదనం మరియు మేము-వారు అనే భయపూరిత విబేధాలు అడ్డుకుంటున్నాయి. మేము-వారు, మంచి-చెడు, తప్పు-ఒప్పు అనే దృష్టిలో ఆలోచించడం వలన పాత శత్రుత్వం అధికమవుతూ, ఇది మనోభావ ఉద్రిక్తతకు ఇంధనం అవుతోంది. ఈ రకమైన ఆలోచనారీతిని ఉపయోగించుకుని రాజకీయనాయకులు వారి అధికారాన్ని ఇప్పటికి కాపాడుకుంటున్నారు.

చివరికి రాజకీయస్థాయిలో వాస్తవాన్ని నిర్ణయించేది మీరే. దీని అర్థం రాజకీయాలు అనేవి చాలా మంది వ్యక్తుల యొక్క సామూహిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి అని. స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తుల యొక్క కలవడం ద్వారా ఒక క్రొత్తచైతన్యపు స్థితి ప్రాణం పోసుకుంటుంది. నేను ఇప్పుడు రాజకీయ స్థాయిలను ప్రక్కన పెట్టి, మీ వ్యక్తిగత స్థాయిల గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. మీరు మీ వ్యక్తిగతస్థాయిలో, హృదయం యొక్క శక్తిని మీ జీవితాలలోకి కలపడానికి పనిచేస్తున్న తీరును మరియు ఆధీనం-అదుపు విషయాలతో వ్యవహరిస్తున్న విధానం గురించి నేను మీతో మాట్లాడాలని అనుకుంటున్నాను.

ఇక్కడ మీ అందరి హృదయాల నుంచి బయటకు ప్రవహిస్తున్న మీ ఆధీనం యొక్క శక్తి కలవడాన్ని అనుభూతి చెందమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరందరూ చాలా తీవ్రంగా విముక్తిని కోరుకుంటున్నారు మరియు అది మీ ఆధీనం యొక్క శక్తిలోనే ఇమిడి ఉందని నమ్మండి, దానిని అలాగే ఉండనివ్వండి. కానీ ఈ శక్తిని మీ నిత్యజీవితంలో ఎలా కలుపుకోవాలి అనేది మీకు తెలియడం లేదు.

జీవితంలో అదుపు యొక్క మూలం ఏమిటి? అదుపు అంటే నా ఉద్దేశ్యం: మీ జీవితంపై అధికారాన్ని సాధించాలనే కోరిక వలన మీకు సరైనవి మరియు సమర్ధవంతమైనవి అని అనిపించిన కోరికలకు అనుగుణంగా మీ జీవితాన్ని ప్రవహించమని ఒత్తిడి చేయడమే. మీ జీవితాన్ని ఎందుకు అదుపు చేస్తున్నారు మరియు దీని వలన మీరు నిరంతరం ఒత్తిడులకు మరియు ఆందోళనలకు ఎందుకు

లోనవుతున్నారు? ఈ అదుపుకు గల మూలకారణం భయం. మీ జీవితం యొక్క నిర్మాణంలో అంటే మీ బాల్యం, విద్య మరియు సమాజాలలో భయం అనేది చాలా లోతుగా పాతుకుపోయి ఉంది. అదుపు యొక్క పద్ధతులు ప్రతీ వ్యవస్థలోనూ ఉన్నాయి మరియు ఇవి మీకు మంచి అలవాట్లుగా నేర్పబడుతున్నాయి. మీ జీవితంపై అదుపును సాధించి, దానికి అనుగుణంగా వ్యవహరించాలని అనుకున్నట్లయితే, మీరు నియమ నిబంధనలతో జీవించాల్సి ఉంటుంది.

ఆధీనం మరియు భవిష్యత్తుని అంచనావేయలేకపోవడం అనేవి మీలో భయాందోళలను రేకెత్తిస్తాయి. మీరు ఆధీనం యొక్క శక్తిని – వదిలివేయడంతోనూ, ఏం చెయ్యాలో తెలియకపోవడంతోనూ మరియు మనోభావ ఉద్రిక్తత లేదా క్లిష్టమైన పరిస్థితుల ద్వారా అతిగా ప్రభావితం చేయబడడంతోనూ కలుపుతుంటారు. ఇది కేవలం ఆధీనం యొక్క పరిమితమైన భావన మాత్రమే. ఈ భావన భయం మరియు అహంభావపూరిత చైతన్యం నుంచి ఉద్భవించింది. కాని ఆధీనానికి సంబంధించి ఇంకా గొప్పగా జీవించే క్రొత్తమార్గం ఉంది. ఆ క్రొత్త జీవనశైలిలో మీరు అదుపు, బలవంతం లేదా మార్చడం యొక్క అవసరం ఎంత మాత్రం లేకుండా మీ పట్ల మీరు పూర్తి విశ్వాసంతో జీవించగలరు.

అహంభావం భయపడడం వలన అదుపును తీవ్రంగా కాంక్షిస్తుంది. అహంభావం ఆత్మ నుంచి వచ్చిన ఊహలను కాకుండా, బాహ్యప్రపంచం ద్వారా సంగ్రహించిన విషయాల ద్వారా గుర్తింపబడుతుంది. అహంభావం అన్నది తన సొంత గుర్తింపును కాపాడుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. ఉదాహరణకి అహం ఒక గొప్ప వ్యాపారవేత్త లేదా ఒక మంచి భార్య లేదా ఒక శాస్త్రవేత్తగా ఉండాలని కోరుకుంటుంది. మీ పట్ల ఇతరులకు ఉన్న ఆలోచనలపై అదుపును కలిగి ఉండడం కోసం, అహం తన సొంత గుర్తింపును కాపాడుకోవాలని ప్రయత్నిస్తుంది. అయినప్పటికీ అహం కూడా నిరంతరం చలిస్తూ వైఫల్యానికి మరియు ఓటమికి గురవుతుంది. మీరు అధిక పని ఒత్తిడికి, అనారోగ్యానికి గురైనప్పుడు లేదా బాంధవ్యాలను కోల్పోయినప్పుడు ఇది సంభవించవచ్చు. అహం ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులను చావుదెబ్బగా పరిగణిస్తూ, ఒకానొక స్థితి దగ్గర వీటన్నింటిని వదిలివేయమని మరియు ఆధీనమవ్వమని మిమ్మల్ని ఒత్తిడి చేస్తుంది.

అహం, ఆధీనాన్ని కష్టమైన పరిస్థితులతో కలుపుతుంది. అహం తరచూ అదుపు మరియు కష్టమైన పరిస్థితుల యొక్క నిరంతర మార్పులలో జీవిస్తుంది.

నిజానికి మీ జీవితంలో ఏర్పడుతున్న కష్టాలు, మీ అంతరంలో దాగి ఉన్న రహస్యపు నిధిని చూడడానికి మీకు ఆహ్వానాన్ని అందిస్తాయి. బాధలు లేదా కష్టాలలో ఎల్లప్పుడూ ఒక మంచి విషయం దాగి ఉంటుంది. ఇది మీ హృదయానికి సన్నిహితమయ్యే మార్గాన్ని చూపిస్తుంది. మీరు అహం యొక్క బోధనల ద్వారా జీవిస్తున్నప్పటికి కూడా, ఈ మార్గంలో మీ జీవితం మీ అంతర్జ్ఞానానికి, మీ మేధాసంపత్తికి మరియు మీకు మీరు సన్నిహితమయ్యేలా నిరంతరం ముందుకు పయనిస్తుంది. తరచూ మీ జీవితంలోని పరిస్థితులు, ఇప్పుడు లేదా ఆ తర్వాతనైనా మీ హృదయానికి ఆధీనమవ్వమని మిమ్మల్ని సవాల్ చేస్తుంటాయి. మీకు జీవితం ఎల్లప్పుడూ ఆధీనాన్ని జీవనశైలిగా ఎంపిక చేసుకోమని అవకాశాలను చూపిస్తుంది.

ఇది మీకు తెలుసు. కష్టమైన పరిస్థితుల తర్వాత ఆధీనమయ్యే క్షణాలు ఉంటాయని మీకు తెలుసు. ఇవే మీకు స్పష్టతను, జాగురుకతను అందిస్తాయి. ఈ క్షణాలలో మీరు కంటికి కనిపించని దివ్యత్వపు శ్వాస యొక్క ప్రవాహం ద్వారా నడపబడుతున్నారనే విషయాన్ని అర్థం చేసుకుంటారు. ఈ దివ్యత్వపు జీవిత ప్రవాహం మీకు ఉన్నతమైనవి అందించాలని అనుకుంటోందనే విషయాన్ని మీరు గుర్తిస్తారు మరియు మీరు ఆశించినది మీకు అందకపోయినప్పటికి, దానిని విశ్వసిస్తూ దానిపై ఆధారపడతారు. మీరందరూ కోరుకునేది ఏమిటంటే మీ ఉన్నతమైన చైతన్యంతో శాశ్వతమైన బంధాన్ని ఏర్పరుచుకుని దానికి అనుగుణంగా జీవించాలని; కేవలం ఈ మార్గాన్ని కష్టమైన పరిస్థితులు మరియు లోతైన నిరాశలకు గురయ్యినప్పుడే కాకుండా, ప్రతీరోజు మీ నిత్యజీవితంలో ఆచరించాలని కోరుకుంటున్నారు. మీరందరూ ఆధీనాన్ని జీవనశైలిగా కోరుకుంటున్నారు.

మీరందరూ అలసటకు గురైన యోధులు. మీరు చాలా దూరం ప్రయాణించారు. కొన్నిసార్లు మీ అంతరంలో మీరు చాలా పురాతనమైనవారిగాను మరియు అలసటకు గురైన వారిగాను అనుభూతి చెందుతారు. ఇంకా విపులంగా చెప్పాలంటే మీరు పాతదనం వలన అలసిపోయారు. మీరు సులభమైన మార్గం కోసం అన్వేషిస్తున్నారు. ఈ మార్గం ప్రోత్సాహకరంగాను, మరింత కాంతి ప్రవహించే విధంగాను ఉండాలని కోరుకుంటున్నారు. నిజానికి మీరు గమనించాల్సిన విషయమేమిటంటే: మీ బాధలు మరియు సమస్యలు మిమ్మల్ని ఆధీనమవ్వమని ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే, మీరు బంధాలను, వృత్తిని, ఇతర లక్ష్యాలను వదిలివేస్తున్నారు.

ఒక అడుగు ముందుకు వేసి లేదా ఒక అడుగు వెనుకకు వేసి మీరు నమ్మకం, ఆధీనం మరియు వదిలివేయడం అనే శక్తులతో నిర్దేశింపబడుతున్న జీవనశైలిపై దృష్టిని కేంద్రీకరించండి. ఆధీనమవ్వడమంటే కష్టపడడం కాదు, ప్రతిఘటించటం కాదు. కేవలం మీ జీవితం యొక్క ప్రవాహంతో అనుగుణంగా పయనిస్తూ, మీకు కావలసిన వాటిని ఇది మీకు అందిస్తుందని విశ్వసించడమే. మీ అవసరాలన్నీ గుర్తించబడతాయని మరియు అవి నెరవేరుతాయని నమ్మండి. ప్రస్తుతం మీ జీవితంలో ఉన్న వాటిని అంగీకరిస్తూ వాటితో ఉండండి. ఈ జీవన శైలి గురించే నేను చెప్పాలనుకున్నాను. ఎందుకంటే ఇది మీ లోతైన హృదయ వాంఛ కాబట్టి. ఈ ఆధ్యాత్మిక వాంఛ మీ ఆత్మ నుంచి వచ్చినది, అంటే మీ అంతరంలోని దివ్యత్వపు ప్రవాహం నుంచి వచ్చినది.

ఆధీనమయ్యే మార్గంలో ఉన్న అడ్డులు : ముగ్గురు అవాస్తవ దేవుళ్ళు.

ఒకవైపు మీ ఆత్మ యొక్క ప్రణాళిక ప్రకారం మీకున్న ముసుగులను తీసివేసి జీవించాలనుకుంటున్నారు. మీరు నిజాయితీని, ప్రేమను, ఐకమత్యాన్ని కోరుకుంటున్నారు. వేరొకవైపు ఈ ముసుగులను తీయడం అనేది మీకు చాలా కష్టంగా ఉంటుంది. మీరు నమ్మక వ్యవస్థలను నిర్మించుకుని వాటిలో పెరిగారు. ఇవి మీ మానసికస్థాయిలో చాలా దృఢంగా పాతుకుపోయి ఉన్నాయి ఇవి మిమ్మల్ని మీ ఆత్మతో బంధాన్ని ఏర్పరుచుకోనివ్వకుండా అడ్డుకుంటున్నాయి. ముఖ్యంగా ఇక్కడ మీరు ముగ్గురు మూర్తులు లేక అవాస్తవమైన దేవుళ్ళ ద్వారా మార్గదర్శకత్వాన్ని పొందాలని కోరుకుంటున్నారు. కాని అవి మిమ్మల్ని మీ కేంద్రం నుంచి బయటకు వచ్చేలా చేస్తాయి మరియు నిజానికి మీరు ఎవరనే దానికి ఆధీనమై జీవించడానికి అవసరమైన సమన్వయాన్ని కోల్పోయేలా చేస్తాయి.

**మొదటిమూర్తి: మీ మీద అధికారాన్ని చూపించే దేవుడు**

మొదటి అవాస్తవమైన దేవుడు: దైవమే. అతడే దైవమని, సృష్టికి గురువు అని భావించడమే. మీ సంస్కృతిని ప్రభావితం చేసే ఈ విధమైన దేవుడిని, అతని యొక్క రూపాన్ని మానవుడే సృష్టించాడు. మీలో చాలామంది దేవుడి యొక్క సాంప్రదాయకరమైన ఊహలను వదిలివేయాలని అనుకుంటారు. మీరు ఇది తప్పు – ఇది ఒప్పు అని నిర్ణయించే దేవుడిని, శిక్షించే దేవుడిని, మీ పై అధికారాన్ని

చూపించే దేవుడిని మరియు ఒక స్కూలు మాస్టర్‌లా గెలుపు – ఓటమిల పట్టికను తయారు చేసే దేవుడిని నమ్మబోమని చెబుతారు. మీరు ప్రేమకు ప్రతిరూపంగా ఉన్న దేవుడినే విశ్వసిస్తామని చెబుతుంటారు. ఎందుకంటే అతను మిమ్మల్ని ఎల్లప్పుడూ క్షమిస్తాడని, ఆహ్లాదపరుస్తాడని మరియు ప్రోత్సహిస్తాడని విశ్వసిస్తారు. అందువలనే అతనిని మేము నమ్ముతామని మీరు చెబుతారు. కాని ఈ విధంగా స్థిరమైన మరియు ప్రేమలేని పద్ధతిలో మీతో మీరు వ్యవహరించడం వలన, ఆ పాత దైవాన్నే ఇంకా సజీవంగా ఉంచుతున్నారు! మీరు ఓడిపోయారని, సరిగ్గాలేరని భావిస్తుంటారు. మీకు మీరు తరచూ బాంధవ్యాలు, ఉద్యోగం లేక ఆధ్యాత్మికతలో ఇంకా పైకి ఎదగలేదని చెప్పుకుంటారు. మిమ్మల్ని మీరు ఈ విధమైన ఆలోచనలతో బాధ పెట్టుకుంటున్నారు: నేను దైవం అంచనాలకు అనుగుణంగా జీవించడం లేదు, నేను నా స్పిరిచువల్ గైడ్స్‌ను లేక నా ప్రజ్ఞాత్మను నిరాశ పరుస్తున్నాను, నేను నా లక్ష్యాన్ని చేరుకోవడంలో ఓడిపోయాను, నేను ఈ ప్రపంచానికి విలువైన సహకారాన్ని ఏమీ అందించలేకపోయాను.

మీలో చాలామంది ఏదో ఒక శక్తి ఉందని మరియు అది చెప్పింది తప్పక పాటించాలని గోప్యంగా నమ్ముతుంటారు. ఆత్మలక్ష్యం లేదా జీవితమార్గం మీ కోసం ఏర్పడి ఉందని, ఆధ్యాత్మిక వంశపారంపర్యంగా మీరు ఒక కర్తవ్యాన్ని కలిగిఉన్నారని, లేక ఒక ఆధ్యాత్మిక గురువు మీరు ఏం చెయ్యాలి లేదా ఎక్కడకి వెళ్ళాలనేది చెప్తాడని...., ఇలాంటి విషయాలన్నింటిలోనూ ఒక ఉన్నత ఆధిపత్యం యొక్క ఉనికి ఉందని, మీపై ఒక ఆధ్యాత్మికశక్తి ఉందని, దానిని మీరు వింటే మంచిదని బలంగా నమ్ముతున్నారు. మీకు బాహ్యంగా ఉన్న దేవుడు మీరు జీవితంలో ఏం చెయ్యాలనే దానికి మార్గదర్శకత్వం చూపిస్తాడని నమ్మినంతవరకూ, మీరు సాంప్రదాయక సిద్ధమైన దేవుడితో మళ్ళీ ఉన్నట్టే. ఈ ఊహ మీకు పరిస్థితులన్నీ స్థిరంగాను మరియు నిర్ణయించబడి ఉంటాయని, ఇదే నిజమని తెలుపుతుంది. ఇక్కడ మీరు చేయగలిగినది ఏమిటంటే, వీటికి అనుగుణంగా లేక వ్యతిరేకంగా జీవించాలి. ఇది ఒక అవాస్తవమైన ఊహ.

నిజానికి మీరు జన్మిస్తున్నప్పుడు మీ ఆత్మ ఈ జన్మకు కొన్ని వాంఛలను పెట్టుకుని వస్తుంది. కొందరు దీనినే ఈ జన్మ యొక్క మీ ఉన్నత ఆశయమని చెప్పవచ్చు. కాని ఇది మీకు బయట నుంచి ఆదేశించబడినది కాదు. ఇది మీకు మీరుగా ఎంపిక చేసుకున్నది. ఇది మీ వాంఛలు మరియు కోరికల నుండి ఉద్భవించినది. మీ జీవితంలోని సంఘటనలు ముందుగా ఉద్దేశింపబడినవి – అంటే ఇవి తప్పకుండా జరగాలని కోరుకున్నవి. కానీ ఇవి ఏవి కూడా పూర్తి స్థిరత్వాన్ని

కలిగి ఉండవు. మీ జీవితంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని మీరే సృష్టిస్తున్నారు మరియు వీటిని మీరే ఎంపిక చేసుకుంటున్నారు.

మీ అనుభూతులను, మీ ఆత్మ యొక్క పిలుపును మరియు మీ లోతైన వాంఛలను వినడం ద్వారా, మీ జీవితాశయంతో లేదా మీ ఉన్నత ఉత్తేజంతో బంధాన్ని ఎప్పుడైనా ఏర్పరుచుకోగలరు. దయచేసి నేను మీకు ఇచ్చే సలహా ఏమిటంటే: ఎలా జీవించాలి అనే విషయాన్ని అతిగా ప్రస్తావించే ఆధ్యాత్మిక సిద్ధాంతాలను వినకండి. ముఖ్యంగా మీ యొక్క క్రిందిభాగం యొక్క పిలుపును వినండి: మీ నిత్యజీవితంలో వ్యక్తీకరింపబడుతున్న తీవ్రమైన మనోభావాలను వినండి. ఈ మనోభావాల ద్వారా, మీ ఆత్మ మీకు చేరువవ్వాలని మరియు మీకు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తుంది.

ప్రస్తుతం మీ ఆత్మ మీకు ఏం చెప్పాలనుకుంటున్న దానిని తెలుసుకోవాలనుకుంటే, మీ జీవితంలో తరచూ సంభవిస్తూ, మిమ్మల్ని దానిలో పూర్తిగా నిమగ్నమయ్యేటట్టు చేస్తున్న మనోభావాలను గమనించి చూడండి. వీటిని దయతోనూ మరియు నిజాయితీగానూ చూడండి. మీ మనోభావాలకు కారణాన్ని వేరే వారిపై మోపకండి. మీరు బయటి కారణాలను వెతకడంలో ఆసక్తిని చూపవద్దు. వీటిని మీ ఎంపికల యొక్క ఫలితాలుగా చూడండి.

ఉదాహరణకి మీకు అకస్మాత్తుగా కోపం లేదా ఆగ్రహం కలిగినట్లయితే, అది ఎక్కడి నుంచి వస్తోంది? అక్కడ మీరు ఏదైనా కోల్పోతున్నారా? ఆ కోపం మీకు ఏం చెప్తోంది? ఆ కోపంలో రహస్యంగా దాగి ఉన్న సందేశం ఏమిటి? దీని అర్థం ఇతరులచే గుర్తించబడలేదనా లేదా గౌరవం పొందలేదనా? ఇతరులకి మీరెవరో చూపించడానికి భయపడుతున్నారా మరియు మీరు మీ వాస్తవంపై నిలబడడానికి భయపడుతున్నారా? మీ నిజమైన అనుభూతులను తరచూ దాస్తున్నారా మరియు మీ హద్దులను స్పష్టంగా వ్యక్తపరచడానికి మీకు కష్టంగా ఉందా? తరచూ మీ కోపం ద్వారా ఒక వాస్తవ సందేశం మీకు గట్టిగా చెప్పబడుతోంది: అదేమిటంటే మీరు ఎవరనేది తెలుసుకోవాలని, మీ నిజమైన ఆత్మశక్తిని ఈ ప్రపంచానికి చూపించాలనే వాంఛకు సంబంధించినది. మీ ఆత్మ యొక్క వాంఛను కోపం ద్వారా గుర్తించినట్లయితే, మీరు మీ అంతర్ శిశువు ద్వారా మీ దివ్యత్వం ప్రకాశించడాన్ని చూస్తారు.

మీ అంతరంలో ఉన్న దైవత్వమే మీ “ప్రజ్ఞాత్మ”. ఇది మీ భౌతిక వాస్తవంతో కలవాలని, భూమి యొక్క వాస్తవంపై తన కాంతిని ప్రకాశింపజేయాలని కోరుకుంటోంది. ఇది “తెలిసిన భాగం.” ఇది జ్ఞానానికి సంబంధించిన భాగం.

మీ అంతర్‌శిశువు జీవితం యొక్క ఆసక్తిగా ఉంటుంది: ఇది ఒక కోరిక, మనోభావం మరియు సృజనాత్మకత. ఇది "అనుభవాన్ని పొందే భాగం".

మీలోని శిశువు యొక్క భాగం మీ యొక్క "జీవాత్మ". ఇది మీ అంతరంలోని దివ్యత్వంతో కలిసి సమన్వయంలో జీవించినప్పుడు, ఇది మీ ఆనందానికి మరియు సృజనాత్మకతకు మూలస్థానంగా ఉంటుంది. కాని ఇది దివ్యత్వపు లాలింపు నుంచి విడిపోయి ఒంటరిగా పయనిస్తున్నట్లయితే, ఇది క్రూరమైన మనోభావాలకు కారణమవుతుంది. అప్పుడు మీ కోపం, ద్వేషంగాను మరియు పగగాను మారుతుంది. భయం క్రమక్రమంగా ఆందోళనగాను, ఆవేదనగాను, అభద్రతాభావంగాను రూపాంతరం చెందుతుంది. బాధ క్రమక్రమంగా చిరాకుగాను మరియు డిప్రెషన్‌గాను మారుతుంది. ఈ మూల మనోభావాలు మీకు సంకేతాలుగా ఉంటాయి. ఇవి అనుభవాన్ని పొందే భాగం నుంచి, అంటే మీ అంతర్‌శిశువు నుంచి మీకు సందేశాలను ఇస్తాయి. ఈ మనోభావాల ద్వారా శిశువు, మీ లోపల ఉన్న దివ్యత్వానికి చేతులను చాపుతూ దగ్గరవుతుంది. ఈ మనోభావాలు స్వచ్ఛమైన, తెలియని అనుభవాన్ని వ్యక్తపరుస్తాయి. ఇవి తప్పుగా అర్థంచేసుకున్న వాటి యొక్క భావప్రకటనలుగా ఉంటాయి. ఈ శిశువు దివ్యత్వంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం వలన, ఈ మనోభావాలను సంకేతాలుగా గుర్తించబడుతూ అర్థం చేసుకోబడతాయి.

ఈ మనోభావాలు, పరివర్తనకు మరియు అన్వేషణకు ఆయుధాలుగా తయారవుతాయి: జీవాత్మ మెరుగుపడుతూ ప్రజ్ఞాత్మను సంతృప్తి పరుస్తుంది, ఎందుకంటే తెలిసిన భాగం తనకు కావలసిన జ్ఞానాన్ని అందించినందుకు ఇది ప్రజ్ఞాత్మను సంతృప్తి పరుస్తుంది. అంతర్‌శిశువుని జ్ఞానవంతం చెయ్యడానికి మీ ప్రజ్ఞాత్మను అనుమతించినట్లయితే, ఆమె మీ జీవితంలోకి ప్రవేశిస్తూ మరియు లోతైన ఆనందాన్ని అనుభవిస్తుంది. ఈ విధంగా మీ ప్రజ్ఞాత్మను ప్రకాశింపజేసినట్లయితే, మీ మనోభావ శరీరం నిశ్శబ్దమై సమన్వయాన్ని పొందుతుంది. దివ్యత్వం మరియు అంతర్‌శిశువు కలిసి ప్రవహించడం వలన సృజనాత్మకతను, అంతర్జ్ఞానాన్ని ఫలంగా పొందుతాయి. దీని వలన మీ జీవితం కాంతితో నింపుబడుతూ సులభంగా ప్రవహిస్తుంది.

మీ అంతరంలో ఉన్న పైస్థాయి మరియు క్రిందిస్థాయి అంటే, ప్రజ్ఞాత్మ మరియు జీవాత్మ అనేవి జీవసంబంధమైన, అర్ధవంతమైన సంపూర్ణత్వానికి సంబంధించినవి. అందువలన పైస్థాయి మరియు క్రిందిస్థాయి వేర్వేరు అనే భావనలు నిజానికి సరియైనవి కావు. తెలుసుకోవడం మరియు అనుభవాన్ని పొందడం అనేవి

కలిసి ఒక ఆహ్లాదకరమైన ఆటను ఆడతాయి. ఈ పరస్పర చర్య వలన నిజమైన జ్ఞానం రూపాన్ని పొందుతుంది.

వర్తమానంలో మీ జీవితానికి సంబంధించిన గైడెన్స్‌ను పొందాలనుకుంటే, మీ అంతర్‌శిశువును ఉన్నతంగా గుర్తించాలి. దీనికి కావలసిన శ్రద్ధను ఇవ్వడం ద్వారా, మీ ఉన్నతచైతన్యం యొక్క జల్లులను దీనిపై  కురింపించగలరు, అంటే మీ ప్రజ్ఞాత్మ యొక్క స్పర్శతో. దీనిని ఉదాహరణతో వివరించి చెప్పాలంటే, నేను పైన చెప్పిన కోపం మరియు ఆగ్రహానికి సంబంధించిన ఉదాహరణ దగ్గరకు తిరిగి వెళదాం. మీరు ఈ మనోభావంతో బంధాన్ని ఏర్పరుచుకుని, ఒక శిశువులా దానిని గమనిస్తూ, ఆ శిశువును మీ దగ్గరకు రమ్మని ఆహ్వానించండి. అది దేని గురించి బాధపడుతోందో మీరు అడగండి. దానిని నయం చేసుకోవడానికి మీ నుంచి దానికి ఏమి కావాలో అడగండి. ఆ శిశువును మీకు సమాధానం చెప్పనివ్వండి మరియు తననుతాను స్పష్టంగా వ్యక్తపరుచుకోవడానికి అనుమతించండి. అది మీ ఎదురుగా నిలబడి స్పష్టమైన శరీరభాషతోను మరియు మొహం మీద ప్రత్యేకమైన భావప్రకటనలతోను మీతో మాట్లాడుతున్నట్లు ఊహించుకోండి. బహుశా అది మీకు ఖచ్చితమైన సమాధానాలను ఇవ్వవచ్చు: “నేను ఈ ఉద్యోగం నుంచి బయటకు రావాలని అనుకుంటున్నాను!” లేదా “నేను డాన్స్ నేర్చుకోవాలని అనుకుంటున్నాను” లేదా అది ఈ విధమైన సాధారణమైన సమాధానాలను కూడా చెప్పవచ్చు. “నేను ఆడుకోవాలనుకుంటున్నాను మరియు మరింత విశ్రాంతిని తీసుకోవాలనుకుంటున్నాను” లేదా “నేను అన్ని సమయాలలో మంచిగా ఉండలేను, నీకు తెలుసా!” ఆ సమాధానాలను అతిముఖ్యమైనవిగా స్వీకరించి సాధ్యమైనంతవరకూ దానికి అనుగుణంగా జీవించండి. మీ అంతర్‌శిశువు కోరికలకు అనుగుణంగా వెంటనే మీరు చేయలేకపోవచ్చు. కాని మీరు చిన్నగా మొదలుపెట్టి క్రమక్రమంగా మీ వాంఛలను గుర్తించడం ఆరంభించండి.

మీ అంతర్‌శిశువులైన కోపం, చిరాకు లేదా బాధ మొదలైన వాటిని, మీరు ప్రేమ మరియు అంగీకారంతో కౌగిలించుకుంటే, అవి మీ అంతరంలోని ప్రజ్ఞాత్మ ద్వారా స్పృశించబడతాయి. దానికి ప్రతిఫలంగా మీ ఆత్మ మీతో మాట్లాడుతుంది. మనోభావాలతో మొదలుపెట్టి, వీటి వెనుకనున్న నిజమైన వాంఛను కనుగొని మరియు ఆ వాంఛలను నెరవేర్చుకునే మార్గాన్ని క్రమక్రమంగా అన్వేషించండి.

ఈ ఊహలో మీరు, మీ అంతరంలోని దివ్యత్వాన్ని మరియు అంతర్‌శిశువును కలిపినట్లయితే, ఆధిపత్యాన్ని చూపే దేవుడి రూపానికి మీలో స్థానం ఉండదు.

స్వేచ్ఛతో క్రమక్రమంగా పరిణామం చెందుతున్న ప్రోత్సాహకరమైన బంధంలో జీవాత్మ మరియు పరమాత్మ ఒకదానినొకటి ప్రశంసించుకుంటాయి. అప్పుడు ప్రజ్ఞాత్మ, జీవాత్మకు ఏమి చెయ్యాలో ఖచ్చితంగా చెప్పనక్కర్లేదు లేదా జీవాత్మ, ప్రజ్ఞాత్మపై ఆధిపత్యాన్ని కలిగి ఉండనక్కర్లేదు. వారిద్దరి మధ్యనున్న పరస్పర అవగాహన ద్వారా, మీకు ఏది సరైనదో వర్తమానంలో నిర్ణయించుకోగలరు.

ప్రజ్ఞాత్మ మరియు జీవాత్మ మధ్యనున్న అతిసన్నిహితమైన సంబంధం ద్వారా మీ జీవిత లక్ష్యాలను కనుగొంటారు. ఈ సంబంధం వలన, నిజానికి మిమ్మల్ని నడిపిస్తున్నది ఏమిటో తెలుసుకోగలరు. బాహ్యంగా ఎవరూ కూడా ఈ బంధాన్ని భర్తీ చేయలేరు లేదా మీకోసం ఎవరూ ఈ బంధాన్ని ఏర్పర్చలేరు. గురువు మీ అంతరంలోని పవిత్రస్థలానికి మార్గాన్ని మాత్రమే చూపించగలడు. అక్కడ మీ ప్రజ్ఞాత్మ ద్వారా మీ అంతర్‌శిశువు ఆనందాన్ని మరియు ప్రోత్సాహాన్ని పొందడానికి మీరు అనుమతించగలరు. ఈ స్థలంలో మీరు ఎవరనే దానిని మరియు మీ ఆశయం ఏమిటనే దానిని కనుగొంటారు.

ఆధ్యాత్మిక జీవితం ఎలా జీవించాలో చూపించే సాధారణ సూత్రాలు ఎల్లప్పుడూ అసంతృప్తికరంగా ఉంటాయి, లేదా కనీసం సృష్టికి ఉపయోగపడే విధంగా కూడా ఉండవు. 'వాస్తవం'కు ఆకృతి లేదు. ప్రతి జీవి తన సొంత రూపాన్ని కలిగి ఉంటూ, ఆ 'వాస్తవం'లో తనకు నచ్చిన విధంగా జీవిస్తాడు. ఇదే సాటిలేని మీ ఆత్మ సారాంశం యొక్క అద్భుతం. నిజమైన ఆధ్యాత్మిక గురువులు ఇది చేయమని, ఇది చేయవద్దని చెప్పరు. ఉదాహరణకు "మాంసం తినవద్దు" అని లేదా రోజుకు రెండుగంటలు ధ్యానం చెయ్యాలి అని బోధించరు. నిజమైన గురువుకు తెలుసు: మీతో మీరు లోతైన బంధాన్ని కలిగి ఉంటూ, మీ సొంత వాస్తవాన్ని మీరే కనుగొనాలి అనే విషయం. గురువు, శిష్యులకు వారి మార్గంలో ఏది సహాయం చేస్తుందో, దానిని సూచించవచ్చు. కాని గురువులు దానిని ఒక నియమంగానో లేదా సిద్ధాంతంగానో మార్చనక్కర్లేదు.

దైవం గురించి మీ మతసంప్రదాయాలు బోధిస్తున్న విధానాలను గమనిస్తే అక్కడ కూడా ఇదే సంభవిస్తోంది. వీటిలో చాలా వరకూ భయం మరియు అధికార దౌర్జన్యాలకు సాంప్రదాయాలుగా ఉంటున్నాయి. స్పష్టమైన నియమాలు, సిద్ధాంతాలు మరియు వంశపారంపర్య ఆధ్యాత్మిక సంస్థల యొక్క అవసరం ఉందని తెలిపేవి ఎల్లప్పుడూ భయం మరియు అధికారాల పై ఆధారపడుతుంటాయి. ఇదే క్రొత్తయుగం

యొక్క ఆధ్యాత్మిక విషయంలో కూడా సంభవిస్తోంది. ఉదాహరణకి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న చాలా అపోహలు, అంచనాలు మరియు అభూతకల్పనలు: మీ ప్రాథమికమైన అనుభూతులను సంప్రదించకుండా మీరు వీటితో పయనించినట్లయితే, మీరు అభద్రతా భావాన్ని మరియు ఆశ్చర్యాన్ని పొందుతూ "నేను మంచిగానే పని చేస్తున్నానా", "నేను 2012లో పడవను(లేదా స్పేస్‌క్రాఫ్ట్) అందుకోలేకపోతే ఏం జరుగుతుంది?", లేదా "నా చక్రాలు ఐదవ తలంలోకి ప్రవేశించేందుకు తగిన విధంగా ఉన్నాయా?" నిజానికి ఈ విధమైన ప్రశ్నలు మీ అంతర్ ఎదుగుదలకు సహాయం చేయవు. మీ అంతరంలోకి వెళ్ళమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. గ్రహాలు మరియు నక్షత్రాల యొక్క కదలికలపై, వాతావరణ పరిస్థితులపై దృష్టి పెట్టవద్దు. లేదా ఆధ్యాత్మిక గురువు యొక్క నిర్ణయం ఆధారంగా మీ వ్యక్తిగత అవగాహనా స్థాయిని నిర్ణయించవద్దు. మీ సొంత విశ్వానికి కేంద్రం మీరే. మీ ప్రపంచం యొక్క ఖచ్చితమైన గీటురాయి కూడా మీరే. మీ గురించి బాగా తెలిసిన దైవం గాని లేదా మీకు సంబంధించిన విషయాలను వివరించ గల దైవం గాని మీకు బాహ్యంగా ఎక్కడా లేదు. ఇంతవరకూ మీరు బాహ్యంగా ఊహించుకున్న దైవం మీ అంతరంలో నివసించడం లేదు. ఈ దైవానికి కూడా పూర్తిగా ఏమి తెలియదు. మీలోనూ మరియు సృష్టంతటిలోనూ ఉన్న దివ్యత్వం అనేది ఒక ఆహ్లాదకరమైన శక్తి. ఇది ఎల్లప్పుడూ అంగీకార వైఖరితోనూ మరియు ఊహించలేని మార్గాల ద్వారా ఎదుగుతూ, క్రమక్రమంగా పరిణామం చెందుతుంది.

ఈ రకమైన ఊహలో, జీవాత్మ ఉనికికి ఖచ్చితమైన కారణం ఉంది: ఇది ఎదుగుదలకు మరియు సంపూర్ణత్వానికి ఒక ఇంధనం లాంటిది. చీకటి మరియు వెలుగు అవి పోషించడానికి వాటి వాటి సొంత పాత్రలను కలిగి ఉన్నాయి. ఆ రెండింటిని అంగీకరించడం ద్వారా మీరు జ్ఞానాన్ని పొందుతారు. కొన్ని ఆధ్యాత్మిక సంస్థలు కాంక్షించిన విధంగా, జ్ఞానం అనే ఒక్క మార్గం వైపే పయనిస్తూ, అజ్ఞానంతో ఘర్షణపడుతూ దానిని వదిలివేయడం వలన భూమి మీద జీవితంలో సమన్వయాలోపాలు మరియు సున్నితమైన ప్రతిఘటనలు సృష్టింపబడుతున్నాయి.

తప్పులు చేయడం, పొరపాట్లు చేయడం అనేవి సహజమైన విషయాలు. వీటిని తప్పించుకోవాలని ప్రయత్నించకుండా, వీటిని అర్థం చేసుకోగలిగితే ఇవి మీకు గొప్ప ఎదుగుదలను అందించగలవు. చెడు విషయాలలో, కాంతి యొక్క బీజం కదలిక లేకుండా అచేతనంగా ఉంటుంది. అంతరంలో చెడు విషయం యొక్క అనుభవాన్ని అర్థం చేసుకున్నప్పుడే, మీరు మంచిని అందంగాను, స్వచ్ఛంగాను మరియు

నిజంగాను అనుభూతి చెందగలరు. మీరు బాహ్యంగా ఈ విషయాలను నేర్చుకోలేరు. మీ అంతరంలోని దైవం తన శక్తిని తగ్గించుకుని భౌతికవాస్తవంలోకి వచ్చిన కారణం ఏమిటంటే, జ్ఞానం ద్వారా అనుభవాన్ని పొందడం కాకుండా, తన అనుభవం ద్వారా జ్ఞానాన్ని పొందాలనే ఉద్దేశ్యంతో. ఈ విధంగా ఆలోచిస్తే చాలా విషయాలు ఆధ్యాత్మికతకు సంబంధించినవే. అనుభవాలన్నీ కూడా పవిత్రమైనవి మరియు అర్ధవంతమైనవి. మీకు ఏది సరైనది, ఏది ఆరోగ్యకరమైనది మరియు మీరు ఆధ్యాత్మికపరంగా ఏది పాటించాలి అని బోధించే బాహ్యపు నియమాల ద్వారా మిమ్మల్ని మీరు గైడ్ చేసుకోవడానికి ప్రయత్నించవద్దు. మీ హృదయమే మీకు గీటురాయి: మీరు ఏ విషయాన్నైనా సరైనది అని అనుభూతి చెందినట్లయితే, దానిని చేయడానికి ప్రయత్నించండి. మిగతా విషయాలన్నింటిని వదిలి వేయండి.

**రెండవ మూర్తి : సమాజం యొక్క పద్ధతులు మరియు ఆదర్శాలు**

మీ సొంత ఆత్మశక్తి నుంచి మిమ్మల్ని దూరం చేసే మరొక అవాస్తవమైన దేవుడు 'సమాజం': సమాజం యొక్క ఆదర్శాలు మరియు విలువలు, మీ సామాజిక ప్రపంచాన్ని అదుపు చేస్తాయి. దీని వలన మీ బాల్యం, విద్య మరియు ఉద్యోగ వాతావరణాలు కూడా ప్రభావితం చెందుతాయి. సమాజం యొక్క ఆదర్శాలు భయంలోనూ, అదుపు అవసరం అనే భావనలోనూ, క్రమబద్ధమైన జీవితంలోనూ పాతుకుపోయి ఉంటాయి. అందువలన ఇవి చక్కని క్రీడాస్థలంగా తయారవుతున్నాయి. ప్రవర్తనకు సంబంధించిన ఆదర్శాలు, మానవులు నిజంగా అనుభూతి చెందాలని మరియు అనుభవించాలని కోరుకుంటున్న వాటిని ఎంత మాత్రం ఇవ్వలేవు. ఎందుకంటే ఇవి కేవలం బాహ్యంగా ఎలా ఉండాలో తెలియజేస్తాయి కాబట్టి.

ప్రవర్తన యొక్క బాహ్యపు ఆదర్శాలకు అనుగుణంగా జీవించడానికి ప్రయత్నిస్తే, అవి మీపై అధిక ఒత్తిడిని తీసుకురాగలవు. మీరు భయాన్ని ఆధారంగా చేసుకుని ఉన్న ఈ క్రింది విషయాల గురించి ఒకసారి ఆలోచించండి. మంచిశరీరం లేదని, లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నానని, అందం లేదని మరియు సరైన బాంధవ్యాలు లేవని మొదలైనవి. అవాస్తవపు ఊహలకు సంబంధించిన గెలుపు మరియు ఆనందాలతో మిమ్మల్ని మీరు పోల్చుకోవడం వలన, మీ సృజనాత్మక శక్తి స్థంబించి పోతుంది మరియు ఈ ప్రపంచంలో ఎప్పటికి మీ ఇంటిలో ఉన్నారనే అనుభూతిని పొందలేరు.

ఏవి చెయ్యాలి, ఏవి చెయ్యకూడదు అనేవి మీ రెండవచర్మంగా ఏర్పడినాయి.

దీని కారణంగా మీరు నిజమైన సృజనాత్మకతను అన్వేషించడానికి సాహసించ లేకపోతున్నారు. మీరు తెలిసిన మార్గాన్ని అధిగమించి ముందుకు వెళ్ళడానికి భయపడుతున్నారు. కాని మీ ఆత్మశక్తి, మీ ద్వారా ప్రత్యేకమైన మార్గంలో ప్రవహించాలని కోరుకుంటోంది, దీని కోసమే ఇది భూమి మీదకి గొప్పగా స్వాగతించబడింది! ప్రస్తుతం భూమి మీద, చైతన్యం యొక్క పరివర్తనలను తీసుకురావడంలో మీ ఆత్మశక్తి భాగంగా ఉంటోంది.

మీ సృజనాత్మక భావనలతో బంధాన్ని ఏర్పరుచుకుంటూ మరియు వాటిని మీ సొంతమార్గాలలో తెలియజేసినప్పుడు, మీరు సమాజం యొక్క లక్ష్యాలు మరియు ఆదర్శాల నుంచి విడిపోగలరు. సహజమైన లయబద్ధతతో మిమ్మల్ని మీరు అన్వేషించుకోవడం మరియు మీరెవరనే దానిని భౌతికస్థాయిలో వ్యక్తపరచడం అనేవి సమాజం యొక్క ప్రణాళికకు అనుగుణంగా ఉండదు. అంటే ఇది జీవితంలో లక్ష్యాలను ఎలా మరియు ఎప్పుడు సాధించాలనే ప్రణాళికకు పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది.

బాహ్యంగా ఏదో సాధించాలని కాకుండా, మొదటిగా మీ గురించి మీరు లోతుగా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ సుదీర్ఘ ప్రక్రియలోకి ప్రయాణించవచ్చు. మీరు అంతరంగా చాలా కష్టపడి పనిచేస్తూ మీకు సంబంధించిన చాలా విలువైన విషయాలను పరిశోధించినప్పటికి కూడా, అవి ఇతరులకు ఫలితంలేనివిగాను, విలువలేనివిగాను అనిపించవచ్చు. మీరు ఎవరనేది, మీ సహజశక్తి మిమ్మల్ని ఎక్కడకి నడిపిస్తోందో తెలుసుకోవడానికి మరియు వాటిని మీ మనోభావాలతో మరియు భౌతికశరీరంతో కలపడానికి మీ సమయాన్ని వినియోగించండి. బాహ్యపు విజయాలపై ఆసక్తిని చూపవద్దు. మీకు ఏది సరైనది అనిపిస్తోందో మరియు మీకు ఏది ఉ త్సాహాన్ని మరియు ప్రశాంతతను అందిస్తోందో దాని పై దృష్టిని పెట్టండి. మీరు ఈ విధమైన జీవనశైలిని కనుగొన్నట్లయితే, మీ అంతరంలో ప్రశాంతతను మరియు నిశ్శబ్దాన్ని అనుభూతి చెందుతూ, చాలా సులభంగా మీ ఆత్మశక్తితో బంధాన్ని ఏర్పరుచుకోగలరు.

సమాజం బోధిస్తున్న విషయాల పట్ల మరియు అది వారి నుంచి ఆశిస్తున్న వాటి పట్ల మనుష్యులలో చాలా భయాలు ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే సమాజానికి సరైన ఉనికి లేనే లేదు. ప్రతి ఒక్కరూ సొంత కోరికలను మరియు లోతైన భయాలను కలిగిఉన్నారు. దీనిని విపులంగా చెప్పాలంటే, ఇతరులు వీరి గురించి ఏమనుకుంటారో అనే భయం లేకుండా, వారితో వారు స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇతరులు మీ గురించి ఏమనుకుంటున్నారు అనే

విషయంపై అతిగా ఆసక్తిని చూపిస్తుంటే, ఒకసారి దాని గురించి మళ్ళీ ఆలోచించండి. మీరు ఇతరుల యొక్క పద్ధతులకు అనుగుణంగా నడవడం మరియు వారి నిర్ణయాలకు భయపడడం వలన, నిజానికి మీరు వారి యొక్క ప్రధాన శత్రువులుగా తయారవుతారు. మీరు అవాస్తవపు ఆదర్శాలను సజీవంగా ఉంచినట్లయితే, అవి మీ ఇరువురికి బలంగా ఊపిరాడకుండా చేస్తాయి. మీరు వేరే వారికి "సమాజం"గా మారుతారు.

మీరు కొత్తశకం యొక్క ప్రధాన అన్వేషకులు. ముఖ్యంగా మీరు భయాన్ని పట్టుకుని వ్రేళ్ళాడుతున్న మనుష్యులకు ఒక ఉదాహరణగా నిలుస్తారు. మీపై మీరు ఆధారపడుతూ, మీ అనుభూతులను అతిసన్నిహితంగా వింటూ, వాటికి అనుగుణంగా జీవిస్తూ, బాహ్యపు నిర్ణయాలను వదిలివేసినట్లయితే, మీరు ఇతరులకు ఆదర్శంగా ఉంటారు. ఈ బాహ్యపు నిర్ణయాలు ప్రేమ నుంచి జన్మించినవి కాదు, భయం నుంచి జన్మించినవి. ఇవి పాతపద్ధతులు మరియు సూచనలపై ఆధారపడి ఉన్నాయి. వీటి యొక్క నిజమైన మూలమేదో ఎవరికి గుర్తులేదు. ఈ పాత ఆదర్శాలు పరివర్తనం చెందాలని కోరుకుంటున్నాయి. అంతరం నుంచి వీటిని పరివర్తనం చెందిస్తూ, కొత్తదనంలోకి ప్రవేశింప చేయగల సాహసోపేతమైన మనుష్యుల కోసం ఎదురు చూస్తున్నాయి. మీ కోసం సమాజం ఎదురుచూస్తోంది. మనుష్యులు వారి యొక్క హృదయాలతోనూ మరియు వారి నిజమైన కోరికలతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి సహాయం చేసే ప్రోత్సాహకరమైన ఆదర్శవంతుల మరియు ఆదర్శాల కోసం ఎదురు చూస్తున్నారు. మీరు భయం యొక్క అనుచరుడిగా కాకుండా, ప్రేమ యొక్క ప్రతిరూపంగా ఉండడం ద్వారా, మీరు సామూహిక చైతన్యం యొక్క పరివర్తనకు సహకరించగలరు.

మీ అంతర్‌శిశువును ధైర్యంగా ఆహ్లాదకరమైన ఆటలోకి స్వాగతించడానికి సాహసించండి. తరచూ మీ అంతర్‌శిశువుతో బంధాన్ని కలిగి ఉండండి. తనకు ఏది కావాలో తనకి బాగా తెలుసు. నిజానికి మీ హృదయం కోరుకుంటున్న దానిని గుర్తించడానికి మీరు తరచూ కష్టపడగలరు మరియు మీ ఆశయాన్ని కోల్పోతున్నట్టు అనుభూతి చెందుతారు. ఎందుకంటే మీ అంతర్‌శిశువును స్వేచ్ఛగా ఆడుకోనివ్వడానికి, ఊహించనివ్వడానికి మరియు కలలను కనడానికి అనుమతించడం లేదు కాబట్టి. మిమ్మల్ని మీరు బాహ్యపు ఆదర్శాలతో (వయసు, లింగబేధం, ఆస్తులు) పోల్చుకోవడం వలన , మిమ్మల్ని మీరు పరిమితం చేసుకుంటూ, మీ అంతర్ శిశువును, మీ కలలు కనే తత్వాన్ని మరియు దూరదృష్టిని అనుమతించ లేరు. ఈ హద్దుల నుంచి బయటకు వచ్చి మీ అంతర్ ఆదర్శాలతో బంధాన్ని ఏర్పరుచుకోండి.

మీరందరూ ఒక ఉత్తేజంతో, కోరికతో భూమి మీద జన్మించారు. ఈ కోరికను

లేదా ఉత్తేజాన్ని మీకోసం మరియు ఇతరుల కోసం ('సమాజం') వ్యక్తపరచాలని ఇక్కడకి వచ్చారు. మీరు దృఢమైన కట్టడాలలో జీవించడానికి రాలేదు. మీరు భూమి మీద ఉన్న సామూహిక చైతన్యంలో భాగంగా ఉన్నారు. మీరు మార్పు యొక్క నాయకుడిగాను మరియు ఉత్తేజకుడిగాను ఉండడం కోసం ఇక్కడకి వచ్చారు. ఇదే మిమ్మల్ని ఆనందంగాను మరియు సంపూర్ణంగాను ఉండేలా చేస్తుంది. మీ అంతర్‌శిశువుతో కలవడం ద్వారా మరియు మీ నిజమైన ఆశయం యొక్క అద్భుతాన్ని తిరిగి అనుభూతి చెందడం ద్వారా, మీరు భ్రమలతో కూడిన హద్దులను మరియు పరిమితులను తొలగించగలరు. మీరు మరింత సులభంగాను, తేలికగాను ఉండే మార్గాన్ని మీ జీవితంలో కనుగొంటారు. మిమ్మల్ని తక్కువగా చూపిస్తూ భయాలలో ఉంచుతున్న ఈ అవాస్తవపు దైవాల నుంచి మీరు స్వేచ్ఛను పొందినప్పుడు, మీకు ఈ విశ్వం మరింతగా సహకరిస్తూ, మీ ఆశయం నెరవేరడానికి కావలసిన ఫలాలను అందజేస్తుంది.

**మూడవ మూర్తి : ఇతరులపై జాలిపడుతూ వారి కష్టాలతో పయనించడం**

నేను మరొక అవాస్తవమైన దైవం గురించి చెప్పాలనుకుంటున్నాను మరియు ఈ దైవం మీ నిత్యజీవితాలను చాలా ఎక్కువగా ఆక్రమించాడు. ఇది మీ ప్రక్కవారిపై జాలిపడడం, మీ సన్నిహితుల యొక్క బాధలను పంచుకుంటూ వారితో పాటు బాధపడడం గురించి తెలియజేస్తుంది. ఇప్పుడు మీరు అడగవచ్చు: నేను ఆరాధించేవాడిలా ఎలా ఉండగలను? నేను ఇతరులతో బంధాన్ని కలిగి ఉండకూడదా, ముఖ్యంగా నేను ప్రేమించినవారితో బంధాన్ని కలిగి ఉండకూడదా? నాకు చేతనైనంత సహాయం వారికి చేయలేనా? నేను చెప్పదల్చుకున్నది ఏమిటంటే, మీ చుట్టూ ఉన్న వారితో మీరు ఎక్కువగా సంబంధాన్ని కలిగి ఉంటే, మీరు వారి యొక్క బాధలకు, కష్టాలకు మరియు చెడు మనోభావాలకు ఆకర్షింపబడతారు. దీని ఫలితంగా మీ ఆత్మకేంద్రంతో మరియు మీ అంతర్ ప్రశాంతతతో బంధాన్ని కోల్పోతారు. ఈ విధమైన జాలి మరియు ఇతరుల కష్టాలను కలిసి పంచుకోవడం అనేది మీ యొక్క కర్తవ్యం కాదు. ఇది ఇతరులకు సహాయం చేయడం కూడా కాదు. ఇది ఆధ్యాత్మిక స్థితి నుంచి గమనించినా కూడా సరైనది కాదు.

మీ అతిసున్నితత్వం, ఇతరుల శక్తులను సులభంగా గ్రహిస్తున్నట్లయితే, మీ సొంత శక్తి క్రమేణా క్షీణించిపోతుంది. ఈ కారణంగా ఇతరుల మనోభావాలను గ్రహించ గల మీ శక్తి సమన్వయాన్ని కోల్పోతుంది. ఎందుకంటే ఈ చెడుశక్తులు ఇతరులకు సంబంధించినవే గాని, మీవి కాదు కాబట్టి. మీరు స్పష్టంగా గమనించ

లేకపోతున్న విషయమేమిటంటే, ఈ చెడుశక్తులు ఇతరుల యొక్క జీవితాలలో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి. మీ కరుణ మరియు అర్ధం చేసుకునే తత్వం ద్వారా, మీరు వీరిని జ్ఞానవంతులను చేయవచ్చు, కాని వీరితో పాటు మీరు కూడా బాధపడుతుంటే, వీరికి ఏ మాత్రం మీరు సహాయం చేయలేరు.

మీ సన్నిహితుల యొక్క (భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు లేదా స్నేహితులు) జీవితాలు ఆనందంగాను మరియు సంతోషంగాను ఉండడాన్ని చూడాలనుకుంటారు. వారు బాగుండాలని మరియు వారి సమస్యలు పరిష్కరింపబడాలని మీరు కోరుకుంటారు. మీరు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే వారి జీవితంలోని సమస్యలు వారి యొక్క సొంత సృష్టికి సంబంధించినవి అని. బాంధవ్య సమస్యలు, డబ్బు సమస్యలు, ఆరోగ్య సమస్యలు, మానసికపరమైన సమస్యలు..... ఇవన్నీ కూడా ఆత్మలో లోతుగా పాతుకుపోయిన అంతర్ ఘర్షణలకు అద్దం పడుతుంటాయి. మనుష్యులు ఈ సమస్యల యొక్క అనుభవాన్ని పొందాలని మరియు వీటి ద్వారా ఏదో ఒకటి పరిష్కరించుకోవాలని చాలా లోతుగా కోరుకుంటారు. ముఖ్యంగా వీరు అవే సమస్యలలోకి మళ్ళీ మళ్ళీ పయనిస్తున్నప్పుడు, వీరిని వీరు బాధితులుగా భావించవచ్చు. కాని దీనికి అర్ధం, వీరు ఆ సమస్య యొక్క గుణం గురించి ఇంకా చాలా లోతైన అనుభవాన్ని పొందాలని కోరుకుంటున్నారు. మరియు వీరు మీ సహాయాన్ని అందుకోవడానికి సిద్ధంగా లేరు. మీరు ఏదో ఒక విధంగా వీరికి సహాయం చెయ్యాలని ప్రయత్నిస్తే, మీరు తొందర పెట్టేవారిగాను మరియు అదుపు చేసేవారిగాను మారుతారు మరియు మీ సొంత మూలకేంద్రం యొక్క శక్తిని కోల్పోతారు. ఆ తర్వాత మీరు ఆధీనమయ్యే జీవనశైలిని వదులుకోవలసి ఉంటుంది.

మీరు అధికంగా ఇవ్వడం వలన శక్తిని వృధా చేస్తారు మరియు మీ సహాయాన్ని పొందుతున్న వారికి మీ అంతట మీరు మనోభావపరంగా బంధీ అవుతారు. ఇది మిమ్మల్ని మీ సొంత బాగుకోసం ఇతరులపై ఆధారపడేలా చేస్తుంది. మీ మనోభావసంబంధిత శక్తులన్నీ కలిసిపోతాయి. ఇవి మీ బలాన్ని, జీవశక్తిని మరియు వ్యక్తిగత జాగురుకతను కోల్పోవడానికి ఒకానొక ముఖ్యకారణంగా తయారవుతాయి. ఇతరుల కోసం వారి యొక్క బాధ్యతలను, విచారాలను, పనులను మీ సొంత వాటిగా స్వీకరించడం వలన మీ శక్తిని సులభంగా కోల్పోతారు.

ఈ విధంగా "సహాయపడే బంధాల"లో, కారణం లేకుండా అధికార సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువగా ఇవ్వడం వలన, నిజానికి సహాయకుడు అంతర్‌శూన్యతను కప్పి ఉంచడానికి ప్రయత్నిస్తాడు. ఈ విషయాన్ని అతను ఎరుకతో

గుర్తించలేదు. ఎందుకంటే అతను వేరొకరిచే ఆక్రమింపబడడం వలన. ఇతరులకు సహాయం చేయడమనేది మీకు ఆనందాన్ని మరియు బలాన్ని ఇస్తున్నట్టుగా అనిపించవచ్చు. మీ సహాయం మరియు శ్రద్ధ పొందుతున్నవారికి ఇది మంచిగాను మరియు సౌకర్యవంతంగాను ఉండవచ్చు. వీరు అతిత్వరలోనే వీరి యొక్క ప్రవర్తన మరియు మనోభావాల ద్వారా మిమ్మల్ని ప్రభావితం చేస్తారు. వీరు చెడు పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు, మీ నుంచి మరింత శ్రద్ధను పొందాలని అనుకుంటారు (ఎందుకంటే వీరు త్వరగా కోలుకోవాలని మీరు కోరుకుంటారు కాబట్టి). మీపై బాధితులు అధికారం ఉందని భావిస్తారు, ఎందుకంటే అతడు బాధితుడి పాత్రలో ఉంటూ మీ నుంచి రుణాన్ని తీసుకోవాలనుకుంటాడు కాబట్టి.

ఈ విధమైన బంధంలో ఒక బలమైన శక్తి మార్పిడి జరుగుతుంది మరియు ఇది మీ ఇరువురిని కృంగదీస్తుంది. దీనికి కారణం నిజానికి మీ ఆత్మ కోరుకున్న దానికి ఇవేవి ఏకీభవించటం లేదు కాబట్టి. ఇలా ఒకరినొకరు పరిమితమైన పాత్రలతో తక్కువ చేసుకోవడంలో ఏ విధమైన ఆధ్యాత్మిక వాస్తవం ఉండదు. సహాయకుడు తను అనుకున్న విధంగా బాధితుడు ఎదగలేదని ఆందోళన చెందుతాడు: ఇది బాధితుడి యొక్క ఇష్టపూర్వకమైన మార్పు కాదు. ఎందుకంటే వీరు బాధితుడి పాత్రలో ఇంకా నిమగ్నులై ఉండాలని కోరుకుంటున్నారు కాబట్టి. బాధితుడు తన బాధిత పాత్రలో మరింతగా ఇరుక్కుపోయి ఉన్నాడు మరియు తనకు తనే చాలా లోతుగా మునిగిపోయి ఉండడం వలన ఈ పాత్ర అతనిని పూర్తిగా కదలనీయకుండా చేస్తుంది. అందువలన ఇద్దరికి కోపం వచ్చి ఒకరినొకరు దూషించుకుంటారు.

మీరు సులభంగా మీ చుట్టుప్రక్కల వారిపై జాలిపడుతూ మరియు వారి స్థితికి బాధపడుతుంటారు. ముఖ్యంగా లైట్‌వర్కర్స్ ఆత్మలు, భూమి మీద కాంతిని మరియు జాగురుకతను నెలకొల్పాలనే లోతైన కోరికను కలిగిఉంటారు. వీరు ఇతరుల యొక్క బాధలకు సులభంగా స్పందిస్తారు. సృష్టిలో సంభవిస్తున్న సమస్యలను చూడడానికి మీకు కష్టంగా ఉంటుంది. ఉదాహరణకు పేదరికం లేదా యుద్ధాల ద్వారా ప్రభావితం చెందుతున్న ప్రదేశాలను, లేదా కాలుష్యంచే నాశనమవుతున్న వాతావరణాన్ని చూడడానికి కష్టపడతారు. మీ వ్యక్తిగత స్థాయిలో ఏర్పడుతున్న కష్టాలకు మీరు చాలా తీవ్రంగా ప్రభావితం చెందుతారు. ముఖ్యంగా ఇక్కడ మీ శక్తిని తిరిగి వెనుకకు తీసుకోవడం మీకు పెద్ద సవాలుగా మారుతుంది.

మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవడం ద్వారా ఇతరులకు సహాయం చేయలేరనే విషయాన్ని ముఖ్యంగా మీరు అర్థం చేసుకోవాలి. ఇతరుల యొక్క మనోభావాలను

గ్రహించినప్పుడే, మీరు వారికి సన్నిహితమవ్వగలరని మరియు వారికి సహాయం చేయగలరని భావిస్తుంటారు. ఈ విధంగా మీరు ఇతరుల బాధలను స్వీకరిస్తుంటారు. కాని ఇలా ఇతరుల సమస్యలను తీసుకోవడం ద్వారా మీరు సమస్యలను రెండింతలు చేస్తున్నారు. దీని యొక్క గుర్తులు మరింత లోతుగా పాతుకుపోతున్నాయి. ఇతరుల యొక్క సమస్యల ద్వారా పయనించడం వల్ల మీ శక్తి వారిలోని చెడుతనం ద్వారా ముక్కలై చిన్నాభిన్నమైపోతుంది. ఇతరులు బాధపడుతున్నప్పుడు మీరు ప్రశాంతంగాను, ఆనందంగాను మరియు సంతృప్తిగాను ఉండే హక్కు లేదని భావిస్తుంటారు. ఇది చాలా పెద్ద పొరబాటు. నిజానికి దీనికి వ్యతిరేకంగా ఉండడమే వాస్తవమంటే.

నిజానికి ఇతరులకు సహాయం చేయాలనుకుంటే మీరు మీ శక్తిని సమస్య మీద కాకుండా, సమస్యకు పరిష్కారం కనుగొనడంలో వినియోగించండి. ఇలా చేయడానికి మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవడం కన్నా ఉన్నతంగా చూడడానికి ప్రయత్నించండి. మీరు మరింతగా మీ సొంత చైతన్యాన్ని మరియు స్వతంత్రతను ప్రసరింపజేస్తారు, మీరు మరింతగా 'పరిష్కారశక్తి'కి ప్రతినిధిగా వ్యవహరిస్తారు మరియు మీరు మీ శక్తిని వినియోగించకుండా ఇతరులకు అర్ధవంతంగా ఉపయోగపడగలరు. అలా కాకుండా మీరు వారితో బాధపడినట్లయితే, మీరు సమస్యను ధృవీకరించినట్టు అవుతుంది. మీరు ప్రశాంతంగాను మరియు మీ ఆత్మ కేంద్రంలోనూ ఉన్నట్లయితే, మీరు ఇతరుల యొక్క తీవ్రమైన మనోభావాలకు స్పందించకుండా, మీరు మరొక కోణాన్ని, మరొక దృక్పధాన్ని తెరచి దాని నుంచి సమస్యను చూడడం ప్రారంభిస్తారు. క్లుప్తంగా చెప్పాలంటే మీరు సమస్య యొక్క శక్తితో ప్రతిస్పందించకుండా, మీరు దానిపై కొత్తకాంతిని ప్రసరింపజేస్తారు.

నిజమైన ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అనేది ఇతరుల యొక్క సమస్యను పరిష్కరించటంలో పాల్గొనదు. కేవలం ఇది వారికి కాంతి మరియు జాగురుకత యొక్క దీపపుస్థంబంగా ఉంటుంది. ఇది వారి సమస్యలకు అద్దంపడుతూ, అవి వారి దగ్గరకు తిరిగి వచ్చేలా చేస్తూ, మరొకసారి ఆ సమస్యలను ఆ కాంతిలో చూసే అవకాశాన్ని కలుగజేస్తుంది. ఇది సమస్యలో విలువను మరియు అర్ధాన్ని తెలుసుకునేలా చేస్తుంది. ఇది  ఇచ్ఛాశక్తి మరియు బాధ్యత యొక్క భావనగా తిరిగి వారి దగ్గరకి చేరుతుంది.

మీలో ఉన్న ఏదో శక్తి వారి హృదయాలను స్పృశిస్తూ, వారిని ఉత్తేజపరుస్తుంది: ఈ శక్తియే ప్రేమ. ఇదే అంగీకారం యొక్క శక్తి. మీరు ఇతరులకు ఏమి చేయకుండా కేవలం ఈ విధంగా మీరు "పరిష్కారం యొక్క శక్తి"ని అందిస్తారు. ఇదే కాంతిపని

లేదా లైట్‌వర్క్ : మీ సహజ స్వభావంలో ప్రశాంతతను కలిగి ఉంటూ, అదే ప్రశాంతతను ఇతరులకు ప్రసరింపజేయడమే. దీని అర్థం ఇతరుల యొక్క బాధలను మోయడం కాదు లేదా వారి సమస్యలకు పరిష్కారాలను కనుగొనటం కాదు. ఇదంతా పరిష్కారం యొక్క శక్తిని మీ సొంత వ్యక్తిత్వంలో కలిగిఉంటూ, దానిని ఇతరులతో స్వేచ్ఛగా పంచుకోవడం గురించి. ఇదే భూమి మీద మీ ప్రధానలక్ష్యానికి కేంద్రంగా ఉంటుంది. ఇదే కాంతిని తీసుకురావడానికి మూలం కూడా.

భూమి మీద ప్రేమ యొక్క శక్తితరంగాలకు ప్రతినిధిగా వ్యవహరించడానికి, మీతో మీరు నిజాయితీగా ఉంటూ, మీపై మీరు శ్రద్ధను కలిగిఉంటూ, మీ అంతర్‌వాణి మీకు ఏం చెబుతోందో వినడం అనేది అతిముఖ్యమైన విషయం. ఇదే మీ ఆత్మ మిమ్మల్ని కోరుతోంది. ఎప్పుడైనా మీ శక్తి ద్వారా ఇతరులు నడవడానికి అనుమతిస్తున్నా, లేదా మీలోని భయం లేక అదుపు అవసరమనే భావన వలన మీ శక్తిని ఇతరులకు అధికంగా ఇస్తున్నట్లయితే, మీ కాంతిలోని ఒక భాగం విచ్ఛిన్నమైపోతుంది. మీ పూర్వస్థితిని పొందడానికి మరియు మీ సహజ సమన్వయాన్ని, జీవశక్తిని మళ్ళీ పొందడానికి, మిమ్మల్ని మీరు మనోభావపరంగా నయం చేసుకోవాల్సి ఉంటుంది.

ఇది మీ నిత్యజీవితంలో ఎలా జరుగుతోందో ఒకసారి గమనించండి. ఇతరులు మిమ్మల్ని ఎలా అర్థం చేసుకుంటారు లేదా మీరు వారికి ఎలా సహాయం చెయ్యాలి అనే విషయాల గురించి బాధపడుతున్నా, మీకు అవే ఆలోచనలు మరియు అవే మనోభావాలు మళ్ళీ మళ్ళీ వస్తున్నా, మీరు భయం మరియు అదుపు యొక్క రొచ్చులో ఇరుక్కుపోతారు. మీరు ఎల్లప్పుడూ ఇతరులకు మీ శక్తిని ఇవ్వాలనుకుంటారు. ఎందుకంటే మీరు పరిస్థితులను బాగు చెయ్యాలని, ఇతరులకు సహాయం చేసి వారిని సమస్యల నుండి బయటకు తీసుకురావాలని కోరుకుంటారు కనుక. కాని ఒకసారి శ్రద్ధగా గమనించి చూడండి: నిజంగా మీరు ఇచ్చే సహకారం సమస్యకు పరిష్కారాన్ని ఇవ్వగలుగుతోందా? లేదా సమస్యను ధృవీకరించి అది నిరంతరం సంభవించేలా చేస్తోందా? మీరు మీ అంతర్‌జ్ఞానాన్ని పంచే వ్యక్తిగా ఉండడానికి బదులు ఆరాధించే వ్యక్తిలా ఉంటున్నారా అనే విషయం గురించి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

పరిస్థితులను అదుపు చేయడం అనేది సరైనదిగాను మరియు అర్థవంతమైనదిగాను అనిపించవచ్చు, కాని తరచూ భయం ఈ విధంగా చేయమని మిమ్మల్ని ఒత్తిడి చేస్తుంది. మీ జీవితంలోని వివిధ పరిస్థితులకు సంబంధించి తీవ్రప్రయత్నాలు చేయడం వలన అలసటకు మరియు అవిశ్రాంతికి లోనవుతారు. కాని మీరు వాటినే పట్టుకుని ఉంటూ, వాటిని మీ విధిగా భావిస్తూ ఇంకా అధికశక్తిని

వినియోగించాలని అనుకుంటారు.  ఇతరులకు, వేరే వ్యవస్థలకు, సమాజానికి లేదా దేవుడికి మీరు రుణగ్రస్తులని భావిస్తారు. ఎప్పుడైనా మీరు మనోభావపరంగా అలసటకు గురైనప్పుడు వీటిని దూరంగా తోసివేసి, వీటిని విడుదల చేయడానికి నిజానికి ఇదే సరైన సమయమని గుర్తించండి మరియు మీ కోసం మీరు నిశ్శబ్ధమైన ప్రదేశాన్ని కనుగొనండి.  ప్రపంచాన్ని వదిలేసి మీ అంతరంలోకి వెళ్ళాల్సిన సమయం కూడా ఇదేనని తెలుసుకోండి. ఒక్క క్షణం మీ బంధాలన్నింటిని త్రెంచుకుని, మీ అంతర్‌శిశువుతో తిరిగి బంధాన్ని ఏర్పరుచుకోండి. దీని వలన మీరు మీ ఆత్మ కేంద్రంలోనూ మరియు సమన్వయంలోనూ ఉండడం యొక్క గొప్ప ప్రాముఖ్యతను అర్థం చేసుకోగలుగుతారు. మీ అంతర్‌శిశువుతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా మీరు మీ ప్రజ్ఞాత్మను (అంతర్‌శిశువు యొక్క రక్షకుడు) కూడా మేల్కొల్పుతారు. మీ జీవాత్మ మరియు ప్రజ్ఞాత్మతో బంధాన్ని ఏర్పరుచుకుంటూ, వాటిని మీ అంతరంలో అనుభూతి చెందుతూ, వాటి మాటలను శ్రద్ధగా వినడం వల్ల, మీ ఉనికిలో అవి రెండూ కలిసి ఆనందంగా ఆడుకోవడాన్ని అనుభూతి చెందడం మొదలుపెడతారు. మీ ఆత్మ కేంద్రంలోనూ మరియు ప్రశాంతంగాను మళ్ళీ ఉండడానికి మీరు ఏం చెయ్యాలి లేదా ఏది అనుసరించాలి అనేది మీకు స్పష్టమవుతుంది.

**మీ ఆసక్తిని కనుగొంటూ దానిని అనుసరించండి**

ప్రతీ మనిషి ఏదో ఒక ఆసక్తితో జన్మిస్తాడు. ఆ ఆసక్తిని అందమైన ఎర్రగులాబిలా ఊహించుకోండి. మీరు జన్మించే ముందు, మీరు స్వర్గం యొక్క అంచుల దగ్గర నిలబడినప్పుడు, మీరు ఈ అత్యంత సుందరమైన ఎర్రగులాబీని మీ చేతిలో పట్టుకుని ఉన్నట్టు ఊహించుకోండి. మీరు భూతలంలోకి దూకడానికి సంకోచించవచ్చు.  నిజానికి మీరు భూమి మీదకి రావడానికి సిద్ధంగా ఉన్నానా లేదా అనే విషయాన్ని విచారంతో ఆలోచిస్తున్నప్పటికి, కూడా మీ అంతరంలో ఒక వెలుగును, ఒక ఆశయాన్ని అనుభూతి చెందుతారు. అది ఒక ఎర్రగులాబీలా  మీతో ఉంటుంది. ఇప్పుడు మీరు భూమి మీదకి వచ్చి మానవరూపం ధరించినట్లు మరియు మీ అంతరంలో  ఈ ఎర్రగులాబీని మీ పొట్ట మరియు హృదయభాగంలో పెట్టుకుని వచ్చినట్లు ఊహించుకోండి.

ఇప్పుడు ఈ గులాబి యొక్క శక్తిని మీ దగ్గరకు రానివ్వండి. ఈ క్షణంలో మీ నిజమైన ఆసక్తిని, మీ     ఉత్తేజాన్ని మీతో ఉండానికి అనుమతించండి. ఒకసారి ఈ గులాబీని చూడండి. అది మీకు ఇప్పుడు ఎలా కనిపిస్తోంది? మీ మనసులో మెదిలిన

మొదటి ఊహను తీసుకోండి. ఆ గులాబి కొంచెం బాధతోనూ మరియు ఒడిలి పోయినట్టు కనిపిస్తోందా, లేదా అద్భుతంగా ప్రకాశిస్తోందా? మీరు గులాబీ మొగ్గను చూస్తున్నారా లేదా వికసించిన పుష్పాన్ని చూస్తున్నారా? ఈ క్షణంలో అది మీ నుంచి ఏమన్నా కోరుకుంటోందా? బహుశా ఎక్కువ నీటిని లేదా సూర్యకాంతిని, లేదా కొంచెం ఎక్కువ ప్రేమను మరియు ఆసక్తిని, లేదా అది తనను వాత్సల్యకరమైన, ఆహ్లాదకరమైన పరిసరాలలోకి తరలించమంటోందా? దానికి కావలసిన దానిని మీరు ఇస్తున్నట్లుగా ఊహించుకోండి. అంతర్‌స్థాయిలో ఇది మిమ్మల్ని ఎలా ప్రభావితం చేస్తోందో అనుభూతి చెందండి.

భూమి మరియు మూలాధారచక్రం యొక్క రంగు: ఎరుపు. ఎరుపు ఆసక్తి యొక్క రంగు కూడా. తరచూ మీరు మీ ఆసక్తికి భయపడుతున్నారా. మీ నిజమైన ప్రవాహాన్ని మీ జీవితంలో స్వేచ్ఛగా వ్యక్తపరచుకోవడానికి మీరు భయపడుతున్నారు, ఎందుకంటే ఇది మీ సమాజం లేదా సాంప్రదాయాలు చెబుతున్న వాటికి వ్యతిరేకంగా ఉంటుంది కనుక. మీ ప్రతీ ఒక్కరిలోనూ నిజమైన ఆసక్తి మరియు ఉత్తేజం ఉన్నాయి. దీని మూలంగానే మీరు ఇప్పుడు భూమి మీద ఉన్నారు. మీ జీవితాన్ని నడిపించడానికి మరియు గైడ్ చేయడానికి మీ శక్తిని అనుమతించినప్పుడు మాత్రమే, మీరు సంపూర్ణంగాను మరియు ఉత్తేజంగాను  ఉండగలరు. ఆధీనమయ్యే జీవనశైలి యొక్క సారాంశం ఏమిటంటే, మీ ఉనికికి, మీ ఆత్మ యొక్క ఆసక్తికి మరియు మీ ప్రస్తుతజన్మను తీసుకోవడానికి కారణమయిన ఉత్తేజానికి ఆధీనమవ్వమని.

మీ ఆత్మ యొక్క ఆసక్తితో మీరు బంధాన్ని కలిగి ఉన్నారా లేదా అనే విషయాన్ని గుర్తించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి.

**1. ఉత్తేజాన్ని అనుభూతి చెందడం -** అది ఎక్కడైతే ప్రవహిస్తోందో అక్కడ మీ యొక్క అవసరం ఉంది

ఆధీనాన్ని ఒక జీవనశైలిగా ఎంచుకోవడమంటే, మిమ్మల్ని నిజంగా ఉత్తేజపరుస్తున్న వాటి ద్వారా మిమ్మల్ని మీరు నడిపించుకోవడానికి అనుమతించడమే. ఆధీనం అంటే చురుకుదనం లేని శక్తి కాదు. నిజంగా మిమ్మల్ని ఉత్తేజపరిచే మరియు ప్రోత్సహించే విషయాలకు ఆధీనమవ్వడం ద్వారా మీరు అంతరంలో  సజీవమైన మరియు చురుకైన శక్తి ప్రవాహానికి మార్గాన్ని తెరుస్తారు. ఈ ప్రవాహాన్ని మీ కోసం మీరు శోధించాలని అనుకుంటే, మీ శక్తి ఏ విషయాలలో సహజంగా ప్రవహించగలదో కూడా తెలుసుకోవాలి. మిమ్మల్ని ఏ విషయాలు ఆనందంగాను మరియు ప్రశాంతంగాను

ఉంచగలవు? మీరు ఏ వృత్తిని సులభంగాను, ఆనందంగాను చేయగలరు? ఈ విషయాలు లేదా పనుల యొక్క సారాంశం ఏమిటి? వీటి యొక్క సారాంశాన్ని అనుభూతి చెందండి. ఈ సారాంశం ఆకృతిని మరియు రూపాన్ని పొందడానికి చాలా ప్రత్యేకమైన మార్గాలు ఉన్నాయనే విషయాన్ని మీరు తెలుసుకోండి.

**2. మీ సొంత స్వభావంతో నిజాయితీగా ఉండండి -** మీరు సహజంగా దేనినైతే చేయగలరో అదే మీకు సరైనది

మీ ఆసక్తిని గుర్తించాలంటే, ఎల్లప్పుడూ మీలో ఏదో సహజంగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. మీరు ఒక చర్య లేదా వృత్తి లేదా భావప్రకటన రూపానికి ఆకర్షింపబడుతూ, వాటిలో ఆసక్తిని అనుభూతి చెందుతూ, వాటిని కొనసాగించడంలో ఆనందాన్ని పొందుతారు. ఇవి మీకు సహజంగాను మరియు అతిసన్నిహితంగాను ఉంటాయి. వీటిని చాలావరకూ మీ ఆలోచనారీతిలో స్పష్టంగా గమనించవచ్చు. మీ సహజమైన బహుమతిని ఫలింప చేసుకోవడానికి, మీరు కొన్ని సామర్థ్యాలను నేర్చుకోవాలి లేదా కొన్ని అధికారిక విద్యలను చదవవలసి రావచ్చు. కాని ఇది చేయడం మీకు చాలా సులభంగాను మరియు ఆనందంగాను ఉంటుంది. మీ సామర్థ్యాలకు మరియు నైపుణ్యాలకు అనుగుణంగా మీ ఆసక్తి ఉంటుంది. ఇది మీరు సమర్థవంతంగా చేసే పనులలోనే ఇమిడి ఉంటుంది.

**3. స్పష్టమైన సరిహద్దులను ఏర్పరుచుకోండి మరియు ధైర్యంగా 'కుదరదు లేక కాదు' అని చెప్పండి -** మిమ్మల్ని మీరు అతి ముఖ్యమైన వారిగా భావించండి

మీకు మీరు ఆధీనమయ్యే ప్రవాహంలో ఉండడం అంటే, మిమ్మల్ని మీరు అతి ముఖ్యమైన వారిగా భావిస్తూ, ఈ ప్రవాహంలో మిమ్మల్ని అడ్డుకుంటున్న విషయాలకు లేదా మనుష్యులకు 'కుదరదని' చెప్పగలగడమే. మీకు సరిపడని విషయాలకు లేదా సరైనవి కాదు అని అనుభూతి చెందుతున్న విషయాలకు ధైర్యంగా కుదరదు అని చెప్పగలిగినప్పుడే, మీరు మీ ఆసక్తిని అనుసరించగలరు. మీ ఉనికికి మరియు మీ ప్రత్యేకమైన ఉత్తేజానికి ఆధీనమవ్వడం వల్ల, మీరు కొన్నిసార్లు తెలివిగాను మరియు మొండివైఖరినితోనూ ఉండవలసి రావచ్చు. ఇతరులు మిమ్మల్ని చులకనగాను మరియు పనికిరాని వారిగాను చూసినప్పటికీ, మీరు ప్రక్కకు నిలబడి మీ హృదయం యొక్క సందేశాలను విశ్వసించండి. గొప్పగా జీవించడానికి సాహసించండి, మార్పును తీసుకురావడానికి సాహసించండి! నిజానికి మీకు మరొక ఎంపిక లేదనే విషయం మీకు తెలుసు. మీరు కలిగి ఉన్న ఇంకొక ఎంపిక ఏమిటంటే, మీ ఉత్తేజం యొక్క

సహజ ప్రవాహాన్ని నిలిపివేయడం లేదా క్షీణింపజేయడమే. దీని ఫలితంగా మీరు ఆందోళనను, శూన్యతను, కోపాన్ని మరియు అసంపూర్ణత్వాన్ని అనుభూతి చెందడం మొదలుపెడతారు. మీ కోసం మీరు ఎంపిక చేసుకోకపోతే, మీకు మీరు వ్యతిరేకంగా ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. గులాబి యొక్క శక్తి, మీ ఆసక్తి, మీ నుంచి తొలగిపోతాయి. ఇది మీ జీవితంలో మానసికపరమైన సమస్యలను సృష్టిస్తుంది. ఒంటరితనం, ఏకాకితనం మరియు విచారం మొదలైన వాటిని. అందువలన "కుదరదు" అని చెప్పడానికి సాహసించండి. మీరు స్పష్టమైన సరిహద్దులతో ఉన్న ప్రదేశాన్ని ఏర్పరుచుకోవడానికి సాహసించండి. అవాస్తవమైన దేవుళ్ళ యొక్క ఆదర్శాలకు వ్యతిరేకంగాను మరియు అహంకార పూరితంగాను ఉండడానికి భయపడవద్దు.

**4. సహనం మరియు లయబద్ధత - క్రమక్రమంగా అభివృద్ధి చెందడం**

మీ ఆత్మశక్తితో, మీ ఉత్తేజం యొక్క శక్తితో బంధాన్ని ఏర్పరుచుకున్నట్లయితే, ఇది మీకోసం ఒక స్పష్టమైన మార్గాన్ని మీ నిత్యజీవితంలో మీకు ఏర్పరుస్తుంది. మీకు తగిన వేగం మరియు లయబద్ధతలతో కూడిన అవకాశాలు మీ దగ్గరకు వస్తాయి. మీరు ఈ వ్యక్తీకరణ యొక్క ప్రవాహానికి తగినట్టుగా శృతి చేయబడాలని అనుకున్నట్లయితే, మీరు వర్తమానంలో ఉంటూ, మీ దగ్గరకి వస్తున్న విషయాలను క్రమక్రమంగా స్వీకరించడానికి ప్రయత్నించండి. మీ కలలు మరియు మీ ఆసక్తి నెరవేరడానికి సంభవించే విషయాలన్నింటిని దాటి ముందుకు వెళ్ళాలని ప్రయత్నించవద్దు. జీవితం మిమ్మల్ని సంరక్షిస్తుంది, మీరు జీవితాన్ని సంరక్షించనక్కర్లేదు. మీరు కేవలం మీ ఆసక్తిని అనుభూతి చెందుతూ, మీ అంతరంలోని దైవాన్ని విశ్వసిస్తూ, ఆసక్తి యొక్క బాధ్యతను అప్పగించండి. మీ అంతరంలోని ప్రజ్ఞాత్మకు, మీ అంతర్‌శిశువు యొక్క కలలను మరియు కోరికలను పట్టించుకోవడానికి అనుమతివ్వండి. ఆధీనమవ్వండి మరియు విశ్వసించండి!

ఈ రోజు ఇక్కడ ఉన్నందుకు నా కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను. ఇలా మీతో ఉండడం అనేది నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. నేను చాలా వరకూ మీ సొంత శక్తికే ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను అనే విషయాన్ని మీకు గుర్తుచేస్తున్నాను. మిమ్మల్ని దగ్గరకు రమ్మని మీ సొంత శక్తి ఆహ్వానిస్తోంది: జీవించడానికి సాహసించండి, మీరు మీరుగా ఉండడానికి సాహసించండి.

* * * *

# పురుషశక్తి మరియు స్త్రీశక్తి

డియర్ ఫ్రెండ్స్, మిమ్మల్ని మళ్ళీ ఇలా కలవడం మరియు మీతో ఇలా ఉండడం నాకు చాలా ఆనందంగా ఉంది. నన్ను లేదా నాలాంటి వారిని మాస్టర్స్‌గా చూసే ధోరణిని మీరు కలిగి ఉంటారు, కాని మేము మిమ్మల్ని మాస్టర్స్‌గా చూస్తాం. భూమి మీద సాహసోపేత సమయాలలో, అంటే మార్పు అధికంగా సంభవిస్తున్న సమయాలలో మీ సొంతమార్గాన్ని మీరు అనుసరిస్తున్నట్లుగా మేము మిమ్మల్ని చూస్తాం. మీ సొంత ఆధిపత్యం వైపు అభివృద్ధి చెందుతున్నట్లు చూస్తాం. మీరు చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్న మాస్టర్స్‌గా మీరు తయారవుతున్నట్లు  మేము మిమ్మల్ని చూస్తాం. ఇదే మీ సొంత ఆధిపత్యాన్ని అన్వేషించడం అంటే! సంప్రదాయాల ద్వారా లేదా పుస్తకాల ద్వారా లేదా ఇతరుల ద్వారా తెలుపబడిన ఏ మాస్టర్‌ని అనుసరించవద్దు. మీ సొంత ఆధిపత్యాన్ని కనుగొనండి. ఇదంతా దీని గురించే.

ఈ రోజు నేను మీ చరిత్రకు సంబంధించిన ఒక అంశం గురించి చెప్పాలనుకుంటున్నాను: ఆ అంశం స్త్రీ-పురుష శక్తుల గురించి. ఇవి చాలా పురాతనమైన శక్తులు. ప్రస్తుతం వీటిలో చాలా మార్పులు సంభవిస్తున్నాయి.

మొదటిగా నేను స్త్రీ మరియు పురుషశక్తుల స్వభావం గురించి కొద్దిగా చెప్పాలనుకుంటున్నాను. ఈ శక్తులు రెండూ ఒకే విషయానికి సంబంధించిన రెండు ప్రత్యేకలక్షణాలు. అందువలన నిజానికి, ఇవి ఒక దానిని ఒకటి వ్యతిరేకించుకోవడం లేదు, లేదా ఇవి రెండూ ద్వంద్వాలు కూడా కావు. ఇవి రెండూ ఒక్కటే. ఇవి ఒకే శక్తి యొక్క రెండు ముఖాలు.

పురుషశక్తి, బాహ్యంగా దృష్టిని కేంద్రీకరించే లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఇది దైవం లేదా ప్రజ్ఞాత్మ యొక్క భాగంగా ఉంటూ, బాహ్యపు వ్యక్తీకరణలను నడిపిస్తుంది. ప్రజ్ఞాత్మ భౌతికవాస్తవంలో రూపాన్ని తీసుకోవడానికి ఇది సహకరిస్తుంది. అందువలన పురుషశక్తికి బలమైన సృజనాత్మక శక్తి గురించి తెలుసు. సహజంగా పురుషశక్తి, దృష్టి కేంద్రీకరణను మరియు లక్ష్యాలను సాధించాలనే ధోరణిని కలిగి ఉంటుంది. ఈ విధంగా పురుషశక్తి ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సృష్టించుకుంటుంది. పురుషశక్తి మీకు ఏకత్వం నుంచి, పూర్ణత్వం నుంచి వేరుపడి మీ సొంత ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకోవడానికి సహకరిస్తుంది.

స్త్రీ శక్తి ఇంటి యొక్క శక్తి. ఇది ప్రాధమిక మూలానికి, ప్రవహించే కాంతికి

మరియు స్వచ్ఛమైన ఉనికికి సంబంధించిన శక్తి. పరిస్థితుల యొక్క అంతర్ లక్షణాల పరంగా ఈ శక్తి ఇంకా వ్యక్తీకరింపబడలేదు. స్త్రీశక్తి అంతటా వ్యాపించి ఉంది. ఇది అన్నింటిని సమభావంతో చూస్తుంది. ఇది దేనిని భిన్నంగా చూడదు.

ఇప్పుడు స్త్రీ శక్తి తనలోని ఒకానొక కదలిక యొక్క ఎరుకను పొందుతున్నట్లు ఊహించుకోండి. అది 'అవిశ్రాంతి'కి మరియు 'తన సరిహద్దుల నుంచి బయట'కు వచ్చి అనుభవాన్ని పొందాలనే వాంఛకు సంబంధించినది. ఇది కొత్తదనానికి మరియు సాహసానికి సంబంధించిన వాంఛ! ఇప్పుడు ఒక శక్తి తన దగ్గరకు వచ్చి ఆ వాంఛకు సమాధానమిస్తుంది. ఆ శక్తి 'పురుషశక్తి'. ఆమె వ్యక్తీకరణలు భౌతికవాస్తవంలో రూపుదాల్చడానికి అవసరమైన సహాయాన్ని మరియు సహకారాన్ని అందించాలని పురుషశక్తి అనుకుంటోంది. స్త్రీశక్తిని నిర్వచిస్తూ దానికి ఆకృతిని పురుషశక్తి ఇస్తుంది. వీరి ఇరువురి సహకారం వలన, మొత్తం శక్తులన్నీ కలుస్తూ పూర్తి సరికొత్త మార్గంలో పయనించగలవు. ఒక కొత్త వాస్తవం సృష్టింపబడి, ఆ వాస్తవంలో 'ప్రతీ విషయం' నిరంతరం మార్పు చెందే వ్యక్తీకరణల యొక్క రూపాలలో వ్యక్తీకరించబడుతూ అన్వేషింపబడగలదు మరియు అనుభవింపబడగలదు.

స్త్రీ-పురుష శక్తుల యొక్క నృత్యం వలన, 'గత సృష్టులు మరియు మీ ప్రస్తుత సృష్టుల యొక్క వాస్తవాలకు సంబంధించిన ప్రభావవంతమైన దృశ్యం' నిరంతరం మార్పులకు గురవుతుంది. స్త్రీ-పురుష శక్తులు ఒకరినొకరు ఆరాధించుకుంటూ, పరస్పర సహకారాన్ని మరియు ఆహ్లాదకరమైన కలయికను ఆనందించినప్పుడు, అది ఒక గొప్ప అందమైన దృశ్యంగా ఉంటుంది. వీటి కలయిక ఈ విధంగానే ఉండాలి. స్త్రీ-పురుష శక్తులు ఒకే శక్తికి సంబంధించినవి. ఇవి ఒకే శక్తి యొక్క రెండు ప్రత్యేకలక్షణాలు. ఇవి రెండూ కలిసి సృష్టి ఎలా ఉండాలి అనే దానిని ఆనందకరమైన వ్యక్తీకరణల ద్వారా తెలుపుతాయి.

మీరు ఎవరనే దాని యొక్క ఆఖరి అవగాహనలో తెలుసుకోవాల్సిన అసలైన సత్యం ఏమిటంటే: 'నేను' గురించి తెలుసుకోవడమే. "నేను" అనే ఆధ్యాత్మికపరమైన మంత్రంలో క్లుప్తంగా రెండు ప్రత్యేకలక్షణాలు కలిసి ఉన్నాయి. దీనిలో 'నే' అనేది పురుషశక్తి, 'ను' అనేది స్త్రీశక్తి. 'నే' అనేది విభజిస్తుంది మరియు సంకోచింపజేస్తుంది. ఇది దృష్టికేంద్రీకరణను, దిశను మరియు ప్రత్యేక వ్యక్తిత్వాన్ని అందిస్తుంది. 'ను' అనేది సర్వవ్యాపకమైనది మరియు అపారమైనది. ఇది ఇంటి యొక్క సర్వవ్యాపకత్వాన్ని, స్త్రీశక్తిని, అనంతమైన మూలాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ మూలానికి హద్దులు గాని,

విబేధాలు గాని లేవు. "ప్రవహిస్తూ అన్నింటిని స్వీకరించే లక్షణం" అనేది స్త్రీశక్తి యొక్క మూలానికి సంబంధించినది. "నేను"లో స్త్రీ మరియు పురుష శక్తులు దగ్గరకు వస్తూ, వీటి శక్తులను ఆహ్లాదకరంగా కలుపుతాయి.

మానవుల యొక్క ఉనికి కన్నా ముందే, స్త్రీ-పురుష తత్వాల మధ్య ఘర్షణ తలెత్తింది. నేను ఇప్పుడు ఈ ఘర్షణల యొక్క మూలంలోకి వెళ్ళాలనుకోవడం లేదు. కాని మీ చరిత్రను చూసినప్పుడు స్త్రీ-పురుష శక్తులు రెండూ వ్యతిరేక బలాలుగా ఉన్నట్లు కనిపిస్తాయి. "ఇన్-యాంగ్" సింబల్స్ నిజమైన పరిస్థితిని స్పష్టంగా వివరిస్తాయి. పురుష-తత్వంలో ఎల్లప్పుడూ స్త్రీ తత్వం యొక్క మూలం ఉంటుంది, మరియు స్త్రీ-తత్వంలో ఎల్లప్పుడూ పురుష తత్వం యొక్క మూలం ఉంటుంది. ఎలాగైతే నలుపులో తెల్లచుక్క మరియు తెలుపులో నల్లచుక్క ఉంటాయో అదే విధంగా. కాని ఈ చరిత్ర ముందుకు కొనసాగుతున్నప్పటి నుంచి, స్త్రీ-పురుష తత్వాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక ఐకమత్యాన్ని మరిచిపోయాము మరియు ఈ రెండు శక్తులు, నలుపు మరియు తెలుపులాగా ఒకదానినొకటి వ్యతిరేకాలుగా తయారయ్యాయి. ఈ రెండింటి యొక్క ఐకమత్యం ఎంతోకాలం గుర్తించబడలేదు.

ప్రస్తుతం మీరు ఈ ఘర్షణ చరిత్ర యొక్క చివరిదశలో ఉన్నారు. ఈ దశలో పురుషశక్తి చాలా శతాబ్దాలుగా అణచివేసే పాత్రను పోషిస్తుంది. స్త్రీశక్తిని అణచివేస్తూ, నాశనం చేసే మరియు ధ్వంసం చేసే పాత్రను చాలాకాలం పురుషశక్తి పోషించింది. కాని పురుషశక్తి ఎల్లప్పుడూ ఈ విధంగానే లేదు. పురుషశక్తిని అణచివేస్తూ స్త్రీశక్తి పరిపాలించిన సమయాలు కూడా ఉన్నాయి. కాని ఆ సమయం గతించిపోయింది. కాని, ఈ ఘర్షణ ఒకానొక స్థితి దగ్గర ఒక ప్రత్యేకమైన మలుపును తీసుకుని, ఒకరి పాత్రను ఒకరు మార్చుకున్నారు. అంటే నేరస్థుడి పాత్రను బాధితుడు, బాధితుడి పాత్రను నేరస్థుడు మార్చుకున్నారు. ఇప్పుడు చాలాకాలంగా పురుషశక్తి అధికారంలో ఉంది. పురుషశక్తి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, స్త్రీశక్తిని బలహీనపరిచింది మరియు తన ఉనికి యొక్క కలయికను ఎంత మాత్రం అర్థం చేసుకోలేని విధంగాను తయారుచేసింది. ఎప్పుడైతే స్త్రీ-పురుష శక్తులు ఘర్షణ పడతాయో, అప్పుడు ఈ రెండు శక్తులు విడిపోతాయి. స్త్రీశక్తి ఎక్కడైతే ఎక్కువగా బాధింపబడుతూ, తిరస్కరణలకు లోనవుతూ తనను తాను కోల్పోయినప్పుడు, పురుషశక్తి కూడా క్రూరమైన కఠినత్వం మరియు ఆగ్రహాలలో తనను తాను కోల్పోతుంది. మీ గతంలో జరిగిన చాలా యుద్ధాలలో ఇలా జరగడాన్ని మీరు గమనించి ఉండవచ్చు.

స్త్రీతత్వం మరియు పురుషతత్వం, సహజంగా ఒకదాని మీద ఒకటి ఆధారపడి ఉంటాయి. ఇవి ఒకదానితో ఒకటి యుద్ధం చేసుకున్నప్పుడు విపత్తులు సంభవిస్తాయి. కాని కాలం మారుతోంది. 19వ మరియు 20వ శతాబ్ధాల నుంచి స్త్రీశక్తి తన బలాన్ని తిరిగి పొందుతూ బాధితురాలి పాత్రను అధిగమిస్తోంది. ఈ పునర్జన్మ అనేది స్త్రీశక్తి యొక్క లోతైన అంతరం నుంచి వస్తోంది. చివరిగా ఈ శక్తి తన వ్యక్తిగత తిరస్కరణల యొక్క తుది అంచులకు చేరింది. ఈ స్థితిలో ఆమె తన ముఖాన్ని తాను చూసుకుని: ఇంత వరకూ జరిగింది చాలు అని మరియు దీనిని అధిగమించాలని కోరుకుంది.

నిజానికి బాధితుడు మరియు నేరస్థుడి పాత్రల మధ్య ఎల్లప్పుడూ ఈ విధంగానే సంభవిస్తుంది. బాధితుడు తన పాత్రను ఇకపై అంగీకరించనని తిరస్కరించినప్పుడు మాత్రమే, మార్పు రావడం మొదలవుతుంది. నేరస్థుడు తన పాత్రను అంటిపెట్టుకుని చాలాకాలం ఉంటాడు. ఎందుకంటే తన పాత్రను ఆపివేయడానికి కారణాలు ఉండవు కాబట్టి. బాధితుడు తన పాత్రను అంగీకరించడాన్ని ఆపివేసి, చివరికి తన అధికారాన్ని తిరిగి తీసుకున్నప్పుడే విప్లవం మొదలవుతుంది. ఉదాహరణకి స్త్రీ, తన కుటుంబంలో లేదా సమాజంలోని అన్నిరకాల అణచివేతల యొక్క పరిస్థితులను, అంటే ఎప్పుడైతే "స్త్రీ లేదా మనిషిలోని స్త్రీ తత్వం" ఇకపై అణచివేతను అంగీకరించనని నిర్ణయించుకుంటుందో, అప్పుడే నిజమైన మార్పు సంభవిస్తుంది. ఇటువంటి క్షణాలు వాటంతటవి సంభవించేంత వరకూ కూడా బాహ్యపు కొలమానాలు అనేవి పనికిరానివిగానే ఉంటాయి.

స్త్రీశక్తి మేల్కొంటోంది మరియు దీని స్థితి ప్రకాశిస్తున్నది. నిజానికి ఈ యుగం మరియు ఈ సమయంలో అత్యవసరంగా పరివర్తనం చెందాల్సినది పురుషశక్తియే!! ఇప్పుడు పురుషశక్తి యొక్క కొత్త నిర్వచనానికి సమయం ఆసన్నమైనది. నేను ఈ ఛానెలింగ్‌ని పురుషశక్తి యొక్క పునర్జన్మగా పిలుస్తాను. ఎందుకంటే సమన్వయం మరియు పరిపూర్ణత్వం గల పురుషశక్తితో, స్త్రీశక్తి తిరిగి కలిసినప్పుడు మాత్రమే అది మళ్ళీ వికసించగలదని నేను బలంగా నొక్కి చెబుతున్నాను.

స్త్రీశక్తి గతించిన దశాబ్ధంలోనే మరియు అంతకు మునుపే తన శక్తిని మరియు బలాన్ని తిరిగి పొందింది. ఇది కొత్తదనం మరియు మరింత సమన్వయంతో కూడిన పద్ధతిలో వికసించడం ఆరంభించింది. మీ సమాజంలో స్త్రీ-పురుష శక్తుల మధ్య సమానత్వలోపాలు ఉన్నప్పటికీ, స్త్రీశక్తి యొక్క ఎదుగుదలను ఆపలేరు. కాని

పురుషశక్తి సహకారం లేకుండా స్త్రీశక్తి తన పూర్తి బలాన్ని మరియు జీవశక్తిని పొందలేదు. ఇది వ్యక్తిగత స్థాయికి, అదేవిధంగా సామూహిక స్థాయికి కూడా వర్తిస్తుంది. పురుషశక్తి యొక్క బంధం మరియు సహకారం లేకుండా స్త్రీశక్తి తుది విజయాన్ని సాధించలేదు. ఇది స్త్రీశక్తిలోని బలహీనత వలన ఏర్పడినది మాత్రం కాదు. ఇది స్త్రీ-పురుష శక్తుల యొక్క మూలస్వభావం వలన ఏర్పడినది: ఎందుకంటే ఈ రెండు శక్తులు ఒకదానినొకటి పెన వేసుకుని ఉంటాయి మరియు వీటి పరస్పర సహకారంలోనే, వీటి యొక్క ప్రకాశవంతమైన సామర్థ్యాలు సంపూర్ణత్వాన్ని పొందగలవు కనుక. అందుకనే ఇప్పుడు పురుషశక్తి తనను తాను తిరిగి రూపొందించుకుంటూ మరియు కొత్తదనంలోకి ప్రవేశించడం అనేది చాలా ముఖ్యమైన విషయం.

సామూహికస్థాయిలో స్త్రీ-పురుష శక్తుల మధ్య పరస్పర చర్యను గమనించినట్లయితే, ఇప్పుడు స్త్రీశక్తి ఎదురుచూస్తున్న స్థితిలో ఉంది. ఆమె ఎదురుచూస్తున్నది. ప్రస్తుతం సామూహిక పురుషశక్తిలోని 'కొత్తదనం మరియు పాతదనాల' మధ్య ఘర్షణ జరుగుతోంది. స్త్రీశక్తిని గౌరవించే మరియు అభిమానించే ఒక కొత్త తరంగపు శక్తి, ఇప్పుడు సామూహిక పురుషశక్తిలో ఉదయిస్తోంది. పురుషశక్తి యొక్క ఈ కొత్త తరంగం స్త్రీశక్తితో కలవాలనుకుంటోంది మరియు కొత్తయుగంలోకి కలిసి ప్రవేశించాలని అనుకుంటోంది. కాని అదే సమయంలో పురుషశక్తి యొక్క పాతతరంగం ఇంకా చురుకుగా ఉంటూ దీనిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఇప్పుడు మీ ప్రపంచమంతటా వరుసగా సంభవిస్తున్న టెర్రరిస్ట్ దాడులన్నీ కూడా, ఈ శక్తి యొక్క చర్యలేనని మీరు స్పష్టంగా గుర్తించవచ్చు. పురుషశక్తి తన పాత పాత్రలోని చెడు వైపును, అంటే నిర్దయలేని దురాక్రమణలను చూపిస్తున్నది. ఈ క్రూరమైన దాడులకు పాల్పడే వారిలో తీవ్రమైన మనోభావాలు ఉంటాయి: ఆగ్రహం, కోపం మరియు అదే సమయంలో పూర్తి అధికార లేమి మరియు నిస్సహాయత ఉంటాయి. ఈ పూర్తి నిస్సహాయ స్థితి నుంచి, వీరు మరింత వినాశకరమైన పద్ధతులలో క్రూరత్వాన్ని, అధికార దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తారు. మనం మాట్లాడుకునే ఈ పురుషశక్తి తన మరణ బాధ యొక్క చివరి దశలో ఉంది. సామూహిక స్థాయిలో ముఖ్యమైన మార్పులు సంభవిస్తున్నాయి మరియు మానవత్వం కొత్తశకం యొక్క ప్రవేశద్వారానికి చేరుతోంది.

స్త్రీ-పురుష శక్తుల మధ్య మరింత సమన్వయంతో కూడిన సహకారం పెంపొందుతున్న సమయంలో, ఈ క్రూరమైన శక్తితో ఎలా వ్యవహరించాలి అనే

ఒకానొక ముఖ్యమైన సమస్యను మీరు ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. ఈ పాత పురుషశక్తి, సాధ్యమైనంతగా తన పతనానికి అవసరమైన విధ్వంసాన్ని మరియు వినాశనాన్ని సృష్టించుకుంటోంది. ఇటువంటి శక్తితో మనం ఏం చేయబోతున్నాం? నేను దీని గురించి మీకు వివరిస్తాను: దీని పతనం అనేది వాస్తవమే. పాత పురుషశక్తి తన ఘర్షణలో ఓడిపోయింది, కాని ఇది అంత సులభంగా ఆధీనమవ్వదు మరియు ఇది చివరివరకూ ఆగ్రహం మరియు ఆధిపత్యం యొక్క దౌర్జన్యాలతోనే అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది.

టెర్రరిస్టుల పట్ల మనకున్న సామూహిక అంతర్ వైఖరి మీదే ఇది ఎక్కువగా ఆధారపడుతుంది. క్రూరత్వపు చర్యలకు ప్రతిస్పందనలుగా ఏర్పడే కోపం మరియు అధికారలేమిని, మీ శక్తిక్షేత్రంలోకి అనుమతిస్తారా? అప్పుడు మీరు టెర్రరిస్టుల యొక్క శక్తి క్షేత్రాలకు అనుగుణంగా తెరవబడి ఉంటారు. ఏ క్షణంలో అయితే మీరు వారిపట్ల ఎక్కువగా ఆగ్రహాన్ని మరియు కోపాన్ని వ్యక్తపరుస్తారో, అప్పుడు వారు వారి యొక్క లక్ష్యాన్ని చేరినట్టే. మీరు వారి యొక్క శక్తివంతమైన ప్రకంపనంలోకి గ్రహింపబడతారు మరియు అదే విధంగా మీరు కూడా చంపడాన్ని ప్రోత్సహిస్తారు: అమాయకులను చంపే హంతకులను చంపడానికి. దీని అర్థం మీరు కూడా ఒక విధమైన దౌర్జన్యపు వైఖరిని పొందుతారు అని. ఇది పూర్తిగా అర్థం చేసుకోదగినది, కాని 'ఇక్కడ ఏం సంభవిస్తోంది' అనే విషయాన్ని మీరు ముఖ్యంగా అర్థం చేసుకోవాలి. తీవ్రమైన మనోభావాలు పైకి వస్తున్నప్పుడు, మౌనంగా నిశ్శబ్దంలో ఉండడం అనేది చాలా తెలివైన పని. మీ యొక్క నిశ్శబ్దమైన మరియు తెలిసిన భాగానికి తిరిగి వెళ్ళి ఈ విధంగా అడగండి: నిజానికి ఇక్కడ ఏం జరుగుతోంది? ఈ భాగం మీ మేధాసంపత్తికి మరియు పరిశీలనాదృష్టికి సంబంధించినది. పరిస్థితులను చూడగలిగే మరియు అనుభూతి చెందగలిగే మీ సామర్థ్యం ద్వారా, ఇక్కడ నిజానికి ఏం జరుగుతోందనే విషయాన్ని తెలుసుకోగలరు. ప్రపంచం టెర్రరిస్ట్ దాడుల ద్వారా ఆక్రమించబడదు; ఎందుకంటే పాత పురుషశక్తి, తన సమయాన్ని ముగించుకుని అంతిమ దశకు చేరుతోంది కనుక.

టెర్రరిజం గురించి, పాత పురుషశక్తి ఆగ్రహం యొక్క ఈ వ్యక్తీకరణ గురించి నేను ఒక ముఖ్యమైన సందేశాన్ని చెప్పాలనుకుంటున్నాను: అది జాగురుకతతో ఉండడమే! అధికారలేమి యొక్క మనోభావాల కారణంగా, అంతర్ కేంద్రం నుంచి బయటకు రావడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకోవద్దు, అంటే బానిసత్వానికి గురవుతున్నాననే మనోభావాల నుంచి. ఈ దురాక్రమణ శక్తిని మీ శక్తిక్షేత్రంలోనికి

అనుమతించకపోతే, మిమ్మల్ని ఎవరూ స్పృశించలేరనే విషయాన్ని తెలుసుకోండి. మీరు వీటికి కోపం లేదా ద్వేషంతో ప్రతిస్పందించకుండా ఉన్నప్పుడే, మీరు ఆ శక్తికి ఆకర్షింపబడరు. మీ సొంత కాంతిచేత మీరు సురక్షితంగాను మరియు క్షేమంగాను ఉండగలరు.

నేను ఇప్పుడు సాధారణమైన వ్యక్తిగత స్థాయిపై దృష్టిని కేంద్రీకరించాలని అనుకుంటున్నాను. ఈ స్థాయిలో మీరు, మీ అంతరంలోని స్త్రీ-పురుష శక్తులతో వ్యవహరిస్తారు. ఈ వ్యక్తిగత స్థాయిలో కూడా స్త్రీ-పురుష శక్తుల మధ్య ఘర్షణ ఉంటుంది. సామూహిక స్థాయిలో జరిగే ప్రతీ విషయమూ కూడా, వ్యక్తిగత స్థాయిలో జరిగే ప్రక్రియనే ప్రతిబింబిస్తాయి.

వ్యక్తిగత స్థాయిలోని స్త్రీ-పురుష తత్వాల మధ్య ఉన్న సమన్వయానికి సంబంధించిన ప్రాముఖ్యతను వివరించాలని అనుకుంటున్నాను. దీని కోసం నేను ప్రతీ మానవుడిలో ఉండే శక్తి కేంద్రాల గురించి ఇప్పుడు మాట్లాడాలని అనుకుంటున్నాను. వీటినే చక్రాలు అని కూడా పిలుస్తారు. మీ శరీరంలో ఏడు చక్రాలు ఉంటాయి, మీకు వీటి గురించి తెలుసు. ఇవి వెన్నుముకను ఆనుకుని, వెన్నుముక క్రింది భాగం నుంచి తల భాగం వరకూ ఉంటాయి. నేను క్లుప్తంగా ఈ చక్రాల అన్నింటి గురించి చెప్పాలనుకుంటున్నాను, ఇవి అధికంగా పురుషశక్తి లేదా స్త్రీశక్తి యొక్క గుణాలను కలిగి ఉండడాన్ని నేను మీకు చూపించాలని అనుకుంటున్నాను.

మూలాధారచక్రం లేదా వెన్నుముక క్రిందిభాగంలోని శక్తి కేంద్రం భూమికి కలుపబడి ఉంటుంది. ఈ చక్రంలోని శక్తి భూమిని చేరుతుంది మరియు భూ వాస్తవికత స్థాయిలో, మీ ఆత్మశక్తి భౌతికరూపంలో వ్యక్తీకరించడానికి ఇది మిమ్మల్ని అనుమతిస్తుంది. మూలాధారచక్రంలోని శక్తి ఈ విధంగా బయటకు వచ్చి మరియు వ్యక్తీకరింపబడడాన్ని చూస్తే, ఈ చక్రం అధిక ప్రభావం కలిగిన పురుషచక్రంగా మీరు చెప్పవచ్చు. ఈ చక్రం పూర్తిగా స్త్రీశక్తి కాదు, పురుషశక్తి కాదు. కాని ఈ చక్రంలో పురుషశక్తి ఆధిపత్యం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు.

రెండవ చక్రాన్ని స్వాధిష్టానం అని పిలుస్తారు. ఇది పొత్తికడుపు భాగంలో ఉంటుంది. ఇది మనోభావాలకు కేంద్రంగా ఉంటుంది. ఈ కేంద్రం మనోభావాలను, మన:స్థితులను, మనోభావపరమైన జీవితం యొక్క ఎత్తు-పల్లాలన్నింటిని అనుభవించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇది స్వీకరించే కేంద్రంగా ఉంటుంది.

అందుకనే నేను దీనిని స్త్రీశక్తి కేంద్రంగా పిలుస్తాను, ఈ చక్రంలో అధికంగా స్త్రీశక్తి ప్రవహిస్తుంది.

మూడవచక్రాన్ని మణిపూరకచక్రంగా పిలుస్తారు. ఇది పొట్టభాగంలో ఉంటుంది. ఇది సృష్టికి మరియు స్పందనకు కేంద్రంగా ఉంటుంది. ఈ కేంద్రం, శక్తిని బయటకు ప్రవహింపజేయడానికి మరియు తనను తాను భౌతికవాస్తవంలో వ్యక్తీకరించుకోవడానికి అనుమతిస్తుంది. మీరు దీనిని సూర్యుడితో అంటే, సూర్యుడి నుంచి బయటకు ప్రసరించే కిరణాలతోనూ మరియు పసుపు రంగు సూర్యకాంతి యొక్క శక్తితోనూ పోల్చవచ్చు. (మూడవచక్రం యొక్క సహజమైన రంగు పసుపు.) మణిపూరకచక్రంలో, మీ ఆలోచనలు, ఉద్దేశ్యాలు, కోరికలు బాహ్యాపు వ్యక్తీకరణలుగా పరివర్తనం చెందుతాయి. ఇది బాహ్యంగా వ్యక్తీకరించే భావప్రకటనలకు మరియు స్పందనలకు కేంద్రంగా ఉంటుంది. ఇది అహానికి స్థానంగా, అంటే చెడు భావాలు లేని భూ వాస్తవికత యొక్క వ్యక్తిత్వానికి కూడా కేంద్రంగా ఉంటుంది. ఈ కేంద్రం పురుషశక్తి ప్రభావాన్ని అధికంగా కలిగి ఉంటుంది.

హృదయచక్రం, స్వాధిష్టానచక్రంలాగా స్వీకరణకు కేంద్రంగా ఉంటుంది మరియు ఇది వివిధరకాల శక్తి ప్రవాహాలను కలుపగలిగే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. హృదయచక్రాన్ని అనాహతచక్రం అని కూడా పిలుస్తారు. ఇది క్రింది మూడు చక్రాల శక్తులను (భూవాస్తవికత) మరియు పై మూడు చక్రాల శక్తులను (ఇతరతలాల వాస్తవం) కలుపుతుంది. హృదయచక్రం, మనస్సు (తల) మరియు మనోభావానికి (పొట్ట) మధ్య వారధిలా ఉంటుంది. మీరు హృదయం నుంచి ఇతరులతో కూడా బంధాన్ని ఏర్పరుచుకోగలరు. ఈ చక్రం ద్వారా మిమ్మల్ని మీరు జయించుకోగలరు. హృదయం, అహం యొక్క హద్దులను అధిగమిస్తుంది మరియు ఇది, మీకు బాహ్యంగా ఉన్న దేనినైనా ఏకత్వంతో అనుభూతి చెందే అవకాశాన్ని కలిపిస్తుంది. ఈ చక్రం, మూలచైతన్యాన్ని కూడా ఏకత్వంతో అనుభూతి చెందగలిగే అవకాశాన్ని కలిపిస్తుంది. హృదయచక్రం ఇంటి శక్తికి ప్రవేశద్వారంగా ఉంటుంది. ఇది స్పష్టంగా బంధాలకు కేంద్రంగా ఉంటుంది. అందువలన ఇది స్త్రీశక్తి ప్రభావాన్ని అధికంగా కలిగి ఉంటుంది.

విశుద్ధచక్రం పురుషశక్తిని కలిగిఉంటుంది. ఈ కేంద్రం ద్వారా అంతర్ వాంఛలు, ఉద్దేశ్యాలు మరియు మనోభావాలు అనేవి సంభాషణ, ఏడుపు, నవ్వు, పాడడం మరియు అరవడం మొదలైన వాటిగా భౌతికరూపాన్ని దాలుస్తాయి. ఇక్కడ

అంతర్ జీవితం యొక్క భావం అనేది భాష ద్వారా మరియు మాట ద్వారా బయటకు వ్యక్తపర్చబడుతుంది. ఈ కేంద్రం, మీ అంతర్ జీవితాన్ని భౌతికపరమైన సంకేతాల ద్వారా ఇతరులకు తెలిసేలా చేస్తుంది: పదాలు, ధ్వనులు, భావాలు. ఇది వ్యక్తీకరణకు కేంద్రంగా ఉంటూ, భౌతిక వాస్తవంలో మీ శక్తిని వ్యక్తీకరించడానికి అవకాశాన్ని కలిపిస్తుంది. ఇది సృజనాత్మకతకు కూడా కేంద్రంగా ఉంటుంది.

ఆరవచక్రం, దీనినే "మూడవకన్ను" లేదా "ఆజ్ఞాచక్రం" అని కూడా పిలుస్తారు. ఇది మీ రెండు కనుబొమ్మల మధ్య ఉంటుంది. ఇది స్త్రీ శక్తికి కేంద్రంగా ఉంటుంది. ఇది అతీంద్రియ శక్తులకు సంబంధించిన ఆస్ట్రల్ ట్రావెల్, టెలిపతి, ఛానెలింగ్ మరియు ఇంగితజ్ఞానం యొక్క భావనలకు కేంద్రంగా ఉంటుంది మరియు ఇది భౌతిక ఇంద్రియాల (ఐదు ఇంద్రియాలు) యొక్క పరిమితులను కూడా అధిగమించగలదు. ఈ కేంద్రం ద్వారా మీరు ఇతరుల యొక్క శక్తులను, అంటే మనోభావాలు, బాధలు, ఆనందాలు మొదలైన వాటిని మీ సొంత శక్తులలాగా అనుభూతి చెందగలరు. మనోభావాలను గ్రహించగలిగే ఈ సామర్థ్యంతో, మీరు అహం యొక్క పరిమితులను అధిగమిస్తారు మరియు మీరు ప్రజ్ఞాత్మ స్థితితో బంధాన్ని ఏర్పరుచుకుంటారు.

చివరిగా సహస్రారం – ఇది మీ తలపై ఉంటుంది. ఈ చక్రం స్త్రీశక్తి కాదు, పురుషశక్తి కాదు, లేదా మీరు ఈ చక్రాన్ని రెండింటికి సంబంధించిన చక్రంగా కూడా పిలువవచ్చు. ఈ చక్రంలో, మీరు స్త్రీ–పురుష శక్తుల యొక్క ద్వంద్వత్వాన్ని అధిగమిస్తారు. ఈ చక్రం, ఈ రెండింటి శక్తుల యొక్క అద్భుతమైన కలయికతో ఉంటుంది. ఈ చక్రం సమన్వయంతో ఉన్నప్పుడు, చైతన్యాన్ని ఎంతగా అయితే అంతరంలోకి స్వీకరిస్తుందో, అంతగా బయటకు కూడా విడుదల చేస్తుంది. ఈ చక్రం ద్వారా, మీరు పైన ఉన్న ఇతరతలాలకు లేదా మీ ప్రజ్ఞాత్మ యొక్క లోతైన పొరలకు చేరుతూ, ఆధ్యాత్మిక అర్థాన్ని లేదా సహకారాన్ని అన్వేషిస్తారు. అదే సమయంలో నిశ్శబ్దమైన మరియు ప్రశాంతమైన అంగీకార వైఖరిని కలిగిఉంటారు. ఈ వైఖరి వలన సరైన సమయంలో సమాధానాలను పొందుతారు. ఇది ఒక విధమైన చైతన్యం, ఈ చైతన్యం అధిక కేంద్రీకరణను మరియు అధిక అంగీకార వైఖరులను కలిగి ఉంటుంది. ఈ విధమైన "మన:స్థితి"లో, మీరు స్త్రీ–పురుష శక్తుల మూలస్వభావమైన ఐకమత్యానికి, ప్రజ్ఞాత్మ యొక్క శక్తికి అతి సన్నిహితమవుతారు.

నేను ఇప్పుడు మానవుల యొక్క శక్తివంతమైన శరీరమంతటా, స్త్రీ–పురుష శక్తుల యొక్క కదలికలు ప్రవహిస్తాయనే విషయాన్ని చాలా క్లుప్తంగా వివరించి

చెప్పాను. ఇప్పుడు నేను ముఖ్యంగా క్రింది మూడు చక్రాల గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఈ మూడు చక్రాలు ముఖ్యంగా భూమికి కలుపబడి ఉంటాయి, ఇవి భూ తలంలో ఉన్న వ్యక్తిత్వంతో ఎక్కువగా బంధాన్ని కలిగి ఉంటాయి. క్రింది మూడు చక్రాలకు సంబంధించిన ఈ భాగం అనేది, మీ అంతర్ బాధ యొక్క హీలింగ్‌లో ముఖ్య పాత్రను పోషిస్తుంది. ఎందుకంటే ఈ భాగంలో లోతైన గాయాలు మరియు మనోభావసంబంధిత మచ్చలు ఉంటాయి కాబట్టి.

తరచూ మీరు భూమి మీద ఉన్న వ్యక్తులుగా అనుభూతిచెందుతూ, ఆధ్యాత్మికవేత్తలుగా రూపొందాలని ప్రయత్నిస్తుంటారు. కాని మేము మిమ్మల్ని ఇంకొక విధంగా చూస్తాం. మీరు ఆధ్యాత్మికవేత్తలుగా ఉంటూ, భూ వాస్తవికతకు తగిన విధంగా రూపొందుతున్నట్లు మేము మిమ్మల్ని చూస్తాం. భూమి ఒక అద్భుతమైన గమ్యస్థానం, ఇది రహస్యంగా దాగి ఉన్న వజ్రం లాంటిది. ఈ వజ్రం యొక్క నిజమైన అందం ఇప్పటికి బయట పడలేదు. భూమి అనేది ఏ ఆశయాన్నైనా సాధించగల ఒక గొప్ప స్థలం!

స్వర్గం అనేది మీ జన్మస్థానం. కాని మీరు "ఇల్లు లేదా స్వర్గంగాను", "స్వచ్ఛమైన ఆధ్యాత్మిక ఉనికి యొక్క స్థితిగాను" గుర్తుపెట్టుకున్న మీ పూర్వ చైతన్యపు స్థితికి మళ్ళీ చేరరు. సాహసోపేతంగా కొత్తదనం వైపు అడుగువేయడం అనేది మిమ్మల్ని కొత్తగమ్యాల వైపు తీసుకువెళ్తుంది. మీరు, నిరంతరం సరికొత్త చైతన్యం వైపు విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్నారు. భూమి, ఈ ప్రయాణంలో అతి ముఖ్యమైన భాగంగా ఉంది.

భూమి మీద ఉన్న మీ వ్యక్తీకరణలలోనూ మరియు ఇక్కడ మిమ్మల్ని మీరు వ్యక్తపరుకోవడానికి చేసే మీ ప్రయత్నాలలోనూ, మీరు చాలా బాధలకు గురయ్యారు. మీలో చాలామందికి తిరస్కరణ, క్రూరత్వం మరియు విసిరివేయబడిన అనుభవాలు, క్రింది మూడు చక్రాలలో తీవ్రమైన మనోభావ సంబంధిత గాయాలను సృష్టించాయి. ఈ అనుభవాలు అనేవి గతజన్మలోనూ మరియు అదే విధంగా ఈ జన్మలోనూ సంభవించినవి కావచ్చు. చాలా వరకూ పై మూడు చక్రాలలో ఉన్న శక్తి అడ్డులన్నీ కూడా, క్రింది మూడు చక్రాలలోని మనోభావసంబంధిత గాయాల వలన ఏర్పడినవే.

నేను ఇక్కడ మొదటి చక్రం గురించి కొంచెం ఎక్కువగా ప్రస్తావించాలని అనుకుంటున్నాను. ముఖ్యంగా లైట్‌వర్కర్స్‌కు, భూమితో బంధం అనేది మనోభావపరమైన భారంగా ఉంటుంది. ఎందుకంటే మీరు చాలా జన్మలలో తీవ్రమైన

ప్రతిఘటనలను ఎదుర్కొన్నారు కనుక. వీటికి సంబంధించి మీ అంతరంలో చాలా భయం మరియు అభద్రతాభావం ఉన్నాయి. మీ అంతట మీరు భూమి మీద స్థిరంగా ఉండాలని నిశ్చయించుకున్నప్పుడు మాత్రమే, మీరు వీటిని నయం చేయగలరు. మీ అంతట మీరు భూమి మీద స్థిరంగా ఉండడం, అంటే భూమి మీద ఉన్న శరీరంలో సంపూర్ణంగా ఉంటూ, భౌతికవాస్తవంలో మీ అంతర్ ఉత్తేజాన్ని వ్యక్తపరచడమే. భూమి మీద స్థిరంగా ఉండడాన్ని ప్రతిఘటించేది ఏమిటంటే, మీరు మిగతావారి కన్నా భిన్నంగా ఉండడమే. దీని వలనే మీరు భూమి మీద స్థిరంగా ఉండలేకపోతున్నారు.

రెండవ చక్రం – 'మనోభావసంబంధిత కేంద్రం'. ఈ కేంద్రంలో ఉన్న 'వదిలివేయబడిన లేదా గాయపడిన' (మనోభావపరమైన) భాగాల యొక్క అనుభవాల వలన, మీరు చాలా లోతుగా ప్రభావితం చెందుతున్నారు. మీ వ్యక్తిగత భావప్రకటనను తీవ్రంగా అడ్డుకోవడం వలన కూడా మీరు అధికంగా ప్రభావితం చెందుతారు.

క్రింది రెండు చక్రాలలో తీవ్రమైన గాయాలు ఉండడం వలన, మూడవచక్రం కూడా అధికంగా ప్రభావితం చెందింది. మూడవచక్రం జీవశక్తి, సృజనాత్మక శక్తి మరియు అధికారంతో పని చేస్తుంది. ఇక్కడ అధికారం అంటే ఆగ్రహం కాదు, వినాశనం కాదు. మూడవచక్రం ద్వారా పనిచేసే ప్రతి వ్యక్తి, తనను తాను అధికారం గల అహంకార వైఖరితోగాని, లేదా బలహీనత్వం గల నిరాడంబరత్వంతో గాని వ్యక్తీకరించుకుంటాడు. 'గాయపడిన మొదటి రెండు చక్రాల' నుంచి ఉద్భవిస్తున్న నిస్సహాయ స్థితి యొక్క అనుభూతుల ఫలితంగా, ఈ పై రెండు పద్ధతులు ఏర్పడినాయి. మూడవచక్రంలో, అధికారం మరియు అదుపులతో సమన్వయంగా వ్యవహరించే మార్గాన్ని కనుగొనాలి. దీని అర్థం సమన్వయం గల అహాన్ని కనుగొనడమే.

అహం అనేది సరైనదే! అహం, మీ అంతర్ ఎదుగుదలకు తోడ్పడే పనినే కలిగిఉంది; ఇది మీ చైతన్యానికి దృష్టిని కేంద్రీకరించే విషయంలో సహాయం చేస్తుంది. ఈ అహం మీరు ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంగా రూపొందడానికి మరియు మిమ్మల్ని మీరు వ్యక్తీకరించుకోవడానికి సహకరిస్తుంది. మీరు సర్వవ్యాపకంగా ఉన్న మూల చైతన్యంలో ఒక భాగమై ఉన్నప్పటికీ, మీరు "నేను" అనే ప్రత్యేకమైన చైతన్యంగా కూడా ఉన్నారు. ఈ "నేను–తత్వం" మిగతా వాటన్నింటి కంటే భిన్నంగానూ మరియు ప్రత్యేకంగానూ ఉంటుంది. "నేను లేదా ఆత్మ"ను అధిగమించి ఉన్న మీ ప్రజ్ఞాత్మను చేరడానికి కావలసిన సహకారాన్ని, ఈ 'అహం' మీకు అందిస్తుంది. అహం శక్తి అనేది, మీరు జీవిస్తున్న శక్తివంతమైన వాస్తవంలో పూర్తిగా గౌరవించదగినది మరియు

ఉండవలసినది కూడా. అహం మరియు ప్రజ్ఞాత్మ యొక్క ఆనందకరమైన కలయికలోనే 'నిజమైన అధికారం' ఉంటుంది.

క్రింది మూడు చక్రాల యొక్క భాగం, వ్యక్తిగత హీలింగ్ మరియు అంతర్ ఎదుగుదలకు సంబంధించిన ప్రక్రియలో ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. ఇప్పుడు మీరు కలిగిఉన్న గొప్ప ఆధ్యాత్మికసవాల్ ఏమిటంటే, మీ అంతరంలో ఉన్న గాయపడిన భాగాల పట్ల శ్రద్ధను వహించడమే. భౌతిక వాస్తవాన్ని అధిగమించడానికి ధ్యానం చేయడం, లేదా అస్పష్టమైన ఇతర తలాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేవి మీ ప్రస్తుత లక్ష్యం కాదు. మీలోని గాయపడిన అంతర్ శిశువును క్షుణ్ణంగా అర్థం చేసుకుని మరియు దానికి మీ ప్రేమపూర్వకమైన సహకారాన్ని అందివ్వడమే మీ ప్రధాన లక్ష్యం. మీ అంతర్ శిశువుకు తన అందాన్ని మరియు ఆహ్లాదాన్ని తిరిగి అందించడం కూడా మీ ప్రధాన లక్ష్యమే. ఇదే మీ నిజమైన ఆధ్యాత్మిక ప్రయాణం; దీనిలోనే గొప్ప సంపద ఇమిడి ఉంది. మీ మానవత్వం మరియు అంతర్‌శిశువు యొక్క భాగాల మీద వాత్సల్యాన్ని మరియు గౌరవాన్ని చూపించడం అనేది, మీ దివ్యత్వపు కరుణకు మరియు జ్ఞానవికాసానికి మార్గంగా ఉంటుంది.

ఈ క్రింది చక్రాల యొక్క శక్తివంతమైన భాగంలో ఉన్న వాస్తవం మీద, మీరు దృష్టిని కేంద్రీకరించాలని కోరుకుంటున్నాను. క్రింది మూడు చక్రాలలో, రెండు చక్రాలు పురుషశక్తికి సంబంధించినవే. ముఖ్యంగా మీ ప్రతి ఒక్కరిలో ఉన్న పురుష శక్తులకు హీలింగ్ ఎక్కువగా అవసరమనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది. అందువలన నేను మీకు ఇచ్చే సందేశం ఏమిటంటే: మీలోని పురుషశక్తిని హీల్ చేసుకోండి!

స్త్రీశక్తి చాలా మార్గాలలో కోలుకుంటోంది మరియు ఆమె తనను తాను సంపూర్ణంగాను, అందంగాను వ్యక్తపరుచుకోవడానికి అవసరమైన బలాన్ని పొందుతోంది. స్త్రీ లక్షణాలైన ఇంగితజ్ఞానాన్ని, సున్నితత్వాన్ని మరియు ఐకమత్యాన్ని, వ్యక్తిగత-స్థాయిలోనూ మరియు అదే విధంగా సామూహికస్థాయిలోనూ చాలా ఎక్కువగా ప్రశంసిస్తున్నారు. కాని నిజానికి సమన్వయంతో కూడిన పురుషశక్తి ఎలా ఉంటుందనేది ఏ ఒక్కరికి స్పష్టంగా తెలియదు. 'పురుషుడు లేదా పురుషశక్తి ఇలానే ఉంటుంది' అనే అవాస్తవపు భ్రమలలో ఇరుక్కుపోయారు, అంటే ఈ శక్తి ఎల్లప్పుడూ క్రూరత్వం ద్వారానే అధికారం చలాయిస్తుంది అనే ముద్రలతో గుర్తించబడుతోంది. పురుషశక్తి యొక్క నిజమైన స్వభావాన్ని గుర్తించడం మరియు దానిని వ్యక్తపరచడం అనేది చాలా ముఖ్యమైన విషయం.

ఇప్పుడు స్త్రీతత్వానికి తన పాత్రను సంపూర్ణంగా నిర్వర్తించడానికి, సమన్వయంతో కూడిన పురుషశక్తి యొక్క అవసరం ఉంది. స్త్రీశక్తి, సామూహిక స్థాయిలోనే కాకుండా వ్యక్తిగత స్థాయిలో కూడా, ఈ మార్పుకోసం ఎదురుచూస్తోంది. స్త్రీశక్తి తన బాధితురాలి పాత్ర నుంచి బయటకు వచ్చి తన ఆత్మ గౌరవాన్ని తిరిగి పొందుతున్నది మరియు పురుషశక్తి యొక్క పున: కలయిక ద్వారా, స్త్రీశక్తి తనను తాను శక్తివంతంగాను మరియు ఆనందంగాను వ్యక్తపరుచుకోవాలని ఇప్పుడు కోరుకుంటోంది.

అందువలన, సమన్వయం గల పురుషశక్తి యొక్క అధికారం అంటే ఏమిటి? ఇది స్త్రీ–పురుషుల ఇద్దరిలో ఉన్న పురుషశక్తికి సంబంధించిన విషయం.

హీలింగ్‌ను మరియు సమన్వయాన్ని పొందిన మొదటి చక్రంలోని పురుషశక్తి, మిమ్మల్ని వ్యక్తిగత చైతన్యం వైపు నడిపిస్తుంది. ఇకపై పురుషశక్తి ఏ మాత్రం ఘర్షణ పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇది వ్యక్తిగత చైతన్యం ద్వారా తన ఉనికిని ప్రదర్శిస్తుంది కనుక. ఉనికిని ప్రదర్శించడం అంటే అర్థం మీ పూర్తి ఆత్మ చైతన్యంతో సంపూర్ణంగా ఉండడమని. ఇదే మొదటి చక్రానికి ఉండాల్సిన అత్యవసరమైన లక్షణం. వ్యక్తిగత జాగురుకతతో ఉండడం అంటే అర్థం, మీ పట్ల మీరు ఎరుకతో ఉంటూ అంతర్ కేంద్రంలో ఉండడమే. అంతేకాని, ఇతరుల యొక్క అభిప్రాయాలకు, ఆశించడాలకు లేదా అవసరాలకు మిమ్మల్ని మీరు కోల్పోవడం మాత్రం కాదు. ఇతరులతో బంధాన్ని కలిగి ఉండడానికి మరియు మీతో మీరు నిజాయితీగా ఉండడానికి మధ్య సమన్వయాన్ని కనుగొనాలి. సమన్వయం గల మొదటి చక్రంలోని పురుషశక్తి, మీరు ఇతరులతోనూ మరియు బయటి ప్రపంచంతోనూ కలిసినప్పుడు, మీ పట్ల మీరు ఎరుకను కోల్పోకుండా, మీ అంతర్ కేంద్రంలో ఉండడానికి మీకు సహకరిస్తుంది.

ఈ వ్యక్తిగత చైతన్యం యొక్క లక్షణాన్ని అభివృద్ధి చేసుకోవడం అనేది అత్యవసరం. ఎందుకంటే ఇది మీ స్త్రీశక్తిని సంరక్షిస్తూ, దానికి మార్గదర్శకత్వాన్ని చూపిస్తుంది కాబట్టి. స్త్రీశక్తి సహజంగా ఇతరులతో(ఇతర ప్రాణులతో కూడా) సంబంధాన్ని ఏర్పరుచుకోవడంలో ఆసక్తిని చూపిస్తుంది మరియు వారితో ప్రేమగానూ మరియు వాత్సల్యంగానూ ఉంటుంది. పురుషశక్తి హద్దులను ఏర్పరుస్తూ, ఇచ్చే ప్రవాహం మరియు తీసుకునే ప్రవాహాల మధ్య సమన్వయాన్ని కనుగొనడానికి సహాయం చేస్తుంది. మొదటి చక్రంలోని పురుషశక్తి, ప్రవహించే గుణం మరియు అంగీకార వైఖరి గల

స్త్రీ శక్తులకు వెనుక ఉండి నడిపించే మార్గదర్శకుడి పాత్రను సంతృప్తికరంగా పోషిస్తుంది. మీ అంతట మీరుగా ఇంటికి చేరడానికి మరియు మీరు కలిగిఉన్న బంధాలన్నింటి యొక్క శక్తులను విడుదల చేయడానికి ఇదే మూలంగా ఉంటుంది.

మూడవచక్రం ఇదే పాత్రను మరొక ప్రత్యేకమైన మార్గంలో పోషిస్తుంది. ఈ చక్రం, నేను ముందు చెప్పినట్టుగా అహం శక్తికి కేంద్రంగా ఉంటుంది. ఇప్పటికి మీరు అహానికి సంబంధించిన అభిప్రాయాలలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లైట్‌వర్కర్స్ ఆత్మలు, మిగతావారి కంటే ఎక్కువగా ఇచ్చే గుణాన్ని కలిగిఉంటారు మరియు వీరు వ్యక్తిగత స్థితిని అధిగమించే శక్తులకు అధిక ప్రాముఖ్యతను ఇస్తారు. కాని ఇది సరైనది కాదు. మీరు జీవిస్తున్న ప్రపంచంలో స్త్రీ–పురుష శక్తులు రెండూ కలిసి నాట్యమాడుతూ, సృష్టికి మూలమైన పునాదులను ఏర్పరుస్తాయి. ఒక శక్తి బంధాన్ని ఏర్పరుస్తూ, ఐకమత్యాన్ని అన్వేషిస్తుంది. మరొక శక్తి విభజిస్తూ, ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సృష్టిస్తుంది. మొదటిశక్తి ఎంత ముఖ్యమైనదో, రెండవశక్తి కూడా అంతే ముఖ్యమైనది.

పురుషశక్తితో ప్రశాంతంగా ఉంటూ, మీ ప్రత్యేకతను, మీ వ్యక్తిత్వాన్ని మరియు మీ "నేను–తత్వాన్ని" కౌగిలించుకోవడం అనేది చాలా ముఖ్యం. మీ జీవితంలో "ఏకాంతం" అనేది అత్యవసరమైనది. దీనికి ఒంటరితనంతో ఏమాత్రం సంబంధం లేదు, కాని ప్రత్యేకమైన వ్యక్తిత్వం గల "నేను"తో, ఈ ఏకాంతానికి అన్ని విధాల సంబంధం ఉంది. ఈ ఏకాంతాన్ని కౌగిలించుకోవడం అనేది ఇతరులతో లోతైన బంధాలను అనుభవించే విషయంలో ఎంతమాత్రం అడ్డుగా ఉండదు. మీరు నిజంగా మీ వ్యక్తిత్వాన్ని అంగీకరించినట్లయితే, మీరు అధిపతిగాను, స్వతంత్రకుడిగాను మరియు సృజనాత్మకత గల వ్యక్తిత్వంగాను తయారవుతారు. మీరు ఈ స్థితిలో ఎవరితోనైనా లేదా ఏ వస్తువుతోనైనా మీ శక్తిని లోతుగా పంచుకొనగలిగే సమర్ధతను కలిగి ఉంటారు. ఎందుకంటే మీరు ఈ విధంగా పంచుకోవడంలో మీ వ్యక్తిత్వాన్ని మరియు మిమ్మల్ని మీరు కోల్పోతాననే భయాన్ని అధిగమిస్తారు కనుక.

మూడవ చక్రం యొక్క పురుషశక్తి, మీరు సృజనాత్మకంగాను మరియు అధిపతిగాను తయారవ్వడానికి సహకరిస్తుంది. అందుకనే మీలోని స్త్రీ శక్తి దీని కోసం ఎదురుచూస్తున్నది. మీ హృదయపూర్వక ఉత్తేజం, తన గురించి భౌతికస్థాయిలో అందరికి తెలియాలని కోరుకుంటోంది. ఇది అతి సాధారణమైన భౌతికపద్ధతిలో బయటకు రావాలని మరియు భూమి మీదకి ప్రేమ మరియు సమన్వయం యొక్క అలలను తీసుకురావాలని కోరుకుంటోంది. స్త్రీశక్తి, కొత్త యుగం యొక్క వాహకంగా

ఉంటోంది. కాని స్త్రీశక్తి తనను తాను వ్యక్తపరుచుకోవడానికి మరియు భౌతిక వాస్తవంలో స్థిరంగా ఎదగడానికి, సమన్వయంతో కూడిన పురుషశక్తి యొక్క అవసరం ఉంది. అందుకనే మొదటిచక్రం మరియు మూడవచక్రం యొక్క శక్తుల హీలింగ్‌కు చాలా ప్రాముఖ్యత ఉంది.

'ఆరోగ్యకరమైన అహంశక్తి', 'హీల్ అయిన మూడవచక్రం' అనేవి ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయి. మొదటి చక్రం వ్యక్తిగత-చైతన్యానికి, మూడవ చక్రం ఆత్మ విశ్వాసానికి సంబంధించినవి. ఇది మీరు చూసే పొగరు లేదా గర్వానికి సంబంధించిన అహం కాదు. ఇది కేవలం మిమ్మల్ని మీరు విశ్వసించుకోవడానికి సంబంధించినదే: "నేను ఇది చేయగలను అని అనుభూతి చెందడమే!" మీ లోతైన ఉత్తేజాల పట్ల మరియు మీ సృజనాత్మక సామర్థ్యాల పట్ల ఎరుకను పొందుతూ, వాటికి అనుగుణంగా నటించడమే. మీ శక్తులను మీ ద్వారా బయటకు ప్రవహించనివ్వండి. మీ సహజమైన సామర్థ్యాలను మరియు నైపుణ్యాలను విశ్వసించండి. మీరు ఎవరనే దానిని విశ్వసించండి మరియు మిమ్మల్ని మీరు ఈ ప్రపంచానికి చూపించండి! ముఖ్యంగా లైట్‌వర్కర్స్ అయిన మీరు, మీ అంతరంలో అధిక అంతర్జ్ఞానాన్ని మరియు మేధాసంపత్తిని కలిగిఉన్నారు. మిమ్మల్ని మీరు ఏ మాత్రం దాచి పెట్టుకోకుండా ప్రపంచానికి చూపించాల్సిన సమయం ఇదే. ఇదే ఆ సమయం. ఇదే మీ గమ్యం. దీనిలోనే మీరు, మీ గొప్ప సంపూర్ణత్వాన్ని కనుగొంటారు.

మీ అంతరంలోని పురుషశక్తిలో ప్రశాంతతను కనుగొనండి. మీ కాళ్ళ మీద మీరు నిలబడడానికి గాని, సమృద్ధిని అందుకోవడానికి గాని మరియు మీ పట్ల మీరు శ్రద్ధను వహించడానికి గాని ఏమాత్రం సంకోచించవద్దు. మీరు స్వచ్ఛమైన మరియు తటస్థమైన ఎరుక గల స్థితిలో అహంకారపూరితంగా ఉండండి. మీరే ఒక అహం, మీరే ఒక వ్యక్తిత్వం. మిమ్మల్ని మీరు ఎల్లప్పుడూ క్షమించుకోవాల్సిన మరియు అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రతీ విషయాన్ని భరించడం అనేది ఆధ్యాత్మికత కాదు. మీరు కొన్ని సమయాలలో స్పష్టంగా "కుదరదు" అని చెప్పడానికి గాని, లేదా "వీడ్కోలు" చెప్పడానికి గాని సంకోచించవద్దు. మీరు మీరుగా ఉండడానికి సాహసించండి. ఏ మాత్రం భయం లేదా నేరం చేశాననే భావన లేకుండా, దీనిని చేయడానికి ప్రయత్నించండి. పురుషశక్తులైన వ్యక్తిగత-చైతన్యం మరియు ఆత్మవిశ్వాసం, మిమ్మల్ని అధిపతిగా రూపొందిస్తూ, మీ స్త్రీశక్తి యొక్క సున్నితమైన పుష్పం వికసించడానికి మరియు ప్రకాశించడానికి ఎలా సహకరిస్తున్నాయో అనుభూతి చెందండి.

ఇదంతా శక్తుల మధ్య ఉన్న సహకారం గురించే. సుదీర్ఘమైన మరియు బాధాకరమైన ఘర్షణల వలన, స్త్రీ-పురుష శక్తులు రెండూ కలిసి చాలా లోతులలోనికి పడిపోయాయి. ఇవి రెండూ కలిసి పైకి రావలసిన అవసరం కూడా ఉంది. ఎందుకంటే ఒకటి లేకుండా మరొకటి సమన్వయాన్ని పొందలేవు కనుక. ఇప్పుడు స్త్రీశక్తి శత్రుత్వం మరియు అణచివేతల యొక్క చితాభస్మం నుంచి ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉంది, అందువలన ఇప్పుడు పురుషశక్తి యొక్క పునర్జన్మ అనేది అత్యవసరమైనది. పురుషశక్తి యొక్క పునర్జన్మ, ముందుగా మీ ప్రతి ఒక్కరి వ్యక్తిగత స్థాయిలో (స్త్రీ మరియు పురుషుడు) వ్యక్తీకరించబడుతుంది. తర్వాత ఇది సామూహిక స్థాయిలో కనబడుతుంది. మీరందరూ మీ అంతరంలోని ఈ ప్రాచీన శక్తులకు సంరక్షకులుగా ఉన్నారు, మరియు ఈ రెండింటి శక్తుల భాగస్వామ్యాన్ని సమానంగాను మరియు ఆనందంగాను చేయడం అనేది మీ జన్మహక్కు.

* * * *

## మనోభావాలతో వ్యవహరించే విధానం

డియర్ ఫ్రెండ్స్, నేను ఈ విధంగా మిమ్మల్ని కలవడం మరియు మీతో సంభాషించడం నాకు చాలా ఆనందంగా ఉంది. నేను మిమ్మల్ని కలిసిన ప్రతీసారి నా కృతజ్ఞతలను తప్పక తెలియజేస్తాను. ఎందుకంటే ఇది నాకు అతి విలువైనది కాబట్టి. నా సొంత వాస్తవతలం నుంచి కన్నా కూడా, ఈ సమావేశాల ద్వారా నేను మీకు అతి సన్నిహితమవ్వగలను. అందువలన ఈ సమావేశాలను నేను గౌరవిస్తాను.

నేను ఎల్లప్పుడూ మీ హృదయాలలోనే జీవిస్తాను. మీరు నా శక్తిని గ్రహించే, మీ కాలంలోని సమయం గురించి నేను ఎదురుచూస్తాను. నా శక్తి లేదా క్రీస్తుశక్తి ఈ సమయంలో జన్మించబోతోంది, ఈ శక్తి కేవలం నాకు మాత్రమే సొంతం కాదు. ఇది కేవలం భూమి మీద ఒకానొకప్పుడు జీవించిన ఒక మనిషికి సంబంధించిన శక్తి ఎంత మాత్రం కాదు. ఇది ఒక సమిష్టి శక్తిక్షేత్రం, మీరు కూడా ఈ శక్తిక్షేత్రంలో భాగమే.

ఒకానొకప్పుడు మీరందరూ ఒక వాగ్దానాన్ని చేశారు. మీరు ఈ శక్తిని భూ వాస్తవంలోకి తీసుకువచ్చి, దానిని ఇక్కడ విస్తరింపజేయాలనే వాంఛను కలిగి ఉండేవారు. మీరు ఈ లక్ష్యం మీదే చాలా జన్మలు, చాలా శతాబ్దాలు పనిచేశారు. మీరు క్రీస్తుశక్తి యొక్క బీజాన్ని మీ అంతరంలో జన్మింపజేసే ప్రక్రియలో నిమగ్నులై ఉన్నారు మరియు నేను మీకు సహాయం చేస్తున్నాను. నేను కొత్తశకం యొక్క ఆవిర్భావానికి ముందు నుంచే ఉన్నాను, కాని క్రీస్తుబీజాన్ని నాటడం అనేది ఒక సమిష్టికృషి. మీ ద్వారా ఇక్కడ సృష్టింపబడిన శక్తిక్షేత్రం వలనే నేను భూమి మీదకి రావడం సాధ్యమయ్యింది. మనమందరం కలిసి పనిచేస్తున్నాము, మనమందరం ఒకటే. అందువలన నేను మీ అందరికీ అందుబాటులోనే ఉంటాను. నేను మీ అందరికీ సేవచేస్తాను.

నేను ఈ రోజు మీ అందరిని చాలా లోతుగా ప్రభావితం చేస్తున్న మరియు మీ నిత్యజీవితంలో తరచూ సంభవిస్తున్న ఒక ముఖ్యమైన అంశం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఈ అంశం మనోభావాలతో వ్యవహరించే విధానం గురించి.

నేను ఇంతకు ముందు ఛానెలింగ్‌లో స్త్రీ–పురుష శక్తుల గురించి మరియు అవి మీ శక్తిక్షేత్రాలు మరియు చక్రాల ద్వారా పనిచేసే విధానం గురించి చెప్పాను.

నేను క్రింది మూడుచక్రాల హీలింగ్ యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా వివరించాను. వీటి యొక్క హీలింగ్ ద్వారానే మీరు సంపూర్ణతను పొందగలరని తెలియజేశాను. ఆధ్యాత్మిక జిజ్ఞాస వలన మీలో కొంతమంది పై మూడు చక్రాలకు ప్రాముఖ్యతను ఇస్తూ, క్రింది మూడు చక్రాలను వదిలి వేస్తున్నారు మరియు వీరు ఆలోచనలు మరియు అనుభూతుల స్థాయి నుంచి కూడా వీటిని తొలగిస్తున్నారు అందువలన నేను దీనినే ప్రధాన అంశంగా భావించి చెప్పాలనుకున్నాను.

హృదయం, మూడవకన్ను, సహస్రారం మీకు ఆకర్షణీయంగా ఉంటాయి, ఎందుకంటే ఈ శక్తికేంద్రాలు మిమ్మల్ని ఉన్నత తలాలతో కలుపుతాయి కనుక. ఇవి మీకు చాలా సహజంగా ఉంటాయి. కాని నిజమైన విజయావకాశాలు క్రిందిస్థాయిలో, అంటే భూమికి సన్నిహితంగా ఉన్న క్రింది మూడుచక్రాలలోనే లభిస్తాయి.

స్వేచ్ఛ మరియు సంపూర్ణత్వానికి సంబంధించిన మీ ఎదుగుదల ప్రక్రియలో మనోభావాలు అతిముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. మీరు ఆధ్యాత్మిక వేత్తలు. మీరు భూ వాస్తవం యొక్క సాంద్రత మరియు తీవ్రత గురించి తెలియని వాస్తవం యొక్క తలం నుంచి వచ్చారు. అందువలన దీనితో వ్యవహరించడం అనేది మీకు చాలా కష్టంగా ఉంది.

మీరు చాలా జన్మల నుంచి భూమి మీద మీ శక్తిని వ్యక్తపరచడానికి ప్రయత్నించారు. ఈ భావప్రకటనలోనూ, భూమిపై మీ శక్తిని ఛానెలింగ్ చేసే విషయంలోనూ, మీ అంతరంలో చాలా గాయాలు ఏర్పడ్డాయి. మీ మనోభావ శరీరం గాయాలు మరియు బాధలతో నిండి ఉంది. అందువలన నేను దీని గురించి ఈ రోజు మీతో మాట్లాడాలని అనుకుంటున్నాను.

అంతర్ ఎదుగుదల యొక్క మార్గంలో పయనిస్తున్న వారికి ఈ మనోభావాల యొక్క ప్రాముఖ్యత గురించి తెలుస్తుంది: మీరు వీటిని అణచివేయకుండా, వీటితో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, చివరికి వీటిని మీరు విడుదల చేయగలగాలి. కాని ఇవి నిజానికి ఎలా పనిచేస్తాయనేది ఎల్లప్పుడూ స్పష్టంగా ఉండదు.

నేను ముందుగా మనోభావాలకి(ఎమోషన్స్) మరియు అనుభూతులకి(ఫీలింగ్స్) మధ్య తేడాను తెలియజేయాలని అనుకుంటున్నాను. నేను ఇక్కడ పదాలకి లేదా గుర్తులకు ప్రాముఖ్యతను ఇవ్వడం లేదు. మీరు బహుశా వీటిని వేరే పేరులతో పిలవవచ్చు, నేను ముఖ్యంగా, 'మనోభావాలను' తప్పుగా అర్థం

చేసుకున్న శక్తుల యొక్క భావప్రకటనలుగాను, మరియు 'అనుభూతులను' ఉన్నతజ్ఞానం యొక్క శక్తి రూపాలుగాను విభజించి వీటి మధ్య తేడాను మీకు తెలియజేయాలని అనుకుంటున్నాను.

అనుభూతులనేవి మీకు గురువులు మరియు మనోభావాలనేవి మీ పిల్లలు.

మనోభావాలనేవి శక్తులుగా మీ భౌతికశరీరంలో స్పష్టమైన వ్యక్తీకరణను కలిగిఉంటాయి. మనోభావాలు, మీరు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయిన పరిస్థితుల యొక్క ప్రతిస్పందనలు. మీరు క్రోధాన్ని  అదుపు చేసినపుడు ఏం జరుగుతోందో ఒకసారి గమనించండి. ఉదాహరణకి మిమ్మల్ని ఎవరైనా అనుకోకుండా బాధించినపుడు, మీ మీద మీకు కోపం వస్తుంది. దీని వలన మీ శరీరం యొక్క కొన్ని భాగాలలో ఆందోళన లేదా ఒత్తిడి ఏర్పడడాన్ని మీరు స్పష్టంగా అనుభూతి చెందగలరు. ఈ శారీరక ఒత్తిడి లేదా ఆందోళన అనేవి మీ యొక్క శక్తివంతమైన గాయాలను అనుసరిస్తూ, మీరు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయిన విషయాలను మీకు చూపిస్తాయి. ఒక శక్తి మీ వైపు అకారణంగా వస్తున్నట్లు మీరు అనుభూతి చెందుతారు. అకారణంగా సంభవించిందనే భావన, మీ మనోభావం ద్వారా బయటకు వెల్లడి అవుతోంది. మనోభావం అనేది మీకు అర్థంకాని విషయాల యొక్క భావప్రకటనలు, ఇది ఒక శక్తివంతమైన ప్రేలుడు మరియు విడుదల.

ఇది సంభవించినపుడు మీరు ఈ రకమైన ఆలోచనలను ఎదుర్కొనవచ్చు. నేను ఈ మనోభావంతో ఏం చెయ్యబోతున్నాను? నా అసలైన ప్రవర్తన యొక్క ఆధారంగా నేను దీనితో ఉండగలనా? ఇతరులకు నేను స్పందించే విధానంలో దీనిని ఒక ఇంధనంగా ఉపయోగించుకుంటానా లేదా నేను ఈ మనోభావాన్ని అలాగే ఉండనిస్తూ, వేరే వాటిపై నా చర్యలను ఆధారపడనివ్వాలా?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు, నేను అనుభూతుల యొక్క స్వభావం గురించి చెప్పాలనుకుంటున్నాను.

ముఖ్యంగా మనోభావాలనేవి తప్పుగా అర్థం చేసుకున్న విషయాల యొక్క ప్రతిస్పందనలు మరియు మీరు వీటిని మీ శరీరంలో స్పష్టంగా గుర్తించగలరు. కాని అనుభూతులు అనేవి ప్రత్యేకమైన స్వభావాన్ని కలిగి ఉంటాయి మరియు అదే విధంగా ఇవి ప్రత్యేకంగా గుర్తించబడుతుంటాయి. అనుభూతులు, మనోభావాల కన్నా చాలా నిశ్శబ్దంగా ఉంటాయి. ఇవి ఆత్మ యొక్క గుసగుసలు, ఇవి సున్నితమైన

కదలికల ద్వారా, అంతర్జ్ఞానం ద్వారా లేదా అకస్మాత్తుగా కలిగే సహజమైన ఇంగితజ్ఞానం ద్వారా మిమ్మల్ని చేరుతుంటాయి, ఇవి మీకు తర్వాత చాలా తెలివిగా కనిపిస్తాయి.

మనోభావాలు ఎల్లప్పుడూ చాలా తీవ్రతను కలిగి ఉంటాయి. ఉదాహరణకి ఆందోళన, భయం, క్రోధం లేదా తీవ్రమైన బాధ మొదలైనవి. మనోభావాలు మిమ్మల్ని పూర్తిగా ఆక్రమిస్తూ, మీ ఆధ్యాత్మిక కేంద్రం నుంచి మీరు బయటకు వచ్చేలా చేస్తాయి. మీరు తీవ్రమైన మనోభావాలను కలిగి ఉన్నప్పుడు, మీరు ఒక విధమైన శక్తితో పూర్తిగా నింపబడి ఉంటారు. ఈ శక్తి మిమ్మల్ని మీ కేంద్రం నుంచి మరియు మీ అంతర్ స్పష్టత నుంచి బయటకు వచ్చేలా చేస్తుంది. మనోభావాలనేవి సూర్యుని ముందు కమ్ముకుని ఉన్న మేఘాల్లాంటివి.

అందువలన నేను మనోభావాలకి వ్యతిరేకంగా చెప్పాలనుకోవడం లేదు. మనోభావాలను అణిచి వేయకూడదు, ఇవి చాలా విలువైనవి. ఎందుకంటే ఇవి మీ గురించి మీరు లోతుగా తెలుసుకోవడానికి సహకరిస్తాయి కనుక. నేను మనోభావాల యొక్క స్వభావం ఏమిటనేది చెప్పాలనుకుంటున్నాను: ఇవి తప్పుగా అర్థం చేసుకోబడిన విషయాల యొక్క భావప్రకటనలు. మనోభావాలు ముఖ్యంగా మిమ్మల్ని మీ కేంద్రం నుంచి బయటకు తీసుకువస్తాయి.

అనుభూతులు మిమ్మల్ని మీ అంతరం యొక్క లోతులలోకి, మీ కేంద్రంలోకి తీసుకువెళతాయి. అనుభూతులు, మీ ఇంగిత జ్ఞానానికి(ఇన్ట్యూషన్) అతిసన్నిహితంగా ఉంటాయి. అనుభూతులు ఉన్నతమైన అవగాహనను వ్యక్తపరుస్తాయి, మరియు ఇవి మనోభావాలను మరియు మనసును రెండింటిని అధిగమించే జ్ఞానాన్ని తెలియజేస్తాయి.

అనుభూతులు అనేవి శరీరానికి ఆవలి వైపున, ఇతర తలాలలో సృష్టించబడతాయి. అందుకనే వీటిని భౌతికశరీరానికి సంబంధించిన ఏ ఒక్క భాగంలోనూ స్పష్టంగా గుర్తించలేము. మీరు మన:స్థితిని లేదా వాతావరణాన్ని అనుభూతి చెందినప్పుడు, లేదా మీరు భవిష్యత్తులో జరగబోవు సంఘటనకు సంబంధించిన భావాలను కలిగి ఉన్నప్పుడు, ఆ స్థితిలో ఏం జరుగుతోందో ఒకసారి గమనించి చూడండి. మీ అంతరంలో వీటి గురించి తెలిసిన అనుభూతి కలుగుతుంది. ఆ అనుభూతి బయటి నుంచి వచ్చినట్టుగా కనిపిస్తుంది, కాని అది బయట నుంచి వచ్చిన దానికి మీ ప్రతిస్పందన మాత్రం కాదు. ఇది శూన్యం నుంచి వచ్చినది. ఆ సమయంలో, మీ హృదయచక్రంలో ఏదో తెరవబడినట్టుగా మీరు అనుభూతి చెందవచ్చు.

మీరు ఈ విధమైన అంతర్ జ్ఞానాన్ని లేదా ఎరుకను పొందిన క్షణాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకి మీరు అసలు ఎప్పుడూ మాట్లాడని వ్యక్తి గురించి మీకు ఏదో తెలిసినట్టుగా అనిపించవచ్చు. మీ ఇద్దరి గురించి మీరు ఏదో భావనను అనుభూతి చెందగలరు. ఆ తర్వాత అదే మీ బంధంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. ఈ విధమైన విషయాలను మాటలలో తెలపడం అంత సులభం కాదు. ఇది కేవలం ఒక అనుభూతి. వీటిని మనస్సు ద్వారా అర్థం చేసుకోవడం కష్టం (ఈ విధమైన అనుభూతుల విషయంలో మీ మనస్సు చాలా సందేహాలను పొందుతూ, పరిస్థితులు సరిగ్గాలేవని మరియు పిచ్చిగా ఉన్నాయని మీకు చెబుతుంది).

నేను వేరొక శక్తి గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను, అది చాలా వరకూ మనోభావాల యొక్క స్వభావాన్ని కంటే అనుభూతుల స్వభావాన్ని ఎక్కువగా కలిగి ఉంటుంది. ఈ శక్తి పేరు ఆనందం. ఆనందం భావావేశాలను అధిగమించే ఒక సంఘటనగా ఉండగలదు. కొన్నిసార్లు మీరు అంతరంలో ఒక విధమైన ఆనందాన్ని అనుభూతి చెందగలరు. ఇది ఏ ప్రత్యేకమైన కారణం లేకుండా మీకు కలుగుతుంది. మీ అంతరంలో దివ్యత్వం యొక్క అనుభూతిని పొందుతారు మరియు మీరు కలిగిఉన్న అన్నింటితో అతిసన్నిహితమైన బంధాన్ని కలిగిఉన్నట్లు అనుభూతి చెందుతారు. మీరు ఆశించడానికి తక్కువ ప్రాముఖ్యతను ఇచ్చినప్పుడే మీరు ఈ అనుభూతి పొందవచ్చు. ఉన్నతమైన వాస్తవం మిమ్మల్ని స్పృశించినప్పుడు లేదా మీరు ఉన్నతమైన వాస్తవాన్ని స్పృశించినప్పుడు ఈ అనుభూతిని పొందుతారు. కాని అనుభూతులను అంత సులభంగా పొందలేరు. ఇవి మీ దగ్గరకు 'శూన్యం' నుంచి వస్తున్నట్లుగా అనిపిస్తాయి. మనోభావాలు చాలా వరకూ ఒక స్పష్టమైన ఆకస్మిక కారణాన్ని కలిగి ఉంటాయి: ఇవి బాహ్యప్రపంచంలో ఒక తక్షణ కారణాన్ని కలిగిఉంటూ, మీ భావావేశాలను ప్రభావితం చేస్తాయి.

అనుభూతులు, మీ ప్రజ్ఞాత్మ యొక్క తలంలో సృష్టించబడతాయి. మీ హృదయంలోని ఈ గుసగుసలను పొందడానికి మీరు నిశ్శబ్దంగా ఉండాలి. మనోభావాలు ఈ అంతర్ నిశ్శబ్దాన్ని మరియు ప్రశాంతతను ఆటంకపరచగలవు. అందువలన మీరు వీటిని హీల్ చేయడానికి మరియు వీటిని అణచివేయకుండా విడుదల చేయడానికి, మీరు మనోభావపరంగా ప్రశాంతంగా ఉండడం అనేది చాలా ముఖ్యం. మీ అనుభూతుల ద్వారా మీ ఆత్మతో బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడే సమన్వయంతో కూడిన నిర్ణయాలను మీరు తీసుకోగలరు.

మీరు ప్రశాంతంగాను మరియు మౌనంగాను ఉండడం వలన, ఆ సమయంలో మీకు సరైన దానిని మీ నిజతత్వంతో అనుభూతి చెందగలరు. మనోభావాలను ఆధారంగా తీసుకునే నిర్ణయాలు మీ ఆత్మకేంద్రంతో ఏ మాత్రం బంధాన్ని కలిగి ఉండవు. మొదటిగా మీరు మనోభావాలను విడుదల చేస్తూ, మీ అంతర్ కేంద్రంతో బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడు మీలో స్పష్టత ఏర్పడుతుంది.

ఇప్పుడు నేను మీ మనోభావాలతో ఎలా వ్యవహరించాలి అనే ప్రశ్నకు వివరణను ఇవ్వాలని అనుకుంటున్నాను.

అనుభూతులు మీ గురువులని మరియు మనోభావాలు మీ పిల్లలు అని నేను మీకు చెప్పాను. మనోభావపరంగా ఉండడం మరియు పిల్లవాడిగా ఉండడం అనే ఈ రెండు సమాంతరాల మధ్య ఆకర్షణ ఉంటుంది. మీ అంతర్‌శిశువు మీ మనోభావాలకు మూలంగా ఉంటుంది. మీ మనోభావాలతో వ్యవహరించే పద్ధతి మరియు మీ పిల్లలతో వ్యవహరించే పద్ధతికి మధ్య ఒక ఆకర్షణీయమైన పోలిక ఉంది.

పిల్లలు వారి యొక్క మనోభావాల విషయంలో చాలా నిజాయితీగాను మరియు చురుకుగాను ఉంటారు. వీరిని పెద్దలు ప్రోత్సహించేంత వరకూ కూడా, వీరి యొక్క మనోభావాలను అణచిపెట్టరు లేదా దాచిపెట్టరు. నిజానికి పిల్లలు, వారి యొక్క మనోభావాలను సహజంగా వ్యక్తపరుస్తారు. దీని అర్థం వీరు మనోభావాలతో సమన్వయంగాను లేదా సరిగ్గాను వ్యవహరిస్తున్నారని అర్థం కాదు. పిల్లలు వారి యొక్క మనోభావాలను (కోపం, భయం లేదా బాధ) వారితో మోస్తుంటారని ప్రతి ఒక్కరికి తెలుసు. వీరు తరచూ సంభవించే మనోభావాలను అంత త్వరగా ఆపలేరు. ఇలాంటి పరిస్థితులలో, పిల్లలు వారి యొక్క మనోభావాలలో పూర్తిగా మునిగిపోయి ఉంటూ, సమన్వయాన్ని కోల్పోతారు. అంటే ఆత్మ కేంద్రం నుంచి బయటకు వస్తారు అని.

ఈ హద్దులు లేని మనోభావాలకు ఒకానొక ముఖ్యమైన కారణం ఏమిటంటే, వీరు ఏ మాత్రం అవధులు లేని ప్రపంచాన్ని అప్పుడే వదిలి బయటకు వచ్చారు కాబట్టి. ఈ భౌతికశరీరంలో మరియు భౌతికతలంలో ఉన్న సరిహద్దులు, ఆటంకాలు ఇతర తలాలలో ఏ మాత్రం ఉండవు. పిల్లల యొక్క మనోభావాలు ఎల్లప్పుడూ భౌతికవాస్తవం యొక్క విషయాలను తప్పుగా అర్థం చేసుకున్న వాటి యొక్క స్పందనలుగా ఉంటాయి. అందువలన ఈ పిల్లలు ఎదుగుతున్నప్పుడు, వీరికి ఈ మనోభావాలతో

వ్యవహరించడానికి సహాయం మరియు సహకారం కావాలి. ఇది భూమి మీద సమన్వయంగా రూపాంతరం చెందే ప్రక్రియలో భాగమే.

మీ యొక్క మనోభావాలతోనూ లేదా మీ పిల్లల యొక్క మనోభావాలతో ఎలా వ్యవహరిస్తారు?

మనోభావాలను అణచి వేయకూడదు లేదా నిర్ణయించకూడదు. ఒక మనిషిలా మీరు మనోభావాలను మీకు సంబంధించిన అతి ముఖ్యమైన భాగంగా గుర్తించాలి. అందువలన వీటిని అంగీకరించడం మరియు గౌరవించడం చాలా అవసరం. మనోభావాలను మీ సొంత పిల్లలుగా చూడాలి. వీటికి మీ శ్రద్ధ, గౌరవం మరియు మీ మార్గదర్శకత్వం కావాలి.

మనోభావాలను ఒక శక్తిగా చూడగలిగినప్పుడు, అవి మీ దగ్గరకు హీలింగ్ కోసం వస్తాయి. అందువలన మీరు మనోభావాలలో పూర్తిగా మునిగిపోకుండా, వాటిని తటస్థస్థితి నుంచి ఎరుకతో గమనించడం చాలా ముఖ్యం. ఇక్కడ ఎరుకతో ఉండడం అనేది చాలా ముఖ్యం. మీరు మనోభావాలను అణచివేయవద్దు. అలా అని వీటిలో పూర్తిగా మునిగిపోవద్దు. మీరు వీటిలో మునిగిపోయినప్పుడు, లేదా మీరు వీటితో పూర్తిగా గుర్తించబడినప్పుడు, మీ అంతర్‌శిశువు ఒక నియంతలా మారుతూ మిమ్మల్ని తప్పు త్రోవలో నడిపిస్తుంది.

ఇక్కడ అతి ముఖ్యమైన విషయమేమిటంటే, మీ చైతన్యాన్ని కోల్పోకుండా, మనోభావాలను లోపలకి అనుమతిస్తూ, వాటి యొక్క అన్ని లక్షణాలను అనుభూతి చెందగలగాలి. ఇక్కడ మీరు కోపాన్ని ఒక ఉదాహరణగా తీసుకోండి. మీరు కోపాన్ని పూర్తిగా రమ్మని ఆహ్వానించండి. మీ శరీరం యొక్క వివిధ భాగాలలో దీనిని అనుభూతి చెందండి. అదే సమయంలో మీరు దీనిని నిర్గుణస్థితిలో గమనిస్తూ ఉండండి. ఈ విధమైన చైతన్యమే హీలింగ్ అంటే. ఈ సంఘటనలో ఏం జరుగుతుందంటే, మీరు మనోభావాలను కౌగిలించుకుంటూ, తప్పుగా అర్ధం చేసుకున్న విషయాలను ఒక అవగాహనతో సరిగ్గా అర్ధం చేసుకోగలుగుతారు. ఇది ఆధ్యాత్మిక రసవాదశాస్త్రము (స్పిరిచువల్ యాల్‌కెమి).

నేను దీనిని ఒక ఉదాహరణ సహాయంతో విశదీకరిస్తాను. మీ శిశువు టేబుల్‌కి తన కాలుని గుద్దుకుని చాలా బాధపడుతున్నాడు. మీ శిశువు టేబుల్‌కి గుద్దు కోవడం వలన తన కాలికి దెబ్బ తగిలింది. ఆమె గాయంతో బాధపడుతూ,

దానికి కారణం టేబుల్ అనుకుని దానిని కొడుతూ, దాని మీద కోపాన్ని చూపిస్తోంది. ఆమె తన బాధకు కారణం టేబుల్ అనుకుంటోంది.

ఈ సమయంలో మనోభావసంబంధిత సహకారం అంటే మొదటిగా తల్లిదండ్రులు, పిల్లలకు వారి యొక్క అనుభవాన్ని గుర్తించడానికి మరియు దానికి పేరు పెట్టడానికి సహాయం చేయాలి. "నువ్వు కోపంగా ఉన్నావా? నువ్వు బాధలో ఉన్నావా?" ఇలా దానికి పేరు పెట్టడం చాలా ముఖ్యం. మీరు సమస్యకు గల కారణాన్ని టేబుల్ నుంచి శిశువు వైపుకు మళ్ళించాలి. సమస్య టేబుల్‌లో లేదని, బాధ పడేది నువ్వేనని, కోపం వచ్చింది నీకేనని వివరించి చెప్పాలి. నేను నీ మనోభావాన్ని అర్థం చేసుకున్నాను! అని వారికి చెప్పాలి.

శిశువు యొక్క మనోభావాలను తల్లిదండ్రులు ప్రేమతోనూ మరియు అవగాహనతోనూ కౌగిలించుకోవాలి. ఎప్పుడైతే శిశువు, తను అర్థం చేసుకోబడినట్లు మరియు గుర్తించబడినట్లు అనుభూతి చెందుతుందో, అప్పుడు శిశువు యొక్క కోపం నెమ్మది నెమ్మదిగా తగ్గిపోతుంది. కాని ఆమె యొక్క భౌతికపరమైన బాధ ఇంకా అలాగే ఉండవచ్చు. బాధ మరియు ఆ బాధ చుట్టూ ఉన్న కోపంతో ఆమె ఘర్షణ పడడం అనేది క్రమక్రమంగా తగ్గిపోతుంది. ఆ శిశువు మీ కళ్ళల్లో కరుణని మరియు అవగాహనను చదువుతుంది. దీని ద్వారా ఆమె ప్రశాంతతను పొందుతుంది మరియు ఆమె మనోభావాలు కూడా శాంతిస్తాయి. మనోభావాలకు కారణం టేబుల్ కాదని ఆమె గుర్తిస్తుంది.

ప్రేమ మరియు కరుణతో మనోభావాలను కౌగిలించుకుంటే, మీరు పిల్లల యొక్క గమనికను బాహ్యం నుంచి అంతరంలోకి వారి దృష్టిని మరల్చగలరు. మీరు పిల్లలకి మనోభావాల యొక్క బాధ్యతను స్వీకరించడం నేర్పించాలి. బాహ్యంగా జరిగిన సంఘటనకు ప్రతిస్పందన సమాధానం కాదని, మీరు పిల్లలకు అర్థమయ్యేలా వివరించి చెప్పాలి. నువ్వు దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు, అంటే అవగాహనను లేదా అవగాహనాలోపాన్ని. నువ్వు యుద్ధాన్ని లేదా అంగీకారాన్ని ఎంపిక చేసుకోవచ్చు. నువ్వు దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు అని వారికి వివరంగా చెప్పాలి.

ఇదే మీ సొంత మనోభావాలకు మరియు మీ అంతర్‌శిశువుకు కూడా వర్తిస్తుంది. మీ మనోభావాలను లోపలకి అనుమతిస్తూ, వాటిని గుర్తించడానికి మరియు వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అంటే మీ అంతర్‌శిశువును అభిమానిస్తూ దాని పై వాత్సల్యాన్ని చూపించమని. మీ మనోభావాల యొక్క పూర్తి బాధ్యతను

స్వీకరిస్తూ, బాహ్యం నుంచి అంతరంలోకి దానిని మరలించడం వలన, మీ అంతర్‌శిశువు ఎవరిని బాధించకుండాను మరియు అది ఒక బాధితురాలిగా బాధపడకుండాను ఉండడానికి ఇది సహాయం చేస్తుంది. తీవ్రమైన మనోభావాలు(కోపం,చిరాకు లేదా భయం) ఎల్లప్పుడూ శక్తిహీనత యొక్క లక్షణాన్ని కలిగిఉంటాయి. దీని అర్థం మీకు బాహ్యంగా జరిగిన విషయాలకు, మీరు "బాధితులని" భావించడమే.
మీరు బాహ్యంగా సంభవించిన సంఘటనల పై దృష్టి పెట్టడానికి బదులు, ఆ సంఘటనల వలన మీలో ఏర్పడిన బాధ మరియు ప్రతిస్పందనల పై దృష్టిని కేంద్రీకరించడానికి ప్రయత్నించండి. ఇలా చేయడం వలన, మీ మనోభావాలకి కారణమైన బాహ్య ప్రపంచపు సంఘటనలను సులభంగా వదిలి వేయగలుగుతారు. మీరు పూర్తిగా అంతరంలోకి మరలుతూ, ఈ విధంగా మీతో మీరు చెప్పుకోండి: అవును, ఇది నా ప్రతిస్పందనే మరియు ఇది ఎందుకు సంభవించింది అనేది నేను అర్థం చేసుకున్నాను. నేను ఈ విధంగా చేయడానికి గల కారణం ఏమిటో కూడా అర్థం చేసుకున్నాను మరియు ఈ విషయంలో నాకు నేను సహకరించుకో బోతున్నాను.

ఈ విధంగా ప్రేమతత్వంతో మీ మనోభావాల వైపు మరలడమే విముక్తి అంటే. దీనికి వ్యక్తిగత క్రమశిక్షణ యొక్క అవసరం ఉంది. "చెడు సంఘటనకు మూలంగా" ఉన్న బాహ్యపు వాస్తవాన్ని విడుదల చేస్తూ మరియు మీ పట్ల మీరు పూర్తి బాధ్యతను స్వీకరించడమంటే అర్థం: "మీరే ఈ మనోభావాలను ఎంపిక చేసుకున్నారని" గుర్తించడమే. మీరు ఏది మంచి, ఏది చెడు అనే విషయాల గురించి వాదించడం మానివేయండి. దీని గురించి ఇతరులపై నిందలను మోపడం ఆపివేయండి. మీ ప్రమేయం లేకుండా సంభవించిన సంఘటనలన్నింటిని విడుదల చెయ్యండి. "నేను ఇప్పుడు ఈ మనోభావాన్ని పూర్తిఎరుకతో అనుభవించాలని ఎంపిక చేసుకుంటున్నాను". ఇదే బాధ్యత తీసుకోవడం అంటే. ఇదే సాహసం అంటే!

మనోభావంతో క్రమశిక్షణగా ఉండడం అంటే, మంచిగా నటించడాన్ని మరియు బాధితుడిగా ఉండడాన్ని వదిలి వేయడమే. మీరు 'కోపాన్ని', 'పొరపాటుగా అర్థం చేసుకున్న విషయాలను' మరియు 'బాధితుల యొక్క భావప్రకటనలను' వదిలివేయడం అనేది మీకు మంచిగా అనిపించగలదు. (నిజానికి మీరు, మిమ్మల్ని తరచుగా విసిగిస్తున్న మనోభావాలను ఎక్కువగా పోషిస్తుంటారు). బాధ్యతను తీసుకోవడం అనేది వినయానికి సంబంధించిన చర్య. దీని అర్థం మీ బలహీన క్షణాలలో కూడా మిమ్మల్ని మీరు విశ్వసించడమే.

మేము ఇలాంటి క్రమశిక్షణనే మిమ్మల్ని అడుగుతున్నాము. అదే సమయంలో, మీరు ఈ విధంగా అంతరంలోకి వెళ్ళడానికి ఉన్నతమైన కరుణ యొక్క అవసరం ఉంది. మనోభావాలను మీ సొంత సృష్టిలుగా భావిస్తూ, వాటిని నిజాయితీగా ఎదుర్కోవడానికి సిద్ధపడడం అంటే అర్థం: వీటిని ఉన్నతమైన అవగాహనతో చూడడమే. "మీరు ఈ సమయంలో కోపాన్ని ఎంచుకున్నారు, అది మీదే కదా?" ఇప్పుడు మీ కరుణ ఈ విధంగా మీకు చెబుతుంది: "నేను ఈ కోపానికి గల కారణాన్ని చూడగలను మరియు నేను నిన్ను క్షమించగలను. నువ్వు, నా ప్రేమను మరియు సహకారాన్ని మరింత స్పష్టంగా అనుభూతి చెందినట్లయితే, దీనికి నువ్వు మళ్ళీ ప్రతిస్పందించడానికి ఇష్టపడవు".

వ్యక్తిగత-హీలింగ్ విషయంలో, చైతన్యం యొక్క నిజమైన పాత్ర ఇదే. ఇదే ఆధ్యాత్మిక రసవాదశాస్త్రం అంటే. చైతన్యం దేనిని తిరస్కరించదు లేదా దేనితోనూ ఘర్షణ పడదు. ఇది ఎరుకతో, చీకటిని హత్తుకుంటుంది. ఇది పొరబాటుగా అర్థం చేసుకున్న వాటి యొక్క శక్తులను అవగాహనతో హత్తుకుంటుంది. దీని ఫలితంగా సాధారణమైన లోహం బంగారంగా పరివర్తనం చెందుతుంది. ముఖ్యంగా చైతన్యం మరియు ప్రేమ అనేవి రెండూ సమానమే. జాగరుకతతో ఉండడం అంటే, ప్రతీ విషయాన్ని తన సహజస్థితిలో ఉండడానికి అనుమతిస్తూ, దానిని మీ ప్రేమ మరియు కరుణలతో కౌగిలించుకోవడమే.

మీ మనోభావసంబంధిత సమస్యలను అధిగమించడానికి, "చైతన్యం ఒక్కటే" సరిపోదని మీరు భావిస్తుంటారు. మీరు ఈ విధంగా చెప్పవచ్చు: "నేను నా మనోభావాలను అణచివేశానని నాకు తెలుసు, నాకు వీటి యొక్క కారణం కూడా తెలుసు. నేను వీటి యొక్క ఎరుకను పొందినప్పటికి కూడా ఇవి నా నుండి వెళ్ళడం లేదు."

ఇటువంటి సందర్భంలో, మీ అంతరంలో ఆ మనోభావానికి సంబంధించి సున్నితమైన తిరస్కరణ ఉంటుంది. ఇవి మిమ్మల్ని ప్రభావితం చేస్తాయనే భయం కారణంగా, వీటిని మీరు దూరంగా ఉంచుతారు. మీరు ఎరుకతో మనోభావాలను అనుమతించినట్లయితే, మీరు వీటి ద్వారా ఎప్పటికి ప్రభావితం చెందరు.

మీరు ఈ మనోభావాలను దూరంగా ఉంచినంత కాలం, మీరు వీటితో యుద్ధం చేస్తారు. మీరు మనోభావాలతో ఘర్షణపడితే, అవి మీకు వ్యతిరేకంగా తయారవుతాయి. (ఆఖరికి మీరు వీటిని బయటకు వ్యక్తపరచలేరు.) ఈ మనోభావాలు

వాటంతటవిగా, మీ శరీరంలో నొప్పి లేదా ఒత్తిడి లేదా నిరాశ యొక్క అనుభూతులుగా వ్యక్తీకరించబడతాయి. తరచూ కృంగిపోవడం లేదా అలసటకు గురవ్వడం అనేవి మనోభావాలను అణచివేస్తున్నారనే దానికి స్పష్టమైన సూచనగా ఉంటాయి.

మీ చైతన్యంలోకి పూర్తిగా ప్రవేశించాలంటే, మీ మనోభావాలను అనుమతించాలి. మీ అంతరంలో ఏ మనోభావాలు ఉన్నాయనేది మీకు ఖచ్చితంగా తెలియనట్లయితే, మీరు మొదటిగా మీ శరీరంలోని ఆందోళనను అనుభూతి చెందడం ఆరంభించండి. ఇదే మనోభావాలను చేరే అతి ముఖ్యమైన మార్గం. ఇవన్నీ మీ శరీరంలోనే ఉన్నాయి. ఉదాహరణకు మీరు, మీ పొట్టభాగంలో బాధను లేదా ఒత్తిడిని పొందుతున్నప్పుడు, మీరు ఎరుకతో ఆ భాగం దగ్గరకి వెళ్ళి, దీనికి గల కారణమేమిటని అడగండి. మీ శరీరం యొక్క కణాలను మీతో మాట్లాడనివ్వండి లేదా ఒక శిశువు అక్కడ ఉన్నట్టు ఊహించుకోండి. ఆ శిశువుని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న తన మనోభావాన్ని మీకు చూపించమని అడగండి.

మీ మనోభావాలతో సంబంధాన్ని ఏర్పరుచుకోవడానికి చాలా మార్గాలు ఉన్నాయి. మీరు ముఖ్యంగా తెలుసుకోవాల్సినది ఏమిటంటే, ఆ మనోభావంలో ఇరుక్కుపోయిన శక్తి, ఇప్పుడు ముందుకు పయనించాలని కోరుకుంటోంది. ఈ శక్తి విడుదల అవ్వాలని కోరుకుంటోంది. అందువలన ఇది ఒక భౌతికపరమైన నొప్పిలా లేదా ఒత్తిడిలా లేదా ఆందోళనల యొక్క అనుభూతి ద్వారా మీ తలుపును తడుతోంది. నిజానికి విషయమేమిటంటే, మీరే దీనిని విడుదల చేయగలరు. మీరు మనోభావాలను అనుభూతి చెందడానికి సిద్ధపడాలి.

మనోభావాలనేవి మీ భూ వాస్తవం యొక్క భాగాలు. కాని ఇవి మీపై ఆధిపత్యాన్ని కలిగి ఉండకూడదు. మనోభావాలనేవి సూర్యుని ముందు కమ్ముకుని ఉన్న మేఘల్లాంటివి. అందువలన మీ మనోభావాల పట్ల ఎరుకను కలిగి ఉండడం మరియు వీటితో జాగరుకతతో వ్యవహరించడం అనేది చాలా ముఖ్యం. స్వచ్ఛత మరియు సమన్వయం గల మనోభావ శరీరం నుంచి, మీ ఇంగితజ్ఞానం యొక్క సహాయంతో, మీ ఆత్మ లేదా అంతర్‌మూలంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం చాలా సులభం.

మీ సమాజంలో మనోభావాల గురించి చాలా సందేహాలు ఉన్నాయి. మీ పిల్లలను ఎలా పెంచాలి అనే దాని గురించి చాలా సందేహాలు ఉన్నాయి. పిల్లలు, పెద్దవారి కన్నా చాలా త్వరితంగా మనోభావాలకు గురవుతుంటారు. ఇదే సమస్యలను

సృష్టిస్తుంది. మీ సంప్రదాయపు హద్దులను అధిగమిస్తే ఏమవుతుంది? పరిస్థితులు చేయి దాటిపోయినప్పుడు మరియు తీవ్రగందరగోళాలు రేకెత్తినప్పుడు ఏం జరుగుతుంది? ప్రతిఒక్కరూ పిల్లలను క్రమశిక్షణగా పెంచాలా? లేదా వారిని వారు స్వేచ్ఛగా వ్యక్తపరుచుకోవడానికి అనుమతించాలా? పిల్లల యొక్క మనోభావాలను అదుపులో ఉంచాలా, లేదా?

పిల్లల పెంపకంలో అతి ముఖ్యమైన విషయమేమిటంటే, పిల్లలు వారి యొక్క మనోభావాలను అర్థం చేసుకుంటూ, అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలుసుకుంటూ మరియు వాటి యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించడం నేర్చుకోవాలి. మీ సహాయంతోనే, పిల్లలు వారి యొక్క మనోభావాలను 'తప్పుగా అర్థంచేసుకున్న వాటి యొక్క ప్రతిస్పందనలు'గా చూడడం నేర్చుకుంటారు. ఈ అవగాహన, మీ శిశువును వారి యొక్క మనోభావాలలో కూరుకుపోనివ్వకుండాను మరియు అదుపు తప్పిపోకుండాను కాపాడుతుంది. అర్థం చేసుకోవడం అనేది మీకు విముక్తిని కలుగజేస్తుంది. ఇది మీ మనోభావాలను అణచివేయకుండా, తిరిగి మీ ఆత్మకేంద్రానికి మిమ్మల్ని తీసుకువెళు తుంది. తల్లిదండ్రులు ప్రత్యక్ష ఉదాహరణగా ఉంటూ, మనోభావాలతో వ్యవహరించే విధానాన్ని పిల్లలకు బోధించాలి.

మీ పిల్లలతో ఎలా వ్యవహరించాలి అనే ప్రశ్నలన్నీ మీకు కూడా వర్తిస్తాయి. మీ మనోభావాలతో మీరు ఎలా వ్యవహరించాలి? మీ పట్ల మీరు కఠినంగా వ్యవహరిస్తున్నారా? మీరు కొద్దిసేపు కోపంగాను లేదా బాధగాను ఉన్నప్పుడు, మీతో మీరు క్రమశిక్షణగా ఉంటూ ఈ విధంగా చెప్పగలుగుతారా : "ఆ బాధను లేదా కోపాన్ని మీతో కలవమని మరియు ముందుకు వెళ్ళమని." మీరు మనోభావాలను అణచివేస్తున్నారా? మీ పట్ల మీరు క్రమశిక్షణగా ఉండడం మంచిదని మరియు అవసరమని అనుభూతి చెందుతున్నారా? ఇది మీకు ఎవరు నేర్పించారు? మీ తల్లిదండ్రులా?

లేదా మీరు వేరే వైపుకు వెళుతున్నారా? మీ మనోభావాలను బయటకు వెళ్ళనివ్వకూడదని వాటిలో మీరు పడిపోతున్నారా? ఇది తరచూ జరిగే విషయమే. మీరు చాలాకాలం మీకు బాహ్యంగా జరిగిన విషయాలకు మీరే బాధితులని భావించి ఉండవచ్చు. ఉదాహరణకి మీ పెంపకపు విధానం, మీ భాగస్వామి లేదా మీ ఉద్యోగ వాతావరణం మొదలైనవి. చెడు విషయాలకు ప్రభావితం చెందడం వలన మీ అంతరంలో ఏర్పడిన కోపాన్ని స్పృశించడం అనేది, ఒకానొక సమయంలో

విముక్తిలా ఉండవచ్చు. కోపం, ఈ ప్రభావితాల నుంచి మీరు స్వేచ్ఛను పొందేలా చేస్తూ, మీ సొంతమార్గంలో పయనించే అవకాశాన్ని మీకు కలిపిస్తుంది. మీరు, మీ కోపం ద్వారా మంచి ప్రభావాన్ని పొందినట్లయితే, మీరు దానిని వదులుకోవాలని ఎంత మాత్రం అనుకోరు. మనోభావాలతో బంధాన్ని ఏర్పరుచుకుని ఈ విధంగా లబ్ధిని పొందడం వలన, మీరు దీనిని ఒక మార్గంలా  కాకుండా, మీ జీవిత విధానంగా మార్చుకుంటారు. మీలోని బానిసత్వం హీలింగ్ కోసం మేల్కొంటుంది. ఇవి మిమ్మల్ని పట్టుకుని ఉంటూ, మీ సొంతశక్తి మీద తిరిగి ఆధారపడేలా చేస్తాయి.

మీ మనోభావాలను నిర్ణయించకుండా, వాటి యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించడం అనేది చాలా ముఖ్యం. మీరు, మనోభావాలను పొరబాటుగా అర్థం చేసుకోబడిన వాటి యొక్క ప్రతిస్పందనలుగా చూడాలి. అలా కాకుండా వీటిని తప్పు-ఒప్పులుగా నిర్ణయించినట్లయితే, ఇవి మిమ్మల్ని మీ ఆత్మ కేంద్రం నుంచి బయటకు వచ్చేలా చేస్తాయి. దీని వలన మీరు, మీ కేంద్రం నుంచి నిర్ణయాలను తీసుకోలేరు.

మీ పిల్లల విషయంలో కూడా ఇదే సంభవిస్తోంది, ఎందుకంటే పిల్లలు కూడా ఇదే విధంగా మనోభావాలను స్వేచ్ఛగా అనుమతిస్తారు కనుక. దీని కారణంగా వీరు అదుపు, అడ్డు లేకుండా తయారవుతారు. ఈ పిల్లలు చిన్న నియంతలుగా తయారవుతారు. ఇది సరైన పద్ధతి కాదు. పెద్దవాళ్ళ మాదిరిగానే పిల్లలకు కూడా ఈ మనోభావ సంబంధిత గందరగోళాలు ప్రశాంతంగా ఉండవు.

క్లుప్తంగా చెప్పాలంటే, మీ మనోభావాలతో వ్యవహరించే విధానంలో, మీరు అతిచనువుగాను లేదా అతి కఠినంగాను ఉంటారు. నేను మనోభావాలతో 'అతిచనువు'గా ఉండే విషయం గురించి కొంచెం ఎక్కువగా చెప్పాలనుకుంటున్నాను. ఈ సమస్యే ప్రస్తుత రోజులలో అధికంగా ఉంటోంది. 1960 నుంచి మీ మనోభావాలను అణచివేయకూడదని, మీరందరూ సామూహిక అవగాహనను పొందారు. ఎందుకంటే మనోభావాలను అణచివేయడం వలన సృజనాత్మకత, చురుకుదనం మరియు మీ ఆత్మశక్తి క్షీణింపబడుతున్నాయి కనుక. సమాజం, క్రమశిక్షణ మరియు విధేయత గల పిల్లలను పెంపొందిస్తూ, వారు అంతర్వాణి కంటే సామాజిక పద్ధతులకు ప్రాముఖ్యతను ఇస్తూ మరియు వాటిని కాపాడాలని కోరుకుంటోంది. ఇది సమాజానికి మరియు అదే విధంగా వ్యక్తిగత జీవితానికి కూడా ఒక విషాదకరమైన విషయం.

కాని దీనికి వ్యతిరేకమైన మరొక మార్గం: మనోభావాలు సరైన కారణాన్ని

చూపిస్తూ, అవి మిమ్మల్ని ఆక్రమిస్తూ, మీ జీవితాన్ని పరిపాలించినట్లయితే ఏమి జరుగుతుంది?

మీ అంతరంలో మనోభావాలను ఏ దృక్పథంతో చూస్తున్నారనేది మీరు స్పష్టంగా గుర్తించవచ్చు. అంటే మీరు మనోభావాలను తప్పుగా అర్థం చేసుకున్న వాటి యొక్క ప్రతి స్పందనలుగా చూస్తున్నారా, లేదా వీటినే నిజాలుగా భావిస్తున్నారా అనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవచ్చు. (మీరు మనోభావాలను నిజాలుగా భావిస్తూ పోషిస్తున్నట్లయితే, మీరు వీటి ద్వారా గుర్తించబడతారు.) విచిత్రమేమిటంటే ఈ మనోభావాలు మిమ్మల్ని తరచూ చాలా తీవ్రంగా బాధిస్తుంటాయి. ఉదాహరణకి శక్తిహీనత ("నేను సహాయం చేయలేను"), అదుపు ("నేను దీనిని పట్టించుకోగలను"), కోపం ("ఇది ఇతరుల యొక్క తప్పు"), లేక బాధ ("జీవితం అనేది దుర్భరం"). ఈ మనోభావాలన్నీ తీవ్రమైన బాధను కలిగిస్తున్నప్పటికీ, ఇవి మీకోసం వేరొక స్థాయిలో వీటి అంతరంలో ఒక ప్రత్యేక బహుమతిని కలిగి ఉంటాయి.

ఉదాహరణకి శక్తిహీనతను లేదా బానిసత్వం యొక్క అనుభూతిని తీసుకోండి. ఈ మనోభావసంబంధిత ధోరణిలో చాలా ఉపయోగకరమైన విషయాలు ఉండగలవు. ఇవి మీకు ఒక భద్రతాభావాన్ని కలిపించవచ్చు. ఇవి మిమ్మల్ని కొన్ని బాధ్యతల నుంచి విడుదల చేస్తాయి కూడా. "నేను వీటికి సహాయం చేయలేను, కాని నేను చేయగలనా?" మీరు చీకటి మూలల్లో కూర్చున్నప్పుడు అది మీకు భద్రతగా అనిపించవచ్చు. కాని ఈ విధమైన మనోభావసంబంధిత పద్ధతులను గుర్తించడానికి, లేదా వీటిని మీలో కలుపుకోవడానికి భయపడి చాలాకాలం అలాగే ఉండిపోయినట్లయితే, మీరు మీ నిజమైన స్వేచ్ఛ మరియు అంతర్ దివ్యత్వంతో బంధాన్ని కోల్పోగలరు.

మీ అంతరంలో కోపాన్ని మరియు ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్న మనోభావాలు, మీ జీవితమార్గంలోకి ప్రవేశించవచ్చు. ఇవి మీ యవ్వనంలోగాని, ఆ తర్వాతగాని లేదా మీ యొక్క గతజన్మలలోగాని సంభవించి ఉండవచ్చు. మీరు జాగృతావస్థలో, ఈ మనోభావాలతో బంధాన్ని కలిగి ఉండడం అనేది చాలా ముఖ్యమైన విషయం. మీ కోపం, బాధ లేదా మీ అంతరంలో మిమ్మల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న శక్తుల యొక్క ఎరుకను పొందాలి. కాని ఒకానొక స్థితిలో, మీరు మీ మనోభావాల యొక్క బాధ్యతను స్వీకరించి, దీనికి కారణమైన బయటి విషయాలకు స్పందించకుండా వాటిని వదిలి వేయగలగాలి.

స్పష్టత మరియు ఆధ్యాత్మిక సమన్వయం గల మీ ఆత్మకేంద్రంలో ఉండడం అంటే అర్ధం: మీ అంతరంలోని మనోభావాల అన్నింటి యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించడమే. ఉదాహరణకి మీ అంతరంలోని కోపాన్ని గుర్తిస్తూ, మీతో మీరు ఈ విధంగా చెప్పుకోండి: "ఇది నేను తప్పుగా అర్ధం చేసుకున్న సంఘటనల పట్ల నా ప్రతిస్పందన. నేను ఈ ప్రతిస్పందనను అవగాహనతో హత్తుకుంటూ, అదే సమయంలో దీనిని విడుదల చేయాలని అనుకుంటున్నాను."

జీవితం అంటే తుదివరకూ మంచిగా ఉండడమే కాదు. జీవితం అంటే స్వేచ్ఛగాను మరియు సంపూర్ణంగాను ఉండడమే. మీ జీవనశైలిలో పెరిగిన పాత మనోభావసంబంధిత స్పందనలను విడుదల చేసినప్పుడే, మీరు స్వేచ్ఛను పొందుతారు.

మనోభావాలను అణచివేయడానికి మరియు వాటిలో మునిగిపోవడానికి మధ్య సున్నితమైన 'మధ్యేమార్గం' ఉందని కొంతమంది చెప్పవచ్చు. ఈ రెండు మార్గాలకు సంబంధించి మీరు చాలా ఉద్దేశ్యాలను మరియు ఆదర్శాలను కలిగిఉన్నారు. కాని అవి ఆధ్యాత్మిక రసవాదశాస్త్రం యొక్క స్వభావాన్ని ఎంత మాత్రం కలిగి ఉండవు. ఆధ్యాత్మిక ఎదుగుదల యొక్క సారాంశం ఏమిటంటే, మీరు వేటిని అణచిపెట్టకుండా, వాటి యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించడమే. మీ "ఆధిపత్యాన్ని లేదా దివ్యత్వాన్ని" సొంతం చేసుకోండి: నేను దీనిని అనుభూతి చెందుతాను, నేనే ఈ ప్రతిస్పందనను ఎంపిక చేసుకున్నాను, అందువలన నేను దీనిని నయం చేసుకోగలను. ఇదే నా నిజమైన సందేశం.

బహుశా ఇది 'మధ్యేమార్గం' కాకపోవచ్చు. కాని, నిజానికి ఇది ఒక ప్రత్యేకమైన మార్గం. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక ఆధిపత్యం గురించే. మీ అంతరంలోని ప్రతీ దానిని అంగీకరించడం ద్వారానే, మీరు వాటిని అధిగమించగలరు మరియు మీరు వాటి యొక్క మాస్టర్స్‌లా మారగలరు. ఆధిపత్యం అంటే శక్తివంతంగాను మరియు నిజాయితీగాను ఉండడం. ఇది పూర్తిగా అనుమతించడానికి సంబంధించిన విషయం మరియు దీనికి ఉన్నతమైన క్రమశిక్షణ అవసరం: ధైర్యం మరియు నిజాయితీతో కూడిన క్రమశిక్షణ.

మీ ఆధిపత్యాన్ని సొంతం చేసుకోండి. మీ వెనుక ఉండి మిమ్మల్ని బాధిస్తున్న మనోభావాల యొక్క భాగాలకు మాస్టర్‌గా ఉండండి. వీటితో బంధాన్ని ఏర్పరుచుకుంటూ, వీటి బాధ్యతను స్వీకరించండి. ఎరుకలేని మనోభావసంబంధిత గాయాలకు మీ ఆధిపత్యాన్ని ఇవ్వవద్దు. అవి మిమ్మల్ని మీ అంతర్ స్వేచ్ఛ వైపు

పయనించకుండా అడ్డుకుంటాయి మరియు అవి మిమ్మల్ని తప్పుద్రోవ పట్టిస్తాయి. వీటిని మీ చైతన్యమే నయం చేస్తుంది. మనోభావాలపై తిరిగి ఆధిపత్యాన్ని సంపాదించే విషయంలో మీకు ఎవరూ సహాయం చేయలేరు. ఎందుకంటే వీటిని తీసివేయడానికి బాహ్యంగా ఎటువంటి పరికరాలుగాని, మార్గాలుగాని లేవు కాబట్టి. మీరు వీటి యొక్క ఎరుకను పొందుతూ కరుణ, పట్టుదల మరియు ధైర్యాలతో వీటిని దగ్గరకు తీస్తూ వీటిని కాంతిలోకి విడుదల చేయగలగాలి.

మీ మనోభావస్థాయిలో సంపూర్ణతను మరియు స్వేచ్ఛను పొందడం అనేది ఆధ్యాత్మికంగా ఎదగడానికి సహాయపడే అతి ముఖ్యమైన లక్షణంగా ఉంటుంది. నేను చివరిగా మీకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే: దీనిని దయచేసి కష్టతరం చేయవద్దు. ఆధ్యాత్మిక మార్గం చాలా తేలికైన మార్గం. ఇది మీ పట్ల మీకు అంతర్‌స్పష్టతను మరియు ప్రేమను ఎలా పొందాలనేది తెలియజేస్తుంది. దీనికి ఏవిధమైన జ్ఞానంగాని లేదా ప్రత్యేకమైన నియమాలుగాని, సంప్రదాయాలుగాని లేదా పద్ధతులుగాని అవసరం లేదు. మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు కావలసిన విషయాలన్నీ మీ అంతరంలోనే ఉన్నాయి.

ప్రశాంతమైన స్థితిలో కూర్చుని మీలో ఉన్న అనుభూతుల వైపుకి వెళ్ళండి. అవి మీకు మీ అంతరంలోని అనుభూతుల పట్ల స్పష్టతను పొందాలని మరియు వాటిని స్వచ్ఛంగా ఉంచాలని మీకు తెలియజేస్తాయి. మీ ఇంగితజ్ఞానాన్ని విశ్వసించండి. దీనిపై పని చేయండి. మిమ్మల్ని మీరు నమ్మండి. మీరే మీ జీవితానికి గురువు. ప్రేమ మరియు స్వేచ్ఛ గల మీ ప్రత్యేకమైన మార్గానికి మీరే మాస్టర్స్.

* * * *

# పని, డబ్బు మరియు సృజనాత్మకత

## సులభం యొక్క ప్రవాహం మరియు సరిపడినంత సమృద్ధి యొక్క ప్రవాహం

డియర్ ఫ్రెండ్స్, ఈ రోజు ఇలా మీతో ఉండడం నాకు చాలా ఆనందంగాను మరియు సంతోషంగాను ఉంది. మీరు నాకు చాలా బాగా తెలుసు. నాకు మిమ్మల్ని నిన్నే కలిసినట్టుగా అనిపిస్తోంది. నేను నివసించే తలాలలో సమయానికి ప్రాముఖ్యత ఉండదు. మీ యొక్క వ్యక్తీకరణలు, మీ శరీరాకృతులు, మీరు నాకు తెలిసిన సమయంతో పోల్చి చూస్తే చాలా భిన్నంగా ఉన్నాయి. అయినప్పటికీ కూడా నేను మిమ్మల్ని బాగా గుర్తించాను.

నేను జెషువాని. నేను భూమి మీద జీసస్ అనే భౌతికశరీరంతో జీవించాను. మీలాగే నేను ఒక భౌతికశరీరంలో మానవుల మధ్య జీవించాను. మానవజీవితం నాకు తెలియనిది కాదు. మానవజీవితం యొక్క అనుభవాన్ని కలిగిఉండడం వలనే, నేను మీ సొంత ఎదుగుదలకు మరియు ఈ కొత్తశకంలో మీరు జన్మ తీసుకోవడానికి సహకరించగలుగుతున్నాను. ప్రస్తుత రోజులలో జరుగుతున్న మార్పులతో మీకు బలమైన సంబంధం ఉన్నట్టుగా మీరు అనుభూతి చెందుతున్నారు.

నా గురించి కొన్ని విషయాలను మీకు చెప్పాలనుకుంటున్నాను. భూమి మీద నేను రక్తమాంసాలు గల శరీరంతో జీవించాను, నేను ఆ సమయంలో క్రీస్తుశక్తి యొక్క ప్రవాహాన్ని భూమి మీదకి వచ్చేలా ఏర్పాటు చేసాను. క్రీస్తుశక్తి నా ద్వారా బయటకు ప్రవహించేది మరియు ఆ సమయంలో నేను భూమికి అందించిన అతి ముఖ్యమైన సహకారం ఇదే. కానీ క్రీస్తుశక్తి నా ఒక్కడిదే కాదు, ఇది మీ అందరికీ సంబంధించినది కూడా. మీరందరూ క్రీస్తుశక్తిని భూమి మీదకు తీసుకురావడంలో భాగంగా, మీరు ఈ శక్తి యొక్క బీజాలను నాటుతున్నారు. దీనిలోనే మీ ఉన్నతమైన సంతృప్తి ఉంది.

పాతశకం నుంచి కొత్తశకానికి జరుగుతున్న మార్పులలో, చాలా విషయాలు మూలాల్లోంచి కదులుతూ ప్రెకలించబడుతున్నాయి. ఈ విషయాలలో, ముఖ్యంగా డబ్బు మరియు వృత్తికి సంబంధించిన భాగాలు చాలా లోతుగా ప్రెకలించబడుతున్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ఈ భాగాలలో పాతశక్తులు చాలా చురుకుగా పని చేస్తున్నాయి. మీరు వీటిని అధికారం మరియు అహంకారం యొక్క శక్తులుగా వివరించవచ్చు.

ఈ క్షేత్రాలలో పాతశక్తులు చాలా చురుకుగా వ్యవహరిస్తున్నాయి, మీరు పని మరియు డబ్బు విషయాలలో సమన్వయంతో కూడిన వైఖరిని కలిగిఉండడం చాలా కష్టమని భావిస్తారు. మీ ఉద్యోగంలో, మీరు  పనిచేస్తున్న కంపెనీలో ఉన్న మీ పొరుగువారితోనూ, మీ సమాజంతోనూ తరచూ సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. మిమ్మల్ని మీరు చాలాసార్లు ప్రశ్నించుకుంటారు: నాకు సహజమైన అవగాహనలేని శక్తులతోనూ మరియు నిత్యజీవితంలో నా చుట్టూ ఉన్న శక్తులతోనూ సమర్ధవంతంగా ఎలా వ్యవహరించాలి? పాతదనం మరియు కొత్తదనానికి మధ్య ఉన్న సమస్యలతో వ్యవహరించే విధానాన్ని మీరు తెలుసుకోవాలని అనుకుంటారు.

మీ శరీరంలో ఉన్న శక్తి కేంద్రాలను ఆధారంగా చేసుకుని, నేను ఈ విషయాన్ని కొంచెం ఎక్కువగా విశదీకరించాలని అనుకుంటున్నాను. ప్రతీ మానవశరీరం యొక్క శక్తిక్షేత్రం ఏడు చక్రాలను లేదా ఏడు కేంద్రాలను కలిగిఉంటుంది. మూడవచక్రంలో (పొట్టభాగం) ఇచ్ఛాశక్తిని కలిగిఉంటాం. ఈ వ్యక్తిగత ఇచ్ఛా కేంద్రం, అధికారానికి మరియు లక్ష్యాలకు స్థానంగా ఉంటుంది. పాతశక్తి యొక్క శకంలోనూ, పాతకాలం మనుష్యులు, ఈ కేంద్రం మీదే ఎక్కువగా ఆధారపడి జీవిస్తుండేవారు. దీని వలన వీరు గెలుపుపై ఆసక్తి గల వైఖరిని, తమ సొంత ఇష్టాలకు మొదటి స్థానాన్ని ఇచ్చే తత్వాన్ని, ఇతరుల కోసం యుద్ధం చేసే ధోరణిని కలిగిఉండేవారు. ఈ విధమైన వైఖరి భయం మరియు కోల్పోవడం అనే భావనల నుంచి పుడుతుంది. ఈ శక్తులను నిర్ణయించడం అనేది నా ఉద్దేశ్యం కాదు. నేను కేవలం ఇవన్నీ మణిపూరకచక్రం లేదా మూడవచక్రం నుంచి చురుకుగా పని చేస్తున్నాయనే విషయాన్ని మీకు వివరించి చెప్పాలనుకున్నాను.

ఈ చక్రానికి పైనున్న చక్రాన్ని హృదయచక్రం అని పిలుస్తాం. హృదయం, మీ యొక్క ఉన్నత కేంద్రంతోను మరియు మీరు ఒకానొకప్పుడు నివసించిన శక్తి పరిధులతోను మీకు బంధాన్ని ఏర్పరుస్తుంది. ఇక్కడ నుంచే మీరు అధికారం మరియు అహంభావం యొక్క శక్తులకు వ్యతిరేకంగా ఉండే ఆదర్శాలను తీసుకువస్తారు.

ప్రస్తుతం సంభవిస్తున్న చైతన్యం యొక్క మార్పుల వలన ఏం జరుగుతోందంటే, ఇప్పుడు మీరు మూడవచక్రం నుంచి హృదయచక్రం వైపు పయనిస్తున్నారు. దీని అర్ధం మీరు మూడవచక్రాన్ని వదిలివేయడం కాదు, లేదా అలా అని పూర్తిగా ప్రక్కకు నెట్టివేయడం కూడా కాదు. మీరు 'అహంకారాన్ని వదిలివేయాలి' అనేది కూడా నిజం కాదు. దీని అర్ధం మీరు ఇచ్ఛాశక్తి నుంచి కాకుండా, హృదయచక్రం నుంచి మరింతగా నిర్దేశింపబడతారని. అంటే మిమ్మల్ని నడిపించే మార్గదర్శకత్వాన్ని ఒక

స్థాయి నుంచి మరొక స్థాయికి మరల్చడమే. ఇలా చేయడం వలన హృదయం యొక్క శక్తితో మీ జీవితాన్ని కనుగొంటారు. మీరందరూ ఏదో ఒక మార్గంలో అంటే, మీ వ్యక్తిగత జీవితం ద్వారానూ, లేదా ముఖ్యంగా పని మరియు సృజనాత్మకత ద్వారానూ, ఈ స్థితిని చేరాలని ప్రయత్నిస్తున్నారు. మీరందరూ హృదయం యొక్క శక్తి వైపు పయనిస్తున్నప్పుడు రక్తసంబంధాన్ని అనుభూతి చెందుతారు. ఈ మార్గంలో, మీ జీవితాన్ని మరింత ప్రశాంతంగాను మరియు ఆనందంగాను జీవించగలరని మీరందరూ భావిస్తారు.

నేను అహంభావపూరిత శక్తులతో (మీ అంతరంగాను మరియు బాహ్యంగాను) ఎలా వ్యవహరించాలి అనే మీ ప్రశ్నకు సమాధానం: మీ హృదయాన్ని, మీ మూడవచక్రం యొక్క శక్తులతో (ఇచ్ఛాశక్తి మరియు అహంభావం) కలుపుతూ, వాటిని ప్రేమ మరియు వాత్సల్యం యొక్క మార్గంలో ముందుకు నడిపించండి. హృదయానికి మరియు మణిపూరకచక్రానికి మధ్య ఉన్న బంధం ద్వారా, మీకు పని, డబ్బు మరియు సృజనాత్మకత భాగాలలో సమృద్ధి లభిస్తుంది.

ఇప్పుడు మీరు హృదయం నుంచి పని చేస్తున్నారా, లేక 'భయం లేదా అహంభావం' నుంచి పని చేస్తున్నారా అనేది ఎలా గుర్తిస్తారు? నేను హృదయశక్తి యొక్క రెండు ముఖ్యమైన లక్షణాలను చెబుతాను. ఇవి మీ నిత్యజీవితంలో హృదయశక్తిని గుర్తించడానికి సహాయపడవచ్చు. మొదటి గుణం: 'కష్టాలు' లేకపోవడం, మరియు 'సులభంగాను మరియు సౌమ్యంగాను' ఉండడం. నేను దీనినే సులభం యొక్క ప్రవాహం అంటాను. రెండవ గుణం: సమృద్ధిని కలిగిఉండడం. నేను ఇప్పుడు సులభం యొక్క ప్రవాహం గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను.

**సులభం యొక్క ప్రవాహం**

మీరు కోరుకున్న వాటిని సాధించడానికి కష్టపడేవారు మరియు ఘర్షణ పడేవారు. ముఖ్యంగా మీరు చేసే వృత్తిలో ఎక్కువ పోటీతత్వం మరియు అహంభావపూరిత గొడవలు ఉంటాయి. తరచూ మీరు వేరేవారిలా నటించాలి. అలా చేయకపోతే, మీరు గుర్తింపును మరియు గౌరవాన్ని పొందలేరు కాబట్టి. ఇది మీ హృదయవాంఛకు విరుద్ధంగా ఉంటోంది. హృదయం చాలా ఎక్కువగా సహజమైన స్వభావాన్ని వాంఛిస్తుంది. హృదయశక్తి ఒత్తిడిని కలుగజేయదు. ఇది చాలా సున్నితంగాను మరియు నిజాయితీగాను ఉంటుంది. ఇది మృదువైన స్వభావాన్ని కలిగిఉంటుంది. హృదయశక్తి, ఇంగితజ్ఞానం ద్వారా మీతో మాట్లాడుతుంది.

హృదయం మీపై సున్నితమైన తాకిడిని కలుగజేస్తూ, మీకు సలహాలను ఇస్తుంది. ఇది మిమ్మల్ని భయం లేదా ఒత్తిడిలతో కూడిన మనోభావప్రేరిత పనులను చేయమని బలవంతం చేయదు.

మీ నిత్యజీవితంలోని పరిస్థితులు సులభంగా పయనిస్తూ, వాటి యొక్క సహజమైన మార్గాన్ని కనుగొంటున్నాయా, లేదా మీరు లక్ష్యాన్ని సాధించాలని చేసే ప్రయత్నంలో తరచూ మీరు ప్రతిఘటనలను ఎదుర్కొంటున్నారా అనే విషయాలను మీరు స్పష్టంగా గుర్తించగలరు. మీరు తరచూ ప్రతిఘటనలను ఎదుర్కొనే స్థితిలో ఉంటున్నారంటే అర్ధం, మీరు మీ హృదయశక్తితో పూర్తిగా కలుపబడి లేరని. హృదయశక్తి యొక్క రహస్యం: ఇది ఏమాత్రం ఒత్తిడి లేకుండా, అద్భుతాలను సులభంగాను మరియు తేలికగాను సృష్టిస్తుంది.

మీ ఇంగిత జ్ఞానాన్ని ధైర్యంగా నమ్మడం అనేది, హృదయశక్తి ప్రవాహంతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి అతి ముఖ్యమైన మార్గంగా ఉంటుంది. దీనినే నేను “సులభం యొక్క ప్రవాహం”గా పిలుస్తాను. పని మరియు సృజనాత్మకత యొక్క సందర్భాలలో, మీ ఇంగిత జ్ఞానం ద్వారా నటించడం వలన, మీ కోసం మీరు ఊహించలేని అద్భుతమైన అవకాశాలను సృష్టించుకుంటారు. ఇది మీ ఉద్యోగ వాతావరణం యొక్క సాంప్రదాయక పద్ధతులకు భిన్నంగా ఉన్నప్పటికీ కూడా, మీరు అద్భుతమైన అవకాశాలను సృష్టించుకోగలరు. ఇదే మిమ్మల్ని మీ ప్రజ్ఞాత్మకు దగ్గరయ్యేలా చేస్తుంది. ఇది మీ హృదయస్థాయిలో మీకు అధికారాన్ని కలిపిస్తుంది, మరియు ఇది మీ హృదయపూర్వకమైన వాంఛలను నెరవేర్చే మనుష్యులను మరియు ప్రదేశాలను వాటంతటవి మీకు ఆకర్షింపబడేలా చేస్తుంది.

మీరు చేస్తున్న వృత్తిలో సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు, మీరు కోరుకున్న పనికి తగిన ప్రదేశం ఇది కాదని మీరు భావించినప్పుడు, మీతో మీరు కొంత సమయం ఒంటరిగా గడపండి. నిశ్శబ్దంగా కూర్చుని, మీరు గ్రహించిన మీ సామాజికపరిస్థితుల యొక్క ఆలోచనలను మరియు ఉద్దేశ్యాలను, వాటితో పాటు వచ్చే భయాలను మరియు ఆందోళనలను, మీ నుండి విడుదల చెయ్యండి. మీ హృదయం యొక్క మధ్యలో ఉన్న లోతైన మరియు నిశ్శబ్ధమైన ప్రదేశం నుంచి, మీకు వస్తున్న ఆలోచనలను మరియు మనోభావాలను గమనించడానికి ప్రయత్నించండి. అవి ఏమిటనేది గమనించండి; అవి సూర్యుడి ముందు కదులుతున్న మేఘాలుగా గుర్తించండి, కాని అవి మీరు కాదు.

మీ హృదయంలో ఉన్న సూర్యకాంతి యొక్క మూలకేంద్రానికి వెళ్ళి, ఇప్పుడు మీకు ఏది సరైనదో మిమ్మల్ని మీరు అడగండి. మీ పురాతనమైన మరియు అనుభవం గల హృదయంతోను మరియు మీ ఉన్నతమైన సృజనాత్మకత యొక్క మూలంతోను బంధాన్ని ఏర్పరుచుకోండి. మీ ఇంగితజ్ఞానాన్ని ఈ క్షణంలో మీకు ఏది సరైనదో తెలపమని అడగండి. బయటి ఉద్దేశ్యాల మీద, మీ ప్రవర్తన యొక్క సామాజికపద్ధతుల మీద ఆధారపడి మీ పనులను చేయడానికి ప్రయత్నించవద్దు. ఇవి ముఖ్యంగా మీరు చేసే వృత్తి వాతావరణాన్ని ప్రభావితం చేయగలవు. ఈ విషయంలో సామూహిక లేదా సమిష్టి చైతన్యం పూర్తిగా భయం మీద ఆధారపడి ఉంటుంది: అంటే మీ ఉద్యోగం పోతుందనే భయం, సామాజికంగా వైఫల్యాన్ని పొందుతారనే భయం మరియు పేదరికం యొక్క భయం. ఈ భయాలన్నీ మీ ఇంగితజ్ఞానాన్ని కప్పిఉంచుతాయి. అయినప్పటికీ కూడా, మీ అంతర్వాణి మీరు ఏం చెయ్యాలనే దానిని తెలియజేస్తూనే ఉంటుంది. దీనికి పరిష్కారం: సాహసించి, మీ అంతర్వాణిని వినడమే మరియు ఇది మీకు సరైన సమాధానాలను అందించడం కూడా మీరు చూడగలరు.

మీరు అంతరంగా వెళ్ళటానికి ప్రయత్నించినప్పుడు, మీ వ్యక్తిగత-సందేహాలు మిమ్మల్ని అడ్డుకుంటూ, మీ హృదయపూర్వక వాంఛలను మరియు ఇంగితజ్ఞానాన్ని, అవాస్తవంగాను మరియు తప్పుగాను చూపిస్తూ, వాటి నుంచి బయటకు వచ్చేలా చేస్తాయి. వ్యక్తిగత-సందేహాలు, మీ కోసం వేయబడిన ఆధ్యాత్మికమార్గాన్ని విశ్వసించనివ్వకుండా అడ్డుకోవచ్చు. మీ ఆధ్యాత్మికమార్గం ద్వారా అంటే, ఈ మార్గంలోని అనుభవాలు మీ ఉన్నతమైన సృజనాత్మకత యొక్క మూలంతో బంధాన్ని ఏర్పర్చుకునేలా మిమ్మల్ని తీసుకువెళతాయి.

ఈ సృజనాత్మక శక్తులు మీ ద్వారా బయటకు ప్రవహించాలని కోరుకుంటున్నాయి. ఈ శక్తులు ఎప్పటినుంచో మీలో ఉన్నాయి. కాని మీ సొంత అనుభూతులను విని, వాటిని విశ్వసించడం ద్వారా మాత్రమే ఈ శక్తులను బాహ్యప్రపంచంలో వ్యక్తీకరించగలరు మరియు గుర్తించగలరు కూడా. మీ ఆత్మ మీ అనుభూతుల ద్వారా మీతో మాట్లాడుతుంది. వీటికి సంబంధించి బాహ్యంగా ఏ విధమైన హామీలు లేదా రుజువులు ఉండవు. ఇక్కడ నమ్మకమనేది చాలా ముఖ్యం. మీ అనుభూతులు మిమ్మల్ని తీసుకువెళ్తున్న మార్గాన్ని అంగీకరించడం మరియు మీ ఇంగితజ్ఞానం ద్వారా నటించడం అనేది, మీ హృదయం యొక్క మార్గదర్శకత్వపు బాధ్యతను మీ అంతట మీరు స్వీకరిస్తున్నట్టు మరియు మీ అహంభావపూరిత చైతన్యం నుండి హృదయపూరిత చైతన్యం వైపు పరివర్తనం చెందుతున్నట్టు అర్థం.

మీరు మూడవచక్రం ద్వారా ఆధిపత్యం యొక్క చివరిదశకు చేరుకున్నారు. మీ ఆత్మ ఈ విధంగా జీవించడాన్ని విడుదల చేయాలనే కోరికతోనే ఈ జన్మను తీసుకుంది. హృదయం నుంచి మీ సృజనాత్మకతను వ్యక్తపరచడానికి తీవ్రంగా ప్రోత్సహింపబడుతున్నారు. ఈ స్థితిలో మిమ్మల్ని మీరు విశ్వసిస్తూ, ఈ మార్గంలో కొనసాగమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరు ముందుగానే ఈ ప్రపంచంలోకి ఎంతో విలువైన న్యూఎనర్జీని (కొత్తశక్తి) తీసుకువస్తున్నారు. మీకు తెలియకుండానే ఈ శక్తి తరచూ భూమి మీద మార్పులకు కారణమవుతోంది. మీరు గుర్తించిన దానికంటే కూడా, మీరు భూమి మీద అతి ఉన్నతమైన పనిని చేస్తున్నారు. మీరు మీ ఆత్మ యొక్క ప్రవాహాన్ని నమ్మడం ద్వారానూ మరియు మీరు సులభం యొక్క ప్రవాహాన్ని అనుసరించడం ద్వారానూ, కొత్తశకం జన్మ తీసుకోవడానికి సహాయం చేస్తున్నారు. అందువలన ఏమాత్రం సందేహాలు లేకుండా మీ మార్గంలో కొనసాగించండి.

వృత్తి విభాగాలను తరచూ పరిపాలించే శక్తులైన 'పోటీతత్వం మరియు కఠినత్వాల' కన్నా కూడా, హృదయశక్తి మరింత నిశ్శబ్దంగాను మరియు సమర్ధవంతంగాను ఉంటుంది. అందువలన మీరు అహంభావపూరిత శక్తులచే ఆక్రమింపబడినప్పుడు, మీ హృదయకేంద్రంలో ఉండడానికి మీకు చాలా ధైర్యం మరియు బలం కావాలి. కాని నేను మీకు చెబుతున్నాను: మీరు ఆత్మప్రవాహాన్ని అనుసరించినప్పుడు, అది మీకు సృజనాత్మకమైన సామర్ధ్యాలను అందిస్తుంది. అవి చాలా వాస్తవంగాను, సహజంగాను ఉంటాయి. ఇవి మీకు మీ భౌతికప్రపంచంలో సమృద్ధిని అందజేస్తాయి. ఈ ప్రవాహానికి మీ అంతట మీరు మీ బాధ్యతను ఇవ్వడం అనేది విశ్వాసం మరియు ధైర్యానికి సంబంధించిన విషయం.

నేను మీకు హృదయశక్తి యొక్క రెండు ముఖ్య లక్షణాలను వివరిస్తానని చెప్పాను. నేను మొదటి లక్షణమైన 'సులభం యొక్క ప్రవాహం'తో ఆరంభించాను. నేను ఇప్పుడు రెండవలక్షణమైన "సమృద్ధి యొక్క ప్రవాహం" గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను. నేను దీనినే అవసరమైనంత ప్రవాహంగా పిలుస్తాను.

**అవసరమైనంత ప్రవాహం**

హృదయం యొక్క శక్తి మీ జీవితంలో నిజమైన సమృద్ధికి మూలంగా ఉంటుంది. సమృద్ధి అనేది మీ జీవితం యొక్క అన్ని భాగాలలో అంటే 'శారీరక, భౌతికపరమైన స్థితి' నుంచి 'మనోభావపరమైన, సామాజికపరమైన మరియు

ఆధ్యాత్మికపరమైన స్థితుల' వరకూ విస్తరించి ఉండాలి. ఈ స్థితులన్నింటిలోనూ మిమ్మల్ని మీరు పోషించుకోవడానికి మరియు మీతో మీరు ఆనందంగా గడపడానికే, మీరు ఇక్కడ ఉన్నారు. ఇప్పుడు నేను ముఖ్యంగా భౌతికపరమైన సమృద్ధి గురించి వివరించాలని అనుకుంటున్నాను. ఇది లైట్‌వర్కర్స్ ఆత్మలకు అదనపు బంధంగా ఉంటుంది.

సాధారణంగా లైట్‌వర్కర్స్ ఆత్మలు, మరియు ఆధ్యాత్మికత భావాలకు ప్రాముఖ్యతను ఇచ్చే ఆదర్శవంతమైన ప్రజలు డబ్బుని పనికిరానిదిగా చూస్తారు. డబ్బుని వీరు పాపంగాను మరియు తక్కువ శక్తిగాను పరిగణిస్తారు. డబ్బుని పనికిరానిదిగా పరిగణించడానికి గల ఒకానొక మూలకారణం: డబ్బును అధికారం మరియు సంపదలతో కలుపుతూ ఇతరులకు వెల కట్టడం వలన. నిజానికి డబ్బు, అధికారానికి పర్యాయపదంగా తయారయ్యింది. దీనిని చదువుతున్న మీలో చాలామందికి, భౌతికపరమైన సమృద్ధి యొక్క ప్రవాహంలో ఆటంకాలు ఏర్పడడానికి "ఈ కలయికే" ఒకానొక ముఖ్యమైన కారణం.

గొప్ప ఆధ్యాత్మిక ఆసక్తి గల లైట్‌వర్కర్ ఆత్మలు కూడా, డబ్బుని జీవితం యొక్క అల్పమైన మరియు నీచమైన విషయంగా పరిగణిస్తున్నారు. అందువలన ఈ భావనను అధిగమించాల్సిన అవసరం ఉంది. డబ్బుకి సంబంధించి చాలా చెడు అభిప్రాయాలను కలిగిఉన్నారు. ఈ అభిప్రాయాలు, మీరు భౌతికప్రపంచంలో ఎత్తిన గతజన్మల వలన ఏర్పడినవి, ఈ జన్మలు ఆడంబరత్వం మరియు నిరాడంబరత్వానికి సంబంధించినవి. ఈ జన్మలలో ఆధ్యాత్మిక విముక్తినే ప్రధానలక్ష్యంగా పెట్టుకుని ఒంటరిగా జీవితాన్ని గడిపారు. ఈ జన్మల యొక్క శక్తులు మీ శక్తిక్షేత్రంపై ఇంకా ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దీని ఫలితంగా మీలో నియమబద్ధంగా జీవించాలనే ధోరణి ఏర్పడింది, ఇదే మిమ్మల్ని ఇరుక్కుపోయేలా చేస్తోంది.

డబ్బు అమాయకమైనది. డబ్బు అనేది ఒక శక్తి ప్రవాహం, ఇది నిజానికి ఒక స్వచ్ఛమైన సామర్థ్యానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. డబ్బు అవకాశాలను అందిస్తుంది, డబ్బు అనేది ఒక సామర్థ్యమేగాని దీనిలో ఏ విధమైన చెడు లేదు. డబ్బును తీసుకోవడం వలన మీరు ఇతరులకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. డబ్బుతో మీరు ఇతరుల కోసం అందమైన మంచి విషయాలను సృష్టించగలుగుతారు. దీనిని ఆనందంగా అందుకోవడం వలన, మీరు మీకోసం మరియు ఇతరుల కోసం సమృద్ధి యొక్క ప్రవాహాన్ని విస్తరింపజేస్తారు. సృజనాత్మక వలయం, తరచూ డబ్బును తీసుకునే ప్రవాహాన్ని కూడా పెంచుతుంది. అప్పుడు తీసుకోవడం మరియు ఇవ్వడం యొక్క

ప్రవాహాలు సమన్వయమవుతాయి. ఇదే హృదయం యొక్క మార్గం అంటే. కాబట్టి డబ్బును తీసుకోవడానికి భయపడవద్దు.

నిజానికి మీరు ఉన్నతమైన బహుమతులను మరియు సామర్థ్యాలను ఈ ప్రపంచంతో పంచుకున్నప్పుడు, మీరు తిరిగి ప్రపంచాన్ని అడగడాన్ని గాని మరియు దాని నుంచి మీకు కావలసిన మరియు అవసరమైన వాటిని అందుకోవడానికి గాని, మీరు ప్రత్యేకమైన కేటాయింపులను కలిగిఉంటారు. ఇలా ప్రతిఫలంగా మీరు తీసుకోవడానికి చాలా బాధపడతారు. ఎందుకంటే మీ కాళ్ళపై మీరు నిలబడాలని మరియు తీసుకునేతత్వాన్ని ఆనందించకూడదు అనే మొదలైన పురాతనమైన అభిప్రాయాలు మిమ్మల్ని అడ్డుకుంటున్నాయి కనుక. కాని విశ్వం యొక్క రహస్యం సమన్వయమే. ఈ జన్మలో మీ ఉన్నతమైన సామర్థ్యాన్ని, మీ యొక్క స్థితులన్నింటిలోను వ్యక్తపరచడానికి శక్తి అవసరమనే విషయం "విశ్వానికి" తెలుసు. ఈ విధంగా చేయడం ఏ మాత్రం పాపం కాదు. మీరు నిజమైన సృజనాత్మకతతో హృదయం నుంచి స్పందించినప్పుడు, మీరు తీసుకునే ప్రవాహాన్ని ఆకర్షిస్తారు. ఈ ప్రవాహాన్ని లోపలికి అనుమతించడం ద్వారా మాత్రమే, మీరు సృజనాత్మక ప్రవాహాన్ని సజీవంగా బయటకి ప్రవహింపజేస్తూ దానిని వృద్ధి చేసుకోగలరు.

మీరు సమృద్ధి లేదా డబ్బు యొక్క ప్రవాహాన్ని, మీ జీవితంలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారనే నిజాన్ని మీరు ఎరుకతో గుర్తించ లేకపోవచ్చు, లేదా మీరు డబ్బు మీద అంతర్లీనంగా అయిష్టతను కలిగి ఉండవచ్చు. డబ్బుకు సంబంధించిన మీ అంతర్ ఆలోచనలను మరియు మనోభావాలను పరిశీలించుకోవడానికి కొంత సమయాన్ని కేటాయించండి. మీ జీవితంలోకి సమృద్ధి యొక్క ప్రవాహాన్ని రానీయకుండా, ఇవే అడ్డుకుంటున్నాయనే విషయాన్ని మీరు సులభంగా గుర్తించవచ్చు. మీరు భూమి మీద జీవితాన్ని ఆనందంగా గడపడానికే వచ్చారనే నిజాన్ని తెలుసుకోండి! మీరు అందమైన విషయాల ద్వారా ఆనందాన్ని పొందడం, ఇంద్రియాల ద్వారా లాలింపబడడం, లేదా మీ హృదయాన్ని ఉత్తేజంతో నింపుకోవడం అనేవి చాలా సహజమైన విషయాలు. ఇది మీ ఇల్లు, మీరు కొంతసేపు జీవించడానికి వచ్చిన ప్రదేశం. అందువలన మీకు నచ్చిన విధంగా మీ చుట్టూ ఉన్న భౌతికపరిస్థితులను సృష్టించుకోవడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకోండి. కేవలం భూమిని మరియు భౌతికవాస్తవికతను ప్రేమించడం ద్వారా, మీరు సమృద్ధి యొక్క ప్రవాహాన్ని సృష్టించగలరు. మీ మాటను భూమి వింటుంది, అది మీకు కావలసిన ప్రతీ దానిని అందించాలని అనుకుంటోంది. ఇది మీకు ఒక ఆధ్యాత్మికవేత్తగా ఎదగడానికి మరియు

పరిణామం చెందడానికి అవసరమైన దానిని అందించడమే కాకుండా, మీరు ఒక మనిషిగా జీవితాన్ని ఆనందించడానికి కావలసిన వాటిని కూడా అందజేస్తుంది.

అందువలన, దయచేసి మీ లోతైన స్థాయిల నుంచి భౌతికసమృద్ధి యొక్క వైఖరిని పట్టించుకోవడానికి ప్రయత్నించండి. కొత్తభూమిని నిర్మించడానికి సహాయపడే అవకాశాలను, మీ సమృద్ధి యొక్క ప్రవాహం మీకు అందిస్తున్నట్లు అనుభూతి చెందండి. ఈ సమృద్ధి, ఈ సాంద్రత కలిగిన భూ వాస్తవంపై మీ కలలను నిజం చేసుకోవడానికి అవసరమైన అవకాశాలను అందిస్తున్నట్టు కూడా అనుభూతి చెందండి. ఈ సమాజం నుంచి మీ అంతట మీరుగా విడిపోవడానికి గాని మరియు సమాజం నుంచి దూరంగా వెళ్ళి పర్వత శిఖరాలపై ధ్యానం చేయడానికి గాని, ఇది ఎంతమాత్రం సమయం కాదు. ఈ సమయం పాల్గొనడానికి సంబంధించినది. ఇది మీ శక్తిని ప్రపంచంలోకి వెళ్ళనిచ్చే సమయం మరియు దీనికి బదులుగా మీ దగ్గరకు తిరిగి వచ్చే వాటిని స్వేచ్ఛగా అందుకునే సమయం కూడా. అందువలన సమృద్ధిని అందుకోవడానికి భయపడవద్దు. మీ సొంత జ్ఞానాన్ని గౌరవిస్తూ, మీరు కష్టపడిన దానికి ప్రతిఫలాన్ని అందుకోండి. ఈ సంపూర్ణమైన సమన్వయాన్ని కలిగిఉండడమే నిజమైన ఆధ్యాత్మికవేత్త యొక్క లక్షణం.

నేను అవసరమైనంత అనే పదం గురించి ఇంకా వివరించి చెప్పాలనుకుంటున్నాను. మొదటిగా నేను సులభం యొక్క ప్రవాహం ద్వారా, హృదయం యొక్క శక్తిని విశ్లేషించాను. మీ మార్గంలో ప్రతీ విషయం సులభంగా జరుగుతున్నప్పుడు మరియు మీకు కావల్సినవి మీ మార్గంలో సహజంగా సంభవిస్తున్నప్పుడు, మీరు హృదయం యొక్క ప్రవాహంతో పయనిస్తున్నారని అర్థం. ఇదే మీకు సంకేతంలా ఉ ంటుంది. నేను రెండవ శక్తి యొక్క ప్రవాహాన్ని అవసరమైనంత ప్రవాహంగా వివరించాను. అవసరమైనంత అంటే అర్థం: నేను సంపూర్ణమైన దివ్యత్వం గల మానవుడిగా ఉండడానికి అవసరమైన ప్రతీది కూడా ఇప్పుడు నాకు అందుబాటులో ఉంది అని. అవసరమైనంత ప్రవాహంలో జీవించడమంటే, మీరు కలిగిఉన్న వాటితో సంతృప్తిచెందుతూ మరియు వాటిపై కృతజ్ఞతాభావాన్ని కలిగిఉండడమే. మీరు మీ చుట్టూ ఉన్న భౌతిక, మనోభావ, మానసిక, ఆధ్యాత్మికస్థాయిల ద్వారా వృద్ధిచెందాన్ని అనుభూతి చెందండి. అదే సమృద్ధి అంటే. అదే అవసరమైనంత సమృద్ధిని కలిగిఉ ండడం అంటే.

అవసరమైనంత ప్రవాహం యొక్క అనుభవాన్ని పొందడమంటే అర్థం: మీరు వర్తమానంలో కలిగిఉన్న దానిని ఆనందించడమే. సమృద్ధిని అనుభవించడం

అనేది, మనస్సు యొక్క భావాధీనమైన స్థితికి సంబంధించిన విషయమని మీ అందరికి తెలుసు. అది మీ చుట్టూ ఉన్న పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. "భౌతికపరమైన సమృద్ధి"ని మీ ఆనందం యొక్క అనుభవంతో పోల్చాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. సమృద్ధిని అనుభవించడం అంటే ధనవంతులుగా ఉండడం కాదు, దీని అర్థం మీ చుట్టూ ఉన్న పరిస్థితులన్నింటి యొక్క గొప్పదనాన్ని అనుభూతి చెందడమే. మీకు ఆనందాన్ని మరియు సంపూర్ణత్వాన్ని ఇచ్చే భౌతిక సమృద్ధిని మీ అంతట మీరుగా కనుగొనాలి. కొంతమంది ప్రజలు  దీనికి అర్థం ప్రశాంతమైన గుడిసెలో జీవిస్తూ ప్రకృతిని ఆనందించడమే అని అనుకుంటారు. కాని వేరే వారికి ఇది పట్టణంలోని ఒక విలాసవంతమైన స్థలం. దీని పట్ల మా వైపు నుంచి గాని, దైవం నుంచి గాని, ప్రజ్ఞాత్మ నుంచి గాని ఏ విధమైన అభిప్రాయం లేదు.

అవసరమైనంత అనే దానికి అర్థాన్ని మీకోసం మీరు తెలుసుకోవాలి. ఇక్కడ అతి ముఖ్యమైన విషయం: మీకు ఆనందాన్ని ఇచ్చే ప్రవాహాన్ని మరియు మీరు జీవితాన్ని సంపూర్తిగా జీవిస్తున్నారనే అనుభూతిని కలిగించే ప్రవాహాన్ని, మీ అంతట మీరుగా కనుగొనాలి. ఇదే అవసరమైనంత ప్రవాహం అంటే. మీరు కలిగిఉన్న భౌతికపరమైన వస్తువుల ద్వారా ఈ ప్రవాహాన్ని గుర్తించలేరు. దీనిని కేవలం మీ నిత్యజీవితంలో, మీరు కలిగిఉన్న ఆనందం మరియు సంతృప్తుల యొక్క అనుభూతి ద్వారా మాత్రమే గుర్తించగలరు. అవసరమైనంత  అనేది ఒక "అనుభూతే" గాని, ఒక వస్తువు ఎంత మాత్రం కాదు.

మీరు రెండు మార్గాల ద్వారా ఈ ప్రవాహం నుంచి బయటకు వెళ్ళిపోగలరు. మీరు "అవసరమైన దానికన్నా ఎక్కువగాను" లేదా "అవసరమైన దానికన్నా తక్కువగాను" కోరుకుంటారు. మీరు "అవసరమైన దానికన్నా ఎక్కువగా" కోరుకుంటున్నట్లయితే, 'మీరు నిజానికి భౌతిక సమృద్ధి యొక్క అవసరం లేకపోయినా దానిని కాంక్షించడం కావచ్చు', లేదా 'మీకు నిజంగా ఆనందించ గల సామర్థ్యం ఉందని ఎక్కువగా కాంక్షించడం కావచ్చు'. అధికంగా ఆస్తిని కూడబెట్టడం అనేది జీవితాన్ని క్లిష్టతరం చేస్తుంది మరియు ఇది మీ జీవితంలోని ఆనందాన్ని మీకు దూరం చేస్తుంది. ఆనందం అనేది స్వేచ్ఛతో కూడిన సులభమైన జీవితవిధానంలోనే ఎదుగుతుంది. మీరు అవసరమైన దానికంటే అధికంగా డబ్బును కలిగిఉండాలని ప్రయత్నిస్తున్నట్లయితే, మీరు తరచూ దీనిని సురక్షితమైన భవిష్యత్తులా అనుభూతి చెందుతారు. మీరు డబ్బుని భవిష్యత్తు యొక్క భద్రత కోసం కలిగిఉండాలనే వ్యసనానికి లోనవుతారు. కాని ఇది, వర్తమానంలో సమృద్ధిని అనుభవించడం మాత్రం కాదు.

ఇది భౌతికసంపద యొక్క మధ్యలో ఉంటూ లోటును అనుభవించడమే అవుతుంది! మీరు నిజంగా అవసరమైనంత ప్రవాహంలో ఉండడం అంటే, మీ అంతరంలో కలిగి ఉన్న భయాలన్నింటిని విడుదలచేస్తూ, మీరు కలిగిఉన్న దానితో ఆనందంగా జీవించడానికి సాహసించడమే. ఈ విధంగా ఆనందించినపుడు మీ జీవితంలో కలిగిఉన్న వాటిని మరింతగా ఆకర్షిస్తారు; ఇది మిమ్మల్ని, మీ అవసరమైనంత ప్రవాహంలో ఉండేలా చేస్తుంది. మీరు అధికంగా భౌతికసంపద యొక్క భద్రత కావాలని ఆలోచించడం మొదలుపెట్టినట్లయితే, మీరు భయాలలో పడిపోతారు. కాని నిజానికి మీకు కావలసినది అధిక విశ్వాసం మరియు తక్కువ భయం.

మీరు "అవసరమైన దానికన్నా తక్కువగా" భౌతికసంపదను కలిగిఉన్నప్పుడు కూడా, మీరు భయాలలో ఇరుక్కుపోతారు. కానీ, ఈ పరిస్థితిలో మీ అంతట మీరు ప్రపంచంలోకి వెళ్ళి, మీ గురించి మీరు స్వేచ్ఛగా వ్యక్తపరుచుకోవడానికి మరియు దానికి బదులుగా ప్రపంచం నుంచి తిరిగి తీసుకోవడానికి కూడా భయపడతారు. మీరు సంపూర్తిగా జీవితాన్ని గడపడానికి కూడా భయపడతారు. మీరు దీనికి అర్హులు కారని, మీకు దీనిని పొందే సమర్థత లేదని మీరు భావించవచ్చు. లేదా మీరు అన్నింటిని కలిగిఉండడాన్ని మరియు వాటికి సంబంధించిన పూర్తి గుర్తింపును పొందడాన్ని పాపంగా భావించవచ్చు. నిజానికి మీరు, మీ సహజమైన అందాన్ని మరియు అమాయకత్వాన్ని అనుభూతి చెందవలసిన అవసరం ఉంది.

మీ గురించి మీరు స్వేచ్ఛగా వ్యక్తపరుచుకోవడానికి మరియు మిమ్మల్ని మీరు ఉన్నదిఉన్నట్టుగా ప్రేమించుకోవడానికి మాత్రమే, మీరు ఇక్కడ ఉన్నారు. మీరు, మీ ఆత్మ యొక్క బహుమతిని ప్రపంచంతో పంచుకున్నట్లయితే, ప్రపంచం మరింత అందమైన మరియు ప్రకాశవంతమైన స్థలంగా రూపొందుతుంది. దీనికి బదులుగా, పపంచం మీకు అవసరమైన దానిని ఇచ్చి మిమ్మల్ని దీవిస్తుంది. "విశ్వం" సమృద్ధితో సిద్ధంగా ఉంది.  మీ నిజ స్వభావాలైన స్వచ్ఛత మరియు అపరిమితమైన ప్రేమలతో ఉన్నట్లయితే, మీరు ఈ ప్రవాహంలో భాగంగా ఉండగలరు.

"అవసరమైనంత" అనేది మనిషి యొక్క సహజస్థితి. మీరందరూ దీని యొక్క అనుభవాన్ని పొందడానికే ఇక్కడ ఉన్నారు. అవసరమైనంత ప్రవాహం మీ అందరికీ అందుబాటులో ఉంది. మితానికి స్థిరపడడం అనేది అర్థంలేని పనిగా ఉంటుంది. నిరాడంబరత్వం ద్వారా లేదా పేదరికం ద్వారా, ఆధ్యాత్మిక ఎదుగుదలను పొందుతారు అనేది నిజం కాదు. దీని కారణంగానే, మీరు ద్వేషం లేదా శత్రుత్వం

యొక్క అనుభూతులను ఎక్కువగా పెంపొందించుకున్నారు. మీ సమృద్ధి లేమి గురించి: దయచేసి ఆధ్యాత్మికపరంగా సమర్థించుకోవడానికి ప్రయత్నించవద్దు. మీరందరూ సంపూర్తిగా జీవితాన్ని ఆనందించడానికి, మీ సృజనాత్మకత శక్తి యొక్క ప్రవాహాన్ని ఈ ప్రపంచంలోకి ప్రవహింపజేయడానికి మరియు దీనికి బదులుగా ఆనందాన్ని, సంతృప్తిని మరియు భౌతికసమృద్ధిని పొందడానికి మాత్రమే, మీరందరూ ఇక్కడ ఉన్నారనే విషయాన్ని మరచిపోవద్దు. అవసరమైనంత ప్రవాహంతో కలసి పయనించడానికి సాహసించండి!

## అవసరమైనంత ప్రవాహాన్ని సృష్టించడం

మీరు ఈ ప్రవాహం నుంచి బయటకు వస్తున్నట్లు మీకు అనిపిస్తే, మీ జీవిత పరిస్థితులను ఒకసారి క్షుణ్ణంగా గమనించండి మరియు ఇది మీకు ఒక శక్తి సందేశాన్ని ఇస్తున్నట్లు అర్థం చేసుకోండి. "ఇప్పుడు నేను ఈ విధంగా నా వాస్తవాన్ని సృష్టించుకున్నాను." దీనికి సంబంధించి, మిమ్మల్ని లేదా ఇతరులను గాని నిర్ణయించవద్దు. వీటిని కేవలం గమనించండి.

మీ ప్రస్తుత పరిస్థితి యొక్క శక్తిని అనుభూతి చెందండి. అది మీ ఇల్లు, లేదా మీ సామాజిక జీవితం, లేదా మీ వృత్తి గాని కావచ్చు. నిజానికి వీటిని, మీ హృదయం కోరుకున్న వాటితో పోల్చి చూడండి. మీరు కోరుకున్న వాటిని నిజంగా అనుభూతి చెందడానికి కొంత సమయాన్ని కేటాయించండి. దయచేసి, మిమ్మల్ని మీరు అలసట లేదా నిరాశకు సంబంధించిన స్పష్టతలేని భావనలతో నిర్ణయించుకోవద్దు. కాని, మీ జీవితంలో మీకు ఏది కావాలనేది మాత్రం, మీకు మీరు స్పష్టంగా వివరించుకోండి.

ఇలా చేయడం వలన, మీరు "కొరత" కలిగిన విషయాల పట్ల ఎరుకను పొందుతారు. దీని ఫలితంగా మీలో ఏర్పడిన బాధను గమనించండి. దయచేసి, ఆ 'అసంతృప్తి' లేదా 'లేమి' యొక్క భావనలో మునిగిపోవద్దు. మిమ్మల్ని బాధపడేలా చేయడానికి ఇది ఒక అభ్యాసం మాత్రం కాదు. మీరు కలిగిఉన్న వాంఛలపై మీ దృష్టిని ప్రశాంతంగా కేంద్రీకరిస్తూ, వీటినే మీ ఆత్మ మీకోసం కోరుకుంటోందని లోతుగా అర్థం చేసుకోండి. ఈ జన్మలో మీ ఆత్మ చేయాలనుకున్న దానికి దిశను, మీకు ఈ వాంఛలు చూపిస్తాయనే నమ్మకాన్ని కలిగిఉండండి. వీటిని నిజం చేసుకోవడానికి, మీకు విశ్వం ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది.

ఈ హృదయపూర్వక కోరికలపై మీ దృష్టిని కేంద్రీకరించి, వీటిని నిశ్శబ్ధమైన మరియు తెరవబడిన ఎరుకతో గమనించినంత మాత్రంగానే, పరిస్థితులలో మార్పు రావడం మొదలవుతుంది. మీరు ఎవరనేది గుర్తించడమే, మీ నిత్యజీవితంలో మార్పులు సంభవించడానికి ఒక పెద్ద "అయస్కాంతంలా" ఉంటుంది. అందువలన భౌతికస్థాయిలో మార్పుకోసం ఏ మాత్రం బలవంతం చేయవలసిన అవసరం లేదు. మీరు కోరుకుంటున్న వాంఛలను లోతుగా అనుభూతి చెందుతూ (మనోభావపరంగా కాదు), ఆ తర్వాత వాటిని మీ హృదయం యొక్క చేతులలో వదిలివేయండి. కేవలం వాటిని విడుదల చేయండి మరియు వాటిని నమ్మండి.

మీ జీవితంలోని పరిస్థితులు మార్పుచెందడం మొదలుపెడతాయి. మీరు మొదటిగా మీలో చాలా లోతుగా పాతుకుపోయిన అలవాట్లను, అంటే మీ ఆలోచనారీతి, అనుభూతులు మరియు మీరు ఇతరులకి స్పందించే విధానాన్ని అతిసన్నిహితంగా గమనించడం మొదలుపెట్టండి. ఆ తర్వాత, మీ నిజమైన లక్ష్యాలకు సహాయం చేయని బంధాలు లేదా ఉద్యోగాల నుంచి విడిపోవచ్చు మరియు వాటి నుంచి తొలగింపబడవచ్చు. ఈ ప్రవాహం నెమ్మదిగా ఉన్నప్పటికీ, ఇది మిమ్మల్ని మీ లక్ష్యాల వైపు తప్పకుండా తీసుకువస్తుందనే విషయాన్ని మీరు విశ్వసించండి. మీ జీవితంలో సంభవించిన పరిస్థితులపై శ్రద్ధను వహించండి. ఇతరులు మీకు చెబుతున్న లేదా ఇతరులు మీకు చేస్తున్న విషయాలలో, తరచూ ఒక నిగూఢమైన సందేశం ఉంటుంది. అది మీకు మీ లక్ష్యానికి సంబంధించి మీరు ఎక్కడ ఉన్నారనేది తెలియజేస్తుంది.

మీ హృదయపూర్వక వాంఛలను అర్థం చేసుకున్నప్పుడు, భౌతికస్థాయిలో మీకు కావలసినవన్నీ కూడా కష్టపడకుండా సులభంగా, శూన్యం నుంచి మీ జీవితంలోనికి ప్రత్యక్షమవుతాయి. ఇవి మీ జీవితంలోనికి సులభంగా మరియు తేలికగా ప్రవేశిస్తాయి. ఇవి చూడడానికి అద్భుతంగా అనిపిస్తాయి. అదే సమయంలో ఇవే మీకు సరిగ్గా అనుకూలమైనవి అని అనుభూతి చెందుతారు. ఇవి మీ గ్రహింపు, ప్రయత్నం, బలవంతం మరియు ఒత్తిడి ద్వారా, మీ దగ్గరకు వచ్చేవి ఎంత మాత్రం కాదు. కేవలం మీ నిజమైన అవసరాల పట్ల నిశ్శబ్ధమైన ఎరుకను పొందినప్పుడు, మీరు నిజాయితీతో వీటిని ఎదుర్కొనప్పుడు మరియు వీటిని ధైర్యంగా విశ్వసిస్తూ వదిలివేసినప్పుడు మాత్రమే, ఇవి మీ జీవితంలోకి రాగలవు. మీరు ఈ ప్రవాహాన్ని మీ జీవితంలో చాలా సులభంగా పొందగలరు. మీ హృదయం యొక్క వాంఛలను గౌరవిస్తూ, వాటిపై దృష్టిని కేంద్రీకరిస్తూ మరియు వాటికి ఆధీనమైనప్పుడే, అవి మీకు "అవసరమైన వాస్తవాన్ని" అందిస్తాయి.

⋆ ⋆ ⋆ ⋆

# ఆరోగ్యం-అనారోగ్యం

డియర్ ఫ్రెండ్స్, నేను మీకు హృదయపూర్వక స్వాగతాన్ని పలుకుతున్నాను. నా ప్రేమను మీ అందరికి అందిస్తున్నాను. నేను మిమ్మల్ని చాలా ఎక్కువగా ప్రేమిస్తున్నాను. మీకు అందించే నా ప్రేమ అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ కూడా, మీ అందరిని వ్యక్తిగతంగా స్పృశించగలదు. నేను ఒకానొకప్పుడు భూమి మీద మీతోపాటు జీవించాను. అందువలన మీలో చాలా మంది నాకు తెలుసు.

నేను జెషువాని. నేను భూమి మీద జీసస్‌గా జీవించాను మరియు నేను మన అంతరంలోని మూల చైతన్యం యొక్క ప్రేమ, మన అందరికీ అందుబాటులో ఉందనే విషయాన్ని స్పష్టంగా తగిన ఆధారాలతో వివరించడానికి మీ అందరి మధ్యలో జీవించాను. ఇప్పుడు మీ కాంతిని అందుకునే సమయం ఆసన్నమైనది. మీలోని క్రీస్తు చైతన్యం యొక్క బీజాలు, ఈ రోజు వికసించబోతున్నాయి. ఇదే క్రీస్తుశక్తి యొక్క పునర్జన్మ అంటే. ఇది, భూమి మీద ఒకానొకప్పుడు జీవించిన జీసస్‌కి సంబంధించిన శక్తి కాదు. ఇప్పుడు విశ్వమంతటా వ్యాపించి ఉన్న క్రీస్తుశక్తి యొక్క మూల చైతన్యమే మీ అంతరంలో జన్మించబోతోంది. మీతో ఉంటూ ఈ విధంగా మీకు సహకారాన్ని అందించడం, నాకు చాలా ఆనందంగా ఉంది.

ఈ రోజు ఛానెలింగ్ ముందు, పమేలా మరియు గెరిట్, మీరు ఏ అంశం గురించి ప్రస్తావిస్తున్నారు అని నన్ను అడిగారు. నేను వారికి ఈ విధంగా చెప్పాను: “ఇక్కడ ఏ అంశం అనేది అంత ముఖ్యమైనది కాదు, నేను మీతో ఉండాలని అనుకుంటున్నాను.” నేను నా శక్తితో మిమ్మల్ని తాకుతూ, మీ గొప్పతనాన్ని మీకు గుర్తుచేయాలని అనుకుంటున్నాను. నా శక్తిని విస్తరింపజేస్తూ, మిమ్మల్ని అందరిని స్పృశించడానికి వెనుక ఉన్న నా ఆశయం ఏమిటంటే, మీరు, మీ అంతరంలోని స్పష్టత యొక్క వెలుగును, మీ వాస్తవం యొక్క వెలుగును అనుభూతి చెందాలని. ఇదే క్రీస్తుశక్తి యొక్క సారాంశం. మొదటిగా నేను ఈ వెలుగుకు వాహకంగా ఉన్నాను, కాని ఇప్పుడు భూమి మీదకి ఈ వెలుగును మీరు తీసుకురావలసిన సమయం వచ్చింది. మీ అంతరంలో మీరు ఎవరనేది గుర్తించడం అనేది చాలా ముఖ్యం. ఈ వెలుగును మీతో మోస్తూ, దీనిని ప్రపంచానికి చూపించే సమయం వచ్చిందని, మరియు దీని కోసం ప్రపంచం ఎదురుచూస్తోందనే విషయాన్ని మీరు గుర్తించాలి. ఇది పరిణామం చెందే సమయం, ఈ సమయంలో గొప్ప మార్పులు సంభవిస్తున్నాయి. ఈ మార్పులు చీకటి-వెలుగుల యొక్క అనేక రూపాలను చూపిస్తాయి. విశాలమైన దృక్పథం గల మనుష్యుల కోసం సమయం సిద్ధమైంది.

వీరు ప్రశాంతమైన మరియు నిర్మలమైన మన:స్థితి నుంచి, చీకటి–వెలుగుల యొక్క వ్యక్తీకరణలన్నింటినీ చూడగలరు మరియు వీటిపై ఎటువంటి నిర్ణయాలు లేకుండా వీటితో ప్రేమగా  ఉండగలరు.

ఈ రోజు నేను ఆరోగ్యం మరియు అనారోగ్యం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఇక్కడ      ఉన్నాననే విషయాన్ని అనుభూతి చెందండి. 'నేను మీకు సమానమేనని మరియు మీరు నాకు సమానమేనని', మనమందరం ఒక్కటేనని, మీరు అనుభూతి చెందండి. మనం ఒక ప్రత్యేకమైన కాంతిశక్తి యొక్క వాహకులుగా ఉన్నాం. చాలా జన్మలుగా, చాలా కాలంగా, మనం ఈ శక్తిని భూమి మీద నెలకొల్పాలని మరియు ప్రసరింపజేయాలనే విషయం మీద పని చేస్తున్నాం. ఇదే మీ ఉద్యోగం. ఇదే మీ లక్ష్యం.

నా సలహాల కోసం ఎదురుచూడకుండా, మీరు నన్ను వదిలి ముందుకు వెళ్ళే సమయం వచ్చింది.  నేను కేవలం మీ స్నేహితుడిని మరియు మీ సోదరుడిని. అంతేగాని మీరు అనుసరించాల్సిన గురువును మాత్రం కాదు. నా ప్రేమ మరియు నా వాస్తవం యొక్క శక్తులతో, నేను మిమ్మల్ని హత్తుకోవాలని కోరుకుంటున్నాను. ఇది మాత్రమే నేను చేయగలను. ఇప్పుడు మీ కాళ్ళ మీద మీరు నిలబడుతూ, మీ కాంతి యొక్క వెలుగును ప్రకాశింపజేయండి.

ఆరోగ్యం–అనారోగ్యం అనే అంశాలు, ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరి జీవితంలోనూ సంభవిస్తాయి. నేను మొదటిగా అనారోగ్యం అంటే ఏమిటో వివరించాలని అనుకుంటున్నాను. అనారోగ్యాలు అన్నీ కూడా ఆధ్యాత్మిక మూలాన్ని కలిగిఉంటాయి. మీరు కలిగిఉన్న ప్రత్యేకమైన శరీరాల యొక్క ప్రాముఖ్యత గురించి, నేను మీకు వివరించాలని అనుకుంటున్నాను. మీ అందరికీ కనిపిస్తున్న భౌతికశరీరంతో పాటు, మీరు మనోభావ శరీరాన్ని, మానసిక శరీరాన్ని మరియు ఆధ్యాత్మిక శరీరాన్ని కూడా కలిగిఉన్నారు.

అనారోగ్యం మొదటిగా మనోభావ శరీరంలో మొదలవుతుంది. ఈ శరీరం నుంచే కొన్ని ప్రత్యేకమైన అడ్డులు వాటంతటవి, భౌతికస్థాయిలోని మానవశరీరంలో స్థిరపడిపోతాయి. మానసిక శరీరంలో ఉన్న నమ్మకాలు, ఈ మనోభావ సంబంధిత అడ్డుల యొక్క అభివృద్ధికి సహకరిస్తాయి. ఇవే అనారోగ్యం ఏర్పడడానికి  కారణం అవుతాయి. నేను ఇప్పుడు మీ అంతరంలో లోతుగా పాతుకుపోయిన నమ్మకాల గురించి, లేదా మీరు అలవాటుపడిన ఆలోచనారీతి గురించి మాట్లాడుతున్నాను. తరచూ ఈ నమ్మకాలు మీకు సంబంధించి ఏది మంచో, ఏది చెడో వివరిస్తుంటాయి.

ఈ నిర్ణయాలు మీ మనోభావపరమైన శక్తి క్షేత్రంలో అడ్డులను ఏర్పరచవచ్చు. ఈ అడ్డులు ఏర్పడిన ప్రదేశాలలో, మనోభావపరమైన శక్తి స్వేచ్ఛగా ప్రవహించలేదు మరియు ఒక విధమైన చెడుశక్తి మీ శక్తి క్షేత్రంలో లేదా ఆరాలో కనిపిస్తుంది. ఈ శక్తి మీ శరీరంలో స్థిరపడి అనారోగ్యంగా తయారవ్వవచ్చు. ఈ విధంగానే జరగవలసిన అవసరం లేదు, ఎందుకంటే ఈ ప్రక్రియకు కొంతసమయం పడుతుంది కనుక. అందువలన అనారోగ్యం దానంతట అది మీ భౌతికశరీరంలో కనపడే ముందే, పరిస్థితులను మనోభావపరంగా సమన్వయపర్చుకుని నయం చేసుకునే అవకాశం మీకు ఉంటుంది.

సాధారణంగా మీ మనోభావాలు, మీ శక్తి స్వేచ్ఛగా ప్రవహించడం లేదనే విషయాన్ని తెలియజేస్తాయి. మీరు వీటి యొక్క సందేశంపై ఆసక్తిని చూపిస్తూ, వీటిని గౌరవించినప్పుడు మీ అడ్డులు విడుదల చేయబడతాయి. ఉదాహరణకు మీరు ఒకానొక పనిని చేసిన ప్రతీసారి, మీరు కోపాన్ని లేదా నిరాశను అనుభూతి చెందవచ్చు. ఆ సమయంలో మీ మనోభావాలను సన్నిహితంగా గమనించినట్లయితే, మీరు కొన్ని విషయాలను బలవంతంగా చేస్తున్నారని, మీరు ఎవరనే దానికి మరియు మీరు కావాలనుకుంటున్న దానికి భిన్నంగా ఉన్నాయనే విషయాన్ని అవి మీకు తెలియజేస్తాయి. మీరు మీ కోపాన్ని పట్టించుకోకుండా వదిలివేస్తూ మరియు మీరు సరైనవి అని అనుభూతి చెందని పనులను చేయడానికి, మిమ్మల్ని మీరు బలవంతం చేసుకున్నట్లయితే, అప్పుడు మీ మనోభావాలు మీలోని అట్టడుగు భాగానికి వెళ్ళిపోతాయి. ఇవి వాటంతటవే మీ ఎరుక నుంచి తొలగించబడతాయి మరియు ఇవి మీ భౌతికశరీరంలో వ్యక్తపరచబడతాయి. ఈ అణచి వేయబడిన మనోభావం ఒక శక్తి లాంటిది. మీరు, వీటి గురించి వినాలని కోరుకుంటాయి. ఇవి వాటంతటవి, మీ శరీరంలో వ్యక్తపరచబడినప్పుడు, అది ఒక అనారోగ్యంగా ఏర్పడుతుంది.

సాధారణంగా ఈ భౌతిక ఫిర్యాదు లేదా అనారోగ్యం, మీ ఎరుకలో లేని మనోభావాల గురించి తెలుపుతుంటాయి. వేరొక స్థాయిలో, ఇవి రోగానికి సంబంధించిన భౌతిక లక్షణాలను మీకు కనిపించేలా చేస్తాయి. ఈ విధంగా మీ అడ్డుతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి సహాయం చేస్తాయి. ఈ విధమైన అనారోగ్య లక్షణాలు లేదా నొప్పులు అనేవి "ఆత్మ యొక్క భాష". ఆత్మ, తన భాగాలన్నీ ఒకదానితో ఒకటి పూర్తి సమన్వయంతో కలుపబడి ఉండాలని కోరుకుంటుంది. తన భాగాలన్నింటిలో శక్తి ప్రవాహం స్వేచ్ఛగా ప్రవహించినప్పుడు మరియు తన భాగాలన్నీ వాటంతటవి నిరంతరం కొత్తదనంతో రూపాంతరం చెందుతున్నప్పుడు, ఆత్మ ఆనందాన్ని అనుభూతి

చెందుతుంది. మనోభావపరమైన అడ్డులు శక్తిని స్వేచ్ఛగా ప్రవహించనివ్వకుండా ఆటంకపరుస్తాయి. దీని కారణంగా ఆత్మ నిరాశకు లోనవుతుంది.

అనారోగ్యం మనోభావాన్ని సూచించే ఒక సూచికలా పని చేస్తుంది: ఇది మీకు హీలింగ్ అవసరమైన ప్రదేశాలను చూపిస్తుంది. అనారోగ్యం చూడడానికి చెడుగా అనిపించినప్పటికీ, అంటే మీరు అనేక రకాల లక్షణాలతో మరియు నొప్పులతో బాధపడుతున్నప్పటికీ, అనారోగ్యాన్ని ఒక సందేశంగాను లేదా మార్గాన్ని సూచించే దిక్సూచిగాను గుర్తించడమనేది అత్యవసరం. ఇలా చేయడం వలన మీరు అనారోగ్యాన్ని సులభంగా నయం చేసుకోగలుగుతారు. అనారోగ్యాన్ని ప్రతిఘటించకుండా మరియు దానికి సహకరించడం వలన, మీరు దాని యొక్క మూలం దగ్గరకి వెళ్ళగలుగుతూ దానిని సులభంగా నయం చేసుకోగలరు.

ఆత్మ మీతో మాట్లాడడానికి చాలా మార్గాలను కలిగిఉంది. ఆత్మ మీ ఇంగిత జ్ఞానం ద్వారా మాట్లాడడానికి ఎక్కువగా ఇష్టపడుతుంది: హృదయం యొక్క నిశ్శబ్దమైన అనుభూతి స్వరాలు మరియు మెత్తని గుసగుసలు. ఒకవేళ మిమ్మల్ని ఈ విధంగా చేరలేక పోయినట్లయితే, మీ మనోభావాల ద్వారా మిమ్మల్ని హెచ్చరిస్తుంది. మనోభావాలు గట్టిగా వినబడే భాషలో మాట్లాడతాయి. ఇవి మీరు, మీ అంతరంలోకి చూడాలని మరియు ఈ మనోభావపరమైన ప్రతిస్పందనను రగిలించే దానిని కనుగొనమని మీకు స్పష్టంగా తెలియజేస్తాయి. ఎప్పుడైతే మీరు మీ మనోభావాలకు తీవ్రంగా ప్రభావితం చెందుతారో, అప్పుడు అది మీకు చెప్పాలనుకుంటున్న విషయాన్ని మీరు కనుగొనాల్సిన అవసరం ఉంది. మీరు నిశ్శబ్దంగా ఉంటూ, శ్రద్ధగా విన్నట్లయితే, ఆత్మ మీకు దీనికి గల కారణాన్ని చెబుతుంది. మీరు మీ మనోభావాలను అడ్డుకున్నా లేదా నిరాకరించినా, మీ ఆత్మ మీ శరీరం ద్వారా మీతో మాట్లాడుతుంది. శరీరం ఒక తెలివైన జీవి, ఇది కేవలం మీరు తినే ఆహార పదార్థాలకు (అంటే ఆహార సంబంధిత పదార్థాలు మరియు పానీయాలు) మాత్రమే కాకుండా, మీరు కలిగిఉన్న మనోభావాలు, ఆలోచనలు మరియు అనుభూతులకు కూడా ఎక్కువగా స్పందించగలదు. శరీరం అనేది భావాలను తెలియజేసేదిగా ఉంటుంది. ఇది కేవలం నివసించడానికి ఉపయోగపడే ఒక భౌతికపదార్థం మాత్రమే కాదు. ఆత్మ తనను తాను వ్యక్తపరుచుకోవడానికి మరియు భౌతికపదార్థంలో తన గురించి తాను తెలుసుకోవడానికి శరీరం సహకరిస్తుంది. ఈ విషయంలో శరీరం ఒక తెలివైన పాత్రను పోషిస్తుంది.

మీ ఆత్మ భాష, శరీరంలో ఒక అనారోగ్యంలా తెలియజేయబడినప్పుడు, మీరు దానిని అర్థం చేసుకోవడాన్ని ఎలా నేర్చుకుంటారు? అనారోగ్యం తనంతట తాను వ్యక్తీకరించినప్పుడు, అది మీకు ఇచ్చే సందేశాన్ని మీరు స్పష్టంగా అర్థం చేసుకోలేకపోవచ్చు. నిజానికి మీరు చాలాకాలంగా, మీ అంతరంలో ఒక మనోభావాన్ని తిరస్కరిస్తూ వచ్చారు. అందువలన మీ అనారోగ్యం మీకు చెప్పాలనుకున్న దానిని మీరు స్పష్టంగా అర్థం చేసుకోలేకపోతున్నారు. అనారోగ్యం యొక్క ఆధ్యాత్మిక 'అర్థాన్ని' అర్థం చేసుకోవడం అనేది ఒక ప్రక్రియ. ఇది ఒక అన్వేషణ, ఒక అంతర్ ప్రయాణం. మీ అంతర్ ప్రయాణంలోని ఈ ప్రక్రియ ద్వారా క్రమక్రమంగా మీరు సమాచారవ్యవస్థని తిరిగి నెలకొల్పగలరు.

ఈ ప్రయాణాన్ని కొనసాగించే ముందు, మీరు మొదటిగా మీ అనారోగ్యాన్ని అంగీకరించాలి. అనారోగ్య విషయంలో మీ మొట్టమొదటి ప్రతిచర్య ఏమిటంటే తరచూ దానిని తిరస్కరించడం లేదా అడ్డుకోవడం. మీరు సాధ్యమైనంత త్వరగా మీ అనారోగ్యాన్ని నయం చేసుకోవడానికి ఇష్టపడతారు. ఎందుకంటే, అది మిమ్మల్ని భయపెడుతుంది కాబట్టి. మీరు ఓటమికి, తిరస్కరణకు, అసంపూర్ణత్వానికి మరియు మరణానికి భయపడతారు. మీరు భౌతికపరమైన ఓటమిని లేదా అనారోగ్యాన్ని ఎదుర్కొంటున్నప్పుడు, మిమ్మల్ని తీవ్ర భయాందోళనలు చుట్టుముడతాయి. ఇవి, మిమ్మల్ని అనారోగ్యం మీద విశాలమైన దృక్పథాన్ని పొందనివ్వకుండా అడ్డుకుంటాయి. మీరు అనారోగ్యాన్ని మరొక కాంతిలో చూడవచ్చు. మీరు దీనిని మార్పు యొక్క సందేశకుడిలా అనుభూతి చెందవచ్చు, లేదా మీరు కోల్పోయిన విలువైన స్థితిని తిరిగి అందించే ఆహ్వానంలా కూడా అనుభూతి చెందవచ్చు.

అనారోగ్యం అనే దిక్సూచిని అర్థం చేసుకోవడానికి మరియు దానికి సహకరించడానికి, ముఖ్యంగా మీ శరీరంలో వాటంతటవి కనిపిస్తున్న రోగ లక్షణాలను మరియు నొప్పులను అనుమతించగలగాలి. అనుమతించడం అంటే, మీ భౌతికశరీరం యొక్క స్థితిని అంగీకరించడం మరియు వీటి ద్వారా మీ ఆత్మ యొక్క భాషను వినడానికి ఇష్టపడడమే. ఇలా చేస్తే, మీ సమస్యను సగానికి సగం పరిష్కరించుకున్నట్టే. నిజానికి ఇక్కడ సమస్య అనారోగ్యం కాదు. కేవలం అనారోగ్యం దాని క్రింద ఉన్న అడ్డులకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. నిజానికి చెప్పాలంటే, మీ అనారోగ్యం మిమ్మల్ని బలవంతంగా కూర్చోపెడుతూ, దాని క్రింద ఉన్న అడ్డులను చూడమని మిమ్మల్ని ఒత్తిడి చేస్తుంది. అనారోగ్యం వైపు దృష్టిని మరలిస్తూ, మీ హృదయం మరియు ఆత్మస్థాయిలో ఉండి అనారోగ్యాన్ని అనుమతిస్తున్నానని చెప్పినట్లయితే, మీరు అడ్డులోని

కొంతభాగాన్ని పరిష్కరించుకున్నట్టే అవుతుంది. మీ అనారోగ్యం మీకు చెప్పాలనుకున్నది మీరు పూర్తిగా అర్థం చేసుకోలేక పోయినప్పటికీ కూడా, మీ అడ్డులోని కొంతభాగం నయం చేయబడుతుంది. మీ అంగీకారం, మీ సహనం మరియు పట్టుదలతో మీరు అంతర్ ప్రయాణాన్ని చేసినట్లయితే, ఇవి తిరిగి మీ సమాచార వ్యవస్థ యొక్క భాగాన్ని నెలకొల్పగలవు.

అనారోగ్యాన్ని అనుమతించడం మరియు దానిని కౌగిలించుకోవడం అనేది మీకు అంత సులభమైన విషయం కాదు. మీరు అనారోగ్యాన్ని తిరస్కరించడాన్ని మరియు దానిపట్ల కోపంగానూ లేదా నిరాశగానూ ఉండడాన్ని, మీ అంతట మీరు స్పష్టంగా గుర్తించవచ్చు. అందువలన అనారోగ్యం మీకు చెబుతున్న దానిని వినలేకపోతున్నారు. దీని నుంచి తరచూ మీరు ప్రత్యేకమైన సంకేతాలను పొందుతారు. ఉదాహరణకి శరీరం యొక్క అసమర్థత ఏమి సూచిస్తుందంటే, మీరు కొన్ని బాధ్యతలను వదులుకోవాలని, మీతో మీరు కొంత సమయం నిశ్శబ్దంగా గడపాలని, మీ అవసరాల పట్ల తక్కువ చురుకుదనాన్ని మరియు ఎక్కువ శ్రద్ధను కలిగిఉండమని తెలుపుతుంది. దీని అర్థం బాహ్యంగా కాకుండా, అంతరంగా శ్రద్ధను చూపించమని.

ఆధ్యాత్మిక స్థితి నుంచి, మీ పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలనేది మీకు తెలియకపోవచ్చు. కాని, తరచూ మీపై వ్యాధి కలుగజేసే ఒత్తిడి వలన ఏర్పడే ప్రవర్తన, మీకు ఒక పెద్ద సంకేతంగా ఉంటుంది. కొన్ని పరిస్థితులకు మాత్రమే మిమ్మల్ని మీరు పరిమితం చేసుకోవడం వలన, మీరు ఎప్పటి నుంచో చీకటిలో ఉండిపోయిన భాగాలపై కాంతిని ప్రసరింపజేయడానికి ఒక అవకాశం లభిస్తుంది. మీకు ఉన్న సామర్థ్యంతో, మీతో మీరు సహనంగాను మరియు నిజాయితీగాను ఎలా ఉండగలరు? మీ భౌతికపరమైన మరియు మనోభావపరమైన అవసరాలపై శ్రద్ధను వహించగలరా? అనారోగ్యం ఎల్లప్పుడూ ఇలాంటి ప్రశ్నలనే పైకి తీసుకువస్తుంది. మీ అంతరంలో తలెత్తిన మనోభావాలను ఎదుర్కోవడం మరియు అంగీకరించడం అనేది హీలింగ్ ప్రక్రియలో భాగమే.

నిజంగా హీలింగ్ ప్రక్రియను మొదలుపెట్టాలంటే, మీరు వీటన్నింటిని అనుమతించానని చెప్పాలి: నొప్పులు, అసౌకర్యం, ఆందోళన, అభద్రతాభావం మరియు కోపం. మీరు వీటి కళ్ళలోకి చూస్తూ, వీటితో స్నేహంగా ఉంటూ, వీటిని హత్తుకోవాలి. ఇవి మీ దగ్గరకు హీలింగ్ కోసం వస్తున్నాయి. దీని అర్థం వీటిని మీరు మార్గం నుండి సాధ్యమైనంత త్వరగా తీసివేయడం కాదు. ఇవి మీ జీవితంలోకి ఇప్పుడు ప్రవేశించడం అనేది అనుకోకుండా జరిగిన సంఘటన ఎంతమాత్రం కాదు.

మీరు, మీ శరీరం యొక్క భాషను పట్టించుకోకుండా వదిలివేస్తున్నప్పుడు మరియు మీ అనారోగ్యాన్ని అణచివేస్తున్నప్పుడు, ఆధ్యాత్మిక సారాంశం మరియు అనారోగ్యం యొక్క అర్థం ద్వారా పయనించడం అనేది చాలా కష్టంగా ఉంటుంది. దీని చుట్టూ చాలా కోపం మరియు భయం ఉన్నాయి. మీ 'అనారోగ్యాన్ని', మీ 'నొప్పులు మరియు అసౌకర్యాలను', మరియు మీ అనుభూతులైన 'భయం మరియు చిరాకులను', ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడు మాత్రమే, మీరు నిజమైన అంతర్ స్వేచ్ఛను పొందగలరు. మీరు వీటిని కౌగిలించుకుంటూ, మీ తెరవబడిన చైతన్యంతో వీటిని నిశ్శబ్ధంగా అడగండి: నువ్వు నాకు ఏం చెప్పాలనుకుంటున్నావు?

మీ సమాజంలో, మీ శరీరంతో సన్నిహితంగా ఉండడం అన్న దానిపై స్పష్టమైన అవగాహన లేదు. ప్రేమ మరియు గౌరవం అందుకునే అర్హత కలిగిన జీవిగా మీ శరీరాన్ని భావిస్తూ, దానితో మాట్లాడడాన్ని అసహజంగా పరిగణిస్తారు. మీ సమాజంలోని ఆదర్శవంతమైన ఊహలతో మీరు నింపబడి ఉన్నారు: మీ శరీరాన్ని ఈ విధంగానే చూడాలని, ఆరోగ్యాన్ని మరియు దృఢత్వాన్ని కలిగి ఉండాలని మరియు శరీరానికి సంబంధించి మీరు ఇవే తినాలని, ఇవి తినకూడదు అనే భావాలను కలిగిఉన్నారు. అన్ని రకాల నియమాలు మరియు పద్ధతులు: సుధీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఎలా గడపాలనేది వివరిస్తాయి.

కాని ఈ ఆదర్శవంతమైన చిత్రాలన్నీ కూడా, ఆత్మ యొక్క మార్గంతో బంధాన్ని ఏర్పరచలేవు. ఆత్మ యొక్క మార్గం పూర్తిగా ఒంటరి ప్రయాణం. మీ శరీరంలో మిమ్మల్ని బాధిస్తున్న అనారోగ్యం, బలహీనత లేదా రుగ్మతల యొక్క "నిజాన్ని" కనుగొనడానికి, ఈ కృత్రిమమైన పద్ధతులన్నింటిని వదిలివేస్తూ మీకు మీరు సన్నిహితమవ్వాల్సిన అవసరం ఉంది. ఈ బాహ్యపు పద్ధతులన్నింటిని విడుదల చేయమని మరియు మీ లోతైన అంతరంలోని 'నిజాన్ని' అన్వేషించమని మిమ్మల్ని అడుగుతున్నాను.

ఇది మీకు ఒక గొప్ప సవాల్ లాంటిది. ఎందుకంటే మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు మిమ్మల్ని భయం మరియు తీవ్ర గందరగోళాలు చుట్టుముడుతూ, మరింతగా ఇతరుల సంప్రదింపుల కోసం ఎదురు చూసేలా చేస్తాయి కనుక. మీరు సలహాలు మరియు ఓదార్పుల కోసం బయటి వారిని సంప్రదించవచ్చు. మీరు డాక్టర్‌ని లేదా ఆరోగ్య పద్ధతుల గురించి తెలిపే వేరే నిపుణులను సంప్రదించవచ్చు; వీటిలో ఏ విధమైన తేడా లేదు. భయం వలన పరిష్కారం కోసం, సాధారణంగా మీరు మీ సొంత బాధ్యతను ఇతరులకు వదిలివేయాలనే ధోరణిని కలిగిఉంటారు మరియు పాక్షికంగా మీ జీవితాన్ని వేరేవారి చేతులలో పెడతారు.

ఈ విధంగా డాక్టర్ లేదా నిపుణుల మాట వినడం తప్పు కాదు. ఇది చాలా వరకూ చేయదగిన విషయమే. కాని మీరు ఎల్లప్పుడూ ఈ జ్ఞానాన్ని మీ లోపలకి తీసుకుంటూ, దీనిని మీ హృదయంలో అంచనా వేయవలసిన అవసరం ఉంది. ఈ సలహా మీకు సరైనదా, కాదా అనే విషయాన్ని అనుభూతి చెందండి. మీ జీవితం యొక్క నిజమైన సృష్టికర్త మీరే. మీ శరీరం యొక్క గురువు మీరే. మీ శరీరానికి ఏది సరైనదో మీకు మీరుగా తెలుసుకోగలరు. ఈ పదాల యొక్క లోతైన అర్థం, మీ శరీరానికి మీరే సృష్టికర్త అని.

స్థంభించిపోయిన మనోభావానికి అనారోగ్యం ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. ఈ మనోభావం పాక్షికంగా మీ చైతన్యం యొక్క పరిధిని అధిగమించి ఉంటాయి. అనారోగ్యం లేదా రోగలక్షణాలు తెలియజేస్తున్న వాటిని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. కొన్నిసార్లు ఒకానొక ప్రత్యేక అనారోగ్యం ద్వారా, మీ ఆత్మ మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్న దానిని అర్థం చేసుకోవడం చాలా కష్టంగా అనిపిస్తుంది. ఈ స్థితిలో మీరు మీ అంతరంలోకి వెళుతూ, మిమ్మల్ని మీరు జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. అనారోగ్యంగా వ్యక్తీకరింపబడడానికి కారణమైన శక్తి యొక్క ఎరుకను క్రమక్రమంగా పొందుతూ, అది మీకు ఏమి చెప్పాలని ప్రయత్నిస్తున్న దానిని అర్థం చేసుకోగలగాలి.

మీ శరీరంతో తిరిగి సాన్నిహిత్యాన్ని పొందడానికి సాధన అవసరం; ఇది అసంభవంగా అనిపించవచ్చు. కాని, దీనిని అంత సులభంగా వదలకండి. మీరు మొండి వ్యాధులతో వ్యవహరిస్తున్నప్పుడు, వాటిని మరొకసారి పరిశీలించడానికి ప్రయత్నించండి. ఒక్క క్షణం మీతో మీరు ప్రశాంతంగా ఉంటూ, ఆ తర్వాత మీ శరీరంలోని అనారోగ్యం తన గురించి వ్యక్తపరుస్తున్న ప్రదేశాలకు, తటస్థమైన ఎరుకతో ప్రయాణించండి. ఆ నొప్పి లేదా అనారోగ్యాన్ని, మీతో మాట్లాడడానికి జీవి యొక్క రూపాన్ని తీసుకోమని అడగండి. దానిని ఒక జంతువు, శిశువు లేదా మనిషిగా కనిపించమని అడగండి లేదా ఏదో ఒక రూపంలో, ఒక మార్గదర్శకుడిగా కనిపించమని అడగండి. దీనికి మీ ఊహాశక్తిని ఉపయోగించండి! మీ ఊహాశక్తి అనేది మీ ఆత్మ యొక్క లోతైన ఆవేశాలను కనుగొనడానికి ఉపయోగించే ఒక విలువైన పరికరం.

మీరు ఈ విధంగా చేసినప్పుడు మరియు మీ శరీరం ఊహలతో లేదా అనుభూతులతో మీకు సమాధానం ఇస్తున్నట్లు గమనించినప్పుడు, మీరు ఆనందాన్ని అనుభూతి చెందుతారు. మీరు తిరిగి పొందిన సాన్నిహిత్యం వలన సంతోషాన్ని అనుభూతి చెందుతారు. శరీరం మీతో మాట్లాడుతూ, ఇది ఒక సమాచారాన్ని చేరవేసే

పాత్రను తిరిగి నెలకొల్పుతుంది! ఇది ఒక గొప్ప విజయం. అంతరం ద్వారా మీ శరీరాన్ని తెలుసుకోగలరని మరియు మీరు ఒక్కరే దీనిని మీ కోసం చేసుకోగలరనే విషయాలను సాధ్యమైనంత త్వరగా గుర్తించినప్పుడు, మీరు మరింత విశ్వాసాన్ని పొందుతారు. ఈ ఆత్మవిశ్వాసం వలన, మీ అనారోగ్యం మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్న దానిని సులభంగా అర్థం చేసుకోగలరు. ఇది మీ అంతరం నుంచి పొందిన సమాధానాలను పట్టుకుని ఉండడానికి మీకు సహకరిస్తుంది. ఎందుకంటే ఇవి మీ బాహ్య ప్రపంచానికి సంబంధించిన సాధారణమైన ఉద్దేశ్యాలకు అనుగుణంగా ఉండవు కాబట్టి. మీ శరీరంతో సన్నిహితంగా ఉండడం అనేది అన్ని పరిస్థితులలోనూ చాలా విలువైనది. ముఖ్యంగా శరీరం అనారోగ్యం లేదా నిరాశకు గురైనప్పుడు ఇది అత్యవసరం.

మీ శరీరంతో మాట్లాడగలిగే ఏకైక మార్గం ప్రేమ. మీరు అనారోగ్యం నయమవ్వడానికి – మీ అంతరంలో జపించడం లేదా దృశ్యాలను చిత్రీకరించడం అనే ధృవీకరణల ద్వారా దీనిని తొలగించాలని ప్రయత్నిస్తే, మీరు మీ శరీరంతో సంభాషించడం సాధ్యమవ్వదు. ఇది కూడా ఒక తిరస్కరణ లేదా ఘర్షణ యొక్క రూపమే. దీనికి అసలైన పరిష్కారం: మీరు, మీ శరీరంలోని జబ్బుపడిన భాగం యొక్క ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవడమే. మీరు దీనిని అర్థం చేసుకున్నట్లయితే, పరిస్థితులు పరిణామం చెందుతూ మరియు మనోభావసంబంధిత అడ్డులు తొలగింపబడతాయి. ఈ విధంగానే హీలింగ్ ప్రక్రియ పనిచేస్తుంది – ఏదో ఒక మార్గంలో అనారోగ్యంతో యుద్ధం చేయకుండా, దీనిని మీకు సరైన దిశను చూపించే ఒక స్నేహితుడిలా అంగీకరించాలి. దీనిని అర్థం చేసుకోవడం చాలా కష్టమైన విషయం, ఎందుకంటే అనారోగ్యం మిమ్మల్ని భయపెడుతూ, దురావస్థకు గురిచేస్తుంది కనుక. మీ అనారోగ్యాన్ని అంగీకరిస్తూ, దానిని అర్థం చేసుకోవడమనేదే నిజమైన హీలింగ్‌కు మార్గంగా ఉంటుంది. అనారోగ్యం తిరిగి మిమ్మల్ని ఇంటికి తీసుకువెళ్ళాలని కోరుకుంటోంది.

## దీర్ఘకాలిక అనారోగ్యాలు

అనారోగ్యం యొక్క ఉద్దేశ్యం, మీకు లోతైన అవగాహనను అందించడమే. ఈ విధంగా మీరు అర్థం చేసుకుంటూ, అంతర్ హీలింగ్ ప్రక్రియతో పయనించినప్పుడు, అనారోగ్యం నయమవ్వడాన్ని ఫలితంగా పొందుతారు. కాని ఇది ఎల్లప్పుడూ ఈ పద్ధతిలోనే పని చేయదు. మీరు మనోభావపరమైన అడ్డుల యొక్క మూలాల్లోకి వెళ్ళినట్లు అనిపించినప్పటికీ కూడా, కొన్ని రోగాలు నయంకావు. ఇది తరచూ దీర్ఘకాలిక రోగాల విషయంలో సంభవిస్తుంది.

దీర్ఘకాలిక రోగాల యొక్క విషయంలో తీవ్రమైన శారీరక సమస్యలు మళ్ళీ మళ్ళీ వస్తుంటాయి. మీరు ముఖ్యంగా గాయపడిన లేదా ఓడిపోయిన సమయాలలో, మీ అంతరాత్మతో బంధాన్ని పూర్తిగాను లేదా పాక్షికంగాను కోల్పోయినప్పుడు, వ్యాధిలక్షణాలు తిరిగి మళ్ళీ వస్తుంటాయి మరియు ఇవి కొన్నిసార్లు అధిక తీవ్రతను కలిగిఉంటాయి. ఇవి విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తాయి. అందువలన విశాలదృక్పథం నుంచి సమస్యను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

దీర్ఘకాలిక రోగాలను కలిగిఉన్న మనుష్యులు అత్యంత కష్టమైన పనిని చేపడతారు. ఆత్మస్థాయిలో, వీరు వీరి యొక్క అనారోగ్యపు పరిస్థితులలో ఎదురయ్యే భయాలను ఎదుర్కొంటానని మరియు జీవితంలో మనిషి ఎలా జీవించాలి అని తెలియజేసే ఆదర్శవంతమైన చిత్రాలను ఎదుర్కొంటానని అంగీకరించారు. ఈ సవాల్‌ను తీసుకోవడం అనేది అద్భుతమైన ధైర్యానికి అద్దం పడుతుంది.

ఆత్మ, ఒకానొక ప్రత్యేక అంశంపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తూ, దానిపై పని చేయాలనే ఉద్దేశ్యంతో దీర్ఘకాలిక రోగాన్ని ఎంపిక చేసుకుంటుంది. ఇదే తరచూ సంభవిస్తోంది. ఈ అనారోగ్యం మిమ్మల్ని ప్రతీసారి ఒకానొక మనోభావాన్ని మళ్ళీ మళ్ళీ అనుభవించేలా చేస్తాయి. ఈ మనోభావపరమైన పద్ధతులు అనారోగ్యాన్ని అనుసరిస్తుంటాయి. ఈ మనోభావాలతో మళ్ళీ మళ్ళీ వ్యవహరించడం అనేది చాలా కష్టమైన పని. కాని ఇది ఆత్మకు చాలా ఫలాలను తీసుకువస్తుంది.

తరచూ ఇటువంటి మనుష్యుల జీవితాలు గొప్ప గాంభీర్యాన్ని మరియు అంతర్ సమృద్ధిని కలిగిఉంటాయనే విషయాన్ని, ఇతరులు గుర్తించలేరు. అందువలన చికిత్స ద్వారా నయమవ్వాలనే కాంక్షకు సహకరించవద్దు. మీరు ప్రతీసారి ఒకే విధమైన పూర్వపు రోగ లక్షణాలలోకి పడిపోయినట్లు అనిపించినప్పటికీ కూడా, అనారోగ్యం తరచూ వృత్తాకార కదలికలలో ముందుకు పయనిస్తూ, మీ అంతర్ స్థాయిలలో ఎదగడానికి మీకు సహకరిస్తూనే ఉంటుంది. ఆధ్యాత్మికస్థాయి ప్రకారం, ఇది క్రిందికి పడిపోవడం ఎంతమాత్రం కాదు. మీరు ఈ మనోభావాలతో వ్యవహరించడం ద్వారా, మీరు ఎప్పుడూ చేరని ఉన్నతమైన లోతులకు ఇప్పుడు చేరగలరు. దీని అర్థం మీరు గతంలో, గతజన్మలలో గమనించకుండా ప్రక్కకు వదిలివేసిన వాటిని ఇప్పుడు చేరగలరని.

ఈ అనారోగ్యాలు వంశపారంపర్యానికి లేదా పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలకు కూడా వర్తిస్తాయి. వీటినే మీరు కొన్నిసార్లు కర్మ అని పిలవవచ్చు.

కాని నేను ఈ కర్మ యొక్క అంశంతో జాగ్రత్తగా ఉంటాను. మీరు కర్మను నేరాలు మరియు శిక్షలతో కలిపే ధోరణిని కలిగిఉంటారు. కాని ఇది ఈ విధంగా ఏ మాత్రం పని చేయదు. ఆత్మ, తన గురించి తాను పూర్తిగా తెలుసుకోవాలని మరియు స్వేచ్ఛగా ఉండాలనే స్వచ్ఛమైన కోరికను కలిగిఉంటుంది. ఇది ఆత్మ యొక్క లోతైన వాంఛ. ఈ హృదయపూర్వకమైన కోరిక వలన, ఆత్మ కొన్నిసార్లు వ్యాధులను, అనారోగ్యాలను మరియు శారీరకపరమైన లోపాలను పెట్టుకుని వస్తుంది. ఎందుకంటే ఆత్మ తన లక్ష్యాన్ని చేరడానికి ఇవి సహాయం చేస్తాయి కనుక. ఇది నిస్సందేహంగా మీ భారాలను లేదా రుణాలను తీర్చివేయడానికి సంబంధించిన ప్రశ్న ఎంతమాత్రం కాదు. ఇది స్వేచ్ఛను పొందాలనే ఒక లోతైన వాంఛ మాత్రమే, మరియు ఇది కొన్నిసార్లు మీ శరీరంలో భిన్నమైన పరిస్థితుల యొక్క అనుభవాలను పొందడానికి గొప్ప మార్గంగా కూడా ఉంటుంది. ఈ ఉద్దేశ్యం పట్ల మేము గొప్ప గౌరవాన్ని కలిగిఉంటాం. ఎందుకంటే మీ సమాజంలో క్రూరమైన ఆదర్శవంతపు ఊహలు – నిజానికి సమర్ధవంతంగాను, ఉపయోగకరంగాను, అందంగాను మరియు విజయవంతంగాను ఎలా ఉండాలనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఈ ఆదర్శవంతమైన ఆలోచనలు మీరు అంగవైకల్యంతో ఉన్న మనుష్యులతో జీవించడాన్ని మరియు దీనిని అర్ధవంతంగాను మరియు ఆనందకరంగాను అనుభవించనివ్వకుండా అడ్డుపడుతూ కష్టతరం చేస్తున్నాయి.

చివరిగా నేను నయంకాని దీర్ఘకాలిక రోగాల గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక మనిషి రోగంతో ఎక్కువ కాలం జీవించలేడు అని కొన్నిసార్లు మనకు స్పష్టంగా అనిపించవచ్చు. క్రమక్రమంగా శరీరం వ్యాధికి గురయ్యి క్షీణిస్తుంది. “భూ సంబంధిత ప్రణాళిక”ను కొనసాగించలేరు. అటువంటి పరిస్థితిలో ఆత్మ తనను తాను శరీరంలో కనుగొన్నట్లయితే ఏమి చేస్తుంది? మీరు వీడ్కోలు చెప్పాల్సిన సమయం ఇదేనని, మీ ఆత్మ మీకు తెలియజేస్తుంది. కాని మీరు అనారోగ్యాన్ని అడ్డుకున్నంత వరకూ కూడా, మీరు మీ ఆత్మతోనూ మరియు మీ అంతర్ జ్ఞానంతోనూ బంధాన్ని కోల్పోతారు. కొన్నిసార్లు మీరు భూమిని వదిలి వెళు తున్నారనే విషయాన్ని ముందుగానే తెలుసుకుంటారు. కాని ఆ ఆలోచన మీకు తీవ్రమైన బాధను మరియు భయాన్ని కలిగించడం వలన మీరు దానితో ఘర్షణ పడుతుంటారు. మీరు వేరే చికిత్సల కోసం ఆసక్తిగా ప్రయత్నిస్తారు లేదా కొత్తమందు ఏదైనా వస్తుందేమోనని ఆసక్తిగా ఎదురుచూస్తారు.

ఈ వైఖరి అర్ధం చేసుకోదగినది మరియు నేను ఖచ్చితంగా ఈ వైఖరిని నిందించాలని అనుకోవడం లేదు. కాని మిమ్మల్ని మీరు చాలా క్రూరమైన పద్ధతిలో

బాధించుకుంటున్నారు. మీరు ఈ పద్ధతిని విడుదల చేసి మరియు మరణాన్ని సన్నిహితంగా రావడానికి అనుమతించినట్లయితే, మీరు మరణం శత్రువు కాదని అది మీ మిత్రుడని గుర్తిస్తారు. మరణం మిమ్మల్ని ఘర్షణ నుండి విడుదల చేస్తుంది.

మరణం మీకు చెప్పాలనుకుంటున్న దానికి అనుగుణంగా మీరు పయనించినట్లయితే, మీరు మరణాని కన్నా ముందు వివిధరకాల దశల ద్వారా పయనిస్తారు. ఈ దశలలో భూ సంబంధిత విషయాలన్నింటిని మెల్ల మెల్లగా విడుదల చేయాల్సి ఉంటుంది – మీరు ప్రేమించిన వారిని, మీ చుట్టూ ఉన్న పరిసరాలను, మీ జ్ఞానేంద్రియాల ద్వారా మీరు గమనించిన ప్రతీ విషయాన్ని విడుదల చేయాలి. ఇది ఒక అందమైన మరియు సహజమైన ప్రక్రియ.

మీరు ఘర్షణ వైఖరితో ఈ ప్రక్రియను ప్రతిఘటిస్తూ, ఏదో ఒక రకంగా భూమి మీద జీవితాన్ని గడపాలని ప్రయత్నించినట్లయితే, అది ఒక విషాదకరమైన పరిస్థితిగా మారుతుంది. ఎందుకంటే అప్పటికే శిథిలమైపోయిన మీ శరీరంలో ఇకపై జీవితాన్ని కొనసాగించడం ఏ మాత్రం ఆమోదయోగ్యంగా ఉండదు కనుక. అందువలన మీ శరీరాన్ని మరణించనివ్వండి. మరణం అనేది మీకు విముక్తిని అందించేదిగా ఉంటుంది. మరణం అనేది మీ శత్రువు కాదు. మరణం అనేది మీకు క్రొత్తజీవితాన్ని తీసుకువస్తుంది.

మీరు నయంకాని అనారోగ్యంతో బాధపడుతున్న మనుష్యులతో ఉన్నప్పుడు మరియు ఆ వ్యక్తి చనిపోతాడని అతనికి తెలుసు అని మీరు భావించినప్పుడు, మీరు ఆ వ్యక్తితో దీని గురించి చాలా సౌమ్యంగాను మరియు జాగ్రత్తగాను మాట్లాడడానికి ప్రయత్నించండి. ఆ చనిపోతున్న వ్యక్తికి ఇది ఒక ఊరటలా ఉంటుంది. మీరు మరణిస్తున్న వ్యక్తికి చేయగలిగే అతి గొప్ప సహాయం ఏమిటంటే, వారి ప్రక్కన కూర్చుని, వారి చేతిని పట్టుకోగలగడమే. మీరు మరణిస్తున్న వ్యక్తితో ఉన్నప్పుడు, మీరు తెలుసుకోవలిసినదిగాని లేదా చేయాల్సినదిగాని ఏమి ఉండదు.

అంతిమ దశలో శ్రద్ధను చూపడం అనేది మీ సమాజంలో చాలా ముఖ్యమైన విషయం. ఏదో ఒక రోజు మీరు మీ కుటుంబంలోగాని లేదా స్నేహితుల యొక్క పరివారంలోగాని దీనిని ఎదుర్కొంటారు. కేవలం మీరు చనిపోయే వ్యక్తితో ఉంటూ, వారు చేయబోతున్న ప్రయాణాన్ని అనుభూతి చెందండి. ఆత్మ తన శరీరాన్ని విడిచే శక్తివంతమైన, అద్భుత క్షణాలను మరియు ఇతర తలాలలో ఉన్న తన ఇంటికి తిరిగి చేరుతున్న క్షణాలను అనుభూతి చెందండి.

అనారోగ్యాన్ని, మరణం వైపు నడిపిస్తున్న శత్రువులా భావించవద్దు. దయచేసి మిమ్మల్ని ఓడిస్తున్న శత్రువులా అనారోగ్యాన్ని చూడవద్దు. ఇది యుద్ధం కాదు. తరచూ మరణం, మిమ్మల్ని నొప్పి నుంచి మరియు దుర్భరస్థితి నుంచి విడుదల చేయడానికే వస్తుంది. మీరు ఖచ్చితంగా ఓడిపోయిన వారు మాత్రం కాదు. మీరు కేవలం వేరే మార్గంలో మీ దిశను కొనసాగిస్తారు.

కొన్నిసార్లు మీరు ఒకానొక ముఖ్యమైన పరిస్థితులలో జీవించాలనుకుంటారు, లేదా ఈ జీవితంలో వాటిని అధిగమించాలని అనుకుంటారు. కాని మీరు ఈ పరిస్థితులను పూర్తి చేయలేకపోవచ్చు. ఇవి మిమ్మల్ని దురావస్థకు గురిచేయవచ్చు మరియు అదే విధంగా మీ వెనుక ఉన్న వారిని కూడా దురావస్థకు గురిచేయవచ్చు. అయినప్పటికీ, నేను మిమ్మల్ని ప్రశాంతంగా వీటిని వదిలివేయమని అడుగుతున్నాను, ఎందుకంటే ఇక్కడ మిమ్మల్ని లోతైన జ్ఞానం ముందుకు నడిపిస్తూ, మిమ్మల్ని మరియు మీరు ప్రేమించిన వారిని సరికొత్త పరిస్థితులలో కలిసేలా చేస్తుంది కాబట్టి. మీరు ఏదో ఒక రోజు మళ్ళీ వారిని కలుస్తారు మరియు జీవితాన్ని ఒక వేడుకలా గడుపుతారు.

ఈ రోజు అనారోగ్యానికి సంబంధించి నా అభ్యర్ధన ఏమిటంటే, దయచేసి మీ అనారోగ్యాన్ని నిజంగా కౌగిలించుకోండి. అనారోగ్యాన్ని ప్రేమతోను మరియు ఎరుకతోను హత్తుకోండి. మిమ్మల్ని మీ లోతైన అవగాహనలోకి దానిని తీసుకువెళ్ళనివ్వండి. మీ అంతట మీరుగా, మీ అనారోగ్యానికి ఆధీనమవ్వండి మరియు మీతో మీరు మరింత లోతైన బంధాన్ని ఏర్పరుచుకోవడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకోండి. ఆధీనమంటే, మీ అనారోగ్యంతో కోపంగా వ్యవహరించడమో లేదా దీనికి స్పందించకుండా ఉండడమో కాదు. మీరు ఒక స్నేహితుడిలా అనారోగ్యంతో చురుకైన పద్ధతిలో సహకరించడమే.

నేను మీ అందరిని నా ప్రేమతో కౌగిలించుకుంటున్నాను మరియు ఈ రోజు నా ఉనికిని, క్రీస్తుశక్తి యొక్క ఉనికిని అనుభూతి చెందమని మిమ్మల్ని అడుగుతున్నాను. అనారోగ్యంలోనూ మరియు ఆరోగ్యంలోనూ, మీ అందరికీ అందుబాటులో ఉన్న నా ప్రేమను అనుభూతి చెందండి. మీ చుట్టూ అనంతమైన ప్రేమ ఉంది. మీరు మీ నమ్మకాలను వదిలివేసిన వెంటనే దీనిని అనుభూతి చెందగలరు. మీరు చాలా రకాల నమ్మకాలను కలిగిఉంటారు: మీరు ఇదే చేయాలి మరియు ఇది చేయకూడదు – మీరు చేస్తున్న పనిని మంచి–చెడుగా విభజించడం – మీరు ఇవే సాధించాలి మరియు వీటినే చేయాలి – అనే మొదలైన విషయాలపట్ల దృఢమైన నమ్మకాలను కలిగిఉన్నారు. దయచేసి వీటన్నింటిని విడుదల చేయండి. నా ప్రేమ ఇప్పుడు మరియు ఇక్కడ మీ అందరికి అందుబాటులోనే ఉంది.

* * * *

## సెక్సువాలిటీ మరియు స్పిరిచువాలిటీ

డియర్ ఫ్రెండ్స్, మిమ్మల్ని ఇలా కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. నేను మిమ్మల్ని భౌతికశరీరాలుగా చూడను. నేను మీలో చూస్తున్నది మరియు అనుభూతి చెందుతున్నది: మీ ఆలోచనలను, అనుభూతులను మరియు మీ మనోభావాల యొక్క అంతర్ కదలికలను. నేను మీ ప్రయాణంలో మీకు సహకారాన్ని అందించడం కోసమే ఇక్కడ ఉన్నాను.

నేను ఈరోజు ఒక అంశం గురించి మీతో చర్చించాలనుకుంటున్నాను. అది మీరు భూమి మీద జీవించిన జన్మలన్నింటి యొక్క చరిత్రపై ఒక గొప్ప ప్రభావాన్ని కలిగిఉంది. ఈ అంశం "సెక్సువాలిటీ(శృంగారం)" గురించి మరియు దీనిని స్త్రీ-పురుషులు ఎలా అనుభూతి చెందుతున్నారు అనే విషయం గురించి.

ఇది అంత సులభమైన అంశం కాదు. శృంగారం యొక్క భాగం చాలా నిర్ణయాలతోనూ, భయాలతోనూ మరియు మనోభావాలతోనూ బాధింపబడింది. దీని యొక్క లక్షణాలు సహజంగాను మరియు స్పష్టంగాను ఉండడం లేదు. శృంగారం, తన యొక్క అమాయకత్వపు శిశుతత్వాన్ని, అంటే ఇది స్వేచ్ఛగా కొత్తదనంతో పయనించే అమాయకత్వపు శిశుతత్వాన్ని కోల్పోయింది. శృంగారపరంగా మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకోవాల్సిన సందర్భం వచ్చినప్పుడు, మీరు పూర్తి భయానికి మరియు ఒత్తిడికి లోనవుతున్నారు.

ఈ ఛానెలింగ్‌లో, నేను ఈ సమస్య గురించి ప్రస్తావించాలని అనుకుంటున్నాను. కాని మొదటిగా, నేను ఆధ్యాత్మిక భావన ప్రకారం శృంగారం యొక్క అర్థం ఏమిటో కొద్దిగా వివరిస్తాను.

శృంగారం అన్నది స్త్రీ-పురుష శక్తులు కలిసి చేసే నాట్యం. నిజానికి శృంగారం భౌతికచర్య కన్నా చాలా గొప్పది. దీని అర్థం, మీ యొక్క మరియు మీ భాగస్వామి యొక్క స్థితులన్నీ లేదా దశలన్నీ కలిసి నృత్యంలో పాల్గొనడమే అని.

నేను నాలుగు స్థితులు లేదా దశల మధ్య తేడాలను విభజించి చెప్పాలని అనుకుంటున్నాను. ఇవి శక్తుల యొక్క నృత్యంలో ప్రధాన పాత్రను పోషిస్తాయి.

## శృంగార అనుభవం యొక్క నాలుగు స్థితులు

మొదటి స్థితి భౌతికస్థాయికి సంబంధించినది, ఇది భౌతికశరీరానికి సంబంధించినది. శరీరం చాలా అమాయకమైనది. శరీరానికి లైంగికపరమైన కోరిక మరియు వాంఛల గురించి మాత్రమే తెలుసు మరియు ఇవి మీ శరీరంలో సహజసిద్ధంగా ఉంటాయి. శరీరం తన కోరికలను సంతృప్తిపర్చుకోవాలని అనుకుంటుంది. 'మనిషి' లేదా 'మనిషిలో ఉన్న ఆత్మచైతన్యం', లైంగికపరమైన కోరికను వ్యక్తీకరించే మరియు నెరవేర్చుకునే దిశలను నిర్దేశిస్తుంది. నేను మళ్ళీ చెబుతున్నాను శరీరం అమాయకమైనదే. దీనికి కోరిక మరియు వాంఛ గురించే తెలుసు. ఇలా ఉండడం ఏమాత్రం తప్పు కాదు. ఇది ఆనందానికి, ఆటకు మరియు ఆహ్లాదానికి మూలంగా ఉంటుంది. కాని శరీరానికి ఈ శృంగార శక్తిని ఎలా వ్యక్తపరచాలో తెలియదు. ఎందుకంటే శరీరం తనకుతానుగా దీనిని ఎంచుకోలేదు కనుక. మీరే మనిషిగా దీని యొక్క బాధ్యతను తీసుకోవాలి మరియు శరీరానికి మీ నాయకత్వం యొక్క అవసరం ఉంది.

మీరు అత్యంత ప్రేమపూర్వకమైన మార్గంలో శృంగారం యొక్క అనుభవాన్ని పొందాలనుకున్నప్పుడు, మీ నాయకత్వం యొక్క స్థానం హృదయంలో ఉండి తీరాలి. మీరు శృంగారశక్తి యొక్క బాధ్యతను మీ హృదయానికి ఇచ్చినప్పుడు, అది చాలా ఆనందకరమైన భావప్రకటనలను కనుగొంటుంది. అలా కాకుండా, మీ ఆలోచనలకు లేదా మీ మనోభావాలకు శృంగార ప్రవాహాన్ని నడిపించమని బాధ్యతను అప్పగించినట్లయితే, ఇది మీ శక్తిలో చాలా అడ్డులు ఏర్పడడానికి కారణమవుతుంది. దీనిని మీరు స్పష్టంగా గుర్తించవచ్చు. కాని ఈ విషయం గురించి నేను మీతో తర్వాత వివరంగా ప్రస్తావిస్తాను.

శృంగార నృత్యంలోని రెండవ స్థితి. నేను దీనిని మనోభావపరమైన స్థితిగా పిలుస్తాను. శృంగార కలయిక అనేది లోతైన మనోభావసంబంధిత చర్య. మీరు ఈ స్థితిని పట్టించుకోకుండా వదిలివేసినట్లయితే, ఈ చర్యలో మీరు సంపూర్ణంగా పాల్గొనలేరు మరియు మిమ్మల్ని మీరు నిజమైన శృంగారం యొక్క అర్థం నుంచి దూరం చేసుకున్నట్టే అవుతుంది.

ఇంతకు ముందు చెప్పిన "మనోభావాలతో వ్యవహరించే విధానం" అనే ఛానెలింగ్‌లో, మనం చాలా విపులంగా మనోభావాల గురించి చెప్పుకున్నాం. మనం భయం, కోపం మరియు బాధలను శక్తివంతమైన మనోభావాలుగా గుర్తించాం. అవి మీ ఆత్మకేంద్రం నుంచి మిమ్మల్ని బయటకు ఎలా తీసుకువస్తాయో కూడా

చర్చించుకున్నాం. వీటిలో ఏ మనోభావమైనా, ఇద్దరి వ్యక్తుల మధ్య ఉన్న బంధంపై ప్రభావాన్ని చూపిస్తున్నప్పుడు మరియు వీరు ఈ మనోభావాలను ఎరుకతో గుర్తించి దానికి చిరునామా ఇవ్వలేకపోయినప్పుడు, అవి వీరివురూ సన్నిహితంగా ఉన్నప్పుడు బయట పడగలవు. మీరు భౌతికపరంగా సన్నిహితమైనప్పుడు, మీలో మానసికపరమైన అవగాహనా లోపాలు ఏర్పడడానికి ఇవి కారణమవుతాయి. దీని ఫలితంగా మీరు కోరికను శాశ్వతంగా అణచివేయవచ్చు. లేదా శరీరం కోరికను లేదా ఉద్రిక్తతను అనుభూతి చెందలేక పోవచ్చు.

ఎప్పుడైతే మీరు ఈ మానసికపరమైన లేదా శారీరకపరమైన అడ్డులను గమనిస్తారో, అప్పుడు మీరు ఇవి తలెత్తడానికి కారణమైన స్థితితో వ్యవహరించడం చాలా ముఖ్యం: అదే మనోభావపరమైన స్థితి. మీరు శారీరక వ్యాధి లక్షణాల విషయంలో, వాటికి కారణమైన మనోభావసంబంధిత తలాన్ని చూడకుండా వాటిని తీసివేయాలని ప్రయత్నించినప్పుడు, మీరు మిమ్మల్ని మరియు అదే విధంగా మీ శరీరాన్ని అగౌరవపరిచినట్టే అవుతుంది. శరీరం శృంగారంలో పాల్గొనడాన్ని ప్రతిఘటిస్తున్నట్లయితే, అది మీకు అక్కడ ఒక మనోభావపరమైన అడ్డు ఉందనే విషయాన్ని స్వచ్ఛమైన మరియు స్పష్టమైన సందేశం ద్వారా తెలియజేస్తోందని అర్థం. ఇది మీకు మరియు మీ భాగస్వామికి మధ్య ఉన్న సమస్యకు సంబంధించినది కావచ్చు, లేదా మీరు గతం నుంచీ మీ అంతరంలో మోస్తున్న మనోభావపరమైన బాధకు సంబంధించినది కావచ్చు. కారణం ఏదైనప్పటికీ కూడా, మీరు దానిని గుర్తించాల్సిన అవసరం ఉంది. శృంగార శక్తి స్వేచ్ఛగా ప్రవహించాలంటే, మీరు ముందుగా ఈ అడ్డును ప్రేమ మరియు నిజాయితీతో పట్టించుకోవాల్సిన అవసరం చాలా ఉంది.

మనోభావపరమైన స్థితి యొక్క తర్వాత స్థితి, హృదయం యొక్క స్థితి. ఇది అనుభూతికి కేంద్రంగా ఉంటుంది. ఇంతకు ముందు ఛానెలింగ్‌లో ("మనోభావాలతో వ్యవహరించే విధానం"), నేను మనోభావాలకు మరియు అనుభూతులకు మధ్య ఉన్న తేడాను విశదీకరించి చెప్పాను. అనుభూతులనేవి ఇంగితజ్ఞానం మరియు అంతర్జ్ఞానం యొక్క కలయికకు సంబంధించినవి. మీ అనుభూతులు మీతో గుసగుసల ద్వారా మాట్లాడతాయి. ఇవి జ్ఞానసంపత్తి మరియు కరుణతో నింపబడి ఉంటాయి. మనోభావాలు చాలావరకూ నాటకీయ స్వభావాన్ని కలిగి ఉంటాయి. మేము వీటిని "తప్పుగా అర్థం చేసుకున్న వాటి యొక్క ప్రతిస్పందనలు"గా పిలుస్తాం, అందుకనే ఇవి చాలా అత్యవసరమైనవి: ఈ మనోభావాలు, మీ జీవితంలో మీకు ఎదురైన పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం వలన ఏర్పడ్డాయి కాబట్టి.

శృంగార భాగస్వాముల యొక్క హృదయాలు తెరవబడి ఉంటే, వారిరువురి మధ్య ప్రేమ, విశ్వాసం మరియు భద్రత ప్రవహిస్తాయి. శృంగార కలయికలో హృదయం పాల్గొన్నట్లయితే, మీ ఇరువురి మధ్య జరుగుతున్న దానిని గుర్తించడానికి మీ ఇంగితజ్ఞానాన్ని మీకు మీరుగా అనుమతిస్తారు. అంటే, మీరు శారీరకంగా సన్నిహితమైనప్పుడు, మీ మధ్య ఏర్పడే మనోభావపరమైన అవగాహనా లోపాలను గుర్తించడానికి మీ ఇంగితజ్ఞానాన్ని అనుమతిస్తారు. మీ మనోభావాలను దాచకుండా వాటి గురించి స్వేచ్ఛగా మాట్లాడండి. మీ పాత గాయం పైకి రావచ్చు మరియు దానిని అలాగే అంగీకరించండి. మిమ్మల్ని మీరు ఉన్నదిఉన్నట్టుగా అంగీకరించండి. ఈ విధమైన అంగీకారం అద్భుతమైన హీలింగ్ శక్తిలా పని చేస్తుంది. మీ హృదయశక్తిని శృంగారశక్తితో కలిపినప్పుడు, ముఖ్యంగా హీలింగ్ అవసరమైన భాగాలలో గొప్ప హీలింగ్ జరుగుతుంది.

హృదయం కూడా మిమ్మల్ని శృంగారాన్ని ఆనందంగాను మరియు ప్రేమగాను అనుభవించనివ్వకుండా అడ్డుకుంటుంది. కొన్ని ప్రత్యేకమైన కారణాల వలన, హృదయం తనకు తానుగా శృంగారం యొక్క ఆనందం నుంచి దూరమైపోయింది. మొదటి కారణం, భూమి యొక్క భౌతికవాస్తవాన్ని అధిగమించాలనే హృదయ వాంఛ వలన కావచ్చు. రెండవది మతపరమైన సిద్ధాంతాలు చలామణిలో ఉండడం కావచ్చు, ఇవి మీ హృదయాన్ని నిజమైన శృంగారం అంటే ఏమిటో తెలుసుకోనివ్వకుండా అడ్డుకున్నాయి. ఇప్పుడు నేను ఈ రెండు విషయాల గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను.

హృదయం ఎల్లప్పుడూ భౌతికవాస్తవం యొక్క సాంద్రతను అధిగమించి పైకి ఎదగాలనే బలమైన వాంఛను కలిగి ఉంటుంది. ఇది ఒక విధంగా ఇంటిబెంగకు సంబంధించినది మరియు ఇది ఐకమత్యం యొక్క వాంఛ కూడా. నిజానికి హృదయం తన అంతరంలో భూతలం యొక్క సున్నితమైన తిరస్కరణను మోస్తోంది (మరియు అదే విధంగా శృంగారం యొక్క తిరస్కరణను కూడా). మీ అందరూ ఈ వాస్తవాన్ని అధిగమించాలనే వాంఛను కలిగిఉన్నారు. మీలో చాలామంది ప్రేమ మరియు సమన్వయం యొక్క శక్తులను స్పష్టంగా గుర్తించగలరు. ఎందుకంటే మీరు వీటిని భూమి మీద జన్మించక ముందు వేరే తలాలలో అనుభవించి ఉన్నారు కాబట్టి. మీ హృదయం తరచూ ఈ ప్రకంపనం యొక్క "స్వేచ్ఛ మరియు తేలికతనం" కోసం ఆరాటపడుతుంది. మీరు ధ్యానం చేసినప్పుడు ఈ శక్తిని గ్రహించడానికి ప్రయత్నిస్తారు. ఎల్లప్పుడూ పైచక్రాలు ఈ విధంగానే చురుకుదనాన్ని పొందుతాయి. పై చక్రాలు

అంటే హృదయం, కంఠం, మూడవకన్ను మరియు సహస్రారం. క్రింది మూడు చక్రాలను స్వల్పంగానో లేదా అధికంగానో వదిలివేసినప్పుడు మాత్రమే ఇవి తెరవబడతాయి. ఈ క్రింది మూడుచక్రాలు (మూలాధారం, స్వాధిష్టానం (పొట్ట), మణిపూరకం): మీ జీవాత్మకు లేదా భూమి మీద ఎత్తిన జన్మలకు సంబంధించినవి. క్రింది మూడు చక్రాలు భూ వాస్తవంలో ముఖ్యమైన పాత్రను పోషించగలవు.

చాలా అసహజమైన పద్ధతిలో, అంటే మీరు మత్తు పదార్థాలను తీసుకున్నప్పుడు కూడా మీ పైచక్రాలు తెరవబడతాయి. మీ మానసిక ఎదుగుదల కోసం మందులను వాడినప్పుడు, పైచక్రాలు కృత్రిమమైన పద్ధతిలో బలవంతంగా తెరవబడతాయి. దీని వలన మీరు తాత్కాలికంగా గొప్ప ఆనందానుభూతిని మరియు ఆహ్లాదాన్ని అనుభవించగలరు. ఇది మిమ్మల్ని భౌతికవాస్తవం యొక్క సాంద్రతను మరియు భూవాస్తవం యొక్క అతిపెద్ద ప్రత్యేకలక్షణాన్ని మరచిపోయేలా చేస్తుంది.

అయినప్పటికీ, అధిగమించాలనే ఈ వాంఛ మరియు ఇంటిబెంగ అర్థం చేసుకోదగినవి. కాని భౌతిక వాస్తవంలో ప్రశాంతతను పొందడం అన్నది చాలా ముఖ్యం. ఇలా చేయలేకపోతే, మీరు మీ శక్తిక్షేత్రం యొక్క పై భాగం మరియు క్రింది భాగాల మధ్య కృత్రిమమైన వేర్పాటును సృష్టిస్తారు. మీ చైతన్యాన్ని తరచూ మీ ఆరా యొక్క పై భాగంలో ఉంచడానికి ప్రాముఖ్యతను ఇస్తారు మరియు మీరు శరీరం, మనోభావం మరియు శృంగారం యొక్క వాస్తవం పట్ల మీ అంతరంలో సున్నితమైన తిరస్కరణలను పెంపొందించుకున్నారు. ఇదే మీ శక్తిక్షేత్రంలో సమన్వయాలోపాన్ని సృష్టిస్తోంది.

మీరు ఈ విధంగా ఇంటి బెంగను పొందుతున్నట్లయితే, మీరు భూమి మీద ఉండడానికి గల కారణాన్ని మరియు ఆశయాన్ని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. మీరు ఇక్కడ ఉండడానికి గల కారణం: కేవలం భూమి యొక్క వాస్తవాన్ని అధిగమించడం కోసమే కాదు, మీ ఇంటినే భూమి మీదకు తీసుకురావడానికి. ఇది ఒక పవిత్రమైన ప్రయాణం.

హృదయం శృంగారం నుంచి దూరంగా ఉండడానికి గల రెండవ కారణం: గతజన్మల నుంచి ఉన్న మతపరమైన సిద్ధాంతాలే. ఎందుకంటే మీరు మీ గతజన్మల్లో, మీ శీలాన్ని పవిత్రంగా ఉంచుకుంటాననే వాగ్దానాలను చేశారు, లేదా శారీరక ఆనందం మరియు శృంగారం అనేవి అవమానమని లేదా నేరమని మీకు నేర్పించబడ్డాయి. ఈ శక్తులన్నీ ఇంకా మీ హృదయంలో అలాగే నిలిచి ఉన్నాయి. ఈ

కారణంగానే మీరు వీటి పట్ల చెడు నిర్ణయాలను కలిగిఉండవచ్చు లేదా శారీరకంగా సన్నిహితమవ్వడంపై తిరస్కరణను కలిగిఉండవచ్చు. ఈ నిర్ణయాలు మరియు అభిప్రాయాలు అన్నవి నిజంపై ఆధారపడి ఉండవు. నేను మళ్ళీ చెబుతున్నాను శరీరం అమాయకమైనది. శృంగార కలయికకు మిమ్మల్ని ప్రేరేపించే వాంఛ, కోరిక మరియు శారీరక ప్రక్రియలన్నీ కూడా సహజమైనవి మరియు ఆరోగ్యవంతమైనవి. చాలావరకూ శృంగారం యొక్క భాగంలో ఏర్పడుతున్న సమన్వయాలోపాలన్నీ కూడా అభౌతికమైన స్థాయిల వలనే ఏర్పడుతున్నాయి. నేను ఇంతకు ముందు వీటిలోని రెండు స్థితుల గురించి మాట్లాడాను. అవి మనోభావపరమైన స్థితి మరియు హృదయ స్థితి.

నాలుగవస్థితి మరియు చివరిస్థితి, ఇది మనసుకి సంబంధించినది – మానసికపరమైన స్థితిలో నీతివంతమైన నమ్మకాలు లేదా ఆధ్యాత్మిక నమ్మకాలు ఉండగలవు. ఇవి శృంగారాన్ని ఆనందించనివ్వకుండా మిమ్మల్ని అడ్డుకుంటాయి. వీటిలోని చాలా నమ్మకాలు మతానికి సంబంధించిన స్వభావాన్ని కలిగి ఉంటాయి.

ఆధ్యాత్మికస్థాయిలో, మీరు శరీరాన్ని ఒక విధమైన జైలుగా భావిస్తారు. మీరు ఇతర తలాలను ఉన్నతమైన వాటిగా భావించడం వలన మీకు భౌతిక వాస్తవం విలువ లేనిదిగా కనిపిస్తోంది. ఇది తరచూ లైట్‌వర్కర్స్‌లో సంభవిస్తోంది. వీరు ముఖ్యంగా శృంగారం అందించే ఆహ్లాదాన్ని మరియు ఆనందాన్ని అడ్డుకుంటారు. ఇది పాక్షికంగా మతాలు మరియు నీతిసూక్తుల కారణంగా ఏర్పడుతోంది. ఇది పాక్షికంగా జీవితంలో ఇమిడి ఉన్న శృంగార లక్షణంపట్ల సరైన అనుభవం లేకపోవడం వలన కూడా ఏర్పడుతోంది. లైట్‌వర్కర్స్ ఆత్మలు చాలా జన్మలలో మతగురువులు, సన్యాసినులు లేదా వీటికి సమానమైన పాత్రలను పోషించారు. ఈ జన్మలలో వీరు సమాజానికి దూరంగా ఉంటూ ఒంటరిగా జీవించేవారు. వీరు కుటుంబాన్ని లేదా భాగస్వామిని కలిగి లేకుండా జీవించారు. వీరు అధికంగా ఆధ్యాత్మికతపై దృష్టిని కేంద్రీకరిస్తూ, శృంగారం యొక్క భాగాన్ని నిర్లక్ష్యం చేసేవారు.

ఆధ్యాత్మికతను లేదా మతాలను అనుసరించే వారు, శరీరం యొక్క సహజమైన భావప్రకటనకు ప్రాధాన్యతను ఇవ్వరు. ఇది నిజానికి చాలా విచారించదగిన విషయం. కాని మేము, భౌతిక పదార్థంలోని భావప్రకటనను ఆత్మ తన పవిత్రమైన ప్రయాణంలో ముందుకు వెళ్ళడానికి సహకరించేదిగా పరిగణిస్తాం. మీ దివ్యత్వం యొక్క విత్తనాలను నాటడానికి మరియు మొలకెత్తించడానికి ఈ భౌతికవాస్తవంలో ఉండడం అన్నది ఒక పవిత్రమైన కర్తవ్యం లాంటిది. ఇది దివ్యమైనది, ఇది ఉన్నతాశయం యొక్క సృజనాత్మక చర్య.

బహుశా, మీరు కొన్నిసార్లు చనిపోయిన వారిని దగ్గరగా చూసి ఉండవచ్చు లేదా ఒక శిశువు జన్మించడాన్ని సాక్షిగా చూసి ఉండవచ్చు. ఆత్మ ఈ క్షణాలలో భౌతికపదార్థంతో నృత్యం చేస్తూ లోపలకి ప్రవేశించడం లేదా బయటకు రావడం జరుగుతుంది. ఈ విషయాలు రెండూ పవిత్రమైన వాతావరణంతో చుట్టుముట్టి ఉ ంటాయి. ఆ సమయాలలో, మీరు గౌరవంతో కూడిన గంభీరమైన నిశ్శబ్దాన్ని అనుభూతి చెందగలరు. ఇది ఆత్మ యొక్క రాకపోకలను తెలియజేస్తుంది. ఆ సమయాలలో మీరు చేసే పనులను మేము చాలా గౌరవిస్తాం. భౌతికపదార్థంతో నృత్యం చేయడం అనేది చాలా పవిత్రమైనది. కాని మీరు దీనిని తరచూ ద్వేషిస్తుంటారు!

శృంగారానికి నిజమైన అర్థం – భౌతికపదార్థంతో నాట్యం చేస్తూ మరియు అదే సమయంలో భౌతికపదార్థానికి అతీతంగా ఉండడమే. మీరు సమన్వయం గల శృంగార–భావప్రకటనలో శృంగారాన్ని అణచివేయకుండానూ లేదా వదిలి వేయకుండానూ, క్రింది మూడుచక్రాలను అశ్రద్ధ చేయకుండానూ మరియు కేవలం పై మూడుచక్రాల ద్వారా మాత్రమే ఆనందానుభూతి కోసం ప్రయత్నించకుండానూ కూడా, మీరు భూవాస్తవాన్ని అధిగమించవచ్చు. “సంపూర్ణమైన శృంగారం” మీ స్థితులన్నింటిని కలుపుతుంది. శృంగారం అనేది భౌతికపదార్థానికి మరియు ప్రజ్ఞాత్మకు మధ్య వారధిని ఏర్పరుస్తుంది.

ఇద్దరు వ్యక్తులు ప్రేమతో శారీరకంగా సన్నిహితమైనప్పుడు, వారి శరీరాలలోని అన్ని కణాలు కొంచెం వేగంగా కంపిస్తాయి – అవి స్వల్పంగా నృత్యాన్ని మొదలుపెడతాయి. ఉన్నతమైన ప్రకంపనల ద్వారాను మరియు తేలికైన అనుభూతుల ద్వారాను శక్తివంతమైన వాస్తవానికి చేరే మార్గం తెరవబడుతుంది. మీ యొక్క భాగాలన్నింటితో – శరీరం, మనసు మరియు ఆత్మ యొక్క కలయికతో మీరు శృంగారంలో పాల్గొన్నట్లయితే ప్రశాంతతను మరియు ఆనందాన్ని అనుభూతి చెందుతారు. ఇది ఒక నిశ్శబ్ధమైన ఆనందానుభూతి. మీ శరీరం యొక్క కణాలన్నీ ప్రేమశక్తిని రుచి చూస్తాయి. మీరు ఆ సమయంలో ప్రేమ యొక్క వాస్తవానికి మీ అంతట మీరుగా సన్నిహితమవ్వగలరు. అప్పుడు మీరు ప్రేమ యొక్క దివ్యత్వపు శక్తితో ఛానెలింగ్ చేస్తారు. మీ ద్వారా ఈ శక్తి ప్రవహించాలని తీవ్రంగా కోరుకుంటోంది మరియు ఇది మీ శృంగార స్వభావంపై గొప్ప గౌరవభావాన్ని కలిగి ఉంటుంది.

ఈ శక్తి శృంగార కలయికలో నాలుగు స్థితుల ద్వారా ప్రవహించినట్లయితే, అది ఒక దివ్యత్వపు సృష్టి యొక్క చర్యగా ఉంటుంది. ఈ విధమైన చర్య నుంచి పిల్లలు జన్మించడం అన్నది మాత్రమే సహజమైన విషయం. ఈ విధంగా ఆనందకరమైన

మార్గంలో స్త్రీ–పురుషుల యొక్క నృత్యం జరిగినప్పుడు, దాని నుంచి మంచితనం మరియు తియ్యదనం మాత్రమే బయటకు రాగలవు. ఈ విధంగా పిల్లలు జన్మిస్తే, ఆ పిల్లలు ప్రేమ మరియు కాంతి యొక్క మార్గం నుంచి భూ తలంలోకి ప్రవేశిస్తారు. ఇలాంటి ఆత్మలకు భూమి మీద ప్రేమపూర్వకమైన స్వాగతం అందించబడుతుంది.

అందువలన శృంగార శక్తులన్నీ చాలా విలువైనవి. దయచేసి మీ శృంగార లక్షణంతో గౌరవప్రదంగా వ్యవహరించమని మేము మిమ్మల్ని అడుగుతున్నాం. ఈ శక్తుల చుట్టూ సమస్యలుగాని, భయాలుగాని లేదా ఒత్తిడులుగాని ఉన్నప్పుడు మీరు శృంగారాన్ని నిర్ణయించవద్దు లేదా వదిలివేయవద్దు, ఎందుకంటే శృంగారం అనేది మీ యొక్క సహజమైన మరియు పవిత్రమైన భాగం కాబట్టి.

## శృంగార సమస్యలు మరియు స్త్రీ-పురుషుల మధ్య ఘర్షణలు

నేను ఇప్పుడు శృంగారం యొక్క చరిత్రలోకి వెళ్ళాలని అనుకుంటున్నాను. ఆ తర్వాత ప్రస్తుత రోజులలో స్త్రీ–పురుషులు వారి యొక్క శృంగార భావప్రకటనలో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యల గురించి చెప్పాలనుకుంటున్నాను.

శృంగార భాగం యొక్క క్షేత్రంలో చాలా ఘర్షణలు సంభవించాయి. శృంగార శక్తి తన మూలంలో కాంతి యొక్క ఉన్నతమైన సామర్థ్యాన్ని మోస్తోంది. కాని, దీని వలన ఈ సామర్థ్యం దుర్వినియోగం కూడా చేయబడుతోంది. నేను ఒక చరిత్ర గురించి మాట్లాడాలని అనుకున్నాను. అది స్త్రీ–పురుషుల మధ్య ఉన్న ఒకానొక శక్తివంతమైన ఘర్షణకు సంబంధించినది. ఈ చరిత్ర చాలా ప్రాచీనమైనది. నిజానికి ఇది వేరే గ్రహవాసులు భూమి మీద జీవితంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ఆరంభించిన కాలానికి సంబంధించిన చరిత్ర. ఆరంభదశలో భూమి కూడా ఒక స్వర్గంలాగే ఉండేది. ఇది అందం మరియు అమాయకత్వంతో నిండి ఉండేది. మేము ఆ శకం గురించి ఇప్పుడు చర్చించడం లేదు. కాని, మీరు ఇప్పుడు 5,000 సంవత్సరాల పురాతనమైన చరిత్ర గల శక్తివంతమైన ఘర్షణ యొక్క చివరిదశలో ఉన్నారు.

ఈ చరిత్ర యొక్క చివరిదశలో, పురుషుడు 'నేరస్థుడి పాత్రను మరియు నియంత పాత్రను' స్పష్టంగా పోషిస్తున్నాడు. కాని ఇది ఎల్లప్పుడూ ఈ విధంగానే జరగలేదు. స్త్రీ సామాజికపరమైన జీవితాన్ని మరియు అదే విధంగా వ్యక్తిగత జీవితాన్ని అధికారంతో పరిపాలించిన సమయాలు కూడా ఉన్నాయి. స్త్రీ ఒకానొకప్పుడు

పురుషశక్తిని క్రూరమైన పద్ధతులతో అణచివేస్తుండేది. స్త్రీ సహజంగా హింసించే స్వభావాన్ని కలిగి ఉండదు, అలా అని ఆమె మొదటి నుంచి ప్రేమకు నిర్వచనం కూడా కాదు. సాధారణంగా స్త్రీ మంచిది మరియు బలహీనురాలు, అదే విధంగా పురుషుడు చాలా కఠినాత్ముడు మరియు సున్నితత్వం లేనివాడు అనేవి పైన చెప్పిన చరిత్ర యొక్క చివరిదశలోని స్త్రీ–పురుషుల యొక్క లక్షణాలు. కాని వీరి లక్షణాలు ఎప్పుడూ ఈ విధంగానే లేవు.

ఈ చరిత్ర యొక్క ముందు కాలాలలో స్త్రీ పరిపాలిత సమాజాలను ఆదర్శవంతంగా పరిగణించారు. ఆ సమయాలలో స్త్రీలు వారి యొక్క శక్తులను క్రూరమైన పద్ధతిలో వినియోగిస్తూ, ప్రతీ మనిషిలో ఉండే జీవశక్తిని మరియు సృజనాత్మకతను అగౌరవపరిచేవారు. ఆ సమయంలో స్త్రీలు పురుషుల పైన అధికారాన్ని చలాయించేవారు. స్త్రీలు సహజంగా కలిగిఉన్న ఇంగితజ్ఞానం మరియు మనోభావాల యొక్క శక్తుల ద్వారా, పురుషులను అదుపుచేస్తూ వారిని నేర్పుగా వినియోగించుకునేవారు. స్త్రీలు తమ యొక్క మానసిక సామర్థ్యాలను కూడా ఉపయోగిస్తూ పురుషులను అణచివేసేవారు. ఉదాహరణకి పురుషులు సంప్రదాయాలు మరియు త్యాగాల ద్వారా బాధింపబడేవారు మరియు చంపబడేవారు.

నేను ప్రస్తుతం అధికారికంగా చలామణిలో ఉన్న చరిత్ర గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను. ఈ చరిత్ర స్త్రీ–పురుషుల మధ్య ఉన్న సంబంధం యొక్క చిత్రాన్ని ఒకవైపున మాత్రమే మీకు చూపిస్తోంది. ఈ వ్రాయబడిన చరిత్ర పురుషుడి చేతిలో స్త్రీ పూర్తిగా అణచివేయబడిందనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. కాని స్త్రీలపై పురుషులు చూపిస్తున్న ద్వేషంగాని, పగగాని ఏ కారణం లేకుండా పుట్టినవి మాత్రం కాదు. పురుషులను ఆచారపరమైన సంప్రదాయాలు మరియు అలవాట్లు ప్రభావితం చేయడమే కాకుండా, పురాతనశకంలో వీరి యొక్క ఆత్మలన్నింటిలో ఏర్పడిన లోతైన మనోభావపరమైన గాయం కూడా వీరిని బలంగా ప్రభావితం చేస్తోంది.

ఈ శకం యొక్క పూర్తి వివరాలలోకి వెళ్ళకుండా, సాధ్యమైనంత వరకూ వీటి యొక్క అనుభవాన్ని మాత్రమే అనుభూతి చెందమని నేను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. స్త్రీలకు ఒక ప్రశ్న: ఒకప్పుడు మీరు పురుషులపై అధికారాన్ని చూపించారని మరియు మీరు పురుషుల యొక్క శక్తిని నియంత్రించడానికి విజయవంతంగా ప్రయత్నించారనే విషయాన్ని ఊహించుకోగలరా? మరియు పురుషులకి ఒక ప్రశ్న: మీరు పెద్ద ఎత్తున స్త్రీలచే అణచివేయబడ్డారని మరియు

మీరు బాధితులుగా ఉన్నారని ఊహించుకోగలరా? మీరు మీ అంతరంలో ఈ ప్రశ్నలను అడగడం ద్వారా, దీనికి సంబంధించిన ఊహలను లేదా కలలను పొందవచ్చు. మీకు వీటిని చూపించడానికి మీ ఇంగితజ్ఞానాన్ని అనుమతించండి మరియు మీలో తలెత్తుతున్న మనోభావాలను గమనించండి. ఇది మీకు ఆశ్చర్యకరంగా అనిపించవచ్చు.

ఈ పురాతనమైన చరిత్ర వల్ల పురుషులందరి యొక్క ఆత్మలలో ద్వేషం మరియు ఆగ్రహం మేల్కొన్నాయి. వీటి కారణంగా స్త్రీశక్తిని రాజకీయాల ద్వారానూ, మతాల ద్వారానూ అంటే ముఖ్యంగా 'చర్చ్'ల ద్వారానూ అణచివేయబడింది. పురుషశక్తి ఆలోచనారీతి ప్రకారం శృంగారం పాపంగాను లేదా చెడ్డదిగాను చూపబడింది. ఈ ఆలోచనారీతి అన్నది ముందు శకంలో పురుష శృంగారం యొక్క అణచివేతల ఫలితంగా ఏర్పడిన ద్వేషం మరియు పగల ద్వారా ప్రభావితం చేయబడింది. ఎందుకంటే ఆ సమయంలో పురుష శృంగారం అనేది పిల్లలను పుట్టించేదిగా ఉండేది; పురుషుల యొక్క అనుభూతులకుగాని, తండ్రి మరియు బిడ్డలకు మధ్య ఉండే మనోభావపరమైన సంబంధానికి గాని గౌరవం ఉండేది కాదు. పిల్లలు తరచూ తండ్రి నుంచి దూరం చేయబడి తల్లి ఆధీనంలో పెంచబడేవారు. తండ్రి ఆలోచనకి మరియు అతను కోరుకున్న దానికి ఏమాత్రం విలువ ఉండేది కాదు. ముఖ్యమైన విషయాలన్నీ తల్లి ద్వారా జరగబడేవి మరియు పురుషుల యొక్క హోదాకి తక్కువ విలువ ఉండేది. పురుషుడిని సమాన భాగస్వామిలా కాకుండా ఒక పని చేసే యంత్రంలా చూసేవారు.

విసుగుచెందిన పురుషశక్తికి 'చర్చ్'లు ఒక శక్తిలా రక్షణను అందించాయి మరియు దీనికి మద్ధతుగా ప్రపంచ వైజ్ఞానికశాస్త్రం కూడా స్త్రీశక్తిపై శత్రుత్వాన్ని చూపించింది. చాలా విషయాలలో విజ్ఞానం మరియు మతం రెండూ సహజ శత్రువులయినప్పటికీ కూడా, స్త్రీశక్తి లక్షణాలైన ప్రవాహగుణాన్ని మరియు ఇంగితజ్ఞానాన్ని అడ్డుకోవడంలో ఇవి రెండూ కలిశాయి. చర్చ్ యొక్క సిద్ధాంతాలు చాలా ఖచ్చితంగాను మరియు అణచివేసే విధంగాను రూపొందించబడ్డాయి. విజ్ఞానపు పద్ధతులు కూడా వేరే విధంగా అదుపు చేయడం ఆరంభించాయి. నిజానికి, నవీన విజ్ఞానశాస్త్రం వెనుక ఉండి ప్రోత్సాహించేవి: "జ్ఞానం మరియు కొత్తదనం". కాని స్త్రీశక్తిని పాల్గొనడానికి అనుమతించక పోవడం వలనే ఈ నవీన విజ్ఞానశాస్త్రం హేతుబద్ధమైన ఆలోచనారీతి యొక్క చిక్కుముడులలో ఇరుక్కుపోయింది. విజ్ఞానపరమైన ఆలోచనారీతి అనేది విశ్లేషణతోను మరియు తర్కంతోను నిండి ఉంటుంది. కాని ఇది మన ఊహాశక్తి వరకూ విస్తరింపబడలేదు మరియు ఇది జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహించగలిగే శక్తి

యొక్క మూలాల గురించి తెలుసుకోలేదు. చాలామంది సైంటిస్ట్‌లు ప్రతీ విషయాన్ని అసహజంగా చూడడం పట్ల మరియు దానిని అర్ధవంతమైన వివరణల ద్వారా వివరించలేకపోవడం పట్ల అయిష్టతను కలిగి ఉంటున్నారు. ఎందుకంటే వీరి ఆత్మలలో వెనుకటి కాలానికి సంబంధించిన అవమానాలు మరియు బాధలు అనేవి జ్ఞాపకాలుగా ఏర్పడ్డాయి కాబట్టి. ఈ జ్ఞాపకాలు అన్నవి పురుషుల యొక్క మానసికపరమైన శక్తులు స్త్రీల ద్వారా దౌర్జన్యంగా అణచివేయబడుతూ మరియు పురుషులను ఒక యంత్రంలా వినియోగించుకున్నప్పటి కాలానికి సంబంధించినవి.

నేను ఈ ప్రాచీనమైన చరిత్ర గురించి ప్రస్తావించడానికి గల కారణం: మీరు స్త్రీ–పురుషుల మధ్య ఉన్న ఘర్షణ గురించి స్పష్టమైన అవగాహనను పొందాలనే. కాని చివరికి బాధితులు మరియు నేరస్థులు, మంచివాళ్ళు మరియు చెడ్డవాళ్ళు ఎవరూ ఉండరు. ఎందుకంటే మీరందరూ ఈ రెండింటిని కలిగి ఉన్నారు కాబట్టి. స్త్రీ–పురుష శక్తుల మధ్య ఉన్న ఘర్షణ వలన ఇవి రెండూ శత్రువులుగా మారాయి. కాని వాస్తవానికి ఇవి రెండూ ఒకదానికొకటి సహకరించుకునేవి. ముఖ్యంగా ఈ శక్తులను మళ్ళీ కలపడానికి మరియు వీటి అసలైన నృత్యం యొక్క గౌరవాన్ని మరియు ఆనందాన్ని తిరిగి అన్వేషించడానికి, ఈ సమయం స్త్రీ–పురుషులిద్దరిని ఆహ్వానిస్తోంది.

సాధారణంగా స్త్రీశక్తి ముందుండి నడిపించేదిగాను మరియు ప్రోత్సాహకరంగాను ఉంటుంది, అదే సమయంలో పురుషశక్తి సహాయం చేసేదిగాను మరియు రక్షించేదిగాను ఉంటుంది. ఏ సృష్టి వెనుకనైనా స్త్రీశక్తి యొక్క ప్రోత్సాహం ఉంటుంది; పురుషశక్తి వ్యక్తీకరణకు లేదా వాంఛ కార్యరూపం దాల్చడానికి సహకరిస్తుంది. ఈ శక్తులు రెండూ ప్రతీ మనిషి ద్వారా, అంటే స్త్రీ లేదా పురుషుడి ద్వారా పని చేస్తాయి. మీరు స్త్రీనా లేదా పురుషుడా అనే విషయానికి ఏమాత్రం సంబంధం లేదు; మీ అంతరంలో ఈ రెండింటి శక్తుల మధ్య ఉన్న సమన్వయం మరియు బంధం మాత్రమే పరిగణనలోకి తీసుకొనబడతాయి.

## శృంగారపరంగా స్త్రీలలో ఉన్న అడ్డులు

నేను ఈ రోజు శృంగారం యొక్క భాగంలో స్త్రీ–పురుషులు కలిగి ఉన్న ముఖ్యమైన శక్తి అడ్డుల గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. స్త్రీలలో ముఖ్యంగా దీనికి సంబంధించిన శక్తి అడ్డులు మొదటి రెండు చక్రాలలో ఉంటాయి. చాలా శతాబ్ధాల నుంచి శృంగారం యొక్క అణచివేతలు మరియు దౌర్జన్యాల వలన ఘర్షణలు

మరియు బాధలు ఏర్పడ్డాయి. కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి, స్త్రీ సమాజంలో బానిస పాత్రను పోషిస్తూ, ఇతరులకు లోబడి ఉంటోంది. ఇప్పటికీ ఇది భూమి మీద జరుగుతూనే ఉంది. శృంగారంలో ఉన్న సమానత్వలోపాల వలన మానభంగాలు, శారీరక వేధింపులు మరియు అవమానాలు పెద్ద ఎత్తున సంభవిస్తున్నాయి. ఈ కారణంగా, చాలామంది స్త్రీలు లేదా స్త్రీ ఆత్మల యొక్క సమూహం తీవ్రమైన బాధలకు లోనవుతున్నాయి. స్త్రీలలో లోతైన మనోభావపరమైన గాయాలు ఉన్నాయి. ఇవి నయమవ్వడానికి వీరికి ప్రేమ, కరుణ, సమయం మరియు ఎక్కువ శ్రద్ధ కావాలి.

స్త్రీలు, శృంగార కలయికను హృదయం యొక్క వాంఛగా లేదా ఆధ్యాత్మిక అనుభూతిగా భావించేవారు. కాని వీరు శారీరకంగా సన్నిహితమైనప్పుడు, వీరి యొక్క శృంగార కోరికను స్వేచ్ఛగా వ్యక్తపరచ లేకపోవడాన్ని వీరు స్పష్టంగా కనుగొనవచ్చు. ఎందుకంటే మొదటి రెండు చక్రాలలో శక్తి అడ్డులు ఉండడం వలన. ఈ శక్తి కేంద్రాలలో, వీరు శృంగారపరంగా ఒత్తిడికి గురయ్యి అవమానింపబడిన వాటి యొక్క (ఆత్మ) జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ అనుభవాలు చాలా బాధాకరంగా ఉండడం వలన, స్త్రీలు పొట్టభాగంలో ఉన్న వారి శక్తిని మరియు వారి చైతన్యాన్ని వదిలివేశారు. ఇప్పుడు ఈ శరీరపు భాగాన్ని శృంగారం ద్వారా తిరిగి చేరాలనుకున్నప్పుడు, ఈ భాగంలోని కండరాలు యాంత్రికంగా బిగుసుకుపోతాయి లేదా మనోభావశరీరం తనకుతానుగా ప్రతిఘటనను సూచిస్తుంది. శరీరం యొక్క కణాలు గాయాలకు సంబంధించిన ఎరుకను కలిగి ఉంటాయి మరియు ఇవి నృత్యంలో పాల్గొనడానికి ఆహ్వానింపబడినప్పటికీ కూడా అంత సులభంగా దానికి స్పందించలేవు. హింసాత్మక దాడుల నుంచి మిమ్మల్ని కాపాడడానికి, ఇవి అడ్డులను సృష్టిస్తూ మూసుకుపోతుంటాయి. ఈ ప్రతిస్పందన పూర్తిగా అర్థం చేసుకోదగినది మరియు దీనితో ఎల్లప్పుడూ చాలా గౌరవంగా వ్యవహరించాలి. ప్రతిఘటనలను తీసివేయడానికి బలాన్ని ఉపయోగించడం అన్నది ఈ గాయపడిన కేంద్రాలను మళ్ళీ బాధపెట్టడమే అవుతుంది.

ఒక స్త్రీగా మీరు ఈ మనోభావాలను కలిగి ఉన్నప్పుడు, వీటికి సంబంధించిన పూర్తి ఎరుకను కలిగి ఉండడం అనేది చాలా ముఖ్యం; శృంగారం పట్ల కోపం, భయం లేదా ప్రతిఘటనలను కలిగి ఉండవచ్చు. ఈ మనోభావాలన్నీ మీరు కలిగిఉన్న బంధం కన్నా పురాతనమైనవి, ఈ ప్రస్తుత జన్మ కన్నా కూడా పురాతనమైనవి. క్రింది మూడుచక్రాలలో చాలా పాతగాయాలు ఉన్నాయి, అవి లోతైన మానసికపరమైన మచ్చలకు కారణమయ్యాయి.

ముఖ్యంగా ఈ బాధను గుర్తించిన స్త్రీలకు నేను ఇచ్చే సలహా ఏమిటంటే,

ఈ బాధ మీరు ఒకానొకప్పుడు నియంతగాను లేదా నేరస్థురాలిగాను ఉన్న జన్మలకు సంబంధించినదిగా గుర్తించండి. లేదా మీ గతజన్మలను చేరుకొనుటకు కష్టంగా అనిపించినట్లయితే, మీలో ఉన్న శక్తివంతమైన స్త్రీతో లేదా నేరస్థురాలి పాత్ర యొక్క శక్తితో బంధాన్ని ఏర్పరుచుకోండి. ఇది చూడడానికి చాలా వింతగా అనిపించవచ్చు, కాని దీనికి కారణం మాత్రం ఇదే. మీరు గతంలో శృంగార దౌర్జన్యాల యొక్క బాధితురాలిగా ఉండడం వలన మీ శక్తిక్షేత్రంలో ఎక్కువగా కోపాన్ని కలిగిఉండడానికి కారణమయ్యింది. చాలా జన్మల నుంచి మీరు ఈ కోపాన్ని కలిగి ఉన్నారు. ఈ కోపం మిమ్మల్ని అడ్డుకుంటోంది మరియు ఇది మిమ్మల్ని శక్తిహీనత మరియు బానిసత్వం యొక్క అనుభూతులలో ఖైదు చేసి ఉంచుతోంది.

ఈ కోపాన్ని విడుదల చేయడానికి మీరు దీనిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీరు ఇది దేనివలన మరియు ఎందువలన ఏర్పడిందో తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంది; మీరు దీనికి సంబంధించిన పూర్తి చిత్రాన్ని చూడాల్సిన అవసరం ఉంది. మీరు మిమ్మల్ని ఒక శక్తివంతమైన స్త్రీగా పురుషులపై నిర్దయగాను మరియు క్రూరత్వంగాను ప్రవర్తించడాన్ని ఊహించుకుంటూ, ఇది మీ అంతరంలోని భాగమేనని అనుభూతి చెందినప్పుడే ఆ కోపం పూర్తిగా కరిగిపోతుంది. మీలో సంపూర్ణ అవగాహన మేల్కొనగలదు. మీ అంతర్జ్ఞానం ద్వారా, మీరు అతిపెద్ద కర్మ సంబంధిత కథలో భాగంగా బాధితురాలు మరియు నేరస్థురాలి పాత్రల రెండింటిని పోషించారనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకొనగలరు. మీరు బాధను, అధికారలేమిని మరియు మీ నేరస్థురాలి పాత్ర యొక్క మనోభావాలను, మీ యొక్క ఇంకొక వైపును అంటే చీకటి భాగాన్ని చూడకుండా విడుదలచేయడం అనేది అసాధ్యం.

మీరు మీలో ఉన్న చీకటివైపును తెలుసుకోవడానికి గతజన్మలలోకి వెళ్ళనవసరం లేదు. మీ నిత్యజీవితంలో మిమ్మల్ని మీరు గమనించుకోవడం ద్వారా కూడా దీని ఎరుకను పొందగలరు. మీరు ఈ శక్తిని అనుభూతి చెందినప్పుడు (ఉదాహరణకి ఇతరులపై అధికారాన్ని చెలాయించడం లేదా వారిని బాధించడం), బాహ్య పరిస్థితులకు నిస్సహాయ బాధితురాలిగా ఉన్నది మీరు ఒక్కరే కాదని తెలుసుకొనగలరు. అపరాధి మరియు బాధితురాలి పాత్రల మధ్య కర్మసంబంధం ఉంది; ఈ రెండు పాత్రలు మీ యొక్క లక్షణాలను ప్రతిబింబిస్తుంటాయి.

మీరు చీకటివైపును తెలుసుకుని మరియు దానిని అంగీకరించిన వెంటనే, మీ అంతర్గాయాలను ప్రత్యేకమైన పద్ధతిలో చూస్తూ వాటిని క్షమించడం మొదలుపెడతారు. ఈ విధంగా అర్థం చేసుకున్నప్పుడే మీ కోపం కరిగిపోతుంది

మరియు మీరు ఈ మనోభావాల వెనుకనున్న లోతైన అట్టడుగు పొరలతో బంధాన్ని ఏర్పరుచుకోగలరు: అంటే బాధ, విచారం, దు:ఖం, నొప్పి అనేవి చాలా స్థాయిలలో విస్తరించి ఉంటాయి అని మరియు ఇవి మీ శరీరంలో కూడా ఉంటాయి.

స్త్రీలు అపరాధి జన్మకు సంబంధించిన లక్షణాన్ని వారిలో గుర్తించి మరియు దానితో పనిచేయడం అనేది చాలా ముఖ్యం. మీ అంతరంలో శృంగారం పట్ల ద్వేషం మరియు పగ ఉన్నప్పుడు, మీరు మరింత ద్వేషాన్ని మరియు కోపాన్ని అనుభూతి చెందుతారని తెలుసుకోండి. మీరు ఎంతగా అయితే బాధితురాలి యొక్క పాత్రతో గుర్తించబడతారో, అంతగా మీ స్వేచ్ఛను మీరే దొంగిలిస్తారని తెలుసుకోండి. మీరు స్పష్టంగా మీరు శృంగారాన్ని ఒక కర్మసంబంధిత ఆట యొక్క క్రీడారంగస్థలంగా మీ అంతరంలో అనుభూతి చెందడానికి ప్రయత్నించండి మరియు ఆ ఆటలో మీరు రెండు పాత్రలను అంటే మంచిపాత్రను అదే విధంగా చెడుపాత్రను జయప్రదంగా నిర్వర్తించారు. అక్కడ నుంచే మీరు క్షమించగలిగే స్థలానికి చేరుతారు – మిమ్మల్ని మరియు అదే విధంగా ఇతరులను క్షమిస్తారు. ఈ పరిస్థితులు ఒకానొక కారణం వలన సంభవించాయి. దౌర్జన్యాలు మరియు అణచివేతల యొక్క చర్యలు చూడడానికి అర్ధంరహితంగా ఉంటాయి, కాని వాటి వెనకాల ఎల్లప్పుడూ ఒక కథ దాగి ఉంటుంది. శృంగార దౌర్జన్యాలు సంభవించినప్పుడు అవి మనిషి యొక్క నాలుగుస్థితుల పైన లోతైన ముద్రలను వదిలివేస్తాయి.

## శృంగారపరంగా పురుషులలో ఉన్న అడ్డులు

పురుషుల యొక్క శృంగార అనుభవం ప్రకారం, అడ్డులు అనేవి ముఖ్యంగా హృదయస్థానంలోను లేదా తలభాగంలోను ఉంటాయి. ఈ స్థితులలో ఆధీనం యొక్క భయం మరియు లోతైన మనోభావసంబంధిత సాన్నిహిత్యం యొక్క భయం ఉండవచ్చు. చాలావరకూ ఈ భయాలు చాలా పురాతనమైనవి. ఇవి స్త్రీల ద్వారా పురుషులు అణచివేయబడిన శకానికి సంబంధించినవి. ఈ అణచివేతలు అనేవి సహజత్వంతోను మరియు అమాయకత్వంతోను నిండి ఉండవలసిన శృంగార ఆకర్షణ యొక్క ఆటను, బెదిరింపులతో కూడిన ఆటగా తయారుచేసాయి. పురుషులు వారి యొక్క మనోభావాలను స్వేచ్ఛగా బయటకి చూపించడం మరియు తన భాగస్వామి దగ్గర తన హృదయం తెరవడం అనేది చాలా అపాయకరమని నేర్చుకున్నాడు.

పురుషులు వారి యొక్క అనుభూతులకు ఆధీనమయ్యే విషయంలో చాలా లోతైన భయాలను కలిగి ఉన్నారు మరియు ఈ భయాలు భౌతికస్థాయిలో

వ్యక్తీకరింపబడవలసిన అవసరం లేదు. వీరు అనుభూతులను ప్రక్కన పెట్టి శృంగారం యొక్క భౌతికచర్యలో పాల్గొనవచ్చు. అందువలన పురుషుడు భౌతికస్థాయి శృంగారంలో మాత్రమే పాల్గొంటాడు, కాని అనుభూతుల స్థితిలో సాక్షికంగా పాల్గొనడు. పురుషుడి మనోభావాలు మూసుకుపోయి ఉంటాయి, ఎందుకంటే ఇవి తెరుచుకుని మరొకసారి తిరస్కరణకు గురై గాయపడతారనే వీరి యొక్క భయం వలన. ఇవన్నీ ఆత్మ యొక్క పాత జ్ఞాపకాలు. ఈ జ్ఞాపకాలు ఒకానొకప్పుడు పురుష ఆత్మలు తిరస్కరింపబడిన మరియు మనోభావపరంగా వేధింపబడిన గాయాలకు సంబంధించినవి.

## సహనం మరియు ప్రేమ

సాధారణంగా స్త్రీ–పురుషులలో ఈ శక్తి అడ్డులు కొద్దిపాటి తేడాలను కలిగిఉంటాయి. అందువలన మీరు కలిసినప్పుడు ఏమి అనుభూతి చెందుతున్నారు మరియు మీరు ఏమి గుర్తిస్తున్నారు అనే విషయాలను ఒకరితో ఒకరు స్వేచ్ఛగా వ్యక్తపరుచుకోవడం అనేది చాలా ముఖ్యం. మీరు నిజంగా మీ భాగస్వామిని నమ్ముతున్నప్పుడు, మీరు ఇరువురూ శారీరకంగా సన్నిహితమైనప్పుడు మీ శృంగార శక్తి నిలిచిపోతున్న ప్రదేశాన్ని అవమానంగా భావించకుండా జాగ్రత్తగా గమనించగలరు. మీ ఇద్దరి మధ్య ఉత్తేజం మరియు శృంగారవాంఛ యొక్క ప్రవాహం మేల్కొన్నప్పుడు, మిమ్మల్ని మీరు దీనిని అనుభూతి చెందడానికి మరియు దీని గురించి వ్యక్తపరుచుకోవడానికి ఎంతవరకూ అనుమతిస్తున్నారనే విషయాలను, మీరు కేవలం ఎరుకను పొందడం ద్వారా గుర్తించగలరు. మీ శరీరం యొక్క ఏ భాగాలలోనైనా లేదా మీ మనోభావాలు మరియు అనుభూతుల యొక్క ఏ భాగాలలోనైనా ఏదో నిలిచిపోయిన అనుభూతిని లేదా అడ్డుపడిన అనుభూతిని మీరు పొందినట్లయితే, ఒకసారి దానిని గమనించి చూడండి. మీరు కలిసినప్పుడు మీ హృదయంలో వెచ్చటి వెలుగును అనుభూతి చెందుతున్నారా? మీరు ఇంకొకరి పట్ల ఆధ్యాత్మికంగా నిజాయితీని అనుభూతి చెందుతున్నారా? మీరు ఆమె లేదా అతని యొక్క సంపూర్ణతను అంగీకరించి వారితో కలవడానికి సిద్ధంగా ఉన్నారా?

ఇది వినడానికి వింతగా ఉంటుంది, కాని మీరు నిజమైన సాన్నిహిత్యానికి భయపడుతున్నారు. మీరందరూ సంతృప్తికరమైన బాంధవ్యాలను బలంగా కోరుకుంటున్నారు. రోడ్లమీద ఉన్న ప్రతీ ప్రకటనా కూడా మనోభావపరంగా మరియు శృంగారపరంగా ఉన్నతంగా ఉన్న బాంధవ్యాన్నే ఆదర్శవంతంగా చూపిస్తుంటాయి. కాని నిజమైన సాన్నిహిత్యం మిమ్మల్ని భయపెడుతుంది. ఎవరయినా మీకు

సన్నిహితమైనప్పుడు, మీ యొక్క ముసుగులను తొలగించమని మిమ్మల్ని అడిగినప్పుడు, మీకు ఎరుకలోలేని అన్నిరకాల అణచివేతలు మేల్కొంటాయి. అవి పైకి వచ్చిన క్షణాలలో వాటితో మిమ్మల్ని మీరు నిర్ణయించుకోవడానికి ప్రయత్నించకుండా, వాటిని మీ అంతరంలోని అణచివేతలను మరియు అడ్డులను శోధించడానికి ఒక అవకాశంగా స్వీకరించండి. వీటి నుంచి ఎవరూ విముక్తి పొందలేదు. నేను ఆరంభంలో చెప్పినట్టుగా మానవులందరూ చాలావరకూ ఈ అడ్డులను కలిగిఉన్నారు, అందువలన మీరు శృంగారాన్ని పూర్తి స్థాయిలో అనుభవించ లేకపోతున్నారు. అందుకనే నేను మిమ్మల్ని మీ అంతరంలోని శృంగారశక్తి యొక్క ప్రవాహాన్ని ప్రేమపూర్వకమైన ఎరుకతో గమనించమని కోరుతున్నాను – దీనిని మీరు ఒంటరిగానైనా లేదా బంధంలోనైనా గమనించవచ్చు – మరియు ఈ అడ్డులతో వ్యవహరించడానికి మీరు శ్రద్ధను మరియు గౌరవాన్ని కనుక్కోండి. ఈ విషయాలలో బలవంతం చేయడం అన్నది చాలా మూర్ఖత్వంతో కూడిన పని. ఇక్కడ ప్రేమ మరియు సహనం అనేవి చాలా విలువైనవి.

నిజమైన శృంగారం యొక్క సంపూర్ణమైన అనుభవాన్ని పొందాలనే వాంఛను సజీవంగా ఉండనివ్వండి! ఈ వాంఛను త్రోసివేయద్దు మరియు ఇది చాలా ఉన్నతమైనది. సంపూర్ణమైన ఆనందంతో కూడిన శృంగార అనుభవాన్ని పొందడానికి చేరే మార్గం చాలా దూరంగాను మరియు అనేక మలుపులతోను ఉన్నది. కాని మీరు ఆ మార్గంలో పయనిస్తే మీకు మీ పట్ల అదే విధంగా ఇతరుల పట్ల ప్రేమ మరియు కరుణ పెంపొందుతాయి, ఇది మీ భౌతిక ప్రపంచంలో అత్యధిక విలువను కలిగిఉంది.

మీరు స్త్రీ–పురుషుల మధ్య ఉన్న ప్రాచీనమైన చరిత్ర గల ఘర్షణను హీల్ చేస్తున్నారు. స్త్రీ–పురుష శక్తులు మళ్ళీ దగ్గరకు రావాలనుకుంటున్నాయి. ఆనందం మరియు సృజనాత్మకత యొక్క నృత్యంలో కలిసి నాట్యం చేయాలని అనుకుంటున్నాయి. మీలో ఏ ఒక్కరైనా దీనికి వ్యక్తిగతస్థాయిలో సహకరించినట్లయితే, అది స్త్రీ–పురుష ఆత్మల యొక్క సమూహంపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం ద్వారా మీ అంతరంలోని సహనం మరియు ప్రేమ యొక్క శక్తులను ఇతరులకు అందుబాటులో ఉండేలా చేయగలరు.

* * * *

# మార్గదర్శకులు

డియర్ ఫ్రెండ్స్, ఈ రోజు నేను చాలా ఆనందంతోను మరియు సంతోషంతోను ఇక్కడ ఉన్నాను.  మీలో ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక స్వాగతాన్ని తెలుపుతున్నాను. మన సమావేశం ఒక మార్పును తీసుకువస్తోంది. ఇక్కడ మీరు కేవలం మాటల రూపంలో ఉండే ఉపన్యాసాన్ని మాత్రమే వినడం లేదు, ఇక్కడ నా ఉనికి మీతో కలుస్తూ ఒక శక్తి తలం సృష్టింపబడుతోంది. అది భూమి మీద కాంతిని ప్రసరింపజేయడానికి సహాయం చేస్తుంది.

మీరు కాంతి యొక్క మార్గదర్శకులుగా ఉన్నారు. భూమి మీద కొత్తశకం యొక్క కాంతిని మరింతగా  ప్రసరింపజేయడానికి మార్గాన్ని తెరుస్తున్న వారిలో మీరూ ఒకరు. పాత ప్రపంచం క్రమక్రమంగా మాయమైపోతోంది. అధికారం మరియు అహంభావపూరిత చైతన్యం యొక్క పాత పద్ధతులు వాటి యొక్క శక్తులను కోల్పోయాయి. ఇవి సముద్రం యొక్క అట్టడుగు భాగానికి క్రమక్రమంగా చేరుతున్నాయి. ప్రేమ మరియు హృదయం యొక్క విలువల మీద ఆధారపడే కొత్త ప్రపంచం మరియు కొత్తతరహా వ్యక్తిత్వపుస్థితి మేల్కొంటున్నాయి.

మీరందరూ చాలా వరకూ ఈ పరివర్తనంలో భాగంగా ఉంటున్నారు. కొన్నిసార్లు ఈ మార్పుల యొక్క ప్రక్రియలో మీరు ఎంతగా నిమగ్నులై ఉంటున్నారో కూడా గుర్తించలేరు. మీ సహకారం అన్నది మీ ఊహకి అందనంత భిన్నంగా ఉంటుంది. పాతదనం నుంచి కొత్తదనం వైపు జరుగుతున్న ఈ పరివర్తనంలో, మీరు మరియు మీ శక్తి శరీరం (ఎనర్జీ బాడీ) కూడా మార్పు చెందుతున్నాయి. మీరు భౌతికశరీరంతో పాటు శక్తి యొక్క అమరికను కూడా కలిగిఉన్నారు. ఈ శక్తిని పాక్షికంగా గుర్తించగలరు మరియు పాక్షికంగా గుర్తించలేరు. మీరందరూ ప్రవహిస్తున్న శక్తికి మూలకేంద్రాలుగా ఉన్నారు. మీలో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేకమైన ప్రకంపనాన్ని ఒక శక్తిక్షేత్రాన్ని ప్రసరింపజేస్తున్నారు, మీకు దీని యొక్క ఎరుక లేకపోయినప్పటికీ కూడా ఇది వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ ప్రసరణ లేదా శక్తిక్షేత్రం అనేది మీ చుట్టూ జరుగుతున్న ప్రతీ విషయాన్ని మరియు మీ జీవితంలో మీరు ఆకర్షిస్తున్న పరిస్థితులను నిర్దేశించే అంశంగా ఉంటుంది. మీరు దీనిని “వ్యక్తిత్వం  యొక్క స్థితి”గా కూడా పిలువవచ్చు. ఈ స్థితి భూమి మార్పుచెందడానికి సహకరిస్తుంది. ఎందుకంటే చాలా మంది మనుష్యులు లేదా ఒక్కొక్కరూ వారి యొక్క శక్తిక్షేత్రాలను శుద్ధి చేస్తూ మార్పుకు లోనయినట్లయితే, ఇది మరొక శక్తివంతమైన వాస్తవాన్ని

భూమి మీదకి ఆకర్షింపజేస్తుంది కనుక. ప్రస్తుతం ఈ భౌగోళిక మార్పులే సంభవిస్తున్నాయి మరియు ఇది వ్యక్తిగతస్థాయిలోనే మొదలయ్యింది.

నిజానికి భూమి చుట్టూ చాలా తలాలు ఉన్నాయి: "ఆస్ట్రల్ మరియు ఆధ్యాత్మిక తలాలు". మీరు ఈ పరివర్తనాన్ని, ఈ ఎన్‌లైటెన్‌మెంట్‌ని గుర్తించడానికి, ఇవి మీకు సహాయం చేయాలని అనుకుంటున్నాయి. కాని మీరే మార్గదర్శకులు. భూమి మీద కాంతి యొక్క మార్గాన్ని తెరుస్తున్న వారిలో మీరూ ఒకరు. ఈ మార్గం తెరుచుకోనట్లయితే, భూమి మీద కాంతి స్థిరంగా ఉండదు. అందువలన మిమ్మల్ని మీరు విశ్వసించడం మరియు మీరు ఏ పని కోసమైతే భూమి మీదకు వచ్చారో, ఆ పనిని మీరు చేస్తున్నట్టుగా తెలుసుకుంటూ అంతరంలో అనుభూతి చెందడం చాలా ముఖ్యం.

మీ వ్యక్తిత్వంలో ఆధ్యాత్మిక మార్పును తీసుకురావాలనే ఉద్దేశంతో మీరందరూ అంతర్‌స్థాయిలలో పని చేస్తున్నారు. మీ ప్రకంపనాన్ని ఈ ప్రపంచంలో విస్తరింపజేయాలనే అంతర్ పని మీదే మీరు ఇక్కడకు వచ్చారు. కాని ఈ ప్రపంచం మీ అంతర్ పనిని ఎల్లప్పుడూ సమర్ధించదు మరియు కొన్నిసార్లు మీ స్వచ్ఛమైన భావాలను అడ్డుకుంటుంది. మీరే లైట్‌వర్కర్స్, మీరే కొత్తశకం యొక్క ప్రధాన అన్వేషకులు కూడా. మీరు ప్రేమ మరియు సమన్వయాల ద్వారా, మీ హృదయంలో కొత్త శకానికి జన్మను ఇస్తున్నారు. ఈ విధమైన అంతర్ పనిని చేయడం ద్వారా, మీరు మరింత అందం మరియు భద్రత గల భౌతిక వాస్తవాన్ని ఆకర్షిస్తారు. దీని అర్థం ఇంతకు ముందు కాలాలలో ఎన్నడూ లేనటువంటి అద్భుతమైన భౌతిక వాస్తవాన్ని మీరు ఆకర్షిస్తారు అని.

మీ నిత్యజీవితంలో మీరు ఏమి చేస్తున్నారు లేదా ఏ వృత్తిని కలిగి ఉన్నారు అనే విషయంతో ఇక్కడ ఏ మాత్రం సంబంధం లేదు. మీరు వడ్రంగి లేదా వైద్యుడైనా, ఇల్లాలు లేదా ప్రొఫెసరైనా కూడా, ఈ విషయంలో ఎటువంటి తేడాలు ఉండవు. నిజానికి పరిగణించాల్సిన విషయం: మీరు ముందుకు ప్రవహింపజేస్తున్న శక్తిని మరియు మీరే శక్తిగా ఉంటున్న "మీ వ్యక్తిత్వం యొక్క స్థితిని" కాబట్టి. ఇక్కడ మీరు ఏమి చేస్తున్నారనేది అంత ముఖ్యం కాదు, ఎందుకంటే మీరు ఎవరనే విషయమే మార్పుకు మూలంగా ఉంటోంది కనుక.

ప్రస్తుతం మీరు ఇక్కడ ఈ గదిలో ఉన్న శక్తిని ఒక్కక్షణం అనుభూతి చెందండి, మనందరి శక్తి యొక్క కలయికను ఒకసారి అనుభూతి చెందండి. నేను, మీ ద్వారా

మాత్రమే ఇక్కడ ఉండగలను. మీరు మీ హృదయాలలో నన్ను అంగీకరించినప్పుడే, నా శక్తి మీ లోపలకి ప్రవహించగలదు మరియు ఇక్కడ భూమి మీద మీ ద్వారా బయటకి ప్రవహించగలదు. ఎప్పుడైతే మీ హృదయాన్ని నా కోసం తెరుస్తారో అప్పుడే నేను దానిలోకి రాగలను మరియు నా కాంతిని ప్రకాశింపచేయగలను. కేవలం మీరొక్కరే ఈ మార్గాన్ని తెరువగలరు. నేను మీకు దీనికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీరు ఇక్కడకు ఏ పని చేయడానికి అయితే వచ్చారో, ఆ పనిని మీరు చేస్తున్నారు. భూమి మార్పు చెందుతున్నది. పాతకాలాల యొక్క శిథిలాల నుంచి కొత్త ప్రపంచం ఆవిర్భవిస్తోంది.

కొత్త శకం తన అంతరంలో అనుభూతి చెందుతున్న దాని గురించి మీకు చెప్పాలని అనుకుంటున్నాను. నేను బాహ్యపు లక్షణాలను కాకుండా, అంతర్ సూచనలను పరిగణించాలని అనుకుంటున్నాను. మీ మనోభావశరీరంలో అతి పెద్ద మార్పులు సంభవిస్తున్నాయి. మీ మనోభావశరీరం భయం, కోపం, ఆగ్రహం మరియు మీ బలమైన నమ్మకాలన్నింటికి సున్నితంగా స్పందించడం వలన, మీరు మీ ఆత్మకేంద్రం నుంచి సులభంగా బయటకు నెట్టివేయబడుతున్నారు. మీరందరూ మీ మనోభావశరీరంలో స్వచ్ఛతను పొందాలనే విషయం మీద పని చేస్తున్నారు. మీరు అంతర్ ప్రక్రియ ద్వారా దీనిని చేస్తున్నారు: మీరు అనుభూతి చెందుతున్న మనోభావాల యొక్క బాధ్యతను తీసుకుంటూ, వాటిని పరిశీలిస్తూ మరియు వాటిని అనుసరిస్తూ తిరిగి వాటి యొక్క మూలాల దగ్గరకి పయనిస్తున్నారు. ఈ అంతర్ ప్రక్రియలో మీరు మీ సమస్యలకు గల కారణాలను బాహ్యప్రపంచంలో ఎంత మాత్రం వెతకకుండా, మీరు వాటిని మీ అంతరంలో చూస్తారు. ఈ విధంగా మీ సొంత శక్తి యొక్క బాధ్యతను మీరు స్వీకరించడం అనేది, మీరు ముందుకు వెళ్ళడానికి అతి పెద్ద మలుపుగా ఉంటుంది. మీరు మీ అంతరంలోని ప్రతీ దాని యొక్క బాధ్యతను స్వీకరించిన వెంటనే, మీరు మూసుకుపోయిన మనోభావాల యొక్క ఎరుకను పొందగలరు మరియు వాటిని పరివర్తనం చెందించగలరు. మీరు ప్రస్తుతం ఈ విషయం మీదే పని చేస్తున్నారు.

కొత్త శకంలో మనోభావశరీరం ప్రశాంతతను పొందుతుంది. మీరు ఇంతకు ముందు జీవించిన దాని కన్నా మరింత సహజమైన ఇంగితజ్ఞానపు మార్గంలో జీవిస్తారు. మీ వాతావరణం కూడా ఈ సహజమైన జీవన విధానానికి సహకరిస్తుంది. మీ హృదయం ప్రశాంతత మరియు నిశ్శబ్ధాలతో నిండి ఉంటుంది. మీరు ఎంతగా దీనిని కోరుకుంటున్నారో అనుభూతి చెందగలరా? మీకు మరియు ఇతరులకి మధ్య శక్తిని స్వేచ్ఛగా ప్రవహింపజేసే విషయంలోనూ, మీ ప్రేమను స్వేచ్ఛగా వ్యక్తపరిచే విషయంలోనూ మరియు మీ చుట్టూ ఉన్న మనుష్యులు మరియు ప్రపంచం యొక్క

భద్రత మీద మీరు ఆధారపడుతున్న విషయంలోనూ, మీరు ఎరుక యొక్క స్థితిని ఎంతగా కోరుకుంటున్నారో నేను అనుభూతి చెందగలను మరియు చూడగలను. మీరు ఈ విధమైన ఎరుక యొక్క స్థితినే కోరుకుంటున్నారు, ఈ స్థితిలో మీరు ప్రతీ విషయం సక్రమంగా ఉందని తెలుసుకోగలరు మరియు మిమ్మల్ని మీరు ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించుకోగలరు.

మీరు స్వేచ్ఛ మరియు భద్రత యొక్క అనుభూతిని కోరుకుంటున్నారు. ఈ శక్తి మీకు పూర్తిగా అందుబాటులో ఉందనే విషయాన్ని నేను మీకు మరొకసారి చెబుతున్నాను. మీ ఆత్మలోకి ఈ దివ్యత్వపు శక్తిని స్వీకరించగల మార్గాన్ని మీరొక్కరే తెరవగలరు. మీకు సహాయాన్ని మరియు సహకారాన్ని అందించడానికి, నేను మరియు ఇతర లోకవాసులు మీ ప్రక్కనే ఉన్నాం. నేను నా శక్తిని అనుభూతి చెందమని మిమ్మల్ని అడుగుతున్నాను, నా శక్తి ఇప్పుడు ఇక్కడ అందుబాటులో ఉందని అనుభూతి చెందండి. నిజానికి మీరు కొత్త-జన్మ మీద పని చేస్తున్నారు. మీ హృదయంలో నిశ్శబ్దాన్ని అనుభూతి చెందండి, మీ పాత శక్తులను విడుదల చేయడానికి మరియు కొత్తదనానికి మార్గాన్ని ఏర్పరుచుకోవడానికి మిమ్మల్ని అనుమతించే అంతర్ ప్రదేశాన్ని అనుభూతి చెందండి. మీరందరూ కాంక్షిస్తున్న స్వేచ్ఛ మీకు సన్నిహితంగానే ఉంది.

కొత్తదనం వచ్చే ముందు ఎల్లప్పుడూ కష్టమైన పరిస్థితి ఉంటుంది: అంటే పాతదనం యొక్క మరణవేదన ఉంటుంది. సూర్యోదయానికి ముందు ఉన్న చీకటి సమయంలా పాత భయాలన్నీ పైకి వస్తాయి. భూమి మీద మీరు అజ్ఞానంలో గడిపిన గతజన్మలన్నింటి నుంచి ఈ జన్మ వరకూ, మీరు ప్రోగు చేసుకున్న విచారాలు మరియు కోపాలన్నీ కూడా పైకి వస్తాయి. ఇవన్నీ కలిసి ఏకమవ్వడానికే పైకి వస్తాయి. మీకు కనిపిస్తున్న వాటిని చూసి మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు. మీ చైతన్యంలోకి ఈ చెడుశక్తి అంతా ప్రవేశించడం అనేది మంచి ఎదుగుదలకు చిహ్నం లాంటిది. దీని అర్థం మీరు పరీక్ష ఉత్తీర్ణమవ్వడానికి అవసరమైన బలం మీకు ఉందని తెలియజేయడమే.

మీరందరూ జీవిత కాలచక్రాన్ని పూర్తి చేయడంపై పని చేస్తున్నారు. ఈ జీవితాలలో మీరు 'మంచి-చెడు', 'వ్యక్తిగత-ఎరుక మరియు అధికారం యొక్క భ్రమలు', 'భయం మరియు అజ్ఞానం' మధ్య జరిగిన అంతర్ఘర్షణల ద్వారా శాసింపబడ్డారు. మీ ఆత్మ యొక్క లోతులలోకి చూడమని, దివ్యత్వపు కాంతి యొక్క వెలుగును తిరిగి అన్వేషించమని నేను మీ అందరిని అభ్యర్థిస్తున్నాను.

మీరు గతాన్ని విడుదల చేసేటప్పుడు ఈ మూడు ఆటంకాలను ఎదుర్కొనవచ్చు. నేను ఇప్పుడు వాటి గురించి చెప్పాలనుకుంటున్నాను. ఇవన్నీ మనోభావశరీరానికి సంబంధించినవి మరియు ఇవి మీరు లైట్‌వర్కర్ అని తెలిపే వాస్తవంతో కూడా చాలా లోతైన బంధాన్ని కలిగి ఉంటాయి.

## 1.ఆధ్యాత్మిక కోపం

మొదటి ఆటంకం కోపం. సమన్వయాన్ని మరియు న్యాయాన్ని కోరుకోవడం ద్వారా ప్రేరేపింపబడే కోపం గురించి నేను మాట్లాడాలనుకుంటున్నాను. దీనిని మీరు ఆధ్యాత్మిక కోపంగా పిలువవచ్చు. నేను దీని యొక్క మూలం గురించి వివరించాలని అనుకుంటున్నాను.

మీ జీవిత కాలచక్రాన్ని భూమి మీద ఆరంభించినప్పుడు, మీరందరూ ఒక ఉత్తేజాన్ని కలిగి ఉండేవారు. ఈ ఉత్తేజం క్రీస్తుశక్తితో బలీయమైన బంధాన్ని కలిగి ఉంది. జెషువాగా భూమి మీదకి నా రాక మీకు మార్గదర్శకంగాను, ఉత్తేజంగాను ఉండేది. మీ అందరిలో ఉన్న శక్తిని మీరు నాలో గుర్తించారు. అంతకు మునుపు కాలాలలో కూడా, మీరందరూ ఈ శక్తిని భూమి మీద ముందుకు నడిపించాలనే నిర్ణయాన్ని కలిగి ఉండేవారు. మీ జీవిత కాలచక్రంలో దీని కోసం ప్రయత్నించినప్పుడు, మీరు చాలా ప్రతిఘటనలను ఎదుర్కొన్నారు. దీని వలన మనోభావశరీరం గాయపడింది. మనోభావశరీరం అంటే మరేదో కాదు మీ అంతర్ శిశువే. మీ అంతర్ శిశువు అనేది మీ యొక్క చురుకైన స్వేచ్ఛా భాగం, ఇది తన మనోభావాలకు సహజంగా స్పందిస్తుంది మరియు ప్రతిస్పందిస్తుంది. చాలా జన్మల నుంచి, మీరు భూమి మీద క్రీస్తుశక్తిని ఆవిర్భవించడానికి సంబంధించిన అంతర్ లక్ష్యాన్ని సాధించడంలో మీ అంతర్ శిశువు చాలా బాధలకు గురైంది.

మీలోని ఒక భాగం ఎల్లప్పుడూ విశ్వ సంబంధిత విషయాలకు ఉత్తేజింపబడుతుంది. మీరు ప్రజ్ఞాత్మ స్థితి నుంచి మీకు సంభవించిన విషయాలన్నింటి యొక్క అర్థాన్ని తెలుసుకుంటారు మరియు వాటిని అనుభూతి చెందగలరు. మీరు కాంతి మరియు జ్ఞానం యొక్క భావన నుంచి పరిస్థితులను చూడగలుగుతారు. కాని మీలో మరొక భాగం ఉంది, ఇది భూ సంబంధిత వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటుంది. ఇదే మీ అంతర్ శిశువు లేదా మీ అహంకారం; దీనిని మీ మానవత్వం యొక్క భాగంగా కూడా పిలువచ్చు. ఈ స్థితిలో మీకు సంభవిస్తున్న విషయాల పట్ల అధిక భయాన్ని మరియు అవగాహనా లోపాన్ని కలిగి ఉండగలరు. మీ ఆత్మకు అంతా సక్రమంగా

జరుగుతోందని మరియు ఇది అతి పెద్ద లక్ష్యాన్ని చేరేందుకు సహకరిస్తోందనే విషయం తెలిసినప్పటికీ కూడా, మీ అంతర్‌శిశువుకు మాత్రం వీటి యొక్క అవగాహన ఉండదు.

మీరు భూమి మీద ఎత్తిన జన్మలలో కాంతి యొక్క బీజాలను నాటడం కోసం, మీరు కొత్త వైఖరులు లేదా ఆదర్శవంతమైన రూపాలతో ఉత్తేజింపబడ్డారు. కాని మీ పరిసరాల ద్వారా, మీరు తప్పుగా అర్థం చేసుకోబడుతూ, తిరస్కరింపబడేవారు మరియు అవమానింపబడేవారు. ఈ విధమైన తిరస్కరణల యొక్క అనుభవాల నుంచే ఎక్కువగా మనోభావసంబంధిత గాయాలు ఏర్పడ్డాయి. మీ అంతరంలోని శిశువు ఎందుకు అసమ్మతినే పొందుతోందో అర్థం చేసుకోలేకపోయింది. మీ ఆత్మ దీనిని అర్థం చేసుకున్నప్పటికీ కూడా – మీ జీవాత్మ, మీ మనోభావశరీరం – వేధింపులు, హింసలు మరియు తిరస్కరణల ద్వారా ఏర్పడిన లోతైన గాయాల యొక్క అనుభవాలతో వ్యవహరించాల్సి వచ్చింది. మీరందరూ, ఈ గాయాలను మీ ఆత్మపై ఏర్పడిన మచ్చలుగా మీ అంతరంలో మోస్తున్నారు.

మీరు భూ వాస్తవంలోనికి కాంతిని తీసుకురావడం కోసం వచ్చారు. ఈ పని చాలా క్లిష్టతరంగా ఉన్నప్పటికీ, మీ గత–చరిత్ర ఆరంభం నుంచి మీరు దీని కోసమే పని చేస్తున్నారు. మీరు భూమి మీద, మీ జీవిత కాలచక్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, మీ జీవితంలో ఒక విధమైన వ్యక్తిగత కర్మ కూడా పాల్గొనడం ఆరంభించిందనే విషయాన్ని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. మీ అంతట మీరుగా అజ్ఞానంలో మునిగిపోయిన కాలాలలో, మీరు భూమి మీద ఉన్న ఆత్మలన్నింటిపై అధికారాన్ని మరియు అదుపును చేజిక్కించుకోవాలని జీవించారు. మీలాగే ఇతరులు కూడా ఈ ప్రయత్నం చేశారు. మీరు ఈ ముందు జన్మలను సరిజేయాలని, మానవత్వానికి ప్రేమను మరియు న్యాయాన్ని తిరిగి అందజేయాలనే లక్ష్యంతో భూమి మీద జీవించేవారు.

ఈ ఉత్తేజం, ఈ కాంతి యొక్క జ్వాల మీ హృదయాలలో తీవ్రంగా వెలుగుతున్నప్పటికీ, మీ అంతర్ శిశువు యొక్క భాగం అవగాహనా లోపానికి గురయ్యేది. ఈ విషయాల వలన ఆధ్యాత్మిక కోపం ఉద్భవించింది. మీ అంతరంలోని శిశువు యొక్క భాగం, మీరు అజ్ఞానానికి అందిస్తున్న కర్మ సంబంధిత సహకారాన్ని అర్థం చేసుకోలేకపోయింది మరియు తనకు తానుగా చెడును బయటకి ప్రదర్శిస్తుండేది. మీ అంతరంలోని శిశువు భాగం, మంచి కోసం పోరాడాలని మరియు మనోభావ సంబంధిత ఉద్దేశ్యాల నుంచి బయట పడాలని కోరుకునేది. మీ

అంతరంలోని శిశువు భాగం తిరస్కరణను మరియు భూ వాస్తవికత యొక్క నెమ్మదితనాన్ని భరించలేకపోయేది. ఇది అతి తక్కువ సహనాన్ని కలిగి ఉండేది. ఈ శిశువు జన్మతో పాటు ఆధ్యాత్మిక కోపం కూడా జన్మించింది.

ఆధ్యాత్మిక కోపం అంటే అర్థం ప్రపంచానికి సంబంధించిన చెడు విషయాల వలన, అమాయక ప్రజలు కష్టపడడం వలన, భూమి యొక్క వినాశనం వలన మరియు మొక్కలు, వృక్షాలు-జంతు సంపదల ధ్వంసాల వలన మీరు అధికంగా ప్రభావితం చెందడమే. "సామాజిక మరియు రాజకీయ అసమానతలు, అనవసరంగా పిల్లలు చనిపోవడం, యుద్ధాలు మరియు విప్లవాలు" మొదలైన పరిస్థితులు- మిమ్మల్ని ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. ఈ విషయాలన్నీ మిమ్మల్ని చాలా లోతుగా ప్రభావితం చేస్తూ, మీ అంతరంలో కోపాన్ని రేకెత్తిస్తున్నాయి. దీని వలన మీరు శక్తిహీనతను అనుభూతి చెందుతున్నారు.

లైట్‌వర్కర్స్ ఈ కోపాన్ని ఒక లక్షణంగా కలిగి ఉండడానికి మరియు దీని ద్వారా ప్రభావితం చెందడానికి వారిని వారు అనుమతిస్తున్నారు. వీరు ఈ కోపం యొక్క విషయంలో వీరి యొక్క సరిహద్దులను దాటుతున్నారు. వీరు ప్రపంచాన్ని మార్చాలని మరియు అభివృద్ధి చేయాలనే కోరిక వలన వీరిని వీరు కోల్పోయారు. ఇది సామాజిక లేదా రాజకీయ స్థాయిలలో పరిస్థితులను మార్పు చెందించాలనే ఆశయానికి సంబంధించినది కావచ్చు, లేదా ఒక వృత్తిగాను లేదా తన సొంత జీవితంలోను వ్యక్తిగతంగా ప్రజలకు సహాయం చెయ్యాలనే కాంక్షకు సంబంధించినది కావచ్చు.

పరిస్థితులను మార్చాలని మరియు సహాయం చెయ్యాలనే కోరిక అనేది, ఆధ్యాత్మిక కోపాన్ని కలిగి ఉన్నప్పటికీ కూడా దీనిని గుర్తించలేరు. సమాజం కోసం లేదా ఇతరుల కోసం మీకు మంచి చేయాలని అనిపించవచ్చు. మీరు ఇచ్ఛాపూర్వకంగా, ఇతరుల యొక్క ప్రవర్తనను లేదా వారి మనోభావాలను మార్చాలని బలవంతం చేసినట్లయితే, మీరు మీ అంతరంలో ఖచ్చితంగా కోపాన్ని అనుభూతి చెందుతారు. తరచూ మీరు ఇది సరైన సమయం కాదనే విషయాన్ని గుర్తించలేరు.

మీరు తీవ్రమైన ఆగ్రహానికి లోనవుతున్నప్పుడు, (లేదా) పరిస్థితులను మార్చాలనే అతి పెద్ద ఆశయాన్ని కలిగి ఉన్నప్పుడు, (లేదా) మీరు పరిస్థితులను యథాతథంగా అంగీకరించాల్సి వచ్చినప్పుడు, మీరు శక్తిహీనతను మరియు కోపాన్ని అనుభూతి చెందుతున్నప్పుడు – మీరు ఆధ్యాత్మిక కోపం యొక్క సమస్యలో ఉన్నట్టు

అర్థం. మీరు ఒకేసారి అధికంగా కోరుకుంటున్నారు. మీరు తీవ్రమైన కోపానికి లోనయినప్పుడు, మీరు వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడాన్ని నిర్లక్ష్యం చేస్తారు. దీని పట్ల ఎరుకను పొందమని మరియు దీనిని వదిలి వేయమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఎందుకంటే ఈ విధమైన ఉత్తేజం, కోపం ద్వారా ప్రేరింపించబడుతూ, మిమ్మల్ని కేంద్రం నుంచి దూరం చేస్తుంది కనుక. ఇది మీకు నిజమైన ఉత్తేజాన్ని అందించలేదు మరియు మీ మనోభావశరీరంలో ప్రశాంతతను మరియు నిశ్శబ్దాన్ని కూడా నెలకొల్పలేదు. భూమి మీద మీ కాంతిని ప్రసరింపజేయడానికి సహకరించే మనోభావశరీరాన్ని మీకు అందించలేదు.

మీరు మీ స్వచ్ఛమైన మరియు ప్రశాంతమైన మన:స్థితి యొక్క కేంద్రంలో మరియు మీ సొంత వ్యక్తిత్వం యొక్క కేంద్రంలో సంపూర్తిగా ఉండడం ద్వారా మాత్రమే, మీరు భూమి మీద మీ కాంతిని ప్రసరింపజేయాలనే వాంఛను సాధించగలరు. ఈ స్థితిలో మీరు ప్రపంచంలో ఉన్నా కూడా ప్రపంచానికి సంబంధం లేనట్టుగా అనుభూతి చెందుతారు, అంటే తామరాకు మీద నీటిబొట్టులా. ప్రపంచంలో జీవించడమంటే అర్థం మీరు మీ ఇంద్రియాల ద్వారా గ్రహించిన ప్రతీ దానికి విలువను ఇస్తూ నిర్ణయిస్తారు: దౌర్జన్యం, యుద్ధం, అనారోగ్యం, వినాశనం మొదలైనవి. వీటిని మీరు మీ శారీరక ఇంద్రియాల ద్వారా మాత్రమే పరిగణించినప్పుడే, మీరు సులభంగా కోపానికి లోనవుతారు. అందువలన మేము మిమ్మల్ని ఒక అడుగు వెనక్కి వేసి, ఒక్క నిమిషం అంతరంలోకి వెళుతూ, మిమ్మల్ని నిరాశకు గురిచేస్తున్న విషయాలలో ఆధ్యాత్మికపరంగా ఏమి సంభవిస్తున్నది అనే దానిని అనుభూతి చెందమని అడుగుతున్నాము.

ఈ విధంగా బాధపడడానికి ఒక నిగూఢమైన అర్థం ఉంది. భూమి మీద జీవిస్తున్న – ప్రతీ ఆత్మ, ప్రతీ జీవి తన గురించి తాను స్పష్టతను పొందడానికి, తనను తాను వ్యక్తపరుచుకోవడానికి మరియు ఒకే సమయంలో జీవాత్మగా మరియు ప్రజ్ఞాత్మగా ఉండడం ఎలా అనే దానిని మరింతగా నేర్చుకోవడానికే ఇక్కడకు వస్తాయి. ప్రతీ ఆత్మ తన అభివృద్ధి కోసం, తన సొంత మార్గంలో పయనిస్తోంది. అందువలన దీనిని గౌరవించమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. కాబట్టి మీరు ఒక అడుగు వెనక్కి వేసి, మీ మీద మరియు మీ సొంత కాంతి మీద పూర్తిగా శ్రద్ధను వహించండి. మీరు ప్రసరింపజేస్తున్న శక్తి, విశ్వాసం, ప్రకంపనం – మీ శక్తి క్షేత్రంలోనికి మానవులను (లేదా) జంతువులను (లేదా) వృక్షాలను స్వేచ్ఛగా అనుమతించడానికి మరియు హీలింగ్ ప్రకంపనాల యొక్క అనుభవాన్ని పొందడానికి ఆహ్వానిస్తాయి. ఈ పని

కోసమే మీరు ఇక్కడకు వచ్చారు. మీరు దీని కోసం కష్టపడాల్సిన అవసరం లేదు. మీరు దీని కోసం పోరాడవలసిన అవసరం లేదు.

మీ నిజమైన ఆధ్యాత్మిక పని అంటే ఏదో చేయడం మాత్రం కాదు, కేవలం ఉండడమే. మీ ఆధ్యాత్మిక శక్తి సమన్వయంలో ఉన్నప్పుడు, మీరు భౌతికపరమైన లేదా మానసికపరమైన ప్రయత్నం లేకుండానే, మీరు ఇతరులకు చాలా సులభంగాను మరియు తేలికగాను హీలింగ్ శక్తిని ప్రసరింపజేయగలరు. ఇది తేలికగాను, సున్నితంగాను ఉంటూ ఏ మాత్రం అలసట లేని అనుభూతిని మీకు కలుగజేస్తుంది. మీరు ఎదురుచూస్తున్న పరిస్థితులు మరియు మనుష్యులు మీ మార్గంలో సహజంగా కనిపిస్తూ, వారు హీలింగ్ కోసం మీ దగ్గరకు వస్తారు.

మీకు మీరుగా ఆగ్రహం మరియు కోపంలో బంధీ అయినప్పుడు, ఆ కోపం భరించలేనంత బాధగాను లేదా అన్యాయంగాను ఉందని మీరు కనుగొన్నప్పటికీ కూడా, నేను మిమ్మల్ని ఒక అడుగు వెనుకకు వేసి మీ ఆత్మకేంద్రంలోకి వెళ్ళమని అడుగుతున్నాను. అంతరంలో నిశ్శబ్దాన్ని అనుభూతి చెందుతూ, ప్రతీ విషయాన్ని యధాతధంగా అంగీకరించండి. ప్రతీ విషయం, తన సొంత చక్రాన్ని పూర్తి చేస్తోందని మరియు తన సొంత అభివృద్ధిని కలిగి ఉంటోందని అంగీకరించండి. మీకు సన్నిహితమైన వారిలో కూడా ఇదే సంభవిస్తోంది. వీరిని స్వేచ్ఛగా వదిలివేయండి. వీరి కోసం మీరు అతిగా ఆలోచించనక్కర్లేదు, మీరు కేవలం అక్కడ ఉంటే చాలు.

## 2.ఆధ్యాత్మిక నిరాశ

నేను రెండవ ఆటంకమైన ఆధ్యాత్మిక నిరాశ (లేదా) విచారం గురించి చెప్పాలనుకుంటున్నాను. మీరందరూ లైట్‌వర్కర్స్‌గా తిరస్కరణలకు, హింసలకు మరియు వేధింపులకు ప్రభావితమైన మీ యొక్క గత చరిత్రను క్లుప్తంగా ఇంతకు ముందే వివరించాను. ఈ సంఘటనలు మీ ఆత్మ మీద కొన్ని మచ్చలను వదిలివేసాయి. ఇవి మిమ్మల్ని ఎంత లోతుగా బాధించాయంటే, మరొకసారి మీరు ఈ ప్రపంచంలో మీ కాంతిని ప్రకాశింప చేయడానికి అవసరమైన ధైర్యాన్ని కోల్పోయేలా చేసాయి. దీని వలన మీరు తరచూ నిరాశకు లోనవ్వవచ్చు మరియు మీకు జీవితం ఒక అర్థం లేనిదిగా అనిపించవచ్చు. మీరు ఈ ప్రపంచంలో తిరస్కరింప బడుతున్నట్లుగా అనుభూతి చెందవచ్చు, మీరు మీ శక్తితో ఇక్కడ ఇమిడి ఉండలేరని భావించవచ్చు. మీరు ఈ ప్రపంచానికి పూర్తి భిన్నంగా ఉన్నట్లు మిమ్మల్ని మీరు భావించవచ్చు.

విచారం లేదా నిరాశ యొక్క అనుభూతులనేవి ఆత్మవిశ్వాసం యొక్క లోపం వలన ఏర్పడతాయి. ఒక వైపు మీ అంతరంలో ఆధ్యాత్మిక కాంతిని మోస్తున్నారని మరియు మీరు సున్నితత్వం, కరుణ మరియు మేధాసంపత్తి గల వారని మీకు బాగా తెలుసు. కాని మరొక వైపున మీ అంతరంలో గాయపడిన శిశువు ఉంది, ఇది బాహ్యప్రపంచం నుంచి గుర్తింపును, ప్రశంసను కోరుకుంటోంది. మీలోని ఒక భాగం బాహ్యపు శ్రద్ధను మరియు భద్రతను కాంక్షిస్తోంది. కాని మీరు ఎప్పటికి దీనిని మీకు కావలసినంతగా పొందలేరు. లేదా నిజానికి మీరు ఆశిస్తున్న గుర్తింపును కనుగొనలేరు, ఎందుకంటే మీరు ప్రత్యేకమైన వారు కనుక. తరచూ మీ పరిసరాలు నిజానికి మీరు ఎవరనే దానిని గుర్తించలేవు. అందువలన ఇవి మీకు గుర్తింపును మరియు వాత్సల్యాన్ని అందించలేవు.

మీ గాయపడిన అంతర్‌శిశువు బాహ్యపు విషయాల ద్వారా నయమవ్వదు. కేవలం మీ ద్వారా, మీ సొంత శక్తి మరియు జ్ఞానం ద్వారా మాత్రమే హీలింగ్‌ను పొందుతుంది. మీ బాధ మరియు విచారం యొక్క శ్రద్ధను తీసుకోవడం ద్వారాను మరియు ఏ ఒక్కరూ మీపై నమ్మకాన్ని కలిగిలేని సమయాలలో మీ పట్ల మీరు నమ్మకాన్ని కలిగిఉండడం ద్వారాను, మీరు నిజమైన ఆత్మవిశ్వాసాన్ని సాధిస్తారు. ఒకసారి మీరు శక్తి యొక్క మూలాన్ని తెరవగలిగినప్పుడు, మీరు భౌతిక మరియు సామాజిక పరిస్థితులను ఆకర్షిస్తారు. ఇవి మీకు మరియు మీ లోతైన ఆకాంక్షలకు సహకరిస్తాయి.

ఆధ్యాత్మిక విచారం లేదా నిరాశకు గురై బాధపడుతున్న ప్రతీ ఒక్కరూ కూడా, భూ సంబంధిత వాస్తవాన్ని అధిగమించాలని, సమన్వయం మరియు జ్ఞానం యొక్క తలాలకు, అంటే ప్రశాంతత మరియు భద్రతలతో విస్తరించి ఉన్న తలాలకు తిరిగి వెళ్ళాలనే బలమైన వాంఛను అనుభూతి చెందుతారు. నేను మీ అందరిని అడుగుతున్నది మరియు మీ ఆత్మలన్నింటిని ప్రార్థిస్తున్నది ఏమిటంటే, మీ అంతర్‌కాంతిని మళ్ళీ విశ్వసించమని మరియు దానిపై స్థిరంగా నిలబడమని. మీకు ప్రేమ మరియు భద్రతలను అందించే కాంతి ఇప్పుడు ఇక్కడ అందుబాటులో ఉంది. ఇది మీ హృదయంలో ప్రకాశిస్తున్నది. అది కేవలం మీ శ్రద్ధను దానిపై మళ్ళీ కేంద్రీకరించమని మిమ్మల్ని అడుగుతోంది. ఇతర లోకాలలో ఉన్న మేము, మీ భారాన్ని తగ్గించాలనే ఆత్రుతను కలిగి ఉన్నప్పటికీ సహాయం చేయలేం. ఎందుకంటే మీరు మీ సొంత కాంతిని విశ్వసిస్తూ మరియు దానిని మీ అంతట మీరు విస్తరింపజేసేంత వరకూ కూడా, ఎవరూ మీకు సహాయం చేయలేరు కనుక.

నిరాశ లేదా విచారం యొక్క అనుభూతులలో కూరుకుపోకుండా ఉండగలగడం చాలా ముఖ్యం. ఇది అతి ప్రమాదకరమైన ఆటంకం. దీని వలన మీరు మీ మార్గాన్ని పూర్తిగా మరిచిపోగలరు. ఎందుకంటే నిజానికి మీరు ఒక దేవత (ఏంజెల్) అని మరియు మీ అంతరంలో కాంతి యొక్క జీవం సజీవంగా ఉందనే విషయాలతో మీరు బంధాన్ని కోల్పోతారు కనుక. మీరు నిరాశకు గురైన క్షణాలలో ప్రశాంతంగా ఉంటూ బ్రీతింగ్ చేయడం అనేది మీకు చాలా సహాయం చేస్తుంది. మీ శరీరమంతా శ్వాస యొక్క కదలికలను, అంటే ప్రతీ ఉచ్ఛ్వాస-నిశ్వాసాల యొక్క కదలికలను ఎరుకతో గమనించండి. మీ అంతరంలో నెమ్మదిగాను లేదా బిగ్గరగాను మీకు మీరు చెప్పుకోండి: "నేను నేనుగా ఉన్నాను. నేను నేనుగా సంపూర్ణంగానే ఉన్నాను."

నేను నా కాంతితో మిమ్మల్ని చుట్టిముట్టి ఉన్నాను. నిజానికి మీ అంతరం నుంచి ఆవిర్భవించిన ఆత్మ విశ్వాసానికి, ఆత్మ గౌరవం యొక్క అనుభూతికి మార్గాన్ని స్వల్పంగా తెరవగలిగినప్పుడు మాత్రమే, మీ అంతరంలో కాంతి ప్రకాశించగలదు: మన సొంత పూర్ణాత్మ యొక్క కాంతి, క్రీస్తుశక్తి యొక్క కాంతి మరియు అందరి సహాయకులు, మార్గదర్శకులు మరియు భూమి చుట్టూ ఉన్న తలాల నుంచి మీకు ప్రేమను, సహకారాన్ని అందించే ఏంజెల్స్ యొక్క కాంతి మీ అంతరంలో ప్రకాశించగలదు.

ఇప్పుడు మార్పు యొక్క కాలం ఆసన్నమైనది. ప్రస్తుత కాలం చాలా కష్టంగా అనిపించినప్పటికీ కూడా మిమ్మల్ని తలెత్తుకుని ముందుకు సాగమని మరియు కొత్తశకం యొక్క అంచులపై దృష్టిని కేంద్రీకరించమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ప్రేమ మరియు సమన్వయాలతో కూడిన వాస్తవం మీకోసం ఎదురుచూస్తోంది; ఇది మీ వారసత్వం మరియు మీలో చాలామంది దీనిని ఈ జన్మలోనే అనుభూతి చెందుతారు. మీ పట్ల మీరు నమ్మకాన్ని కలిగిఉండడం చాలా ముఖ్యం మరియు మీకు అవసరమైనవన్నీ అందజేయబడతాయని విశ్వసించడం చాలా ముఖ్యం. మీ అంతరంలోని కాంతి చాలా బలంగా స్థిరపడి ఉంది, కాబట్టి చీకటి గురించి భయపడవద్దు. మీ కాంతిని ఎవరూ ఓడించలేరు. మీరు చేతిని అందించేంత వరకూ మరియు మార్గాన్ని తెరిచేంత వరకూ కూడా, మీ కాంతి యొక్క వాస్తవం మీ కోసం ప్రేమతోను మరియు సహనంతోను ఎదురుచూస్తుంది.

### 3. మీ సొంత బలానికి సంబంధించిన భయం

చివరిగా నేను మరొక ఆటంకం గురించి చెప్పాలనుకుంటున్నాను. ఇది మీ మనోభావశరీరంలో చాలా గందరగోళం ఏర్పడడానికి కారణమవుతోంది. ఇక్కడ నేను మీ అంతర్ ప్రశాంతతను మరియు స్పష్టతను సాధించకుండా అడ్డుకుంటున్న శక్తుల గురించి ఇంకా మాట్లాడుతున్నాను. ఇది కోపం కావచ్చు, విచారం కావచ్చు మరియు భయం కూడా అయి ఉండవచ్చు, ఇదే మూడవ ఆటంకం.

ముఖ్యంగా మీ సొంత ఉత్తేజాలు, అనుభూతులు మరియు ఇంగితజ్ఞానం యొక్క విషయాల పట్ల నమ్మకాన్ని కోల్పోవడం వలనే ఈ భయం ఏర్పడుతుంది. మీరు మీ సొంత అనుభూతులను సందేహించినట్లయితే, మీరు అధికంగా బాధకు గురవుతారు మరియు మీ మనోభావాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి బయటకు వస్తూ మీరు మీ ఆత్మ కేంద్రానికి దూరమయ్యేలా చేస్తాయి. మీరు భయంతో నిండి ఉన్నప్పుడు మీ ఇంగితజ్ఞానం మూసుకుపోతుంది. మనసు మరియు మనోభావాలు అనేవి పై చేయిగా ఉంటూ ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఇవి తీవ్ర భయాందోళనలను మరియు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తాయి. మనసుకు మరియు మనోభావాలకు, “ఇంగితజ్ఞానం మరియు హృదయం” పునాదిగా ఉండాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే ఇవి మీకు ఉపయోగకరమైన మార్గంలో సహాయాన్ని అందిచగలవు.

మీరు హృదయాన్ని పట్టించుకోకుండా వదిలివేసినట్లయితే, బుద్ధి అధిక సమయం పని చెయ్యాల్సి వస్తుంది. దీని కారణంగా మనోభావాలు ప్రశాంతమైన క్షణాలను కలిగి ఉండలేవు. అప్పుడు భయం మీపై అదుపును పొందవచ్చు. అప్పుడు భయం అన్ని రకాల పరిస్థితులలో తనను తాను వ్యక్తీకరించుకుంటుంది. మీరు సహజంగా చేయగలిగే పనుల విషయంలో కూడా, మీ సామర్థ్యాన్ని మీరు సందేహించవచ్చు. మీరు రుజువులను కూడా ప్రశ్నించడం మొదలుపెట్టవచ్చు మరియు ప్రతీ విషయాన్ని సమస్యగా తయారుచేయవచ్చు. మీరు మీ అంతరంలో ఒక రకమైన బలహీనతను కలిగిఉంటారు, ఇది మీతో మీరు నిశ్శబ్దంగాను మరియు ప్రశాంతంగాను గడపడాన్ని అసాధ్యం అయ్యేలా చేస్తుంది.

మీ అంతట మీరు బాధలన్నింటి నుండి స్వేచ్ఛను పొందడం మరియు మీ హృదయానికి, మీ అనుభూతులకు తిరిగి చేరడం చాలా ముఖ్యం. మీరు ఈ అవిశ్రాంతమైన ఆలోచనలు మరియు గందరగోళ మనోభావాలన్నింటి క్రింద ఉన్న

అసలు విషయాన్ని నిజంగా అనుభూతి చెందగలరా? మీరు ప్రశాంతంగా బ్రీతింగ్‌ని చేసినప్పుడు, మీరు మీ మూలం దగ్గరకి తిరిగి వెళ్ళగలరు. అప్పుడు మీరు మీ అంతరంలో విశ్రాంతిని పొందవచ్చు, మీ ఆలోచనలకు మరియు మనోభావాలకు అతీతంగా ఉండే నిశ్శబ్దాన్ని అనుభూతి చెందవచ్చు. ఆ తర్వాత, మీ చుట్టూ 'ఆలోచనలు మరియు మనోభావాలు' మేఘాలుగా కమ్ముకుని ఉన్న అనుభవాన్ని మీరు పొందవచ్చు. మీరు వీటిపై మీ దృష్టిని పెట్టవచ్చు లేదా పెట్టకపోవచ్చు. ఆ తర్వాత మీరు మీ యొక్క స్వేచ్ఛా భావనను మరియు ఒకానొక ఆలోచనను లేదా మనోభావాన్ని ఎంపిక చేసుకోగల మీ యొక్క సామర్థ్యాన్ని తిరిగి పొందుతారు.

మీ ఆలోచనలు సత్యమైనవని లేదా మీ మనోభావాలు సత్యమైనవని మీరు నమ్మినట్లయితే, మీరు వాటిచే పూర్తిగా గ్రహింపబడుతూ, ఈ ఆలోచనలు మరియు మనోభావాల యొక్క త్రోవనే అనుసరిస్తారు. ఒక అడుగు వెనుకకు వేసి మీతో మీరు ఈ విధంగా చెప్పుకోండి: "నేను ఈ మనోభావాలు మరియు ఆలోచనలు ఏవైనప్పటికీ కూడా, వాటిని వదిలివేస్తున్నాను మరియు నేను వెనుకకు వెళ్తున్నాను. నేను నా లోతులలోకి వెళుతున్నాను. నిజానికి ఇక్కడ ఏం జరుగుతోంది మరియు ఈ ఆలోచనలను మరియు మనోభావాలను ఇప్పుడు నేను ఎందుకు మనసులో పెట్టుకుంటున్నాను" అనే విషయాలను అనుభూతి చెందుతాను. మీరు వెనుకకు అడుగు వేసిన వెంటనే, మీ సొంత సామర్థ్యాన్ని తిరిగి కనుగొంటారు. మీ ఆత్మవిశ్వాసం మళ్ళీ స్వేచ్ఛగా ప్రవహిస్తుంది. దట్టమైన మేఘాలు కరిగిపోతాయి. మీరు ప్రశాంతతను మరియు స్పష్టతను తిరిగి పొందుతారు. మీరు ఈ పద్ధతిని తప్పకుండా మళ్ళీ మళ్ళీ చేయాలి. ఎందుకంటే మీ హృదయం యొక్క జీవనశైలి మరియు మీ సహజ స్వభావం గురించి, మీరు ఇప్పటికీ స్పష్టతను పొందలేదు కనుక. దీని వలన మీరు అధిక భయాన్ని అనుభవిస్తున్నారు.

ప్రస్తుతం మీరు మీ పాత నమ్మకాలను విడుదల చేస్తున్నారు. మీ తల్లిదండ్రులు చెప్పిన విషయాలపైన, మీ గురువులు బోధించిన విషయాలపైన, లేదా మీ అధికారులు మీకు నిర్దేశించిన నిబంధనల పైన, మీరు ఇప్పటి నుంచి పూర్తిగా ఏ మాత్రం ఆధారపడరు. మీరు మేధాశక్తిని లేదా సైన్స్ యొక్క ఫలితాలను గుడ్డిగా ఏ మాత్రం నమ్మరు. మీరు మీ మనోభావాలు చాలా వరకూ నిలకడలేకుండా ఉంటాయని మరియు వీటిని వాస్తవంతో పోల్చలేమని కూడా మీకు బాగా తెలుసు. ఈ నమ్మకాలన్నింటిని విడుదల చేయడం అనేది మీ సామర్థ్యాన్ని సూచిస్తుంది. మీరు ఇలా విడుదల చేసిన తర్వాత భయాలకు తిరిగి లోనుకావచ్చు మరియు మీరు

కష్టమైన సముద్రంలో ఈదుతున్నట్లు అనుభూతి చెందవచ్చు. నిజానికి ఈ పరిస్థితే అంతరంలోకి వెళ్ళమని మరియు ఆ లోతైన అంతరం నుంచి అంటే మీ ప్రత్యేకమైన పునాది నుంచి అనుభూతి చెందమని మిమ్మల్ని ఒత్తిడి చేస్తుంది: "నేను ఎవరు? ఈ ప్రపంచంలో నా స్థానం ఏమిటి? నేను బాహ్య ప్రపంచం ద్వారా కాకుండా, నా అంతర్ దిక్సూచి ద్వారా నడపబడాలి." ఈ దిక్సూచి ద్వారానే మీరు కొత్తభూమిలోకి ప్రవేశిస్తారు కనుక.

ప్రతీసారి మీ అంతర్ కేంద్రంతో బంధాన్ని ఏర్పరుచుకుంటూ మరియు ఒక అడుగు వెనుకకు వేసినట్లయితే, మీరు మీ ఆత్మలో సరికొత్త స్పష్టతను కనుగొంటారు. దీని ఫలితంగా, మీరు మీ మనోభావాలలో కూరుకుపోకుండా వాటిని సాక్షిగా చూడగలరు. మీరు మీ కోపాన్ని చూడగలరు మరియు దానికి మీ ప్రేమను అందించగలరు. మీరు మీ నిరాశను గమనించగలరు మరియు దానికి మీ అంతట మీరు సహాయాన్ని అందించగలరు. మీరు మీ భయాన్ని చూడగలరు మరియు దానికి విముక్తి యొక్క శక్తిని అందించగలరు.

**మీకు మీరే దైవం.**

మీకు బాహ్యంగా ఎటువంటి దైవం లేదు. వేలమంది దేవుళ్ళు మిమ్మల్ని చేరాలనుకుంటున్నారు. కాని మీరు మాత్రమే మీ హృదయం యొక్క ద్వారాన్ని తెరవగలరు మరియు దాని యొక్క కాంతిని అంగీకరించగలరు. నిజానికి మీరు రాబోతున్న కొత్తశకంలో చేయబోతున్నది ఏమిటంటే, మీరు మీ హృదయాలకు చేరుకోవడమే. మీరే నిజానికి భూమి మీద జీవిస్తున్నారు, మేము కేవలం మీకు సహాయం చేస్తున్నాం. మీరే కార్యాన్ని నిర్వర్తిస్తున్నారు మరియు మేము మీరు చేస్తున్న దానిపై లోతైన గౌరవాన్ని మాత్రం చూపించగలం. మా కాంతిని మరియు మా ప్రేమను మీకు పంచడానికి మేము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం.

మీరు ధైర్యవంతులు, మీరు సాహసవంతులు. మీరు కొత్తశకం యొక్క యోధులు. మిమ్మల్ని మరియు మీ లక్ష్యాన్ని నమ్మమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ప్రతీసారి మీరు తీవ్రమైన మనోభావాలు లేదా అజ్ఞానపు ఆలోచనల ద్వారా ప్రభావితం చెందినప్పుడు, కొన్ని క్షణాలు ప్రశాంతంగా కూర్చుని మీ అంతరాత్మతో అంటే మీ అంతర్ నిశ్శబ్ధం యొక్క కేంద్రంతో బంధాన్ని ఏర్పరుచుకోండి. కొత్తశకానికి మార్గదర్శకుడు అంతరాత్మయే. ఈ మార్గదర్శకుడిని మీరు ఎప్పుడో వదిలివేశారు. మీ హృదయంలో ప్రశాంతత ఎప్పటి నుంచో ఉంది. కేవలం మీరు చేయవలసినది

ఏమిటంటే, మీరు మళ్ళీ ఈ ప్రశాంతతను తిరిగి పొందాలి మరియు మరొకసారి ఆ ప్రశాంతత మరియు స్పష్టతలను తిరిగి పొందడంలో మీకు మీరే మార్గదర్శకంగా ఉండాలి.

నాటకంలోను మరియు గందరగోళాలలోను ఇరుక్కుని పోవద్దు. మనోభావ ఉద్రిక్తస్థితి అనేది 'నిజం' యొక్క స్నేహితుడు కాదు. కాని మీరు మీ హృదయం యొక్క నిశ్శబ్దం, ప్రశాంతత మరియు స్పష్టమైన పిలుపుపై ఆధారపడండి మరియు మీరు ఒంటరి వారు కాదనే ఎరుకలో ఉండండి. ఈ మార్గంలో మీరు వేసే ప్రతీ అడుగులోనూ మేము మీ ప్రక్కన ఉంటాము. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా ప్రేమ శక్తులను అంగీకరించమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఈ చారిత్రాత్మకమైన క్షణంలో మీకు సేవ చేయాలనేది మరియు కాంతిని విస్తరించే మార్గంలో మీకు కొన్నిసార్లు సహకారాన్ని అందించాలనేది నా హృదయపూర్వకమైన కోరిక.

నా ప్రేమను అంగీకరించండి.

* * * *

# కొత్తశకంలోని బాంధవ్యాలు

డియర్ ఫ్రెండ్స్, ఈ రోజు నేను మీతో మరింత ఆనందంగాను మరియు సంతోషంగాను ఉన్నాను. నా శక్తి మీ మధ్య ప్రవహిస్తోంది మరియు మీరు దీనిని అనుభూతి చెందగలరు. ఇది సాంప్రదాయపరమైన రీతిలో జరుగుతున్న చర్చ కాదు. నేను ఒక ప్రత్యేకమైన శక్తిని (సమాచారంతో పాటు అదనంగా) అందజేస్తున్నాను. నేను, పమెలా మరియు గెరిట్‌లాగా మీరు కూడా దీనిలో భాగస్వాములే. ఇక్కడ మనందరి కలయికతో మనం ఈ గదిలో ఒక శక్తిక్షేత్రాన్ని సృష్టిస్తూ, దానిని భూమి మీద విస్తరింపజేస్తున్నాం. అందువలన ఇది చాలా పవిత్రమైన స్థలం. ఏ స్థలంలో అయితే మనుష్యులు – మానవశరీరంలో ఏంజెల్స్‌గా – భూమి మీద వారి యొక్క కాంతిబీజాన్ని మొలకెత్తించాలనే కోరికతో దగ్గరవుతూ కలుస్తుంటారో, ఆ ప్రదేశం పవిత్రమైన స్థలంగా మారుతుంది.

నేను క్లుప్తంగా ఛానెలింగ్ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఇది ప్రస్తుతం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది. మీ అందరికి 'ప్రాణ' గురించి తెలుసు. ఇది యోగాలో మరియు తూర్పు దేశాల వేదాంతాలలో కనిపిస్తుంది. 'ప్రాణ' అనేది ఒక ఆధ్యాత్మిక శక్తి. మీరు తీసుకునే ప్రతీ శ్వాసతో పాటు ఈ శక్తిని కూడా తీసుకుంటారు. నిజానికి విషయమేమిటంటే, మీరు శ్వాసించినప్పుడు కేవలం ఆక్సిజన్‌నే కాకుండా జీవశక్తిని, విశ్వశక్తిని కూడా లోపలకి గ్రహిస్తారు, ఇది మీకు భౌతికాన్ని అధిగమించి జీవించ గల సామర్ధ్యాన్ని అందజేస్తుంది. ఇప్పుడు నేను చెప్పాలనుకుంటున్న విషయమేమిటంటే: ప్రతీ వ్యక్తి శ్వాసించినప్పుడు ఆక్సిజన్‌తో పాటు 'ప్రాణ'ను కూడా పీలుస్తారు, అంటే స్త్రీ లేదా పురుషుడు వారి సొంత మార్గంలో నిరంతరం ఛానెలింగ్ చేస్తున్నారని అర్ధం. ఛానెలింగ్ అనేది కొంతమంది కోసమే కేటాయించబడిన ప్రత్యేకమైన బహుమతి కాదు. ఛానెలింగ్ అనేది ప్రపంచంలో ఉన్న అతి సహజమైన విషయం. మీరు విశ్వశక్తి లేకుండా జీవించలేరనే విషయం మీకు తెలుసు. మీరు విశ్వశక్తిని లోపలకి గ్రహించకుండా బ్రతకలేరు, జీవించలేరు మరియు ఎదగలేరు. మీరు కేవలం ఆక్సిజన్‌తోనే జీవించడం లేదు. మీరు విశ్వశక్తితో బంధం లేకుండా, అంటే మీ ఇంటితో ప్రాథమికమైన పద్ధతిలో కొద్దిపాటి బంధానైనా కలిగి లేకుండా ఉండలేరు. భూమి మరియు విశ్వతలాలు, ఆక్సిజన్ మరియు ప్రాణ అనేవి రెండూ కూడా మిమ్మల్ని మీరు భూ వాస్తవంలో ఒక సంపూర్ణమైన మనిషిగా వ్యక్తీకరించుకోవడానికి చాలా అవసరం.

నేను మిమ్మల్ని ముందు ఛానెలింగ్‌లో మార్గదర్శకులుగా పిలిచాను, భూమి మీద మరింత కాంతి ప్రసరింపబడడానికి మార్గాన్ని ఏర్పరచిన వారిలో మీరు కూడా ఒకరు. మీరు విశ్వానికి మరియు భూతలానికి మధ్య 'మధ్యవర్తిత్వాన్ని' వహిస్తూ వారధిని కూడా నిర్మిస్తున్నారు. మీరు భూమి మీదకి విశ్వశక్తిని ప్రసరింపజేస్తున్నారు. మీరు నిజానికి చేస్తున్నది ఇదే. దీనిని మీరు ఆనందాన్ని, ఆశయాన్ని మరియు ఆరోగ్యాన్ని అనుభూతి చెందడం కోసం చేయాల్సిన అవసరం ఉంది. మీరు ఎప్పుడైతే మీ ఇంగితజ్ఞానాన్ని ఉపయోగిస్తారో, మీ అంతరంలోకి లోతుగా వెళుతూ, మీ పరిస్థితులు ఎలా ఉన్నాయో అనుభూతి చెందుతారో మరియు వాటిని మీకు ఇష్టమైన రీతిలో మార్చాలని అనుకుంటారో, అప్పుడు మీరు ఛానెలింగ్ చేస్తున్నట్లే. ఈ క్షణాలలో మీరు మీ ప్రజ్ఞాత్మతోనూ మరియు ఇతర తలాల యొక్క మేధాసంపత్తితోనూ బంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఇది భూమి మీద మీ లక్ష్యాలను చేరడంలో సహాయాన్ని అందిస్తుంది. మీరందరూ ఏదో ఒక మార్గంలో, సమయం మరియు తలాలకు అతీతంగా ఉన్న మీ ప్రజ్ఞాత్మతో, మీకు మీరుగా తిరిగి సంబంధాన్ని ఏర్పరుచుకోవడానికి ఛానెలింగ్ చేస్తారు.

మనం ఈ రోజు మన శక్తులను పంచుకుంటూ, కొత్తశకంలో భూమి మీదకి రావడానికి మార్గాన్ని కనుగొంటున్న విశ్వశక్తిని ఛానెలింగ్ చేద్దాం. కొత్తశకం ఇక ఏ మాత్రం భవిష్యత్తు యొక్క దృశ్యంగా ఉండదు. ఇది తనకు తానుగా, ఇప్పటికే చాలా మంది యొక్క నిత్యజీవితాలలో వ్యక్తీకరించబడుతోంది. మీరు పేపర్ లేదా వార్తలను చూసినట్లయితే, మీకు ఇంకా ఆ సమయం వచ్చినట్టుగా అనిపించకపోవచ్చు. కాని నిజానికి కొత్తశకం తీసుకువస్తున్న జాగురుకత వ్యక్తిగతస్థాయిలలో ఆరంభమవుతుంది. ఇది ప్రభుత్వాలు, వ్యవస్థలు మరియు సంస్థలలో గాని ఏర్పడడం లేదు. ఇది మీ నిత్యజీవితంలో కొత్తశక్తి యొక్క ప్రవాహంలా తనకుతానుగా ఉంటోంది. మీ హృదయం యొక్క ప్రవాహం, తన తేలికతనం మరియు జ్ఞానానికి అనుగుణంగా మిమ్మల్ని నటించమని మరియు జీవించమని ఆహ్వానిస్తోంది. సాధారణమైన మనష్యులు, వారి హృదయాల యొక్క గుసగుసల మీద శ్రద్ధను చూపడం ద్వారా కొత్తశకం జన్మ తీసుకుంటుంది. ఆధ్యాత్మికపరంగా మార్పు యొక్క పునాది ఎల్లప్పుడూ వ్యక్తిగతస్థాయి మీదే ఆధారపడుతుంది. మీ హృదయాలలో మేల్కొన్న ఈ శక్తి, క్రమక్రమంగా అహంభావపూరిత చైతన్యం యొక్క పాత పద్ధతులను ఇంకా పట్టుకుని వ్రేలాడుతున్న సంస్థలు మరియు వ్యవస్థల ద్వారా పయనిస్తూ పరివర్తనాన్ని తీసుకువస్తుంది. అధికారం యొక్క పాత పద్ధతులు, హింస ద్వారా కాకుండా ఆత్మ యొక్క సుతిమెత్తని శక్తి ద్వారా సులభంగా ఛేధింపబడతాయి. హృదయం

ప్రధానపాత్ర పోషించినట్లయితే, పాతదనం ఏ మాత్రం అధికారం మరియు దౌర్జన్యాల యొక్క ఒత్తిడులకు లోనవ్వకుండా, కేవలం ప్రేమ యొక్క ఒత్తిడి ద్వారా పతనమవుతుంది.

ఈ కొత్తశకంలో బాంధవ్యాలు అతి పెద్ద పరిమాణంలో పరివర్తనం చెందబోతున్నాయి. బాంధవ్యాలు మీలోని లోతైన మనోభావాలకు మూలాలుగా ఉంటూ, ఇవి గొప్ప ఆనందం నుంచి లోతైన బాధ వరకూ అనుభవాన్ని పొందుతాయి. బాంధవ్యాలలో, మీరు అంతర్ బాధ యొక్క ఎరుకను పొందవచ్చు. ఇది ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న బంధం కన్నా చాలా పురాతనమైనది, మీ మానవ ఉనికి కన్నా కూడా చాలా ప్రాచీనమైనది.

ఈ యుగంలో మీరు బాంధవ్యాల యొక్క క్షేత్రంలో లోతైన హీలింగ్‌ను సాధించడం కోసమే మీరు ఇక్కడకు ఆహ్వానింపబడినారు. దీని వలనే మీరు తరచూ సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు తనకుతానుగా ఉంటున్న కొత్తశక్తి యొక్క ఉనికి ద్వారా, మీ బాంధవ్యాల యొక్క క్లిష్టమైన పరిస్థితులను మంచిగా పరివర్తనం చెందించడం మీకు సాధ్యమవుతుంది. మీకు మరియు ఇతరులకు మధ్య శక్తి ప్రవాహం సమంగా ప్రవహించడం కూడా సాధ్యమవుతుంది. హీలింగ్ మరియు వ్యక్తిగత-పరివర్తనాలకు మరొక అర్ధం ఏమిటంటే మిమ్మల్ని మీరు సరిగ్గా వ్యక్తపరుచుకోవడానికి అవకాశం ఇవ్వని బాంధవ్యాలను వదిలివేయడం అని కూడా. దీని అర్ధం మీరు ఎవరినైనా చాలా ఇష్టంగా ప్రేమించినా కూడా, వారికి వీడ్కోలు చెప్పాల్సిన పరిస్థితి రావచ్చు. ఎందుకంటే మీ అంతర్ మార్గం మిమ్మల్ని ఒక సరికొత్త ప్రదేశానికి తీసుకువెళ్తోంది కాబట్టి. ఇది కొనసాగింపుకు లేదా విడిపోవడానికి దారి తీసినప్పటికీ, మీరందరూ వ్యక్తిగత బంధాల యొక్క విషయంలో లోతైన సమస్యలను ఎదుర్కొనడానికి సాహసిస్తున్నారు. హృదయం యొక్క పిలుపు, హృదయం ఆధారిత శక్తి అనేది కొత్తశకాన్ని సూచిస్తోంది మరియు ఇది మీ నిత్యజీవితంలోనికి ప్రవేశించింది. మీరు దీనిని ఏ మాత్రం వదిలివేయలేరు.

ఈ బాంధవ్యాలు మిమ్మల్ని తీవ్రంగా ఎందుకు బాధిస్తున్నాయి మరియు మీ జీవితాన్ని పూర్తి తలక్రిందులుగా ఎందుకు చేస్తున్నాయి అనే విషయాలను వివరించడానికి ముందు, మీరు మీ ఆత్మలో మోస్తున్న ప్రాచీనకాలం నాటి బాధ గురించి నేను మీకు చెప్పాలని అనుకుంటున్నాను. ఈ బాధ చాలా పురాతనమైనది, ఈ జీవితకాలం కన్నా కూడా చాలా పాతది, భూమి మీద మీరు జీవించిన గతజన్మలన్నింటి కంటే కూడా చాలా ప్రాచీనమైనది. మీరు ఒక ఆత్మగా పుట్టినప్పుడు,

మీలో ఏర్పడిన అసలైన జన్మబాధ దగ్గరకు మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను.

ఒకానొకప్పుడు అంతా సంపూర్ణంగాను మరియు ఏ విభజనలు లేకుండాను ఉండేది. మీరు దీనిని ఊహించగలరా? ఒక్కక్షణం మీ ఊహాశక్తిని స్వేచ్ఛగా పయనించడానికి అనుమతివ్వండి. ఒక్కసారి ఊహించుకోండి: మీరు శరీరంలో లేరు, మీరు ఒక స్వచ్ఛమైన చైతన్యం, మీరు అతిపెద్ద శక్తి క్షేత్రంలో భాగంగా ఉన్నారు మరియు ఈ శక్తి మిమ్మల్ని సౌకర్యవంతమైన రీతిలో మీ చుట్టూ అల్లుకుని ఉంది. మీరు ఈ ఐకమత్యంలో భాగంగా ఉండడాన్ని మరియు మీరు ఏ విధమైన షరతులు లేకుండా పోషింపబడడాన్ని అనుభూతి చెందండి. అత్యధిక సౌకర్యవంతమైన కవచంగా, ఒక సమృద్ధికరమైన ప్రేమశక్తిగా ఈ శక్తిక్షేత్రం మిమ్మల్ని చుట్టుముట్టడాన్ని అనుభూతి చెందండి. మీరు ఎవరనేది తెలియజేసే మీ సహజ జన్మహక్కును ఏ మాత్రం సందేహించకుండా, మిమ్మల్ని మీరు స్వేచ్ఛగా అన్వేషించుకోవడానికి మరియు మీరు అభివృద్ధి చెందడానికి ఇది మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇక్కడ ఏ విధమైన ఆందోళనగాని, భయంగాని లేదు.

ఈ సౌకర్యం మరియు భద్రత యొక్క భావనలనేవి మీరు ఒక ఆత్మగా జన్మించే ముందు ఉన్న స్థితులు. మీరు వీటి నుంచే ఒక ప్రత్యేకమైన ఆత్మగా ఆవిర్భవించారు. ఇది ఒక విశ్వగర్భం. దీనిని మీ ప్రస్తుత స్థితి నుంచి చాలా వరకూ తొలగించనప్పటికి కూడా, ఈ సంపూర్ణత్వం మరియు ఏకత్వం యొక్క భావనలను, అంటే ప్రేమ మరియు కరుణ యొక్క కవచంలో మీరు అనుభవించిన సంపూర్ణమైన భద్రత యొక్క అనుభూతిని, మీ హృదయం ఇప్పటికి అలాగే తీవ్రంగా కాంక్షిస్తోంది. మీరు ఈ ఏకత్వం యొక్క భావనను దైవంగా గుర్తుంచుకున్నారు. మీరు దైవాన్ని స్థాపించి దానిని ఈ ప్రేమ యొక్క భావనతో కలిపారు.

ఈ దివ్యత్వపు చైతన్యం లేదా ప్రేమ యొక్క కవచంలో, ఒకానొక స్థితి దగ్గర కొత్తపరిస్థితి ఏర్పడాలని నిర్ణయించబడింది. దీనిని మానవ భాషలో చెప్పాలంటే చాలా కష్టం. మీరు దేవుడిలో లేదా ఈ ఐకమత్యపు ఎరుకలో, ఐకమత్యం కన్నా పూర్తి భిన్నమైన మరొక వాంఛ ఉండేదనే విషయాన్ని ఊహించండి. దీనినే అనుభవం యొక్క కోరికగా చెప్పవచ్చు. మీరు స్వచ్ఛమైన వ్యక్తిత్వం యొక్క పూర్ణత్వంలో పూర్తిగా లీనమై ఉన్నప్పుడు, మీరు పరిస్థితులను అనుభవించలేరు – మీరు కేవలం ఆ స్థితిలో ఉంటారు అంతే. ఈ విధమైన స్థితిలో గొప్ప ఆనందం మరియు పూర్తి భద్రత ఉన్నప్పటికీ, మీలో ఒక భాగం పరిణామం చెందాలని మరియు అన్వేషించాలని

కోరుకునేది. ఈ భాగం దైవానికి మరియు విశ్వసంబంధిత ఎరుకకు సంబంధించినది. ఈ భాగం "దానంతట అదే విడిపోయింది."

మీరు ఈ దైవం యొక్క భాగమే. ఒకానొక ప్రత్యేకమైన స్థితిలో, మీ చైతన్యం ఏకత్వం నుంచి విడిపోవడానికి సంబంధించిన ప్రయోగానికి మరియు 'నేను'గా రూపొందడానికి అంగీకరించింది. 'నేను' అనేది తనకుతానుగా ఒక ప్రత్యేక సొంత లక్షణం గల రూపం, ఇది నిర్వచింపబడిన ఒక ప్రత్యేకమైన ఎరుక. ఇది అతిపెద్ద మలుపు. మీ వ్యక్తిత్వం యొక్క లోతుల్లోంచి దీనిని ఒక మంచి విషయంగా భావించారు. మీరు సృజనాత్మకత మరియు కొనసాగింపు యొక్క వాంఛను ఒక మంచి విషయంగాను మరియు విలువైన ఆకాంక్షగాను భావించారు. నిజానికి మీరు ఏకత్వం యొక్క క్షేత్రం నుంచి విడిపోయినప్పుడు మీలో బాధ ఏర్పడింది. మొదటిసారిగా మీ జ్ఞాపకాలలోనూ, మొదటిసారిగా మీ జీవితంలోనూ లోతైన బాధ ఏర్పడింది. మీకు పూర్తి ఎరుక ఉన్న ప్రేమ మరియు భద్రతల యొక్క తలం నుంచి విడివడినారు. నేను దీనినే జన్మబాధగా ప్రస్తావించాను. మొదటిసారిగా తీవ్రమైన ఒంటరితనం యొక్క అనుభవంలో ఉన్నా కూడా, మీ అంతరాత్మ మీకు ఇదంతా సరైనదేనని, ఇది మీ సొంత ఎంపిక అని మీకు చెప్పింది. కాని, ఈ బాధ చాలా లోతైనది. దీని వలన మీ యొక్క బాహ్య పొరలలో మీరు అలజడులకు మరియు గందరగోళానికి గురయ్యారు. మీరు అంతరంగా ఉన్న లోతైన జ్ఞానంతోనూ, మీరే దైవమని తెలియజేసే అంతర్ స్థాయితోనూ మరియు అంతా సక్రమంగా ఉంది అని మీకు తెలియజేసే స్థితితోనూ తిరిగి బంధాన్ని ఏర్పరుచుకోవడం చాలా కష్టతరమయ్యింది.

ఆ సమయంలో తీవ్రంగా హింసకు గురైన భాగం ఉద్భవించింది, దీనినే నేను అంతర్‌శిశువుగా పిలుస్తాను. మీ ఆత్మ, మీ ప్రత్యేక వ్యక్తిత్వం, తన అంతరంలో ఒకవైపు స్వచ్ఛమైన దివ్యత్వపు జ్ఞానం యొక్క భాగాన్ని మరియు మరొకవైపు గాయపడిన విశ్వసంబంధిత శిశువు యొక్క భాగాన్ని మోస్తోంది. దైవం మరియు శిశువు, జ్ఞానం మరియు అనుభవం యొక్క కలయిక సుదీర్ఘ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. మీరు ఒక ప్రత్యేకమైన ఆత్మగా ఆరంభమయ్యారు. మీరు "నేను"గా నిర్వచింపబడిన ఒక ప్రత్యేక లక్షణంగా ఉండడం అనేది ఎలా ఉంటుందో పరిశోధించడానికి మరియు దాని అనుభవాన్ని పొందడానికి సిద్ధమయ్యారు.

దైవం, తన దివ్యత్వంలోని ఒక భాగాన్ని ఆత్మలోకి బదిలీ చేసింది. ఆత్మకు తన దివ్యత్వపు మూలాలను తిరిగి కనుగొనడానికి అనుభవం అవసరం. ఆత్మ నిజానికి తను ఎవరనేది, అంటే తనే దైవమనే విషయాన్ని  అనుభూతి చెందాలి. దీని అర్థం

ఆత్మ జీవించి ఉంటూ అనుభవాన్ని, అన్వేషణను, వ్యక్తిగత వినాశనాన్ని మరియు పున:సృష్టిని అనుభూతి చెందాల్సిన అవసరం ఉంది. ఏకత్వంతో సంపూర్ణంగా ఉండడం అనే స్పష్టతను విచ్ఛిన్నం చేసింది. ఈ స్పష్టతను అనుభవం ద్వారానే తిరిగి పొందాలి. ఈ విషయం సృజనాత్మకత యొక్క గొప్ప నైపుణ్యంగా ఉండేది. 'నేను-చైతన్యం' యొక్క జననం అనేది ఒక అద్భుతం! ఇది ముందెన్నడూ సంభవించలేదు.

ఏకత్వం మరియు లోతైన ఐకమత్యం యొక్క అనుభవాన్ని తిరిగి పొందడానికి, తరచూ మీరు మీ "నేను-తత్వం" యొక్క పరిమితులను అధిగమించాలని ప్రయత్నిస్తారు. దీనినే మీరు, మీ ఆధ్యాత్మిక దీర్ఘకాలన్వేషణ యొక్క గొప్ప ఆశయంగా చెప్పవచ్చు. కాని, ఒక్క క్షణం దీనిని దైవం యొక్క స్థితిలో ఉండి, ఈ నేను-తత్వాన్ని మరియు వేర్పాటును అద్భుతం యొక్క రూపంగా పరిగణించండి! ఒకటిగా ఉండడం అనే స్థితి సాధారణమైన విషయం, "ఇది ఎల్లప్పుడూ అలాగే ఉంది". ఒక ప్రత్యేకమైన ఆత్మగా ఉండడమనే అద్భుతంలో – ఒక గొప్ప అందం, ఆనందం మరియు సృజనాత్మకశక్తి ఇమిడి ఉన్నాయి. మీరు దీనిని అనుభూతి చెందకపోవడానికి గల కారణం ఏమిటంటే, మీరు ఒక ఆత్మగా మీ జన్మబాధతో ఇంకా పోరాడుతున్నారు కాబట్టి. మీ ఆరంభానికి సంబంధించిన తీవ్రమైన బాధ మరియు ద్రోహం యొక్క అరుపులు మీ లోతైన అంతరంలో ఏదో ఒక మూల ఇంకా ప్రతిధ్వనిస్తున్నాయి: ఇవి మీ తల్లి/తండ్రి నుంచి, ప్రేమ మరియు భద్రత యొక్క అనంతమైన శక్తి నుంచి విడిదీయబడినప్పటి జ్ఞాపకాలు.

కాలం మరియు అనుభవాల ద్వారా మీరు పయనించిన ప్రయాణంలో, మీరు చాలా పరిస్థితులను అనుభూతి చెందారు. మీరు వివిధ రకాల రూపాలను ధరించారు. మానవ శరీరాలలోనే కాకుండా చాలా రూపాలలో జన్మలను తీసుకున్నారు. కాని ప్రస్తుతం ఇది ఇక్కడ సంబంధం లేని విషయం. ఈ సందర్భంలో నేను చెప్పాలనుకున్న విషయమేమిటంటే, ఈ సుదీర్ఘచరిత్రలో మీకు రెండు ప్రత్యేకమైన ఆశయాల ద్వారా నడుపబడ్డారు. ఒకవైపు అన్వేషణ, సృష్టి మరియు కొనసాగింపు యొక్క ఆసక్తితోనూ, మరొకవైపు ఇంటి బెంగ, స్వర్గం నుంచి విడదీయబడిన భావన మరియు తీవ్రమైన ఒంటరితనం యొక్క అనుభూతితోనూ ఉండేవారు.

మీలోని సాహసోపేతమైన మరియు అభివృద్ధిని కాంక్షించే భాగానికి సంబంధించిన శక్తి, మిమ్మల్ని విశ్వగర్భం నుంచి బయటకు వచ్చేలా చేసింది. దీని వలన మీరు చాలా విషయాలను సృష్టించారు మరియు వాటి యొక్క అనుభవాన్ని పొందారు. కాని మీ అంతరంలో మోస్తున్న జన్మబాధ మరియు ఇంటి బెంగ వలన,

మీరు చాలా గాయాలతోనూ మరియు వాస్తవాన్ని తెలిపి భ్రమలను పోగొట్టే ఆధారాలతోనూ కూడా వ్యవహరించాల్సి వచ్చింది. మీ సొంత సృష్టిలలో ఎల్లప్పుడూ కరుణను కలిగి ఉండేవారు కాదు. కాలం మరియు తలాల ద్వారా మీరు పయనించిన ప్రయాణాలలో, మీరు చాలా పనులను చేశారు మరియు ఆ తర్వాత మీరు వాటి గురించి బాధపడ్డారు – వీటినే మీరు 'చెడు'గా పిలువవచ్చు. మా అవగాహన ప్రకారం, ఈ పనులన్నీ కూడా కేవలం అనుభవాన్ని పొందాలనే పట్టుదల మరియు తెలియని ప్రదేశాలను తెలుసుకోవాలనే తపనకు సంబంధించిన ఫలితాలే. మీరు ప్రత్యేకంగా రూపొందాలని నిర్ణయించుకున్న వెంటనే, మీరు ఏకత్వం యొక్క స్పష్టత నుంచి విడివడినారు. మీరు ఈ స్థితిలో కేవలం వెలుగు యొక్క అనుభవాన్ని మాత్రమే పొందరు. మీరు ప్రతీ విషయంలోనూ సరికొత్తదనాన్ని కనుగొనాలి. కాబట్టి మీరు చీకటిని కూడా అనుభవించాలి. మీరు అక్కడ ఉన్న అన్ని అంచుల యొక్క అనుభవాన్ని పొందాలి.

మీ ప్రస్తుత పరిణామక్రమ స్థితిలో, మీ "నేను–తత్వాన్ని" హత్తుకునే సామర్థ్యం మీదే ప్రతీది ఆధారపడి ఉందనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకుంటారు. ఇదంతా నిజానికి మీ సొంత దివ్యత్వాన్ని అంగీకరించడం మరియు ఆ వ్యక్తిగత–ఎరుక నుంచి ఆనందాన్ని మరియు సమృద్ధిని అనుభవించడం గురించే. మీరు విశ్వగర్భం నుంచి జన్మించినప్పుడు, మిమ్మల్ని ఏకాకితనం మరియు బాధ చుట్టిముట్టినప్పుడు, మిమ్మల్ని మీరు స్వల్పంగాను మరియు మీకు గుర్తింపు లేనట్టుగాను అనుభూతి చెందడం మొదలుపెట్టారు. మీరు ఆ క్షణం నుంచే మిమ్మల్ని కాపాడగలిగే శక్తి ఏదైనా ఉందా అని బాహ్యంగా వెతకడం మొదలుపెట్టారు – బాహ్యంగా అంటే దైవం, తల్లిదండ్రులు, నాయకుడు, భాగస్వామి మరియు పిల్లలు మొదలైనవారు. మీరు ఇప్పుడు అనుభవాన్ని పొందుతున్న ఈ మేల్కొల్పు ప్రక్రియలో భాగంగా, మీరు కోరుకుంటున్న అసలైన భద్రత అనేది మీకు బాహ్యంగా దొరకదనే విషయాన్ని తెలుసుకుంటారు. అయినప్పటికీ ఈ వాంఛ లేదా ఇంటిబెంగ, ఏదో ఒక ముఖ్యమైన బంధాన్ని చాలా శక్తివంతంగా ప్రభావితం చేయవచ్చు. కాని మీరు అక్కడ కూడా ఈ అసలైన భద్రతను కనుగొనలేరు. ఆఖరికి మీకు దైవంతో ఉన్న సంబంధంలో కూడా కనుగొనలేరు.

మీరు నమ్ముతున్న దైవం, మీకు సంప్రదాయాల ద్వారా తరతరాలుగా అందజేయబడిన మరియు మీ భావనను అధికంగా ప్రభావితం చేస్తున్న దైవం, మీకు బాహ్యంగానే ఉంది. ఈ దైవం మీ కోసం పరిస్థితులను ఏర్పరుస్తాడని మరియు మీ కోసం మార్గాన్ని వేస్తాడని మీరు భావిస్తున్నారు. కాని అటువంటి దైవం లేదు.

'మీరే' దైవం, మీరే దైవం యొక్క సృజనాత్మక భాగం, ఈ దైవం తన సొంత మార్గంలో వెళ్ళాలని మరియు తనంతట తాను పూర్తి ప్రత్యేకమైన మార్గంలో పరిస్థితుల యొక్క అనుభవాన్ని పొందాలని నిశ్చయించుకున్నాడు. మీ అంతట మీరుగా జన్మ యొక్క ప్రాధమిక గాయాన్ని నయం చేసుకోగల సామర్థ్యం ఉందనే నమ్మకాన్ని కలిగి ఉండేవారు. అన్వేషణ మరియు కొనసాగింపుల యొక్క విస్తరణ శక్తిని పురుషశక్తిగాను, ఏకీకరణ శక్తిని మరియు ఇంటి శక్తిని కలిపే దానిని స్త్రీశక్తిగాను మీరు చెప్పవచ్చు. ఈ రెండు శక్తులు మీరు ఎవరనే దాని యొక్క సారాంశానికి సంబంధించినవి. ఒక ఆత్మగా, మీరు కేవలం స్త్రీ లేదా పురుషుడు మాత్రమే కాదు. ముఖ్యంగా మీరు రెండూ, స్త్రీ మరియు పురుషుడు కూడా. మీరు మీ ప్రయాణాన్ని ఈ రెండింటి గుణాలతో మొదలుపెట్టారు. ఇప్పుడు ఈ రెండింటి శక్తుల సమన్వయంతో పనిచేసే సమయం వచ్చింది, అంటే నిజానికి మీలో సంపూర్ణత్వం యొక్క అనుభవాన్ని పొందే సమయం వచ్చింది. ఈ విధంగా మీ సొంత గొప్పతనాన్ని మీరు చాలా కాలం తిరస్కరించిన తర్వాత, ఆఖరికి వేరే ఎంపిక లేదనే విషయాన్ని తెలుసుకుని, దైవంగా ఉండడమే మీ అసలైన వాంఛ అని గుర్తించడం మొదలుపెడతారు.

మీరు కాంక్షిస్తున్నది: మీకు మీరే దైవమని తెలుసుకోవాలని. ఇదే మీరు తుదికి చేరవలసిన స్థితి. మిమ్మల్ని మీ సొంత హృదయశక్తిలోకి, మీ హృదయ సంపూర్ణత్వంలోకి తీసుకువెళ్ళగలిగే శక్తి మీకు బాహ్యంగా ఏదీ లేదు. మీరే అది, మీరు ఒక్కరే మరియు మీరే అది చేయగల సమర్థులు! మీరు ఎల్లప్పుడూ మీ కోసమే ఎదురుచూస్తున్నారు.

ఈ వ్యక్తిగత ఎరుక యొక్క దీపాన్ని అంతరంలో వెలిగించినట్లయితే, అది మీకు ఆనందాన్ని, ఇంటి రాక యొక్క లోతైన భావనను అందిస్తూ, మీ మొత్తం బంధాలన్నీ ఒక కొత్త రీతిలో ఉండేలా చేస్తుంది. ఉదాహరణకి ఇతరులు మీకు చెబుతున్న విషయాలను తక్కువగా పట్టించుకుంటున్న అనుభూతిని పొందుతారు. మిమ్మల్ని ఎవరైనా అవమానపరిచినా లేదా నిరాశపరిచినా, దానిని మీరు వెంటనే వ్యక్తిగతంగా తీసుకోరు. మీరు దానికి తక్కువగా ప్రభావితం చెందుతారు, లేదా దాని పట్ల ప్రతిస్పందించడానికి ఆసక్తిని చూపరు. మీరు వాటిని సులభంగా వదిలివేస్తారు మరియు మీ నుంచి మరియు ఇతరుల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవాల్సిన అవసరాన్ని వదిలివేస్తారు. ఇతరులు మీ గురించి అనుకుంటున్న దానికి మీరు మనోభావపరంగా ప్రభావితం చెందినట్లయితే, అది అంతరంగా మిమ్మల్ని మీరు అగౌరవపరుచుకున్నట్లు మరియు ఇతరుల యొక్క చెడు అభిప్రాయాలకు విలువను

ఇస్తున్నట్లు సూచిస్తుంది. మీరు ఈ చులకన భావన గురించి ఇతరులతో ఘర్షణపడడం ద్వారా ఇది పరిష్కరించబడదు. కేవలం మీ అంతరంలోకి పయనించడం ద్వారా మరియు మీలోని మనోభావసంబంధిత గాయాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా మాత్రమే పరిష్కరించగలరు. ఇవన్నీ ఈ ప్రస్తుత తిరస్కరణ కన్నా కూడా చాలా పురాతనమైనవి.

నిజానికి తిరస్కరణ యొక్క బాధలు మరియు బంధాల యొక్క గాయాలు, అన్నీ కూడా మీ నయంకాని అసలైన జన్మబాధ దగ్గరకు తిరిగి తీసుకువెళ్తాయి. బంధాల యొక్క క్లిష్టమైన పరిస్థితులకు కారణం మీ కళ్ళ ముందే ఉన్నప్పుడు, ఇంత లోతుగా ఆలోచించడం అవసరమా అని మీకు అనిపించవచ్చు. మీ బాధకు గల కారణం మీ భాగస్వామి చేసిన లేదా చేయని పని వలన ఏర్పడినదిగా మీకు అనిపించవచ్చు. బాహ్యంగా ఉన్న విషయాల ద్వారా మీకు బాధ కలిగినట్లు అనిపించవచ్చు. అందువలన మీ సమస్యకు గల పరిష్కారం ఇతరుల యొక్క ప్రవర్తనలో ఉందని భావిస్తారు. కాని నన్ను మీకు చెప్పనివ్వండి: మొదటిగా మీరు మీ అంతరంలో ఉన్న అతి ప్రాచీనమైన బాధను నయం చేసుకోవడం మీదే ముఖ్యంగా పని చేస్తున్నారు. మీకు దీని పట్ల ఎరుక లేకపోయినట్లయితే, మీరు బంధాలకు సంబంధించిన పరిస్థితులకు సులభంగా ప్రభావితమవుతూ తీవ్రమైన బాధకు గురికావచ్చు.

ముఖ్యంగా స్త్రీ/పురుషుల సంబంధాలలో(ప్రేమ సంబంధాలలో), మీరు అస్పష్టంగా గుర్తు పెట్టుకున్న మరియు సృష్టి ప్రారంభదశకు సంబంధించిన ఏకత్వపుస్థితిలోని ఐకమత్యం మరియు భద్రతలను, తరచూ మీరు ఈ బంధాలలో ప్రతిబింబింప చేయాలని ప్రయత్నిస్తారు. అపరిమితమైన ప్రేమ మరియు అంగీకారం యొక్క కవచంతో చుట్టబడి ఉన్న అనుభూతిని, మీరు తిరిగి సృష్టించాలని అచేతనావస్థలో ప్రయత్నిస్తున్నారు. మీ అంతరంలో ఒక శిశువు ఉంది, ఇది షరతులు లేని స్వీకరణ కోసం రోదిస్తున్నది. మీ అంతరంలోని శిశువు, మీ భాగస్వామిలో ఉన్న శిశువుని హత్తుకున్నట్లయితే, ఇది ఎల్లప్పుడూ మీకు ఊపిరాడకుండా చేస్తూ, మీ భాగస్వాములిద్దరిలో ఉన్న అసలైన వ్యక్తిగత భావప్రకటనను స్వేచ్ఛగా వ్యక్తపరచనివ్వకుండా ఆటంకపరుస్తుంది.

ఇక్కడ ఏం సంభవిస్తున్నదంటే, మీరు మనోభావపరంగా ఆధారపడేట్టు చేస్తుంది. ఆ తర్వాత మీరు మీ బాగు కోసం వేరేవారి యొక్క ప్రేమ లేదా ఆమోదం కావాలని కోరుకుంటారు. ఆధారపడడం అనేది ఎల్లప్పుడూ అధికారం మరియు అదుపులకు సంబంధించిన విషయంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఇంకొకరిని కావాలనుకోవడం

అనేది  ఆమె లేదా అతని యొక్క ప్రవర్తనను అదుపు చేయాలని కోరుకోవడం లాంటిదే కనుక. ఇది వినాశనకరపు బంధం యొక్క ఆరంభం. మీరు ఒకానొక బంధంలో స్వతంత్రతను కోల్పోవడం మరియు సంపూర్ణ ఐకమత్యం కోసం అచేతనావస్థపు వాంఛ ద్వారా నడుపబడడం అనేది మిమ్మల్ని మరియు అదే విధంగా వేరేవారిని నాశనం చేయడమే అవుతుంది.

ఇద్దరి మనుష్యుల మధ్య ఉండే "నిజమైన ప్రేమ" అనేది ఒకరి నుంచి ఒకరు పూర్తి స్వతంత్రంగా ఉండడాన్ని స్పష్టంగా వారి శక్తి క్షేత్రాలలో చూపిస్తుంది. ప్రతీ శక్తిక్షేత్రం తనకు తానుగా సంపూర్ణంగా ఉంటుంది మరియు దీని ఆధారంగానే ఇతరులతో బంధాన్ని కలిగి ఉంటుంది. భాగస్వాములు ఒకరిపై ఒకరు ఆధారపడుతున్న బంధాలలో, మీరు "జీవసంబంధిత సంపూర్ణత్వం" కోసం గందరగోళ పరిస్థితుల ద్వారా     ఉత్తేజింపబడడాన్ని కనుగొంటారు. దీని అర్థం ఇతరులు లేకుండా ఉ ండలేక పోవడాన్ని లేదా పని చేయలేక పోవడాన్ని. ఇవి శక్తులను చిక్కులలో బంధీ అయ్యేట్టు చేస్తాయి. ఇక్కడ భాగస్వాములు ఒకరినొకరు వారి శక్తిత్రాడుల ద్వారా పోషించుకోవడాన్ని, మీరు వారి యొక్క శక్తి క్షేత్రాలలో గమనించగలరు. భాగస్వాములు ఇరువురూ ఆధారపడేతత్వం మరియు అదుపుల ద్వారా లోబర్చుకునే శక్తులతో ఒకరినొకరు పోషించుకుంటారు. ఈ విధంగా చిక్కులలో ఇరుక్కుపోయిన శక్తి వలన, మీ పూర్తి బాధ్యతను మీరు తీసుకోలేక పోవడాన్ని మరియు మీరు మాత్రమే నయం చేసుకోగల మీ పాత ఆత్మగాయానికి ఎదురుపడలేక పోవడాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు. మీరు ఈ తీవ్రమైన బాధను గుర్తించి దాని యొక్క బాధ్యతను తీసుకున్నట్లయితే, మీరు సంపూర్ణంగా ఉండడానికి వేరేవారి యొక్క అవసరం లేదనే విషయాన్ని తెలుసుకుంటారు మరియు మీరు బంధం యొక్క అసంతృప్తికరమైన లక్షణం నుంచి మీకు మీరుగా విముక్తిని పొందుతారు.

## కర్మ బంధాలు

ఈ సందర్భంలో నేను కర్మ సంబంధిత బంధాల గురించి వివరించాలని అనుకుంటున్నాను. దీని అర్థం గతజన్మల నుంచి ఒకరికొకరు తెలిసిన మనుష్యుల మధ్య ఉండే బాంధవ్యం మరియు వారు ఒకరితో ఒకరు పొందిన తీవ్రమైన మనోభావాల యొక్క అనుభవాన్ని గురించి అని. ఈ కర్మ బంధాలను గుర్తించగలిగే లక్షణం ఏమిటంటే దీనికి సంబంధించిన భాగస్వాములు పరిష్కారం కాని మనోభావాలను అంతరంలో మోస్తుంటారు:  తప్పు, భయం, ఆధారపడేతత్వం, అసూయ, కోపం మొదలగు వాటిని. ఈ పరిష్కారం కాని మనోభావపరమైన బాధ్యత వలన, వీరు

తర్వాతి జన్మలో ఒకరికొకరు ఆకర్షింపబడాలని కోరుకుంటారు. దీనిని నూతనంగా ఎదుర్కోవడానికి సంబంధించిన లక్ష్యం యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, ఈ మనోభావాలను పరిష్కరించుకోవడానికి మరొక అవకాశం లభిస్తుంది అని. ఇవే మనోభావాలను అతి తక్కువ సమయంలో మళ్ళీ సృష్టించడం వలన ఇవి పరిష్కరింపబడతాయి. వీరు మొట్టమొదటిసారిగా కలిసినప్పుడు, ఈ కర్మ సంబంధిత ఆటగాళ్ళు ఒకరికొకరు సన్నిహితమవ్వాలని బలంగా కాంక్షిస్తారు మరియు కొంతకాలం తర్వాత వీరు వీరి యొక్క పాత మనోభావ సంబంధిత పాత్రలను తిరిగి పోషించడం మొదలుపెడతారు. ఇప్పుడు పాత మనోభావాలను సరికొత్తదనంతో ఎదుర్కొనడానికి రంగస్థలం ఏర్పడుతుంది మరియు బహుశా మరింత జ్ఞానవంతమైన మార్గంలో దీనితో వ్యవహరించవచ్చు. మనోభావాలను నూతనమైన పద్ధతిలో ఎదుర్కోవడం యొక్క ఆధ్యాత్మిక ఆశయం ఏమిటంటే, భాగస్వాములిద్దరూ గతజన్మలలో ఎంచుకున్న ఎంపికల కంటే భిన్నమైన కొత్త ఎంపికలను ఎంచుకోవడానికి అవకాశం లభిస్తుంది కాబట్టి.

ఇక్కడ నేను దీనిని ఒక ఉదాహరణ ద్వారా వివరించి చెప్పాలనుకుంటున్నాను. ఒక స్త్రీ, తన గతజన్మలో అసూయను మరియు అధికారాన్ని చూపించే భర్తను కలిగిఉన్నట్లు ఊహించుకోండి. కొంతకాలం ఆమె దీనిని అంగీకరించ గలిగింది, కాని ఒకానొక స్థితిలో ఆమె ఇది ఇక చాలు అని నిర్ణయించుకుని ఆ బంధాన్ని వదిలివేసింది. ఆ తర్వాత ఆమె భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు ఆ స్త్రీ పశ్చాత్తాపానికి లోనయ్యి, తను పాపం చేసినట్టుగా భావించింది. ఆ జన్మలో, ఆమె అతనికి మరొక అవకాశాన్ని ఇచ్చి ఉండాల్సిందా? ఈ పాపమనే భావనను ఆమె తన మిగిలిన జీవితమంతా మోస్తూ వచ్చింది.

మరొక జన్మలో వీరు మళ్ళీ కలుస్తారు. వీరిద్దరి మధ్య అసాధారణమైన ఆకర్షణ ఉంటుంది. వారు కలిసిన మొదట్లో పురుషుడు ఉత్తమమైన ఆకర్షణను కలిగి ఉంటాడు మరియు అతను ఆమె పై అత్యంత ఆసక్తిని చూపిస్తూ, ఆమెను ఆరాధిస్తుంటాడు. ఆ తర్వాత వీరు ఒక బంధంలోకి ప్రవేశిస్తారు. అప్పటి నుంచి అతనిలో అసూయ మరియు అనుమానించేతత్వం క్రమక్రమంగా పెరుగుతుంటాయి. అతను ఆమె యొక్క శీలాన్ని అనుమానిస్తుంటాడు. ఆమె ఒక అంతర్ ఘర్షణలో ఉన్నట్టు తనను తాను గుర్తిస్తుంది. అతను, తనపై తప్పుగా నేరాన్ని ఆరోపిస్తున్నాడని ఆమె నిరాశకు మరియు కోపానికి లోనవుతుంది. అయినప్పటికీ ఆమె అతనిని క్షమించి అతనికి మరొక అవకాశాన్ని ఇవ్వాలనుకుంటుంది. ఆమె అతనిని ఒక గాయపడిన మనిషిగా భావిస్తుంది; అతను పూర్తిగా వదిలివేయబడతాడనే భయాన్ని కలిగి ఉన్నాడని, నేను అతనికి సహాయం చేయడం ద్వారా అతను దీని నుంచి బయటకు

రాగలదని అనుకుంటుంది. ఈ విధంగా ఆమె తన ప్రవర్తనను సమర్ధించుకుంటుంది. కాని, నిజానికి ఆమె ఈవిధంగా తన వ్యక్తిగత హద్దులను ఉల్లంఘించడానికి అనుమతిస్తోంది. ఈ బంధం ఆమె సొంత గౌరవాన్ని చెడుగా ప్రభావితం చేస్తుంది.

ఇప్పుడు ఆమెకు ఈ బంధాన్ని త్రెంచుకోవడానికి మరియు తప్పు చేశాననే భావనను వదిలివేయడానికి, తన సొంత మార్గంలో ముందుకు వెళ్ళడానికి స్వేచ్ఛతో కూడిన ఒక గొప్ప అవకాశం లభిస్తుంది. భర్త యొక్క బాధ మరియు భయం అనే వాటికి ఆమె బాధ్యురాలు కాదు. అతని బాధ మరియు ఆమె తప్పు చేశాననే భావన అనేవి అసంతృప్తికరమైన బాంధవ్యానికి దారితీస్తాయి. గతజన్మ కారణంగా, వీరి యొక్క బంధం ముందే మనోభావపరమైన బాధ్యతగా మారింది. నూతనంగా సమస్యని ఎదుర్కోవడం యొక్క అర్థం ఏమిటంటే, స్త్రీ తప్పు చేశాననే భావనలతో కాకుండా, తను సహజంగా పరిస్థితులను వదిలివేయడాన్ని తప్పకుండా నేర్చుకోవాలి మరియు అదే విధంగా పురుషుడు కూడా మనోభావపరమైన విషయాలకు సంబంధించి తన సొంత కాళ్ళపై నిలబడడాన్ని నేర్చుకోవాలి. అందువలన దీనికి అసలైన పరిష్కారం ఏమిటంటే బంధాన్ని వదలివేయడమే. స్త్రీ యొక్క కర్మకు పరిష్కారం: తప్పు చేశాననే ఆమె యొక్క భావనను పూర్తిగా వదిలివేయడమే. ఆమె తన గత జన్మలో చేసిన పొరపాటు తన భర్తను వదిలివేయడం కాదని, అతని ఆత్మహత్యకు తనే బాధ్యురాలినని అనుకోవడమేనని తెలుసుకోవాలి. ఈ జన్మలో అతని భార్య వదిలివేయడానికి కారణం: అతను తన సొంత బాధను మరియు భయాన్ని తిరిగి ఎదుర్కొనాలని మరియు ఈ మనోభావాలను వదిలివేయకుండా వీటిని తిరిగి ఎదుర్కొనడానికి మరొక కొత్త అవకాశాన్ని అందిస్తున్నాయని అతను తెలుసుకోవాలి.

నిజానికి మీకు వేరేవ్యక్తి బాగా పరిచయం ఉన్నవారిలా అనిపించడం ద్వారా, మీరు కర్మ బంధాలను  గుర్తించవచ్చు. చాలా తరచుగా మీ ఇద్దరి మధ్య పరస్పర ఆకర్షణ ఉంటూ, అది మిమ్మల్ని దగ్గరవ్వమని మరియు ఒకరినొకరు తెలుసుకొనమని ఒత్తిడి చేస్తుంది. ఏదైనా అవకాశం దొరికినట్లయితే, ఈ బలమైన ఆకర్షణ "ప్రేమ సంబంధంగాను లేదా బలమైన మోజుగాను" మారవచ్చు. మీరు అనుభవం పొందుతున్న ఈ మనోభావాలు మిమ్మల్ని ఎంత తీవ్రంగా ప్రభావితం చేస్తాయంటే, మీకు మీ జంట ఆత్మను కలుస్తున్నట్టుగా అనిపించవచ్చు. కాని, ఈ పరిస్థితులు కనిపిస్తున్న విధంగా ఉండవు. ఈ విధమైన బంధాలలో సమస్యలు ఏదో ఒక సమయంలో పైకి వస్తాయి. భాగస్వాములు చాలా తరచుగా మానసికపరమైన సమస్యలలో పాల్గొంటారు. అవి అధికారం, అదుపు మరియు ఆధారపడేతత్వం యొక్క ముఖ్యలక్షణాలను కలిగిఉంటాయి. ఈ కారణంగా వీరు విషాదాన్ని తిరిగి

పొందుతూ, ఇది గతజన్మ నుంచి వచ్చినదిగా అచేతనావస్థలో గుర్తిస్తారు. గతజన్మలో వీరు ప్రేమికులుగా గాని, తండ్రి–బిడ్డగా గాని లేదా తల్లి–బిడ్డగా గాని, అధికారి మరియు వారి క్రింద పనిచేసే ఉద్యోగిగా గాని, లేదా వేరే ఏ విధమైన బంధానైనా కలిగిఉండవచ్చు. వీరు అవిశ్వాసం మరియు అధికార దౌర్జన్యం యొక్క నటనల ద్వారానూ, లేదా బేధాలు మరియు అతిప్రేమలను చూపించడం ద్వారానూ, వీరిరువురూ వీరి యొక్క అంతరంలో ఉన్న లోతైన బాధను స్పృశిస్తారు. వీరి మధ్య తీవ్రమైన ఘర్షణ ఉండడం వలన, అది మనోభావపరమైన గాయాలకు మరియు లోతైన ముద్రలకు కారణమవుతాయి. అందుకనే వీరు కొత్తజన్మలో మళ్ళీ కలిసినప్పుడు ఆకర్షణ శక్తి మరియు అదే విధంగా వికర్షణ శక్తి రెండూ కూడా వీరిరువురి మధ్య చాలా తీవ్రంగా ఉండగలవు.

ఈ విధంగా శక్తివంతమైన చిక్కుముడులలో ఇరుక్కుపోయిన ఆత్మలకు ఆధ్యాత్మిక ఆహ్వానం: ఒకరినొకరు విడుదల చేసుకుంటూ, స్వేచ్ఛ మరియు స్వతంత్రంతో తమకు తాముగా సంపూర్ణమైన వ్యక్తిత్వం గల ఆత్మలుగా రూపొందమనే. ఇక్కడ తెలుపబడిన కర్మ బంధాలు చాలా వరకూ ఎక్కువ కాలం స్థిరంగా గాని లేదా ప్రేమ బంధంగా గాని ఉండవు. ఇవి నయం చేసుకునే బంధాలుగా కన్నా కూడా, ఎక్కువ శాతం విడిపోయే వాటిగానే ఉంటాయి. ముఖ్యంగా ఈ ఘర్షణలను ఎదుర్కోవడం యొక్క ప్రధానలక్ష్యం ఏమిటంటే, ఒకరినొకరు స్వేచ్ఛగా వదిలివేయడంలో సఫలమవ్వడమే. దీనిని గతజన్మలలో చేయలేకపోయారు. కాని ఇప్పుడు ఒకరినొకరు ప్రేమతో విడుదల చేయడానికి మరొక అవకాశం ఉంది.

మీరు తీవ్రమైన మనోభావాల యొక్క లక్షణాలతో కూడిన బంధంలో మిమ్మల్ని మీరు గుర్తించినట్లయితే, అది మీకు చాలా బాధను మరియు దు:ఖాన్ని కలిగిస్తుంది. కాని మీరు వీటి నుంచి స్వేచ్ఛను పొందలేరు. దయచేసి ఈ విషయాన్ని అర్థం చేసుకోండి: మీరు వేరే మనిషితో నివసించాలి అని మిమ్మల్ని ఎవరూ నిర్బంధించడం లేదు. మీరు అర్థం చేసుకోవాల్సిన మరొక విషయం ఏమిటంటే ఈ తీవ్రమైన మనోభావాలు మీ ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ కన్నా కూడా లోతైన బాధనే ఎక్కువగా సూచిస్తాయి. ప్రేమశక్తి ముఖ్యంగా నిశ్శబ్దంగాను మరియు ప్రశాంతంగాను, తేలికైన హృదయంతోను మరియు ఉత్తేజంతోను ఉంటుంది. ఇది ఎంతమాత్రం భారంగా గాని, విషాదంగా గాని మరియు అలసిపోయేట్టుగా గాని ఉండదు. ఒకవేళ ఏ బంధమైనా ఈ విధమైన గుణాలతో ఉన్నట్లయితే, ఆ బంధంతో తిరిగి వ్యవహరించడం కన్నా కూడా, దానిని వదిలివేయడానికి ఇదే సరియైన సమయం.

మీరు కొన్నిసార్లు వారితో కలిసి జీవించడానికి, మీకు మీరు సర్ది చెప్పుకుంటారు. ఎందుకంటే మీరు "కర్మని పంచుకోవాలి" మరియు మీరు ఇరువురూ "కలిసి ఈ విషయాల మీద పని చేయాలి" అని అనుకుంటారు కాబట్టి. మీరిద్దరూ తీవ్రంగా బాధపడుతున్నప్పటికీ కూడా, దీనిని కర్మ యొక్క ఫలితంగా భావిస్తూ తిరిగి బంధాన్ని కొనసాగిస్తారు. నిజానికి మీరు కర్మ యొక్క భావాన్ని వక్రంగా అర్థం చేసుకుంటున్నారు. మీరిద్దరూ కలిసి కర్మ మీద పని చేయవలసిన అవసరం లేదు; కర్మ అనేది వ్యక్తిగత విషయం. ఇంతకు ముందు చెప్పినట్లు ఈ విధమైన బంధాల విషయంలో కర్మ నుంచి విముక్తిని పొందాలంటే, మీరు పూర్తిగా వేరేవారిని వదిలివేయాలి. మీకు మీరే అంతా అనే అనుభవాన్ని పొందడానికి ఈ బంధం నుంచి మిమ్మల్ని మీరు ఉపసంహరించుకోవాలి. మీరు ఈ కర్మను మళ్ళీ మీ సొంతంగా పరిష్కరించుకోవచ్చు. వేరొక వ్యక్తి మీ అంతరంలోని ఈ బాధను స్పృశించవచ్చు, అది మీ ఇద్దరి మధ్య ఒక గొప్ప నాటకాన్ని సృష్టిస్తుంది. అప్పుడు మీ యొక్క అంతర్ గాయంతో వ్యవహరించడం అనేదే మీ కర్తవ్యంగాను మరియు సవాల్‌గాను ఉంటుంది. వేరే వ్యక్తుల యొక్క విషయాలు మీకు సంబంధం లేనివి, మీ పట్ల మాత్రమే మీరు బాధ్యతను స్వీకరించాలి.

ముఖ్యంగా మీరు అర్థం చేసుకోవాల్సిన విషయం ఇదే. ఎందుకంటే ఇది బంధాలలో ఒకానొక ప్రధానమైన సమస్యగా ఉంటోంది కాబట్టి. మీ భాగస్వామికి సంబంధించి మీరు బాధ్యులు కారు మరియు మీకు సంబంధించి మీ భాగస్వామి బాధ్యుడు కాదు. మీ సమస్యలకు పరిష్కారం అనేది వేరే వ్యక్తి యొక్క ప్రవర్తనపై ఆధారపడి ఉండదు. కొన్నిసార్లు మీ భాగస్వామి యొక్క అంతర్ శిశువుతో, అంటే మనోభావపరంగా గాయపడిన వారి యొక్క అంతర్భాగంతో ఎక్కువగా బంధాన్ని ఏర్పరుచుకోవడం వలన మీరొక్కరే దీనిని కాపాడగలరని భావిస్తారు, లేదా ఇదే విధంగా మీ భాగస్వామి మీతో ప్రయత్నించవచ్చు. కాని ఇది ఏ విధంగాను పనిచేయదు. మీరు వేరేవ్యక్తిలోని శక్తిహీనత మరియు బానిసత్వం యొక్క మనోభావాలను బలపరుస్తున్నారు. కాబట్టి మీరు హద్దులను ఏర్పరుచుకుని మీ కోసం మీరు జీవించినట్లయితే, అది మీకు తుదికి చాలా అద్భుతమైన సహాయాన్ని చేస్తుంది. "మీకు మీరే అంతా" అనే విషయాన్ని మీ సొంతంగా మీరు అనుభూతి చెందగలగడమే మీ యొక్క గమ్యం. నిజానికి ఒక బంధాన్ని సంతృప్తికరంగా నిర్వర్తించడానికి ఇదే అతి ముఖ్యమైన షరతుగా ఉంటుంది.

## హీలింగ్ బంధాలు

బంధాలలో నయం చేసుకుని(హీలింగ్) కొనసాగించేవి మరియు అదే

విధంగా విడిపోయేవి కూడా ఉంటాయి. హీలింగ్ బంధాల యొక్క లక్షణం ఏమిటంటే, భాగస్వాములు ఒకరినొకరు మార్చాలని ప్రయత్నించకుండా, ఒకరి స్థితిని ఒకరు యధాతధంగా గౌరవిస్తారు. వీరు ఒకరి సాంగత్యంలో ఒకరు చాలా ఆహ్లాదాన్ని పొందుతారు. కాని వీరు వీరి భాగస్వామి ప్రక్కన లేనప్పుడు ఏమాత్రం కష్టాన్ని గాని, నిరాశను గాని లేదా ఒంటరితనాన్ని గాని అనుభూతి చెందరు. ఈ విధమైన బాంధవ్యాలలో మీరు ప్రేమించే వ్యక్తి యొక్క సమస్యలను పరిష్కరించాలని ప్రయత్నించకుండా, వారికి అవగాహనను, సహకారాన్ని మరియు ప్రోత్సాహాన్ని అందిస్తారు. ఈ బాంధవ్యాలలో ఎల్లప్పుడూ స్వేచ్ఛ మరియు ప్రశాంతత ఉంటాయి. వీటిలో కూడా అప్పుడప్పుడు అపార్థాలు తలెత్తవచ్చు, కాని వీరిలో తలెత్తే మనోభావాలు చాలా స్వల్పకాలం ఉంటాయి. భాగస్వాములు ఇద్దరూ ఒకరినొకరు క్షమించుకోవడానికి సిద్ధంగా ఉంటారు. వీరిద్దరి మధ్య ఉన్న హృదయ సంబంధం వలన, వీరు భాగస్వామి యొక్క మనోభావాలను మరియు పొరపాట్లను వ్యక్తిగతంగా తీసుకోరు. ఇది బాధ యొక్క లోతైన పొరను స్పృశించదు, అందువలన వీరు దీనికి అధిక ప్రాముఖ్యతను ఇవ్వరు. మనోభావపరంగా భాగస్వాములు ఇద్దరూ స్వతంత్రంగా ఉంటారు. వీరు, వీరి యొక్క శక్తి మరియు క్షేమం కోసం, వీరి భాగస్వామి యొక్క ఉనికి లేదా వారి ఆమోదం కోసం ఎదురుచూడరు. ఆమె లేదా అతను వీరి యొక్క జీవితంలోని ఖాళీలను పూరించరు. కాని, వీరి జీవితానికి కొత్తదనాన్ని మరియు జీవశక్తిని కలుపుతుంటారు.

హీలింగ్ బంధాలలో భాగస్వాములు కూడా ఒక జన్మ లేదా అంతకంటే ఎక్కువ గతజన్మల నుంచి ఒకరికొకరు తెలిసి ఉండవచ్చు. కాని ఈ విషయాలలో ఇంతకు ముందు మనం చర్చించుకున్న మనోభావపరమైన కర్మసంబంధిత భారాలు అంతగా ఉండవు. గతజన్మ నుంచి కూడా, ఈ రెండు ఆత్మలు ముఖ్యంగా ఒకరికొకరు ప్రోత్సహించుకునే విధంగాను మరియు సహకరించుకునే విధంగాను తెలిసి ఉండవచ్చు. స్నేహితులు, భాగస్వాములు, తల్లి-బిడ్డ సంబంధం, లేదా వీరు ఒకరికొకరు ఆత్మ బంధువులుగా గాని గుర్తిస్తారు. ఇది చాలా జన్మలలో శాశ్వతమైన బంధాన్ని సృష్టిస్తుంది.

నేను మరొక ఉదాహరణను చెప్పాలనుకుంటున్నాను. ఇది ఒక పేద కుటుంబానికి సంబంధించిన ఒక యువకుడి ఉదాహరణ. అతను నిజాయితీపరుడు మరియు సున్నిత స్వభావం కలవాడు. అతను తన చుట్టూ ఉన్న పరిసరాలకు తగినట్టుగా జీవించలేక పోతాడు. అతని యొక్క కుటుంబం కష్టపడి పనిచేసే తత్వాన్ని కలిగి ఉంటుంది, వీరు ఏ విధమైన కలలు లేదా ఆశయాలు లేని కఠినమైన మనుష్యుల్లా

ఉంటారు. అతను ఎదిగిన తర్వాత సన్యాసాశ్రమంలోకి ప్రవేశిస్తాడు. అతను నిజానికి ఇక్కడ కూడా ఆనందంగా ఉండడు. ఎందుకంటే ఈ జీవితం కూడా కఠినమైన నియమ-నిబంధనలతో ఉంటుంది. అక్కడ నివసించే మనుష్యుల మధ్య అతి తక్కువ వాత్సల్యం లేదా అభిమానం ఉంటాయి. అక్కడ అతనికి కొద్దిపాటి భిన్నత్వం కలిగిన ఒక మనిషి కనిపిస్తాడు, అతను ఉన్నతస్థాయిలో ఉన్న ఒక మత గురువు. కాని ఆ గురువుకి ఏ మాత్రం అధికారగర్వం ఉండదు మరియు అతను ఈ యువకుడిపై ఇష్టాన్ని చూపుతాడు. ఆ గురువు ఈ యువకుడి పరిస్థితులను అప్పుడప్పుడు విచారిస్తూ అతనికి ఆహ్లాదాన్ని కలిగించే తోట పనులను కేటాయిస్తాడు. వీరు ఒకరినొకరు చూసుకున్న ప్రతీసారి వీరి మధ్య ఒక విధమైన గుర్తింపు అంటే ఒకే విధమైన మనస్తత్వం కలిగిన భావన ఉంటుంది. వీరు హృదయం నుంచి ఒక నిశ్శబ్ధమైన బంధాన్ని కలిగి ఉంటారు. వీరు తరచూ కలుసుకుని మాట్లాడుకోలేక పోయినప్పటికీ, గురువు ఈ యువకుడి యొక్క ఆశకు మరియు ప్రోత్సాహానికి మూలంగా ఉంటాడు.

ఈ యువకుడు తన తర్వాత జన్మలో స్త్రీగా జన్మిస్తాడు. ఆమె మరొకసారి నిజాయితీని మరియు కలలుకనే తత్వాన్ని కలిగిఉంటుంది. ఆమె తన కాళ్ళపై తాను నిలబడడానికి కష్టపడుతుంటుంది. ఆమె పెరిగి పెద్దదైన తర్వాత, తను అహంకారం మరియు అధికారగర్వం కలిగిన ఒక వ్యక్తితో పెళ్ళి జరిగి ఆ బంధంలో కూరుకునిపోతుంది. ఆమె తొలిచూపులోనే అతని యొక్క అత్యుత్తమమైన ఆకర్షణలో పడిపోతుంది. కాని, తర్వాత అతని యొక్క ఆధీకృత ఆమెను అడ్డుకుంటూ అణచివేస్తోందని తెలుసుకుంటుంది. ఆమె దీనిని గుర్తించినప్పటికీ ఆ బంధం నుంచి స్వేచ్ఛను పొందడం చాలా కష్టంగా ఉంటుంది. ఆమె తను పనిచేసే చోట తన సహొద్యోగి అయిన ఒక పెద్దమనిషికి ఈ విషయం గురించి చెప్పుకుంటుంది. ఆమెను తన కాళ్ళ మీద నిలబడమని మరియు తన సొంత అవసరాలను నిజాయితీగా పట్టించుకోమని అతను ప్రోత్సహిస్తాడు. ఆమె అతనితో మాట్లాడిన ప్రతీసారి అతను సరిగ్గా చెబుతున్నాడని తన ఇంగితజ్ఞానంతో తెలుసుకుంటుంది. ఒక గొప్ప అంతర్ సంఘర్షణ తర్వాత ఆమె తన భర్తతో విడిపోతుంది. ఇప్పుడు తన సహొద్యోగితో ఆమె బంధం మారుతుంది. ఆమె అతనిపై అభిమానాన్ని చూపిస్తుంది. అతను కూడా ఒంటరిగా మారుతాడు. ఆమె అతనితో చాలా స్వేచ్ఛగా ఉన్నట్లు అనుభూతి చెందుతుంది, వీరు ఒకరికొకరు కొన్ని యుగాలుగా తెలిసినట్లు అనుభూతి చెందవచ్చు. వీరు అభిమానం మరియు ప్రశాంతతతో కూడిన బాంధవ్యాన్ని ఆరంభిస్తారు మరియు ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఉంటారు. గతజన్మ నుంచి వీరి మధ్యలో

ప్రవహిస్తున్న కరుణ ఇప్పుడు సంతృప్తికరమైన భార్యభర్తల బాంధవ్యంగా రూపుదిద్దుకుంటుంది.

ఇదే హీలింగ్ బంధం. స్త్రీ తన భర్తను వదిలివేయడంలోనూ మరియు తనకు కావలసిన దానిని ఎంచుకోవడంలోనూ అతి ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకుంది. దీని ద్వారా ఆమె తన మనోభావసంబంధిత స్వతంత్రతను ధ్రువీకరించింది. ఇది స్నేహభావం కలిగిన ఆత్మతో ప్రేమపూర్వకమైన మరియు మంచి సమన్వయం కలిగిన బంధానికి మూలాధారాన్ని సృష్టించింది.

**జంట ఆత్మలు(ట్విన్ సోల్స్):**

నేను ఇప్పుడు జంట ఆత్మల యొక్క అంశం గురించి చెప్పాలనుకుంటున్నాను, బహుశా ఇది మీ అందరికి బాగా తెలిసిన విషయం కావచ్చు. జంట ఆత్మల యొక్క ఆలోచనపై మీరు లోతైన ఆకర్షణను కలిగిఉంటారు. ఎలా అయినా ఇది చాలా వరకూ ప్రమాదకరమైనది, ఎందుకంటే ఇది మీ ప్రతీ ఒక్కరిలో ఉన్న జన్మగాయాన్ని మరియు మనోభావపరంగా ఇతరులపై ఆధారపడే తత్వాన్ని పరిష్కరించుకోవడానికి బదులు, వాటిని బలపరిచే విధంగా అర్థాన్ని వివరిస్తుంది. మీరు జంట ఆత్మల యొక్క అంశం ఉందని నమ్మినప్పుడు, అంటే మీకు అన్ని విధాల సరిపోయే వ్యక్తి ఉంటాడని మరియు అతను లేదా ఆమె మిమ్మల్ని సంపూర్ణం చేస్తారని మీరు అనుకున్నప్పుడు ఇది సంభవిస్తుంది. ఇది మీ యొక్క వేరే సగ-భాగంగా ఉన్న జంట ఆత్మ గురించిన అంశం. మీరు పూర్తిగా పోగొట్టుకున్న ఏకత్వం మరియు భద్రతలను మీకు సరిజోడి అయిన భాగస్వామిలో కనుగొనాలని అనుకుంటారు.

జంట ఆత్మలకు సంబంధించి పరిణత లేని అభిప్రాయాల వలన, మీరు ఆత్మలను రెండు ముక్కలుగా భావిస్తూ, అవి తిరిగి కలవడం ద్వారా సంపూర్ణమవుతాయని పరిగణిస్తుంటారు. సాధారణంగా ఈ రెండు భాగాలను స్త్రీ మరియు పురుషుడిగా చెబుతుంటారు. అందువలన ఈ అభిప్రాయం మీకు మీరు అసంపూర్ణమని చెప్పడమే కాకుండా, మీరు ముఖ్యంగా స్త్రీ లేదా పురుషుడు మాత్రమేనని తెలియజేస్తుంది. ఆధ్యాత్మికపరంగా ఈ జంట ఆత్మల యొక్క అభిప్రాయం అనేది ఆరోగ్యవంతమైనది కాదని లేదా నయంచేసేది కాదని బహుశా మీరు గుర్తించగలరు. ఇది మీరు పూర్తిగా బయటి విషయాలపై ఆధారపడేటట్లు చేస్తుంది. మీరు స్త్రీ మరియు పురుషుడు రెండూ అని మరియు మీకు మీరే అంతా అనే వాస్తవాలను తెలియజేసే దివ్యత్వపు మూలకేంద్రాన్ని తిరస్కరిస్తుంది. ఇది మీ ఇంటి నుంచి దూరం

చేసే అన్ని రకాల భ్రమలను సృష్టిస్తుంది. ఇక్కడ ఇల్లు అంటే అర్థం మీ సొంత నిజతత్వం, మీ "నేను-తత్వం" యొక్క దివ్యత్వమే. ఏ ఆత్మ కూడా వేరేవారి యొక్క మరొక సగ-భాగంగా ఎంత మాత్రం ఉండదు.

జంట ఆత్మలు ఉంటాయి, కాని అవి కవలల గురించి తెలియజేస్తాయి. ఈ ఆత్మలు ఒకే "అనుభూతి స్వరంతో లేదా ఒకే ప్రకంపనం"తో ఉంటాయి, లేదా వీరిని ఒకే సమయంలో జన్మించిన కవలలుగా మీరు చెప్పవచ్చు. ఈ ఆత్మలు అంతరంగా ఒక ప్రత్యేకమైన అనుభూతి స్వరాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ, కాలం మరియు తలాలలోని ఒక ప్రత్యేకమైన క్షణంలో, అంటే ఒకే జనన సమయంతో జన్మలను తీసుకుంటాయి. వీరు ఏవిధంగాను ఒకరిపై ఒకరు ఆధారపడరు. వీరు ఆత్మపరంగా స్త్రీ కాదు, పురుషుడు కాదు. కాని వీరు ఒకే విధమైన పోలికలు ఉన్న ప్రజ్ఞాత్మలుగా ఒకరికొకరు శృతి చేయబడతారు.

జంట ఆత్మల యొక్క సృష్టికి గల కారణం ఏమిటి? అవి ఎందుకు ఉంటాయి? జంట ఆత్మల ఉనికికి గల కారణం ఏదో నేర్చుకోవడానికి కాదు. వీటి యొక్క లక్ష్యం ఏమిటంటే కేవలం ఆనందం మరియు సృజనాత్మకతయే. జంట-ఆత్మలు, ద్వంద్వంలో ఏవిధమైన పనిని కలిగిఉండరు. మీరు ద్వంద్వాన్ని అధిగమించినప్పుడు, మీరు మీ అంతరంలోని  దైవంతో అంటే ఏ రూపాన్నైనా ధరించగల సామర్థ్యం ఉన్న ఏకత్వంతో కూడిన మీ పూర్ణాత్మతో తిరిగి మిమ్మల్ని మీరు గుర్తించగలిగినప్పుడు, మీరు మీ జంట ఆత్మను కలుస్తారు. జంట ఆత్మలు ఇంటికి తిరిగి చేరు ప్రయాణంలో మళ్ళీ కలుస్తాయి.

మనం ఒక్కక్షణం మీ ప్రయాణం యొక్క ఆరంభదశకు తిరిగి వెళదాం. మీరు ఏకత్వం యొక్క స్థితిని వదిలి ఒక ప్రత్యేకమైన ఆత్మగా రూపొందిన క్షణంలో, మీరు ద్వంద్వంలోకి ప్రవేశించారు. అకస్మాత్తుగా అక్కడ చీకటి-వెలుగు, ఎక్కువ-తక్కువ, అనారోగ్యం-ఆరోగ్యం మొదలైన వాటిగా ఏర్పడ్డాయి. వాస్తవం అనేది రెండుగా చీలిపోయింది. నిజానికి మీరు ఎవరు అనే దానిని తెలుసుకోవడానికి, మీకు ఏవిధమైన గుర్తులు లేకుండా పోయాయి. ఆరంభంలో మీరు అనంత విశ్వంలోని భాగంగా మీ గుర్తింపును పొందారు. కాని, ఇప్పుడు మీరు అనంతం నుంచి విభజింపబడిన ఒక చిన్న భాగంగా ఉన్నారు. దీనిని మీరు ఎరుకతో గుర్తించలేక పోయినప్పటికీ కూడా, మీకు సమానమైన మరియు మీకు సన్నిహితమైన పోలికలు కలిగిన ఒక రూపం మిమ్మల్ని అనుసరిస్తుండేది. మీరు ఏకత్వంలోని ఒకే తలంలో ఉండేవారు, మీరు జన్మించేంత వరకూ మీరు ఇద్దరూ అని గుర్తించలేనంత సన్నిహితంగా ఒకరితో

ఒకరు ఉండేవారు. ద్వంద్వాలకు అతీతంగా ఉండే స్థితియే మీ ఇద్దరిని కలుపుతుంది, అంటే ద్వంద్వాల యొక్క చరిత్రను తెలిపే తర్వాత స్థితి, సాధారణంగా దీనిని మాటల్లో చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే మీరు స్త్రీ లేదా పురుషుడిగా ఉంటారని మరియు ఒకే సమయంలో ఇద్దరిగా ఉండలేరని తెలిపే మీ సాధారణమైన నిర్వచనాలను సవాలు చేస్తుంది కాబట్టి.

ఇప్పుడు మీ ఇద్దరూ చాలా అనుభవాలతో కూడిన సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధమయ్యారు. మీ “సారాంశం” ద్వంద్వంలో ఇమిడి లేదని, ద్వంద్వానికి ఆవలి వైపు మరియు దాని యొక్క లోతుల్లోనూ ఉంటుందని భావించారు. మీ ఇద్దరూ క్రమక్రమంగా దీనిని అన్వేషించడానికి ద్వంద్వాల అంచుల యొక్క అనుభవాన్ని పొందారు. మీరు ద్వంద్వం యొక్క లోతులలో ఉన్న ఏకత్వం యొక్క ఎరుకను పొందిన వెంటనే, మీ ఇంటిని చేరే తిరుగు ప్రయాణం ఆరంభమవుతుంది. కొద్దికొద్దిగా మీరు బాహ్య విషయాలైన అధికారం, డబ్బు లేదా పరువు-ప్రతిష్ఠలతో ఉన్న అనుబంధాన్ని తక్కువగా అనుభూతి చెందుతారు. మీరు ఏమి అనుభవాన్ని పొందారు అనే దాని కంటే కూడా, మీరు ఎలా అనుభవాన్ని పొందారు అనే విషయానికే అధిక ప్రాముఖ్యతను ఇవ్వాలని, మీరు మరింత స్పష్టంగా తెలుసుకుంటారు. మీ అవగాహన యొక్క స్థితి ఆధారంగానే, మీరు మీ సొంత ఆనందాన్ని లేదా దు:ఖాన్ని సృష్టిస్తారు. మీరు, మీ సొంత చైతన్యం యొక్క శక్తిని కనుగొంటున్నారు.

ఒకసారి మీరు ద్వంద్వం యొక్క ఎత్తు-పల్లాలన్నింటి ద్వారా పయనించినప్పుడు, మీరు మీ జంట ఆత్మను కలిసే క్షణం వస్తుంది. మీ జంట ఆత్మ యొక్క శక్తి మరియు ఆకృతిలో, మీరు మీ యొక్క గొప్ప లోతైన భాగాన్ని మరియు ద్వంద్వాలకు అతీతంగా ఉన్న మీ సారాంశాన్ని గుర్తిస్తారు. ఈ విధమైన గుర్తింపు వలన మిమ్మల్ని మీరు బాగా అర్థం చేసుకుంటారు మరియు మీరు నిజానికి ఎవరనే దాని యొక్క ఎరుకను పొందుతారు. మీ యొక్క జంట ఆత్మ అనేది మీరు ఎవరనే దానికి అద్దం పడుతుంది. ఇది మీ పట్ల మీకున్న పరిమితమైన నమ్మకాల నుంచి, అంటే మీరు మీ జీవితంలోను లేదా మీ గతజన్మలలోను స్వీకరించిన వాటి నుంచి విముక్తిని పొందడానికి అవసరమైన సహాయాన్ని మీకు అందిస్తుంది. మీ జంట ఆత్మలో, మీ యొక్క ఏకత్వపు ప్రతిబింబాన్ని చూడడం ద్వారా మిమ్మల్ని మీరు విముక్తి చేసుకుంటారు; ఇది ఒక అలారం లాంటిది మరియు మనోభావపరంగా ఆధారపడే తత్వంతో ఇకపై ఎలాంటి అవసరం లేదు. మీరు ఒకరినొకరు కలుసుకోవడం అనేది మీరు శక్తివంతంగాను మరియు మరింత వ్యక్తిగత ఎరుక గల ప్రత్యేకమైన వ్యక్తిగా ఉండడానికి సహాయం చేస్తుంది. భూమి మీద మీ సృజనాత్మకతను మరియు ప్రేమను తెలియజేయడానికి మీరు ఒకరికొకరు

సహాయం చేసుకుంటారు. ఇది మీ తిరుగు ప్రయాణం యొక్క వేగాన్ని పెంచుతుంది. ఏవిధంగా అంటే, మీ నేను-తత్వాన్ని, మీ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని పూర్తిగా అలాగే ఉంచుతూ మరియు దానిని వ్యక్తపరుస్తూ, మీ ఏకత్వం యొక్క ఉన్నతస్థితిని చేరడానికి ఇది సహాయం చేస్తుంది.

ఆఖరికి మనమందరం ఒక్కటే. మన అందరిలో ఉన్న సర్వవ్యాపకమైన శక్తి మనకు సహాయం అందిస్తోంది. కాని అదే సమయంలో మన అందరిలో ప్రత్యేకమైన వ్యక్తిత్వం కూడా ఉంది. జంట ఆత్మ కొంతవరకూ ఈ ప్రత్యేకమైన వ్యక్తిత్వానికి మరియు ఏకత్వానికి ముడిపెడుతుంది. ఇది ఏకత్వాన్ని చేరుకునే మెట్టులా ఉంటుంది. మీ జంట ఆత్మతో జాగృతావస్థలోనూ మరియు భౌతికపరంగానూ, మీరు బంధాన్ని ఏర్పరుచుకున్నట్లయితే, మీరు సరికొత్తదనం యొక్క సృష్టిని తీసుకువస్తారు: వీరిద్దరూ చేసిన చర్య వలన మూడవశక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తి వీరిద్దరికే కాకుండా విశ్వమంతా ఏకత్వపు ఎరుకను పెంపొందించుకోవడానికి సహాయం చేస్తుంది. ఎందుకంటే వీరు ఇంటి యొక్క మార్గంలో ఉన్నారు కనుక. ఈ జంట ఆత్మలు, భూమి మీద ప్రేమ మరియు ఏకత్వం యొక్క శక్తులను ముందుకు నడిపించడానికి అనుగుణంగా ఉత్తేజింపబడతారు. వీరు ఈ మార్గంలో వీరి యొక్క ప్రత్యేకమైన సామర్థ్యాలు మరియు నైపుణ్యాలతో ముందుకు పయనించడానికి సమ్మతిస్తారు. ఈ పద్ధతిలో జంట ఆత్మల యొక్క ప్రేమ, ఇరువురి లోతులలో ఉన్న ఏకత్వాల మధ్య వారధిని నిర్మిస్తుంది.

ఈ జంట ఆత్మల మధ్య లోతైన అంతర్ సంబంధం ఉంటుంది, కాని అది వారికి వారే సంపూర్ణమైన భాగాలు అనే వాస్తవాన్ని ఎంత మాత్రం మార్పు చెందించదు. వీరి యొక్క కలయిక ప్రేమ మరియు ఆనందాన్ని తీసుకువస్తుంది. ఈ కలయిక సృజనాత్మకతను మరియు సొంత అవగాహనను పెంపొందిస్తుంది. వీరు మనోభావపరంగా ఆధారపడేతత్వం లేదా అలవాటుపడిన తత్వానికి సంబంధించిన ఆటంకాలలో పడిపోకుండా, ఒకరికొకరు సహకారాన్ని అందించుకుంటారు. జంట ఆత్మల మధ్య ఉండే ప్రేమ అనేది ఒకరినొకరు సంపూర్ణం చేసుకోవడానికి ఏర్పడినది మాత్రం కాదు. కాని, ఈ ప్రేమ ఏదో కొత్తదనాన్ని సృష్టించడానికే ఏర్పడింది: ఈ రెండూ ఒకటిగా అవ్వడానికి బదులు, మూడుగా తయారవుతాయి.

**విశ్వగర్భం నుంచి జన్మించిన బాధను నయం చేసుకోవడం:**

ఏదో ఒక స్థితిలో మీరు మీ జంట ఆత్మను కలుస్తారు. ఈ జ్ఞానం మీకు సరిపోతుంది. మీరు ఆశలు లేదా ఊహలపై జీవించడానికి ప్రయత్నించవద్దు, అవి

మిమ్మల్ని మీ కేంద్రం నుంచి బయటకు వచ్చేలా చేస్తాయి. అసలు విషయమేమిటంటే మీరు చాలా తీవ్రంగా కోరుకుంటున్న ప్రేమ మరియు భద్రత, మీ అంతరంలోనే ఉన్నాయని ఈ క్షణంలో మీరు పూర్తిగా గుర్తించాలి. ముఖ్యంగా మీరు గుర్తించాల్సినది ఏమిటంటే ఈ సంపూర్ణమైన వ్యక్తిగత అంగీకారాన్ని ఇతరులు మీకు ఇవ్వలేరని, అలాగే మీ జంట ఆత్మ కూడా దీనిని మీకు ఇవ్వలేదని మీరు తెలుసుకోవాలి.

కేవలం ప్రేమ బాంధవ్యాలలోనే కాకుండా, తల్లి-బిడ్డ సంబంధంలో కూడా అసలైన ఏకత్వాన్ని లేదా భద్రతను ఇతరులలో కనుగొనాలనే కుతూహలం ఉంటుంది. తల్లిదండ్రులు, వారు సాధించలేకపోయిన కలలను తమ పిల్లలు సాధించాలని రహస్యంగా కోరుకుంటారు. లేదా పిల్లలు ఎదిగినప్పటికీ కూడా, వారు వారి తల్లిదండ్రులను అలాగే అంటిపెట్టుకుని ఉండాలని మరియు వారికి తల్లిదండ్రులు సంపూర్ణమైన భద్రతాస్థలంగా ఉంటారని భావిస్తుంటారు. మీరు ఒకసారి ఇలాంటి బంధాల గురించి ఆలోచించండి.

మీ బాంధవ్యాల యొక్క అంతర్ తలాలను మరియు వాటి ఉద్దేశ్యాల యొక్క ఎరుకను పొందడం చాలా ముఖ్యం. అదే విధంగా వీటిని మీ చైతన్యం యొక్క కాంతిలో నయం చేయడం కూడా చాలా ముఖ్యం. మీ విశ్వసంబంధిత ఇంటి బెంగ అనేది బాంధవ్యం ద్వారానో లేదా బాంధవ్యంలో ఉండడం ద్వారానో నయం కాదు. ఎందుకంటే ఇది మీ ఒక్కరి ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది కనుక. మీరు ఎవరనే దాని యొక్క పూర్తి అవగాహనను పొందడం ద్వారానూ, మీ కాంతిని, సౌందర్యాన్ని మరియు దివ్యత్వాన్ని గుర్తించడం ద్వారానూ నయం చేయగలరు. మీ ప్రయాణం యొక్క గమ్యం ఇదే.

మీరు ఏ ఏకత్వపు స్థితి నుంచైతే వచ్చారో, ఆ ఏకత్వపు స్థితికి మీరు తిరిగి వెళ్ళరు. మీరు ప్రేమ యొక్క పొర నుంచి జన్మించారు, దీని నుంచే మీ ఆత్మ యొక్క ప్రథమదశ మొదలయ్యింది. ఇప్పుడు మీరు  పరిణతి చెందిన దివ్యాత్మలుగా రూపొందుతున్నారు. మీరు, మీ హృదయం నుంచి సంపూర్ణమైన ప్రేమ మరియు భద్రత యొక్క క్షేత్రాన్ని సృష్టిస్తారు మరియు దీనిని ఏ విధమైన షరతులు లేకుండా పంచుకోవడానికి ఇతరులను అనుమతిస్తారు. అదే దైవం యొక్క సారాంశం: అపరిమితమైన ప్రేమ ఏ విధమైన ప్రణాళిక గాని, లెక్కింపు గాని లేకుండా విస్తరింపబడుతుంది, సృష్టింపబడుతుంది మరియు వృద్ధి చేయబడుతుంది.

మీ నేను–తత్వాన్ని, మీ ప్రత్యేకతను నిజంగా అనుభూతి చెందడానికి, నేను మిమ్మల్ని ఇప్పుడు కొన్ని క్షణాలు మౌనంగా ఉండమని కోరుతున్నాను. మీరు మనుష్యుల మధ్యలో ఉన్నట్లయితే, అప్పుడు ఒక్కక్షణం మీరు మీ యొక్క "నేను"ని చాలా బలంగా అనుభూతి చెందండి. మీరు పూర్తిగా దైవం యొక్క భాగం. ఇది మీ నుంచి తీసుకొనగలిగేది కాదు, ఇది మీరు నిరాకరించలేని ఉనికి, ఇది ఎల్లప్పుడూ మీతోనే ఉంటుంది.

మీ "నేను–తత్వం" అనేది నిరాకరించ లేని వాస్తవం, ఎందుకంటే ఇది మీ ఆనందం మరియు శక్తి యొక్క మూలకేంద్రంగా ఉండగలదు. దీనిని ఇప్పుడు ఒక్కక్షణం అనుభూతి చెందండి. మీ సొంత వ్యక్తిత్వం యొక్క అద్భుతాన్ని అంగీకరిస్తూ, దానిని కౌగిలించుకోండి: "అవును 'నేను నేనే'. నేను ప్రత్యేకమైన మరియు సాటిలేని సొంత వ్యక్తిత్వాన్ని." నా యొక్క 'నేను–తత్వాన్ని' మరచిపోకుండా, ఇతరులతో చాలా లోతుగా బంధాన్ని ఏర్పరుచుకోగలను. ఈ వాస్తవం వెనుక ఏకాకితనం మరియు ఒంటరితనం ఉంటాయని మీరు భావించవచ్చు, కాని దయచేసి ఈ ఆలోచనలను దాటి ముందుకు వెళ్ళండి మరియు మీ అంతరంలోని బలాన్ని మరియు జీవశక్తిని అనుభూతి చెందండి. మీరు నిజంగా మీ వ్యక్తిత్వాన్ని అంగీకరించినట్లయితే, మీరు ఆత్మవిశ్వాసం మరియు నమ్మకం యొక్క అనుభవాన్ని పొందుతారు. దీని ఆధారంగా, మీరు ప్రేమ బాంధవ్యాలను సృష్టిస్తూ, ఏకాకితనం మరియు ఒంటరితనాలను కరిగిపోయేలా చేస్తారు.

ఒంటరితనం మరియు ఏకాకితనం యొక్క అనుభూతులు మిమ్మల్ని ప్రభావితం చేస్తునప్పుడు, మీ అంతరంలోని శిశువుని మీ ఒడిలోకి తీసుకోండి. ఈ శిశువులోని బాధను గుర్తించండి. ఇది మీరు మొదటిదశలో కలిగి ఉన్న సంపూర్ణ భద్రతను కోరుకుంటోంది. ఇది మీ భాగస్వామి యొక్క ముఖంలోనూ, మీ పిల్లల యొక్క ముఖంలోనూ, మీ తల్లి లేదా తండ్రి యొక్క ముఖంలోనూ, మీ గురువు యొక్క ముఖంలోనూ ఈ భద్రత ప్రతిబింబించాలని కోరుకుంటోంది మరియు దానిని ప్రేమగా చూడాలని ఆశిస్తోంది. ఆ తర్వాత మీ ముఖాన్ని ఆ శిశువుకి చూపించండి. ఈ శిశువు కోసం మీరు మీ అంతర్ దైవం యొక్క ముఖాన్ని కలిగిఉన్నారు. మీరు కలలు కన్న విధంగా మీ అంతర్ శిశువును నయం చేస్తారు. నేను లేదా వేరే ఏ ఇతర గురువు గాని, మీ కోసం ఏమీ చేయలేరు. ఎందుకంటే మేము కేవలం దిశను చూపించగలం గనుక. మీరే మీ జీవితానికి సంరక్షకులుగా ఉండాలి.

ఆఖరిగా నేను మనందరి కలయికను ఒక్కక్షణం అనుభూతి చెందమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. మీరు ఇక్కడ లేకపోయినా మరియు మీరు ఈ పుస్తకాన్ని చదువుతున్నా కూడా, ఒక్కక్షణం మన అందరి కలయికను అనుభూతి చెందండి. ఇప్పుడు 'నేను-తత్వం' మీద దృష్టిని పెట్టకుండా, చాలా స్వేచ్ఛగాను మరియు అతిసులభమైన మార్గంలోనూ జరిగిన మన కలయిక మీద దృష్టిపెట్టండి. ఏ శక్తి అయితే మనందరిని దగ్గరకు తీసుకువచ్చిందో ఆ శక్తిని అనుభూతి చెందండి. ఈ శక్తి సంపూర్ణత్వం యొక్క స్థితిని కోరుకుంటోంది. ఇప్పుడు మన అందరిని అతి బలమైన శక్తి హత్తుకుని ఉన్నట్లు ఊహించుకోండి. ఈ శక్తి, మీ మేల్కొన్న భాగాల యొక్క శక్తిగాను మరియు మీ ప్రజ్ఞాత్మ యొక్క శక్తిగాను మీ అంతరంలో ఉన్నట్లు ఊహించుకోండి. మనం ఈ శక్తిని శ్వాస రూపంలో లోపలకి స్వీకరిద్దాం మరియు ఒక్కక్షణం దీని యొక్క ప్రభావాన్ని చాలా లోతుగా అనుభూతి చెందండి.

మీరందరూ ఇక్కడకు వచ్చినందుకు నా కృతజ్ఞతలను తెలుపుతున్నాను.

* * * *

# మీ సొంత చైతన్యం యొక్క సామర్థ్యం

డియర్ ఫ్రెండ్స్, నేను ఈ రోజు మీ అందరితో మాట్లాడడం కోసమే ఇక్కడకు వచ్చాను. మీ అందరూ నాకు బాగా తెలుసు! నేను మీకు ఎంత బాగా తెలుసో మీకు తెలియదు. నేను తరచూ మీతోనే ఉంటాను, ఎందుకంటే నా హృదయం మీకు కలుపబడి ఉంది కనుక. నేను మీ బాధను చూస్తాను; నేను మీ ఆనందాన్ని, మీ బాధలను మరియు మీ కష్టాలను సాక్షిగా గమనిస్తాను. మీలో ఉన్న సామర్థ్యం గురించి నేను మీకు చెప్పాలని అనుకుంటున్నాను. ఇది మీ సొంత చైతన్యం యొక్క సామర్థ్యం. ఇది మీ సొంత ఉనికి యొక్క సామర్థ్యం. ఇది మీ సొంత ఆత్మ యొక్క సామర్థ్యం.

ఇప్పటికీ మీరు చాలా తరచుగా దీనిని అన్వేషిస్తున్నారు. మీరు ఎల్లప్పుడూ పరిష్కారాల కోసం మీకు బాహ్యంగా వెతుకుతున్నారు. కాని మీరు ఈ పరిష్కారాల కోసం అంతరంలో అన్వేషించడం మొదలుపెట్టిన వెంటనే, ఇవి కరిగి పోవడం ఆరంభిస్తాయి. మీరే మీ ఉనికి యొక్క కేంద్రం, మీరే మీ సొంత విశ్వం యొక్క సూర్యుడు అని గుర్తించండి. మీ చైతన్యం యొక్క దిశ మరియు ఇది దేనికి శృతి చేసుకుని ఉన్నదో అనే విషయాలు మీరు ఎలా అనుభూతి చెందాలి, ఎలా ఆలోచించాలి మరియు ఎలా నటించాలి అనే వాటిని నిర్ణయిస్తుంది. సూర్యుడు తన కిరణాలను బయటకు ప్రసరింపజేసినట్టుగా, మీ లోతైన అంతరం నుంచి ఈ విషయాలను నడిపిస్తారు. మీ యొక్క గతజన్మలు లేదా పాత్రల మీద మీ అంతర్ సూర్యుడు తన కాంతిని ప్రకాశింపజేయడని, కొన్ని ప్రదేశాలలో ఈ సూర్యకాంతి పడకూడదని మరియు కొన్ని విషయాలు ఈ సూర్యకిరణాల యొక్క వెచ్చదనాన్ని రుచి చూడకూడదని మీరు విశ్వసించినట్లయితే, అప్పుడు మీరు కలిసే ప్రతీ మనిషి లేదా ప్రతీ వస్తువు మీ నమ్మకాలు నిజమని ధ్రువీకరించేలా చేస్తాయి.

ఇదే విధంగా, మీకు సహాయం అవసరమైన పాత్రల మీద మీ సొంత సూర్యకాంతిని ప్రకాశింపజేయడానికి మీరు అనుమతించినప్పుడు మాత్రమే, దానికి సంబంధించిన సహాయం లేదా వ్యక్తి యొక్క సలహా అందుకోగలరు. ఆ పాత్రను కాంతిలో ఉంచడం మరియు మీ హృదయ ద్వారాన్ని తెరవడం అనేది ఎల్లప్పుడూ మీ నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. ఇది చేయడానికి మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయలేరు. మీరు సహాయాన్ని పొందడానికి మిమ్మల్ని మీరు అనుమతించకపోవడం వలనే, మీకు ఎవరూ సహాయం చేయడం లేదు (భూమి యొక్క సహాయం మరియు అదే విధంగా ఇతరలోకాల యొక్క సహాయం).

స్థిర నమ్మకాలు అనేవి మీ లోపల సజీవంగా ఉంటూ, మీ సొంత మార్గాన్ని కనుగొనడానికి మరియు మీ సొంత గమ్యాన్ని తిరిగి అనుభూతి చెందడానికి, మీకు సామర్థ్యం లేనట్టుగా మీరు భావించేలా చేస్తాయి. ఈ నమ్మకాలు, మిమ్మల్ని మీరు చాలా కాలం పాటు కోల్పోయిన మీ గతానికి కలుపబడి ఉన్నాయి. ముఖ్యంగా నేను ఇప్పుడు భూమి మీద ఉన్న మీ గతం గురించి మరియు భూమి మీద మీరు చీకటిని అనుభవించిన అనేక గతజన్మల గురించి మాట్లాడుతున్నాను.

ఈ చరిత్రకు అర్థం ఉంది. ఈ చరిత్రలో, మీరు ఎక్కువగా భయంతో తలపడ్డారు మరియు ఈ భయం మీ అంతర్ సూర్యుడిని కమ్మేసింది. కాని ఇప్పుడు మీరందరూ క్రమక్రమంగా మేల్కొంటున్నారు. మీ యొక్క భాగాలు మళ్ళీ కాంతిలోనికి వచ్చాయి. కాని, ఇంకా చాలా భాగాలు మీ పట్ల మీకున్న భయం మరియు అభద్రతాభావాల వలన చీకటితో కమ్ముకునే ఉన్నాయి.

ఈ అంతర్ చీకటిని, పోగొట్టుకున్న శిశువుతో పోల్చవచ్చు. మీ ఆత్మ యొక్క ఒక భాగం పోగొట్టుకున్న శిశువు లాంటిది. ఇది గతానికి సంబంధించిన బాధలో తన మార్గాన్ని కోల్పోయింది. కాని గతం అనేది చలనం లేని వస్తువు కాదు. కొంత వరకూ, సమయం అనేది ఒక భ్రమ లాంటిది. మీరు సమయంలో కోల్పోయేది ఏమి ఉండదు. మూసివేయబడిన ద్వారాలంటూ ఏమి ఉండవు. గతంలో మీరు పోగొట్టుకున్న మీ అంతర్ శిశువును కనుగొని, ఇప్పుడు దానిని హీల్ చెయ్యగలరు. మీరు దీని యొక్క తల్లి-తండ్రి. మీరు ఒక్కరే ఈ శిశువుపై వాత్సల్యాన్ని చూపించగలరు మరియు దీనిని మీ జీవితంలోకి మళ్ళీ తీసుకురాగలరు.

నా ఉద్దేశంలో జీవితం అంటే నిజంగా జీవించడమని. మీరు ఎలా జీవించాలి అనే విషయాన్ని మరచిపోయారు. మీరు నిర్జీవంగా బ్రతకడంలో నైపుణ్యాన్ని సాధించారు. నిజంగా జీవించడం అంటే మరింత ఉత్సాహంగాను మరియు ఆనందంగాను మరియు స్వచ్ఛంగాను ఉండడమే.

మీ యొక్క భాగమైన మీరు పోగొట్టుకున్న అంతర్ శిశువుకు మాత్రమే ఇలా ఖచ్చితంగా జీవించగల సామర్థ్యం ఉంది. మీరు దీనిని గతం యొక్క ఛాయలలోను మరియు మీ చైతన్యాన్ని గాయపరిచిన సంఘటనలను ప్రోగు చేయడంలోను కోల్పోయారు. అన్ని యుగాలలోనూ మీరు భూమి మీద జన్మించారు. పిల్లలు బాల్యం నుంచి యుక్తవయస్సుకు చేరినట్లుగా, మీరు ఆత్మస్థాయిలో అభివృద్ధి చెందుతున్నారు. ఈ పద్ధతిలో మీరు ఒక శిశువుగా భూమి మీదకు వచ్చి చాలా అనుభవాలను మీ

సొంతం చేసుకున్నారు మరియు మీకు పూర్తిగా అర్ధం కాని చాలా అనుభవాలను కూడా పొందారు. ఇప్పుడు మనం మీ చరిత్రలోని అతి ప్రధానమైన చివరిదశకు, మీ అభివృద్ధి పథంలోని చివరిదశకు చేరుకున్నాం. మీరు అర్ధం చేసుకోలేక పోయిన అనుభవాలను అధిగమించే సమయం ఇదే: అంటే మీరు తండ్రిగా ఎదగడానికి సరైన సమయం ఇదే అని. మీ సొంత శిశువుకు తల్లి మరియు తండ్రిగా ఉండబోయే సమయం ఇదే. మీ చైతన్యం యొక్క సామర్ధ్యం గురించే నేను మీకు సూచిస్తున్నాను: మీ గాయపడిన అంతర్ శిశువును అధిగమించే సామర్ధ్యం మీలో ఉంది.

మీ అంతర్ శిశువు, మీరు సరిగ్గా అర్ధం చేసుకోలేకపోయిన చాలా అనుభవాల యొక్క బాధితురాలిగా ఉంది. మీ లోతైన అంతర్ గాయాన్ని, వదిలివేయబడిన శిశువు యొక్క మనోభావస్థితితో పోల్చవచ్చు అని నేను మీకు తెలుపుతున్నాను. ఒకానొక స్థితిలో ఈ శిశువు, మీ ఇంటి యొక్క భద్రత మరియు ప్రేమపూర్వకమైన కౌగిలి నుంచి విడిపోయింది. ఈ శిశువుకు ఎందుకు మరియు దేని కోసం విడిపోయిందనేది తెలియదు. మీ అంతర్ శిశువు వదిలివేయబడినట్టు మరియు భయభీతికి లోనవుతున్నట్టు అనుభూతి చెందుతోంది. దీనిని అర్ధం చేసుకునేవారు లేరని బాధపడుతోంది. ఈ బాధ గతంలోని ఒకానొక స్థితికి సంబంధించినది. ఆ సమయంలో మీరు దైవం అనే ఏకత్వపు స్థితి నుంచి విడిపోయి, ప్రత్యేకమైన ఆత్మలుగా మీరు ప్రయాణాన్ని మొదలుపెట్టారు. (దీని గురించి విశ్వసంబంధిత జన్మబాధ అనే ఛాప్టర్‌లో మరింత విపులంగా విశదీకరిస్తాను).

ఒకానొక స్థితిలో మీరు ఈ ప్రయాణం మీ సొంత ఎంపికయే అని తెలుసుకుంటారు మరియు ఈ సృష్టి యొక్క నటన నిజంగా దివ్యమని తెలుసుకుంటారు. మీ ఒంటరి ప్రయాణాన్ని, మీ అనుభవం యొక్క ప్రయాణాన్ని మొదలుపెట్టినప్పుడు, మీరు ఈ లోతైన బాధను అనుభూతి చెందారు. అదే సమయంలో ఈ లోతైన బాధ సృష్టి యొక్క గొప్ప నటనగా ఉన్నది. ఎందుకంటే ఉన్నతమైన పూర్ణత్వం నుంచి, మీ తండ్రి-తల్లి-దైవం నుంచి ఆత్మలుగా మీ అంతట మీరు స్వేచ్ఛను పొందడం ద్వారా, మీరు ఒక గొప్ప ఆశయాన్ని సాధించడానికి, చాలా విషయాలను అనుభవించడానికి మరియు అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకున్నారు. మీ ప్రయాణం యొక్క ప్రస్తుత స్థితిలో కూడా మీరు అంతర్ బాధను ఎక్కువగా కలిగిఉన్నారు. మీ ఇంటిని వదిలి సుదీర్ఘ ప్రయాణం చేసిన దానికి గల మూలకారణం ఏమిటనేది తెలుసుకోవడానికి మీకు చాలా కష్టంగా ఉంది. మీరు సృష్టికర్తలోని గొప్ప విశ్వాసాన్ని మరియు గొప్ప ధైర్యాన్ని కలిగిఉన్న అద్భుతమైన కాంతి జీవులు అనే విషయాన్ని నేను

మీకు తెలియజేస్తున్నాను. అలా కాకపోతే, మీరు ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టేవారే కాదు. నేను మీకు గుర్తు చేయాలనుకుంటున్న విషయం ఏమిటంటే, ఆ సృష్టికర్తలో ఉన్న ధైర్యం, సృజనాత్మకత మరియు కాంతి యొక్క మెరుపు మీలో కూడా ఉంది. ఆ మెరుపును మీ హృదయంలో మళ్ళీ అనుభూతి చెందుతూ, దానితో పున: బంధాన్ని ఏర్పరుచుకోండి. మీ అంతరంలోని శిశువును తిరిగి జీవితంలోకి తీసుకురావడానికి మరియు దానిని ఆడుకోవడానికి మరియు పాడుకోవడానికి అనుమతినిచ్చే సామర్థ్యాన్ని మీరు కలిగి ఉన్నారని తెలుసుకోండి. మీ అంతర్ చీకటిని, మీరు పోగొట్టుకున్న శిశువు యొక్క పిలుపుగా చూసే దృక్పథాన్ని నేను మీకు అందిస్తున్నాను. మీరు ఒక నిజమైన తండ్రిగా, మీ పట్ల మీరు వాత్సల్యాన్ని మరియు ప్రేమను చూపించుకోవడమే ఈ దృక్పథం.

ఒక ఆత్మగా మీ ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఆరంభదశలో, మీరు “కోల్పోయిన మరియు చీకటిలో ఒంటరిగా వదిలివేసిన శిశువు” యొక్క బాధ్యతను స్వీకరించారు. ఈ మనోభావపరమైన భాగంతో వ్యవహరించడం మీకు ఒక గొప్ప సవాల్‌గా ఉండేది. మీ శిశువు భాగం, మీ యొక్క అతి ముఖ్యమైన మరియు సహజమైన లక్షణానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ భాగమే మీ జీవితం యొక్క సారాంశం. మీ ప్రయాణం యొక్క చివరి దశలో, మీ జీవిత కాలచక్రం యొక్క చివరి దశలో, మీరు మీ అంతర్ శిశువు యొక్క చేతిని పట్టుకుంటారు. ఇది ఆనందాన్ని, ఆహ్లాదాన్ని మరియు ఉత్తేజకరమైన చైతన్యాన్ని మీకు అందించడాన్ని మీరు స్పష్టంగా చూడగలరు. ఇది మళ్ళీ భద్రతను అనుభూతి చెందుతూ, తన యొక్క నిజమైన సంపదను మీకు చూపిస్తుంది: దీని అర్థం సంపూర్ణంగా జీవితాన్ని అనుభూతి చెందే మరియు జీవించే తన యొక్క సామర్థ్యాన్ని మీకు తెలియజేస్తుంది అని. ఈ శిశువు అక్కడకు చేరడానికి అవసరమైనది ఏమిటంటే, పరిపూర్ణమైన పరిణితి గల వ్యక్తి దీనిని హత్తుకుంటూ, దీనిపై వాత్సల్యాన్ని చూపిస్తూ మరియు విశ్వాసంతో దీనిని ఉత్తేజపరచడమే. ఇదే మీ ప్రధాన లక్ష్యం: మీ అంతర్ శిశువుకి సంరక్షకుడిగా ఉండడమే. ఈ శిశువే మీకు బాధను కలిగించింది, ఇది మీ మనోభావ సంబంధిత గాయాలకు వాహకంగా ఉంటున్నది. కాని అదే సమయంలో ఇది గొప్ప వాగ్దానాన్ని బలంగా పట్టుకుని ఉంది: ఇది మీ ప్రేమ, ఆనందం మరియు సృజనాత్మకతల యొక్క లోతైన మూలంగా ఉండాలి అని.

దీనికి సమయం ఆసన్నమైనది. మీ చరిత్ర యొక్క ప్రస్తుత సమయంలో, మీ యొక్క పోగొట్టుకున్న భాగాలన్నింటిని ప్రోగుచేసి కలిపే సమయం మరియు మీరు అంతర్ సూర్యుడిగా ఉండే సమయం వచ్చింది. మీ సొంత చైతన్యం యొక్క

సామర్థ్యాన్ని తిరిగి పొందడంలో, మీరు ఆత్మగా మీ ప్రయాణాన్ని మొదలుపెట్టక ముందు ఉన్న స్థితికి మాత్రం మళ్ళీ చేరరు. మీరు పూర్తిగా చైతన్యం యొక్క కొత్త వాస్తవాన్ని లేదా స్థితిని సృష్టిస్తున్నారు. మీ సొంత దివ్యత్వాన్ని గుర్తించడం అనేది మీరు ఇంటికి చేరిన అనుభూతిలా ఉంటుంది. ఇది మీకు ఒకప్పుడు తెలిసిన ఆహ్లాదకరమైన ఏకత్వం మరియు సమన్వయం యొక్క పాత జ్ఞాపకాలను మీలో మేల్కొల్పుతుంది. కాని ఇప్పుడు మీరు మొదటిసారిగా భౌతిక వాస్తవంలో ఉన్నప్పుడే, మీ సొంత చైతన్యం నుంచే ఏకత్వం యొక్క భావనకు జన్మను ఇస్తారు. మీరు భూమి మీద దైవంగా రూపొందుతారు. మీ వ్యక్తిత్వాన్ని మరియు మీ భౌతిక ఆకృతిని వదిలివేయకుండా, మీ దివ్యత్వపు సారాంశాన్ని తిరిగి చేరుతారు. ఇదే కొత్త శకం యొక్క అద్భుతం: ఏకమవుతూ సంపూర్ణత్వాన్ని పొందడం, ప్రత్యేకమైన మరియు సాటిలేని చైతన్యంగా ఉండడం మరియు అదే సమయంలో ఒకటిగా ఉంటూ మూలచైతన్యంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం.

****

# విశ్వసంబంధిత జన్మబాధ

డియర్ ఫ్రెండ్స్, ఇలా మిమ్మల్ని కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మీలో కొంతమంది చాలా దూరం నుంచి వచ్చారు! మీరు ఎవరో నాకు తెలుసు మరియు మీరు నాకు చాలా సన్నిహితమైనవారు. నా ప్రయాణమే మీ ప్రయాణం మరియు మీ అంతరంలో ఉన్న బాధ మరియు దు:ఖం గురించి నాకు తెలుసు. అందుకనే, ఆత్మలుగా మీరు చేస్తున్న ఈ సుదీర్ఘ ప్రయాణానికి సంబంధించిన నా అవగాహనలను కొన్నింటిని  మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను.

నేను ఈ ప్రయాణం యొక్క ఆరంభదశకు మిమ్మల్ని తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను. మీకు తెలియని మరియు సరికొత్త వాస్తవంలో ఆత్మలుగా మీరు జన్మించినప్పటి పూర్తి ఆరంభదశకు మిమ్మల్ని తిరిగి తీసుకు వెళ్తున్నాను. మీరు సమయం మరియు తలాలలోను, భౌతకవాస్తవంలోను ప్రయాణాన్ని మొదలుపెట్టిన క్షణానికి మిమ్మల్ని తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను. ఈ సంఘటన సుదీర్ఘకాలం క్రిందట సంభవించింది. కాని, ఆ సమయంలో మీరు పొందిన మనోభావాలు మరియు ఇంటి నుంచి విడిపోయిన బాధ, మీ అందరిలో ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దీనిని నేను విశ్వ సంబంధిత జన్మబాధగా పిలుస్తాను, మీ నిత్యజీవిత అనుభూతులు మరియు ప్రవర్తనల అన్నింటి యొక్క వెనుక ఈ జన్మబాధ ఉన్నది.

మీలో చాలామంది “ఏదో అన్వేషించడంలో” నిరంతరం అలసటను మరియు అవిశ్రాంతి యొక్క అనుభూతులను అంతరంలో ఎదుర్కొంటున్నారు. మీరు పూర్తిగా ఇంట్లో లేరనే అనుభూతి వలనే మీ అంతరంలో ఒత్తిడి ఏర్పడుతోంది. మీ సొంత ఉనికితో, మీ సొంత మూలంతో ఇంటి దగ్గర ఉన్న అనుభూతిని లేదా భద్రతను అనుభూతి చెందలేకపోతున్నారు.

ఈ ప్రాథమికమైన ఒత్తిడి వలనే, మీరు ఇతరుల యొక్క గుర్తింపు ద్వారా బాహ్యంగా చలామణి అవ్వాలనే వైఖరి మరియు భౌతిక సంపదను సంగ్రహించాలనే తత్వం, లేదా మీకు ప్రేమ మరియు భద్రత యొక్క అనుభూతిని ఏది ఇస్తుందో అటువంటి వాటిని వెతకాలనే ధోరణి మీ అంతరంలో ఉద్భవిస్తాయి.  “మీకు బాహ్యంగా హామీని ఇచ్చేది, ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని ఇచ్చేది మరియు మీరు సరిగ్గా ఉన్నారని తెలియజేసేది” – మీకు నిరంతరం అవసరమని భావిస్తారు. మీరు తరచుగా ఈ హామీని ఎంత తీవ్రంగా కాంక్షిస్తున్నారో ఒకసారి గమనించండి,

అప్పుడే మీరు నిజానికి మీ అంతరంలో ఎంతగా ఒత్తిడిని మరియు బాధను అనుభవిస్తున్నారనేది మీకు తెలుస్తుంది.

నేను ఈ బాధ యొక్క మూలం గురించి మరియు బాహ్యపు చలామణిని ఎంత వ్యసనంగా అనుసరిస్తున్నారు అనే దాని గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను. నిజమైన కారణం అనేక పొరలతో చుట్టుముట్టిన ఉల్లిపాయ యొక్క మధ్య భాగంలా ఉంటుంది. ఈ బాహ్యపు పొరలు అనేవి మీ జీవితంలో జరిగిన కొన్ని ముఖ్యమైన సంఘటనల వలన ఏర్పడినవి. ఈ సంఘటనలు బాధను, అలసటను, మీ అంతరంలో ఇంటి దగ్గర లేననే భావనను అనుభూతి చెందడానికి కారణమయ్యాయి. ఉల్లిపాయ మధ్య భాగానికి దగ్గరగా ఉన్న లోతైన పొరలలో – మీరు గతజన్మల నుంచి మనోభావపరంగా గాయపడిన వాటి యొక్క సంఘటనలే ఇక్కడ ఉన్నాయి. ఈ పొరలన్నీ కూడా మీ అంతరంలో బాధను రేకెత్తించేవేనని నేను ముఖ్యంగా మీకు తెలియజేస్తున్నాను. మీరు ఈ పొరలన్నింటిని తీసివేస్తూ మూలాన్ని చేరినట్లయితే, మీరు అసలైన బాధను మరియు మీ ప్రయాణం యొక్క ఆరంభదశకు సంబంధించిన ఇంటి బెంగను కనుగొంటారు.

మీరు నిరాశ లేదా ఆందోళనల నుంచి పూర్తి స్వేచ్ఛను పొందుతూ, మీరు అనంతమైన ప్రేమ మరియు భద్రతల యొక్క సముద్రంలో భాగంగా ఉన్నట్లు మిమ్మల్ని మీరు ఊహించుకోండి. సృష్టి అంతటా వ్యాపించి ఉన్న ప్రేమపూర్వకమైన చైతన్యం, మిమ్మల్ని కౌగిలించుకుంటున్నట్లు ఊహించుకోండి. ఇదే ఇంటి యొక్క శక్తి, ఈ శక్తి నుంచే మీరు జన్మించారు. ఈ పురాతనమైన స్థితి యొక్క అనుభూతి స్వరాలను అర్థం చేసుకోవడానికి, నిద్రలోకి జారుకునే ముందు ఉండే తేలికైన స్థితి యొక్క చైతన్యం గురించి ఆలోచించండి. ఈ స్థితిలో మీ మనస్సు తన అదుపును విడుదల చేస్తుంది మరియు అప్పుడు మీ చైతన్యం అన్నింటిని స్వీకరించేదిగా ఉంటుంది. మీరు భూమి మీద చాలా జన్మలలో తల్లి గర్భంలో పిండదశగా ఉన్న ప్రతీసారి, మీరు ఈ స్థితినే అనుభూతి చెందుతారు. చైతన్యం, ఈ సున్నితమైన మరియు ఆహ్లాదకరమైన గాఢనిద్రలో ఉన్నప్పుడు దానిలో అంతర్–బాహ్యాల మధ్య స్పష్టమైన విభజన ఉండదు, నేను–నువ్వు అనే భిన్నత్వపు భావన ఉండదు. పిండదశ, గాఢనిద్ర యొక్క చైతన్యపు స్థితిలో ఏకత్వం మరియు భద్రతల యొక్క సర్వవ్యాపకత్వం ఉంటుంది.

ఆ ప్రాచీన కాలంలో, అతి పెద్ద విశ్వసంబంధిత గర్భంలో, మీరు ఆత్మలుగా అంతర్ భద్రతను మరియు సర్వవ్యాపకత్వాన్ని అనుభూతి చెందారు. ఒకానొక స్థితి దగ్గర ఇది ఎలాగో మార్పు చెందింది. మీరు ఒక విధమైన చీల్చబడిన భావనను

అనుభవించారు. మీ అనంతమైన సర్వవ్యాపకత్వపు ఎరుక యొక్క సముద్ర గర్భం నుంచి పురిటినొప్పుల ద్వారా, మీరు ప్రత్యేకమైన ఆత్మలుగా విడిపోయి మీ యొక్క గాఢనిద్ర నుంచి మేల్కొన్నారు. ప్రత్యేకమైన ఆత్మలుగా జన్మించిన మీ జన్మకు ఆరంభం ఇదే. మిమ్మల్ని అత్యధికంగా ప్రభావితం చేసిన ఏకత్వపు ఉనికి నుంచి మీ అంతట మీరుగా విడిపోయి, మొదటిసారి మిమ్మల్ని మీరు అనుభవించారు. ఆ క్షణంలో "నేను" అనే ప్రాధమికమైన భావన ఆరంభమైంది.

విశ్వగర్భం నుంచి చీల్చబడిన మరియు విడదీయబడిన అనుభవం మిమ్మల్ని గందరగోళంలోను మరియు సందేహంలోను పడవేశాయి. ఇది సంభవించినప్పుడు మీకు ఈ స్థితిని గుర్తించే ఎరుక లేదు; అప్పుడు మీరు పూర్తిగా అనుభవించే స్థితిలోనే ఉన్నారు. ఆ తర్వాత, మీరు అప్పటి వరకూ పట్టుకుని ఉన్న పూర్వపు అనుభూతి గురించి మరియు మీకు తెలిసిన భద్రత దగ్గరకు తిరిగి వెళ్ళే మార్గం గురించి గుడ్డిగా అన్వేషించడం మొదలుపెట్టారు. మీరు ఏదో పోగొట్టుకున్న అనుభూతిని పొందారు. మీ దివ్యత్వం యొక్క జ్ఞానేంద్రియాలన్నీ మూసుకుపోతున్నట్లు అనుభూతి చెందారు. ఆ సమయంలోనే మీ అంతరంలో చీకటి ఏర్పడింది.

మూలచైతన్యం లేదా ఇంటి నుంచి, మీ అంతట మీరుగా చీల్చబడిన క్షణమే, అతి పెద్ద సృజనాత్మకతకు ఆవిర్భావంగా కూడా ఉన్నది. ఇదే అనుభవం మరియు జీవితం యొక్క గొప్ప ప్రయాణానికి ఆరంభదశ. మీ ముందు తెలియని, వింతైన, విస్తృతమైన మరియు పేరు లేని చీకటితో కూడిన ఒక శూన్య ప్రదేశం ఉన్నట్లు ఊహించుకోండి. మీరు ఈ ప్రదేశంలోనికి అప్పుడే జన్మించిన చిన్న ఆత్మలుగా ప్రవేశించారు. ఈ ప్రదేశం మీకు ఇంకా తెలియని అనేక సామర్థ్యాలతోను, రుచి చూడాల్సిన అనేక రకాల అనుభవాలతోను ఉన్నది. అది చీకటితో నిండి ఉన్నప్పటికీ, దానిలో ఏదో కొత్తదనానికి చోటు కూడా ఉన్నది.

మీ విశ్వ సంబంధిత ప్రయాణం యొక్క ఆరంభదశలో, మీరు అనేక రకాల మనోభావాలతో వ్యవహరించిన విషయాన్ని – ముందు ఛానెలింగ్‌లో చెప్పిన "పోగొట్టుకున్న అంతర్‌శిశువు" యొక్క మనోభావాలతో పోల్చవచ్చు ("మీ సొంత చైతన్యం యొక్క సామర్థ్యం" యొక్క ఛాప్టర్‌లో చూడండి). కొత్తగా జన్మించిన శిశువు, తెలియని మరియు పరిచయం లేని వాస్తవానికి అలవాటుపడడంలో వివిధ రకాల మనోభావాలను ఎదుర్కొంటుంది. ఎందుకంటే ఈ మనోభావాలు ఆ శిశువు ఉన్న పూర్వపు స్థితికి, అంటే అచేతనావస్థ యొక్క గాఢనిద్ర స్థితికి పూర్తి భిన్నంగా ఉ

ంటాయి కనుక. ఏడుస్తూ మరియు గందరగోళంలో ఉన్న పోగొట్టుకున్న శిశువు యొక్క ఊహాచిత్రం, మీకు మీ అంతర్ గాయాలతో ప్రయాణాన్ని ఆరంభించారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

ఈ ప్రయాణంలో మీరు చాలా అనుభవించారు. మీరు చాలా ఆకృతులను, రకరకాల శరీరాలను ధరించారు మరియు చివరికి మీ ప్రయాణం భూమి మీదకు చేరింది. భూమి అనేది ఉన్నతమైన సృజనాత్మకతకు మరియు అనేక సామర్థ్యాలకు ప్రాంతంగా ఉంటుంది. ఇప్పుడు మీకు ఇన్ని సామర్థ్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నప్పటికి మరియు మీరు లోతైన మరియు ఉన్నతమైన అనుభవ జ్ఞానాన్ని కలిగి ఉన్నప్పటికి కూడా, మీరు నిరంతరం ఇంటి బెంగను అనుభూతి చెందుతూనే ఉన్నారు. మీ లోతైన అంతరంలో ఏదో కొరత యొక్క భావన ఉంది. ఇది మీ అంతరంలో ఏదో కోల్పోతున్నారనే భావనను మరియు అదేమిటో మీకు తెలియని అనుభూతిని కలిగిస్తోంది. మీరు దీనిని మంచిగా అనుభూతి చెందడం చాలా అత్యవసరం. నిజానికి కోల్పోతున్నది ఏమిటంటే, మీరు ఒకానొకప్పుడు విశ్వగర్భంలో అనుభవించిన ప్రేమ మరియు మనోభావ సంబంధిత భద్రతల యొక్క ప్రాథమిక భావనయే. సుఖం మరియు భద్రతల యొక్క అపరిమితమైన భావన అనేది మీ యొక్క సంతృప్తికరమైన స్థితికి, మీ సొంత భావప్రకటనకు మరియు మీ సొంత వ్యక్తిత్వపు భావనకి అత్యవసరం. మీరు ఇంటిని వదిలివేసినప్పటి నుంచి దీని కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. మీరు చాలా సుదీర్ఘకాలం నుంచి కూడా, మీ విశ్వసంబంధిత జన్మబాధను హీల్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

నేను ఇప్పుడు మిమ్మల్ని అడుగుతున్నది ఏమిటంటే, మీరు ఇంటిని వదిలినప్పుడు సృష్టింపబడిన అసలు గాయం మీ లోతైన అంతరంలో ఉందనే విషయాన్ని గుర్తించగలరా అని! మూలచైతన్యం నుంచి ఒక భాగంగా చీల్చబడిన భావనను మీ సొంత మానసిక స్థితిలో కనుగొనగలరా? ఇది పూర్ణత్వం లేదా ఏకత్వపు స్థితికి సంబంధించినది. దీనిని మనస్సు ద్వారా వివరించలేరు. మీరు దీని యొక్క భాగమనే విషయాన్ని మీ హృదయం ద్వారా మాత్రమే గుర్తించగలరు.

ఈ అసలైన జన్మబాధ వైపు మీ ఆసక్తిని మరల్చడం ద్వారాను, ఇది మీలో రేకెత్తించిన లోతైన అనుభూతుల యొక్క ఎరుకను పొందడం ద్వారాను, మీరు ఈ క్షణం వరకూ అనుభూతి చెందుతున్న ఒంటరితనం మరియు ఇంటిబెంగ యొక్క భావనలలో హీలింగ్ జరగడం మొదలవుతుంది. ఈ విధంగానే మిమ్మల్ని మీరు

లోతైన స్థాయిలలో హీల్ చేసుకోవడం ఆరంభించగలరు. ఇక్కడే మీరు మీ బాధ యొక్క మూలం దగ్గరకి చేరగలరు. ఇక్కడ ఉన్న మీరందరూ లేదా ఈ పదాలను చదువుతున్న మీరందరూ కొత్త చైతన్యం యొక్క స్థితి వైపుగా ఎదుగుతున్నారు. మీరు మీ కోసం భద్రత మరియు అపరిమితమైన ప్రేమ యొక్క అంతర్ పునాదిని నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారు. మీ అంతట మీరు లేదా మీ కోసం మీరు విశ్వగర్భం యొక్క అనుభూతి స్వరాలను తిరిగి సృష్టిస్తున్నారు. ఇదే మీ ప్రధాన లక్ష్యం, మీ ఆధ్యాత్మిక లక్ష్యం. మీ అంతరంలోనే మీ ఇల్లు ఉందని మరియు మీరు దివ్యత్వపు భద్రత మరియు ఏకత్వం యొక్క ఒక భాగాన్ని మీ మూలంలో మోస్తున్నారని గుర్తించినప్పుడే, మీరు నిజానికి ఎవరనే విషయంలో ప్రశాంతతను మరియు విశ్రాంతిని పొందగలరు. అందువలన ఏమాత్రం బాహ్యపు గుర్తింపులు లేదా చలామణుల యొక్క అవసరం లేదు. మీరు ఇతరుల ద్వారా భద్రతను మరియు ప్రశాంతతను పొందినప్పుడు అది మీకు మంచిగా అనిపించినప్పటికీ కూడా మీరు దాని మీద ఎంత మాత్రం ఆధారపడరు.

ఎవరైతే వారి బాధ యొక్క మూలాన్ని గుర్తిస్తూ మరియు దానిని అంగీకార ధోరణితో ఎదుర్కోవడానికి సాహసిస్తారో, అటువంటి వ్యక్తుల మీదే రాబోతున్న కొత్తశకం ఆధారపడుతుంది. మీ అభివృద్ధి పథం యొక్క ఈ దశలో, మీరు మీ ప్రస్తుత జన్మలోను మరియు గతజన్మలలోను తలెత్తిన బాధలు మరియు గాయాల మీద దృష్టిని కేంద్రీకరించడమే కాకుండా, వీటన్నింటిని అధిగమిస్తూ, మీ అసలైన జన్మగాయాన్ని కూడా గుర్తిస్తారు. మీరు ఎరుకతో ఈ బాధను మీ హృదయం ద్వారా గుర్తించి మరియు దానిని జ్ఞాపకం తెచ్చుకున్న వెంటనే, మీరు దీనిని సంరక్షించడానికి సిద్ధపడతారు. ఇప్పటికీ మీ సహాయం కోసం బిగ్గరగా ఏడుస్తున్న "కొత్త జన్మ తీసుకున్న ఆ విశ్వసంబంధిత శిశువును" మీ చేతులు చాచి హత్తుకోవడానికి సిద్ధమవుతారు. మీ చెడు మనోభావాలైన భయం, కోపం మరియు దు:ఖం ద్వారా ఇది మిమ్మల్ని పిలుస్తుంది.

మీ విశ్వ సంబంధిత జన్మగాయంతో ఎలా వ్యవహరించాలనేది తెలుసుకోవడానికి ఒకానొక మార్గం ఏమిటంటే, మీ జీవితంలోని సంబంధాల యొక్క క్షేత్రాన్ని గమనించడమే. తరచూ మనుష్యులు వారి యొక్క ఒంటరితనం మరియు భయం యొక్క లోతైన మనోభావాల నుంచి ఉపశమనాన్ని, వారి యొక్క సన్నిహితమైన బంధాలలో కనుగొనడానికి ప్రయత్నిస్తారు. వీరు ఇక్కడ ప్రయత్నిస్తున్నది ఏమిటంటే, వీరి యొక్క అంతర్ శూన్యాన్ని ఇతరుల యొక్క శక్తితో నింపడానికి చూడడమే.

ఇతరుల యొక్క గుర్తింపు, శ్రద్ధ మరియు భద్రత వీరి యొక్క బాధకు కొంత ఊరటను కలిగిస్తాయి. మరొక రకంగా చెప్పాలంటే, వీరు తమ గాయపడిన శిశువు యొక్క బాధ్యతను వీరి భాగస్వామికి అప్పగించడమే. అతి త్వరలోనైనా లేదా ఆ తర్వాతనైనా, మీరు భాగస్వాములు ఒకరి పై ఒకరు మనోభావపరంగా ఆధారపడడం మొదలుపెడతారు. వీరి యొక్క ఆరంభదశకు సంబంధించిన ప్రేమ మరియు ఐకమత్యం యొక్క అనుభూతులు – అతి సున్నితత్వాన్ని లేదా అతి కఠినత్వాన్ని ప్రదర్శించేవిగా మారతాయి. ఎప్పుడైతే మీరు ఇతరులచే ప్రేమించబడాలని మరియు భద్రత పొందాలని ఇతరులపై ఆధారపడతారో, అప్పుడు మీరు ఆమె లేదా అతని యొక్క శక్తి మీ సొంతమని మరియు దానిపై మీకు పూర్తి అధికారం ఉందని భావిస్తారు. కాని, ఇది చివరికి ఘర్షణలు మరియు సమస్యలు తలెత్తడానికి కారణమవుతుంది. ఆఖరికి మీరు ముందెన్నడూ లేనంత ఒంటరితనాన్ని అనుభూతి చెందుతారు (ఇతర వివరాల కోసం కొత్తశకంలోని బాంధవ్యాలు యొక్క ఛాప్టర్‌లో చూడండి).

మీరు ఒంటరితనం అనేది స్నేహితులు లేదా జీవిత భాగస్వామి యొక్క కొరతతో ముడిపడి ఉంటుందని భావిస్తారు మరియు దీనికి పరిష్కారం కొత్త స్నేహం లేదా ప్రేమ బంధాలలో ఉంటుందని భావిస్తున్నారు. కాని ఈ విధమైన ఆలోచనారీతిలో మీ బాధకు కారణం మరియు దీనికి పరిష్కారం అనేవి మీకు బాహ్యంగా ఉంటుందని అంచనా వేస్తారు. ఈ విధంగా మీరు కొత్త బంధాన్ని మొదలుపెట్టినట్లయితే, మీ అంతర్ గాయాలకు ఇతరులే బాధ్యులని భావిస్తూ, మిమ్మల్ని మీరు బాధితుడిగా చూస్తారు. మీ అంతరంలోని శూన్యతను పూడ్చడానికి వేరొకరి అవసరం ఉందని భావించడం అనేది మిమ్మల్ని మీరు మొదటి నుంచి శక్తిహీనులుగా చూస్తున్నారని అర్థం.

సన్నిహితమైన బంధాల యొక్క క్షేత్రం, మిమ్మల్ని మీ అంతరంలో మోస్తున్న విశ్వసంబంధిత జన్మబాధ పట్ల మరింతగా ఎరుకను పొందేలా తయారు చేస్తుంది. తరచూ మీరు ఎంతగా మీ జీవితంలో ఇతరుల యొక్క ఉనికి అవసరమని అనుభూతి చెందుతున్నారో ఒకసారి గమనించి చూడండి. నిజానికి ఈ ఎరుక మీ అంతరంలోకి మరలడానికి మరియు పోగొట్టుకున్న అంతర్ శిశువును కనిపెట్టడానికి సహాయం చేస్తుంది. ఇది మీ అంతర్ ఉనికి నుంచి వచ్చే ఒక సంకేతం లాంటిది. మీ ఒంటరితనానికి పరిష్కారం అనేది మీ అంతరంలోకి మరలడంలోను, మీ కోసం మీ మనోభావ సంబంధిత గాయాన్ని మోస్తున్న విలువైన అంతర్ శిశువును కౌగిలించుకుంటూ సంరక్షించడంలోను ఇమిడి ఉంటుంది. మీరు ఆ శిశువు యొక్క

బాధ్యతను స్వీకరిస్తూ దానితో బంధాన్ని ఏర్పరుచుకుంటూ మరియు మీరు ప్రేమ పూర్వకమైన తల్లి-తండ్రిగా దానికి మార్గదర్శకత్వాన్ని చూపించినప్పుడే మీ బంధాల నుంచి స్వేచ్ఛను పొందుతారు. ఆ తర్వాత మీరు ఇతరులతో స్వేచ్ఛగాను మరియు స్వతంత్రంగాను బంధాన్ని ఏర్పరుచుకోగలరు.

****

## ఆనందాన్ని మీ మార్గదర్శకంగా అనుమతించండి

నేను మేరీని. నేను క్రీస్తుశక్తి యొక్క స్త్రీతత్వానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. నేను ఈ రోజు మీ అందరికి నా అభినందనలను తెలియజేస్తున్నాను. నేను మీతో ఆనందాన్ని మరియు ప్రశాంతతను పంచుకోవాలని అనుకుంటున్నాను. ఇవి మీ అందరికి అందుబాటులోనే ఉన్నాయి మరియు ఇవి మీరు ఎవరనే దానిని తెలియజేసే గొప్ప సారాంశానికి సంబంధించినవి. మీరు బాధపడడానికో, కష్టాలుపడడానికో మరియు బ్రతుకుతెరువు కోసమో ఇక్కడ లేరు. మీరు భూమి మీద ఉన్నది ఆనందాన్ని కలిగి ఉండడానికి, మీరు మీరుగా ఉంటూ మరియు దాని యొక్క అద్భుతాన్ని అనుభవించడానికి మాత్రమే. మీరు ఎలా ఉన్నా అందంగానే ఉన్నారు. దేనిని మార్చవలసిన అవసరం లేదు లేదా అభివృద్ధి చెందించవలసిన అవసరం కూడా లేదు. అంతా సరిగ్గానే ఉంది. వాటిని అలాగే మీ ద్వారా పయనించనివ్వండి.

సృష్టి యొక్క సారాంశం ఆనందమే. దైవం మిమ్మల్ని విచారం కోసం గాని మరియు గొప్ప ఆశయాల కోసం గాని సృష్టించలేదు. ఆమె మిమ్మల్ని ఆనందం నుంచే సృష్టించింది మరియు ప్రతీ విషయాన్ని ఆసక్తితో అన్వేషించడం కోసమే సృష్టించింది. ఆమె మీ ద్వారా జీవితం గురించి తెలుసుకోవాలని కోరుకుంది. మీరందరూ దైవానికి సంబంధించిన 'ప్రేమ మరియు సృజనాత్మక ఆనందం' యొక్క భావప్రకటనలు. అందుకనే మీరు ప్రతిక్షణం దీని యొక్క అనుభవాన్ని పొందేందుకు అర్హతను కలిగిఉన్నారు. నేను మిమ్మల్ని ఈ అసలైన శక్తి ప్రవాహంతోను, దైవం యొక్క ఆనందపు సృష్టితోను తిరిగి బంధాన్ని ఏర్పరుచుకోమని ఆహ్వానిస్తున్నాను. ఇది మీ ప్రతీ ఒక్కరి ద్వారా ప్రవహిస్తోంది.

మీరు మీ జీవితాన్ని చాలా భారంగాను మరియు కష్టంగాను తయారు చేస్తున్నారు. మీరు లక్ష్యాన్ని సాధించడం కోసం ఇక్కడ లేరనే విషయాన్ని ఒకసారి ఊహించుకోండి. మీరు చీకటిని, సందేహాన్ని లేదా నిర్బంధించబడిన అనుభూతిని పొందుతున్న మీ యొక్క భాగాలతో కలిసి మీరు మీరుగా ఉండడానికే ఇక్కడ ఉన్నారని ఊహించుకోండి. అందువలన ఈ భాగాలను స్వాగతించండి. ఎందుకంటే ఇవి ద్వంద్వానికి సంబంధించిన అన్ని పాత్రల యొక్క సంపూర్ణమైన అనుభవం మరియు ఇవన్నీ ఈ అనుభవంలో భాగాలే కనుక. ఇవి మిమ్మల్ని అందమైన మరియు అద్భుతమైన కొత్త ప్రపంచం వైపు నడిపిస్తాయని విశ్వసించండి. మీరు నిరంతరం పయనిస్తూ మరియు మీకు మీరుగా పరివర్తనం చెందుతూనే ఉంటారు. ఈ మార్గంలో మీకు ఏ విధమైన స్థిర ఆశయంగాని, ఆఖరి గమ్యంగాని లేదు. మీరు నిరంతరం

పయనిస్తూనే ఉంటారు. ఇప్పుడు ఈ విధంగా ముందుకు సాగడాన్ని ఆనందించండి, జీవిత ప్రవాహం యొక్క మార్పులను ఆనందించండి. అప్పుడే మీ నుంచి ఒక బరువైన బాధ్యత తొలగింపబడుతుంది.

భూమి మీద మానవశరీరంలో జన్మించక ముందు ఉన్న సమయానికి నాతో రమ్మని నేను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ఇది సాధ్యం అవుతుందా అని ఏమాత్రం సందేహించవద్దు. కేవలం మీ ఊహాశక్తితో ప్రయాణించండి. మీరు చెయ్యాలనుకుంటే ఇది అంత పెద్ద విషయమేమి కాదు. మిమ్మల్ని మీరు నమ్మండి మరియు ఒకానొకప్పుడు మీరు శరీరం లేకుండా ఉన్న స్థితిని అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి. మీరు భౌతికరూపం లేకుండా స్వతంత్రంగా ఉండేవారు. మీకు ఏ విధమైన అవధులు లేవని మరియు ఏదైనా సాధ్యమేనని అనుభూతి చెందేవారు. ఈ గొప్ప స్వేచ్ఛాతలంలో జీవితం చాలా అద్భుతంగా ఉండేది. మీరు ఈ తలం నుంచి భూమి మీదకి బలంగా లాగబడినట్టుగా అనుభూతి చెందారు. మీ ఆసక్తి విశ్వంలోని అన్ని ప్రదేశాల కన్నా కూడా, గొప్ప సామర్థ్యాలు కలిగిఉన్న ఈ చిన్న గ్రహం వైపే ఎక్కువగా ఆకర్షింపబడింది; ఈ సామర్థ్యాలు చీకటి మరియు వెలుగు, ప్రేమ మరియు భయం యొక్క రెండింటి కలయికతోను నిండి ఉన్నాయి. మీరు దీనికి ఆకర్షింపబడుతున్నట్టు అనుభూతి చెందారు. మీరు భూమిపై ఉన్న వాస్తవం యొక్క స్వభావాన్ని చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు మరియు మీరు దానితో ఏదో చెయ్యాలని కాంక్షించారు. మీరు అక్కడ ఏదో ఉందని, దాని యొక్క అనుభవాన్ని పొందాలని కోరుకున్నారు.

స్వేచ్ఛ గల ఆత్మలా, మీరు భూమి మీదకి దిగివచ్చి మానవరూపం ధరించాలని నిర్ణయించుకున్నారు. మీరు భూమి మీద చాలా అనుభవాల ద్వారా పయనించినా కూడా, ఇప్పటికీ మీలో అలాగే ఉన్న ఆసక్తి, అన్వేషణ మరియు ఆకర్షణలకు సంబంధించిన ఒకానొకప్పటి అసలైన అనుభూతులను, ఇప్పుడు మీరు ఒకసారి అనుభూతి చెందండి. మీరు ఇక్కడ ఉండడం అనేది ఎంత ప్రత్యేకమైనదో ఒకసారి అనుభూతి చెందండి. ఈ భౌతికశరీరంలో ఇమిడి ఉండడానికి మీ చైతన్యం తననుతాను తగ్గించుకుని, శరీరం యొక్క జ్ఞానేంద్రియాలైన కళ్ళు, చెవి మరియు స్పర్శ మొదలైన వాటి ద్వారా వాస్తవాన్ని గ్రహించాలని మీకు మీరుగా కోరుకున్నట్లు అనుభూతి చెందండి. ముఖ్యంగా వాస్తవాన్ని ఈ విధంగా గ్రహించాలనుకోవడం అంత సహజమైన విషయం కాదు. నిజానికి వాస్తవాన్ని గ్రహించే మీ తత్వం చాలా విశాలమైనది మరియు అవధులు లేనిది. అయినప్పటికీ మీరు ఈ సరిహద్దులను

ఎంపిక చేసుకున్నారు. ఎందుకంటే ఏదైనా నమ్మశక్యంగాని విలువైన విషయాన్ని కనుగొనడానికి ఈ సరిహద్దులు అవసరం కనుక.

మీరు దిగి వచ్చిన ఆధ్యాత్మిక తలాల యొక్క స్వేచ్ఛను మరియు అద్భుతాన్ని తెలియజేయడం కోసమే మీరు భూమి మీద ఉన్నారు. మీరు వీటిని ఒక ఆకారంలోకి మరియు పదార్థంలోకి తీసుకురావడానికి మరియు దీని యొక్క అనుభవం మీకు మరియు ఇతరులకు అందుబాటులో ఉండే విధంగా కూడా ఏర్పాటు చేయడానికి ఇక్కడ ఉన్నారు. నిజానికి, మీరు కాంతి యొక్క వాహకులు. కాంతి అంటే స్వేచ్ఛ, సహజత్వం మరియు ఆనందం. మీరు ఈ కోరికతోను – సృష్టి యొక్క కాంతిని ఇక్కడ ప్రసరింపజేయాలనే ప్రోత్సాహంతోను – ఆనందాన్ని మరియు లోతైన పరిశీలనాదృష్టిని విస్తరింపజేయాలనే ఆసక్తితోను – మీరు ఇంతకు ముందు చాలాసార్లు భూమి మీద జన్మించారు. దీనిని మళ్ళీ అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకోండి. మీరు ఎవరనేది తెలుసుకోండి. మీరు ఇక్కడ ఉండి ఏదో ప్రత్యేకమైన దానిని చేయవలసిన అవసరం లేదు. మీ యొక్క ప్రధానలక్ష్యం ఏమిటంటే, మీరు ఎవరనేది గుర్తించడం మరియు మళ్ళీ మీ జీవితంలోకి ఆనందాన్ని అనుమతించడం. మీరు మరే ఇతర లక్ష్యాలను కలిగి లేరు. ఇదే మీరు చేయవలసిన పని: అన్వేషణ మరియు ఆనందం యొక్క అసలైన స్థితికి తిరిగి చేరడమే, ఇవి మీకు పూర్తి భిన్నమైన దిశను సూచిస్తున్నట్లు అనిపిస్తుంది.

ఈ కారణంగా మీరు ఒత్తిడికి గురయ్యారు. భూమి యొక్క వాస్తవం, మనుష్యుల యొక్క ఆలోచనా విధానం, సమాజం యొక్క నమ్మకాలు మీపై అధిక బరువును మోపగలవు మరియు మిమ్మల్ని ఒక్కక్షణం మరుపులో మునిగిపోయేలా చేయగలవు. మీరు రక్తమాంసాలతో ఉన్న దివ్యత్వమని గుర్తుంచుకోండి. ప్రస్తుతం కాంతి మీ చేతుల ద్వారా, మీ కళ్ళ ద్వారా ప్రవహిస్తోందని అనుభూతి చెందండి. ఇది ఎప్పుడూ మిమ్మల్ని వదలలేదు. కాని మీ జీవితంలోని ఏదో ఒక స్థితి దగ్గర ఈ కాంతి స్వేచ్ఛగా ప్రవహించలేదనే విషయం మీ అందరికి చెప్పబడింది. ఇది మీ నుంచి విడదీయ బడుతుందనే భయంతో, మీరు దీనిని మీ అంతరంలో దాచి ఉంచాలని నమ్ముతున్నారు. ఇటువంటి పరిమితమైన ఆలోచనలు సాధారణంగా ఉంటాయి, కాని ఇవి మీ గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో అనే విషయానికి మీరు బంధీ అయ్యేలా చేస్తాయి. బహుశా ఇదే భూమి మీద ఉన్న అతి దుర్భరమైన జైలు. శరీరంలో ఉండడమనేది మిమ్మల్ని అదుపు చేయడం లేదు. నిజమైన అదుపు అనేది సమాజం యొక్క అతి భారమైన, భయపూరితమైన నమ్మకాలను అనుమతించడం ద్వారానే ఏర్పడుతుంది. వీటిని కలిగి ఉండడం వలన మీ దివ్యత్వపు ప్రకాశం క్షీణింపబడుతుంది.

వీటి నుంచి బయటకు వచ్చే మార్గాన్ని మీకు చూపించాలనేదే నా వాంఛ మరియు దీనికి మార్గం ఏమిటంటే: మీ జీవితంలో తిరిగి ఆనందాన్ని పొందడానికి సాహసించండి, ఇది మీ జన్మహక్కుగా అనుభూతి చెందండి! ఇది కేవలం మీకు మీరుగా ఉండడమే. మీరు దైవం యొక్క ఆనందం ద్వారా వ్యక్తీకరించబడిన వారు. అందువలన మీరు సాధించాల్సినది ఏదీ లేదు. కేవలం మీతో మీరు ఉండడం మాత్రమే ఇక్కడ అవసరం. మీరు ఇప్పుడు ఇక్కడ సంతృప్తికరంగా ఉన్నారని అనుభూతి చెందాల్సిన అవసరం ఉంది. మీరు పోగొట్టుకునేదిగాని, కోల్పోయేదిగాని ఏమీ లేదు. ఇప్పుడు మీరు ఎవరనే దాని యొక్క సంపూర్ణత్వాన్ని కౌగిలించుకోండి, సంపూర్ణత్వం అంటే మీ భయాలు, మనోభావ సంబంధిత అడ్డులు మరియు అదే సమయంలో మీ లోతైన పొరలలో ఉన్న అన్వేషణ మరియు జీవశక్తి యొక్క లోతైన భావనలన్నింటి యొక్క కలయిక కూడా. జీవితం తనకు తానుగా మీ ద్వారా ప్రవహిస్తూ, తనకు సంబంధించిన చాలా అద్భుతమైన బహుమతులను మీకు ఇవ్వాలని కోరుకుంటోంది. మీరు ఈ శరీరంలో, ఈ సమాజంలో, ఈ భౌతికతలంలో మానవజన్మ యొక్క ప్రయాణం చేయడానికి అంగీకరించారు. అది చాలు. మీరు దీని ద్వారా మీ యొక్క గొప్ప ధైర్యాన్ని మరియు విశ్వాసాన్ని ప్రదర్శించారు. ఇప్పుడు మీ జీవితంలో మీకు కావలసిన ప్రతీది అందుకునే అర్హత మీకు ఉందని విశ్వసించండి. మీరు ఈ ప్రస్తుత క్షణంలో, మీ దివ్యత్వం యొక్క స్వచ్ఛమైన ఆనందాన్ని అనుభూతి చెందండి. మీరు ఈ ఆనందంలో విశ్రాంతిని పొందడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి.

ఇప్పటి నుంచి మీరు మీ జీవితంలో ఖచ్చితంగా చేయవలసినవి ఏవి లేవని ఊహించుకోండి. నిజంగా మీకు మీరుగా ఈ స్వేచ్ఛను అనుమతిస్తే, మీ జీవితం ఎల్లప్పుడూ అతి సులభంగాను మరియు సున్నితంగాను ప్రవహిస్తుంది. మీ తల్లిదండ్రులు, గురువులు, సమాజం మొదలైనవారి ద్వారా మీకు చెప్పబడిన వాటికి ఇది పూర్తి వ్యతిరేకంగా ఉందని నేను అర్థం చేసుకోగలను. సమాజం మీరు కష్టపడి పనిచేయాలని మరియు వాస్తవంతో వ్యవహరించడానికి కావలసిన సామర్థ్యాలను మరియు నైపుణ్యాలను పెంపొందించు కోవడానికి కృషిచేయాలని మీకు చెబుతుంది. మీరు పరిమితంగా ఉండాలని మరియు మీరు కలలు కంటున్న మరియు ఆశిస్తున్న వాటి కన్నా కూడా, మీకు సాధ్యమైన వాటి మీద దృష్టిని కేంద్రీకరించమని మీకు చెబుతుంది. ఇది కేవలం సమాజం మాత్రమే చెప్పడం లేదు, అనేక ఆధ్యాత్మిక ఉపన్యాసాలు కూడా ముక్తిని పొందడానికి సరైన ప్రవర్తన మరియు క్రమశిక్షణ అవసరమని చెబుతున్నాయి.

మీరు లక్ష్యాలు మరియు ఆశయాల యొక్క వివిధ రకాల ఉద్దేశ్యాలను విడుదల చేస్తున్నట్లు ఊహించుకోండి. మీతో మీరు ఈ విధంగా చెబుతున్నట్టు ఊహించుకోండి: నేను 'నేను'గా ఉంటాను, నేను ఎలా ఉన్నా సంపూర్ణంగా ఉన్నాను. ఇదే విముక్తి! మీకు మీరుగా ఈ విధంగా విశ్రాంతిని అనుమతిస్తే, మీ జీవితంలో అద్భుతమైన పరిస్థితులు ప్రవహించడం మొదలుపెడతాయి, మరియు సమాజం మీకు దేనినైతే ఆశించమని చెబుతోందో, దానికి పూర్తి వ్యతిరేకమైనది మీ జీవితంలో సంభవించడం మీరు చూస్తారు. మీరు ఏమాత్రం కష్టపడకుండా పరిస్థితులు మీ కోసం సహజంగా సంభవించడం ఆరంభమవుతాయి. మీతో మీరు ఉంటూ మరియు పరిస్థితులను ఉన్నది ఉన్నట్టుగా అంగీకరిస్తే, మీరు మీ జీవితంలోకి అద్భుతాలను తీసుకువచ్చే ప్రశాంతత యొక్క ప్రవాహాన్ని ఆహ్వానించగలరు. మిమ్మల్ని మీరు యధాతధంగా అంగీకరించడం ద్వారా మీ జీవితానికి, మీరు భూమి మీద ఉండడానికి అంగీకారాన్ని తెలుపుతున్నారని అర్థం. మీరు కోరుకున్నది ఏదైనా కూడా, దానిని అందుకోవడానికి మిమ్మల్ని మీరు అనుమతిస్తారు. ఎందుకంటే మీరు దివ్యత్వం యొక్క శాశ్వతమైన రూపంగా రూపొందారు కాబట్టి. అందువలన మీరు ఎలా ఉన్నా కూడా షరతులు లేని అపారమైన ప్రేమను మరియు వాత్సల్యాన్ని మీకు మీరు అందిస్తారు.

మీరు ఈ ప్రశాంతతను మీ హృదయంలో కనుగొన్నప్పుడు, మీరు మీ ఒత్తిడిని మరియు ఉన్నతమైన ఆశించడాలను విడుదల చేసినప్పుడు, మీరు మీ యొక్క సంరక్షణను జీవితం యొక్క అద్భుతానికి వదిలివేస్తారు. మీ అంతట మీరుగా జీవితం యొక్క ప్రవాహానికి మరియు ఆమె లయకు ఆధీనమవుతారు. మొదటిగా మీరు మీ జీవితంలో మళ్ళీ ఆనందాన్ని అనుభవించడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకున్న తర్వాతనే, మీ జీవితంలో సంతృప్తిని, సరైన ఉద్యోగాన్ని, సరైన బంధాన్ని లేదా నివసించడానికి సరైన ఇల్లుని కనుగొనడం మొదలుపెట్టమని నేను మీకు చెబుతున్నాను. మీరు ఆనందం యొక్క ప్రతిరూపం. ఆధ్యాత్మికత అనేది సహజత్వానికి మరియు స్వేచ్ఛకు సంబంధించినది. దీనిని పిల్లలు అనుభూతి చెందినట్లుగా అనుభూతి చెందడమే, అంటే రేపటి గురించి ఆలోచించకుండా, వర్తమానాన్ని ఆనందిస్తూ, మీకు ఎలా అనిపిస్తే అలా చేయడమే.

ఇది పెద్దవారికి ఏ మాత్రం సాధ్యం కాదనే విషయం మీరు నమ్ముతారని నాకు తెలుసు. ఇది చాలా విచారించదగిన విషయం. ఇక్కడ నిజానికి చాలా బాధాకరమైన విషయం: మీరు చాలా సహజంగా సంభవించే మీ భాగాన్ని మరియు

ప్రతీ దానిని సులభంగా తీసుకునే తత్వం గల మీ యొక్క భాగాన్ని త్యజించడం అనేది ఒక విధిగా నిర్వర్తించారని అర్ధం. మీ అంతరంలోని శిశువుకి మీ చేతులను అందివ్వండి, అది మీ కోసం మీ సహజత్వాన్ని జాగ్రత్తగా దాచి ఉంచినది. తనంతట తాను ఆడుకోవాలని మరియు ఆనందించాలని కోరుకునే శిశువు, జీవితాన్ని అన్వేషించాలని మరియు అంతా సరిగ్గా ఉందని నమ్మే శిశువు, ఇప్పటికీ మీ లోతైన అంతరంలో అలాగే ఉంది. మీ గురించి మీరు వ్యక్తపరుచుకోవడానికి, మీకు భూమియే ఒక సరైన భద్రతా స్థలమనే విషయం ఈ శిశువుకి తెలుసు. దీనిని అనుభూతి చెందండి మరియు దీనిని మళ్ళీ మీతో మాట్లాడనివ్వండి. బహుశా అది ప్రస్తుతం మీకు ఒక సందేశాన్ని ఇవ్వాలని అనుకుంటోంది. మీరు దీనిని ఏమాత్రం అనుభూతి చెందలేకపోయినప్పటికీ కూడా అది సరైనదే. ఎందుకంటే మీరు ఆ శిశువును చేరడానికి ఇష్టతను చూపడం, మీ అంతరంలోని అసలైన సహజత్వం యొక్క ప్రవాహాన్ని మరియు మీ ఆత్మ యొక్క ప్రోత్సాహాన్ని అంగీకరించడం అనేది ఇక్కడ చాలా ముఖ్యమైన విషయం కనుక. మీరు ఇది సాధ్యంకాదు లేదా ఇది కోరుకోదగినది కాదు అనే అభిప్రాయాలను నిజమని భావిస్తూ, మీరు మీ జీవితంలోని మార్గదర్శకత్వం కోసం అంతరంగా కాకుండా బాహ్యంగా వెతకాలి అనే భావనలతో నింపబడి ఉన్నారు. కాని ఇవి సరైనవి కావు. మీ అంతర్ ప్రవాహానికి అనుగుణంగా జీవించడమే జీవితం అంటే.

మీ జీవితంలోని సరికొత్త సృష్టిలు ఎల్లప్పుడూ నిజమైన సృజనాత్మక శక్తి ద్వారానే వ్యక్తీకరించబడతాయి, ఇలా వ్యక్తీకరించబడాలంటే, మీరు నిరంతరం సహజత్వం మరియు స్వేచ్ఛ యొక్క స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే మీరు పూర్తి విశ్రాంతిని పొందుతూ మరియు దివ్యత్వపు స్థితిలో ఉండి విషయాలను పట్టించుకోకుండా సులభంగా వదిలివేయడాన్ని అనుభూతి చెందినప్పుడు మాత్రమే, మీరు మీ జీవితంలో చాలా ఉన్నతమైన మార్పులను ఆకర్షించగలరు. మీరు బలవంతంగా ఏ పనినైనా చేసినా లేదా ఇంకొకరిని అనుకరించడానికి ప్రయత్నించినా, మీరు మీ జీవితంలో మంచి మార్పులను ఆకర్షించలేరు. మీరు మీ కలలను మరియు కోరికలను పోషిస్తూ, వాటిని స్వేచ్ఛతో విడుదల చేస్తూ మరియు పరిస్థితులను వాటి యొక్క సొంత పద్ధతిలో వెళ్ళడానికి అనుమతించినట్లయితే, మీ విశ్వాసం వాటిని మీ దగ్గరకు ఆకర్షింపబడేలా చేస్తుంది. మీరు అవి సంభవించాలని ఎదురుచూడరు, ఎందుకంటే మీరు వర్తమానంలో మీతో మీరు ఆనందంగా గడపడంలో తీరిక లేకుండా ఉంటారు కాబట్టి. జీవితం సహజంగానే అత్యంత సుందరమైనది.

మేము మీతోనే ఉన్నాము. మేము మీరు పయనిస్తున్న మార్గాన్ని బాగా అర్థం చేసుకున్నాం. ఈ సందేశాన్ని నమ్మమని మేము మిమ్మల్ని అడుగుతున్నాం. జీవితం యొక్క కరుణ మీద విశ్వాసాన్ని కలిగి ఉండండి. ప్రతీ జీవి ద్వారా ఆనందం ప్రవహిస్తోందని విశ్వసించండి. ఒకసారి ప్రకృతిని గమనించండి. జంతువులు, వృక్షాలు మరియు పుష్పాలు మొదలైనవన్నీ కూడా, సహజమైన సౌందర్యం మరియు సమన్వయం యొక్క భావప్రకటనలనే తెలియజేస్తాయి. వాటినవి సందేహించవు. సహజమైన మరియు ప్రశాంతమైన మార్గంలో వాటికి అవి విలువను ఇస్తూ గౌరవించుకుంటాయి. ఈ విలువైన సహజశక్తితో బంధాన్ని ఏర్పరుచుకోండి మరియు మీరు అదే విధమైన జీవిత వ్యవస్థతో అంతరంగా కలుపబడి ఉన్నారని తెలుసుకోండి. మీరు సురక్షితంగానే ఉన్నారు. దైవం ఇప్పుడు ఇక్కడ మీతో ఉంది మరియు మిమ్మల్ని ఎప్పటికీ ప్రక్కకు వదిలివేయదు. జీవితం యొక్క అద్భుతాన్ని మీ అంతట మీరు విశ్వసించడానికి ధైర్యం చేయండి, అది ఏదో కాదు మీ సొంత ఆత్మ యొక్క దివ్యత్వపు ప్రవాహమే. ఈ ప్రవాహాన్ని ఆనందించండి.

* * * *

# అహంకారం నుంచి హృదయం వైపు - మొదటిభాగం

**చైతన్యం యొక్క పరివర్తనలోని నాలుగు దశలు:**

నేను ఈ ఛాప్టర్‌లో పూర్తిగా మీ అందరిలో ఏర్పడుతున్న పరివర్తనానికి సంబంధించిన మానసికపరమైన గుణాల గురించి ప్రస్తావించాలని అనుకుంటున్నాను. మేము ఈ ప్రక్రియను నాలుగు దశలుగా విభజించాం.

1. మీరు అహం ఆధారిత చైతన్యం ద్వారా పొందుతున్న వాటి వలన అసంతృప్తికి గురవ్వడం మరియు "వేరొక దానిని" వాంఛించడం: ఇది అహం అంతం యొక్క ఆరంభం.

2. అహం ఆధారిత చైతన్యంతో ముడిపడి ఉన్న మీ బంధాల యొక్క ఎరుకను పొందుతూ, దీనికి సంబంధించిన ఆలోచనలను మరియు మనోభావాలను గుర్తించి మరియు వాటిని విడుదల చేయడం: ఇది అంతం యొక్క మధ్య దశ.

3. మీలోని పాత అహం ఆధారిత శక్తులను చనిపోనివ్వండి. వీటి గూడును విసిరివేస్తూ, మీరు మీ యొక్క సరికొత్త తత్వంగా రూపొందండి: ఇది అహం అంతం యొక్క అంతిమ దశ.

4. మీరు ప్రేమ మరియు స్వేచ్ఛల ద్వారా ఉత్తేజింపబడుతూ, మీ అంతరంలో హృదయ ఆధారిత చైతన్యాన్ని మేల్కొల్పడం; ఇతరులు పరివర్తనం చెందడానికి సహాయం చెయ్యడం.

**మొదటిస్థితి : అహంకారం మీకు ఏమాత్రం సంతృప్తిని ఇవ్వదు.**

అహం ఆధారిత చైతన్యం నుంచి హృదయ ఆధారిత చైతన్యం వైపు పరివర్తనం అనేది అంతర్ శూన్యత యొక్క అనుభవంతో మొదలవుతుంది. మీ పూర్తి ఆసక్తిని ఆకర్షించిన విషయాలు లేదా మీరు పూర్తిగా ఆధారపడుతున్న పరిస్థితులు, ఇప్పుడు మిమ్మల్ని శూన్యంలోను లేదా నిరాశలోను పడవేస్తాయి. కొంతవరకు ఈ విషయాలు వాటి యొక్క సాధారణమైన అర్థాన్ని మరియు ఆశయాన్ని కోల్పోతున్నట్లు కనిపించవచ్చు.

ఈ శూన్యస్థితి యొక్క అనుభవాన్ని పొందే ముందు, చైతన్యం పూర్తిగా భయం యొక్క అదుపులో ఉంటుంది మరియు ఇది తరచూ తనను తాను తిరిగి

రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఇది నిరంతరం ఇతరుల సహాయం కోసం ఎదురుచూస్తుంది. ఎందుకంటే ఇది తిరస్కరణ మరియు ఒంటరితనం యొక్క మూలాలకు సంబంధించిన భయాన్ని ఎదుర్కొనడానికి ఇష్టపడదు కనుక. మీ చర్యలన్నింటి వెనుక రహస్యంగా దాగి ఉన్న ముఖ్యోద్దేశ్యం ఏమిటంటే, లోతైన భయం మరియు ఇతరుల సహాయం అవసరం అనే భావనయే. వీటిపై మీకు జాగృతావస్థ యొక్క ఎరుక లేకపోయినప్పటికి, మీ పూర్తి జీవితం ఈ భయాల మీదనే ఆధారపడి ఉంటుంది. బహుశా మీరు మీ అంతరంలో తీవ్రమైన అలసట మరియు ఒత్తిడి యొక్క ఎరుకను గమనించవచ్చు. ఉదాహరణకి, మీ జీవితంలో తరచూ పెద్ద సంఘటనలుగా ఉంటున్న బాంధవ్యాల యొక్క తెగత్రెంపులు, ప్రేమించినవారు చనిపోవడం లేదా ఉద్యోగాన్ని కోల్పోవడం మొదలైన విషయాలు మీ దగ్గరకు వస్తూ, నిజానికి ఒత్తిడి లేదా అలసట మీకు ఏం చెబుతున్నాయి అనే దానిని ఒకసారి శోధించమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాయి.

మీ వ్యక్తిత్వం యొక్క కేంద్రంగా అహంకారం ఉన్నప్పుడు, మీ చైతన్యం మరియు మీ మనోభావ సంబంధిత జీవితం బాధలతో నిండి ఉంటుంది. మీరు భయంతో వెనకడుగు వేస్తూ, నిరంతరం మిమ్మల్ని మీరు సంరక్షించుకుంటారు. మీరు అహంకార స్థితిలో ఉన్నప్పుడు కొరతను అనుభూతి చెందుతూ, ఏదో కావాలని కాంక్షిస్తారు. మీ ఆలోచనలు, అనుభూతులు మరియు చర్యల యొక్క పునాది ఒక 'నల్లటి శూన్యం'తో ఖాళీగా ఉంటుంది, ఇది ఎప్పటికి పూర్తిగా నింపబడదు. మీరు ఈ శూన్యం నుంచి మీ చైతన్యాన్ని తొలగించినట్లయితే, ఇది భయంతోను మరియు నీడలతోను కప్పబడి ఉంటుంది. ఈ నీడలలో మీకు తెలియని ప్రదేశాల యొక్క ఎరుక ఉంటుంది. కాని మీరు అక్కడకి వెళ్ళడానికి ఇష్టపడరు.

ఈ స్థితిలో, మీరు మీ దైవంతో లేదా మూలచైతన్యంతో విడిపోయిన భావనను అనుభూతి చెందుతారు. మీ అంతరాళంలో ఒంటరితనాన్ని, విసిరివేయబడిన భావనను అనుభూతి చెందుతారు. మీరు విడదీయబడినట్టుగాను ఏ ఆశయం లేకుండా అర్థంలేని జీవితాన్ని గడుపుతున్నట్లు భావిస్తారు మరియు మీరు దీనికి సంబంధించిన మీ భయాన్ని కప్పి ఉంచినట్లయితే, మీరు దీని యొక్క నీడను మాత్రమే పరోక్షంగా అనుభూతి చెందగలరు.

ప్రజలు పూర్తి ఎరుకతో అంతర్ శూన్యాన్ని ఎదుర్కొనడానికి భయపడతారు. వీరు వీరి అంతరంలోని చీకటిని ధైర్యంగా ఎదుర్కొనడానికి మరియు దానిని పరిశీలించడానికి భయపడుతుంటారు. మీరు దీనిని ఎదుర్కొనక పోతే, అది అక్కడే

ఉంటుంది మరియు మీ జీవితాన్ని గడపడానికి వేరొకరి పద్ధతులను అనుసరించి అభివృద్ధి చేయాల్సి వస్తుంది. అహం స్థితిలో ఉన్నప్పుడు సమస్యను కేంద్రం దగ్గర కాకుండా, కేంద్రం అవతలి వైపే ఎల్లప్పుడూ పరిష్కరిస్తుంటాం. సమస్యను పరిష్కరించడానికి మీ చైతన్యాన్ని బయటకు మళ్ళించాలని అహం శక్తి ప్రయత్నిస్తుంది. ఇది బయటి శక్తులను మీకు ఆహారంగా ఇస్తూ అంతర్ గాయాన్ని పెంచాలని ప్రయత్నిస్తుంది. ఈ శక్తులు ముఖ్యంగా హోదాకి, అభిమానానికి, అధికారానికి, ఆసక్తి మొదలైన వాటికి సంబంధించినవి. ఈ విధంగా అహం, ఆత్మ కోరుకుంటున్న మరియు ఆత్మ వాంఛలైన – ఏకత్వం, భద్రత మరియు ప్రేమలకు సమాధానాన్ని వీటి ద్వారా సృష్టిస్తూ మీకు చూపిస్తుంది.

ఈ అహం యొక్క వాంఛ కూడా పూర్తి విలువైనది మరియు న్యాయమైనదే. ఇది దైవం యొక్క పిలుపే, ఇది దివ్యత్వం యొక్క పిలుపే. మీ సొంత స్వభావమే మిమ్మల్ని పిలుస్తోంది, మీరే దైవం! దైవమంటే ఏకత్వం, భద్రత మరియు ప్రేమ శక్తుల యొక్క కలయికే. మీలో ప్రతి ఒక్కరూ అపరిమితమైన ప్రేమను మరియు మీరు దైవంగా పిలుస్తున్న దివ్యత్వపు శక్తి యొక్క కౌగిలింతను తీవ్రంగా కావాలని కాంక్షిస్తున్నారు. దీని సారాంశం ఏమిటంటే, ఈ వాంఛ అన్నింటిపై సంపూర్ణమైన ఎరుకను పొందాలని మరియు మీ దివ్యత్వంతో ఏకమవ్వాలని కోరుకుంటోంది. అపరిమితమైన ప్రేమకు మీ సొంత దివ్యత్వమే మార్గంగా ఉంటుంది. మీరు మీ సొంత దివ్యత్వం చుట్టూ ఉన్న భయం మరియు చీకటి ద్వారా పయనించినప్పుడు, మరియు మీరు దీనిని బాహ్యంగా కాకుండా అంతరంగా వెళ్ళి అన్వేషించినప్పుడు మాత్రమే కనుగొనగలరు. మీ చైతన్యాన్ని ఒక కాంతిగా ఉపయోగించుకోవడం ద్వారా, మీరు మీలోని ఛాయలను పారద్రోలుతారు. చైతన్యమే కాంతి. అందువలన ఇది చీకటితో యుద్ధం చేయవలసిన అవసరం లేదు; కేవలం చైతన్యం అక్కడ ఉండడం ద్వారానే చీకటి కరిగిపోతుంది. మీ చైతన్యాన్ని అంతరంలోకి మరల్చడం ద్వారా, మీ ముందు అద్భుతాలు సంభవించడం మీరు చూడగలరు.

అహంకారం దీనికి పూర్తి వ్యతిరేకమైన మార్గంలో పయనిస్తుంది. అహం.. ప్రేమ మరియు భద్రతలు అవసరమని తెలుపుతుంది. కాని, ఇది మీ అంతర్ చీకటిని మరియు భయాలను ఎదుర్కోకుండా ఈ అవసరాన్ని సంతృప్తి పరుచుకోవాలని కోరుకుంటుంది. దీనిని సాధించడం కోసం ఇది "గారడీ" చేస్తుంది: ఇది ప్రేమ యొక్క అవసరాన్ని, ఇతరుల యొక్క ఆమోదం మరియు గుర్తింపు యొక్క అవసరంగాను పరివర్తనం చెందిస్తుంది. ఇది ఏకత్వం మరియు సమన్వయం యొక్క వాంఛను, ఇతరుల కన్నా ఉన్నతంగా జీవించాలనే వాంఛగాను పరివర్తనం చెందిస్తుంది. మీరు

ఇతరులకు నచ్చే లక్ష్యాలను సాధించినప్పుడు మీరు ప్రేమించబడతారని, దాని కోసం మీరు కష్టపడితే చాలని, మీ అంతరంలోకి వెళ్ళి ప్రేమను వెతకవలసిన అవసరం లేదని మీరు భావిస్తారు; ఈ విధంగా అహంకారం మీ భయాలను కప్పి ఉంచాలని ప్రయత్నిస్తుంది.

ప్రేమ మరియు ఆహ్లాదకరమైన ఏకత్వం యొక్క మీ నిజమైన వాంఛ, ఇప్పుడు గుర్తింపు యొక్క వాంఛగా రూపొంది తప్పుగా అర్థం చేసుకోబడుతోంది. మీరు నిరంతరం బాహ్యపు విలువల కోసం అన్వేషిస్తున్నారు, కాని ఇది మీకు తాత్కాలికమైన సహాయాన్ని మాత్రమే అందిస్తుంది. మీ చైతన్యం యొక్క దృష్టి ముఖ్యంగా బాహ్య ప్రపంచంపై కేంద్రీకరింపబడుతోంది. మీరు ఇతరుల యొక్క అభిప్రాయాల మీద ఆధారపడుతూ మరియు మీ గురించి ఇతరులు ఏమనుకుంటారో అనే దాని గురించి ఎక్కువగా ఆందోళన పడుతుంటారు. మీ ఆత్మ గౌరవం దీనిపై ఆధారపడి ఉండడం వలన, మీరు దీనికి అధిక ప్రాముఖ్యతను ఇస్తున్నారు. నిజానికి మీ ఆత్మ గౌరవం క్రమక్రమంగా అట్టడుగు ప్రాంతానికి మునిగిపోతోంది, ఎందుకంటే మీ దివ్యత్వానికి కాకుండా, మీ బాహ్యపు లక్ష్యాలను నిర్ణయించే బయటి శక్తులకు మీ అధికారాన్ని ఇస్తున్నారు కనుక.

మీ అంతరంలోని ఒంటరితనం మరియు విసిరివేయబడిన లోతైన భావనలు ఉపశమనాన్ని పొందలేవు. నిజానికి మీరు వీటిని చూడడానికి తిరస్కరించినట్లయితే, ఇవి మరింత చెడుగా రూపొందుతాయి. మీరు దీనిని చూడడానికి ఇష్టపడకపోవడం వలన ఇవి మీ నీడగా తయారవుతాయి. ఇక్కడ భయం, కోపం మరియు చెడుశక్తులు సంచరిస్తూ మిమ్మల్ని ప్రభావితం చేస్తాయి, మీరు అంతరంలోకి వెళ్ళడానికి నిరాకరించడం వలన అవి మిమ్మల్ని మరింత తీవ్రతకు గురిచేస్తాయి. సందేహాలను, అనుమానాలను, అనుభూతులను అణచివేసే విషయంలో అహంకారం చాలా మొండివైఖరిని ప్రదర్శిస్తుంది. ఇది అంత సులభంగా అదుపును విడుదల చేయలేదు.

వ్యక్తిగత అధికారాన్ని పట్టుకుని వ్రేలాడు తుండడం యొక్క ఫలితాన్నే మీ ప్రపంచంలో ఉన్న “చెడు” అని మీరు భావిస్తున్నారు. ఇదంతా అదుపును వదులుకోవడాన్ని నిరాకరించడం మరియు అంతర్ భయాన్ని మరియు చీకటిని అంగీకరించడాన్ని ఇష్టపడకపోవడం వలనే సంభవిస్తోంది.

ఎన్‌లైటెన్‌మెంట్‌ను పొందడానికి తొలిమెట్టు “ఏమిటి అనే” విషయానికి ఆధీనమవ్వడమే. ఎన్‌లైటెన్‌మెంట్ అంటే, మీ చైతన్యం యొక్క కాంతిలోకి మీ యొక్క

గతజన్మలను మరియు పాత్రలను అనుమతించడమే. నిజానికి ఎన్‌లైటెన్‌మెంట్ యొక్క అర్థం: కేవలం మీ అంతరంలోని ప్రతీ విషయం పట్ల పూర్తి జాగురుకతను పొందడం కాదు, మీరు జాగురుకతతో ప్రతీ పాత్రను లేదా గతజన్మను ఎదుర్కొనడానికి సుముఖతను చూపడమే అని.

ఎన్‌లైటెన్‌మెంట్ అనేది ప్రేమకు సమానం. ప్రేమ అంటే అర్థం మిమ్మల్ని మీరు ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించుకోవడమే.

మీరందరూ చాలా ఎక్కువగా భయపడుతున్న మీ ఆత్మ యొక్క లోతులలో ఉన్న అంతర్ చీకటి, విసిరివేయబడిన భావన అనేవి తాత్కాలికమైనవే. అహంకార స్థితి అనేది కేవలం మీ అంతర్ ఎదుగుదల మరియు చైతన్యం యొక్క విస్తరణలో ఒక చిన్న అడుగు మాత్రమే. ఈ స్థితి, వ్యక్తిగత-దివ్యత్వపు చైతన్యం వైపుగా మొదటి అడుగు వేస్తుంది.

ఒక ప్రత్యేకమైన చైతన్యం యొక్క జన్మ, ఒక వేరుపడిన ఆత్మగా మీ యొక్క జన్మ అనేవి, మీ తల్లిదండ్రుల నుంచి వేరుచేయబడిన భావన మరియు ఒంటరితనం యొక్క అనుభవాలతో కలిసి పయనిస్తాయి. మీరు దీనిని మీరు మీ భౌతిక ప్రపంచంలో జన్మించినప్పుడు వచ్చే బాధతో పోల్చవచ్చు. గర్భంలోని శిశువు తన తల్లితో ఉన్నప్పుడు, ఏకత్వం యొక్క అనంతమైన భావనను అనుభవిస్తుంది. ఈ శిశువు జన్మించినప్పుడు తనకు తానే సంపూర్ణంగా రూపొందుతుంది.

మీ అందరిలో జన్మగాయం ఉండడం వలన - నేను ఇప్పుడు ఆత్మ యొక్క జన్మ గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. ఆత్మ తన జన్మను విడదీయబడిన భావనగా తన అంతరంలో మోస్తోంది. తను సత్యమని భావించిన వాటన్నింటి నుంచి వేరు చేయబడింది.

కొత్తగా జన్మించిన ఆత్మ తను ఎక్కడి నుంచైతే వచ్చిందో దానిని తన ఇంటిగా పరిగణిస్తూ, స్పష్టత లేని చైతన్యం యొక్క ఏకత్వపు స్థితికి తిరిగి చేరాలని కోరుకుంటోంది. ఇది అసాధ్యం అయినందు వలన, ఆత్మ తీవ్రభయానికి, బాధకు మరియు సందేహాల యొక్క అనుభూతులకు ప్రభావితమవుతోంది. ఈ అంతర్ బాధ మరియు అలజడులు అనేవి అహంకారపు అధికారానికి స్వాధీనమయ్యే ఒక స్థలాన్ని క్రమక్రమంగా ఏర్పరుస్తాయి. ఆత్మ ఈ భయం మరియు బాధలతో వ్యవహరించాల్సి ఉంది, మరియు అహంకారం వీటికి పరిష్కారాన్ని అందిస్తానని వాగ్ధానం చేసింది. అహంకారం, ఆత్మ

చైతన్యానికి సంబంధించిన అధికారం మరియు అదుపుల యొక్క సారాంశాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. ఆత్మ అధికారలేమి మరియు పోగొట్టుకోవడం యొక్క అనుభూతులలో కూరుకుపోవడం వలన తన ఆధిపత్యాన్ని అహంకారానికి అందించింది.

అహంకారం – ఆత్మ యొక్క భాగమే, ఇది భౌతిక ప్రపంచానికి సంబంధించినది. దీని యొక్క సారాంశం ఏమిటంటే, అహంకారం ఆత్మ యొక్క ఆయుధం. కాలం మరియు తలాలలో, ఆత్మ ఒక భౌతిక శరీరంలో ఉంటూ తనను తాను వ్యక్తీకరించుకోవడానికి అహంకారాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకుంది. అహంకారం ఒకానొక ప్రత్యేక విషయం మీద దృష్టిని కేంద్రీకరించ గలిగే చైతన్యాన్ని అందిస్తుంది. ఇది చైతన్యాన్ని మొత్తం అన్ని ప్రదేశాలలో కాకుండా, ఇప్పుడు మరియు ఇక్కడ ఉన్న ప్రదేశంలో మాత్రమే దృష్టిని కేంద్రీకరించేలా చేస్తుంది. అహంకారం అంతర్ వాంఛలను ప్రత్యేకమైన భౌతిక రూపంలోకి మారుస్తుంది. మీలో ఒక భాగమైన ఈ అహంకారం, మీ ఆధ్యాత్మిక భాగానికి మరియు భౌతిక భాగానికి మధ్య వారధిని నిర్మిస్తుంది.

ఆత్మ ఇతర తలాలకి సంబంధించినది. అందువలన ఇది భూమి మీద స్థిరంగా ఉండడం అసహజమైనది. ఆత్మ ఏవిధమైన భౌతికరూపంపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉంటుంది. మీరు ఒక పక్షిలా ఆకాశంలో ఎగిరినట్టుగా కలలు కన్నప్పుడు, మీరు మీ యొక్క స్వేచ్ఛ మరియు స్వతంత్రం గల భాగంతో బంధాన్ని ఏర్పరుచుకుంటారు. మరొక వైపు అహంకారం మిమ్మల్ని బంధిస్తూ పట్టి ఉంచుతుంది. ఇది మీ భౌతిక ప్రపంచంలో పని చేయడానికి మీకు సహకరిస్తుంది కాబట్టి. అహంకారం అతి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది మరియు దీనికి మంచి లేదా చెడులతో ఎలాంటి సంబంధం ఉండదు. అహంకారం సమన్వయంతో కూడిన స్థితిలో పని చేసినట్లయితే, ఇది భౌతికశరీరంలో ఉన్న ఆత్మకు ఒక తటస్థమైన మరియు ముఖ్యమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది.

అహంకారం ఆత్మ చైతన్యాన్ని పరిపాలించడం ప్రారంభిస్తే, ఇది ఆత్మ యొక్క ఆయుధంగా పని చేయడానికి బదులు, ఆత్మ తన సమన్వయాన్ని కోల్పోయేలా చేస్తుంది. అహంకారం ఆత్మకు బోధించినప్పుడు (ఇది అహంకార ఆధారిత చైతన్యం యొక్క ముద్ర), అహంకారం అంతర్ వాంఛలను భౌతికరూపంలోకి మార్పు చెందించలేదు. ఎందుకంటే ఇది అంతర్ వాంఛలను అదుపు చేస్తూ వాటిని క్రమక్రమంగా అణచి వేస్తుంది కనుక. అప్పుడు అహంకారం, వాస్తవం యొక్క

తప్పుడు భ్రమలతో మిమ్మల్ని మీకు చూపిస్తుంది. సమన్వయంలేని అహంకారం ఎల్లప్పుడూ అదుపు మరియు అధికారాలపై ఆధారపడుతుంది మరియు ఇది వీటి యొక్క వెలుగులో వాస్తవాలను తప్పొప్పులుగా విభజిస్తుంది.

మీ నిత్యజీవితంలో మీ సొంత అధికారం మరియు అదుపులపై ఆధారపడిన ఆలోచనల వెనుక ఉన్న ఉద్దేశాలను తెరిచి చూడమని మేము మీకు సూచిస్తున్నాం. మీ ఉద్దేశాలు గొప్ప కారణాన్ని కలిగి ఉన్నప్పటికీ కూడా, మీరు మీ ఇచ్ఛకు తగినట్టుగా పరిస్థితులను లేదా మనుష్యులను ఎలా బలవంతంగా మలుచుకుంటున్నారు అనే దానిని గమనించడానికి ప్రయత్నించండి. మీ మార్గానికి అనుగుణంగా పరిస్థితులు లేకపోయినట్లయితే మీరు తరచూ ఆగ్రహానికి గురవుతున్నారా? అదుపు యొక్క అవసరం వెనుక ఎల్లప్పుడూ అదుపును కోల్పోతాననే భయం ఉంటుందనే విషయాన్ని మీరు తెలుసుకోవాలి. అందువలన మిమ్మల్ని మీరు అడగండి: అదుపును విడుదల చేయడం వలన వచ్చే ప్రమాదం ఏమిటి, మరియు అంచనాలను విడుదల చేయడం వలన వచ్చే నష్టం ఏమిటి? నా లోతైన భయం ఏమిటి?

మీరు పరిస్థితులను అదుపులో ఉంచడానికి చెల్లించే మూల్యం ఏమిటంటే, మీ జీవితం యొక్క వైఖరిని ఒత్తిడులకు మరియు ఆంక్షలకు గురిచేయడమే.

మీరు అంతర్ ప్రోత్సాహం ద్వారా జీవించడానికి సాహసించినప్పుడు మరియు మీకు ఆనందాన్ని ఇచ్చే పనులను చేసినప్పుడు మాత్రమే, మీ జీవితంలో సహజమైన మరియు వాస్తవమైన ప్రవాహం సృష్టించబడుతుంది. మీరు జీవితం యొక్క ప్రవాహాన్ని మళ్ళించవలసిన అవసరం లేకుండానే, మీరు ప్రశాంతంగాను మరియు ఆనందంగాను జీవిస్తారు. భయం లేకుండా జీవించడం అంటే: మీకు జీవితం అందిస్తున్న వాటితో పూర్తి విశ్వాసంతో జీవించడమే. మీరు దీనిని చేయడానికి సాహసించగలరా?

యవ్వనదశలో ఉన్న ఆత్మకు అహం ఆధారిత చైతన్యం యొక్క ఆటంకాన్ని తప్పించుకొన సాధ్యం కాదు. భయం మరియు విసిరివేయబడిన భావనల యొక్క సమస్య నుంచి బయటకు వచ్చే మార్గాన్ని అహంకారం అందించింది; కాని ఇది క్రమక్రమంగా మీ ఆసక్తిని "అంతరంలో ఏమి పొందగలరు" అనే దాని నుంచి "బాహ్య ప్రపంచం నుంచి ఏమి పొందగలరు" అనే వైపుకి మళ్ళిస్తుంది. ఇది సమస్యకు నిజమైన పరిష్కారం కాదు, కాని కొంత సమయం ఉపశమనాన్ని అందిస్తునట్లు అనిపిస్తుంది. మీ చుట్టూ ఉన్న పరిసరాలపై అధికారం మరియు అదుపును చూపించడం అనేది, మీకు తాత్కాలికమైన సంతృప్తిని లేదా క్షణికానందాన్ని ఇవ్వవచ్చు.

ప్రేమించబడడం, గౌరవించబడడం మరియు అభిమానించబడడం అనే వాటికి క్లుప్తమైన అర్థం ఉంది. ఇవి మీ బాధకు కొంతకాలం ఉపశమనాన్ని ఇవ్వగలవు. కాని ఈ స్థితి కొద్దికాలం మాత్రమే ఉంటుంది మరియు మీరు తిరిగి గుర్తింపును పొందడానికి, మంచివారిగాను లేదా మరింత సహాయాన్ని అందించేవారిగాను ఉండడానికి మిమ్మల్ని మీరు నయం చేసుకోవాలి.

అహం యొక్క ఆధిపత్యంలో ఉన్నప్పుడు, దయచేసి మీరు ఎరుకను పొందండి, మీరు మంచి-చెడు, ఇవ్వడం-తీసుకోవడం, అధికారం-లోబడి ఉండడం అనే రెండింటి గుణాలను కలిగి ఉండగలరు. చాలా వరకూ ఇవ్వడం అనేది నిస్వార్థంగా అనిపించినప్పటికీ కూడా, మీ సహాయాన్ని అందుకున్న వ్యక్తి నుంచి పరోక్షంగా శ్రద్ధను, ప్రేమను మరియు గుర్తింపును ఆశించడం లాంటిదే. మీరు ఎల్లప్పుడూ ఇతరులను పట్టించుకుంటూ వారికి కావలసినవి అందించడం అనేది మీ నుంచి మీరు తప్పించుకోవడమే అవుతుంది. అందువలన అహం ఆధిపత్యాన్ని అర్థం చేసుకోవడం కోసం, మీరు హిట్లర్ లేదా సద్దాంహుస్సేన్ లాంటి మొదలైన క్రూరమైన వ్యక్తుల గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. దీనిని సులభంగా ఉంచండి; మీ నిత్యజీవితంలో మిమ్మల్ని మీరు గమనించుకోండి. పరిస్థితులను అదుపు చేయడం అవసరమని తెలిపే వాటి ద్వారా, మీరు అహం ఆధిపత్యం యొక్క ఉనికిని గుర్తించగలరు. ఉదాహరణకి కొంతమంది వ్యక్తులు ఈ విధంగానే ప్రవర్తించాలని మీరు కోరుకోవడమే. ఇది జరిగేలా చేయడానికి మీరు భిన్నమైన ప్రవర్తనలను ప్రదర్శిస్తారు. ఉదాహరణకి మీరు మంచిగానో లేదా ఫిర్యాదు చేసే వైఖరితోనో ప్రవర్తిస్తుంటారు, మరియు మీరు ఇతరుల యొక్క అనుభూతులను ఎల్లప్పుడూ బాధ పెట్టకూడదని ప్రయత్నిస్తారు. నిజానికి ఈ ప్రవర్తన వెనకాల అదుపు యొక్క అవసరం దాగి ఉంది. “ఎందుకంటే నన్ను ప్రేమించడానికి నువ్వు కావాలి, నేను నీకు వ్యతిరేకంగా ప్రవర్తించను”. ఈ విధమైన ఆలోచనారీతి భయం మీద ఆధారపడి ఉంటుంది. మీరు స్వతంత్రంగా జీవించడానికి మరియు మీరు భయం, తిరస్కరణ మరియు విసిరివేయబడిన భావనలను ఎదుర్కొనడానికి భయపడుతున్నారు. సున్నితత్వం మరియు మంచితనం అనేవి మీ సహజత్వాన్ని తిరస్కరించడం యొక్క ప్రతిరూపాలే. ఇదే అహం ఆధీకృతలో ఉండడమంటే.

మీ ఆత్మను అహంకారం పరిపాలించినంత వరకూ కూడా, మీరు మీ మంచి కోసం ఇతరుల యొక్క శక్తులపై ఆధారపడుతూ మిమ్మల్ని మీరు పోషించుకోవాల్సి వస్తుంది. ఇతరులు మరియు సమాజం అంగీకరించగలిగే అర్హతను మీరు కలిగి

ఉండాలని కోరుకుంటారు. మీ చుట్టూ ఉన్న ప్రపంచం ఎప్పుడూ ఖచ్చితంగాను లేదా స్థిరంగాను ఉండదు. మీరు శాశ్వతమైనవి అని భావిస్తూ ఆధారపడుతున్న వాటిపై ఎప్పటికీ ఆధారపడలేరు, అది మీ భాగస్వామైనా, మీ గురువైనా లేదా మీ తల్లిదండ్రులైనా కూడా. అందువలన మీరు ఎల్లప్పుడూ కష్టపడి పని చేయాలి – మీ మార్గంలో అంగీకారాల కోసం ఎల్లప్పుడూ ఎదురుచూడాలి – ఇటువంటి వైఖరి శాశ్వతంగా అహంకారంలో ఇరుక్కుపోయినవారి యొక్క మానసిక స్థితికి సంబంధించిన ఒత్తిడిని మరియు బలహీనతలను వివరిస్తుంది.

అహం నిజమైన ప్రేమను మరియు వ్యక్తిగత–గౌరవాన్ని మీకు అందించలేదు. అహంకారం విసిరివేయబడిన బాధకి ఇచ్చే పరిష్కారం ఎల్లప్పుడూ మరింత విచారానికి లోనుచేసేది గానే ఉంటుంది కాబట్టి. యవ్వన ఆత్మచైతన్యం యొక్క నిజమైన లక్ష్యం ఏమిటంటే, తను కోల్పోయిన తండ్రిలా తాను మారడమే.

దయచేసి భూమి మీద ఉన్న జీవితం యొక్క నిర్మాణాన్ని ఎరుకతో గమనించండి. దీని అర్ధం మీరు ఒక నిస్సహాయత గల శిశువులా భూమి మీద మీ ప్రక్రియను మొదలుపెట్టినప్పటి నుంచి కూడా, భూమి మిమ్మల్ని మీ కాళ్ళపై ఆధారపడుతూ ఒక యుక్తవయస్కుడిలా ఎదగమని, తరచూ ఇది మిమ్మల్ని ఆహ్వానిస్తూనే ఉంది అని. నిజానికి మీ జీవితాలలో ఉండే అసలైన ఆనందం దీనిలోనే ఇమిడి ఉంది: మీకు మీరే సొంత తండ్రిగాను మరియు తల్లిగాను రూపొందడం, మీరు కోల్పోయిన మరియు ఇతరుల నుంచి లభించని ప్రేమను మరియు అవగాహనను మీకు మీరు అందించుకోవడమే. మేము మాట్లాడుతున్న దానికి భౌతికస్థాయిలో అర్ధం: మీరు దైవం పోగొట్టుకున్న శిశువు కాదని, మీరే నిజానికి దైవమని తెలుసుకోవాలి. ఈ అవగాహనే మిమ్మల్ని ఇంటికి తిరిగి చేరుస్తుంది. ఈ అవగాహనే మీరు ఎవరనే దాని యొక్క హృదయానికి, అంటే ప్రేమ మరియు దివ్యత్వపు అధికారంతో నిండి ఉన్న హృదయం వైపుకు మిమ్మల్ని తీసుకువెళ్తుంది.

ఆత్మ ఒకే విధమైన చర్యలు మరియు ఆలోచనలు మళ్ళీ మళ్ళీ సంభవిస్తున్నాయని తెలుసుకున్న వెంటనే, అహంకారం యొక్క చివరి దశ ఆరంభమవుతుంది. ఎప్పటికీ అస్పష్టంగా ఉండే ఒక నిధిని కనుగొనడానికి అహం నిరంతరం ప్రయత్నిస్తూ విఫలమవ్వడాన్ని చూసి ఆత్మ విసుగుకు మరియు నిరాశకు గురైనప్పుడు అహం తన ఆధిక్యాన్ని కోల్పోతుంది. ఆత్మ ఈ ఆట యొక్క వాగ్దానాలను అవాస్తవమైనవని సంశయిస్తూ మరియు నిజానికి ఈ ఆటలో గెలవడానికి ఏమీ లేదని తెలుసుకోవడం ఆరంభిస్తుంది. ఆత్మ ఎల్లప్పుడూ ఉన్నతంగా ఉండాలని

ప్రయత్నించడంలోను మరియు దీనికే మొత్తం సమయాన్ని కేటాయించడంలోను విసుగు చెందినప్పుడు, ఆత్మ వీటి యొక్క అదుపును కొంచెంగా విడుదల చేస్తుంది.

ఆలోచనలను మరియు ప్రవర్తనలను అదుపు చేయడానికి తక్కువ శక్తిని ఉపయోగించినట్లయితే, ప్రత్యేకమైన మరియు సరికొత్త అనుభవాలను అనుమతించే ఒక శక్తివంతమైన తలం తెరుచుకుంటుంది. మొట్టమొదటిగా మీరు ఈ స్థితిలోకి ప్రవేశించినప్పుడు, మీ అంతరంలో అలసిపోయిన అనుభూతిని మరియు శూన్యత్వాన్ని అనుభూతి చెందవచ్చు. మీరు గతంలో ముఖ్యమైన వాటిగా భావించిన విషయాలు, ఇప్పుడు మీకు పూర్తి అర్థరహితంగా కనిపించవచ్చు. స్పష్టమైన లేదా సరైన కారణం లేకుండానే మీ భయాలన్నీ పైకి రావచ్చు. బహుశా ఇది మరణానికి లేదా ప్రేమించిన వారిని కోల్పోతాననే మొదలైన భయాలకు సంబంధించినవి కావచ్చు. మీ ఉద్యోగం లేదా మీ పెళ్ళి మొదలైన పరిస్థితుల ద్వారా కూడా మీకు కోపం రావచ్చు. ఇప్పటి వరకూ స్పష్టంగా ఉన్న ప్రతీది కూడా, ఇప్పుడు మీలో సందేహాన్ని రేకెత్తించవచ్చు. చివరికి అహం ఆధారిత చైతన్యం నిర్బంధించినవన్నీ కూడా సంభవించడం మొదలుపెడతాయి.

అహం కప్పి ఉంచిన ముసుగు క్రమక్రమంగా తొలగించబడుతూ, అదుపు చేయలేనటువంటి అన్ని రకాల భయాలు మరియు మనోభావాలు బయటకి వచ్చి మీ చైతన్యంలోకి ప్రవేశిస్తూ, మీ జీవితంలో సందేహాలు మరియు అలజడుల యొక్క విత్తనాలు మొలకెత్తడానికి కారణమవుతాయి. ఆ క్షణం వరకూ కూడా మీరు అహం చైతన్యం ఆధారంగానే పని చేస్తారు. అకస్మాత్తుగా మీ అంతరంలో అనేక రకాల అనుభూతులు మరియు ఆలోచనా పద్ధతులు తలెత్తుతాయి; మీరు వాటిని ఏమాత్రం ప్రశ్నించకుండా, వాటిని మీ నుండి విడుదల చేయండి. ఇదే మీ చైతన్యానికి ఐకమత్యాన్ని మరియు స్థిరత్వాన్ని అందిస్తుంది. మీ చైతన్యం ఎదుగుతూ విస్తరింపబడినప్పుడు, మీ వ్యక్తిత్వం రెండుగా చీలిపోతుంది. మీలోని ఒక భాగం పాత మార్గాలను పట్టుకుని ఉండాలని కోరుకుంటుంది; మరొక భాగం ఈ మార్గాలను ప్రశ్నిస్తూ మరియు కోపం, భయం మరియు సందేహాలైన మొదలగు అసౌకర్యవంతమైన అనుభూతులతో తలపడుతుంది.

చైతన్యం యొక్క విస్తరణ అహం స్థితి యొక్క చివరిదశలో సంభవిస్తుంది. ఈ విస్తరణ స్వాగతింపబడని వ్యక్తిగా లోపలకి చొరబడుతూ, ఆటను విధ్వంసం చేస్తున్నట్టుగా మీరు అనుభూతి చెందుతారు. ఈ కొత్త ఎరుక ఇంతకు ముందు మీకు స్పష్టంగా కనిపించిన ప్రతీ విషయాన్ని అస్థిరం చేస్తుంది మరియు ఇది మీకు ఎలా

వ్యవహరించాలో తెలియని మనోభావాలను మీ అంతరంలో మేల్కొనేలా చేస్తుంది, మీరు అహం ఆధారిత పద్ధతుల యొక్క ఆలోచనలను మరియు పనులను సందేహించడం మొదలుపెట్టినప్పుడు, మీ చైతన్యంలోకి సరికొత్తదనంతో కూడిన భాగం ప్రవేశిస్తుంది. ఈ భాగం అధికారాన్ని కాకుండా వాస్తవాన్ని ప్రేమిస్తుంది.

అహంకారం యొక్క ఆదేశాల ప్రకారం జీవించడం అనేది చాలా వరకూ అణచివేసేదిగా ఉంటుంది. మీరు అధికారం మరియు అదుపులను లక్ష్యంగా పెట్టుకుని ఉన్న "భయపూరితమైన ఒక చిన్న నియంతకి" సహకరిస్తున్నారు. ఈ నియంత మీ పరిసరాల మీదనే కాకుండా ముఖ్యంగా మీపై కూడా అధికారాన్ని చూపిస్తోంది. ఇది, మీ అనుభూతులు మరియు ఇంగితజ్ఞానం యొక్క సహజమైన ప్రవాహాన్ని కూడా అణచివేస్తుంది. అహం సహజత్వాన్ని ఎక్కువగా ఇష్టపడదు. ఇది మీ సహజమైన అనుభూతులను స్వేచ్ఛగా వ్యక్తపరచనివ్వకుండా మిమ్మల్ని అడ్డుకుంటుంది. ఎందుకంటే అనుభూతులు మరియు మనోభావాలు అదుపు చేయలేని విధంగాను మరియు ఊహించలేని విధంగాను ఉంటూ, మీ అహాన్ని దెబ్బతీస్తాయి కనుక. అందువలన అహం ముసుగుల ద్వారా పని చేస్తుంది.

మీ అహం "ఇతరుల యొక్క సానుభూతిని పొందడానికి మిమ్మల్ని ప్రేమగాను మరియు మంచిగాను నటించమని," ఆదేశించినట్లయితే, మీ అంతరంలోని కోపం, అలసట, అవిశ్రాంతి మరియు విసుగు మొదలైన అనుభూతులను మీరు క్రమక్రమంగా అణచివేస్తారు. మీరు ఈ ఆదేశాల యొక్క సమర్థతను సందేహించడం మొదలుపెట్టినట్లయితే, మరొకసారి ఈ అణచివేయబడిన మనోభావాలన్నీ తిరిగి పైకి వస్తాయి. అనుభూతులను అణచివేయడం ద్వారా తొలగించలేము. మీరు వీటిని ఎంత ఎక్కువగా అయితే అణచివేస్తారో, అవి అంతగా మరింత తీవ్రతను పొందుతూ జీవిస్తాయి.

ఒకసారి ఆత్మ శూన్యతను మరియు సంశయాన్ని అనుభవించినట్లయితే, అది అహంస్థితి యొక్క చివరిదశ లక్షణంగా ఉంటుంది. ఈ దశలో, మీకు ఇంతకు ముందు చీకటిలో దాగి ఉన్న అనుభూతులను మరియు మనోభావాలను కలవడానికి మరియు ఎదుర్కోవడానికి ఇక్కడ సాధ్యమవుతుంది. ఈ మూసివేయబడిన మనోభావాలు మరియు అనుభూతులు మీ ప్రజ్ఞాత్మకి ప్రవేశద్వారంగా ఉంటాయి. మీరు నిజమని భావిస్తూ అనుభూతి చెందుతున్న వాటిని కాకుండా, మీ అంతరంలో సహజంగా వస్తున్న అనుభూతులను అన్వేషించడం ద్వారా, మీరు మీ సహజత్వం మరియు మీ పూర్ణత్వం కలిగిన భాగాన్ని పునఃస్థాపించగలరు. మీరు ఈ భాగాన్నే మీ యొక్క

అంతర్ శిశువుగా పిలుస్తున్నారు. మీ నిజమైన మనోభావాలు మరియు అనుభూతులతో సంబంధాన్ని ఏర్పరుచుకుంటే, అవి మిమ్మల్ని విముక్తి వైపు నడిపిస్తాయి. అప్పుడు హృదయ ఆధారిత చైతన్యం వైపు పరివర్తనం మొదలవుతుంది.

**రెండవస్థితి: మీ అంతర్ గాయాలను అన్వేషించడం**

మిమ్మల్ని మీరు అహంభావంతో గుర్తించడం ఆపివేసినప్పుడు, మొదటిగా మీరు ఎవరనే సందేహపు స్థితిని పొందుతారు. ఈ సందేహం చాలా తీవ్రంగాను మరియు తార్కిక స్వభావాన్ని కలిగి ఉండగలదు. మీరు జీవితం యొక్క అర్థం గురించి, మంచి–చెడుల గురించి ప్రశ్నించడం మొదలుపెడతారు. మీరు నిజానికి అంతరంలో అనుభూతి చెందుతున్న మరియు ఆలోచిస్తున్న విషయాలు మీ సమాజం మీకు నేర్పించిన ఆలోచనారీతికి మరియు అనుభూతులకు పూర్తి వ్యతిరేకంగా ఉండడాన్ని మీరు ప్రశ్నించడం మొదలుపెడతారు. అకస్మాత్తుగా ఈ ప్రశ్నలన్నీ మీకు చాలా వాస్తవంగా అనిపిస్తాయి మరియు ఇవి మీరు జీవితంలో ఎంపిక చేసుకున్న వాటిపై ప్రత్యక్షంగా ప్రభావాన్ని చూపుతాయి. మిమ్మల్ని మీరు చూసుకుంటూ ఈ విధంగా ఆలోచిస్తారు: ఇది నేనేనా? నేను కోరుకునేది ఇదేనా? ఏ విధమైన స్పష్టత లేనందు వలన  ఇప్పుడు ఏది ఎంపిక చేసుకోవాలనేది చాలా కష్టంగా ఉంటుంది.

నిజానికి మీరు ఇప్పుడు ఒక అడుగు వెనుకకు వేస్తూ, మీ లోతులలోకి మరియు అంతరంలోకి పయనిస్తున్నారు. మీ యొక్క లోతైన భాగాల యొక్క ఎరుకను పొందుతారు, ఇవి మీ సమాజం మరియు మీ పెంపకం ద్వారా తక్కువ శిక్షణను పొందని భాగాలు. నిజానికి మీరు ఎవరనే దాని యొక్క భావనలను పొందుతారు: మీ ప్రత్యేకతను, మీ వ్యక్తిత్వాన్ని. మీరు దేనిపైన ఆధారపడని మీ యొక్క భాగాన్ని గుర్తిస్తారు. మీ చుట్టూ ఉన్న పరిసరాల పైన, మీ తల్లిదండ్రుల పైన, మీ బంధాల పైన, మీ ఉద్యోగం పైన, ఆఖరికి మీ శరీరం పైన కూడా ఆధారపడని మీ యొక్క భాగాన్ని గుర్తిస్తారు. ఈ విధంగా మీరు, మీ దివ్యత్వాన్ని అస్పష్టంగా అనుభూతి చెందుతారు, ఈ భాగం పూర్తి స్వతంత్రంగాను మరియు శాశ్వతంగాను ఉంటుంది.

నిజానికి మీరందరూ మల్టీడైమెన్షనల్ వ్యక్తులు; మీరు ఒకే సమయంలో వివిధ రకాల ప్రత్యేక వాస్తవాలను మీ అంతట మీరు వ్యక్తీకరించగలరు. మీరు ఒకే తలానికి సంబంధించిన కాలపద్ధతికి బంధీయై లేరు. మీ ప్రస్తుత వ్యక్తిత్వం అనేది కేవలం మీ మల్టీడైమెన్షనల్ భాగంలో ఉన్న ఒకానొక లక్షణం మాత్రమే. మీరు ప్రస్తుత మానవశరీరంలో వ్యక్తపరుస్తున్నది కేవలం మీలోని ఒక లక్షణమేనని మీరు

గుర్తించిన వెంటనే, మీరు దానిని అధిగమిస్తారు మరియు మీరు ఎవరనేది తెలియజేసే మీ ప్రజ్ఞాత్మతో బంధాన్ని ఏర్పరుచుకోగలరు.

కాని మీరు దీనిని చేరే ముందు, మీ అంతరంలోని గాయపడిన భాగాలను నయం చేయవలసిన అవసరం ఉంది.

మీరు అహం యొక్క ఆజ్ఞలు మరియు ఆదేశాల ప్రకారం జీవించిన కారణంగా, అది మీ అంతరంలో మానసికపరమైన గాయాలను సృష్టించింది. అహం ఆధారిత చైతన్యాన్ని విడుదల చేయడం ఆరంభించిన మొదట్లో, అది మీలో సందేహాలను, అలజడులను మరియు అసంతృప్తిని సృష్టిస్తుంది. ఈ మొదటి మలుపు తర్వాత, మీరు కొత్తస్థితిలోకి ప్రవేశిస్తారు: ఇది మీ అంతర్‌గాయాలను గమనించడం, తెలుసుకోవడం మరియు హీల్ చేయడం యొక్క స్థితి. ప్రస్తుతం నేను ఈ స్థితి గురించి చెప్పాలనుకుంటున్నాను.

మీరు అహం యొక్క ఆధిపత్యంలో ఉన్నట్లయితే, మీ చర్యలు మరియు ఆలోచనలు ఎక్కువ కాలం భయం మీద ఆధారపడి ఉంటాయి. మరొక విధంగా చెప్పాలంటే, మీరు అధికారం, హోదా మరియు అదుపులను తీవ్రంగా కాంక్షిస్తూ కఠినంగా ప్రవర్తించారు అని. ఈ విధంగా మీరు మీ సొంత స్వభావానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంటారు. మీ యొక్క ప్రవర్తన నిజమైన అవసరాల మీద కాకుండా, బయటి వారి ఆదర్శాలపై ఆధారపడుతుంది. మీరు వాస్తవానికి ఒక వ్యక్తిని ప్రేమించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండలేరు. ఎందుకంటే ప్రేమ అనేది అదుపు లేదా అధికారాలకు పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది కాబట్టి. ఈ అహం చైతన్యం యొక్క స్థితి, మీ ఆత్మ యొక్క సంపూర్ణత్వంపై దాడి చేసింది. అహం పరిపాలనలో ఆత్మ బాధకు లోనయ్యింది.

మీ అంతట మీరుగా ఈ అహం చేతి నుంచి విడువడినప్పుడు, మీ అంతర్ బాధ మీకు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ బాధ తన ముసుగులను తొలగించుకుని మరింత సహజంగాను మరియు స్పష్టంగాను కనిపిస్తుంది. ఇంకా మీరు అలజడులు మరియు సందేహాల యొక్క స్థితిలో ఉండడం వలన, మీకు ఈ బాధతో ఎలా వ్యవహరించాలో తెలియదు. తరచూ, మీ అంతర్ గాయాలను నిర్లక్ష్యిస్తుంటారు, ఎందుకంటే అవి చెడు పద్ధతుల యొక్క ప్రవర్తనకు దారి తీస్తాయి కాబట్టి: వ్యసనం, నిరాశ, అదుపు చేయలేని మన:స్థితి, మాట్లాడే విధానంలోని సమస్యలు, సన్నిహిత సంబంధాలలో ఇబ్బందులు మొదలగునవి.

మిమ్మల్ని మీరే నిర్ణయించుకోవడం అనేది, ఇప్పుడే కాంతి వైపుకు తిరిగి వెళ్ళడం మొదలుపెట్టిన ఆత్మకు తీవ్రమైన బాధను కలుగజేస్తుంది. అధికారం మరియు అదుపుల యొక్క అవసరాన్ని ఆత్మ విడుదల చేయడం వలన, ఆత్మలో అతిసున్నితత్వం పెరుగుతుంది. ఆ తర్వాత ఆత్మ తన సొంత నిర్ణయాలలో ఇరుక్కుపోతుంది.

చాలామంది అహం మరియు హృదయం మధ్యలో ఉన్న గందరగోళ ప్రదేశంలో సంచరిస్తున్నారు. వీరు ప్రేమపూర్వకమైన వాస్తవం కోసం అన్వేషిస్తున్నారు, కాని వీరు ఇప్పటికి అహం యొక్క ఆధిపత్యానికే ఎక్కువగా ఆకర్షింపబడుతున్నారు.

నిజానికి మిమ్మల్ని బాధ పెడుతున్నది మీ అంతర్‌గాయం ఎంత మాత్రం కాదు, మీరు వేటినైతే "చెడు లక్షణాలు"గా పరిగణిస్తున్నారో అవే మిమ్మల్ని తీవ్రమైన బాధకు గురి చేస్తున్నాయి. మీ గాయాన్ని నిర్ణయించడం వలనే మీరు అసంతృప్తికి లోనవుతున్నారు. మిమ్మల్ని మీరు అంగీకార వైఖరితో చూసుకున్నట్లయితే, మీరు వ్యసనానికి, లేదా నిరాశకు, లేదా బలహీనమైన వ్యక్తిత్వాన్ని మీలో ఇకపై చూడరు. ఒకసారి మీ అంతర్ బాధను గమనించండి. అది సాధ్యమైనంత సున్నితమైన మరియు ప్రేమపూర్వకమైన పద్ధతిలో పోషింపబడాలని మరియు సంరక్షింపబడాలని కోరుకుంటోంది.

అహం నుంచి హృదయం వైపు జరుగుతున్న పరివర్తనపు ప్రక్రియ యొక్క రెండవ దశలో అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీ అంతర్ బాధను తెలుసుకోవడానికి సుముఖతను చూపాలి: దీనిని అంగీకరిస్తూ, దీని యొక్క మూలాలను అర్థం చేసుకోవాలి మరియు వాటిని అలాగే ఉండడానికి అనుమతించాలి.

మీరు అహం ఆధారిత చైతన్యం యొక్క భావప్రకటనలన్నింటిలో ఉన్న భయం యొక్క మూలాన్ని అర్థం చేసుకోగలిగినప్పుడే, మీరు హృదయ ఆధారిత చైతన్యం యొక్క వాస్తవంలోకి ప్రవేశిస్తారు. మీ ప్రవర్తన మీకు తప్పుగా అనిపించినప్పటికీ, మీరు ఆ ప్రవర్తన వెనుకనున్న బాధను, ఒంటరితనాన్ని మరియు సంరక్షణ యొక్క అవసరాన్ని గుర్తించినట్లయితే, మీరు మీ ఆత్మ ప్రదర్శించే చెడు ప్రవర్తనతో బంధాన్ని ఏర్పరుచుకోగలరు. మీరు ఆత్మను భయంలో గుర్తించిన వెంటనే, మీరు దానిని క్షమించగలరు. మొట్టమొదటిగా దీనిని మీ మీద మీరే ప్రయోగించుకోవాలి.

నిజానికి మీ అంతరంలో మీరు ద్వేషిస్తున్న విషయాన్ని గాని, లేదా చాలాకాలం నుంచి మిమ్మల్ని నిరాశకు గురిచేస్తోందని భావించి మీరు వదిలి వేయాలనుకుంటున్న

విషయాన్ని గాని తీసుకోండి. అది అభద్రతాభావం, సోమరితనం, అసహనం, వ్యసనం గాని అయి ఉండవచ్చు. పైన చెప్పిన వాటిలో మీరు ఉండవలసిన అవసరంలేదని భావిస్తున్న ఏదో ఒక విషయాన్ని తీసుకోండి. ఇప్పుడు మీరు ఈ విషయం లేదా ఈ లక్షణం లేదా ఈ వైఖరి వెనుకనున్న ముఖ్యోద్దేశ్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఈ విషయాన్ని అదే పనిగా మిమ్మల్ని అనుభూతి చెందమని లేదా చేయమని ఒత్తిడి చేసేది ఏమిటి? మిమ్మల్ని ప్రేరేపిస్తున్న దానిలో ఉన్న భయం యొక్క లక్షణాన్ని గుర్తించగలరా?

మీరు అక్కడ భయం ఉందని తెలుసుకున్న వెంటనే, మీ అంతరంలో సున్నితత్వం పెరుగుతూ మరియు మీరు ఈ విధంగా అనుభూతి చెందడాన్ని గమనించారా!: “ఓహ్ దేవుడా, నువ్వు చాలా భయపడుతున్నావని నాకు తెలియదు! నేను నీకు సహాయం చేస్తాను.” ఇప్పుడు మీ వైఖరిలో సహనం ఉంది. ప్రేమ మరియు క్షమాపణ కూడా ఉన్నాయి.

మీరు భయం ఆధారిత ప్రవర్తనలైన ఆగ్రహం, వ్యసనం, బానిసత్వం, గర్వం మొదలైన వాటిని “చెడుగాను, పాపంగాను, లేదా నేరంగాను” పరిగణిస్తున్నారంటే, మిమ్మల్ని మీరు నిర్ణయిస్తున్నట్లే. కాని నిర్ణయించడం అనేది భయపూరిత చర్య. మిమ్మల్ని మీరు నిర్ణయిస్తునప్పుడు మీ అంతరంలో కఠినత్వం పెరగడాన్ని గమనించారా! ఉదాహరణకి మీ కళ్ళు చల్లబడడం మరియు మీ శరీరంలో ఏదో ఒత్తిడి కలిగినట్టు మొదలైనవి. నిజానికి మనం విషయాలను ఎందుకు నిర్ణయించాలి? విషయాలలోకి అంత సూక్ష్మంగా వెళ్ళి మంచి-చెడుల క్రింద విభజించడం అవసరమా? మనం నిర్ణయిస్తున్న అవసరం వెనుక ఉన్న భయం ఏమిటి? ఇది మన అంతరంలో ఉన్న సొంత చీకటిని ఎదుర్కోవడం యొక్క భయమే. ముఖ్యంగా ఇది జీవించడానికి సంబంధించిన భయం.

అహం ఆధారిత చైతన్యాన్ని విడుదల చేయడం ద్వారా, మీరు విషయాలను పూర్తి సరికొత్త మార్గంలో చూసే విధానాన్ని అభివృద్ధి చేయాలనుకుంటారు. ఈ విధంగా చూడడం అనేది నిర్గుణస్థితిని తెలియజేస్తుంది. దీని అర్థం విషయం ఏమిటనేది పరిగణలోకి తీసుకుని కేవలం గమనించడమే మరియు విషయాలు “ఇలాగే ఉండాలి” అని నిర్ణయించే వైఖరిపై అయిష్టతను చూపడం. మీరు అహం ఆధారిత ప్రవర్తన యొక్క కారణాలను మరియు ప్రభావాలను గమనిస్తూ, మీ అంతరంలోని భయం యొక్క మూలాన్ని గుర్తిస్తారు. అందువలన మీరు ఇప్పుడు అహాన్ని స్పష్టంగా

గుర్తించగలరు. మీకు స్పష్టంగా కనిపిస్తున్నది ఏదైనప్పటికీ కూడా, మీరు కోరుకున్నట్లయితే దానిని విడుదల చేయవచ్చు.

ప్రతీ మనిషికి భయం గురించి తెలుసు. మీలో ప్రతి ఒక్కరికి భయంలో ఇరుక్కుపోయి ఉన్న చీకటి మరియు ఒంటరితనం గురించి బాగా తెలుసు. పిల్లల యొక్క మొహంలో భయం కనపడినప్పుడు, తక్షణమే మీరు దానికి స్పందిస్తూ వారిని హత్తుకుంటారు. కాని హింస మరియు క్రూరత్వం యొక్క ముసుగుల ద్వారా భయం పరోక్షంగా కనపడినప్పుడు, అది క్షమించరానిదిగా అనిపిస్తుంది. ప్రవర్తన ఎంతగా అయితే కౄరత్వాన్ని మరియు కఠినత్వాన్ని కలిగి ఉంటుందో, అంతగా దాని వెనుకనున్న భయాన్ని మరియు ఒంటరితనాన్ని గమనించడం కూడా కష్టతరమవుతుంది.

అయినప్పటికీ మీరు చేయగలరు.

భయం మరియు ఒంటరితనం యొక్క మీ సొంత అనుభవాల లోతుల్లోంచి, మీరు హంతకులు, రేపిస్టులు మరియు క్రిమినల్స్ యొక్క ఆత్మలలో లోతుగా ఉన్న భయాన్ని స్పృశించగలరు.

మీరు వారి యొక్క చర్యలను అర్థం చేసుకోవడం మీకు సాధ్యమవుతుంది. మీ సొంత చీకటితో ఉన్న సన్నిహితమైన అనుభవం ఆధారంగా వాటిని చూసినట్లయితే, మీరు వాటిని సులభంగా విడుదల చేస్తారు. మీరు ఈ చర్యలను నిర్ణయించవలసిన అవసరం లేకుండా యధాతథంగా ఉండనివ్వగలరు. మీరు భయాన్ని ఒక శక్తిగా మీరు నిజంగా అర్థం చేసుకున్నప్పుడు మరియు మీ జీవిత అనుభవాల ద్వారా దీనిని క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడు, మీరు పరిస్థితులను నిర్ణయించడం వదిలివేస్తారు. భయం అనేది మంచీ కాదు, చెడూ కాదు. ప్రస్తుతం భయం పోషించడానికి ఒకానొక పాత్రను కలిగి ఉంది.

మనుష్యుల అభిప్రాయాల ప్రకారం భయాన్ని వివరించడం చాలా కష్టం, భయం అనేది దీవెన మరియు అదే విధంగా బాధ కూడా. మీ వాస్తవంలోకి భయాన్ని అనుమతించడం యొక్క ఎంపిక అన్నది ఇతరులు మీ కోసం తయారు చేసినది కాదు. నిజం చెప్పాలంటే మీరే దేవుళ్ళు. మీ వాస్తవంలో ఒక ప్రధానమైన పాత్రను పోషించడానికి 'భయాన్ని' అనుమతించినవారు 'మీరే'. మీరు దీనిని సృష్టించినది మిమ్మల్ని మీరు బాధించుకోవడానికి కాదు. ప్రపంచం కేవలం ఒక్క ప్రేమ మీదే ఆధారపడకుండా, మరింత ప్రాముఖ్యత మరియు పరిపూర్ణత్వం గల

వాస్తవాన్ని సృష్టించడం కోసమే మీరు ఇదంతా చేశారు. ఇది నమ్మశక్యంగా ఉండదని నాకు తెలుసు, కాని నేను మీకు చెప్పాలనుకుని ప్రయత్నిస్తున్న విషయాన్ని, మీరు మీ ఇంగితజ్ఞానం ద్వారా గ్రహించగలరు.

భయం అనేది సృష్టి యొక్క అతి విలువైన భాగం. ఎక్కడైతే భయం ఉంటుందో అక్కడ ప్రేమ ఉండదు. ఎక్కడైతే ప్రేమ ఉండదో అక్కడ మీ ఊహకందని కొత్త మార్గాలలో ప్రేమను కనుగొంటారు. ప్రేమ యొక్క ఉనికి లేకపోవడం వలన, మీరు అన్ని రకాల మనోభావాలను అన్వేషించగలరు మరియు సృష్టించగలరు కూడా. మీరు వివిధ మార్గాలలో ప్రేమ-ఉనికి లేకపోవడాన్ని అనుభూతి చెందగలరు. గతంలో భయం యొక్క అనుభవాలను రుచి చూసినవారే ప్రేమ యొక్క ఉనికిని అనుభూతి చెందగలరు. అలా కాకపోతే ప్రేమ అంతటా వ్యాపించి ఉండేది, కాని మీరు దానిని యధాతథంగా గుర్తించలేకపోయేవారు.

భయాన్ని సృష్టించడం ద్వారాను, మిమ్మల్ని చుట్టిముట్టి ఉన్న ప్రేమ యొక్క సముద్రం నుంచి బయటకి మీ అంతట మీరు విసిరి వేయబడడం ద్వారాను, మీరు మొదటిసారిగా ప్రేమ యొక్క అనుభవాన్ని పొందడానికి మిమ్మల్ని మీరు అనుమతించారు.

ఇది మీకు అర్ధమయ్యిందా?

మీరు ప్రేమను సృష్టించలేరు. కాని ప్రేమ యొక్క అనుభవాన్ని సృష్టించారు. అందువలన మీకు ప్రేమకు పూర్తి వ్యతిరేకంగా ఉన్న ఏదో ఒకటి మీకు కావలసి వచ్చింది. దీని కోసం మీరు భయాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారు. మాయపొర ఆవలి వైపు ఉన్న మేము, మీ వాస్తవంలో భయం పోషిస్తున్న ఆధ్యాత్మిక పాత్రను స్పష్టంగా చూడగలం. అందువలన, మీరు దీనిని నిర్ణయించేవారిగా ఉండవద్దని మేము మీకు మరీ మరీ చెబుతున్నాం. దయచేసి భయాన్ని నిర్ణయించవద్దు మరియు అది మీలోను మరియు ఇతరులలోను తీసుకువచ్చే చీకటిని సందేహించవద్దు. మీరందరూ ప్రేమ నుంచే సృష్టింపబడ్డారు మరియు మీరు ఇదే ప్రేమను తిరిగి పొందడం కోసమే సృష్టింపబడ్డారు.

మీరు అహం నుంచి హృదయం వైపు పరివర్తనం చెందుతున్న ప్రక్రియ యొక్క రెండవ దశలో ప్రవేశించినప్పుడు, మీరు మీ అంతర్ గాయాన్ని మరియు మీ భయాన్ని ఎదుర్కొంటారు. మీరు అవగాహన మరియు అంగీకార వైఖరితో చూడడానికి వీటిని ఆహ్వానిస్తారు.

మీ అంతర్ గాయం మరియు భయం యొక్క ఎరుకను పొందిన వెంటనే, మిమ్మల్ని మీరు నిర్ణయించుకునే దశలోకి పయనించవచ్చు. ఇక్కడ మీరు క్రూరమైన ప్రవర్తనను ప్రదర్శించవచ్చు. ఇది మీరు ముందుకు వెళ్ళడానికి బదులు వెనుకకు వెళ్తున్నట్టుగా మీకు అనిపించవచ్చు. ఈ దశలో మీరు ప్రమాదకరమైన ప్రదేశంలో ఉంటారు, ఈ ప్రదేశం అహంకారం మరియు హృదయం మధ్యనున్న శూన్యస్థితిగా ఉంటుంది. మీరు పాతదనాన్ని విడుదల చేయాలని అనుకుంటున్నారని కూడా మీకు తెలుసు. అయినప్పటికీ, మీరు కొత్తదనాన్ని స్వీకరించలేక పోతున్నారు. కాబట్టి మీరు వ్యక్తిగతమైన సందేహాలు మరియు నిర్ణయాలలో ఇరుక్కుపోతున్నారు. కొంత సమయం మిమ్మల్ని మీరు నిర్ణయించుకోకుండా ఉండడమనేదే నిజానికి ఒక కొత్త మలుపు.

మిమ్మల్ని మీరు ఇష్టం మరియు అంగీకార వైఖరితో చూడడానికి సిద్ధపడినప్పుడు మాత్రమే, మీరు హృదయ ఆధారిత చైతన్యం యొక్క వాస్తవంలోకి ప్రవేశిస్తారు. దీనికి ముందు, మీరు కేవలం కృత్రిమమైన ఆదర్శాలతో మిమ్మల్ని మీరు పోల్చుకుంటారు, కాని వీటిని సాధించడానికి ప్రయత్నించి చాలాసార్లు విఫలమవుతారు కూడా. దీని గురించి మిమ్మల్ని మీరు దూషించుకుంటూ మరియు మీ మనస్సులో సృష్టించుకున్న ఆదర్శాలకు తగినట్టుగా మిమ్మల్ని మీరు మలుచుకోవాలని బలవంతంగా ప్రయత్నిస్తారు.

ఈ విధమైన కఠినత్వం ప్రాణాలను తీసే ఒక ప్రమాదకరమైన ఆయుధమనే విషయాన్ని నేను మీకు తెలియజేస్తున్నాను. ఇది ప్రేమకు పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. నిజానికి ప్రేమ దేనితోనూ పోల్చుకోదు మరియు ఇది ముఖ్యంగా మిమ్మల్ని దేని కోసం బలవంతం చేయదు, లేదా ఇది మిమ్మల్ని ఏదో ఒక విధంగా మార్చాలని కూడా ప్రయత్నించదు. ప్రేమ ఈ విధంగానే ఉండాలి అని తెలిపే నిర్వచనం లేదు. హృదయం యొక్క చైతన్యంలో 'ఈ విధంగానే ఉండాలి' అని తెలిపే విభాగమే లేదు. మీరు హృదయం నుంచి పరిశీలించినప్పుడు, ఈ నీతివంతమైన ఆదర్శాలు వాస్తవాన్ని ముక్కలుగా విభజించడాన్ని లేదా దీనికి అర్థవివరణను ఇవ్వడాన్ని స్పష్టంగా గమనించగలరు. ఇవి మీ మెదడులో పుట్టిన ఆలోచనలే. కాని ఏ ఇద్దరి మెదడులు ఒకే విధంగా ఉండవు. అందువలన ఆదర్శాలు పెట్టుకోవాలి మరియు మంచిని నిర్వచించాలి అనేవే ప్రధానాంశంగా ఉంటూ, మానవుల మధ్య గొడవలు మరియు యుద్ధాలకు కారణమవుతున్నాయి. చాలావరకూ ఈ ఘర్షణలకు మరియు ఆగ్రహాలకు కారణం ఆదర్శాలు కావు, కాని వీటి క్రింద ఉన్న అదుపు చేయాలి మరియు నిర్బంధించాలి అనేవే మూల కారణాలు.

రాజకీయ, వ్యక్తిగత లేదా ఆధ్యాత్మికత ఆదర్శాలు, ఆరోగ్యం, అందం మరియు శుభ్రత యొక్క మొదలైన నియమాలు – మీ పరిస్థితులు ఎలా ఉండాలి, మీరు ఎలా ప్రవర్తించాలి అనే వాటిని తెలియజేస్తాయి. ఇవన్నీ మంచిని నిర్వచించాలని మరియు నిర్బంధించాలని ప్రయత్నిస్తాయి.

కాని, ప్రేమ మంచిని నిర్వచించడానికి ఇష్టపడదు. ఇది ఆదర్శాల కన్నా వాస్తవాన్ని ఎక్కువగా ఇష్టపడుతుంది. ఏది నిజం అనే దాని వైపు ప్రేమ మరలుతుంది.

నిజానికి హృదయం, మీ ఎదుగుదల మరియు మీ వినాశనం యొక్క భావప్రకటనల రెండింటిని ఇష్టపడుతుంది. ఇది ప్రతీ దానిని గమనిస్తుంది; హృదయం కేవలం అక్కడ ఉంటూ, మీరు అనుమతిస్తే తన ఉనికితో మిమ్మల్ని హత్తుకుంటుంది.

మీరు ప్రేమ యొక్క వాస్తవాన్ని, హృదయం యొక్క వాస్తవాన్ని తెరవగలిగినట్లయితే, మీరు నిర్ణయించడాన్ని పూర్తిగా మీ నుండి విడుదల చేస్తారు. వర్తమానంలో మిమ్మల్ని మీరు ఉన్నది ఉన్నట్టుగా అంగీకరిస్తారు. నిజానికి మీరు మీరుగానే ఉన్నారనే విషయాన్ని అనేక రకాల కారణాల ద్వారా తెలుసుకుంటారు. ఇప్పుడు, మీరు దీనిని తెలుసుకోవడానికే పరిశోధనను మరియు అన్వేషణను ఆరంభించబోతున్నారు.

ఈ క్షణానికి చేరువైనప్పుడు, అది ఆత్మకు ఒక గొప్ప దీవెనలా ఉంటుంది. ఇప్పుడు మిమ్మల్ని మీరు నయం చేసుకోగలరు. మీరు మధ్య మధ్యలో మిమ్మల్ని మీరు నిర్ణయించుకోవడంలోకి తిరిగి పడిపోతుంటారు, కాని ఇప్పుడు మీరు ప్రేమ ఎలా అనుభూతి చెందుతుంది అనే జాగృతావస్థ యొక్క స్మృతిని కలిగి ఉంటారు. మీరు దీనిని కలిగి ఉన్నానని తెలుసుకున్న వెంటనే, మీలో సరికొత్తదనాన్ని తిరిగి కనుగొనడం మొదలుపెడతారు. ఎందుకంటే మీరు మీ ఇంటి యొక్క మధురస్మృతిని మళ్ళీ రుచి చూసారు కాబట్టి.

అహం నుంచి హృదయం వైపు పరివర్తనం చెందుతున్న రెండవ దశలో, మీతో మీరు అతిసన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటారు. మీ గతానికి సంబంధించిన అనుభవాలను అతిసన్నిహితంగా గమనిస్తారు మరియు మీరు మళ్ళీ బాధాకరమైన జ్ఞాపకాలలో తిరిగి జీవిస్తారు. ఇవి ఈ జన్మకు మరియు గతజన్మలకు సంబంధించిన జ్ఞాపకాలు. మీ గతజన్మల నుంచి ఇప్పటి వరకూ మీరు మోస్తున్న మానసికపరమైన అనుభవాల యొక్క కలయికయే మీ ప్రస్తుత వ్యక్తిత్వం. మీరు ఈ బరువును బట్టలతో

నిండి ఉన్న ఒక బ్యాగ్‌లా చూడవచ్చు. మీరు శరీరంపై దుస్తులను ధరించినట్టుగా, మీరు గతంలో చాలా పాత్రలను మరియు వ్యక్తిత్వాలను పోషించారు. మీరు ముఖ్యంగా కొన్ని పాత్రలను చూసినప్పుడు, అవి మీ వ్యక్తిత్వం యొక్క భాగాలేనని చాలా దృఢంగా విశ్వసించారు. ముఖ్యంగా మీరు కొన్ని పాత్రల విషయంలో “ఇది నేనే” అని అనుకుంటారు.

నిజానికి ఈ పాత్రలతో మీకున్న అనుబంధం ఏమిటని మీరు పరిశోధించినప్పుడు అవే ‘మీరు’ కాదని మీరు కనుగొంటారు. మీరు నిజమని భావిస్తున్న మానసికపరమైన పాత్రలు లేదా వ్యక్తిత్వాలు ‘మీరు’ కాదని తెలుసుకుంటారు. మీరు, మీ ‘దుస్తులు’ కాదనే విషయాన్ని తెలుసుకుంటారు. మీ ఆత్మ ఈ ఈ పాత్రల యొక్క అనుభవాలను కావాలని కోరుకోవడం వలనే మీరు వీటిని ధరించారు.

ఈ అనుభవాలన్నింటిని ఆత్మ ఆనందంగా స్వీకరించింది, ఎందుకంటే ఆత్మ తనకు తానుగా నేర్చుకోవాలని అంగీకరించిన ప్రక్రియలో ఇవి భాగంగా ఉన్నాయి కాబట్టి. అందువలన ఈ అనుభవాలన్నీ చాలా ఉపయోగకరమైనవి మరియు చాలా విలువైనవి కూడా.

మీ సొంత పాత్రలను లేదా వ్యక్తిత్వాలను మీరు సన్నిహితంగా గమనించిన వెంటనే, వీటిని మీ గతం యొక్క బాధాకరమైన మరియు తీవ్రమైన గాయాల యొక్క అనుభవాలని మరియు అవి మిమ్మల్ని ఇప్పటికి అలాగే అంటిపెట్టుకుని ఉన్నాయని మీరు గుర్తిస్తారు. వీటిని విడుదల చేయలేకపోతున్నట్లుగా మీకు అనిపించవచ్చు. ఇవి మీ రెండో చర్మంలాగా తయారయ్యాయి, ఇవి దుస్తులుగా ఉండడానికి బదులు చర్మంగా తయారయ్యాయి.

ఇవి మీ గతానికి సంబంధించిన కష్టమైన పాత్రలు. నిజానికి ఇవి మీ జీవితాన్ని ఆనందంగా జీవించనివ్వకుండా, ఇప్పుడు మిమ్మల్ని అడ్డుకుంటున్నాయి. మీరు ఈ భాగాలతో చాలా ఎక్కువగా గుర్తించబడుతున్నారు, ఎంత ఎక్కువగా అంటే మీరే అవి అని భావిస్తున్నారు. వీటి వలన మీరు ఒక బాధితుడిగా అనుభూతి చెందుతున్నారు మరియు మీరు వీటి వలన జీవితం పట్ల చెడు అభిప్రాయాన్ని కలిగి ఉంటున్నారు. కాని ఈ చెడు అభిప్రాయం విధిగా మీ జీవితాన్ని అంటిపెట్టుకుని ఉండవు; ఎందుకంటే ఈ అభిప్రాయాలు కేవలం మీ ఆత్మ చైతన్యంలోని గాయపడిన భాగాలను మాత్రమే పట్టుకుని ఉంటాయి కాబట్టి.

ఇప్పుడు ఈ భాగాలకు హీలింగ్ అవసరం. కాని ఇది ఇంతకు ముందెన్నడూ లేనంత ప్రేమపూర్వకమైన మరియు తెలివైన చైతన్యంతో, మీరు గతంలోకి తిరిగి ప్రవేశించడం ద్వారానే సాధ్యమవుతుంది. అహం నుంచి హృదయం వైపు జరిగే పరివర్తన ప్రక్రియ యొక్క రెండవదశలో, మీరు గతం యొక్క గాయాలను మీ ప్రస్తుత చైతన్యంతో చుట్టుముడుతూ వాటిని మీరు హీల్ చేయగలరు. మీరు హృదయం యొక్క దృష్టిని కేంద్రీకరించడం ద్వారా, మీరు వర్తమానంలో వీటిని తిరిగి అనుభవిస్తూ, మీ గతానికి సంబంధించిన గాయపడిన భాగాలను మీ నుండి విడుదల చేస్తారు.

మీరు ఒక గొప్ప ఓటమిని లేదా బాధను లేదా చెడును అనుభవించినప్పుడు, మీ అంతరంలో గాయం ఏర్పడుతుంది. ఇది ఎందుకు సంభవించిందో మీకు అర్థం కాదు. మీరు చాలా జన్మలలో ఇటువంటి గాయాల యొక్క అనుభవాలను పొందారు. నిజానికి ఆత్మచైతన్యం ఇతర తలాల నుంచి అహం స్థితిలోకి వచ్చినప్పటి నుంచి కూడా గాయపడుతోంది: ఆత్మ ఏకత్వాన్ని లేదా ఇంటిని కోల్పోయాననే దానిని గుర్తుపెట్టుకుంది మరియు ఇది ఎందుకనేది మాత్రం అర్థం చేసుకోలేదు.

మీరు ఊహాశక్తి ద్వారా, మీ అసలైన గాయం యొక్క సంఘటన దగ్గరకి వెళ్ళినప్పుడు మరియు మీ హృదయ చైతన్యంతో దానిని చుట్టిముట్టినప్పుడు, ఈ సంఘటన పట్ల మీ నిజమైన స్పందనను మార్పు చెందిస్తారు. మీరు గాయాన్ని ఘోరంగాను మరియు సందేహంగాను చూస్తున్న వైఖరిని మారుస్తూ, నిజానికి అక్కడ ఏం సంభవించిందో గమనించి చూస్తారు. ఈ విధంగా గతంలోకి ప్రయాణించడం ద్వారా, మీరు అక్కడ ఏం సంభవించిందో గమనించగలరు. ఈ ప్రయాణం మీకు నిజానికి అక్కడ జరిగిన దానిని ఆధ్యాత్మికపరంగా అర్థం చేసుకోవడానికి అవకాశాన్ని కలిపిస్తుంది. వర్తమానంలో మీకు ఈ అవకాశం లభించినప్పుడు, మీరు మళ్ళీ మీ వాస్తవానికి మాస్టర్‌గా తయారవుతారు. మీరు జరిగిన ప్రతీ విషయానికి ఒక అర్థం మరియు ఆశయం ఉన్నాయనే దానిని మీ హృదయం ద్వారా అర్థం చేసుకోవడం వలన, ఇప్పుడు మీరు ఈ మొత్తం కథను అంగీకరించగలరు. మీ జీవితంలో సంభవిస్తున్న ప్రతీ దానిలో స్వేచ్ఛా ఎంపిక యొక్క లక్షణం ఉంటుందని మీ హృదయం ద్వారా గ్రహించగలరు. అందువలన మీరు ఈ సంఘటనల యొక్క పూర్తి బాధ్యతను అంగీకరించడం ఆరంభిస్తారు. మీరు మీ సొంత బాధ్యతను స్వీకరించినప్పుడు, మీరు స్వేచ్ఛగా పయనించగలరు.

మీ గతజన్మ వ్యక్తిత్వాలను సినీ యాక్టర్స్ చేసే పాత్రలుగా భావించినప్పుడే, మీరు ఎక్కడకు కావాలనుకుంటే అక్కడకు స్వేచ్ఛగా వెళ్ళగలరు. అప్పుడే మీరు హృదయ

ఆధారిత చైతన్యంలోకి స్వేచ్ఛగా ప్రవేశించగలరు. మీరు గతంలో చేసిన ఏ పాత్రను ఎక్కువ కాలం పట్టుకుని ఉండరు: దీని అర్ధం బాధితుడు లేదా ఆవేశపరుడు, మగ లేదా ఆడ, నలుపు లేదా తెలుపు, పేద లేదా ధనిక మొదలైన పాత్రల నుంచి సులభంగా మీరు బయటకు రాగలరని. మీరు ద్వంద్వాల యొక్క లక్షణాలతో ఆడుకున్నప్పుడు మరియు అది మీకు అందిస్తున్న ఆనందాన్ని మరియు సృజనాత్మకతను ఉపయోగించుకున్నప్పుడు, మీరు భూమి మీద ఉన్న జీవితం యొక్క అర్ధాన్ని గ్రహిస్తారు. అప్పుడే మీరు గొప్ప ఆనందాన్ని మరియు ఇంటికి తిరిగి వచ్చిన అనుభవాన్ని పొందుతారు. ఎందుకంటే మీరు మీ యొక్క భిన్నమైన పాత్రలు మరియు వ్యక్తిత్వాల క్రింద ఉన్న చైతన్యంతో బంధాన్ని ఏర్పరుచుకుంటారు కాబట్టి. మీరు మీ సొంత దివ్యత్వపు చైతన్యంతో ఆత్మ మూలాన్ని మళ్ళీ స్పృశించడం వలన అంతా ఒక్కటేనని, అంతా ప్రేమ యొక్క వాస్తవమేనని తెలుసుకుంటారు.

మేము ఈ ఛాప్టర్‌ని రెండు రకాల పద్ధతులను చెప్పి ముగిస్తాము. ఇవి మీ అనుభవాలన్నింటి క్రింద ప్రవహిస్తున్న ఏకత్వం మరియు దివ్యత్వపు చైతన్యం యొక్క ప్రవాహాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి సహాయం చేయవచ్చు.

**పద్ధతి-1**

మీ జీవితంలో ఏ మానసికపరమైన లక్షణాలు మిమ్మల్ని అధికంగా సమస్యలకు గురిచేస్తున్నాయని మీరు భావిస్తున్నారు? అలాంటి రెండు లక్షణాలను ఎంపిక చేసుకోండి.

ఆ లక్షణాల యొక్క వ్యతిరేకాలపై దృష్టి పెట్టండి. మీరు “అసహనం” మరియు “అభద్రత”లను ఎంపిక చేసుకున్నట్లయితే, మీరు ఇప్పుడు వాటి యొక్క వ్యతిరేకాలైన: “సహనం” మరియు “విశ్వాసం” పై దృష్టి పెట్టండి. ఒక్క క్షణం ఈ లక్షణాల యొక్క శక్తులను అనుభూతి చెందండి.

మీ అంతరంలోకి వెళ్ళి ఈ శక్తులను అన్వేషించండి. మీ జీవితంలో ఈ మంచి లక్షణాలకు సంబంధించిన మూడు ఉదాహరణలను చూడండి.

ఇప్పుడు మీరు ఈ మంచి లక్షణాలతో బంధాన్ని ఏర్పరుచుకుని, మీ ద్వారా వీటి శక్తిని ప్రవహించనివ్వండి మరియు అవి మిమ్మల్ని ఎలా సమన్వయపరుస్తున్నాయో అనుభూతి చెందండి.

**పద్ధతి-2**

ప్రశాంతంగా కూర్చుని లేదా పడుకుని మీ ఊహాశక్తి ద్వారా మీరు ఆనందంగా ఉన్న క్షణాలలోకి తిరిగి వెళ్ళండి. ముందుగా మీ మనసులోకి ప్రవేశించిన మొదటి విషయాన్ని తీసుకోండి. మీరు మళ్ళీ ఆ ఆనందాన్ని అనుభూతి చెందండి.

ఇప్పుడు మీరు చాలా బాధగా ఉన్న క్షణంలోకి వెళ్ళండి. మీరు ఆ క్షణంలో అప్పుడు అనుభవించిన బాధ యొక్క సారాంశాన్ని అనుభూతి చెందండి.

ఈ రెండు అనుభవాలలో ఒకే విధంగా ఉన్న విషయాన్ని గుర్తించండి. ఈ రెండు క్షణాలలో ఒకే రకంగా ఉన్న విషయాన్ని అనుభూతి చెందండి.

ఈ రెండు పద్ధతుల యొక్క సారాంశం ఏమిటంటే, మీ అనుభవాలన్నింటి క్రింద ఉన్న చైతన్యం యొక్క ఎరుకను మరియు ఎల్లప్పుడూ ఉంటున్న "మీ-తత్వం" యొక్క ఎరుకను పొందడమే అని. మీ అనుభవాల యొక్క వాహకం మరియు మీ చైతన్యానికి శాశ్వతమైన వాహకం – మీ దివ్యత్వమే. మీ ద్వంద్వానికి అతీతంగా చేరే వాస్తవానికి ప్రవేశద్వారం: మీ హృదయం యొక్క వాస్తవం.

* * * *

## అహం నుంచి హృదయం వైపు - రెండవభాగం

### మూడవస్థితి: మీ పాతదనాన్ని విడుదల చెయ్యడం

మేము ఇప్పుడు మూడవస్థితి గురించి మాట్లాడాలనుకుంటున్నాం. దానికి ముందు ఈ పరివర్తన ప్రక్రియ వరుసక్రమంలో జరుగదనే విషయాన్ని, ముఖ్యంగా మేము మీకు చెప్పాలనుకుంటున్నాం. కొన్ని సమయాలలో, మీరు గతంలో వదలివేసిన పరిస్థితుల్లోకి పడిపోవచ్చు. కాని ఈ విధంగా పడిపోవడం అనేది మిమ్మల్ని ఆ తర్వాత ఒక గొప్ప స్థితి వైపు నడిపించవచ్చు. అందువలన ఈ మలుపులు మీ గమ్యం యొక్క దూరాన్ని తగ్గించేవిగా ఉండవచ్చు. ప్రతీ ఆత్మ యొక్క ఆధ్యాత్మిక మార్గం సాటిలేనిదిగాను మరియు ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఈ నాలుగు స్థితుల గురించి మేము అందిస్తున్న ఈ సూచనలు, మీ ప్రక్రియలోని ముఖ్యమైన మలుపులను గుర్తించడానికి సహాయం చేయగలవు. ఈ సూచనలు మరియు లక్షణాలు కేవలం వాస్తవాన్ని చూపగలిగే పరికరాలుగా ఉంటాయి. కాని ఈ వాస్తవాన్ని మీ మనస్సు మరియు మీ మానసిక స్థితి ద్వారా మాత్రం గుర్తించలేరు.

మీ అంతర్ గాయాలను అంగీకరించినప్పుడు మరియు ముందు ఛాప్టర్‌లో మేము చెప్పినట్టుగా మీ చైతన్యంలోని గాయపడిన భాగాలను హీల్ చేసినప్పుడు మాత్రమే, మీ శక్తి మార్పు చెందుతుంది. మీరు మీ పాతదనాన్ని విడుదల చేస్తున్నారు. మీ పూర్తి ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో కొత్త మార్గంలో అనుభవాలను పొందడానికి ఒక ప్రదేశాన్ని సృష్టిస్తున్నారు. ఈ ఛాప్టర్‌లో మేము మీకు అహం కేంద్రంగా ఉన్న చైతన్యాన్ని విడుదల చేసినప్పుడు శక్తిపరంగా ఏం జరుగుతుందనే విషయాన్ని వివరించాలని అనుకుంటున్నాం. మీరు అహం ఆధిపత్యం నుంచి హృదయ ఆధారిత చైతన్యం వైపు కదలడం వలన శక్తిపరంగా ఏం జరుగుతున్నదంటే, ఇప్పటి వరకూ మూడవచక్రం నిర్వహించిన మీ బాధ్యతను ఇప్పుడు హృదయచక్రం తీసుకుంటుంది.

చక్రాలు, మీ వెన్నెముకని ఆనుకుని శక్తి యొక్క కేంద్రాలుగా ఉంటాయి. ముఖ్యంగా, ఈ శక్తి కేంద్రాలన్నీ కూడా జీవితం యొక్క ప్రధాన అంశాలతో ముడిపడి ఉంటాయి. ఉదాహరణకి “ఆధ్యాత్మికత” (సహస్రారం), “సంభాషణ” (విశుద్ధ చక్రం), లేదా “మనోభావాలు” (మణిపూరక చక్రం). మీ శరీరంలోని కొన్ని ప్రత్యేక స్థలాలకు సంబంధించినవిగా ఈ చక్రాలు ఉండడం వలన, ఇవి మీ భౌతికవాస్తవికతలో కూడా కొంతవరకూ భాగంగా ఉంటాయి. కాని ఇవి మీ కళ్ళకు కనిపించవు. కాబట్టి మీరు వీటిని ఆత్మ మరియు భౌతిక పదార్థాలకు మధ్యన వ్రేలాడుతున్నవిగా చెప్పవచ్చు;

ఇవి ఈ రెండింటి మధ్య వారధిని సృష్టిస్తాయి. ఇవి మీ ప్రజ్ఞాత్మ (ఆత్మ చైతన్యం) రావడానికి ప్రవేశద్వారాన్ని ఏర్పరుస్తాయి. ఇవి ప్రజ్ఞాత్మ భౌతిక రూపాన్ని ధరించడానికి అవకాశాన్ని కలిపిస్తాయి మరియు దీనికి మీ జీవితంలో జరుగుతున్న విషయాలను సృష్టించే అవకాశాన్ని అందిస్తాయి.

హృదయచక్రం మీ ఛాతి మధ్యభాగంలో ఉంటుంది. ఈ చక్రం, ప్రేమ మరియు ఏకత్వం యొక్క శక్తికి స్థానంగా ఉంటుంది. ఇది ఐకమత్యం మరియు సమన్వయాలకు సంబంధించిన శక్తులకు వాహకంగా ఉంటుంది. ఒక్కక్షణం, మీరు మీ ఆసక్తితో ఈ కేంద్రాన్ని గమనించినట్లయితే, మీరు వాత్సల్యాన్ని లేదా ఏదో తెరవబడిన అనుభూతిని పొందవచ్చు. మీరు ఏ అనుభూతిని పొందనట్లయితే, దానిని వదిలివేస్తూ మరియు మరొకసారి ప్రయత్నించండి.

హృదయం క్రింద ఉన్న చక్రాన్ని మణిపూరకచక్రంగా పిలుస్తారు. ఇది పొట్ట భాగంలో ఉంటుంది. ఇది "ఇచ్ఛ"కు స్థానంగా ఉంటుంది. మీ శక్తిని భౌతికవాస్తవంలో కేంద్రీకృతం చేయడానికి, ఇది ముఖ్య స్థానంగా ఉంటుంది. అందువలన ఈ చక్రం జీవశక్తి, సృజనాత్మకత, ఆశయం మరియు వ్యక్తిగత–అధికారం యొక్క శక్తులతో అనుబంధాన్ని కలిగి ఉంటుంది.

అహం మరియు ఇచ్ఛ ఒకదానితో ఒకటి చాలా దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఇచ్ఛ యొక్క బోధనలు ఏదో ఒక దానిపై, అంటే అంతర్ లేదా బాహ్య విషయాలపై దృష్టిని కేంద్రీకరించేలా చేస్తాయి. వాస్తవం పట్ల మీ యొక్క అభిప్రాయాలు, మీ మీద మరియు ఇతరుల మీద మీ యొక్క అభిప్రాయాలు, మీ కోరికల ద్వారాను మరియు మీరు కోరుకున్న వాటి ద్వారాను ఎక్కువగా ప్రభావితం చెందుతాయి. తరచూ మీ కోరికలు భయంతో కలుపబడి ఉంటాయి. మీరు తరచూ ఏదో కావాలని కోరుకుంటారు. ఎందుకంటే మీరు ఏదో ఒక దాని యొక్క అవసరం ఉందని అనుభూతి చెందుతారు కాబట్టి; దీని క్రింద ఏదో కోల్పోయిన భావన లేదా అవసరమనే భావన ఉంటాయి. మీ యొక్క కోరికలన్నింటిలో చాలా వరకూ భయాన్ని కలిగి ఉండడం వలన, మణిపూరకచక్రం తరచూ అహం యొక్క శక్తి ద్వారా నడుపబడుతోంది. ముఖ్యంగా మణిపూరకచక్రం ద్వారా అహం తననుతాను వ్యక్తపరుచుకుంటుంది.

ఇచ్ఛ యొక్క బోధనల ద్వారా, అహం వాస్తవం మీద ఒత్తిడిని కలుగజేస్తుంది. అహం, వాస్తవాన్ని అణచి వేయడం అవసరమని మరియు మీరు దానిని నమ్మాలని కోరుకుంటుంది. అహం వాస్తవం ఎలా పని చేస్తుందనే ప్రాధమికమైన అభిప్రాయాలను

కలిగి ఉంటూ వాటి ద్వారా పనిచేస్తుంది, ఈ అభిప్రాయాలన్నీ భయాన్ని ఆధారంగా చేసుకుని ఉంటాయి. అహం, తన సొంత అవసరాలు మరియు భయాల మీద ఆధారపడి ఉన్న సంకుచిత మనస్తత్వపు అభిప్రాయాలకు తగిన వాస్తవం యొక్క ఉన్నత చిత్రాన్ని ఎంచి మీ ముందు ఉంచుతుంది. అది గమనించిన ప్రతీ దానిని మంచి లేదా చెడుగా నిర్ణయిస్తుంది. విషయాలను సులభంగా గమనించడానికి అవకాశాన్ని ఇవ్వదు. ప్రతీ దానిని మంచి లేదా చెడులుగా విభజిస్తూ వాటికి ముద్రలను వేస్తుంది.

మీరు హృదయం నుంచి జీవించినప్పుడు, నిజాల యొక్క అర్థాన్ని లేదా విలువను తెలిపే స్థిరమైన నమ్మక వ్యవస్థలు ఉండవు. ఇకపై మీరు ఏ విషయం పట్ల స్థిర అభిప్రాయాన్ని కలిగి ఉండరు. మీరు మరింత గమనించేవారిగా మారుతారు. మీరు ఏ విషయాన్నైనా కూడా నిర్ణయించడం వాయిదా వేస్తారు, ఎందుకంటే మీరు ఆ విషయంలో ఉన్న అర్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదని భావిస్తారు కనుక. నిర్ణయాలు ఎల్లప్పుడూ వాటికి సంబంధించిన ఏదో ఒక స్థిర అభిప్రాయాన్ని కలిగి ఉంటాయి, కాని హృదయం నిర్వచనాలను ఇష్టపడదు. హృదయం నిర్వచనాలను మరియు స్థిర అభిప్రాయాలను అధిగమించాలని ప్రయత్నిస్తుంది. హృదయం ఎల్లప్పుడూ అన్వేషించడానికి, అలాగే పున: పరిశీలించడానికి మరియు క్షమించడానికి సిద్ధంగా ఉంటుంది.

మీరు అహం కేంద్రంగా ఉన్న ఇచ్ఛాశక్తిని ఉపయోగించినప్పుడు, మీ మణిపూరకచక్రంలో ఒత్తిడిని అనుభూతి చెందుతారు. ఈ విధంగా మీ ఇచ్ఛను ఉపయోగించడం అనేది శక్తిపరంగా జరుగుతుంది, మీరు కావాలనుకుంటే దీనిని జాగృత ఎరుకతో గమనించగలరు. ఎప్పుడైతే ఈ ఒత్తిడి, మీరు కోరుకున్న విషయాలు మీ మార్గంలో ఉండాలనే బలమైన వాంఛతో కలసి పయనించినట్టు అనుభూతి చెందుతారో, అప్పుడు మీరు మీ ఆశలకు అనుగుణంగా మీ వాస్తవాన్ని మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే. మీరు వాస్తవంపై మీ నమ్మకాలను బలంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారు.

మీరు హృదయం నుంచి నటించినప్పుడు, పరిస్థితులు వాటంతటవిగా మీకు సహజంగా అందిస్తున్న ప్రవాహం వెంట పయనిస్తారు; ఇక్కడ మీరు బలవంతంగాని లేదా ఒత్తిడిగాని చేయరు.

మీరు దేనినైనా సాధించడానికి చాలా ఎక్కువగా కష్టపడుతున్నా మరియు

మీరు మళ్ళీ మళ్ళీ మీ లక్ష్యాలను చేరడానికి విఫలమవుతున్నా, దయచేసి మిమ్మల్ని మీరు అడగండి: మీరు ఏ చక్రం నుంచి, ఏ శక్తి కేంద్రం నుంచి పని చేస్తున్నారన్న విషయాన్ని. మీరు మీ హృదయానికి అనుగుణంగా శృతి కాగలరు. మీ హృదయాన్ని ఈ విషయం ఎందుకు జరగడం లేదని, లేదా దీనిలో అధిక శక్తిని ఎందుకు పెట్టాల్సి వస్తోందని అడగండి.

మీరు కొన్ని లక్ష్యాలను, మీ అంతరంలోకి వెళ్ళకుండాను మరియు హృదయంతో పరిశీలించకుండాను వాటిని సాధించాలని ప్రయత్నిస్తారు; అంటే ఈ లక్ష్యాలు మీ అంతర్ మార్గంలో మేధాసంపత్తిని మరియు సృజనాత్మకతను పొందడానికి నిజంగా సహకరిస్తాయా లేదా అన్నది తెలుసుకోకుండానే గుడ్డిగా ప్రయత్నిస్తున్నారని అర్థం. మీ లక్ష్యాలు మీ లోతైన హృదయవాంఛలను తెలియజేస్తున్నప్పటికీ కూడా, పరిస్థితులు సంభవించే కాలపరిమితి పట్ల మీరు అసహజమైన అంచనాలను కలిగి ఉండవచ్చు. మీరు హృదయానికి సంబంధించిన కాలపరిమితిలో కాకుండా, వ్యక్తిగత ఇచ్ఛకు సంబంధించిన కాలపరిమితిలో ఉండవచ్చు.

విషయాలన్నింటికి సహజమైన లయబద్ధత ఉంటుంది. మీరు కోరుకున్నంత వేగాన్ని ఈ లయబద్ధత కలిగి ఉండవలసిన అవసరం లేదు. మీ లక్ష్యాలు నెరవేరడానికి శక్తి మార్పు చెందాల్సిన అవసరం ఉంది. ఈ శక్తి మార్పులు మీరు కోరుకున్న లేదా ఆశించిన దాని కన్నా ఎక్కువ సమయాన్ని తీసుకుంటాయి. నిజానికి శక్తి మార్పులు అంటే మరేదో కాదు మీరు మార్పు చెందడమే.

మీ లక్ష్యాలను మీరు చేరినప్పుడు, ఇప్పుడు ఉన్న "మీరు" అప్పుడు ఉండదు. మీ ప్రస్తుత స్థితి విస్తరిస్తూ సరికొత్త స్థితిగా రూపాంతరం చెందుతుంది. ఈ సరికొత్త స్థితి మరింత మేధాశక్తితో, మరింత ప్రేమతో మరియు మరింత అంతర్‌శక్తితో నింపబడుతుంది. మీ లక్ష్యాలు నెరవేరడానికి పట్టే సమయం అనేది మీ చైతన్యం మార్పు చెందడానికి తీసుకునే సమయమే. ఈ విధంగా మీరు కోరుకున్న వాస్తవం, మీ నిజమైన వాస్తవంలోకి ప్రవేశించవచ్చు. అందువలన మీ విషయాలను మరింత వేగవంతం చేసుకోవాలని అనుకుంటే, మీరు మీ దృష్టిని వాస్తవం మీద కాకుండా మీ ప్రస్తుత స్థితి మీద కేంద్రీకరించండి.

తరచూ మీ లక్ష్యాలు మీకు అందించే ఫలితాలను తీసుకోవడానికి, మీరు వాటిని మీ నుండి విడుదల చేయాలి. ఇది పూర్తి విరుద్ధంగా అనిపించవచ్చు. కాని నిజానికి మేము చెబుతున్నది ఏమిటంటే, మీరు కొత్తదనంలోకి ప్రవేశించాలంటే మీ

ప్రస్తుత వాస్తవాన్ని పూర్తిగా అంగీకరించాలి. మీ ప్రస్తుత వాస్తవాన్ని అంగీకరించకపోయినా మరియు మీ లక్ష్యాలపై ఒత్తిడిని కలుగజేస్తూ వాటిని బలంగా పట్టుకుని ఉన్నా, మీరు ముందుకి వెళ్ళలేరు.

మీరు మీ వాస్తవంలోని ప్రస్తుత పరిస్థితులను ప్రేమిస్తే గాని అవి మిమ్మల్ని వదిలి వెళ్ళవు. ప్రేమించడం అంటే అర్థం "ప్రతీదానికి స్వేచ్ఛను ఇవ్వడమే".

మీరు మీ ప్రస్తుత వాస్తవాన్ని కౌగిలించుకోకపోతే మరియు దానిని మీ సృష్టిగా అంగీకరించకపోతే, అది మిమ్మల్ని వదిలి వెళ్ళదు. ఎందుకంటే మీలోని ఆ భాగాన్ని తిరస్కరిస్తున్నారు కాబట్టి. మీ ప్రస్తుత వాస్తవాన్ని సృష్టించిన భాగానికి మీరు తిరస్కారాన్ని తెలుపుతున్నారు కనుక. మీరు మీ నుంచి ఈ అక్కర్లేని భాగాన్ని తీసివేసి ముందుకు వెళ్ళాలనుకుంటారు.

కాని మిమ్మల్ని మీరు ద్వేషించినప్పుడు మరింత ప్రేమతో కూడిన వాస్తవాన్ని సృష్టించలేరు. మీరు ద్వేషిస్తున్న భాగాలను ప్రక్కకు త్రోసివేయడం ద్వారా మీరు కొత్త వాస్తవంలోకి బలవంతంగా ప్రవేశించలేరు. ఇచ్ఛాశక్తి అనేది ఇక్కడ మీకు సహాయం చేయలేదు.

మీ హృదయంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది ఇక్కడ మీకు అవసరం. అవగాహన మరియు అంగీకారం యొక్క శక్తులు అనేవి కొత్తదనం మరియు మరింత సంతృప్తికరమైన వాస్తవం యొక్క అసలైన పునాదులు.

మీరు హృదయం ద్వారా మీ వాస్తవానికి స్పందించినప్పుడు, మీరు దానిని అలాగే ఉండనిస్తారు. మీరు ఏమాత్రం దానిని మార్చాలని ప్రయత్నించరు; మీరు దానిని ఉన్నదిఉన్నట్టుగా గమనించి పరిగణలోకి తీసుకుంటారు.

హృదయం మీకు సంరక్షకుడిగా మారినప్పుడు, మణిపూరక కేంద్రం లేదా ఇచ్ఛ యొక్క కేంద్రం, హృదయానికి అనుగుణంగా పయనిస్తుంది. ఇచ్ఛకు బోధకుడిగా ఉన్న అహం తొలగించబడదు. ఎందుకంటే ఇది సహజంగా చైతన్యం యొక్క స్థాయి నుంచి భౌతికవాస్తవం యొక్క స్థాయి వైపు శక్తిని అనువదించే పాత్రను పోషిస్తుంది కాబట్టి. ఈ అనువాదన లేదా వ్యక్తీకరణ అనేది హృదయం ద్వారా నడుపబడినప్పుడు, ఇచ్ఛ యొక్క శక్తి సృష్టింపబడుతుంది మరియు ఇది సులభంగా ప్రవహిస్తుంది. దీనిలో ఏవిధమైన ఒత్తిడిగాని, బలవంతంగాని పాల్గొనదు. ఇప్పుడే పరిస్థితులు సమన్వయాన్ని పొందుతాయి: ఒకే సమయంలో రెండు, మూడు సంఘటనలు

అనుకోకుండా జరుగుతూ, మీ లక్ష్యాలు అద్భుతంగా నెరవేరడాన్ని గమనిస్తారు. ఈ విధంగా పరిస్థితులు కలిసికట్టుగా జరిగినప్పుడు మీకు అద్భుతంగా అనిపిస్తుంది. నిజానికి మీరు హృదయం నుంచి సృష్టించిన ప్రతీసారి ఇదే జరుగుతుంది. కష్టం లేకుండా సులభంగా సంభవించడం అన్నది హృదయం నుంచి సృష్టింపబడిన దానికి ముద్ర లాంటిది.

**హృదయం నుంచి మీ వాస్తవాన్ని సృష్టించడం:**

నిజమైన సృజనాత్మకత అనేది పట్టుదల మరియు బలమైన వాంఛల మీద ఆధారపడదు, ఇది కేవలం తెరవబడిన హృదయం మీదే ఆధారపడుతుంది. నిజమైన సృష్టికర్తగా ఉండడానికి అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, అంగీకార వైఖరిని కలిగి ఉంటూ కొత్తదనాన్ని మరియు తెలియని విషయాలను స్వీకరించగలగడమే.

నిజమైన సృజనాత్మకతకి ఒకానొక మార్గం ఏమి చేయకుండా ఉండగలగడమే: చేయడం, నిర్ణయించడం, స్థిర అభిప్రాయాలు మరియు దృష్టిపెట్టడాలను విడుదల చేయడమే. ఇది, ఎరుకతో కూడిన స్వచ్ఛమైన అంగీకార వైఖరితో మీ చైతన్యాన్ని ఉంచగల సామర్ధ్యానికి సంబంధించినదే.

ఇతరుల నుంచి తెలుసుకున్న వాటి ద్వారా కాకుండా, విషయాలను తెరిచి ఉంచుతూ మీరు మీ వాస్తవంలోకి ఏదో ఒక కొత్తదనం ప్రవేశించడానికి ప్రదేశాన్ని సృష్టించుకోగలరా.

"మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు" అని తెలిపే కొత్తయుగం యొక్క బోధనలు, చాలా వరకూ నేను చెప్పిన దానికి విరుద్ధంగా ఉంటాయి. ఎల్లప్పుడూ మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటారు అన్నది నిజమే. మీరు ఎరుకలో ఉన్నా లేకున్నా మీ చైతన్యం సృజనాత్మకతను కలిగి ఉంటుంది. చాలా పుస్తకాలు మరియు చాలా వైద్య పద్ధతులు, మీరు జాగృతావస్థలో ఉండి మీ వాస్తవాన్ని సృష్టించాలని మీకు బోధిస్తున్నాయి. కాని ఇక్కడ మీరు అర్ధం చేసుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, వాస్తవాన్ని ఉన్నతంగా సృష్టించడం యొక్క విధానం అన్నది ఇచ్ఛ (చురుకుగా ఉండడం) మీద ఆధారపడదు, ఇది కేవలం వ్యక్తిగత ఎరుక (స్వీకరించడం) మీదే ఆధారపడుతుంది.

భౌతిక ప్రపంచంలోని మార్పులు – ఉదాహరణకి పని, బాంధవ్యాలు లేదా మీ భౌతికప్రపంచపు పరిసరాల యొక్క భాగాలన్నీ కూడా, మీ అంతర్‌స్థాయిలలోని

మార్పులకు ప్రతిబింబాలే. అంతర్ పరివర్తన ప్రక్రియ పూర్తయినప్పుడు మాత్రమే, భౌతికవాస్తవం మీ అంతర్ మార్పు యొక్క బింబాన్ని, మీ జీవితంలో మార్పు చెందుతున్న పరిస్థితుల ద్వారా మీకు చూపిస్తుంది.

మీరు ఇచ్ఛ నుంచి సృష్టించాలని ప్రయత్నించినప్పుడు, అంటే ఉదాహరణకి నిరంతరం మీ లక్ష్యాలపై దృష్టిని కేంద్రీకరించడం లేదా మీ లక్ష్యాలను దృశ్యంగా ఊహించుకోవడం అనేది మీ మార్పుకి అత్యవసరమైన మీ అంతర్ పరివర్తనాన్ని పట్టించుకోకపోవడమే అవుతుంది. మీరు కృత్రిమమైన మార్గంలో సృష్టిస్తున్నారు మరియు మీరు అసంతృప్తికి తప్పక లోనవుతారు. మీరు మీ ఆత్మ యొక్క లోతుల నుంచి సృష్టించడం లేదు.

ఆత్మ మీతో నిశ్శబ్దంగా ఉన్న సమయాలలో మాట్లాడుతుంది. మీకు ఏమాత్రం తెలియనప్పుడే, నిజంగా మీరు దీని యొక్క గొంతును వినగలరు. తరచుగా మీరు పరిస్థితులను వదిలివేసిన మరియు విసిరివేసిన సమయంలో మాత్రమే ఆత్మ మీతో చాలా స్పష్టంగా మాట్లాడగలదు. మీరు వదిలినప్పుడు మరియు నిరాశ చెందినప్పుడు ఏం జరుగుతుందంటే, మీరు కొత్తదనాన్ని చేరుకోవడానికి వీలుగా ఉండగలరు. మీరు మీ మొత్తం ఆశించడాలను విడుదల చేస్తారు మరియు మీరు కొత్తదనం ఎలా ఉన్నా దానిని స్వీకరిస్తారు.

మీ జీవితం ఇలాగే ఉండాలి అని తెలిపే బలమైన నమ్మకాల వలన మీలో నిరాశ ఏర్పడుతుంది. ఈ నమ్మకాలకు సమాధానమివ్వడంలో వాస్తవం విఫలమైనప్పుడు, మీరు ఒకానొక స్థితి దగ్గర నిస్పృహకు మరియు నిరాశకు లోనవుతారు.

మీరు బలమైన ఆశించడాలను వదిలివేస్తూ మరియు కొత్తదనాన్ని స్వీకరించడానికి ధైర్యం చేసినట్లయితే, మీరు నిరాశకు లోనుకాకుండానే తిరిగి మీ ఆత్మతో బంధాన్ని ఏర్పరుచుకోగలరు. ఆత్మ మీకు చెబుతున్న దానిని తెలుసుకోవడానికి మీరు నిశ్శబ్ధతను, స్వీకరించే వైఖరిని మరియు తెరవబడిన హృదయాన్ని కలిగి ఉంటే చాలు. దీనిని చేరడానికి మొదటిగా మీరు నిరాశకు గురికావల్సిన అవసరం లేదు.

"మీకు ఏమి కావాలనేది ఖచ్చితంగా" తెలిసినంత వరకూ, మీరు తరచూ మీకు శక్తిపరంగా అందుబాటులో ఉన్న అవకాశాలను పరిమితం చేస్తూనే ఉంటారు. మీరు ఎదురుచూస్తున్న కొత్త వాస్తవం, ఉదాహరణకి అది ఉద్యోగం లేదా బాంధవ్యం

లేదా మంచి ఆరోగ్యం మొదలైనవన్నీ కూడా మీకు తెలియని ఎన్నో మూల పదార్థాలను కలిగి ఉంటాయి. తరచూ మీరు కోరుకున్నది భవిష్యత్తులోకి తీసుకురావడం మీకు తెలుసు అని భావిస్తారు(మంచి ఉద్యోగం, ప్రేమించే భాగస్వామి). కాని అది సరైనది కాదు. నిజానికి మీరు కొత్త వాస్తవాన్ని సృష్టించడం ద్వారా ఏమి చేస్తున్నారంటే, మీరు మీ సొంత మానసిక సరిహద్దులను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నారు మరియు ఆ సరిహద్దుల తర్వాత ఏం ఉందనేది మీరు ఇప్పుడు తెలుసుకోలేరు.

సరిహద్దులకు ఆవలి వైపు మీరు కోరుకున్నది ఏదో ఉందని మీరు చాలా స్పష్టంగా అనుభూతి చెందగలరు, మీరు దీనిపై ఇరుకు మనస్తత్వపు దృష్టిని కేంద్రీకరించడం ద్వారా లేదా దాని యొక్క దృశ్యాన్ని ఊహించడం ద్వారా చూడనక్కర్లేదు. మీరు అంగీకార వైఖరి మరియు ఆసక్తి ద్వారా ఆవలివైపు ఉన్న దాని కోసం ఆనందంగా ఎదురుచూడండి.

మీరు ఎక్కువగా కోరుకుంటున్న వాస్తవాన్ని నిజంగా సృష్టించాలంటే, మీ ఆలోచన మీద లేదా మీ ఇచ్ఛ మీద దృష్టిని కేంద్రీకరించడం కన్నా మిమ్మల్ని మీరు అంగీకరించుకోవడం అన్నది చాలా చాలా ముఖ్యమైన విషయం. మీ అర్హతను మించి మీరు సృష్టించలేరు. మీరు వెయ్యిసార్లు మంత్రాలు ఉచ్ఛరించవచ్చు లేదా మీ మనస్సులో మంచిని సృష్టించవచ్చు. కాని, అవి మీ అంతరంలో అనుభూతి చెందుతున్న వాటిని, అంటే ఉదాహరణకి కోపం, విచారం, అలసట మొదలైన వాటిని ప్రతిబింబించకపోతే, అవి మీ అంతరంలో గందరగోళాన్ని మరియు సందేహాలను మాత్రమే సృష్టిస్తాయి, ("నేను చాలా కష్టపడుతున్నా కాని నాకు ఏమి లభించడం లేదు".) దీని అర్థం అంతరాత్మలో బాధ ఉంది, మనస్సులో మంత్రాలను ఉచ్ఛరించినప్పటికీ, అవి గందరగోళాన్ని మరియు సందేహాలను మాత్రమే సృష్టిస్తాయి.

మిమ్మల్ని మీరు అంగీకరించడం అనేది ప్రేమ యొక్క ప్రతిరూపమే. ప్రేమ అనేది మీ జీవితంలో మంచి మార్పులు ఆకర్షించే ఒక పెద్ద అయస్కాంతం లాంటిది. మిమ్మల్ని మీరు ఉన్నదిఉన్నట్టుగా ప్రేమిస్తూ మరియు అంగీకరించగలిగితే, మీరు మీ సొంత ప్రేమను ప్రతిబింబించే మనుష్యులను మరియు పరిస్థితులను ఆకర్షిస్తారు. ఇది చాలా సులభంగా అర్థం చేసుకోదగినది.

మీ సొంత శక్తిని మరియు మీ మొత్తం అనుభూతులను అనుభూతి చెందండి. మీ యొక్క కష్టాలు మరియు బాధలన్నింటిలో ఉన్నప్పటికీ, మీరు ప్రస్తుతం అందంగాను మరియు నిజాయితీగాను ఉన్నారనేది అనుభూతి చెందండి. మీరు మీ యొక్క

“పొరపాట్లు” మరియు “లోపాల”తో కూడా అందంగా ఉన్నారు. కేవలం ఈ అవగాహనే లెక్కించదగినది.

మీరు ఎవరనే దానిని కౌగిలించుకుంటూ, మీకు మీరుగా విశ్రాంతిని పొందండి. మీరు మీ యొక్క ‘పొరపాట్లను’ ఆహ్లాదకరమైన వైఖరితో చూడండి. సంపూర్ణత్వం అనేది ఒక ఎంపిక కాదని మీకు తెలుసా. ఇది కేవలం ఒక భ్రమ మాత్రమే.

హృదయం నుంచి మీ వాస్తవాన్ని సృష్టించడం అనేది ఇప్పుడు ఇక్కడ మీ కాంతిని గుర్తించడమే. దీనిని గుర్తించడం ద్వారా మరియు దీని యొక్క ఎరుకను పొందడం ద్వారా, మీరు ఒక విత్తనాన్ని మొలకెత్తిస్తూ దానిని పెంచుతూ మరియు దానికి భౌతికవాస్తవంలో ఒక ఆకృతిని తీసుకువస్తారు.

దైవం మిమ్మల్ని ప్రత్యేకమైన ఆత్మలుగా సృష్టించినప్పుడు, ఆమె తన ఇచ్ఛను ఉపయోగించలేదు. ఆమె కేవలం తనలో తాను ఉండేది మరియు ఒకానొక స్థితి దగ్గర, ఆమె బాహ్యంగా అన్వేషించదగినది ఏదో ఉందని భావించింది. ఆమెకు అదేమిటనేది ఖచ్చితంగా తెలియదు. కాని అది ఆమెను ప్రేమలో మునిగేట్టు చేసింది. ఆమె ఏమాత్రం సంకోచించకుండా దానిని నిజమని భావించింది, ఆమె ఈ కొత్త మరియు ఆహ్వానించదగిన వాస్తవాన్ని అనుభవించదగినదిగా గుర్తించింది. ఆమె తన ప్రేమలో తాను మునిగిపోయింది!

దీని వలన మీరు ప్రత్యేకమైన ఆత్మలుగా రూపాన్ని ధరించారు మరియు దైవం మీ ద్వారా జీవితాన్ని అనుభవించడం మొదలుపెట్టింది. ఇదంతా సృష్టి ప్రక్రియ యొక్క వివరాలకు సంబంధించిన సమాచారం. దైవం నిజానికి దేని గురించి బాధ పడదు. ఆమె తనను తాను ప్రేమించుకునేది మరియు ఆమె మార్పుకి సిద్ధంగా ఉండేది. మీ సొంత వాస్తవాన్ని సృష్టించడానికి , ఇవే మూల లక్షణాలు మీకు కూడా అవసరం: వ్యక్తిగత-ప్రేమ మరియు కొత్తదనం యొక్క ప్రదేశంలోకి ప్రవేశించడానికి సిద్ధపడడం.

**హృదయం నుంచి జీవించడానికి అలవాటు పడడం:**

హృదయం నుంచి సృష్టించడం అనేది శక్తివంతమైనది మరియు ఇది అహం నుంచి సృష్టించిన దానికన్నా కూడా చాలా సులభంగా ఉంటుంది. మీరు వివరాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు; మీ అంతరంగాను మరియు బాహ్యంగాను ఉన్న

విషయాలన్నింటిని అంగీకరించడానికి సిద్ధంగా ఉంటే చాలు.

ఈ అంగీకార వైఖరి నుంచి, మీరు ఇప్పుడు లేదా ఆ తర్వాతనైనా ఒక ఆకర్షణను అనుభూతి చెందుతారు. మీరు కొన్ని పరిస్థితులకు ఆకర్షింప బడుతున్నట్టు అనుభూతి చెందుతారు. ఈ ఆకర్షణ నిజానికి హృదయం నుంచి వచ్చిన నిశ్శబ్ధపు గుసగుస లాంటిది; ఇది మీ ఇంగిత జ్ఞానం. మీరు ఇంగిత జ్ఞానం నుంచి నటించినప్పుడు, మీరు ఏమాత్రం ప్రయత్నం లేకుండా సులభంగా విషయాలను ఆకర్షిస్తారు. మీ అంతరంలో ఇది సరైనదే నని అనుభూతి చెందేంత వరకూ దేనిని మీరు నటించరు.

మీరు కష్టపడి ప్రయత్నించడానికి చాలా ఎక్కువగా అలవాటు పడ్డారు. దీని అర్థం మీరు మీ ఇచ్ఛను ఉపయోగించి పరిస్థితులను సృష్టించడం వలన, మీరు అహం నుంచి హృదయానికి శక్తిపరంగా పయనించడం మీకు ఒక సవాల్‌గా మారింది. ఈ విధంగా పయనించడం కోసం మీకు మీరుగా “మీ యొక్క వేగాన్ని చాలా వరకూ తగ్గించుకోవాలి”. నిజంగా మీ ఇంగిత జ్ఞానం యొక్క ప్రవాహంతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి, మీరు జాగృతావస్థలో “ఏమి చెయ్యకుండా ఉండడానికి” ప్రయత్నించాలి, మరియు మీ యొక్క ప్రతీ విషయాన్ని యధాతథంగా ఉండనివ్వాలి. ఇలా చెయ్యడం అనేది మీరు నేర్చుకున్న దానికి మరియు అలవాటు పడిన దానికి పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. మీరు మీ ఆలోచనల మీద మరియు ఇచ్ఛాశక్తి మీద ఆధారపడి పని చేయడం మీకు అలవాటుగా మారింది. మీ ఆలోచనలకు, మీ లక్ష్యాలను నిర్ణయించే అవకాశాన్ని మరియు ఇచ్ఛను ఉపయోగించి వాటిని సాధించడానికి మీరు అనుమతిస్తున్నారు. ఇది హృదయ ఆధారిత సృష్టికి పూర్తి వ్యతిరేకమైనది.

మీరు హృదయం నుంచి జీవిస్తున్నప్పుడు, మీ హృదయం మాట వింటారు మరియు దానికి అనుగుణంగా నటిస్తారు. మీరు ఆలోచించరు, కేవలం మీ హృదయం మీకు చెబుతున్న దానిని శ్రద్ధ మరియు అంగీకార వైఖరి యొక్క ఎరుకతో వింటారు. హృదయం మీ మనస్సు ద్వారా కాకుండా, మీ అనుభూతుల ద్వారా మాట్లాడుతుంది. మీరు హృదయం యొక్క మాటను నిశ్శబ్ధంగాను, ప్రశాంతంగాను మరియు నిశ్చలంగాను ఉన్నప్పుడు చాలా బాగా వినగలుగుతారు.

హృదయం ఇప్పుడు మీకు చాలా ప్రేమపూర్వకమైన మరియు ఆనందకరమైన వాస్తవానికి మార్గాన్ని చూపిస్తుంది. దీని యొక్క గుసగుసలు మరియు సలహాలు

హేతుబద్ధమైన ఆలోచనారీతి పైన ఆధారపడవు. మీరు హృదయం యొక్క మాటను, దానిలో ఇమిడి ఉండే తేలికతనం మరియు ఆనందాల ద్వారా గుర్తించగలరు. దీనిలో తేలికతనం ఉంటుంది, ఎందుకంటే హృదయం మిమ్మల్ని బలవంతం చెయ్యదు కాబట్టి; ఈ సలహాలకు ఏ విధమైన షరతులు అతికించి ఉండవు. మీ హృదయతత్వం మీ నిర్ణయాలకు అంటిపెట్టుకుని ఉండదు మరియు ఇది మీరు ఏమి చేసినప్పటికి మిమ్మల్ని ప్రేమిస్తుంది.

హృదయం నుంచి జీవించడమంటే అర్థం మీరు సోమరితనంగా తయారవ్వడం మాత్రం కాదు. విషయాలకు మంచి లేదా చెడు అనే ముద్రలను అతికించకుండా ఉండడానికి, విషయాలను ఈ మార్గంలోనే పయనించాలని బలవంతం చెయ్యకుండా ఉండడానికి చాలా సామర్థ్యం అవసరం. ఈ సామర్థ్యం అనేది మీరు పూర్తిగా వర్తమానంలో ఉండడానికి, మీ జీవితంలో ఉన్న ప్రతీ విషయాన్ని ఎదుర్కొనడానికి మరియు వాటిని యధాతథంగా చూడడానికి మీకు సహకరిస్తుంది. మీరు శూన్యతను లేదా విచారాన్ని లేదా బలహీనతను అనుభూతి చెందవచ్చు, కాని మీరు ఈ విషయాలను దూరంగా త్రోసివెయ్యడానికి మాత్రం ప్రయత్నించవద్దు. నిజానికి మీరు ఇక్కడ చెయ్యాల్సినది ఏమిటంటే మీ చైతన్యంతో వీటిని కౌగిలించుకోవడమే.

మీరు మీ చైతన్యం యొక్క నిజమైన శక్తిని అర్థం చేసుకోలేదు. మీ చైతన్యం కాంతిచే తయారు చేయబడినది. మీ చైతన్యంతో మీరు దేనినైనా పట్టుకుంటే, అది మార్పు చెందుతుంది. మీరు మీ ఆలోచనారీతి ద్వారా మరియు కష్టపడి పని చెయ్యాలనే అలవాటు ద్వారా, మీరు మీ చైతన్యాన్ని బంధించకుండా ఉంటే, అది ఒక హీలింగ్ శక్తిగా పని చేస్తుంది.

మీ జీవితాలు మనసు మరియు ఇచ్ఛ యొక్క బోధనలతో, ఆలోచించడం మరియు చెయ్యడం యొక్క ఆధిపత్యంతో నింపబడి ఉంటాయి.

మనసు మరియు ఇచ్ఛ రెండూ కూడా సాధారణమైన నియమాలతో పని చేస్తాయని గమనించండి. ఈ నియమాలు తర్కంతో కూడిన ఆలోచనారీతికి సంబంధించినవి. ఈ సాధారణమైన పద్ధతులన్నీ ఆలోచనలను భౌతికస్థాయిలో పెడుతుంటాయి; ఇవి "ప్రణాళికా బద్ధంగా" పనిని నిర్వర్తించడం యొక్క నియమాలు.

కాని ఇవన్నీ కూడా సాధారణమైన సిద్ధాంతాలే. సాధారణమైన నియమాలు మరియు మార్గదర్శక సూత్రాలు ఎల్లప్పుడూ యాంత్రికమైన లక్షణాన్ని కలిగి ఉ

ంటాయి. ఇవి అందరికి లేదా చాలామంది వ్యక్తులకు వర్తిస్తాయి; అలా కాకపోతే వీటి యొక్క ఉపయోగం లేదు.

ఇప్పుడు ఇంగితజ్ఞానం చాలా ప్రత్యేకంగా పని చేస్తోంది. ఇంగితజ్ఞానం అనేది ఎల్లప్పుడూ ఒక వ్యక్తికి, ఒక ప్రత్యేక సమయానికి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. ఇది పూర్తిగా వ్యక్తిగతమైనది. అందువలన ఇది హేతుబద్ధమైన వివరణకి లేదా సాధారణమైన సూత్రాలకి పరిమితమై ఉండదు.

మీ ఇంగితజ్ఞానం ప్రకారం జీవించడం మరియు నటించడం అన్నది మిమ్మల్ని మీ యొక్క అత్యున్నతమైన విశ్వాసాన్ని చూపించమని కోరుతుంది. ఎందుకంటే మీ ఎంపికలన్నీ కూడా ఇతరుల యొక్క నియమాలు సరైనది అని చెబుతున్న విషయాలపై కాకుండా, మీకు సరైనది అని అనుభూతి చెందుతున్న వాటిపై పూర్తిగా ఆధారపడి ఉంటాయి కాబట్టి.

మీ హృదయం నుంచి జీవించడం అన్నది మీ మనసును మరియు ఇచ్ఛాశక్తిని ఎక్కువగా ఉపయోగించే అలవాటును మాత్రమే విడుదల చేయమని అడగడం లేదు; ఇది మిమ్మల్ని మీరు నిజంగా విశ్వసించమని కూడా సవాల్ చేస్తుంది.

మీ హృదయం యొక్క మాటను వినడానికి, దాని సందేశాలను విశ్వసించి మరియు దాని ప్రకారం నటించడం నేర్చుకోవడానికి సమయం పడుతుంది. మీరు దీనిని ఎంతగా అయితే సాధన చేస్తారో, అంతగా మీరు మీ బాధలను మరియు సందేహాలను మీ హృదయం యొక్క మేధాసంపత్తికి ఆధీనం చేస్తూ అంతర్ ప్రశాంతతను కనుగొంటారనే విషయాన్ని తెలుసుకుంటారు.

మీరు ఈ మార్గంలో కొనసాగుతూ మరియు అహం నుంచి హృదయం వైపు పరివర్తనం చెందుతున్న మూడవ దశలో ప్రవేశించినప్పుడు, మీరు మొదటిసారిగా అంతర్ ప్రశాంతతను కనుగొంటారు. ఆలోచనారీతి మరియు ఇచ్ఛాశక్తి ద్వారా వాస్తవాన్ని అదుపు చేయాలనే మీ కాంక్ష, మిమ్మల్ని అలసటకు మరియు గందరగోళానికి గురిచేస్తోందని మీరు తెలుసుకుంటారు.

మీరు అదుపును విడుదల చేసినప్పుడు, జీవితం యొక్క అద్భుతాన్ని స్వేచ్ఛగా అనుమతిస్తారు. మీరు చేయవలసినది కేవలం వినడమే. మీ జీవితంలో ఏం జరుగుతున్నది అనే వాటిపైన, ఇతరుల మీద మీకు ఎటువంటి అనుభూతులు ఉ

న్నాయి అనే వాటిపైన, మీ కలలు మరియు కోరికలు ఏమిటి అనే వాటిపైన అప్రమత్తంగా ఉండండి. మీ అంతరంలో ఏం జరుగుతున్నది అనే దానిపై అప్రమత్తంగా ఉన్నప్పుడు, 'వాస్తవం' దీనికి అనుగుణంగా నటించడానికి కావలసిన పూర్తి సమాచారాన్ని మీకు అందిస్తుంది.

ఉదాహరణకి, మీరు నిజంగా స్వేచ్ఛతో సంభాషించగలిగే ప్రేమపూర్వకమైన బంధం యొక్క వాంఛ మీ హృదయంలో ఉందనే ఎరుకను పొందవచ్చు. మీరు ఆ కోరిక గురించి ఏ మాత్రం ప్రయత్నించకుండా, కేవలం మీరు ఆ కోరికను గుర్తించి అంగీకరించినట్లయితే, దానికి విశ్వం స్పందించిన తీరును చూసి మీరు ఆశ్చర్యపోతారు. మీరు ఏ విధమైన తుది నిర్ణయాలకు ఆకర్షింపబడకుండా, కేవలం మీ చైతన్యం యొక్క కాంతిలో వాంఛను ఉంచడం ద్వారా మీ పిలుపును విశ్వం వింటుంది మరియు దానికి సమాధానం ఇస్తుంది.

మీరు ఆశించిన దానికంటే ఎక్కువ సమయం పట్టవచ్చు. ఎందుకంటే ఇటువంటి కోరికలు నెరవేరే ముందు మీ అంతరంలో శక్తి మార్పులు జరుగుతాయి కాబట్టి. కాని, మీరే మీ శక్తివంతమైన వాస్తవానికి సృష్టికర్త మరియు గురువు. మీరు భయం నుంచి ఆ కోరికను సృష్టించినట్లయితే, వాస్తవం కూడా దీనికి అనుగుణంగానే స్పందిస్తుంది. కాని మీరు విశ్వాసం మరియు ఆధీనం నుంచి ఆ కోరికను సృష్టించినట్లయితే, మీరు కోరుకున్న దానికంటే ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

## నాలుగవ స్థితి: ప్రజ్ఞాత్మ స్థితికి చేరడం

మీరు నాలుగవ స్థితిలో ప్రవేశించినప్పుడు, మీ అంతరంలో నిశ్శబ్ధమైన మరియు ప్రశాంతమైన ప్రదేశాన్ని కనుగొంటారు. మీరు తరచూ మీ హృదయంలో నిశ్శబ్ధతను అనుభూతి చెందుతారు, అదే శాశ్వతమైన స్థితి అని మీకు తెలుసు. మీరు అనుభవం పొందుతున్న ప్రతీది కూడా, ఈ అనంతమైన మరియు సంపూర్ణమైన ఉనికితో పోల్చదగినది.

మీ అంతరంలోని ప్రశాంతమైన మరియు నిశ్శబ్ధమైన ఈ ప్రదేశాన్ని ప్రజ్ఞాత్మ అని కూడా పిలుస్తారు. మీ సాంప్రదాయాలు ప్రజ్ఞాత్మ, ఆత్మ మరియు శరీరాల మధ్య తేడాలను ఏర్పరిచాయి.

శరీరం అంటే ఆత్మ కొంతకాలం భౌతిక ప్రదేశంలో నివసించడానికి ఉపయోగపడే వాహకం.

ఆత్మ, ఇతర తలాల యొక్క అనుభవాలను మరియు మానసికపరమైన అనుభవాలను భద్రపరుస్తుంది. ఇది చాలా జన్మల యొక్క అనుభవాలను తనతో మోస్తోంది. ఆత్మ కాలాల తరబడి అభివృద్ధి చెందుతూ మరియు మెల్లిమెల్లిగా అనేక దృక్కోణాలు కలిగిన అందమైన వజ్రంగా తయారవుతోంది. ప్రతీ దృక్కోణం, ప్రత్యేక తరహా అనుభవాన్ని ప్రతిబింబిస్తుంది మరియు ఈ అనుభవం ద్వారానే జ్ఞానాన్ని పొందుతాం.

ప్రజ్ఞాత్మ అనేది కాలంతో ఎదగదు లేదా మార్పు చెందదు.

ప్రజ్ఞాత్మ కాలం మరియు తలాలకు ఆవలి వైపు ఉంటుంది. మీలో ఉన్న ప్రజ్ఞాత్మ శాశ్వతమైనది, సమయానికి అతీతంగా ఉన్న మీ యొక్క భాగం. ఇది మిమ్మల్ని సృష్టించిన మూలచైతన్యానికి సంబంధించినది. కాలం మరియు తలాలలో ఉన్న మీ భావప్రకటనకు అసలైన పునాది ఈ దివ్యత్వపు చైతన్యమే. మీరు స్వచ్ఛమైన చైతన్యం యొక్క తలం నుంచి జన్మించారు మరియు మీరు ఆ చైతన్యం యొక్క భాగాన్ని మీ భౌతిక ఆకృతిలో ఉన్న మీ వ్యక్తీకరణలన్నింటి ద్వారా మీ అంతరంలో మోస్తున్నారు.

ఆత్మ ద్వంద్వంలో పాల్గొంటుంది. ఇది ద్వంద్వంలోని అనుభవాలకు ప్రభావితమవుతూ పరివర్తనం చెందుతుంది. ప్రజ్ఞాత్మ ద్వంద్వాలకి ఆవలివైపు ఉంటుంది. ఇది తెరవెనుక ఉండడం వలన ప్రతీ విషయం దానంతట అది అభివృద్ధి చెందుతుంది మరియు పరిణామం చెందుతుంది. దీనిని మీరు ఉనికి లేదా మూలంగా పిలువవచ్చు.

నిశ్శబ్ధంగా, బాహ్యంగాను ముఖ్యంగా అంతరంలోను ఉండడం అనేది సర్వవ్యాపకత్వం కలిగిన ఈ శక్తిని అనుభవించడానికి గొప్ప ప్రవేశద్వారంగా ఉంటుంది, నిజానికి మీ లోతైన మూలంలో ఉన్న శక్తి 'మీరే'. నిశ్శబ్ధంలో మీరు మీ అంతరంలోని స్పష్టమైన మరియు అద్భుతమైన విషయంతో బంధాన్ని పెట్టుకోగలరు: ప్రజ్ఞాత్మ, దైవం, మూలచైతన్యం, ఉనికి.

ఆత్మ చాలాజన్మల యొక్క జ్ఞాపకాలను తన అంతరంలో మోస్తోంది. ఇది మీ భౌతిక వ్యక్తిత్వం కన్నా చాలా ఎక్కువగానే తెలుసుకుంటుంది మరియు అర్థం

చేసుకుంటుంది. ఆత్మ తనకు జ్ఞానాన్ని అందించే జ్ఞానేంద్రియపు మూలాలతో బంధాన్ని కలిగి ఉంటుంది, అంటే మీ గతజన్మల వ్యక్తిత్వాలు, మార్గదర్శకులు లేదా ఆస్ట్రల్ తలాలలో పరిచయస్తులు. ఈ బంధాన్ని కలిగి ఉన్నప్పటికీ కూడా, ఆత్మ గందరగోళ పరిస్థితిలోను మరియు తన నిజస్వభావం యొక్క మరుపులోను పడిపోగలదు. ఆత్మ కొన్ని అనుభవాల ద్వారా బాధింపబడవచ్చు మరియు వాటి వలన కొంత సమయం చీకటి ప్రదేశంలో ఉండిపోతుంది. ఆత్మ నిరంతరం భూమి మీద ఉన్న తన జీవితంలో, ద్వంద్వాల యొక్క అవగాహనను పెంచుకుంటూ క్రమక్రమంగా పరిణామం చెందుతుంది.

ప్రజ్ఞాత్మ, ఈ అభివృద్ధి పథంలో నిశ్చలమైన స్థితిలో కదలకుండా ఉంటుంది. ఆత్మ చీకటి లేదా వెలుగు యొక్క ఏదో ఒక స్థితిలో మాత్రమే ఉండగలదు. కాని ప్రజ్ఞాత్మ అలా కాదు. ప్రజ్ఞాత్మ అనేది స్వచ్ఛమైన ఉనికి, స్వచ్ఛమైన చైతన్యం. ఇది చీకటిలోనూ అదే విధంగా వెలుగులోనూ ఉండగలదు. ఏకత్వం ద్వంద్వానికి ఆధారంగా ఉంది. మీరు అహం నుంచి హృదయం వైపు జరుగుతున్న పరివర్తన ప్రక్రియలోని నాలుగవ దశకు చేరినప్పుడు, మీరు ప్రజ్ఞాత్మతో బంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఇక్కడ మీరు మీ దివ్యత్వంతో బంధాన్ని ఏర్పరుచుకుంటారు.

మీ అంతరంలోని దైవంతో బంధం పెట్టుకోవడం అంటే ద్వంద్వం నుంచి బయటకి వస్తూ మరియు అదే సమయంలో మీరు వర్తమానంలో భూమి మీద పూర్తి స్థిరంగా ఉండడమే. ఈ స్థితిలో, మీ చైతన్యం లోతైన అంటే నిశ్శబ్దంతో కూడిన గొప్ప ఆనందానుభూతితో నిండి ఉంటుంది: ప్రశాంతత మరియు ఆనందం యొక్క కలయికతో నిండి ఉంటుంది.

మీరు మీకు బాహ్యంగా ఉన్న వేటిపై ఆధారపడి లేరని గుర్తిస్తారు. మీరు స్వేచ్ఛగా ఉన్నారు. నిజానికి మీరు ప్రపంచంలో ఉంటారు, కాని దేనితోనూ బంధం లేనట్టుగా ఉంటారు.

మీ అంతరంలోని ప్రజ్ఞాత్మతో బంధాన్ని పెట్టుకోవడం ఒక్కసారిగా జరిగే విషయం కాదు. ఇది నెమ్మదిగా మరియు క్రమక్రమంగా జరిగే ప్రక్రియ, ఈ ప్రక్రియలో మీరు మీ ప్రజ్ఞాత్మతో కలుస్తారు, విడిపోతారు, తిరిగి కలుస్తారు...! క్రమక్రమంగా మీ చైతన్యం యొక్క దృష్టి ద్వంద్వం నుంచి ఏకత్వం వైపు కదులుతుంది. చైతన్యం తనను తాను సర్దుబాటు చేసుకుంటూ ఆలోచనలు మరియు మనోభావాలను అధిగమిస్తూ చివరకు నిశ్శబ్దాన్ని ఆకర్షిస్తుంది. నిశ్శబ్దం అంటే మా ఉద్దేశ్యం: పూర్తిగా

మీ కేంద్రంలోను మరియు వర్తమానంలోను, తటస్థఎరుక స్థితిలో ఎల్లప్పుడూ ఉండడమే అని.

అక్కడకు చేరడానికి ఏ విధమైన స్థిర పద్ధతులు లేదా మార్గాలు ఉండవు. మీ ప్రజ్ఞాత్మతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి ఎటువంటి క్రమశిక్షణలను(ధ్యానం, ఉపవాసం) అనుసరించాల్సిన అవసరం లేదు, కాని దీనికి నిజమైన అర్థమేమిటంటే – నిశ్శబ్ధమే మిమ్మల్ని మీ ఇంటికి చేరుస్తుందని, మీ ఆలోచనలు లేదా మనోభావాలు కావని అర్థం చేసుకోవాలి.

మీరు ఎప్పుడైతే మీ ఆలోచనలు మరియు మనోభావాలు పనిచేసే తీరు యొక్క ఎరుకను పెంచుకుంటారో అప్పుడే మీ అవగాహన అన్నది క్రమక్రమంగా వృద్ధి చెందుతుంది. మీరు మీ పాత అలవాట్లను విడుదల చేస్తూ మరియు హృదయ ఆధారిత చైతన్యం యొక్క కొత్త వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. మీలోని అహం ఆధారిత చైతన్యం బలహీనమవుతూ నెమ్మదినెమ్మదిగా మరణిస్తుంది.

మరణించడం అనేది మీరు చేసేది మాత్రం కాదు; మీరు కేవలం ఇది జరగడానికి అనుమతిస్తారు. మీ అంతట మీరు ఈ మరణ ప్రక్రియకు ఆధీనమవుతారు. మరణం అనేది మార్పుకు, పరివర్తనకు పర్యాయపదం. ఇది ఎల్లప్పుడూ ఇదే విధంగా ఉంటుంది. మరణం అనేది ఎల్లప్పుడూ గతాన్ని విడుదల చేస్తూ మరియు కొత్తదనానికి సంసిద్ధమై ఉంటుంది. ఈ ప్రక్రియలో మీరు ప్రతిక్షణం చనిపోతుంటారు. మరణం అనేది మీరు నిర్వచించిన ప్రకారం ఒక భ్రమ లాంటిది. మార్పుకి సంబంధించిన భయం మాత్రమే, మిమ్మల్ని మరణానికి భయపడేలా చేస్తుంది.

మీ జీవితంలో మీరు భౌతికపరమైన మరణానికే కాకుండా, మీరు మనోభావపరమైన మరియు మానసికపరమైన మరణానికి కూడా భయపడుతున్నారు. కాని మరణం లేకుంటే విషయాలు స్థిరంగాను మరియు మార్పు లేకుండాను ఉంటాయి. మీరు పాతరూపాలలో బంధీయై ఉంటారు: శిధిలమైన శరీరం, పనికిరాని ఆలోచనా విధానాలు, పరిమితమైన మనోభావ ప్రతిస్పందనలు. ఇది ఊపిరాడనట్టుగా ఉంటుంది అవునా? మరణం అనేది  విముక్తిని ఇచ్చేది. మరణం అనేది ఎల్లప్పుడూ కొత్త నీరుతో ప్రవహిస్తూ పాత నీరుని మరియు త్రుప్పు పట్టిన ద్వారాలను తొలగిస్తూ మరియు అనుభవం యొక్క కొత్త ప్రదేశాలలోకి మీరు కదిలేలా చేస్తుంది.

మరణానికి భయపడవద్దు. అది మరణం కాదు, కేవలం మార్పు మాత్రమే.

అహం ఆధారిత చైతన్యం నుంచి హృదయ ఆధారిత జీవనం వైపు పయనించడం అనేది చాలా రకాలుగా మరణం యొక్క అనుభవాన్ని పొందుతున్నట్టే ఉంటుంది. మీరు ఎంతగా అయితే మిమ్మల్ని మీ అంతరంలోని ప్రజ్ఞాత్మతోను, దివ్యత్వంతోను గుర్తిస్తారో, అంతగా మీరు బాధపడిన లేదా అధికశక్తిని వినియోగించిన విషయాలను విడుదల చేయగలరు. మీ లోతైన స్థాయిలలో మీరు చేయడానికి ఏమి లేదని, కేవలం ఉండడమేనని తెలుసుకుంటారు. మీరు మీ ఆలోచనలు మరియు మనోభావాల యొక్క ప్రవాహంతో కాకుండా, మీ దివ్యత్వం యొక్క ఉనికితో మిమ్మల్ని మీరు గుర్తించినట్లయితే, మీ జీవితం తక్షణమే ప్రభావితం చెందుతుంది. ప్రజ్ఞాత్మ అన్నది సిద్ధాంతపరమైనది కాదు. ఇది ఒక వాస్తవం. నిజంగా మీరు దీనిని భూమి మీద ఉన్న మీ జీవితంలోనికి తీసుకురాగలరు. ఈ మూలాల యొక్క స్వచ్ఛతతో బంధాన్ని కలిగిఉంటే, మీ జీవితంలోని ప్రతీ అంశం మార్పు చెందుతుంది. దైవం లేదా మూలచైతన్యం లేదా ప్రజ్ఞాత్మ యొక్క సహజమైన స్వభావం సృజనాత్మకతయే. కాని, ఇది చాలావరకూ మీకు అర్ధమయ్యే విధంగా ఉండదు.

ప్రజ్ఞాత్మ నిశ్శబ్దంగాను మరియు స్థిరంగాను మరియు సృజనాత్మకంగాను ఉంటుంది. నిజానికి దివ్యత్వం యొక్క వాస్తవాన్ని మనసు ద్వారా గ్రహించలేరు. దీనిని కేవలం అనుభూతి చెందగలం. మీరు దీనిని మీ జీవితంలోకి అనుమతించి మరియు మీ హృదయం యొక్క గుసగుసలుగా గుర్తించినట్లయితే, ప్రతీ అంశం క్రమక్రమంగా ఒక ప్రదేశంలోకి చేరడం ఆరంభిస్తాయి. మీరు మీ అనుభవాలన్నింటి వెనుకనున్న ప్రజ్ఞాత్మ యొక్క వాస్తవానికి, నిశ్శబ్ద ఎరుకకి తగినట్టుగా శృతి కాబడినప్పుడు, మీరు మీ వాస్తవంపై ఇచ్చను బలవంతంగా రుద్దడం ఆపివేస్తారు. మీరు పరిస్థితులను తిరిగి వాటి యొక్క సహజస్థితికి చేరడానికి అనుమతిస్తారు. మీరు మీ యొక్క సహజమైన నిజతత్వంగా రూపొందుతారు. ఇదంతా సమన్వయంతో కూడిన అర్ధవంతమైన మార్గంలో జరుగుతుంది. పరిస్థితులు సహజ లయబద్ధత మరియు సహజ ప్రవాహం గల మార్గంలో కలిసికట్టుగా సంభవించడాన్ని అనుభవిస్తారు. మీరు చేయాల్సినది ఏమిటంటే ఈ దివ్యత్వపు లయబద్ధతకి శృతి కావడం మరియు మిమ్మల్ని ఆటంకపరచడానికి ప్రయత్నించే భయాలను మరియు అవగాహనా లోపాలను విడుదల చేయడం.

## ప్రజ్ఞాత్మ స్థితి నుంచి ఇతరులకు సహాయం చేయడం

మీరు అహం ఆధారితం నుంచి హృదయ ఆధారిత చైతన్యం వైపు పరివర్తనం చెందినప్పుడు, మీరు ఎల్లప్పుడూ అధికంగానైనా లేదా స్వల్పంగానైనా మీ అంతరంలోని

దివ్యత్వపు ప్రవాహంతో బంధాన్ని కలిగి ఉంటారు. ఈ స్థితిలో ఇతరులకు సహాయం చేయాలనే కోరిక లేదా అవసరం ఉండదు. కాని ఈ కోరిక లేదా అవసరం మీ దగ్గరకు సహజంగా వస్తుంది. ఇవి ఇచ్ఛ ద్వారా కాకుండా సహజంగా మీకు ఆకర్షింపబడతాయి. ఇప్పుడు మీరు శక్తిపరంగా ప్రత్యేకమైన ప్రకంపనాలను విడుదల చేస్తున్నారు. మీ శక్తిక్షేత్రంలో ఏదో సామర్థ్యం ఉంటుంది, అది మీకు ఇతరులు ఆకర్షింపబడేలా చేస్తుంది. ఇది మీరు ఏదో చేయడం ద్వారా వచ్చినది కాదు, కేవలం మీరుగా ఉండడం ద్వారా వచ్చినదే. మీ శక్తిలో ఒక ప్రకంపనం ఇతరులకు అందుబాటులో ఉంటుంది, ఇది ఇతరులు వారి యొక్క సొంత దివ్యత్వంతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి సహాయం చేయగలదు.

మీరు ఇతరులకి ప్రతిబింబంగా ఉండగలరు. వీరు ఈ ప్రతిబింబంలో వారి యొక్క కష్టమైన సమస్యను లేదా పరిస్థితిని చూస్తూ దానిని విడుదల చెయ్యగలరు మరియు పరిష్కారం యొక్క శక్తిగా పరివర్తనం చెందించగలరు. మీ ఉనికిలో ఉన్న ప్రజ్ఞాత్మతో బంధాన్ని కనుగొన్న ప్రతీసారి వీరు పరిష్కారం యొక్క శక్తిని అనుభూతి చెందుతారు.

మీరు వీరికి బోధించగలరు మరియు ఆ శిక్షణ మీరు మీరుగా ఉండడం ద్వారా బోధింపబడుతుంది. మీరు ప్రసరింపజేస్తున్న జ్ఞానం ద్వారా లేదా మీరు నేర్పిస్తున్న మరియు హీల్ చేస్తున్న పద్ధతులను ఉపయోగించడం ద్వారా ఈ శిక్షణ జరుగదు. కేవలం మీరు మీరుగా ఉండడానికి, మిమ్మల్ని మీరు అనుమతించినప్పుడు మరియు మీరు కనుగొన్న ఆనందాన్ని మీ అంతట మీరు వ్యక్తపరిచినప్పుడు మాత్రమే మీ ఉనికి వారికి నిజంగా సహాయం చేసేదిగా తయారవుతుంది. మీ అనుభవాలను ఇతరులతో పంచుకోవడం వలన, మీరు వారి కోసం ఒక హీలింగ్ ప్రదేశాన్ని అందుబాటులో ఉంచుతారు. ఆ ప్రదేశంలోకి వారు ప్రవేశించాలా లేదా అన్నది వారి ఎంపిక మీద ఆధారపడుతుంది. ఇది పూర్తిగా వారికి సంబంధించిన విషయం.

ఒక హీలర్‌గా లేదా ఒక వైద్యుడిగా మీరు దివ్యత్వపు అంతర్ ప్రవాహంతోను, నిశ్శబ్దపు ఎరుకతోను అంటే ప్రజ్ఞాత్మతో బంధాన్ని పెట్టుకుంటే చాలు. నిజానికి ఈ బంధమే ప్రజలను కదిలిస్తుంది మరియు వారు దీనిని ఎంచుకుంటే వారిని కూడా ఉన్నతమైన ఎరుక యొక్క స్వేచ్ఛా స్థితికి చేరుస్తుంది. వీరు ఈ విధంగా చేసినట్లయితే, వీరి యొక్క సొంత లయబద్ధత మరియు సొంత ప్రవాహం యొక్క మార్గంలో ఈ స్థితిని చేరగలరు.

ఈ విధంగా ఇతరుల దగ్గర ఉండడం అనేది చాలా తటస్థమైన అనుభూతి స్వరాన్ని కలిగి ఉంటుంది. ఇది బంధం లేకుండా ఉన్న స్థితిని తెలుపుతుంది. మీరు

ఈ స్థితిలో మీ వ్యక్తిగత-వాంఛను అంటే ఇతరులను మార్చాలని లేదా వారిని "బాగుచెయ్యాలనే" వాంఛను విడుదల చేస్తారు. లైట్‌వర్కర్స్ యొక్క ఏదో ఒక దశలో ఈ వాంఛ కనబడుతూనే ఉంటుంది. ఇది అంతర్‌మార్గాన్ని నిజంగా అర్థం చేసుకున్న స్థితి నుంచి ఉద్భవించినది మాత్రం కాదు. ఇక్కడ అంతర్‌మార్గం అంటే ప్రజలు వారి సొంత నిజాన్ని కనుగొనడానికి ప్రయాణించాలనుకునే మార్గమే. ప్రజలు కొన్ని ముఖ్యమైన విషయాలను విడుదల చేయడానికి ముందు వాటి యొక్క మూలాల దగ్గరకి తప్పని సరిగా వెళ్ళాల్సి ఉంది. వారు ఈ విధంగా చేసినప్పుడు మాత్రమే వారి సమస్యలకు పరిష్కారాన్ని 'పొందగలరు' మరియు ఇది వారికి లోతైన సంతృప్తిని ఇస్తుంది. బహుశా మీరు దీనిని మీ జీవితంలో కష్టపడిన విషయాల ద్వారా గుర్తించవచ్చు. దయచేసి దీని యొక్క ఎరుకను పొందండి మరియు ప్రజలను అట్టడుగు లోతులకు వెళ్ళనివ్వకుండా ఉంచడంలో మీరు కష్టపడవద్దు. వారు ఆ లోతులలోని అంచులకు వెళ్ళాలని నిశ్చయించుకుంటే, మీరు ఏం చెప్పినప్పటికీ లేదా ఏం చేసినప్పటికీ కూడా వారు అక్కడకు వెళ్ళి తీరుతారు.

మీరు సహాయం చేస్తున్న వారితో మనోభావపరంగా పాల్గొనకపోవడం అన్నది చాలా ముఖ్యం. మనోభావపరంగా పాల్గొనడం అనేది ఇతరులను మార్చాలని లేదా హీల్ చేయాలనే వ్యక్తిగత-ఇచ్ఛతో అనుమతించినట్టే అవుతుంది. ఈ వ్యక్తిగత-కోరిక ఇతరులకు సహాయం చేయలేదు; ఇది నిజానికి వారి హీలింగ్ ప్రక్రియలో అడ్డులు ఏర్పడడానికి కారణమవ్వచ్చు. ఎప్పుడైతే మీరు ప్రజలు మార్పుచెందాలని కోరుకుంటారో అప్పుడు మీరు ప్రేమ మరియు సహాయం యొక్క ప్రదేశంలో ఉండలేరు. వీరు దీనిని స్పష్టంగా తెలుసుకోగలరు. మీరు వారిని గమనిస్తున్నట్లు మరియు చదువుతున్నట్లు అనుకోవచ్చు, అదే విధంగా వారు కూడా మిమ్మల్ని చాలా లోతుగా పరిశీలిస్తారు!!

అహం నుంచి హృదయం వైపు పరివర్తనం యొక్క నాలుగవ దశలో ఆత్మ స్థాయిని అధిగమించి ప్రజ్ఞాత్మ స్థితికి ఎదుగుతారు. దీనికి అర్థం ఆత్మ, ప్రజ్ఞాత్మ కంటే తక్కువ అని కాదు. ఇక్కడ గమనించాల్సినది ఏమిటంటే: మీరు మీ ఆత్మ కంటే శక్తివంతమైనవారు మరియు మరింత విస్తరణ కలిగినవారని. ఆత్మ అనుభవం యొక్క వాహనంగా ఉంటుంది. మీరు మీ అంతరంలోని ప్రజ్ఞాత్మతో, మీ దివ్యత్వంతో గుర్తించబడినప్పుడు, భూమి మీద మీరు అనేక జన్మలలో అనుభవించిన విషయాలన్నీ కూడా ఒక ప్రదేశానికి చేరుతాయి. మీరు వీటిలోని ఏ ఒక్క అనుభవంతోను మిమ్మల్ని మీరు పోల్చుకోకుండా ఉన్నప్పుడు మాత్రమే, మీరు ఈ అనుభవాలను అధిగమిస్తారు. ఇదే ఆత్మపై హీలింగ్ ప్రభావాన్ని చూపిస్తుంది.

* * * *

## హీలర్‌గా రూపొందే మార్గంలోని ఆటంకాలు

డియర్ ఫ్రెండ్స్, మీ పాత స్నేహితుడినైన నన్ను కలవడం కోసం ఈ ప్రదేశానికి వచ్చిన మీ అందరికి నా హృదయపూర్వక స్వాగతాన్ని పలుకుతున్నాను. మీతో ఇలా ఉండడం నాకు చాలా ఆనందంగాను మరియు సంతోషంగాను ఉంది. నా పేరు జెషువా. నేను జీసస్‌గా భూమి మీద జీవించిన జన్మలో మీతో ఉన్నాను. నేను కూడా మానవరూపాన్ని ధరించాను మరియు భూమి మీద భౌతికశరీరం ద్వారా కొనసాగే జీవితప్రవాహం ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు. 'మీరు ఎవరనే దానిని' తెలుసుకునే విషయంలో మీకు సహాయం చేయడానికే నేను ఇక్కడకు వచ్చాను.

ఇక్కడున్న మీరందరూ మరియు తర్వాత దీనిని చదివే వారందరూ కూడా లైట్‌వర్కర్సే. మీరు కాంతి యొక్క దేవతలు, నిజానికి మీరు ఎవరనేది మర్చిపోయారు. భూమి మీద కొనసాగుతున్న మీ ప్రయాణంలోను మరియు మీ గతజన్మల్లోను మీరు చాలా ప్రయత్నాలను చేశారు. ఈ ప్రయత్నాలన్నీ అంతరానికి సంబంధించినవే అని నాకు తెలుసు.

ఇప్పుడు మీరు మీ ఆత్మ యొక్క చరిత్రలోని ఒకానొక దశకు చేరుకున్నారు, ఈ దశలో మీరు మీ జన్మలన్నింటి యొక్క పరంపరను పూర్తి చేస్తారు. ఈ స్థితిలో నిజానికి మీరు ఎవరనేది తెలియజేసే మీ ప్రజ్ఞాత్మతో చాలా ఎక్కువగా బంధాన్ని ఏర్పరుచుకుంటారు, ఇది కాలం మరియు తలాలకు సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది. భూమి మీద ఉన్న మీ భౌతిక శరీరంలోకి, మీ నిత్య జీవితంలోకి ప్రజ్ఞాత్మను అనుమతించే ప్రక్రియలో ఉన్నారు.

మీరు మీ ప్రజ్ఞాత్మతో స్థిరమైన బంధాన్ని ఏర్పరుచుకోవడానికి ఇంకా కష్టపడుతున్నారు, ఎందుకంటే మీరు నిజానికి ఎవరనేది మరచిపోయారు అంటే మీరే కాంతికి మూలమని మరచిపోయారు కనుక. అయినప్పటికి మీరు అంతరంలో ప్రయాణాన్ని మొదలుపెట్టారు మరియు మీరు ఈ ప్రయాణంతో పాటు మీరు ఇతరులకు వారి అంతర్ ఎదుగుదల మరియు వ్యక్తిగత-ఎరుక స్థితికి చేరే మార్గంలో సహాయం చేయాలనే కోరికను అనుభూతి చెందారు. ఇది ముఖ్యంగా లైట్‌వర్కర్స్‌కు సహజమైన విషయం. ఎందుకంటే మీరు మీ అనుభవాలను మరియు లోతైన గమనికలను ఇతరులతో పంచుకోవాలని కోరుకుంటారు కాబట్టి. మీరందరూ టీచర్స్‌గాను మరియు హీలర్స్‌గాను జన్మించారు.

మీరు ఇతరులకు టీచర్‌గా లేదా హీలర్‌గా మార్గదర్శకత్వాన్ని చూపించాలనే బాధ్యతను స్వీకరించినప్పటి నుంచి, మీరు చాలా ఆటంకాలలో ఇరుక్కుపోవచ్చు. ఈ ఆటంకాలు అన్నవి ఇతరులకు ఆధ్యాత్మికపరంగా గైడ్ చేసేప్పుడు సంభవించే అవగాహనా లోపాల యొక్క ఫలితాలే. ఇవి మీకు హీలింగ్ చేసే విధానం గురించి మరియు ఒక హీలర్‌గా మీ యొక్క పాత్ర గురించి సరైన అవగాహన లేదనే విషయాన్ని తెలియజేస్తాయి. ఈ రోజు నేను ఈ ఆటంకాల గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను.

## హీలింగ్ అంటే ఏమిటి?

హీలింగ్ యొక్క సారాంశం ఏమిటి? మానసిక, మనోభావ లేదా భౌతికస్థాయిలలో ఎవరైనా "హీలింగ్"ని పొందినప్పుడు ఏం జరుగుతుంది? నిజానికి ఇక్కడ ఏం జరుగుతుందంటే, ఈ వ్యక్తి (ఆమె/అతను) తన సొంత అంతర్‌కాంతితో, తన సొంత ప్రజ్ఞాత్మతో తిరిగి బంధాన్ని ఏర్పరుచుకుంటాడు. ఈ బంధం ఆ మనిషిలో ఉన్న మనోభావ, మానసిక మరియు భౌతికస్థాయిల యొక్క అన్ని పొరల మీద హీలింగ్ ప్రభావాన్ని చూపుతుంది.

నిజానికి ప్రతి వ్యక్తి హీలర్‌లోను లేదా టీచర్‌లోను అన్వేషించేది: 'శక్తి ప్రదేశాన్నే'. ఇది ఇతరులను వారి యొక్క అంతర్‌కాంతితోనూ, ప్రతీ విషయం గురించి తెలిసిన మరియు అవగాహన కలిగిన వారి యొక్క భాగంతోనూ తిరిగి బంధాన్ని ఏర్పరుచుకునే అవకాశాన్ని కలిపిస్తుంది. ఈ ప్రదేశాన్ని హీలర్/టీచర్ మాత్రమే అందించగలడు. ఎందుకంటే వీరు వీరి యొక్క అంతరంతో ముందే బంధాన్ని ఏర్పరుచుకున్నారు కాబట్టి. హీలర్ సమస్యకు తగిన పరిష్కారం యొక్క శక్తి తరంగాన్ని, శక్తి ప్రకంపనాన్ని కలిగిఉంటాడు. ఇది వీరి దగ్గరకి కౌన్సిలింగ్ కోసం వచ్చే వ్యక్తులకు ఈ ప్రకంపనం అందుబాటులో ఉంటుంది. ఒక హీలర్‌గా లేదా టీచర్‌గా ఉండడం అంటే అర్థం మీ శక్తిక్షేత్రంలో పరిష్కారం యొక్క శక్తివంతమైన తరంగాన్ని కలిగిఉ ంటూ మరియు దీనిని ఇతరులకు అందుబాటులో ఉంచడమే. ఇదే హీలింగ్ అంటే, ఇంకేదో కాదు.

సాధారణంగా ఈ ప్రక్రియ మాటలు లేదా చర్యలు లేకుండా జరుగుతుంది. మీలో తనుకు తానుగా ఉన్న ఈ శక్తే మిమ్మల్ని హీలర్‌గా లేదా టీచర్‌గా తయారుచేస్తుంది, ఇదే హీలింగ్ ప్రభావాన్ని చూపిస్తుంది. మీ ఎన్‌లైటెండ్ శక్తి, ఇతరులకు ముందు నుంచే తెలిసిన దానిని 'జ్ఞప్తికి' తెచ్చుకోవడానికి, వారి యొక్క

అంతర్‌కాంతితో మరియు ఇంగితజ్ఞానంతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి అవకాశాన్ని అందజేస్తుంది. ఈ జ్ఞాపకం, ఈ బంధం హీలింగ్ జరిగేలా చేస్తాయి. నిజానికి హీలింగ్ వ్యక్తిగత–బాగుకి సంబంధించినది.

ఈ విధమైన హీలింగ్ లేదా బోధన కోసం, పుస్తకాలు లేదా కోర్సుల ద్వారా పొందే ప్రత్యేకమైన జ్ఞానం లేదా సామర్థ్యాలతో ఇక్కడ ఏ విధమైన పని ఉండదు. హీలింగ్ శక్తిని బయటి విషయాల ద్వారా పొందలేరు. నిజానికి ఈ హీలింగ్ శక్తి అన్నది మీ అంతర్ ఎదుగుదల మరియు చైతన్యం యొక్క స్పష్టతల ఫలితంగా మీ శక్తిక్షేత్రంలో ఉంటున్న "పరిష్కారం యొక్క తరంగానికి" సంబంధించినది. తరచూ ఒక హీలర్/టీచర్‌గా, మీరు ఇంకా మీ వ్యక్తిగత ఎదుగుదల యొక్క ప్రక్రియలో పాల్గొంటున్నారు. అయినప్పటికీ మీ శక్తిక్షేత్రంలోని భాగాలు స్వచ్ఛంగాను మరియు చాలా స్పష్టంగాను రూపొందడం వలన, అవి ఇతరులపై హీలింగ్ ప్రభావాన్ని చూపించగలవు.

ఈ ప్రభావం కోసం మీరు కష్టపడి పని చేయవలసిన అవసరం లేదనే విషయాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మీ దగ్గరకు వచ్చేవారు, మీరు అందిస్తున్న శక్తిని స్వీకరించాలా లేదా, అంతరంలోకి అనుమతించాలా లేదా అన్నది పూర్తిగా వారే నిర్ణయించుకోవాలి. ఇది పూర్తిగా వారి ఎంపికకు సంబంధించినది. మీరు దీనిని ఇతరులకు మీరు మీరుగా ఉండడం ద్వారాను, "వారి దగ్గర ఉండడం" ద్వారాను అందిస్తారు. ఇది మీరు ఇతరుల నుంచి నేర్చుకున్న జ్ఞానం లేదా నైపుణ్యం ద్వారా వచ్చేది మాత్రం కాదు. నిజానికి మీరు ప్రయాణించిన అంతర్ మార్గంలో మీరు మీరుగా ఉండడం ద్వారా, మీరు ఈ హీలింగ్ ప్రభావాన్ని కలిగి ఉన్నారు. ముఖ్యంగా మీ అంతట మీరుగా సమస్యల యొక్క లోతైన మనోభావపరమైన స్థాయిల దగ్గరకు పయనించిన అనుభవం ఉన్నప్పుడే, మీరు ఇతరులకు సహాయం చేయగలరు. ఈ సమస్యల యొక్క ప్రాంతాలలో మీ కాంతి ఒక దీపస్థంభంలా ప్రకాశిస్తూ, ఇటువంటి సమస్యలలో ఇరుక్కుపోయి ఉన్న వారికి, వీటి నుంచి సులభంగా బయటకు వచ్చే మార్గాన్ని చూపిస్తుంది.

మీ అంతట మీరుగా నయం చేసుకున్న లోతైన గాయాలు మరియు బాధలకు సంబంధించిన భాగాలు మీ అంతరంలో ఉన్నప్పుడే మీరు నిజమైన మాస్టర్‌గా తయారవుతారు. ఈ మాస్టర్ యొక్క మేధాసంపత్తి అన్నది అంతర్‌జ్ఞానం మరియు నిజాయితీ గల అనుభవాల మీద ఆధారపడి ఉంటుంది. మీ అంతర్ గాయాలను మీ సొంతంగా నయం చేసుకోవడం, వాటి బాధ్యతను స్వీకరించడం మరియు మీ చైతన్యం

యొక్క కాంతితో వాటిని చుట్టుముట్టడం అనేది ఒక టీచర్‌గా మరియు హీలర్‌గా రూపొందడానికి కావలసిన అతి ముఖ్యమైన అర్హత. మిమ్మల్ని మీరు హీల్ చేసుకునే సామర్థ్యమే మిమ్మల్ని లైట్‌వర్కర్స్‌గా తయారుచేస్తుంది. ఇది మీ వ్యక్తిత్వంలో "పరిష్కారం యొక్క శక్తి"ని సృష్టిస్తూ, ఇతరులు వారి సొంత శక్తితో వారిని హీల్ చేసుకునే మార్గాన్ని అందిస్తుంది.

మీ పరిసరాలలోని ప్రజలకు సహాయం చేస్తున్నప్పుడు లేదా మీ దగ్గరకు హీలింగ్ కోసం వచ్చిన వారితో వ్యవహరిస్తున్నప్పుడు, మీరు తరచూ వారి శక్తిని "చదువుతారు". మీరు వారి మాటలను వింటున్నప్పుడు, వారికి సలహాలను ఇస్తున్నప్పుడు లేదా వారి దగ్గర శక్తివంతమైన హీలింగ్ పద్ధతులతో వ్యవహరిస్తున్నప్పుడు, మీరు మీ ఇంగితజ్ఞానంతో వారికి తగినట్టుగా శృతి చేయబడతారు. మీరు హీలింగ్ చేస్తున్న వ్యక్తి కూడా మిమ్మల్ని "చదవడం"లో మునిగిపోతాడు. మీరు ఎలా అయితే వారి శక్తికి శృతి చేయబడుతున్నారో, అలాగే వారు కూడా చేతనంగాను లేదా అచేతనంగాను మీ శక్తిని గ్రహిస్తారు. మీరు ప్రసరింపజేస్తున్న శక్తి ప్రకంపనానికి తగినట్టుగా మీరు చేస్తున్న లేదా చెబుతున్న దానికి పోలిక ఉందా లేదా అన్నది వారు కూడా వారి ఇంగితజ్ఞానం ద్వారా అనుభూతి చెందుతారు. వారు మీ మాటలు లేదా మీ చేతలనే కాకుండా, మీరు ఎవరనే దానిని కూడా అనుభూతి చెందుతారు.

ఈ విధంగా మీ దగ్గరకు హీలింగ్ కోసం వచ్చిన వ్యక్తి మిమ్మల్ని చదవడం అన్నది ఒక నిజమైన విజయావకాశంలా ఉంటుంది. ఈ వ్యక్తి మీ ఉనికిలోని స్వేచ్ఛను మరియు భద్రతను అనుభూతి చెందినప్పుడు, తన అంతర్జ్ఞానాన్ని విశ్వసించడానికి అనుమతించే ఒక విధమైన చైతన్యం ద్వారా చుట్టబడి ఉన్న అనుభూతిని పొందినప్పుడు, అతను మీరు చెప్పిన లేదా చేసిన ప్రతీ విషయాన్ని కూడా హీలింగ్ లక్షణంగా తీసుకుంటాడు. మీ మాటలు లేదా చేతలు మీరు ఎవరనే దానిని ప్రతిబింబించినప్పుడు, అవి కాంతి మరియు ప్రేమ యొక్క వాహకంగా తయారవుతూ వారిని వారి సొంత కాంతి మరియు ప్రేమ యొక్క మూలంలోకి తీసుకువెళ్తాయి.

ఎవరైనా మిమ్మల్ని నిజాయితీగా సహాయాన్ని అడిగినప్పుడు, వారు మీ శక్తిని తీసుకోవడానికి మరియు మీ యొక్క స్వచ్ఛమైన మరియు స్పష్టమైన భాగం ద్వారా స్పృశించబడడానికి అర్హత కలిగిన వారని అర్థం. ఈ మీ యొక్క భాగం, మీరు చదివిన పుస్తకాలు లేదా మీరు నేర్చుకున్న నైపుణ్యాల నుంచి ఉద్భవించినది కాదు. ఇది వ్యక్తిగత మార్పు, వ్యక్తిగత పరివర్తనం ద్వారా మీ చైతన్యంలో ఏర్పడిన ముద్ర యొక్క ఫలితమే. నేను దీనికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాను. ఎందుకంటే ఇతరులకు

నయం చెయ్యాలనే వైఖరి గల లైట్‌వర్కర్స్, ఒక మంచి టీచర్/హీలర్‌గా తయారవ్వడానికి ఒక కొత్తపుస్తకాన్ని, కొత్తపద్ధతిని, కొత్తసామర్థ్యాన్ని వెతుకుతుంటారు. నిజమైన హీలింగ్ అన్నది చాలా సులభం.

నేను భూమి మీద జీవించినప్పుడు నా కళ్ళ ద్వారా ఒక శక్తిని ప్రసరింపజేసేవాడిని. ఎవరైతే ఈ శక్తిని అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారో అటువంటి వారు నా కళ్ళ ద్వారా ప్రసరింపబడే శక్తిని అందుకుని తక్షణ హీలింగ్ ప్రభావాన్ని పొందేవారు. దీనిలో ఎటువంటి అద్భుతమైన గారడిగాని లేదా నాకు మాత్రమే సొంతమైన నైపుణ్యంగాని ఏమి లేదు. నేను నా అంతర్‌వాస్తవం యొక్క మూలంతో కలుపబడి ఉండేవాడిని. నేను సహజంగా దివ్యత్వపు కాంతిని మరియు ప్రేమను నా వారసత్వంగా ప్రసరింపజేసేవాడిని – అవి మీ వారసత్వం కూడా – మరియు నేను ఇతర ప్రాణులను కూడా ఈ శక్తితోనే స్పృశించేవాడిని. ఇలాగే మీరు కూడా చెయ్యవచ్చు. మీకు నాకు మధ్య ఏ ప్రత్యేకత లేదు. మీరు కూడా అదే అంతర్‌మార్గంలో నడిచారు; మీరు అవే ప్రయత్నాలు మరియు బాధల ద్వారా పయనిస్తూ, చివరికి నేను భూమి మీద జీవించినప్పుడు చేరిన స్థితికే మీరు చేరుతున్నారు. మీరందరూ జాగృతావస్థలో క్రీస్తు చైతన్యంగా రూపొందుతున్నారు.

మీ ఆధ్యాత్మిక గమ్యం క్రీస్తుశక్తే మరియు మీరు క్రమక్రమంగా ఈ శక్తిని మీ నిత్యజీవితంతో అనుసంధానం చేస్తారు. క్రీస్తుశక్తి యొక్క సహజమైన ఫలితంగా ఉన్న “మీ అంతరంలోని ఈ క్రీస్తు” హీలర్‌గాను మరియు టీచర్‌గాను ఉంటాడు. ఇప్పటికీ చాలా తరచుగా మిమ్మల్ని మీరు గురువు పాదాల దగ్గర ఉండే శిష్యులుగా భావిస్తూ, మీ సందేహాలను ఆ గురువును అడుగుతూ వారి మాటలను వింటున్నారు లేదా గురువుల కోసం అన్వేషిస్తున్నారు. కాని నేను మీకు చెబుతున్నాను మీరు శిష్యుడిగా ఉండే సమయం అయిపోయింది అని. మీకు మీరే గురువు అయ్యే సమయం వచ్చింది. మీ అంతరంలోని క్రీస్తుని విశ్వసించడానికి మరియు ఈ శక్తిని మీ నిత్యజీవితపు వాస్తవంలో వ్యక్తీకరించడానికి కూడా ఇదే సరియైన సమయం.

మీ అంతరంలోని క్రీస్తుతో మీరు ఏకమైనప్పుడు, మీరు ఆ శక్తి నుంచి బోధిస్తూ మరియు హీలింగ్ చేసినప్పుడు, మీరు చాలా విషయాలను విడుదల చేయవలసి ఉంటుంది. ఈ విషయాలు హీలర్/టీచర్‌గా రూపొందే మార్గంలో ఎదురయ్యే ఆటంకాలను తెలియజేస్తాయి. నేను ఈ ఆటంకాలను మూడు భాగాలుగా విభజించి చెప్పాలని అనుకుంటున్నాను.

**తల భాగంలో ఉన్న ఆటంకం**

మొదటి ఆటంకం మీ తల లేదా మనసు యొక్క భాగంలో ఉంటుంది. మీరు విషయాలను విశ్లేషించే విధానానికి మరియు వాటిని కొన్ని సాధారణమైన సూత్రాల ప్రకారం విభజించడానికి చాలా ఎక్కువగా అలవాటుపడినారు. కొన్ని పరిస్థితులలో ఇది సరైనదిగా అనిపించవచ్చు, కాని సాధారణంగా మీ యొక్క మానసిక ఆలోచనారీతి యొక్క భాగం చాలా వరకూ ద్వంద్వం యొక్క ప్రపంచంలో భాగంగా ఉంటోంది. ద్వంద్వం యొక్క ప్రపంచం అంటే ఒక విధమైన చైతన్యం, ఇది విషయాలను మంచి లేదా చెడు, చీకటి లేదా వెలుగు, ఆరోగ్యం లేదా అనారోగ్యం, మగతత్వం లేదా ఆడతత్వం, మిత్రువు లేదా శత్రువు మొదలైన వాటిగా విభజిస్తుంది. ఈ రకమైన చైతన్యం విషయాలను విభజిస్తూ ముద్రలను అతికించడాన్ని ఎక్కువగా ప్రేమిస్తుంది మరియు ఇది అన్ని విషయాలలో మూలంగా ఇమిడి ఉన్న ఏకత్వాన్ని గుర్తించలేదు. ఈ రకమైన చైతన్యం సాధారణ నియమాలు మరియు వ్యక్తిగత స్థాయిలోని హేతుబద్ధమైన లక్ష్యాలతో పని చేయడానికి ఇష్టపడుతుంది. నిజానికి ఇది వాస్తవాన్ని సూటిగా చేరే మరొక అవకాశాన్ని పరిగణలోకి తీసుకోనివ్వదు: ఇంగితజ్ఞానం, లేదా “అనుభూతుల ద్వారా తెలుసుకోవడాన్ని” ఉపయోగించదు.

క్రీస్తుశక్తి ద్వంద్వం యొక్క ఆవలివైపు ఉంటుంది. క్రీస్తుశక్తి అన్ని భిన్నత్వాల క్రింద ప్రవహిస్తున్న ఉనికిని ఏకం చేస్తుంది. కాని ఆధ్యాత్మిక స్థాయిలో ఉన్న ఈ ఏకత్వం యొక్క ఉనికిని మనసు అర్థం చేసుకోలేదు. మనసు ఈ అనంతమైన ఉనికిని చిన్ని చిన్ని భాగాలుగా విభజించి నిర్వచించాలని అనుకుంటుంది. ఎందుకంటే అప్పుడే వీటిపై అర్థవంతమైన ఆధిపత్యాన్ని పొందగలదు కనుక. మనసు పద్ధతులను, సిద్ధాంతాలను రూపొందించి వాటిని వాస్తవం మీద మరియు ప్రత్యక్ష అనుభవం మీద పెట్టాలని అనుకుంటుంది. ముఖ్యంగా ఇది వాస్తవాలకు సంబంధించిన కొన్ని విషయాలకు మాత్రమే ఉపయోగకరంగాను మరియు సౌకర్యవంతగాను ఉంటుంది. కాని ఇది హృదయం ద్వారా చేసే హీలింగ్‌కు మరియు బోధనకు మాత్రం ఉపయోగపడదు.

మీరు ఏ విధమైన ఆచరణ లేకుండా ఇతరులకు సహాయం చేయాలనుకుంటే, మీరు వారి యొక్క ప్రత్యేకమైన లక్షణాలను సాధారణమైన వాటిగా గుర్తిస్తారు. మీరు వారి యొక్క సమస్యలకు మరియు వాటి సమాధాలను కనుగొనడానికి సిద్ధాంతాల కోసం వెతుకుతుంటారు. మీరు ఒక మానసిక శాస్త్రవేత్తగా, సామాజిక వేత్తగా లేదా ఏ విధమైన సలహాదారుడిగా ఉండడానికి మీరు శిక్షణ పొందుతున్నప్పుడు, మీరు

ముఖ్యంగా వీటినే నేర్చుకోవాలి. నేను ఇవన్నీ తప్పని చెప్పడం లేదు. కాని నేను మిమ్మల్ని అడుగుతున్నది ఇదే: మీరు సలహాదారుడిగానైనా లేదా మీ వ్యక్తిగత జీవితంలోనైనా ఇతరులతో పని చేస్తున్నప్పుడు, మీ ఆలోచనలను, విశ్లేషణలను మరియు వారిపట్ల మీకున్న ఉద్దేశ్యాలన్నింటిని విడుదల చేస్తూ, మరియు వారి మాటలను "మీ హృదయంతో వినాలని." మీ అంతరంలోని నిశ్శబ్ధపు ప్రదేశంలో ఉంటూ ఇతరుల యొక్క శక్తికి తగినట్టుగా శృతి చేసుకోండి. మీ దగ్గరకు వచ్చిన వ్యక్తి వేటిపై ఆధారపడుతున్నాడు అన్నది, అతని అంతర్ ప్రపంచంలో మీరు ఉంటే ఎలా ఉ ంటుంది అన్నది, మీ హృదయం మరియు ఇంగితజ్ఞానంతో అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. (ఈ ఫలితాన్ని పొందడానికి ఈ ఛాప్టర్ చివరిలో చెప్పిన పద్ధతిని చదవండి.)

ఇతరులు వారి యొక్క సమస్యలను పరిష్కరించుకోవడానికి అవసరమైన సలహాలను మీరు తరచూ పెంచి పోషిస్తుంటారు. మీరు వారి యొక్క సమస్యలను విశ్లేషిస్తూ మరియు దాని పరిష్కారం గురించి ఆలోచిస్తుంటారు. మీ ఆలోచనారీతిలో ఇది చాలా వరకూ సరైనదని అనిపించవచ్చు. కాని ముఖ్య గమనిక ఏమిటంటే: మీ సలహాలు ఇతరుల యొక్క శక్తికి తగినట్టుగా వర్తమానంలో శృతి కాకపోవచ్చు. మీరు వారి అంతరంలో ఏమి అనుభూతి చెందుతున్నారనే దానితో పూర్తిగా బంధాన్ని కోల్పోవచ్చు. మీరు సహాయం చేద్దామనుకున్న వారి యొక్క శక్తివంతమైన వాస్తవానికి తగినట్టుగా మీ సలహాను శృతి చేసినప్పుడే, మీ సహాయం సార్ధకం అవుతుంది. మీ హేతుబద్ధమైన మనసుతో పరిశీలించిన దాని కన్నా కూడా, పూర్తి ప్రత్యేకమైన మార్గం ఆమె లేదా అతనికి అవసరమై ఉండవచ్చు.

మీ అంతరంలోని నిశ్శబ్ధమైన, సహజమైన ప్రదేశం నుంచే పూర్తిగా ఇతరులను చూడమని మరియు అనుభూతి చెందమని నేను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ద్వంద్వాన్ని అధిగమించడానికి మరియు అంతరంలో క్రీస్తుశక్తి యొక్క కరుణతో నింపబడడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి. మీరు ఇతరులకు టీచింగ్‌ని మరియు హీలింగ్‌ని అందిస్తున్నప్పుడు, వారు మీ దగ్గర ఉన్నప్పుడు, మిమ్మల్ని ఉత్సాహంతో ఉండమని నేను అడుగుతున్నాను.

అప్పుడు పరిష్కారం అన్నది చాలా సులభమవుతుంది. మీ నుంచి కావలసినది ఏమిటంటే మీ యొక్క తెలివితేటలు కాదు, కేవలం మీ అంతర్ మేధాసంపత్తి మాత్రమే. మిమ్మల్ని అడుగుతున్నది: మీ నిర్ణయాన్ని కాదు, కేవలం మీ కరుణ మరియు లోతైన

అవగాహనను మాత్రమే. మీరు అక్కడ ఉన్నది పరిష్కారాన్ని అందించడానికే గాని, వారిపై అధికారాన్ని చూపించడానికి కాదు. మీరు వారితో ప్రేమగా ఉంటే సరిపోతుంది.

ఈ విషయాన్ని ఒక ఉదాహరణతో విశదీకరించి చెప్పాలనుకుంటున్నాను. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలకు సహాయం చేయాలనుకునే తల్లిదండ్రులను తీసుకోండి. ఒక పని చేయడం ద్వారా వచ్చే ఫలితాలను పిల్లల కన్నా కూడా తల్లిదండ్రులే వారి అనుభవం ద్వారా సరిగ్గా అంచనా వేయగలుగుతారు. ఈ జ్ఞానం ఆధారంగా తల్లిదండ్రులు వారి పిల్లలను తరచూ హెచ్చరిస్తుంటారు; వీరు వీరి పిల్లలను ప్రమాదాల నుంచి కాపాడాలని అనుకుంటారు మరియు తల్లిదండ్రులు వారు సరైనవని భావించిన విషయాలనే చేయమని పిల్లలకు సలహా ఇస్తారు. ఇది మనసుపరంగా ఆలోచిస్తే చాలా గొప్ప సహాయంలా అనిపించవచ్చు. కొన్ని విషయాలలో ఇది చాలా వరకూ అర్ధవంతమైనది.

తల్లి/తండ్రి అంతరంలోని నిశ్శబ్దమైన మరియు సహజమైన ప్రదేశం నుంచి పిల్లలకు తగినట్టుగా శృతి కాబడినట్లయితే, పిల్లలు నిజానికి వీరి నుంచి ఆశిస్తున్నది పూర్తి ప్రత్యేకమైన విషయమని కనుగొంటాడు. తరచూ పిల్లలు ఎక్కువగా కోరుకునేది: తండ్రి యొక్క విశ్వాసాన్ని మరియు సహకారాన్ని. “నన్ను నమ్మండి, నన్ను నన్నుగా ఉండనివ్వండి. నన్ను పొరబాట్లను చెయ్యనివ్వండి, నన్ను పడిపోనివ్వండి మరియు నా మీద మీ విశ్వాసం అలాగే ఉండనివ్వండి.” మీరు నమ్మకం అనే తలం నుంచి మీ పిల్లలతో బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడు, మీరే వారిని వారి యొక్క ఇంగితజ్ఞానం మీద ఆధారపడడానికి ప్రోత్సహిస్తారు. ఈ ప్రోత్సాహం పిల్లలు వారికి సరైనదని అనిపించిన నిర్ణయాన్ని తీసుకోవడంలో సహాయం చేస్తుంది మరియు ఇది మీరు కూడా అర్ధం చేసుకోదగినదిగా ఉంటుంది. “మీకు బాగా తెలుసు” అనే అభిప్రాయం ద్వారా, మీ పిల్లలతో చేయించాలని ప్రయత్నించినట్లయితే, మీ పిల్లలు మీ వైఖరిలో ఉన్న అవిశ్వాసాన్ని అనుభూతి చెందుతారు మరియు ఇది వారు మిమ్మల్ని మరింతగా ప్రతిఘటించేలా చేస్తుంది.

మీరు పిల్లలకి సహకారాన్ని అందించినప్పుడు వారు మిమ్మల్ని “చదువుతారు.” పిల్లలు మీ మాటల వెనుకనున్న మీ మనోభావాల యొక్క ఎరుకను క్షుణ్ణంగా పరిశీలించగలిగే స్వభావాన్ని కలిగిఉంటారు. వారు మీ మాటల వెనుకనున్న భయాలను లేదా నిర్ణయాలను గుర్తించగలరు. పిల్లలు తరచూ మీ మాటల కన్నా మీ మనోభావానికి ఎక్కువగా స్పందిస్తారు. వీరు అయిష్టతతో ప్రతిస్పందించినప్పుడు,

అది పూర్తి అకారణంగా అనిపించవచ్చు. తండ్రి కారణానికి తగిన విధంగా స్పందించినట్లు అనిపించవచ్చు, అంటే వీరు వీరి సొంత మనోభావాల వెనుక దాగి ఉన్న వాటిని గుర్తించలేరు మరియు వీరు పిల్లలతో నిజాయితీగాను మరియు అంగీకార వైఖరితోను బంధాన్ని ఏర్పరుచుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఇలా చేయాలంటే, తల్లిదండ్రులు వారి యొక్క పాత అభిప్రాయాలను విడుదల చేయాలి మరియు పిల్లల యొక్క మనోభావ సంబంధిత వాస్తవాన్ని అంగీకరించగలగాలి. పిల్లల యొక్క ఆనందాలను మరియు ఆందోళనలను నిజాయితీగా వినడం వలన మీ ఇరువురి మధ్య సంభాషణకు వారధి ఏర్పడుతుంది.

నేను ఈ ఉదాహరణ చెప్పడానికి కారణం ఏమిటంటే ఇది చాలా తరచుగా సంభవించే విషయం మరియు అతి సర్వసాధారణమైన విషయం కాబట్టి. విశ్వాసం మరియు అంగీకార వైఖరితో మీ పిల్లలకు సహకరించడం అనేది ఎంత కష్టమైన విషయమో మనందరికి తెలుసు. ఇదంతా విడుదల చేయడం గురించే – "ఎలా ఉండాలి" అని చెప్పే మీ సలహాలను, మీ కోరికలను మరియు మీ ఆశలను విడుదలచేయాలి, మరియు వేరే వ్యక్తులను వారిని వారిలా ఉండడానికి అనుమతించండి. ఇతరులను అంగీకార వైఖరితో మరియు నిజమైన, హృదయపూర్వకమైన అవగాహనతో కూడిన ప్రదేశంలో ఉండి ఇతరులను హత్తుకోవడం అన్నది, వారికి నిజమైన హీలింగ్ శక్తిని అందించేదిగా ఉంటుంది. ఇతరులకు నిజంగా సహాయం చేసేది ఏమిటంటే, మీ పూర్తి అంగీకారంతో పరిస్థితులను ఉన్నదిఉన్నట్టుగా స్వీకరించ గలగడమే. మీ మనసు యొక్క స్థాయి నుంచి దేనిని మార్చడానికి ప్రయత్నించనప్పుడు, మీరు నిజంగా ఇతరులతో బంధాన్ని ఏర్పరుచుకోగలరు మరియు వారి కోసం ప్రేమ మరియు కరుణ యొక్క ద్వారాన్ని తెరవగలరు.

## హృదయ-భాగంలోని ఆటంకం

మీరు టీచర్‌గా లేదా హీలర్‌గా ఉండడానికి చేసే కృషిలో ఎదురయ్యే రెండవ ఆటంకం హృదయభాగంలో ఉంటుంది. హృదయం చాలా శక్తులు కలుసుకునే ఒక కేంద్రబిందువు. హృదయ కేంద్రం(లేదా చక్రం), భూమికి మరియు ఇతరతలాలకు మధ్య వారధిని, పై శక్తి కేంద్రాలకు మరియు క్రింది శక్తి కేంద్రాలకు మధ్య వారధిని నిర్మిస్తుంది. హృదయం ఒక ప్రత్యేకమైన మూలం యొక్క శక్తులను "సేకరిస్తుంది" మరియు ఇది వీటన్నింటి క్రింద ఉన్న ఏకత్వాన్ని గుర్తించగలదు. హృదయం ద్వంద్వాన్ని అధిగమించే అవకాశాన్ని మీకు కలిపిస్తుంది. ఇది ప్రేమ మరియు కరుణలతో ఇతరులను దగ్గరకు చేరదీయగలదు.

హృదయం ఇతరుల శక్తికి తగినట్టుగా శృతి చేసుకునే మరియు ఆ వ్యక్తిలా ఉన్నప్పుడు మీరెలా అనుభూతి చెందుతారనే సామర్థ్యానికి మూలస్థానంగా ఉంటుంది. ఇది ఇతరుల మనోభావాలను తెలుసుకునే శక్తికి కేంద్రంగా ఉంటుంది. కాబట్టి హృదయం ఆధ్యాత్మిక బోధన లేదా ఏ హీలింగ్ రూపంలోనైనా ముఖ్యమైన పాత్రను స్పష్టంగా పోషిస్తుంది. మీలో చాలామంది సహజంగా ఇతరుల మనోభావాలను చదవగలిగే సామర్థ్యాన్ని కలిగిఉంటారు – మీరు ఇతరుల మనస్తత్వాలను మరియు శక్తులను అనుభూతి చెందాలనే ఒక సహజమైన ఇచ్ఛను కలిగిఉంటారు. మీరు ఇతరులతో పనిచేసే సమయంలో మీకు ఈ సామర్థ్యం చాలా గొప్పగా ఉపయోగపడుతుంది.

అదేవిధంగా ఈ సామర్థ్యంతో ఒక ముఖ్యమైన ఆటంకం కూడా కలిసి ఉంది. మీ సున్నితత్వం ఇతరుల శక్తులకు చాలా బలంగా స్పందించడం వలన, మీ మనోభావాలకు మరియు ఇతరుల యొక్క మనోభావాలకు మధ్య తేడాలను గుర్తించడం మీకు చాలా కష్టంగా ఉంటుంది. మీ ఆత్మ యొక్క అనుభూతిని కోల్పోయేంతగా, కొన్నిసార్లు ఇతరుల శక్తులను బలంగా ఆకర్షిస్తారు. ముఖ్యంగా ఇతరులు ఎలా అనుభూతి చెందుతారనేది మీకు తెలియడం వలన, మీరు ఇతరులకు ఎక్కువగా సహాయం చేయాలని కోరుకోవచ్చు. దీని కారణంగా మీ ఇరువురి శక్తులు కలుస్తాయి మరియు మీరు మీవి కాని వారి బరువులను మోయడం ప్రారంభిస్తారు.

ఇది జరిగినప్పుడు మీరు సమన్వయాన్ని కోల్పోతారు. మీరు చాలా అధికంగా ఇస్తున్నారు. మీరు ఇతరుల యొక్క బాధలను మోస్తూ మరియు మీ మార్గం నుంచి బయటకు వచ్చి వారికి సహాయం చేసినప్పుడు, మీరు మీ హద్దులను అతిక్రమిస్తారు. మీరు అధికంగా ఇచ్చే శక్తే మీకు శత్రువుగా మారుతుంది. ఈ అదనపు శక్తిని ఇంకొకరి దగ్గరకు వెళ్తుంది, కాని ఇది వారి సమస్య పరిష్కారం కోసం ఏమాత్రం సహకారాన్ని అందించలేదు. ఆ వ్యక్తి ఈ శక్తిని అందుకోలేడు లేదా తనలో ఐక్యం చేసుకోలేడు, లేదా వారు ఈ శక్తికి భయపడవచ్చు, లేదా వారు దీనిని గుర్తించలేకపోవచ్చు. మీరు చివరికి అవిశ్రాంతికి, నిరాశకు మరియు చిరాకుకు లోనవుతారు.

మీరు ఎక్కువగా ఇస్తున్నారనే దానిని – మీ శరీరం మరియు మనోభావాలు మీకు సంకేతాల ద్వారా తెలియజేయడాన్ని మీరు గుర్తించగలరు. మీరు కౌన్సిలింగ్ కోసం వచ్చిన వ్యక్తిని కలిసిన తర్వాత లేదా సాధారణంగా ఎవరికైనా సహాయం చెయ్యాలని ప్రయత్నించినప్పుడు, మీరు శూన్యతను, ఆందోళనను లేదా భారాన్ని

అనుభూతి చెందుతున్నట్లయితే, ఇది మీరు అధికంగా కృషిచేశారన్న దానికి సంకేతం లాంటిది.

మీరు సమన్వయంతో కూడిన కేంద్రస్థితి నుంచి బోధనను మరియు హీలింగ్‌ను అందిస్తే, మీరు తేలికదనాన్ని, ప్రోత్సాహాన్ని మరియ ఉత్తేజాన్ని అనుభూతి చెందుతారు. మీరు ఈ విధంగా ఏ వ్యక్తినైనా కలిసిన తర్వాత, మీరు సులభంగా మీ నిజస్థితికి మరియు మీ శక్తికి తిరిగి రాగలరు. మీరు ఆ వ్యక్తిని సులభంగా విడుదల చేయగలరు మరియు మీ ఇరువురి శక్తిక్షేత్రాల మధ్య శక్తిపరంగా పట్టి ఉంచే బంధం వెంటనే విడిపోతుంది.

ఆ వ్యక్తితో శక్తి బంధం అలాగే ఉన్నట్లయితే దానికి అర్ధం, మీరు ఆమె లేదా అతను నయమవ్వాలని లేదా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్టు మరియు ఈ బంధం మీ శక్తిపై చెడు ఫలితాన్ని చూపిస్తుంది. అతనితో పాటు మీరు కూడా బాధపడితే, మీరు అతని యొక్క మనోభావ శక్తులను చాలా బలంగా సంగ్రహిస్తారు. వారి బాధకు ఉపశమనాన్ని ఇవ్వడంలో మిమ్మల్ని మీరు కోల్పోతారు మరియు ఇక్కడ మీ ఇద్దరి మధ్య మనోభావపరంగా ఆధారపడే తత్వం ఏర్పడుతుంది. ఈ వ్యక్తి మీపై ఆధారపడతాడు మరియు మీ సంతోషం వారి సంతోషం మీద ఆధారపడే తత్వంగా మారుతుంది. ఈ విధంగా చిక్కుల్లో ఇరుక్కుపోయిన శక్తులు అతనికి ఏ మాత్రం సహాయం చెయ్యవు మరియు ఇవి మీ శక్తిని క్షీణింప చేస్తుంటాయి.

మీరు ఇతరులకు సహాయం చెయ్యడం మొదలుపెట్టినప్పుడు, మీ శక్తి సులభంగా చిక్కుల్లో ఎందుకు ఇరుక్కుని పోతుంది? ముఖ్యంగా లైట్‌వర్కర్స్‌కి ఈ ఆటంకాన్ని ఎదుర్కోవడం ఎందుకు కష్టంగా ఉంటుంది?

ఈ ప్రపంచాన్ని హీల్ చెయ్యాలని, సంపూర్ణంగా తయారు చెయ్యాలని, మరియు అద్భుతమైన స్థలంగా ఉంచాలనే బాధాకరమైన బలమైన కోరిక ఎక్కడి నుంచి వస్తోంది? మీరు ఈ ప్రపంచానికి బోధనను మరియు హీలింగ్‌ను అందించాలనే అంతర్ లక్ష్యాన్ని కలిగిఉన్నారు. ఇలా ఎక్కువగా ఇవ్వాలనే వైఖరి, మీకు పూర్తిగా ఎరుకలో లేని మీ అంతర్‌బాధ నుంచి ఉద్భవిస్తోంది. ఈ బాధ మిమ్మల్ని ఇచ్చే విషయంలో "ఎక్కువగా తొందరపెడుతుంది".

మీ హృదయంలో ఉన్న బాధ మరియు విచారం, మీరు కొత్తతరహా వ్యక్తిత్వంగాను రూపొందాలని అనుకునేలా చేస్తాయి, ఈ విధమైన చైతన్యపు స్థితి

ప్రాణులన్నింటి యొక్క సహజమైన దివ్యత్వానికి మరింతగా శృతి కాగలదు. మీరు భూమి మీద మరింత ప్రేమపూర్వకమైన మరియు ప్రశాంతమైన వాస్తవాన్ని పొందాలని ఆరాటపడుతున్నారు. మీ ప్రస్తుతజన్మలో, మీరు అహంభావం యొక్క పద్ధతులను అన్వేషించడానికి మాత్రం రాలేదు. మీరు వీటి కారణంగా అవిశ్రాంతికి మరియు అలసటకు లోనయ్యారు. మీ ఆత్మ యొక్క ప్రాచీనమైన గీతానికి సమాధానాన్ని ఇవ్వడానికే మీరు ఇక్కడకు వచ్చారు. మీరు భూమి మీద ప్రశాంతతను, ఆనందాన్ని, అభిమానాన్ని మరియు ఐకమత్యాన్ని తిరిగి నెలకొల్పడంలో సహాయం చేయడానికి కూడా వచ్చారు.

మీ మనోభావశరీరం చాలా జన్మలలో గాయపడింది. ఈ జన్మలలో మీరు ఆత్మ యొక్క కాంతిని భూమి మీదకు తీసుకువచ్చే ప్రయత్నంలో తిరస్కారాలను మరియు అణచివేతలను ఎదుర్కొన్నారు. మీరు ఇక్కడకు గొప్ప అవకాశాలతో వచ్చారు మరియు అదే సమయంలో మీ అంతరంలో ఆశయం యొక్క పాత పుష్పం ఒడిలిపోకుండా అలాగే ఉంది. మీరు మళ్ళీ ఇక్కడ ఉన్నారు! మీరు అంతరంలో మోస్తున్న బాధ వలన, మీరు ఒక సున్నితమైన మరియు మృదువైన పుష్పంలా ఉంటున్నారు. కాని ఇప్పుడు, మీరు వికసించడానికి మరియు ఎదగడానికి మీకు గట్టి పునాది అవసరం. మీ అందరికి అవసరమైన గట్టి పునాది: భూమి మీద స్థిరంగా ఉంటూ మరియు మీ ఆత్మ కేంద్రంలో ఉండాలనే అనుభూతియే.

స్థిరంగా ఉండడం అంటే, భూ వాస్తవికత ఎలా పని చేస్తోందనే దాని యొక్క ఎరుకను కలిగి ఉండడానికి, మీరు భౌతిక శరీరంలో జీవిస్తున్నప్పుడు ఏ మూల అంశాలతో వ్యవహరించాలనే విషయాన్ని తెలుసుకోవడానికి మీ వ్రేళ్ళను భూమిలోకి స్థిరంగా నాటాల్సిన అవసరం ఉంది. కొన్నిసార్లు మీరు ఆధ్యాత్మికత పట్ల అధిక మక్కువను కలిగి ఉండడం వలన మీ మీద మరియు మీ శరీరం మీద కూడా శ్రద్ధను వహించడం మరచిపోతారు. మీరు “ఇతరతలాల”లోను, లేదా అతి ఆదర్శవంతంగాను మరియు అసహజంగాను ఉంటారు. మీరు తరచూ భూ వాస్తవికతను అధిగమించాలని కోరుకుంటారు, కాని మీరు దీనిని “భూమి ద్వారా” మాత్రమే అధిగమించగలరు. దీని అర్థం మీ ఇంటిలో ఉన్న అనుభూతిని భూమి మీద పొందినప్పుడు మరియు భూమి యొక్క లక్షణంతో సహజంగా ఉన్నప్పుడు మాత్రమే, మీ ఆత్మ శక్తి ఇక్కడ వికసించగలదు మరియు భూ వాస్తవికతను అధిగమించగలదు.

అంతర్ కేంద్రం అంటే మీ సొంత అనుభూతులతోను మరియు మీకు సరైనది అనిపించిన మీ సొంత భావనతోను నిజాయితీగా ఉండాల్సిన అవసరం

ఉంది. ఒక మనిషిగా మీరు అహాన్ని లేదా ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కలిగిఉంటారు, ఇది మిమ్మల్ని ఇతరుల నుంచి వేరుచేస్తుంది. అహం ఒక విలువైన పనికి సహకరిస్తుంది. ఇది మీ ఉన్నతమైన ఆత్మశక్తిని భూ వాస్తవంపై దృష్టిని కేంద్రీకరిచేలా చేస్తుంది. మీరు ఎంత "గొప్ప మంచి" కోసమైనా కూడా మీ వ్యక్తిత్వాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు! మీరు మీ అహాన్ని తొలగించచడం కోసం మాత్రం ఇక్కడ లేరు; మీ అహం ద్వారా, మీ ఆత్మ యొక్క జ్యోతిని ప్రకాశింపజేయడానికే ఇక్కడ ఉన్నారు. మీ శక్తిని బాహ్యంగా వ్యక్తీకరించడానికి మీకు మీ అహం యొక్క అవసరం చాలా ఉంది.

మీరు మీ ఆత్మలలో మోస్తున్న బాధ వలన, మీ పాతదనం యొక్క విసుగు వలన మరియు కొత్తభూమి యొక్క స్వేచ్ఛా స్థలానికి చేరాలనే వాంఛ వలన, మీరు భూమి మీద స్థిరంగా ఉండలేకపోతున్నారు మరియు మీ అంతర్ కేంద్రంతో బంధాన్ని కోల్పోతున్నారు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మీరు వాటిని బలవంతంగా మార్చాలని ప్రయత్నిస్తారు. లేదా మీరు ఇతరులు కలిగిఉన్న సామర్థ్యం కన్నా ఎక్కువ వేగంతో వారిని బలవంతంగా మేల్కోల్పాలని ప్రయత్నిస్తారు. మీరు ఇచ్చే విషయంలో ఎక్కువ ఆత్రుతను కనపరుస్తారు. ఈ ఆత్రుత మంచి కారణంతో కూడిన గొప్ప సహాయంగా రూపం దాల్చవచ్చు లేదా ఇతరుల యొక్క బాగు కోసం అతి జాగ్రత్తను చూపే విధంగాను ఉండవచ్చు. కాని ఈ సహాయం వలన, మీరు మీ హృదయంలో అసహనాన్ని మరియు అలసటను అనుభూతి చెందుతారు. మీరు దీనిని కొంతకాలం ఆసక్తిగాను మరియు ప్రోత్సాహకరంగాను అనుభూతి చెందవచ్చు, కాని మీరు ఒకానొక స్థితి దగ్గర నిరుత్సాహానికి లోనవుతారు మరియు ఆతర్వాత మీరు నిరాశను మరియు కోపాన్ని అనుభూతి చెందుతారు. ఎందుకంటే మీరు మీ శక్తి వనరులను క్షీణింపజేస్తున్నారు కనుక.

హృదయం యొక్క ఆటంకం, అధికంగా ఇచ్చేతత్వం యొక్క ఆటంకం అన్నవి వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించకపోవడం నుంచే ఉద్భవిస్తాయి. ఈ ఆటంకం, మీలోని అసహనాన్ని మరియు అలసటను విడుదల చేయడానికి మీరు కష్టపడేలా చేస్తుంది. దీని వలన, మీరు సహాయం చేయాలనుకున్న మనుష్యుల నుంచి లేదా మీరు పెట్టుకున్న ఆశయాల నుంచి సరైన మనోభావపరమైన దూరాన్ని కలిగి ఉండడానికి చాలా కష్టపడతారు.

మీరు టీచర్స్ మరియు హీలర్స్. మీరు భూమి మీద ఒక లక్ష్యాన్ని కలిగి ఉన్నారు. నిజంగా మీరు ఈ లక్ష్యాన్ని సాధించాలంటే, మీరు పరిస్థితులను మార్చాలనే తీవ్రమైన కోరికను విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ విధంగా

చెయ్యాలనే మీ ఆత్రుతకి బాధ యొక్క అంచు కూడా కలుపబడి ఉంది. మీరు మీ ఇంటి యొక్క అనుభూతిని ఉన్నదిఉన్నట్టుగా భూమి మీద అనుభూతి చెందకపోవడం వలనే "ఈ బాధ" ఏర్పడినది. నిజమైన ఆధ్యాత్మిక మార్పు ఎల్లప్పుడూ అంగీకారం యొక్క పునాది నుంచే మొదలవుతుంది. మీరు హీలర్/టీచర్‌గా ఉండాలని నిజంగా కోరుకుంటే, మీరు మీ సొంత బాధను కౌగిలించుకుంటూ దానిని హీల్ చేయాల్సిన అవసరం ఉంది. మీరు మీ లోతైన మనోభావాలైన భయం మరియు కోపంలో ప్రశాంతతను కనుగొనాల్సి ఉంది. ఈ విధంగా చేసినప్పుడు, ఇతరులకు ఇవ్వాలనే మీ అత్యవసర వాంఛ లేదా మంచి కారణంలో పాల్గొనాలనే మీ వాంఛ అన్నవి, ప్రశాంతత మరియు అంగీకారంతో కూడిన నిశ్శబ్దమైన అనుభూతులకు స్థానాన్ని కల్పించడాన్ని మీరు కనుగొంటారు. అప్పుడే మీ ప్రకాశం హీలింగ్ గుణాన్ని పొందగలదు.

ఇతరుల యొక్క బాధను మరియు ప్రయత్నాలను విడుదల చేసినప్పుడు, ఇతరులు వారి సొంత ప్రక్రియలోకి పూర్తిగా వెళ్ళడానికి మీరు సమయం మరియు ప్రదేశాన్ని కలిపించినప్పుడు, మీరు అంతర్ బాధను పొందవచ్చు. ఎందుకంటే ఇది మిమ్మల్ని తిరిగి మీ ఒంటరితనం దగ్గరకు తీసుకువెళ్తుంది మరియు ఇది ఈ భూవాస్తవికతలో మీ ఉనికిని కోల్పోయిన అనుభూతిని పొందేలా చేస్తుంది కాబట్టి. ఈ క్రూరమైన మరియు అసంపూర్ణమైన ప్రపంచానికి మరియు మీరు కలలు కన్న స్వచ్ఛమైన మరియు అందమైన ప్రపంచానికి మధ్య వ్యత్యాసం ఉండడం వలన, అది మీ లోతైన అంతరంలో బాధను కలిగిస్తుంది. ఈ బాధ నుంచి పారిపోకుండా ఉండడం, దీనిని మీ పూర్తి ఎరుకలోకి ప్రవేశించనివ్వడం మరియు దీనిని మీ ప్రజ్ఞాత్మ చేతులతో హత్తుకోవడం అన్నది మీకు ఒక పెద్ద సవాల్.

సహాయం చెయ్యాలనే లేదా మంచి కారణం కోసం పోరాడాలనే మీ ఆత్రుతను గుర్తించినప్పుడు మరియు దీనిలో దాగిఉన్న బాధ యొక్క ఎరుకను పొందినప్పుడు, వాస్తవాన్ని ఉన్నదిఉన్నట్టుగా అంగీకరించలేని మీ భాగాన్ని వదిలివెయ్యడం మొదలుపెట్టగలరు. మీ ఆత్రుత మరియు అసహనం అన్నవి అంతర్‌బాధ మరియు విచారం నుంచి వస్తున్నాయనే విషయాన్ని మీరు గుర్తించిన వెంటనే, మీరు అధికంగా ఇవ్వడాన్ని ఆపి వేయగలరు. మీ మీద మీరు దృష్టి పెట్టగలరు మరియు మీతో మీరు ప్రశాంతంగా ఉండడానికి మార్గాలను కనుగొంటారు. మీకు మీరు నిజంగా ఇచ్చుకోడం మొదలుపెడతారు.

మిమ్మల్ని మీరు మరియు ఇతరులను అంగీకరించినప్పుడే, మీరు పూర్తి

స్థిరత్వం మరియు పరిపూర్ణత్వం గల లైట్‌వర్కర్‌గా రూపొందుతారు. ఒక లైట్‌వర్కర్‌గా మీరు చేయవలసిన అసలు పని ఏమిటంటే మీ శక్తిని ఇతరులకు అందుబాటులో ఉంచడమే. మీ శక్తిక్షేత్రంలో ఉన్న "పరిష్కారం యొక్క శక్తిని" ప్రసరింపజేయడం ద్వారా బోధనను మరియు హీలింగ్‌ను చేయాలి. మీరు ఏ సమస్యలను అయితే మీ అంతట మీరుగా పరిష్కరించుకున్నారో, మీరు తరచూ అవే సమస్యలు ఉన్న వారిని ఆకర్షిస్తారు. మీ అంతట మీరు ఈ సమస్యల యొక్క అంచులకు పయనించారు. ఈ భాగాలలో జ్ఞానాన్ని మరియు స్వచ్ఛతను పొందడం వలన ఇవి మీ వ్యక్తిత్వంలో భాగంగా రూపొందాయి. ఇవి పరిపూర్ణత్వం పొందిన మీ యొక్క భాగాలు. ఇవి పవిత్రమైనవి, విలువైనవి. మీరు వీటిని కోల్పోలేరు. ఇవి నేర్చుకున్న జ్ఞానం నుంచి ఏర్పడినవి కావు, కాబట్టి మీరు వీటిని మర్చిపోలేరు. మీరు ఇతరులకు అందించాల్సినది పరికరాన్ని కాదు లేదా సిద్ధాంతాన్ని కాదు. మీ జీవితం ద్వారాను మరియు మీ అంతర్ గాయాలను ఎదుర్కొన్న సాహసం మరియు అనుభవం ద్వారాను పరివర్తనం చెందిన "మిమ్మల్నే" ఇతరులకు అందించాలి.

ఒక లైట్‌వర్కర్‌గా, మీరు ఈ విషయంలో చెయ్యాల్సినవి మీ దగ్గరకు సులభంగా వస్తాయి. ఇది మీ దగ్గరకు చాలా సహజంగా వచ్చిన అనుభూతిని పొందుతారు. మీ లక్ష్యాన్ని కనుగొనడానికి మీ జీవితంలో "చేయవలసిన పని" ఏమిటంటే, మీరు నిజంగా కోరుకుంటున్న వాటి యొక్క ఎరుకను పొందాల్సిన అవసరం ఉంది మరియు మీకు ఉత్తేజంగా అనిపిస్తున్న పనులను మాత్రమే చేయాలి. మీరు ఈ విధంగా చేస్తే, మీ శక్తిని బాహ్య ప్రపంచంలో పెట్టగలరు. దీని ద్వారా, ఇతరులు స్పృశించబడతారు మరియు ప్రోత్సాహాన్ని పొందుతారు. కొన్నిసార్లు వీరు మీ ఎరుకలో లేని మార్గాల ద్వారా స్పృశించబడవచ్చు. నిజానికి మీరు ఇంతకంటే ఎక్కువ చేయవలసిన అవసరం లేదు. మీరు ఒక లైట్‌వర్కర్‌గా ఈ పని చేయడానికే వచ్చారు.

ఇవ్వడం మరియు తీసుకోవడం మధ్య సమన్వయం తెలిసిన లైట్‌వర్కర్స్ వారి జీవితాలలో మరింత ప్రశాంతతను మరియు ఆనందాన్ని కలిగి ఉంటారు. అప్పుడు మీరు, మీ శక్తిక్షేత్రాల నుంచి "పరిష్కారం యొక్క తరంగాన్ని" చాలా స్వేచ్ఛగాను మరియు ధారాళంగాను ప్రసరింపజేయగలరు. మీరు 'సున్నితత్వాన్ని' మరియు 'ఇతరుల మనోభావాలను చదవగలిగే శక్తిని' కలిగి ఉంటారు, కాని అదే సమయంలో మీ వ్యక్తిగత సరిహద్దుల పట్ల స్పష్టమైన అవగాహనను కూడా కలిగిఉంటారు. మీరు ఎంత సులభంగా అయితే ఇస్తారో, అంత సులభంగాను తీసుకోవడానికి

మిమ్మల్ని మీరు అనుమతించుకుంటారు. ఈ విధంగా మీ జీవితంలో ఇచ్చే ప్రవాహం మరియు తీసుకునే ప్రవాహం రెండూ బలోపేతంగా తయారవుతాయి.

**ఇచ్ఛకు సంబంధించిన ఆటంకం**

ఇప్పుడు నేను టీచర్/హీలర్‌గా తయారయ్యే మార్గంలో ఉన్న మరొక ఆటంకాన్ని గురించి వివరిస్తాను. నేను తల భాగంలోని ఆటంకం గురించి మరియు హృదయ భాగంలోని ఆటంకం గురించి చెప్పాను మరియు ఇప్పుడు చివరిగా నేను ఇచ్ఛకు సంబంధించిన ఆటంకం గురించి చెప్పి ముగించాలని అనుకుంటున్నాను.

ఇచ్ఛ, మూడవచక్రంలో అంటే పొట్ట దగ్గర ఉన్న శక్తి కేంద్రంలో ఉంటుంది. ఈ చక్రం లేదా కేంద్రం మీ అంతర్ శక్తిని భౌతిక ప్రపంచంలో బాహ్యంగా వ్యక్తీకరింపజేసే సామర్థ్యానికి సరైన దిశను నిర్దేశిస్తుంది. మీ యొక్క నిశ్శబ్దపు భాగమైన ఇంగితజ్ఞానంతో ఇచ్ఛ కలిసినప్పుడు, మీ జీవితంలోని పరిస్థితులు సులభంగాను మరియు స్వేచ్ఛగాను ప్రవహిస్తాయి. ఎందుకంటే ఈ నిశ్శబ్దపు భాగానికి ద్వంద్వాన్ని అధిగమించే సామర్థ్యం ఉంటుంది కనుక. మీరు విశ్వాసం మరియు జ్ఞానం యొక్క అంతర్భావం నుంచి నటిస్తారు. మీ మూడవచక్రం (అహం యొక్క కేంద్రం) హృదయం ద్వారా గైడ్ చేయబడినట్లయితే, మీరు సాధారణంగా మీకు ఇష్టమైన పనులను చేస్తూ ఎక్కువ సమయం ఆనందంగాను మరియు ఉత్తేజంగాను ఉంటారు. అప్పుడు ఇచ్ఛ లేదా అహం అంతరంలోని క్రీస్తు యొక్క విస్తరణగా రూపొందుతుంది.

మీరు తరచూ ఇతరులకు గైడ్ చెయ్యాలని లేదా సహాయం చెయ్యాలని ప్రయత్నించినప్పుడు, మీరు ఈ ప్రవాహంతో బంధాన్ని కోల్పోతారు. మీలోని ఒక భాగం అతి ఎక్కువగా సహాయం చెయ్యాలని కోరుకుంటుంది. మీ ఇంగితజ్ఞానం విషయాలను విడుదల చేయమని లేదా మిమ్మల్ని వెనక్కి తగ్గమని చెప్పినప్పటికీ కూడా, ఇది విషయాలను ఒత్తిడి లేదా బలవంతం చేస్తూ ఫలితాలను సాధించడానికి ప్రయత్నిస్తుంది. తరచూ మీ వ్యక్తిగత అహం ప్రత్యక్షంగా కనిపించే ఫలితాలు కావాలని కాంక్షిస్తుంది. నిజానికి ఈ అహం ఇతరులకు ఏ విధమైన సహాయాన్ని అందించలేదు! ఇది ఎల్లప్పుడూ మీరు బాహ్యపు హొదాలు కలిగిఉండడం అత్యవసరమని తెలియజేస్తుంది. దీని వలన మీరు అభద్రతా భావానికి లోనవుతూ, సహజమైన హీలింగ్ ప్రవాహంతో బంధాన్ని కోల్పోతారు. కాని, ఈ హీలింగ్ ప్రవాహం ఎల్లప్పుడూ మీరు కోరుకున్న దానికంటే నెమ్మదిగాను మరియు మీ ఊహకి అందని విధంగాను ఉంటుంది.

మీరు కష్టపడి పని చేస్తున్నట్లుగా అనుభూతి చెందినప్పుడు మరియు ఇతరులు మీ భావాలను ప్రశంసించట్లేదని లేదా స్వీకరించట్లేదని అనుభూతి చెందినప్పుడు, మీరు అతి ఎక్కువగా పని చేస్తున్నారని అర్థం. మీరు సహజమైన పరిస్థితుల యొక్క ప్రవాహం నుంచి విడిపోయినప్పుడు, తరచూ మీరు బాహ్యపు నిర్ణయాల ద్వారా నిరాశను పొందుతారు. మీరు ఇతరుల యొక్క ఉద్దేశ్యాలు మరియు అంచనాల మీద ఆధారపడతారు మరియు వారి కళ్ళల్లో మీ ఓటమిని చూడడానికి భయపడతారు. మీరు తిరిగి మీ బలాన్ని పొందాలంటే, మీరు ఏమి చెయ్యకుండా ఉంటూ మరియు అంతరంలో నిశ్శబ్దాన్ని రుచి చూడడం అన్నది చాలా ముఖ్యం. మీ హృదయంతో తిరిగి బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడు మాత్రమే మీరు ప్రశాంతమైన మరియు తటస్థమైన ప్రదేశం నుంచి పరిస్థితులకు శృతి కాగలరు. అప్పుడు మీ భయం మరియు అభద్రతాభావం వెనుకకు తగ్గుతూ మాయమైపోతాయి మరియు మీ సహాయం కోరుతున్నవారు నిజానికి మీ నుంచి కావాలనుకుంటున్న దానిని మీరు స్పష్టంగా గుర్తించగలరు.

తరచూ ఆమె లేదా అతని కోసం ఎక్కువగా పని చేయవలసిన అవసరం లేదు. మిమ్మల్ని మొట్టమొదటిగా అడుగుతున్నది ఏమిటంటే, వారితో ఉండమని మరియు వారికి సులభమైన మరియు ప్రత్యక్షమైన మార్గం ద్వారా “పరిష్కారం యొక్క శక్తిని” అందించమని. మీరు ఏం చేయనప్పటికీ లేదా ఏం చెప్పకపోయినప్పటికీ కూడా, మీరు మీ ఉనికి యొక్క సామర్థ్యాన్ని విశ్వసించవలసిన అవసరం ఉంది. మీరు వేరేవారితో ఉన్నప్పుడు కూడా, మీరు మీ అంతరంలోని నిశ్శబ్దపు ప్రదేశంలో ఉండడానికి సాహసించండి. మిమ్మల్ని మీరు విశ్వసించినట్లయితే, ఇతరులకు చెప్పడానికి లేదా చేయడానికి ఏది సరైన విషయమో మీకు ఆ సమయంలో తెలుస్తుంది. మీరు గైడెన్స్ ఇచ్చే విషయంలో తరచూ గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే, మీరు ఎంత తక్కువ సహాయం చేస్తే అంత ఎక్కువ సహాయం చేసినట్టు.

## విడుదల చేయడమే ప్రేమంటే

నేను పైన చెప్పిన ఆటంకాలను అధిగమించడానికి చేసే ప్రయత్నంలో ఎల్లప్పుడూ ఒక రకమైన విడుదల చేయడం అన్నది పాల్గొంటుంది. ఇదంతా అతిగా ఆలోచించడాన్ని, మనోభావపరంగా అతిగా గుర్తింపబడడాన్ని మరియు ఇచ్ఛ యొక్క అదనపు ఉపయోగాన్ని విడుదల చేయడం గురించే. మీరు వీటన్నింటిని విడుదల చేసి మరియు మరింత కరుణ-నిజాయితీ గల మీ భాగానికి ఆధీనమైనప్పుడు, మీరు టీచర్ లేదా హీలర్‌గా చేసే “పని”లో లోతైన ఆనందాన్ని మరియు సంతృప్తిని

కనుగొంటారు. లైట్‌వర్కర్స్‌గా మీరు వ్యక్తిగత అవగాహనను మరియు స్వేచ్ఛ యొక్క లోతైన భావనను అనుభవిస్తారు. మీరు టీచర్/హీలర్‌గా ఉండడాన్ని ఏ మార్గంలో వ్యక్తపరిచినప్పటికీ, మీరు సంపూర్ణత్వంతోను మరియు అన్నింటి క్రింద ఇమిడి ఉన్న ఏకత్వంతోను కలుపబడిన అనుభూతిని పొందుతారు. మీరు "మూల చైతన్యం" యొక్క భాగంగా అనుభూతి చెందండి మరియు మీ యొక్క సహజమైన భాగం దీనిలో ఆడుతున్నట్లు అనుభూతి చెందండి. ఇదే నిజానికి మీరు మీ లక్ష్యాన్ని సాధిస్తున్నారు అన్న అనుభూతిని మీకు కలిగేలా చేస్తుంది.

**అభ్యాసం**

ఈ ఛాప్టర్‌లో చెప్పిన విషయాలతో మీరు మరింత ప్రత్యక్షమైన మరియు మనోభావపరమైన మార్గంలో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి ఈ అభ్యాసం మీకు సహాయం చేయవచ్చు.

మీకు సౌకర్యవంతమైన స్థితిలో కూర్చోండి లేదా పడుకోండి. మీ భుజాలు మరియు మెడ యొక్క కండరాల మీద మీ దృష్టిని కేంద్రీకరించండి. అక్కడ ఏదైనా ఒత్తిడి లేదా బిగింపులు ఉంటే వాటిని విడుదల చెయ్యండి. అదే విధంగా మీ పొట్ట, చేతులు మరియు కాళ్ళ యొక్క కండరాల బిగుంపును విడుదల చెయ్యండి. మీ చైతన్యంతో మీ కాళ్ళ దగ్గరకు ప్రయాణించి భూమితో మీ బంధాన్ని అనుభూతి చెందండి. భూమి మిమ్మల్ని ఎలా మోస్తోందో మరియు మీకు అవసరమైన భద్రతను ఎలా అందిస్తోందో అనుభూతి చెందండి. మీ పొట్టలోకి లోతుగా సులభమైన, సుదీర్ఘమైన శ్వాసలను తీసుకోండి.

ఇప్పుడు మీరు అసంతృప్తికరంగాను మరియు చులకనగాను అనుభూతి చెందిన క్షణంలోకి మిమ్మల్ని తీసుకువెళ్ళడానికి మీ ఊహాశక్తిని అనుమతించండి. ముందుగా ఏ విషయం వస్తే దానిని తీసుకోండి. దానితో పయనించండి. గతంలోని ఆ క్షణం గురించి, ఆ క్షణంలో మీ అంతరంలో అనుభూతి చెందిన దాని గురించి ఒకసారి మళ్ళీ ఆలోచించండి.

ఆ తర్వాత "పరిష్కారం యొక్క శక్తి" దగ్గరకి పయనించండి. మిమ్మల్ని మీరు అడగండి: నేను దీని నుంచి బయటకు ఎలా వచ్చాను? నాకు ఎక్కువగా సహాయం చేసింది ఏమిటి? మీకు ఎక్కువగా సహాయం చేసిన శక్తి, మీ నుంచి లేదా ఇతరుల నుంచి వచ్చినది కావచ్చు; దానిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కేవలం మిమ్మల్ని ఆ కష్టం నుంచి పైకి లేపిన ఆ శక్తిని మాత్రమే పరిగణించండి.

ఇప్పుడు గతాన్ని విడుదల చెయ్యండి మరియు ఇప్పుడు మీకు ఇష్టమైన వారి గురించి మరియు వారిపట్ల మీరు కలిగిఉన్న ఆందోళన గురించి ఆలోచించండి. అది మీ భాగస్వామి లేదా పిల్లలు, లేదా మీ సహోద్యోగి లేదా స్నేహితుడు కావచ్చు. మీ ఊహాశక్తిలో ఆ వ్యక్తి మీకు కనిపించడానికి అనుమతినివ్వండి మరియు వారి ఉనికిని నిజంగా అనుభూతి చెందండి. ఆ తర్వాత అడగండి: నేను నీకు ఎలా సహాయం చేయగలను? నేను నీకు చేయగల విలువైన పని ఏమిటి? మీ హృదయంతో వినండి. ఆ వ్యక్తి మీకు ఏం చూపిస్తున్నాడు లేదా ఏం చెబుతున్నాడు? సమాధానాన్ని అనుభూతి చెందండి. అది మీ దగ్గరకు రావడానికి అనుమతించండి.

పైన చెప్పిన దానిని విడుదల చేసి మరియు మీ దృష్టిని మీ పాదాల మీద, మీ బ్రీతింగ్ మీద పెట్టండి, మరియు మీ వర్తమానానికి తిరిగి రండి.

ఈ అభ్యాసం యొక్క లక్ష్యం: మీ మనోభావపరమైన బాధలలో లేదా క్లిష్టమైన పరిస్థితులలో నిజంగా సహాయం చేసేది ఏమిటి అనే దాని యొక్క స్పష్టమైన ఎరుకను పొందడమే. మీరు సహాయం చేస్తుందని భావించిన దానికి ఇది పూర్తి వ్యతిరేకంగా ఉండవచ్చు.

* * * *

## సమయం మరియు మల్టీడైమెన్షనాలిటి

ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న ఛాప్టర్‌లో, మేము మీ ఆసక్తిని ఒక ప్రత్యేకమైన దృక్పధం వైపు మరియు మిమ్మల్ని మీరు ప్రత్యేకమైన తీరులో చూసుకునే పద్ధతి వైపు మళ్ళించాలని కోరుకుంటున్నాము. ఈ దృక్పధం మిమ్మల్ని సమయం నుంచి, మీ గత చరిత్ర నుంచి బయటకు తీసుకువస్తుంది మరియు ఇది మీకు సమయంతో సంబంధం లేని మీ యొక్క ఉనికి గురించి తెలియజేస్తుంది. ఈ ఉనికినే మల్టీడైమన్షినాలిటి అని కూడా అంటాం.

మీలోని ఒక భాగం, సమయం మరియు తలాలపై ఆధారపడకుండా పూర్తి స్వతంత్రంగా ఉంటుంది. ఈ భాగం తను కోరుకున్న ఏ అనుభవం యొక్క తలానికైనా లేదా ప్రదేశానికైనా, తను స్వేచ్ఛగా ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రవేశిస్తుంది. ఇది ఏ సమయంలోనైనా చీకటి లేదా వెలుగును స్వేచ్ఛగా ఎంపిక చేసుకుంటుంది.

మీ భూవాస్తవ దృక్పధం ప్రకారం, మీరు A స్థితి నుంచి B స్థితికి సమాంతర దిశలో ప్రయాణించగలరు. ఇక్కడ సమాంతరం అంటే మీరు ఒక సమయంలో ఒక్క ప్రదేశంలోనే ఉండగలరని భావించడమే.

సమయంతో సంబంధం లేని మీ మల్టీడైమన్షినల్ దృక్పధం ప్రకారం, మీ నిజతత్వం అనేది సమయాన్ని ఆధారంగా చేసుకుని అభివృద్ధి చెందదు, కేవలం ఈ భాగం అభివృద్ధి యొక్క అనుభవాన్ని మాత్రమే పొందుతుంది. మీ నిజతత్వం అభివృద్ధి చెందాల్సిన అవసరం లేదు. ఇది ప్రతీ విషయాన్ని తన స్వేచ్ఛా ఎంపిక ద్వారా అనుభవించడానికి అనుమతిస్తుంది. ఈ ఎంపిక అనేది ద్వంద్వాల అనుభవానికి సంబంధించిన ఉన్నతమైన విలువను లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా ప్రేరేపింపబడుతుంది.

సమయంతో సంబంధం లేని మీ ఆధ్యాత్మిక తత్వం యొక్క దృక్పధం ప్రకారం, మీరు ఏ సమయంలోనైనా సమాంతర గీతలోని ఏ బిందువు యొక్క అనుభవాన్నైనా స్వేచ్ఛగా పొందగలరు. ఉదా: A నుంచి B నుంచి Z కి మరియు అతీతానికి అంటే ఏ బిందువు నుంచి ఏ బిందువుకైనా స్వేచ్ఛగా వెళ్ళవచ్చు. ఏ సమయంలోనైనా, మీరు మీ కోసం చైతన్యం యొక్క ఏ వాస్తవాన్నైనా ఎంపిక చేసుకుని దానితో పని చేయించుకోగలరు. కాబట్టి మీరు అంతర్ అభివృద్ధి యొక్క ఒకానొక దశలో ఇరుక్కుపోయారన్న భావన కూడా చివరికి ఒక భ్రమ లాంటిదే.

మేము, మీ ఆసక్తి ఈ దృక్పథం వైపు ఆకర్షింపబడాలని కోరుకోవడానికి గల కారణం ఏమిటంటే, ఇది మీ అంతర్ హద్దులను చేధించడానికి మీకు సహాయం చేస్తుంది కనుక. ఇది మీకు భ్రమల యొక్క ముసుగులను తొలగించడానికి మరియు మీరు మీ కాంతితత్వంతో ప్రత్యక్షంగా సంబంధాన్ని ఏర్పర్చుకోవడానికి సహాయం చేయవచ్చు: కాంతితత్వం అంటే నిజానికి మీరు ఎవరనే దానిని తెలిపే మీ ఏంజెల్ యొక్క శక్తియే.

దీనిని ఒక నిజమైన దృక్పథంగా అర్థం చేసుకొని, మిమ్మల్ని మీరు  దీని నుంచి చూసుకోవాలంటే, మేము మీకు సమయం పట్ల ఉన్న అభిప్రాయాల గురించి కొద్దిగా వివరించాల్సిన అవసరం ఉంది.

**సమయం :**

ఏకత్వం యొక్క ఉన్నతమైన స్థితిలో సమయం ఉండదు. ఇది ప్రజ్ఞాత్మ, దైవం, స్వచ్ఛమైన ఉనికి యొక్క స్థితి. ఈ స్థితిలో అభివృద్ధి చెందడంగాని, "తయారవ్వడం"గాని ఏమి ఉండదు, ఇక్కడ కేవలం "ఉండడమే" ఉంటుంది.

ఏకత్వం యొక్క క్రింది స్థాయిలో, వేర్పాటు లేదా ద్వంద్వాన్ని చాలా బలంగా అనుభూతి చెందుతారు.  ఇక్కడ శూన్యత కలిగిన సమాంతర సమయం యొక్క భావన పని చేస్తుంది. శూన్యత అంటే సమయం యొక్క శాస్త్రీయపరమైన సిద్ధాంత భావన, ఈ భావన పూర్తిగా అనుభూతులను మరియు సంతృప్తిని కలిగి ఉండదు. ఈ భావన ప్రకారం సమయం అన్నది మీకు బాహ్యంగా ఉన్న ఒక లక్ష్యానికి ఆధారంగా ఉంటుంది. సమయం అనేది ఒక బాహ్యపు నిర్మాణంగా మీ అనుభవాలపై ఆధారపడి ఉంటుంది.

ఉదాహరణకి, మీ "బయోడేటాను" తీసుకోండి. ఈ పత్రంలో, మీరు పూర్తి చేసిన చదువు యొక్క వివరాలు ఉంటాయి. ఈ సంవత్సరంలో నేను ఇది చేశాను, నేను ఆ సంవత్సరంలో పలానా స్కూలు నుంచి పట్టా పొందాను లాంటి మొదలైన విషయాలు ఉంటాయి. ఇక్కడ మీరు బాహ్యంగా కనపడే విషయాలకు అధిక ప్రాముఖ్యతను ఇస్తున్నారు. అంతర్ విషయాలైన – ప్రోత్సాహాన్ని, అర్థాన్ని మరియు అనుభూతిని వదిలివేస్తున్నారు.

ఏకత్వం మరియు ద్వంద్వం మధ్య ఉన్న శక్తి స్థాయిలలో, సమయం ఒక వాస్తవంగా ఉంటూ మీ అనుభవంతో పాటు కదులుతూ ఉంటుంది. సమయం

అనేది ఒక ప్రయోగాత్మకమైన భావన: ఇది అనుభవాలను రూపొందించే మార్గంగా ఉంటుంది. ఈ స్థాయిలలో సమయం అనేది మీ అనుభవాల మీద ఆధారపడి ఉంటుంది లేదా ఇది మీ అనుభవాలతో కలిసి ఉంటుంది.

ఉదాహరణకి మీరు ఆస్ట్రల్ తలాలకి నిద్రించిన సమయంలోను మరియు చనిపోయిన తర్వాత వెళ్తుంటారు, ఈ తలాలలో మీ గడియారపు సమయం ఉండదు. ఇక్కడ గడియారపు సమయం అనేది అనుభూతుల నుంచి, అంటే మీ నుంచి మరియు మీ అనుభవాల నుంచి సమయాన్ని విడదీసే గొప్ప ప్రయత్నంగా ఉంటుంది. ఇది ఒక గొప్ప భ్రమ. ఆస్ట్రల్ తలాలలో సమయం అనేది మీ అనుభవాలకు లయబద్ధంగా ఉంటుంది. ఉదాహరణకి మీరు విశ్రాంతిని తీసుకోవడం, ఇప్పుడు మీరు ఎవరినైనా కలవడం, ఆ తర్వాత మీ కోసం మీరు చదువు కోవడం మొదలైనవి. ఒక స్థాయి దగ్గర మొదటి దశ పూర్తవ్వడాన్ని మరియు వేరొక దశ ఆరంభమవ్వడాన్ని మీకు బాహ్యంగా ఉన్న గడియారపు సమయం ద్వారా లెక్కించరు. కాని ఇక్కడ దశలను మీ అనుభూతుల యొక్క అంతర్ ప్రవాహం ద్వారాను, మీకు సహజంగా కనిపిస్తున్న వాటి ద్వారాను నిర్వచిస్తారు.

సమయం యొక్క సహజమైన భావన లేదా లయబద్ధత అన్నది, భూమి మీద జీవితంలో కూడా భాగంగా ఉండగలదు. సమయం యొక్క అనుభూతిని అంటే, నిజానికి సమయాన్ని ఒక్కొక్క పరిస్థితిలో ఒకొక్క రకంగా అనుభవించగలం అనేది మీ అందరికి బాగా తెలుసు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు సమయం పరిగెడుతోందని చెబుతారు, మీరు సూపర్ మార్కెట్‌లో లేదా హాస్పిటల్స్‌లో వేచి ఉన్నప్పుడు మీకు సమయం గడవనట్టుగా అనిపించవచ్చు.

ఇప్పుడు మీ అంతరంలోని సందేహపు ఈ విధంగా చెప్పవచ్చు: పరిస్థితులు చెడుగా ఉన్నప్పుడు సమయం చాలా నెమ్మదిగా కదులుతుందని మరియు పరిస్థితులు మంచిగా ఉన్నప్పుడు సమయం చాలా తొందరగా కదులుతుందని చెప్పవచ్చు. మనం విషయాలను ఎలా అనుభవించినా కూడా, సమయం మాత్రం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటూ స్థిరమైన పద్ధతిలో ముందుకు పయనిస్తుంది.

ఇది లక్ష్యాల ఆధారంగా ఏర్పడిన సమయం యొక్క భావన, దీనినే సమాంతర సమయం యొక్క భావన అంటారు. సమాంతర సమయం అంటే మీరు ఒక సమయంలో ఒక్క ప్రదేశంలోనే ఉండగలరని భావించడమే. ఇది హేతుబద్ధమైన, శాస్త్రీయపరమైన పద్ధతుల నుంచి ఉద్భవించినది.

సమయాన్ని లెక్కించే గడియారాలు, పగలు-రాత్రి, సహజమైన ప్రభావాలు అంటే సూర్యుడు, చంద్రుడు మరియు ఆటుపోటులు మొదలైనవేవీ లేనటువంటి స్థితిని ఊహించండి. ఈ స్థితిలో మీరు మీ సొంత అనుభూతుల యొక్క సమయపు భావన మీద మాత్రమే ఆధారపడతారు.

మీ లక్ష్యాలను కొలిచే సమయం – గడియారం – నిజానికి బాహ్యంగా ఉన్న విషయంపై ఆధారపడి లేదు; ఇది మానవుడి మనసు నుంచి పుట్టిన వస్తువు. ఈ మనసు ప్రతీదానిని విభజించి ముక్కలుగా చేయాలని కోరుకుంటుంది. మానవుడి మనసు భూమి మీద ఉన్న కొన్ని సహజమైన విషయాలను వెలికితీసింది. కాని ఆ విషయాలలో సమయం అన్నదే లేదు, అంటే ఇది భూమి మీద ఉన్న సహజమైన విషయం కాదు. సమయం అనేది మానవుడి మనసు ద్వారా కనుగొన్న కృత్రిమమైన విషయం, కాని ఇది మానవుడిపై ఆధారపడి లేదు. సమయం అనేది ఒక భ్రమ, ఇది ద్వంద్వాల యొక్క నమ్మకాన్ని పట్టుకుని ఉన్న ఒక విధమైన చైతన్యానికి సంబంధించిన వస్తువు.

సమయం అనేది ముఖ్యంగా అనుభూతులకు సంబంధించినది. సమయం అనేది అనుభూతి చెందగలిగే విధంగా అనుభవాలను రూపొందించడానికి మార్గంగా ఉంటుంది, మీరు ఈ మార్గంలో దీనిని స్పష్టంగా గుర్తించగలరు. ఉదాహరణకి మీరు ఒక మనిషి గురించి చెప్పవచ్చు "అతనిది వృద్ధాత్మ అని". నిజానికి మీరు చెప్పినదానికి అర్థం అతని వయస్సు గురించా లేక అతని జన్మల గురించా? లేదా మీరు అతను వృద్ధుడు అని చెప్పినదానికి అర్థం సమయాన్ని పరిగణలోకి తీసుకుని చెబుతున్నదా లేదా అతను వ్యక్తపరుస్తున్న లక్షణాలైన జ్ఞానం, సమన్వయం మరియు ప్రశాంతతకు సంబంధించినదా? "వృద్ధాత్మ" అనే పదంలో సమయం యొక్క ప్రస్తావన అనేది నిజానికి అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని చెప్పినది.

సమయం యొక్క పూర్తి భావాన్ని పదాలలో చెప్పాలంటే, అంతర్‌స్థాయిలలో ఎదుగుదలను పొందడమే అని. ఇది మీకు చాలా ఉపయోగకరమైన అంశంగా అనిపించవచ్చు. ఎందుకంటే ఇది పరిస్థితుల ప్రవాహాన్ని లేదా సహజమైన లయబద్ధతను స్పష్టమైన రీతిలో భావాత్మకంగా వ్యక్తపరచడానికి మీకు సహాయం చేస్తుంది కాబట్టి. కాని మీరు దీనిని ఒక లక్ష్యంగా భావిస్తూ మీపై మోస్తున్నట్లయితే, ఇది మిమ్మల్ని పరిమితం చేస్తుంది మరియు నిరాశ పరుస్తుంది. మీరు ఒకే దిశలో పయనించే సమయానికి మాత్రమే పరిమితం కాదు, మీరు ఒకే తలానికి సంబంధించిన వ్యక్తిత్వం

కూడా కాదు. మీ వ్యక్తిత్వంలోని కొన్ని స్థాయిలు సమయం యొక్క ఆవలి వైపున ఉన్నాయి, ప్రస్తుతం మీరు వాటిని అనుభవిస్తున్నారు. ఇప్పుడు మీ యొక్క ఈ ప్రత్యేక లక్షణంపై అంటే మీ యొక్క మల్టీడైమన్షినాలిటిపై మీ దృష్టిని కేంద్రీకరించమని మేము మిమ్మల్ని కోరుతున్నాం.

**మల్టీడైమెన్షనాలిటి**

సమాంతర సమయం యొక్క భావన ప్రకారం, మీరు ఒకే సమయంలో ఒక్క ప్రదేశంలో మాత్రమే ఉండగలరని మరియు అంతకంటే ఎక్కువ ప్రదేశాలలో ఉండలేరని చెబుతుంది. ఈ సమాంతర భావన అనేది మీ ద్వారా మీ శరీరానికి, మీ మెదడుకి మరియు ఈ రెండింటితో ముడిపడి ఉన్న మీ చైతన్యానికి వర్తిస్తుంది. (సైన్స్ శరీరం మరియు చైతన్యం ఎలా ఖచ్చితంగా ముడిపడి ఉంటాయనే విషయాన్ని ఇప్పటికీ వివరించ లేకపోయింది, కాని భౌతికశరీరం లేకుండా చైతన్యం ఉండలేదనే విషయాన్ని సాధారణంగా సైన్స్ తెలియజేస్తుంది.)

సమయం యొక్క పూర్తి భావాధీనమైన అభిప్రాయం ప్రకారం, మీ చైతన్యం నివసించే చోటనే మీరు ఉంటారు. కాలం మరియు ప్రదేశంలో మీరు ఎక్కడ ఉన్నారు అనేది, మీ శరీరం ఉన్న ప్రదేశం ద్వారా కాకుండా, మీ చైతన్యం యొక్క దృష్టికేంద్రీకరణ ద్వారా నిర్దేశింపబడతుంది.

ఉదాహరణకి మీరు స్టేషన్‌లో రైలు రాక కోసం ఎదురుచూస్తున్నారు. అది రావడానికి కొంచెం సమయం పడుతుంది అని తెలిసినప్పుడు, మీరు ఒక ప్రదేశంలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు మరియు అప్పుడు మీరు గమనించకుండానే వేరొక చైతన్యపు స్థితికి చేరుతారు. ఇప్పుడు మీరు, నిన్న మీతో మాట్లాడిన వ్యక్తి గురించి ఆలోచిస్తారు. మీరు ఆ సంభాషణను సులభంగా తిరిగి జ్ఞప్తికి తెచ్చుకుంటారు మరియు అది మిమ్మల్ని ఎంతగా ప్రభావితం చేసిందో స్పష్టంగా గుర్తు చేసుకుంటారు. మీరు ఆ సంభాషణకు సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను తిరిగి జీవింపజేస్తూ, వాటిని గతం నుంచి మీ ప్రస్తుత క్షణంలోకి ఆకర్షిస్తారు. నిజానికి ఇక్కడ చేస్తున్నది ఏమిటంటే, మీరు గతానికి ప్రయాణిస్తూ ఆ క్షణం యొక్క శక్తులను మళ్ళీ దర్శిస్తున్నారు. మీ వర్తమానం యొక్క శక్తి గతం యొక్క శక్తితో కలిసినప్పుడు, ఇది ఆ క్షణానికి సంబంధించిన మీ అనుభవంలో సాధ్యమైనంతగా మార్పులను సృష్టిస్తుంది మరియు ఈ మాదిరిగా గతం మార్పు చెందుతుంది.

గతం మార్పు చెందడం అంటే, మా ఉద్దేశ్యం మీరు భౌతిక వాస్తవాలను మారుస్తారని కాదు, ఆ వాస్తవాలను మీరు ప్రత్యేకమైన దృక్పథంతో లేదా అర్థవివరణతో చూస్తారు అని. పాత సంఘటన యొక్క సారాంశం మార్పు చెందడం వలన, మీ కోసం ఆ సంఘటన మార్పుచెందినట్లుగా మీరు అనుభూతి చెందవచ్చు.

ఈ ఉదాహరణను ఒకసారి ఆలోచించండి.

మీరు గతంలో ఒక మనిషితో సంభాషించి ఉండవచ్చు, నిజానికి ఆ వ్యక్తి మీ మాటల ద్వారా బాధింపబడ్డాడు. కాని మీరు అతనిపై ఎటువంటి చెడు అభిప్రాయాన్ని కలిగిలేరు. మీరు ఈ విషయాన్ని అతనికి చెప్పడానికి ప్రయత్నించినప్పుడు, ఆ మనిషి మిమ్మల్ని తిట్టి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. ఇప్పుడు మీరు తిరిగి బాధింపబడినట్టుగాను మరియు పొరపాటుగా అర్థం చేసుకోబడినట్టుగాను అనుభూతి చెందుతూ, కోపానికి మరియు అదే సమయంలో దిగ్భ్రాంతికి లోనవుతారు. మీరు ఇంటికి వెళ్ళిన తర్వాత కొన్ని గంటలు దీని గురించి ఆలోచిస్తూ బాధపడతారు. కాని ఆ తర్వాత దీనిని వదిలివేసి ప్రశాంతంగా నిద్రపోతారు. మరుసటి రోజు ఉదయం రైల్వేస్టేషన్‌లో మీరు రైలు కోసం ఎదురుచూస్తున్నప్పుడు ఈ బాధకరమైన సంభాషణ మళ్ళీ అకస్మాత్తుగా మీకు గుర్తుకు వస్తుంది. మీరు ఎక్కడ తప్పు జరిగింది అని ఆలోచిస్తారు. ఇప్పుడు మీరు ఆ సంఘటనను ప్రత్యేకమైన కోణం నుంచి చూస్తారు మరియు ఆ వ్యక్తి నా మాటల ద్వారా ఎందుకు బాధపడ్డాడు అనే దానిని అకస్మాత్తుగా గుర్తిస్తారు. మీరు అతని గతానికి సంబంధించిన కొన్ని వాస్తవాలను, ఈ సంభాషణకు ముందు మర్చిపోయారనే విషయాన్ని గుర్తు చేసుకుంటారు. మీరు అతని మనోభావపరమైన ప్రతిస్పందనను పూర్తి ప్రత్యేకమైన కాంతిలో చూడగలుగుతారు, ముఖ్యంగా మీకు దీనితో ఎటువంటి సంబంధం లేదనే కోణంలో చూస్తారు. అతనిని బాధ పెట్టినది మీరు కాదు; మీరు కేవలం అతని అంతరంలోని పాతగాయాన్ని స్పృశించారు. ఈ విధమైన దృక్పథం మీ అంతరంలో ప్రత్యేకమైన మనోభావ స్పందనను కదిలిస్తుంది. మీరు  ప్రశాంతతను, లోతైన పరిశీలనాదృష్టిని మరియు క్షమాపణను అనుభూతి చెందుతారు. “ఓహ్… నేను ఇప్పుడు ఆ వ్యక్తిని అర్థం చేసుకున్నాను.”

ఆ క్షణంలో మీరు గతాన్ని తిరిగి సృష్టిస్తున్నారు. మీరు వాస్తవాలను కొత్త దృక్పథంలో చూస్తూ మీ పూర్వపు స్పందన మార్పు చెందేలా చేస్తారు. స్పష్టంగా చెప్పాలంటే, దీని అర్థం మీ పూర్వపు స్పందన జరగలేదని కాదు, కాని దాని చుట్టూ ఉన్న కోపం, బాధ మరియు పొరపాటుగా అర్థం చేసుకోబడిన శక్తులు ఇప్పుడు అవగాహన మరియు క్షమాపణల యొక్క శక్తులుగా పరివర్తనం చెందుతాయి. ఈ

ఆధ్యాత్మిక పరివర్తనం అనేది గతం మరియు వర్తమానం మధ్య ఉన్న పరస్పర స్పందన ద్వారా సంభవిస్తుంది.

ఇక్కడ భౌతిక వాస్తవాలు అన్నవి అంత ముఖ్యంకాదు. నిజానికి సంఘటన యొక్క సారాంశం మరియు ఆ సారాంశానికి మీ శక్తివంతమైన ప్రతిస్పందన అనేవే మీ జీవితానికి మరియు మీ వాస్తవానికి ఆకృతిని ఇస్తాయి. అందువలన మీరు హీలింగ్ అవసరమైన గతం యొక్క శక్తుల దగ్గరకి సమయం ద్వారా పయనించడం చేత, గతాన్ని మార్చగలరని మేము మీకు చెబుతున్నాం.

మీరు స్టేషన్‌లో కూర్చుని మీ యొక్క కాలంతో ప్రయాణిస్తున్నప్పుడు, మీ చైతన్యానికి సంబంధించిన చిన్న పొర మీ శరీరంతో ఉంటుంది. "మీ మెదడు యొక్క వెనుక భాగం ద్వారా", మీ చేతులు చల్లబడడాన్ని లేదా మీ వెనుక పిల్లలు బిగ్గరగా మాట్లాడుకోవడాన్ని మీరు అనుభూతి చెందవచ్చు.

చైతన్యం తనను తాను విభజించుకోగలదు. ఒకే సమయంలో వేర్వేరు ప్రదేశాలలో ఉండగలదు. అంటే చైతన్యం ఒకే సమయంలో వేర్వేరు శక్తివంతమైన వాస్తవాలలో నివసించగలదని అర్థం.

ఇదే మల్టీడైమెన్షనాలిటి అంటే. మీ చైతన్యం సమయానికి మరియు తలానికి మాత్రమే పరిమితం కాదు. మీరు భూమి మీద జీవితంలో, మీ చైతన్యంలోని కొంతభాగం మీ భౌతికశరీరంతో కలుపబడి ఉండాలనే ప్రాథమిక ఒప్పందాన్ని మీరు కలిగి ఉన్నప్పటికీ, మీ చైతన్యం మాత్రం సమయంలోని ఏదో ఒక స్థాయికే పరిమితమై ఉండదు. మీరు గతానికో లేదా భవిష్యత్తుకో పరిమితమై ఉండరు, ఎందుకంటే ఇవి స్థిరంగా ఉండవు కనుక. ఇవి అనుభవాలు ప్రవహించే ప్రదేశాలు. వీటిని మార్చగలం మరియు మీరు వర్తమానం నుంచి వీటికి అనుగుణంగా స్పందిచగలరు.

మీరు మీ శరీరంలోనే బంధీయై ఉన్నారని భావిస్తున్నప్పటికీ, మీ చైతన్యం మాత్రం చాలా తలాలతో బంధాన్ని కలిగి ఉంటుంది(మల్టీడైమెన్షనల్). "ఆమె గతంలో ఇరుక్కుపోయింది" అని మీరు ఎప్పుడైనా విన్నారా? ఆమె చైతన్యం పూర్తిగా గతం యొక్క అనుభవాలతోను మరియు మనోభావాలతోను అంటే విచారం, పశ్చాత్తాపం లేదా తప్పు చేశాననే భావనలతో నిండి ఉండడం వలన, ఆమె గతాన్ని తన నుండి విడుదల చేయలేక పోతోంది. ఆమె వర్తమానంలో ఉండదు. ఆమె పూర్తిగా గతంలోనే

ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణ ప్రకారం ఆమె వర్తమానం నుంచి గతంతో పరస్పర కలయికను కలిగి ఉంటుంది. కాని ఈ కలయిక విముక్తి మరియు పరివర్తనల యొక్క దిశలో ఉండదు. ఆమె శరీరం వర్తమానంలో ఉంటుంది, కాని ఆమె మాత్రం గతంలో ఇరుక్కుపోయి ఉంటుంది. రోజులు, వారాలు మరియు నెలలు గడుస్తున్నప్పటికీ కూడా, ఆమెకు మాత్రం సమయం స్తంభించిపోయి ఉంటుంది. ఎందుకంటే ఆమె ప్రయోగాత్మకంగా కదలడం లేదు కాబట్టి.

జీవితం మరియు అనుభవం అనే సహజమైన ప్రక్రియలతో ఆమె ప్రవహించండం లేదు. ఇది మల్టీడైమెన్షనాలిటి యొక్క ఉదాహరణ. మిమ్మల్ని మీరు నిర్ణీతమైన దృష్టి గల చైతన్యానికి పరిమితం చేసుకున్నప్పటికీ, మీరు మల్టీడైమెన్షనల్‌గా ఉంటారు. నా ఉద్దేశ్యం ఏమిటంటే మల్టీడైమెన్షనాలిటి అనేది మీరు అభివృద్ధి చెందితే వచ్చే స్థితి కాదు, మీరు కేవలం ఉన్న స్థితిలో ఉన్నప్పుడే సంభవిస్తుంది. ఇది మీ స్వభావం; ఇది మీ ఉనికి యొక్క సహజస్థితి.

నిజమైన ప్రశ్న ఏమిటంటే: స్వేచ్ఛ మరియు పరివర్తనం యొక్క మార్గం ద్వారా మీరు మల్టీడైమెన్షనల్‌గా ఎలా ఉండగలరు? మీరు మీ దివ్యత్వపు ప్రజ్ఞాత్మతో బంధాన్ని కోల్పోకుండా, స్వేచ్ఛగా ఇతర తలాలలో విహరించడానికి మీ యొక్క మల్టీడైమెన్షనాలిటీని ఎలా ఉపయోగించుకోగలరు? జ్ఞానం మరియు ఎరుక యొక్క ప్రదేశం నుంచి మల్టీడైమెన్షనల్ వ్యక్తిగా ఉండడం: ఇదే మీ ఆధ్యాత్మిక గమ్యం. మీరు పూర్తి జాగరుకత గల మల్టీడైమెన్షనల్ సృష్టికర్తలుగా తయారవ్వడమన్నదే మీ గమ్యం.

జాగరుకత గల మల్టీడైమెన్షనల్ వ్యక్తిగా ఉండడం అంటే అర్థం సమాంతర సమయం యొక్క భ్రమను విడుదల చేయడమే అని, దీని అర్థం మీరు కేవలం శరీరమే అనే భావనను కూడా విడుదల చేయాలి అని.

జాగరుకత గల మల్టీడైమెన్షనల్ వ్యక్తిగా ఉండడం అంటే మీ అంతరంలోని ప్రజ్ఞాత్మతో మిమ్మల్ని మీరు గుర్తించడమే. ఇది తను ఎంపిక చేసుకున్న ఏ అనుభవం యొక్క తలానికైనా పూర్తి స్వేచ్ఛతో ప్రవేశించగలదు.

జాగరుకత గల మల్టీడైమెన్షనల్ వ్యక్తిగా ఉండడం అనేది కొత్త భూమి యొక్క వాస్తవంలో ముఖ్యమైన భాగం.

మీరు మల్టీడైమెన్షనాలిటీ యొక్క అంశంతో ఘర్షణ పడడానికి గల కారణం:

ఒకే సమయంలో రెండు వేర్వేరు ప్రదేశాలలో భౌతికపరంగా ఉండడమనేది ఎలా సాధ్యమనే మీ ఆలోచనయే. మీ భౌతికశరీరం ఒకే సమయంలో రెండు భౌతిక ప్రదేశాలలో ఉండలేదు. కాని తలాలు అనేవి భౌతిక ప్రదేశాలు కాదు. డైమెన్షన్స్ అనేవి చైతన్యం యొక్క తలాలు, చైతన్యం యొక్క వలయాలు. ఇవి కొన్ని శక్తివంతమైన సిద్ధాంతాలకు అనుగుణంగా నడుపబడతాయి.

మీ చైతన్యం ఒకే సమయంలో వేర్వేరు ప్రత్యేక తలాలలో ఉండగలదు. ఇది 'వర్తమానం'లో మాత్రమే సంభవిస్తుంది. గతం, భవిష్యత్తు, ఆస్ట్రల్ తలాలు, గతజన్మలు, ప్రజ్ఞాత్మ మరియు మొదలైనవన్నీ కూడా, మీ అంతరంలో ఇప్పుడు ఇక్కడ ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయి. మీరు ఇప్పుడు మల్టీడైమెన్షనల్ వ్యక్తి అనే విషయాన్ని జాగరుకతతో గుర్తించగలరా? ఈ డైమెన్షన్స్‌ని మీ అంతరంలోకి మరియు బయటకి ప్రవహించడానికి అనుమతించగలరా, అవి మీ దగ్గరకు తీసుకువచ్చే శక్తులను అంగీకరించగలరా మరియు అవి మీకు సంబంధించినవిగా గుర్తించగలరా?

మీలో భాగంగా ఉన్న ఇతర డైమెన్షన్స్‌తో మీరు అన్ని వేళలా బంధాన్ని కలిగి ఉంటారు, కాని మీరు జాగరుకత మరియు అంగీకారంతో ఈ విధంగా చేసినట్లయితే, మీరు నిజానికి ఈ డైమెన్షన్స్ యొక్క వాస్తవాలను పరివర్తనం చెందిస్తారు. ఈ డైమెన్షన్స్‌లో ఇరుక్కుపోయిన లేదా కూరుకుపోయిన శక్తులను హత్తుకుని మరియు వాటిని పట్టుకుని మీ చైతన్యం యొక్క కాంతిలో ఉంచడం ద్వారా, మీరు మీ యొక్క భాగాలన్నింటికి విముక్తిని ఇస్తూ మీ అంతరంలో కలుపుకుంటారు మరియు మీ వర్తమానం కూడా మార్పు చెందుతుంది.

చాలా తలాల యొక్క చైతన్యం మీ అంతరంలో కలుస్తుంటుంది మరియు నిజానికి మీరే ప్రధానమైన మాస్టర్, అందువలన వీటిలో దేని యొక్క అనుభవాన్ని పొందాలనేది మీరే ఎంపిక చేసుకోవాలి. మీరు స్వేచ్ఛగా, దూరంగా ఉన్న లేదా దగ్గరగా ఉన్న తలాల్లోకి వేగంగానైనా లేదా నెమ్మదిగానైనా ప్రయాణించగలరు. మీరు మీ అంతరంలోని ప్రజ్ఞాత్మతో గుర్తింపబడినంత వరకూ, మీరు స్వేచ్ఛాజీవి అనే ఎరుకను కలిగి ఉంటారు.

చైతన్యం యొక్క చాలా తలాలు, చాలా డైమెన్షన్స్ మీ అంతరంలో కలుసుకుంటాయి. నిజానికి మీరే డైమెన్షన్స్ అన్నింటి యొక్క సృష్టికర్త మరియు మాస్టర్ కూడా. మీరు అనేక కిరణాలతో ఉన్న ఒక నక్షత్రం, మీరు అనేక వాస్తవాలు లేదా వ్యక్తీకరణలతో ఉన్న ఒక ఆత్మ చైతన్యం. మీరు ఎంపిక చేసుకున్న ఏ వాస్తవాన్నైనా కూడా స్వేచ్ఛగా కదిలేలా చేయగలరు.

సమయం సమాంతరంగా ఉంటుందనే భావనను లేదా సంఘటనలు వరుసక్రమంలో జరుగుతాయనే భావనను మీరు విడుదల చేసినట్లయితే, గతం లేదా భవిష్యత్తు మిమ్మల్ని నిర్దేశించలేవనే విషయాన్ని నమ్మడానికి మిమ్మల్ని మీరు అనుమతిస్తారు. ఆ తర్వాత మీరు డైమెన్షన్స్ యొక్క ప్రకంపన క్షేత్రం యొక్క మధ్య భాగంలో ఉండడాన్ని మీ అంతట మీరుగా అనుభూతి చెందండి. ఈ డైమన్షన్స్ అన్నీ సమయానికి అతీతంగా ఉన్న మీ యొక్క దివ్యత్వపు మూలం నుంచే ఆవిర్భవిస్తున్నాయి.

ఈ వాస్తవాలు, ఈ సామర్థ్యాల అన్నింటి మధ్యలో మిమ్మల్ని మీరు ఊహించుకోండి. ఆ తర్వాత మీరు మీకోసం మరింత కాంతిని అందించే భాగాన్ని ఎంపిక చేసుకోండి.

మీరు మీ క్షేత్రంలో ప్రకాశవంతమైన, మరింత ప్రేమపూర్వకమైన కిరణాన్ని ఎంపిక చేసుకోండి, మరియు ఇప్పుడు ఒక్క క్షణం దాని లోపలకి వెళ్ళండి మరియు "ఆ కిరణంగా ఉండడం" అనేది ఎలా ఉంటుందో మీరు అనుభూతి చెందండి.

కాని మీరు పరిమితమైన ఆలోచనల్లో ఇరుక్కుపోయి ఉన్నప్పుడు, "నాకు ఇది సాధ్యం కాదు", "నేను దీనిని అనుమతించలేను", "ఇది చెడుకి దారి తీస్తుంది" అనే నమ్మకాలను మీరు పట్టుకుని ఉన్నప్పుడు, మీరు ద్వంద్వం యొక్క భ్రమలో మునిగిపోతారు. మీరు సమయం ఒకే దిశలో పయనిస్తుందనే, మీరు కేవలం శరీరమనే, మీరు దైవం నుంచి విడిపోయి ఉన్నారనే మొదలైన భ్రమలను పట్టుకుని ఉంటారు. ఈ విధంగా, కొన్ని తలాలకు సంబంధించిన అనుభవాలకు మాత్రమే ఆత్మ తాత్కాలికంగా "బంధీయై" ఉంటుంది. ఆత్మ తన నిజమైన మూలాలను, తన దివ్యత్వాన్ని మరియు తన స్వేచ్ఛను మరిచిపోతుంది.

ఈ విధంగా పట్టుకుని ఉండడం లేదా "బంధీయై" ఉండడాన్ని కర్మ అని కూడా పిలుస్తారు.

వీటి నుంచి స్వేచ్ఛను లేదా విముక్తిని పొందే స్థితికి చేరడానికి, మీరు తరచూ చాలా స్థాయిల ద్వారా లేదా దశల ద్వారా ముందుకు కొనసాగుతుంటారు. ఈ దశలనే మీరు "అంతర్ ఎదుగుదల" అని పిలుస్తుంటారు. జీవాత్మ లేదా మానవ సమాంతర భావన యొక్క దృష్టి ప్రకారం, "అహంకారం నుంచి హృదయం వైపు" అనే ఛాప్టర్‌లో చెప్పినట్టుగా మీరు అంతర్ అభివృద్ధి యొక్క నాలుగు దశల ద్వారా పయనిస్తూ "కర్మను విడుదల" చేస్తారు మరియు నెమ్మది నెమ్మదిగా మీ అంతట మీరు పరివర్తనం చెందుతారు. కాని ప్రజ్ఞాత్మ దృష్ట్యా, మీరు మీ సహజమైన దివ్యత్వపు ఎరుకలోకి తిరిగి చేరుతున్నట్టు అర్థం. ఈ దృక్పథం ప్రకారం, కర్మను విడుదల చేయడమంటే మరేదో కాదు, మీ సొంత దివ్యత్వాన్ని గుర్తించడమే.

# ఆధ్యాత్మిక మాతృత్వం

డియర్ ఫ్రెండ్స్,

నేను ఈ రోజు చాలా ఆనందంతోను మరియు తెరవబడిన హృదయంతోను మీ అందరిని ఆహ్వానిస్తున్నాను. నేను మేరీని. నేను జెషువాకి తల్లిగా ఉన్నాను. నేను ఈ రోజు క్రీస్తుశక్తి యొక్క స్త్రీతత్వానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను, ఇప్పుడు ఈ శక్తి అధికపరిమాణంలో భూమి మీద జన్మిస్తోంది. చాలా కాలంగా, మీ సమాజంలోనూ మరియు అదే విధంగా మీ హృదయాలలోనూ స్త్రీశక్తి అణచివేయబడింది.

స్త్రీశక్తి, సృష్టి యొక్క ప్రారంభకాలానికి సంబంధించిన శక్తి మరియు ఇది మూలచైతన్యం యొక్క ప్రాథమిక భాగం. ఈ శక్తి, జీవితాన్ని ముందుకు నడిపిస్తూ, మీలోని ప్రతి ఒక్కరి ద్వారా ఇది ప్రవహిస్తోంది. మీరు ఒక ఆత్మగానైనా లేదా మానవుడిగానైనా కూడా స్త్రీశక్తి లేకుండా జీవించలేరు. ఈ సమయంలో స్త్రీశక్తి ప్రవాహం తన అంతరంలో ఒక అద్భుతాన్ని కూడా మోస్తోంది మరియు ఇది ఈ డిసెంబర్ నెల యొక్క చీకటిని కాంతివంతం చేయాలని మరియు అదే విధంగా మీ అంతర్ కష్టాలను, భారమైన మనస్తత్వాలను తేలికపరచాలని కోరుకుంటోంది. (ఈ ఛానెలింగ్ టిల్‌బర్గ్ అనే ప్రాంతంలో డిసెంబర్ 15, 2007లో జరిగింది).

భూమి మీద మీ జీవితం మీకు ఏమి మంచి చేస్తోంది అని మీరు కొన్నిసార్లు ఆశ్చర్యానికి లోనవుతారు. ఈ జీవితం చాలా విలువైనదని మరియు ఒక ఆశయాన్ని అందిస్తోందని నేను మీకు చెబుతున్నాను. మీరు ఇక్కడ ఒక ముఖ్యమైన పనిని చేస్తున్నారు. మీ ఉనికి, మీ చుట్టూ ఉన్న జీవులన్నింటిపై ప్రభావాన్ని చూపిస్తోంది, మీరు ప్రపంచంలో మార్పును తీసుకువస్తున్నారు. అయినప్పటికీ, ఆ మార్పుపై మీ దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం లేదు. మీరు మార్పును తీసుకురావడానికి ఇతరులపై దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం లేదు. ఇక్కడ రహస్యమేమిటంటే, మీరు మీ మీద మరియు మీ ఉనికి యొక్క కలయిక మీద దృష్టిని కేంద్రీకరిస్తే సరిపోతుంది. మీరు ఎవరనే దాని యొక్క అన్ని కోణాలను అంగీకరిస్తూ మరియు మిమ్మల్ని మీరు ప్రేమపూర్వకమైన చైతన్యంతో నింపుకున్నట్లయితే, మీ దగ్గరకు కాంతి సులభంగా వచ్చే మార్గాన్ని మరియు అదే విధంగా ఇది మీ ద్వారా సహజంగా బయటకు ప్రవహిస్తూ ఇతరులను చేరే మార్గాన్ని మీరు సృష్టిస్తారు. భూమి మీద మీ లక్ష్యాన్ని సాధించడానికి, మీ మీద మీరు శ్రద్ధను వహించాల్సిన అవసరం చాలా ఉంది.

ఈ సందర్భంలో "మీకు మీరు ఆధ్యాత్మిక తల్లిగా ఎలా ఉండాలి" అనే దాని గురించి నేను ఈ రోజు మాట్లాడాలని అనుకుంటున్నాను. నేను ఈ రోజు క్రీస్తు సంప్రదాయంలోని తల్లి శక్తికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. నిజానికి దీని అర్థం ఏమిటి? స్త్రీశక్తి యొక్క అతిముఖ్యమైన పాత్ర మాతృత్వం: తల్లి అనేది జీవితాన్ని ఇస్తూ, వాత్సల్యాన్ని మరియు భద్రతను అందజేసే స్వభావం కలదిగా చూపబడుతోంది. కాని ఈ ఊహ సంపూర్ణమైనదేనా? కాని చరిత్ర యొక్క కథలలో నా గురించి చెప్పబడిన కథలన్నీ కూడా అస్పష్టమైనవి మరియు తప్పుగా చెప్పబడినవి. అందువలన నేను భూమి మీద జెషువాకి తల్లిగా ఉన్నప్పటి నా జీవితం గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను.

నేను ఆ చరిత్రలో మంచి స్వభావం గల దానిగా వివరించబడ్డాను, కాని నేను నా వెనుకటి జీవితంలో ఆ విధంగా లేను. నేను రక్తమాంసాలు కలిగిన సాధారణమైన స్త్రీగా జీవించాను. నాకు తీవ్రమైన మనోభావ సంబంధిత ఉద్రిక్తత గురించి మరియు మీరు మీ జీవితంలో అనుభవిస్తున్న వాటి గురించి నాకు బాగా తెలుసు. నేను ఒక కుటుంబంలో ఏడవ శిశువుగాను, ఆఖరి దానిగాను జన్మించాను. నా పైన చాలా మంది అక్కలు-అన్నయ్యలు ఉన్నారు. నేను చాలా పట్టుదల గల శిశువుగా ఉండే దానిని. నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడే, ఎవరి మీద ఆధారపడకూడదని మరియు నా భద్రతను నేనే తీసుకోవాలని నేర్చుకున్నాను. నా తల్లిదండ్రులు నా కోసం ఉన్నప్పటికీ కూడా, నేను వారిపై ఆధారపడే దానిని కాదు. ఇదే నా అసలైన స్వభావం, ఎందుకంటే నేను నా సొంత ప్రపంచంలో ఉండడాన్ని మరియు నా సొంత మార్గంలో పయనించడాన్ని ఇష్టపడేదాన్ని కాబట్టి.

నేను లావుగాను మరియు చాలా ధైర్యంగాను ఉండే దానిని. నేను పరిస్థితుల పట్ల కూడా బలమైన అంతర్ భావాన్ని కలిగి ఉండేదాన్ని. నేను ఎల్లప్పుడూ అంతర్ మార్గదర్శకత్వాన్నే అనుసరించే దాన్ని. నా గురించి ఇతరులు ఏమనుకుంటున్నారు అనే దాని గురించి నేను అంతగా పట్టించుకునే దానిని కాదు. నా అన్నయ్యలు నన్ను ఎప్పుడూ ఏడిపిస్తుండడం వలన, "నా సహజస్థితిలో నేను నేనుగా" ఉండడానికి సంతృప్తిని మరియు సొంత వ్యక్తిగత-గౌరవాన్ని ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించాను. అందువలన నేను కొంచెం ప్రత్యేకంగా ఉండేదాన్ని. నేను శక్తులను అనుభూతి చెందగలను మరియు నేను మనుష్యులను "చదవగలను". ఇతరులు పైకి ప్రశాంతంగా ఉంటూ సరదాగా మాట్లాడినప్పటికీ కూడా, వీరు చాలా విషయాలలో క్రూరమైన లేదా భారమైన మనోభావాలను అంతరంలో దాస్తున్నట్లు నేను గ్రహించాను.

ఒక శిశువుగా ఇది నన్ను కలవరపర్చేది. నాకు ఏదో తప్పుగా ఉందని అనిపించేది మరియు ఇది ఎందుకు అని నేను విచారపడే దానిని. కాని ఎవ్వరూ దీనిని నాకు వివరించే వారు కాదు. అందువలన నేను చాలాసార్లు ఒంటరితనాన్ని అనుభూతి చెందాను, నేను తరచూ తప్పుగా అర్థం చేసుకుంటున్నట్లు అనుభూతి చెందాను. నేను ప్రకృతిలో ఉండడాన్ని మరియు ఇంటి చుట్టూ జంతువులు ఉండడాన్ని ఎక్కువగా ఇష్టపడే దానిని.

నా బాల్యంలో జరిగిన ఒక చెడు సంఘటన నా తల్లి యొక్క మరణం. ఇది నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు జరిగింది. నా తల్లి అప్పటికే చాలా వృద్ధురాలు, నేను ఆమెకు ఆఖరి సంతానాన్ని. ఆమె మరణం కారణంగా నేను మొదటిసారిగా కోల్పోవడం అనే విషయంతో ఘర్షణ పడ్డాను. ఇది చాలా బాధాకరమైన అనుభవం మరియు దీని వలన నేను గాయపడినట్టుగాను, వదిలి వేయబడినట్టుగాను అనుభూతి చెందాను. నేను ఆమె శవం ప్రక్కన కూర్చున్నప్పుడు నాలో ఏదో భాగాన్ని కోల్పోయినట్టుగా అనుభూతి చెందాను. నాలోని ఒక భాగం పూర్తిగా ప్రకాశాన్ని కోల్పోయినట్టు నాకు అనిపించింది. ఈ భాగాన్ని పట్టుకుని ఉండడం నాకు కష్టంగా ఉన్నందు వలన, దీనిని విడుదల చేయాలని అనుకున్నాను. నిజానికి ఇది నేను నా జీవితంలో నేర్చుకున్న అతిపెద్ద పాఠం: విడుదల చేయడం గురించి.

ఇప్పుడు నేను నా కొడుకు జెషువా జన్మించిన సమయం గురించి మీతో మాట్లాడాలని అనుకుంటున్నాను. ప్రతీ తల్లిలా నేను కూడా నా శిశువును అభిమానిస్తూ, తనని కష్టాల నుంచి సంరక్షించాలనే కోరుకున్నాను. మొదట్లో నేను జెషువాలో ఏదో ప్రత్యేకత ఉందనే విషయాన్ని ఎక్కువగా గుర్తించలేకపోయాను. కంటికి కనిపించని చెయ్యి మన జీవితాలకు మార్గదర్శకత్వాన్ని చూపిస్తోందనే విషయాన్ని, నేను నా జీవితం ద్వారా తెలుసుకున్నాను. మన జీవితాల ద్వారా ఏదో అతిగొప్ప శక్తి పని చేస్తోందని మరియు దీనిని మన ఇచ్ఛకి, మానవ అవసరాలకు మరియు కోరికలకు అనుగుణంగా మార్చలేమని గుర్తించాను. ఈ అతిగొప్ప శక్తి సున్నితమైనదని మరియు తెలివైనదని కూడా నేను తెలుసుకున్నాను. మన మానవ-మనసుతో దీని యొక్క మేధాశక్తిని గ్రహించలేము. మనకు కావలసిన వాటిని జీవితం మనకు అందిస్తోందనే విషయాన్ని మనం కొంతకాలం తర్వాత మాత్రమే అర్థం చేసుకోగలం. నిజానికి ఈ విధంగా జరుగుతున్నప్పుడు, ఇది చాలా క్రూరంగాను మరియు అన్యాయంగాను కనిపించవచ్చు.

నాకు తెలిసిన విధంగా జెషువాని పెంచాను. అతను ఎదుగుతున్నప్పుడు, అతనిలో ఏదో ప్రత్యేకత ఉందని నాకు స్పష్టమైంది. అతను అద్భుతమైన బహుమతులను మరియు సామర్ధ్యాలను కలిగి ఉండేవాడు. నేను శిశువుగా ఉన్నప్పుడు ఎలా అయితే పట్టుదలను కలిగి ఉండేదానినో, అలాగే అతను కూడా పట్టుదలను కలిగి ఉండేవాడు. నేను ఒకవైపున అతనిలోని ప్రత్యేకమైన శక్తిని బాగా అర్ధం చేసుకునే దానిని. కాని, మరొక వైపున ఇది నాకు చాలా కష్టంగా ఉండేది. ఒక తల్లిలా మీరు కూడా మీ శిశువుని ప్రపంచంలో ఉన్న చెడు శక్తుల నుంచి కాపాడాలని కోరుకుంటారు. కాని నా కొడుకు రక్షణను పొందడానికి ఇష్టపడేవాడు కాదు, అతను తన కాంతి గురించి వ్యక్తపర్చాలని మరియు దానిని ప్రపంచంలో బహిరంగంగా ప్రకాశింపజేయాలని కోరుకున్నాడు. అతను తన అంతర్ లక్ష్యం మరియు తన ఉన్నతమైన శక్తి ద్వారా నడుపబడుతుండేవాడు. ఈ శక్తి, ప్రపంచంలో మార్పును తీసుకురావడానికి, అతనిని తన సొంత మార్గాన్ని అనుసరించమని మార్గదర్శకత్వాన్ని చూపిస్తుండేది. దీనిని అంగీకరించడానికి నాకు చాలా సంవత్సరాలు పట్టింది మరియు నేను దీని గురించి చాలా కష్టపడ్డాను. ఎందుకంటే అతని యొక్క వ్యక్తీకరణలు సామాజిక వ్యవస్థపై అపనమ్మకాన్ని రేకేత్తించేట్టుగా ఉండేవి మరియు అతను తరచూ సవాళ్ళ ద్వారా పయనించేవాడు. అతను కొన్ని నియమాలను మరియు హద్దులను ఉల్లంఘిస్తుండేవాడు. అతను బెదిరింపులకు గురయ్యినప్పటికీ కూడా సవాళ్ళను ఎదుర్కొనేవాడు. నేను నా భయాన్ని మరియు అతనిని అదుపు చేయడం తప్పనిసరి అనే భావనను క్రమక్రమంగా విడుదల చేయాల్సి వచ్చింది. అతను ఇక్కడకు తీసుకురావాలని అనుకున్న ప్రత్యేకమైన కాంతికి నేను అవకాశాన్ని కల్పించాను.

మీ భూతలం యొక్క భాష ప్రకారం చెప్పాలంటే, నేను నా మాతృత్వాన్ని విడుదల చేశాను. నాలోని ఈ భాగం ఆందోళన, అధికభారం మరియు అదుపులపై ఆధారపడేది, అందువలన నేను దీనిని విడుదల చేయాల్సి వచ్చింది. ఆఖరికి, నేను అతను నా శిశువు కాదని అర్ధం చేసుకున్నాను. అతను నా ద్వారా, నా శరీరం ద్వారా జన్మించాడు. కాని అతను నా సొంతం కాదు. అతను తన సొంత హక్కులో జీవించగల ఒక పరిపూర్ణ ఆత్మ. అతను తన సొంత మార్గంలో తన జీవితాన్ని రూపొందించాలని మరియు సృష్టించాలని కోరుకున్నాడు. ఈ విధంగా అతను తన ప్రత్యేక మార్గంలో పయనించడానికి, స్వర్గ శక్తులు అతనికి సహాయం చేసేవి. కాని ఇది మన అందరి విషయంలో కూడా నిజమవుతుందా? భూమి మీదకి వచ్చిన ప్రతీ శిశువుకి తన ఆత్మ ద్వారా ఎంచుకోబడిన ఒక ప్రత్యేకమైన మార్గం ఉంటుంది. ఒక తల్లిలా మీరు ఈ విధమైన అవగాహనను పొందాలి మరియు దీనిని గౌరవించాలి. మీరు ఒక శిశు

వుకు జన్మనిచ్చిన తర్వాత మీరు నేర్చుకోవాల్సిన విషయం: వారిని వారిలా ఉండనివ్వడం మరియు వారి జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోగలిగే అంతర్ బలాన్ని మరియు సామర్థ్యాన్ని వారు కలిగి ఉన్నారనే విషయాన్ని నమ్మడం.

చివరికి, శిలువ మీద చనిపోవడమన్నది కూడా జీసస్ యొక్క ఎంపికయే. ఇది జరగడానికి అతను అనుమతించాడు. నిజానికి ఇది అతని యొక్క నిర్ణయమని, ఇది అతని ఆత్మ యొక్క మార్గానికి సంబంధించినదని, మరియు ఇది సరియైనదే అనే స్పష్టమైన అవగాహనకు నేను రావాల్సి వచ్చింది. అతను మరణించడాన్ని చూసినప్పుడు, నేను చాలా రోధించాను. అప్పుడు నా హృదయం చీకటి మరియు నిరాశలతో నిండి పోయింది. నేను నా బాధను సులభంగా అధిగమించానని మరియు జరిగిన దానిని ప్రశాంతంగా చూసానని, దయచేసి మీరు అనుకోవద్దు. నేను యోగినిని కాదు. నేను ఈ సంఘటనకు అధికంగా ప్రభావితం చెందాను మరియు నిజానికి ఇది నా 'ఆత్మ యొక్క చీకటి రాత్రి'. అదే సమయంలో ఈ అనుభవం నాకు ఒక గొప్ప వాస్తవాన్ని తెలియజేసింది. ఇది నాకు అతిపెద్ద స్థాయిలో విముక్తిని అందించింది. కాని నేను దీనిని కొంతకాలం తర్వాత అనుభూతి చెందాను. నా జీవితంలో జెషువా యొక్క ఉనికి నన్ను అభివృద్ధి చేసింది మరియు ఆఖరికి నేను అభివృద్ధి చెందడానికి నన్ను నేనే అనుమతించుకున్నాను; ఇదే నేను ఆ జీవితంలో చేసిన అతిగొప్ప ధైర్యవంతమైన చర్య. జెషువా ద్వారా ప్రవహిస్తున్న క్రీస్తుశక్తి, క్రూరమైన హంతకుల చేతుల్లో అతని మరణాన్ని చూసేలా నన్ను సవాల్ చేసింది. అదే సమయంలో, మన అందరికి మార్గదర్శకత్వాన్ని చూపిస్తున్న ఉన్నతమైన శక్తి, అతిగొప్ప మేధాసంపత్తిని విశ్వసించమని కూడా నన్ను సవాల్ చేసింది.

నా ఉనికిని మరియు నా బాధను ఈ ఉన్నతమైన మేధాసంపత్తి యొక్క మూలానికి ఆధీనం చెయ్యడం వలన ఇది నన్ను లోతైన స్థాయిలలో మేల్కొనేలా చేసింది. ఇది నా ప్రజ్ఞాత్మను మేల్కొల్పింది మరియు నేను భూమి మీద జీవితంలోనే ముందుకు పయనించేలా చేసింది. మీ అందరూ ఎక్కువగా కోరుకుంటున్న అంతర్ ప్రశాంతత మరియు స్వేచ్ఛ అనేవి జీవితాన్ని అదుపు చేయడం ద్వారా పొందలేమనే విషయాన్ని క్రమక్రమంగా నేను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. మీ సంస్కృతుల ప్రకారం, మాతృత్వం అనేది అధికారం మరియు అదుపులతో కలుపబడి ఉంది. నిజమైన తల్లి తన పిల్లల కోసం అగ్ని ద్వారా మరియు నీటి ద్వారా పయనిస్తుందని మరియు వీరి కోసం నిరంతరం పోరాడుతుందని చెబుతుంటారు. అపరిమితమైన ప్రేమ కొన్నిసార్లు తొందరపాటు తనం మరియు శత్రుత్వం యొక్క రూపాన్ని

ధరించినప్పటికీ, నా ఉద్దేశ్యం ప్రకారం నిజమైన మాతృత్వం అంటే, జెషువా గురించి నా భయాలను మరియు అంచనాలను విడుదల చేయడమే. నేను సాధించిన అతిగొప్ప విషయం ఏమిటంటే, జెషువాని స్వేచ్ఛగా వదలడం మరియు అతనిని అతనిలా ఉండడానికి అనుమతించడం. అప్పుడే నేను అతను  ఎవరనేది మరియు అతను ప్రతినిధిగా వ్యవహరిస్తున్న సామర్ధ్యం యొక్క సౌందర్యాన్ని మరియు స్వచ్ఛతను అత్యంత శక్తివతంగా అనుభూతి చెందగలిగాను. అప్పుడే నేను అతనికి సమానంగాను, ఒక ఆత్మ బంధువుగాను మరియు ఒక ఆధ్యాత్మిక పరమైన తల్లిగాను ఉండగలిగాను. ఆధ్యాత్మిక తల్లిగా ఉండడాన్ని నేర్చుకోవడం మరియు భూ సంబంధిత తల్లి యొక్క మనోభావాలను విడుదల చేయడం అనేదే నా ప్రధానమైన లక్ష్యంగా ఉండేది.

నేను ఆ జన్మలో చనిపోయి ఈ తలానికి వచ్చినప్పుడు, నేను ఒక వైపు అలసటను మరియు బలహీనతను అనుభూతి చెందాను. నేను వివిధ రకాల మనోభావ సంబంధిత ఎత్తు-పల్లాల ద్వారా పయనించి చాలా అనుభవాన్ని పొందాను. కాని మరొక వైపు, నేను లోతుగా మెరుగుపర్చబడిన అనుభూతిని పొందాను. ఒక ఉన్నతమైన కాంతి నన్ను స్పృశించింది, దీని ద్వారా నా ప్రజ్ఞాత్మ నా దగ్గరకు వస్తూ మరియు తనను తాను భూమి మీద వ్యక్తీకరించుకోగలిగింది. ఆఖరికి, నేను పరిస్థితులు యధాతధంగా ఉండడాన్ని అంగీకరిస్తూ  మరియు నా భూ సంబంధిత మాతృత్వాన్ని విడుదల చేశాను (బాధపడే తత్వం మరియు అదుపుచేసే తత్వం గల మాతృత్వాన్ని) మరియు ఆ తర్వాత నేను ఆధ్యాత్మిక పరమైన తల్లిగా రూపొందాను.

మీకు మీరే ఆధ్యాత్మిక తల్లిగా తయారవ్వడం కోసమే, మీరు ఇక్కడకు ఆహ్వానింపబడ్డారు. మీలో ఉన్న కొన్ని చెడు భాగాలతో మీరు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ భాగాలలో మనోభావసంబధిత అడ్డులు లేదా మీకు సంబంధించిన చెడు నమ్మకాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక తల్లి యొక్క దృష్టితో వీటిని చూడడానికి ప్రయత్నించండి: వీటన్నింటిని పరిష్కరించాలనే తల్లిలా కాకుండా, మిమ్మల్ని చూస్తూ, మీ ప్రత్యేక శక్తిని గుర్తించే తల్లిగా మిమ్మల్ని  మీరు చూసుకోండి. ఆధ్యాత్మిక తల్లి మిమ్మల్ని ఎంత మాత్రం మార్చాలని ప్రయత్నించదు మరియు ఆమె మీ ప్రస్తుత స్థితిని ఉన్నది ఉన్నట్టుగా గౌరవిస్తుంది. ఒక్కక్షణం ఈ విధమైన మాతృత్వపు శక్తిని అనుభూతి చెందండి. నా నుంచి ఏదో శక్తి ప్రసరిస్తున్నట్లుగా మీరు అనుభూతి చెందగలరు. కాని ఇది నాది కాదు. ఇది నాకు మాత్రమే సొంతం కాదు. ఇది చాలా వరకూ ఒక ప్రకంపనం లేదా చైతన్యపు స్థితి లాంటిది, నా అంతట నేనుగా విముక్తిని పొందడానికి ఈ చైతన్యపు స్థితికి ఎదగాల్సి వచ్చింది. ఇది విశ్వమంతటా వ్యాపించి

ఉన్నది మరియు ఇది మీ అందరికి అందుబాటులో ఉంది. ఇది మీ వారసత్వమే, ఎందుకంటే మీరందరూ మీ అంతరంలోని క్రీస్తు శిశువుకి ఆధ్యాత్మిక తల్లిగా రూపొందడానికే ఇక్కడకు వచ్చారు కాబట్టి.

సమస్యలను పరిష్కరించాలనే మీ ప్రయత్నాన్ని ఆపివేస్తూ, వాటిని సహజంగా చూడడం ద్వారానూ మరియు వాటిని యధాతథంగా ఉండడానికి అనుమతించడం ద్వారానూ, మీరు ఆధ్యాత్మిక మాతృత్వపు శక్తిని అందుకోగలరు. మీరు సమస్యలను కలిగి ఉన్నప్పటికీ కూడా, మీ కోసం మీరు ప్రేమ మరియు ప్రశంసల యొక్క అనుభూతిని పొందగలరా? ఇదే మీకు ఆరంభం.

తల్లి కొత్తగా జన్మించిన తన శిశువును ఎలా చూస్తుందో ఒక్కసారి గుర్తు చేసుకోండి. ఒకవైపు ఆ శిశువుకు భౌతికపరంగా సన్నిహితంగాను మరియు మరొక వైపు ఆ శిశువుకు దూరంగాను ఉండడాన్ని మీరు గమనించవచ్చు. ఎందుకంటే మీరు ఆ శిశువు ఉనికి యొక్క అద్భుతం పట్ల భయాన్ని మరియు గౌరవాన్ని కలిగి ఉంటారు కాబట్టి.

ఆ జీవి చాలా చిన్నదిగా ఉన్నప్పటికీ, అది భౌతికపరంగానే కాకుండా ఆధ్యాత్మిక పరంగా కూడా సంపూర్ణత్వాన్ని కలిగి ఉంటుంది. పరిపక్వత కలిగిన ఆత్మ, జీవితంలో తన సొంత మార్గాన్ని అనుసరిస్తుంది. ఆహా ఏమి అద్భుతం!

ఇప్పుడు మిమ్మల్ని మీరు ఈ మార్గంలో చూసుకోవడానికి సాహసించండి. మీకు మీరుగా కొంతదూరాన్ని సృష్టించుకుంటూ, ఇప్పటి వరకూ మీ జీవితంలోని మీ సొంత మార్గంలో ఎలా నడిచారో అర్ధం చేసుకోండి, మరియు మీరు మీ కోసం ఎల్లప్పుడూ సంతృప్తికరమైన వాస్తవాన్ని సృష్టించుకోవడానికి ఎలా ప్రయత్నించారో తెలుసుకోండి. మీరు పొరపాట్లుగా పిలుస్తున్న విషయాలను చేసినప్పటికీ కూడా, మీరు ఆనందాన్ని సృష్టించడంలోనూ లేదా బాధ మరియు నిరాశల నుంచి బయటపడే మార్గాన్ని కనుగొనడంలోనూ, మీరు మీ శక్తి మేరకు ప్రయత్నిస్తున్నారు. మీ అంతట మీరుగా కొంత విరామాన్ని తీసుకోండి మరియు ఈ పొరపాట్లను మీ అంతట మీరుగా దయచేసి అనుమతించండి. మీరు అన్ని విధాల సంపూర్ణంగా ఉండడం కోసం ఇక్కడ లేరు. ఇలా ఉండడం అనేది నిజానికి చాలా విసుగ్గా ఉంటుంది. మీరు జీవించడానికి, అనుభవాన్ని పొందడానికే ఇక్కడ ఉన్నారు. మీ అనుభవాలు చెడుగా ఉన్నప్పటికీ కూడా మీరు ఆశ్చర్యకరమైన భావనతో వీటి ద్వారా పయనించడం కోసమే మీరు ఇక్కడ ఉన్నారు.

మీరు మానవుడిగా ఉన్నప్పుడు మీ జీవితంలో సంభవించే అతి చెడు విషయం ఏమిటంటే, మీరు ఏ మాత్రం ముందుకు పయనించ లేకపోవడం మరియు కొత్త అనుభవాన్ని స్వీకరించ లేకపోవడం. మీరు ఒక సమస్య లేదా నమ్మకవ్యవస్థలో పూర్తిగా ఇరుక్కుపోయినప్పుడే ఇది సంభవిస్తుంది. మీరు ఎప్పుడైతే పూర్తిగా ఇరుక్కుపోయిన అనుభూతిని మరియు మీకు మరొక ఎంపిక లేదని భావిస్తూ జీవితాన్ని చురుకుదనం లేకుండా భారంగా గడుపుతారో, అప్పుడు మీరు ఆధ్యాత్మికంగా మరణించినట్లే అవుతుంది. మీ జీవితంలో మీకు ఏ మాత్రం ప్రదేశం గాని, శ్వాసించడానికి గాలి గాని లేదా అన్వేషణ యొక్క భావన గాని ఉండదు.

ఇలాంటి స్థితి మీకు ఏర్పడినట్లయితే, మీరు ఆ పరిస్థితి లేదా సమస్య నుంచి కొంతదూరాన్ని సృష్టించుకోవడానికి ప్రయత్నించండి. ఆ సమస్య చుట్టూ శ్వాసించడానికి ప్రయత్నించండి. ఆ సమస్య మీ శరీరంలో ఒక ప్రదేశాన్ని కలిగిఉన్నట్లు ఊహించుకోండి. ఉదాహరణకి మీరు ఎక్కడైతే ఒత్తిడిని లేదా బాధను అనుభూతి చెందుతున్నారో, ఆ ప్రదేశం వైపు మీ శ్వాస సులభంగా ప్రవహిస్తూ దాని చుట్టూ ఒక ఖాళీ స్థలం ఏర్పడడానికి అనుమతించండి. ఒత్తిడి మరియు ప్రతిఘటన శక్తుల చుట్టూ మీ శ్వాస యొక్క సున్నితత్వం ప్రవహిస్తున్నట్లు అనుభూతి చెందండి మరియు దీనిలో మీ ఆత్మ యొక్క నిజమైన వెలుగును గుర్తించండి. ఇది స్వచ్ఛమైన చైతన్యం మరియు ఒక ఆశ్చర్యానుభూతి. మీరు ఇక్కడ ఉండడం అనేది తాత్కాలికమని గుర్తుంచుకోండి, మీరు జీవితాన్ని అంత భారంగా తీసుకోవద్దు! ఇది ఒక గొప్ప ఆట. మీరు కనురెప్ప పాటులో ఆవలి వైపు ఉంటారనే విషయాన్ని గుర్తుంచుకోండి. మీరు జీవితాన్ని భారంగా తయారు చేయవలసిన అవసరం లేదు, ఇది కేవలం క్షణకాలం మాత్రమే. ఆ ఖాళీ స్థలంలో మళ్ళీ శ్వాసిస్తూ, మిమ్మల్ని మీరు విశాలం చేసుకుంటూ మరియు తెరవబడిన హృదయంతో సమస్యను అధిగమించండి. మీరు ఈ సమస్య కంటే చాలా ఉన్నతమైనవారు. మీ శ్వాస ద్వారా, మీరు సృష్టించిన ఖాళీ స్థలంలో మళ్ళీ విషయాలు ఎలా కదలడం ప్రారంభించాయో అనుభూతి చెందండి.

అంతరంలోని ఖాళీ స్థలాన్ని కనుగొనడం పూర్తి కష్టంగా అనిపిస్తే, భౌతికపరంగా కదలడానికి ప్రయత్నించండి. మీకోసం ఏదైనా చెయ్యండి, కాని సమస్య గురించి ఆలోచించకండి. మీ శక్తి తిరిగి ప్రవహించడానికి, మీరు మీ శ్వాస యొక్క ప్రవాహంతోను, ఆశ్చర్యం యొక్క అనుభూతితోను మరియు మీరే కాంతి అనే భావనతోను తిరిగి బంధాన్ని ఏర్పర్చుకోవడానికి – మీరు ఎక్కడికైనా బయటకు వెళ్ళండి, నడవండి, ఇంకొక దాని మీద మీ దృష్టిని కేంద్రీకరించండి. మీ మనసులో దేని గురించి

ఆలోచించకుండా ఉన్నట్లయితే, మీరు కొత్త సమాధానాలను, కొత్త దృక్పథాలను పొందగలరు. సమాధానాలు అనేవి మీ మనసు లేదా మీ ఇచ్ఛ నుంచి మాత్రం రావు. "నేను ఇప్పుడు చేయాల్సిన విషయం ఏమిటనేది నేను తప్పక కనుగొనాలి" అని మీరు పట్టుబట్టినట్లయితే, మీ మీద మీరు మరింత ఒత్తిడిని కలుగజేస్తూ మిమ్మల్ని మీరు బంధీ చేసుకున్నట్టే అవుతుంది. మీ చైతన్యాన్ని కుంచింపజేస్తూ మరియు ఒకే విషయం మీద కష్టపడి దృష్టిని కేంద్రీకరించడం ద్వారా కాకుండా, దానిని మరింత విశాలం చేస్తూ తెరిచి ఉంచినప్పుడు మాత్రమే మీరు సమాధానాలను పొందగలరు. మీ మనసు స్థంబించిపోయి అవిశ్రాంతికి లోనైనట్టుగాను మరియు మీరు పరిస్థితులను విడుదల చేయడానికి కష్టపడుతున్నట్టుగాను మీరు అనుభూతి చెందినట్లయితే, మీరు భౌతికపరంగా కదులుతూ ఏదైనా చెయ్యడానికి ప్రయత్నించండి – పరిగెత్తడం, నడవడం లేదా ఈతకొట్టడం మొదలైనవి. భౌతికపరమైన కదలిక మీ తలలోని శక్తిని ప్రశాంత పరుస్తుంది.

అంతరంలోని ఆధ్యాత్మిక తల్లితో బంధాన్ని ఏర్పరుచుకోవడం వలన, మీకు మీరు మళ్ళీ కొంత ఖాళీ ప్రదేశాన్ని ఇచ్చుకోగలరు. మీరు ఒక అడుగు వెనుకకు తగ్గి, మీ వ్యక్తిగత నిర్ణయాలను విడుదల చెయ్యండి మరియు ఇది మీకు ఒక కొత్త స్థలాన్ని సృష్టిస్తుంది. అదే విధంగా దీనిలో చెడు విషయాలకు కూడా స్థానం ఉంటుంది. ఎందుకంటే, ఇవన్నీ ఒక కారణం వలన ఉన్నాయని మరియు ఇవి గతంలో జరిగిన దానికి ప్రతిఫలంగా ఏర్పడ్డాయనే విషయాన్ని మీలోని మాతృత్వం అర్థం చేసుకుంటుంది కాబట్టి. మీరు బాధను మరియు నిరాశను ఎక్కువగా అనుభూతి చెందుతున్నట్లయితే, తల్లి యొక్క చేయి మీ భుజం మీద ఉన్నట్లు ఊహించుకోండి. ఆమె యొక్క సున్నితమైన మరియు సౌకర్యవంతమైన స్పర్శను అనుభూతి చెందండి. అసలైన మాతృమూర్తి కేవలం మిమ్మల్ని చూస్తుంది, మరియు ఆమె ఓదార్పును కలిగించే చూపును మీ ద్వారా మీకు అందిస్తుంది. మీ లోతైన అంతరం నుంచి పైకి వచ్చిన మరియు స్వర్గం నుంచి దిగి వచ్చిన ఈ రక్షణను మీతో ఉండన్వివండి. మీకు మీరు హామీని ఇచ్చుకోవడం ద్వారా, మీరు సరిగ్గా ఉన్నారనే విషయాన్ని తెలుసుకోండి: మీరు మీ శక్తిమేరకు పని చేస్తున్నారని మరియు పొరపాట్లు చేయడం కూడా సరియైన విషయమే అని తెలుసుకోండి. పొరపాట్లు అనేవి ఈ ఆటలో భాగమే. మీ జీవితంలో ఎంపికలను ఎంచుకోవడానికి, పొరపాట్లను చేయడానికి మరియు ఆ తర్వాత కొత్త ఎంపికలను ఎంచుకోవడానికి మీకు మీరు స్వేచ్ఛను ఇచ్చుకోండి. ఇదే జీవించడమంటే. నిరంతర కదలికను, ఎదుగుదలను, కనుగొనడాన్ని మరియు వీటన్నింటిలో దాగి ఉన్న ఆశ్చర్యం యొక్క భావనను అనుభూతి చెందండి. జీవితంలో సంభవిస్తున్న ప్రతీ విషయంలోనూ ఎంపిక

చేసుకునే ప్రదేశాన్ని కనుగొనడమే కళాత్మకంగా జీవించడమంటే. మీకు నచ్చిన విధంగా విషయాలను అనుభవించడానికి మీకు మీరుగా స్వేచ్ఛతోటి ఎంపిక చేసుకునే ప్రదేశాన్ని కనుగొన్నప్పుడే, భూమి మీద మీ జీవితం యొక్క మాస్టర్ మీరే అవుతారు. ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నప్పటికీ కూడా విషయాలు స్వేచ్ఛను పొందుతాయి, మరియు మీ మనసు ద్వారా మీరు ఊహించలేని సమాధానాలు మీ దగ్గరకి వస్తాయి. మిమ్మల్ని జీవితం యొక్క అద్భుతం ఆక్రమించడానికి మీరు అనుమతివ్వండి.

నేను ఇప్పుడు స్వేచ్ఛ మరియు సృజనాత్మక ఆనందం యొక్క తలంలో జీవిస్తున్నాను. నా మీద ఏ మాత్రం భూమి జీవితం యొక్క భారాలు లేవు మరియు నేను ఇక్కడ ఒక అతిథిలా ఉంటూ, హృదయం ద్వారా మీతో బంధాన్ని ఏర్పర్చుకోవడాన్ని ఆనందిస్తున్నాను. మీరు భూమి మీద మీ సొంత ప్రత్యేకమైన మార్గంలో ఉన్నప్పటికీ కూడా, మీరు ఇదే స్వేచ్ఛను మరియు ఆనందాన్ని పంచుకోగల సామర్థ్యం మీకు ఉందనే విషయాన్ని నేను తెలియజేస్తున్నాను. మీరు విడుదల చేయడానికి సాహసిస్తూ మరియు మిమ్మల్ని నడిపిస్తున్న ప్రేమ యొక్క చేతిని విశ్వసించినట్లయితే, మీకు ఇప్పుడే స్వేచ్ఛ అందుబాటులో ఉండగలదు. జీవితాన్ని వేడుకలా జరుపుకునే సమయం ఇదే. మీ జీవితంలోకి కాంతిని, గాలిని మరియు ప్రదేశాన్ని అనుమతించండి. అప్పుడే మీ జీవితం మీ దివ్యత్వపు ఆత్మ యొక్క లయబద్ధతకు అనుగుణంగా మళ్ళీ ప్రవహిస్తుంది.

* * * *

## మీ జన్మ కుటుంబాన్ని విడుదల చేయండి

డియర్ ఫ్రెండ్స్, మిమ్మల్ని మళ్ళీ ఇలా కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మీరందరూ తెలివైన యోధులు. భూమి మీద భౌతికశరీరంలో మీరు ఉండడం అన్నది మీ గొప్ప ధైర్యాన్ని తెలియజేస్తోంది. మీ అంతరంలోను మరియు బాహ్యంలోను ఉన్న చీకటిని ఎదుర్కొని దానిపై మీ కాంతిని, మీ చైతన్యం యొక్క కాంతిని ప్రసరింపజేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఆధ్యాత్మిక భావనలో మీరు యోధులు. మీ యొక్క ఆయుధాలు "కరుణ" మరియు "గమనిక". కేవలం మీరు ప్రేమ మరియు కరుణలతోనే, భయం మరియు భ్రమలతో కూడిన మీ వాస్తవాన్ని అధిగమించలేరు. స్త్రీ లక్షణాలైన "ప్రేమ మరియు కరుణ" సమన్వయం పొందడానికి, పురుష లక్షణాలైన "స్పష్టత మరియు గమనికల" యొక్క అవసరం చాలా ఉంది. కరుణ అనేది ద్వంద్వానికి సంబంధించిన ప్రతీ భావప్రకటనలో ఇమిడి ఉన్న కాంతి యొక్క మూలాన్ని అర్థం చేసుకోవడానికి మీకు అవకాశాన్ని కలిపిస్తుంది. ఉదాహరణకి ఒక మనిషి యొక్క వ్యక్తిత్వం పూర్తి చెడుతో నింపబడి ఉన్నా కూడా, 'కరుణ' మాత్రం అతనిలో ఉన్న ఆత్మ కాంతిని గుర్తిస్తుంది. గమనిక అనేది ప్రతీ భావప్రకటనలో ఉన్న భయం మరియు అధికార సంబంధిత శక్తుల ఉనికి యొక్క ఎరుకను మీరు పొందేలా చేస్తుంది. ఇది మీ శక్తిక్షేత్రం నుంచి మీరు వీటిని సులభంగా విడుదల చేయడానికి మరియు మీ అంతట మీరుగా వీటి నుండి దూరంగా ఉండడానికి అవకాశాన్ని కలిపిస్తుంది.

మీరు నిజానికి ఎవరనేది తెలుసుకోవడం కోసం – "మీరు ఎవరు కాదో" దానిని విడుదల చేయండి. దీనిని విడుదల చేయడంలో 'గమనిక' మీకు సహాయం చేస్తుంది. గమనిక అనేది "ఖడ్గం యొక్క శక్తి". ఈ శక్తి, మీకోసం మీరు సరిహద్దులను ఏర్పరుచుకోవడానికి మరియు మీ సొంతమార్గాన్ని కనుగొనడానికి సహాయం చేస్తుంది. నేను ఈ శక్తినే పురుషశక్తిగా పిలుస్తాను మరియు ఇది స్త్రీ లక్షణాలైన అవగాహనా మరియు క్షమాపణలకు అవసరమైన సమన్వయాన్ని అందిస్తుంది. నేను ఈ ఛానెలింగ్‌లో "గమనిక యొక్క ఖడ్గం" ప్రాముఖ్యతను నొక్కి చెప్పాలనుకుంటున్నాను, ఎందుకంటే ఈ రోజు మనం చర్చించుకునే అంశానికి మరియు ఈ శక్తికి చాలా దగ్గర సంబంధం ఉంది కాబట్టి.

నేను ఈ రోజు మీ తల్లిదండ్రులతోను మరియు మీరు జన్మించిన కుటుంబంతోను మీకు ఉన్న సంబంధం గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను.

మీరు ఆధ్యాత్మిక ఎదుగుదల యొక్క మార్గంలో ప్రవేశించినప్పుడు, ఒకానొక స్థితి దగ్గర ఈ అంశం మీరు దృష్టి పెట్టాల్సిన మొదటి విషయంగా ఉంటుంది.

మీరు జన్మను తీసుకోవడం పాపం లేదా నేరం అనే భావనల నుంచి విడిపోయి చూసినట్లయితే, భౌతికశరీరంలో జన్మించడమనేది చీకటిలో పడిపోయినట్టుగా మీకు అనిపించవచ్చు. జన్మ ప్రక్రియ అనేది నిజానికి చాలా లోతులలోకి పడిపోయినట్టుగా ఉంటుంది. కాని మీరు జాగృతావస్థలో ఉండే మీ ఆత్మ యొక్క కొంతభాగం నుంచి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. మీరు ఈ జన్మను తీసుకోవాలని మీ ఆత్మ యొక్క మూలం దగ్గరే నిర్ణయించుకున్నారు, మరియు మీరు మీ "లక్ష్యాన్ని సాధించడానికి" విశ్వాసంగాను మరియు పట్టుదలగాను పని చేయాల్సిన అవసరం ఉందని భావించారు. మీరు భౌతిక శరీరంలో జన్మించినప్పుడు, మీరు ఏమి తెలియని స్థితిలోనూ మరియు తాత్కాలిక ఎరుకలేని స్థితిలోనూ మునిగిపోతారు. మీరు భూమి యొక్క భౌతికవాస్తవంలో ప్రవేశించిన వెనువెంటనే కొన్ని భ్రమల ద్వారా మీ చైతన్యం మాయపొరతో కప్పివేయబడుతుంది. భూమి మీద జీవిస్తున్న చాలామంది మనుష్యులలో లోతుగా పాతుకుపోయిన అలవాట్లకు సంబంధించినవే ఈ భ్రమలు. ఈ మాయపొర మీ చుట్టూ కమ్ముకుని ఉంటుంది.

మీరు భూమి మీద ఉన్న జీవితంలోకి ప్రవేశించినప్పుడు, ఇతరలోకాలకు సంబంధించిన జ్ఞాపకాలు మీలో అలాగే సజీవంగాను మరియు కొత్తగాను ఉంటాయి. కాని వీటిని వ్యక్తపరచడానికి మాటలుగాని, వీటి యొక్క సత్యాన్ని తెలపగలిగే మార్గాన్నిగాని మీరు కలిగి ఉండరు. దీని అర్ధం మీరు ఎక్కడకు వెళ్ళినా మిమ్మల్ని అపరిమితమైన ప్రేమ మరియు భద్రత చుట్టుముట్టి ఉంటాయనే సులభమైన విషయాన్ని తెలపలేరు అని. చేపకు నీటి యొక్క అనుభూతి ఎలా అయితే ఉంటుందో అదే విధంగా మీకు కూడా ఇంటి యొక్క స్పష్టత అలాగే ఉంటుంది. మీరు జన్మ తీసుకున్న సమయంలో ఇంటి యొక్క శక్తిని చాలా స్పష్టంగా అనుభూతి చెందుతారు. కాని ఆ తర్వాత మీరు భౌతిక ప్రపంచంలోకి మరియు మీ తల్లిదండ్రుల యొక్క మానసికపరమైన వాస్తవంలోకి ప్రవేశిస్తారు. మీరు వీరిని చేరిన తర్వాత కూడా మీ ఇంటి యొక్క అనుభూతిని అలాగే సజీవంగా ఉంచాలని కోరుకుంటారు. కాని మీకు దీని నుంచి విడిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎలా అంటే మీ యొక్క చేప భాగం చుట్టూ ఈ మాయపొర వల అల్లుకున్నట్టుగా. ఇదే జన్మగాయం అంటే. ఈ జన్మ గాయానికి భౌతికపరమైన మరియు అదే విధంగా లోతైన ఆధ్యాత్మికపరమైన లక్షణాలు కలిగి ఉంటాయి.

మీ తల్లిదండ్రుల వ్యక్తిత్వాల యొక్క పద్ధతుల ద్వారానూ, జీవితం పట్ల వారికి ఉన్న ప్రాథమిక దృక్పథం ద్వారానూ, వారితో వారు వ్యవహరించే పద్ధతి ద్వారానూ మరియు మీపై వారికున్న ఆశలు మరియు కోరికల ద్వారానూ, మీరు ప్రభావితం చేయబడుతూ మాయపొర యొక్క వలలో చిక్కుకుని పోతారు. మీరు జన్మించినప్పటి నుంచి ఇప్పటి వరకూ కూడా భూమి మీద ఉన్న సామూహిక చైతన్యం, అహం ఆధారిత చైతన్యం యొక్క గుప్పిట్లోనే ఉంది. కాలాలు మారుతున్నాయి, కాని మార్పు అన్నది మాత్రం ఒక విధమైన ఆరంభదశలోనే ఉన్నది. ఈ దశలో విషయాలు వాస్తవంగా రూపొందడానికి మరియు వీటిలో ప్రాథమికమైన మార్పు రావడానికి కొంత సమయం అవసరం. మీరు ఇప్పటికీ ఈ ఆరంభదశలలోనే ఉన్నారు మరియు మీరు చేసే అంతర్‌పని దీనిలో అతి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. కాబట్టి మీరు భూమి మీదకి ప్రవేశించినప్పుడు, మీరు అహం ఆధారిత చైతన్యం యొక్క అదుపులో ఉన్న వాస్తవంలోకి ప్రవేశించారు మరియు మీరు దీని యొక్క ఎరుకను మీ తల్లిదండ్రుల యొక్క శక్తి ద్వారా పొందారు.

మీరు మీ తల్లిదండ్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న అహం ఆధారిత చైతన్యం యొక్క వాస్తవంలోకి ప్రవేశించినప్పుడు, మీరు అనేక రకాల భ్రమలతో వ్యవహరించాల్సి ఉంటుంది. నేను వీటిలో మూడింటి గురించి చెప్పాలనుకుంటున్నాను.

## 1. ఆధిపత్యాన్ని కోల్పోవడం

మొదటిది ఆధిపత్యాన్ని కోల్పోయారనే భ్రమకు సంబంధించినది. మీరు పెరిగి పెద్దవారు అవుతున్నప్పుడు, మీ జీవితంలో సంభవిస్తున్న ప్రతీ దానికి మీరే సృష్టికర్త అనే విషయాన్ని మరిచిపోయేంతగా ఈ భ్రమ మిమ్మల్ని ప్రేరేపిస్తుంది. చాలామంది ప్రజలు వారి జీవితాలలో జరుగుతున్నవి వారి యొక్క సొంత సృష్టిలేనని గుర్తించలేరు. మీరు ఎల్లప్పుడూ “ఉన్నతమైన శక్తుల” యొక్క బాధితులుగా అనుభూతి చెందుతున్నారు. ఈ ఉన్నత శక్తులే మీ జీవితాన్ని రూపొందిస్తున్నాయని భావిస్తున్నారు. ఇదే ఆధిపత్యాన్ని కోల్పోవడమంటే.

## 2. ఐకమత్యాన్ని కోల్పోవడం

మీ తల్లిదండ్రుల ద్వారా తెలపబడిన సామూహిక మానవ చైతన్యంలోకి ప్రవేశించినప్పుడు, మీరు అన్ని జీవాలతో ఉన్న మీ ఐకమత్యపు భావనను కోల్పోతారు. “అన్ని విషయాలలో ఉన్న ఏకత్వానికి” సంబంధించిన ప్రాథమికమైన అవగాహన

అనేది నెమ్మది నెమ్మదిగా మీ చైతన్యం నుంచి తొలగించబడుతుంది. మీరు మీ సొంత అహాన్ని నిర్మించుకోవడానికి ప్రోత్సహింపబడతారు. అహం ఆధారిత చైతన్యం ప్రకారం, మనమందరం ప్రత్యేకమైన వ్యక్తిత్వాలుగా ఉంటూ, మన సొంత ఉనికి కోసం కష్టపడుతుంటాం. బ్రతుకుతెరువు, పోషణ మరియు గుర్తింపు కోసం కష్టపడుతుంటాం. మనం మన సొంత శరీరానికి మాత్రమే పరిమితమై ఉన్నట్లు కనిపిస్తాం మరియు ఇతరులతో ఎటువంటి సంబంధం లేని మన సొంత మానసికపరమైన వాస్తవంలో బంధీయై ఉన్నట్లు కనిపిస్తాం. ఇదే వేర్పాటు యొక్క భ్రమ మరియు ఈ భ్రమకు ఒంటరితనం యొక్క విషాదకరమైన భావన అంటిపెట్టుకుని ఉంటుంది.

## 3. ప్రేమను కోల్పోవడం

ప్రేమను కోల్పోవడం అంటే అర్థం మీ హృదయం యొక్క సహజ జన్మహక్కులా ఉన్న అపరిమితమైన ఆనందం మరియు భద్రతలను కోల్పోయాననే భావనయే. భూతలంలోకి ప్రవేశించిన తర్వాత మీరు ప్రేమ యొక్క శక్తిని స్పష్టంగా గుర్తించలేరు. ఉదాహరణకి మీరు అభిమానం, సంపద లేదా మనోభావపరంగా ఆధారపడేతత్వం మొదలైన ప్రేమ కాని శక్తుల వలన మీరు అసలైన ప్రేమను గుర్తించలేని గందరగోళ స్థితికి క్రమక్రమంగా గురవుతూ ఉంటారు. ప్రేమకు సంబంధించిన ఈ గందరగోళ అభిప్రాయాలు మీ బాంధవ్యాలను ప్రభావితం చేస్తాయి మరియు ఇవి అపరిమితమైన ప్రేమను తిరిగి పొందడానికి నిరంతరం మీకు బాహ్యంగా అన్వేషించేలా మిమ్మల్ని తయారు చేస్తాయి. కాని, నిజానికి ఈ ప్రేమ మీ లోతైన అంతరంలోనే ఉంది.

ఈ భ్రమలు లేదా కోల్పోవడాలు అనేవి మిమ్మల్ని ఎంతగా ప్రభావితం చేస్తాయన్నది, మీ తల్లిదండ్రుల ఇల్లు లేదా మీ కుటుంబ వాతావరణం యొక్క ప్రత్యేకమైన శక్తిపైన ఆధారపడి ఉంటుంది. సాధారణంగా మీ తల్లిదండ్రుల చైతన్యం అనేది అహం మరియు హృదయం యొక్క కలయికతోనూ, భయం మరియు కాంతి యొక్క కలయికతోనూ ఉంటుంది. ముఖ్యంగా మీ తల్లిదండ్రులు కొన్ని భాగాలలో పైన చెప్పిన భ్రమలను అంటిపెట్టుకుని ఉంటారు, కాని కొన్ని భాగాలలో మాత్రం ఎన్‌లైటెన్‌మెంట్‌ని పొంది ఉంటారు. ఉదాహరణకి కష్టాల ద్వారా అనుభవాన్ని పొందిన భాగాలలో హృదయం తెరుచుకుని అంతర్ అభివృద్ధిని సాధించి ఉండవచ్చు. వీరు అహం ఆధారిత చైతన్యం యొక్క భ్రమలకు సంబంధించిన ఒకానొక మార్గంలో ఇరుక్కుపోయి ఉన్నారు, అంటే దీని అర్థం ప్రతి కుటుంబం లేదా ప్రతి తల్లి/తండ్రి ఒక్కో ప్రత్యేకమైన మార్గంలో ఇరుక్కుపోయి ఉన్నారని.

మీరు జన్మించిన కుటుంబానికి ఆకృతిని ఇచ్చిన ఈ ప్రత్యేకమైన శక్తులలోకి మీరు ప్రవేశించినప్పుడు, మీ చైతన్యం తెరిచి ఉంచబడి ఎటువంటి వ్యక్తిగత హద్దులు కలిగి లేకుండా ఉంటుంది. మీరు శిశువుగా ఉన్నప్పుడు మీ తల్లిదండ్రుల యొక్క శక్తులను ప్రాథమికమైన ముద్రలుగా మీ అంతరంలోకి స్వీకరిస్తారు. ఈ ముద్రలు మీ జీవితంలో తర్వాత వచ్చే పరిస్థితులను ఎలా అనుభవించాలి అనే వాటిపై లోతైన ప్రభావాన్ని చూపిస్తాయి. కాని ఈ స్థితిలో ఏవిధమైన వడబోత ఉండదు. మీ పట్ల మీరు ఎరుకను పొందుతున్న యవ్వనదశలో మాత్రమే దీనిని చేయగలరు. మీ చైతన్యం అభివృద్ధి చెందడం కోసం, మీరు ఈ శక్తులను వడబోయాల్సిన అవసరం ఉంది మరియు మీకు సరైనవి మరియు సహజమైనవి అని అనిపించిన వాటిని కనుగొనాల్సిన అవసరం ఉంది.

మొదట్లో మీ అంతట మీరుగా మీ తల్లిదండ్రుల యొక్క పద్ధతులకి చాలా బలంగా కలుపబడి ఉంటారు. మీరు పెరిగి పెద్దవారై వ్యక్తిగత ఎరుకను పొందిన తర్వాత, మీ తల్లిదండ్రుల యొక్క దృక్పధాన్ని(జీవనశైలిని) ప్రశ్నించడం మొదలుపెడతారు. ఎందుకంటే మీ సొంత గుర్తింపును అన్వేషించడం మొదలుపెడతారు కాబట్టి. ఈ మానసికపరమైన ఎదుగుదల ప్రక్రియ అన్నది చాలా వరకూ అహం ఆధారిత చైతన్యం నుంచి హృదయ ఆధారిత చైతన్యం వైపు పరివర్తనం చెందుతున్నట్లుగా ఉంటుంది. భూమి జీవితం యొక్క సహజమైన దశలు అంటే జీవసంబంధిత మరియు మానసికపరమైన ప్రక్రియలు మరియ ఋతువులు మొదలైన దశలన్నీ కూడా, ఆధ్యాత్మిక భావనలోని సహజమైన ఎదుగుదల దశలతో బంధాన్ని కలిగిఉంటాయి. అహం నుంచి హృదయాధారిత చైతన్యం వైపు జరిగే పరివర్తన ప్రక్రియ, తరచూ మీరు జన్మించిన కుటుంబాన్ని అదుపు చేస్తున్న పరిమితమైన మరియు భయపూరిత శక్తులను అధిగమించే ప్రక్రియతో కలసి పయనిస్తుంది.

మీరు ప్రత్యేకమైన ఆత్మగా జన్మించినప్పుడు విశ్వసంబంధిత జన్మగాయాన్ని అనుభవించారు (విశ్వసంబంధిత జన్మగాయం అనే ఛాప్టర్‌ను చూడండి). ఈ జన్మగాయాన్ని మీరు భూమి మీద కొత్తగా జన్మ తీసుకున్న ప్రతీసారి కొంతవరకూ అనుభవిస్తున్నారు. మీరు జన్మిస్తున్న సమయంలో, మీ తల్లిదండ్రులు భూమి యొక్క శక్తికి సంబంధించిన వారిగా ఉంటున్నారు. వీరు అప్పటికే ఈ తలానికి, ఇక్కడ అమలులో ఉన్న నియమాలకి అలవాటుపడిపోయారు. ఈ పరిమితమైన నియమాలు పిల్లలు అర్థం చేసుకోవడానికి ఏమాత్రం స్పష్టంగా ఉండవు. తల్లిదండ్రులు అహం ఆధారిత చైతన్యానికి మరియు మూడు భ్రమల యొక్క శక్తికి ప్రతినిధిగా వ్యవహరిస్తుంటారు. దీనిని పిల్లలు గమనిస్తుంటారు. పిల్లలు, తల్లిదండ్రుల ఇంటి

ద్వారా వీటిని తెలుసుకుంటారు. ఇవి తల్లిదండ్రుల జీవితంలో ఆకృతిని పొందిన తీరు, పిల్లల యొక్క మిగతా జీవితాన్ని బలంగా ప్రభావితం చేస్తాయి.

ముఖ్యంగా మొదటి మూడు నెలల్లో పిల్లలు వారి చుట్టూ ఉన్న పరిసరాలను చాలా లోతుగా గమనిస్తూ వాటిని స్వీకరిస్తారు. హేతుబద్ధమైన ఆలోచనల ద్వారా, తల్లిదండ్రుల యొక్క శక్తులు సులభంగా పిల్లల యొక్క చైతన్యంలోకి ఇంకిపోతాయి. మరొకవైపు వీరి జ్ఞాపకాలలో "స్వర్గం యొక్క భాగం" అలాగే ఉంటుంది. పిల్లల యొక్క చైతన్యంలోని ఒక భాగం భ్రమల ద్వారా ప్రభావితం చెందకుండా ఉంటుంది. ఈ భాగం ప్రేమ, ఆధిపత్యం మరియు ఏకత్వాలు సహజసిద్ధమైనవి అని గుర్తిస్తుంది. ఈ ఎరుక అహం ఆధారిత శక్తుల చుట్టూ ఉన్న వాటితో ఘర్షణ పడుతుంటుంది మరియు ఇది ఒక లోతైన బాధాకరమైన ఘర్షణ. ఇది పిల్లలను అలజడికి గురిచేస్తూ "ఇంటికి" తిరిగి పోవాలనే వాంఛను వారిలో రేకెత్తిస్తుంది; ఇది జీవితం యొక్క ప్రధమదశలో తీవ్రమైన ప్రతిఘటన ఏర్పడేందుకు కారణం కాగలదు. నిజానికి ఇది విశ్వసంబంధిత జన్మగాయం మళ్ళీ రేకెత్తినందు వలన ఏర్పడినది.

ఈ శక్తుల యొక్క ఘర్షణతో పిల్లలు ఎలా వ్యవహరించాలి? దీని వలన చాలా తరచుగా పిల్లల యొక్క కొన్ని భాగాలు మూసుకుపోతాయి. పిల్లల యొక్క చైతన్యంలోని కొన్ని భాగాలు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతాయి. తల్లిదండ్రుల యొక్క శక్తులను పిల్లలు అనుసరిస్తూ, వాటికి తగినట్టుగా తయారవుతుంటారు. ఎందుకంటే మొదటి నుంచి వీరు తల్లిదండ్రులపై పూర్తిగా ఆధారపడుతున్నారు కాబట్టి. పిల్లలు చాలా తీవ్రంగా గాయపడిన భౌతికస్థితిలో ఉంటారు మరియు వీరికి తల్లిదండ్రుల ద్వారా వాత్సల్యాన్ని మరియు ప్రేమను పొందాలనే కోరికను కలిగి ఉంటారు. సహజస్థితి యొక్క సంబంధించిన జ్ఞాపకాలైన ఏకత్వం, ప్రేమ మరియు ఆధిపత్యం అనేవి, నిజానికి పిల్లలు తల్లిదండ్రులకు ఇచ్చే బహుమతి. కాని ఈ బహుమతిని తీసుకోవడానికి తల్లిదండ్రులు ఎప్పుడూ సిద్ధంగా ఉండరు. ఎందుకంటే వీరు భ్రమల యొక్క శక్తుల ద్వారా చుట్టబడినప్పుడు, వీరు ఆ బహుమతిని అందుకోలేరు. అందువలన వీరు పిల్లలను నిజంగా స్వాగతించ లేకపోతున్నారు.

ఒకానొక స్థితిలో తల్లిదండ్రులు కూడా పిల్లలుగా ఉన్నవారే మరియు వీరు కూడా ఇదే ప్రక్రియలో పయనించారు. జాగృతావస్థలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారి భయాలను మరియు భ్రమలను పిల్లలపై బలంగా రుద్దరు. నిజానికి పెద్దవారు అహం ఆధారిత చైతన్యం యొక్క అనేక శక్తులను అస్పష్టంగానే స్వీకరిస్తున్నారు.

శిశువు జన్మిస్తున్న సమయంలో తల్లిదండ్రులు తాత్కాలికమైన మేల్కొల్పును అనుభవిస్తారు. గర్భం నుంచి ఈ అమాయకమైన చిన్నశిశువు ఈ ప్రపంచాన్ని విశ్వసిస్తూ ఇక్కడకి రావడం చూసినప్పుడు, ప్రతీ ఒక్కరిలోనూ గౌరవభావన ఏర్పడుతుంది. ఈ పవిత్రమైన క్షణం, తల్లిదండ్రుల యొక్క చైతన్యంలోని ఇంటి యొక్క ద్వారాలను విశాలంగా తెరిచి ఉంచుతుంది మరియు వీరు తెలియకుండానే అపరిమితమైన ప్రేమ మరియు ఏకత్వపు ఎరుక గల వీరి అంతర్ దివ్యత్వపు మూలానికి చేరుకుంటారు. కొంతసమయం వీరు ఒక పవిత్రమైన స్థలంలోకి ప్రవేశిస్తారు మరియు వీరు భ్రమలను అధిగమించి, నిజానికి వీరు ఎవరు అనే దానిని అనుభూతి చెందుతారు. కాని ఇది తాత్కాలికమైన ఆనందపు స్థితి మాత్రమే. ఎందుకంటే ఆ తర్వాత పరిస్థితులు యధాస్థానానికి వస్తాయి కాబట్టి. వారు అలవాటుపడిన ఆలోచనారీతికి మరియు అనుభూతులలోకి తిరిగి పడిపోతారు. అందువలన తాత్కాలికంగా కొంత సమయం తెరవబడిన వీరి హృదయ ఆధారిత చైతన్యం మళ్ళీ మూసుకుపోతుంది.

పిల్లలు పెరిగి పెద్దవారవుతున్నప్పుడు ఏం జరుగుతుంది? చాలామంది పిల్లలు వారి తల్లిదండ్రుల పద్ధతులకు తగినట్టుగా సర్దుకుపోతుంటారు. దీని కారణంగా, పిల్లలు జన్మించినప్పుడు కలిగిఉన్న ఆత్మశక్తి యొక్క ఎరుకతో బంధాన్ని కోల్పోతారు. జీవితం యొక్క ఆరంభదశలో, పిల్లలు ఈ ప్రపంచంపై దృష్టిపెట్టడంలో వారంతట వారుగా నిమగ్నులవుతారు మరియు వీరు తల్లిదండ్రుల నుంచి ప్రేమను మరియు ఆసక్తిని పొందాలని చూస్తుంటారు. దీని వలన 'నిజానికి వీరెవరనే విషయాన్ని' మర్చిపోతారు.

ఇది పిల్లలను ఎలా ప్రభావితం చేస్తుంది? పిల్లలు ప్రేమ మరియు భద్రతలకు సంబంధించిన అపరిమితమైన వాంఛను కలిగిఉంటారు. తల్లిదండ్రుల యొక్క శక్తులలోని భయపూరిత మరియు నిస్సారవంతమైన భాగాలలో పిల్లల యొక్క ఈ వాంఛ ఇరుక్కుపోయినప్పుడు, పిల్లలు గందరగోళానికి గురవుతూ బాధను మరియు వదిలివేయబడిన భావవను అనుభవిస్తారు. కాని పిల్లలు ఈ బాధను భరించలేక మనోభావాలను దాచివేస్తారు. ఎందుకంటే బలహీనమైన స్థితిలో ఉన్నప్పుడు దీనికి సంబంధించిన పూర్తి అవగాహనను పొందడమనేది చాలా కష్టతరం కాబట్టి. పిల్లలు ఏం చేస్తారంటే అన్నింటిని గుడ్డిగా మూసివేస్తూ మరియు ప్రేమకు సంబంధించిన అవాస్తవపు భ్రమలను సృష్టించుకుంటారు. మనోభావపరంగా జీవించడానికి, పిల్లలు తల్లిదండ్రుల యొక్క అవాస్తవపు ఊహలను వారంతట వారుగా అనుమతిస్తూ గందరగోళానికి లోనవుతారు. ఎందుకంటే అపరిమితమైన ప్రేమ అనేది అందుబాటులో

లేనప్పుడు, పరిమితమైన ప్రేమ మంచిగా అనిపిస్తుంది. సాధారణంగా పిల్లలు తమ ఇంటి యొక్క జ్ఞాపకాలైన ప్రేమ మరియు భద్రతలను పొందడం కోసం తరచూ వెనుకకు తగ్గుతూ వారి సొంత గుర్తింపును వదిలివేస్తుంటారు. అందువలన పిల్లలు తప్పుడు శక్తులనే ప్రేమ అనుకుని పొరబాటు పడుతుంటారు. ఉదాహరణకి వీరు కొన్ని లక్ష్యాలను సాధించడం ద్వారా తల్లిదండ్రులు పొందే సంతృప్తినే ప్రేమగా పొరబాటు పడుతుంటారు, లేదా పిల్లల పట్ల తల్లిదండ్రులు కలిగిఉన్న మనోభావసంబంధిత అవసరాలనే ప్రేమగా పొరబాటు పడుతుంటారు.

పిల్లలు ఏదైనా సాధించినప్పుడు దానిని చూసి తల్లిదండ్రులు చాలా గర్వపడుతుంటారు మరియు దీని గురించి పిల్లవాడు ప్రశంసించబడతాడు. ఈ ప్రశంసలు మరియు పొగడ్తల ద్వారా, పిల్లలు వారి యొక్క హృదయం తెరపబడినట్టుగా అనుభూతి చెందవచ్చు. కాని ఈ ప్రశంస అన్నది పిల్లవాడిని స్వచ్ఛంగా అర్థంచేసుకున్న మూలం నుంచి రానప్పుడు, మరియు తల్లిదండ్రుల ప్రశంస పిల్లలు కావాలని కోరుకుంటున్న దాని కన్నా కూడా సమాజం వీరి నుంచి ఆశిస్తున్న దాని మీదే ఎక్కువగా ఆధారపడి ఉన్నప్పుడు – నిజానికి ఈ ప్రశంస అనేది ఒక విధమైన విషంగా ఉంటుంది. పిల్లలు బాహ్యపు ఆదర్శాలకు అనుగుణంగా జీవించినప్పుడే కీర్తించబడతారు. నిజమైన ప్రేమంటే అర్థం: పిల్లలు ఈ జన్మలో వారికోసం వారు సాధించాలనుకున్న లక్ష్యాలతోను మరియు పిల్లల యొక్క అంతర్ ఆదర్శాలతోను మీరు బంధాన్ని ఏర్పరుచుకోవడమే. అలవాటు ప్రకారం మీ ఆసక్తిని బాహ్యపు లక్ష్యాలపై కేంద్రీకరించినప్పుడు, ఆ లక్ష్యాలనే పిల్లలు ప్రేమకు సమానమని నమ్ముతూ మోసపోతుంటారు. పిల్లలు వారికి సరైనది అని అనిపించిన దానిని కాకుండా, బాహ్యపు ఆదర్శాలకు తగినట్టుగా పని చేసినప్పుడు, వీరి అంతరంలో నేరం చేశాననే భావన ఏర్పడుతుంది. పిల్లలు పెరిగి పెద్దవారైన తర్వాత వేరొకరిని అనుసరిస్తూ వారిలా రూపొందవచ్చు, ఈ విధమైన స్థితిలో వీరు వీరి యొక్క సరిహద్దులను ఎప్పుడు దాటారన్నది మరియు వీరు ఎప్పటి నుంచి అధికంగా కష్టపడుతున్నారు అనే విషయాలను గుర్తించలేరు. వీరు ఎల్లప్పుడూ ఏదో సాధించాలనే కాంక్షను అనుభూతి చెందుతున్నారనే దానిని కనుగొంటారు. కాని వీరిలో కష్టపడి పని చేయాలనే అలవాటు ఎందుకు వ్యసనంగా తయారయ్యిందనే విషయాన్ని వీరు అర్థం చేసుకోలేరు.

నిజమైన ప్రేమశక్తిని తప్పుగా అర్థం చేసుకుంటున్న మరొక పద్ధతి ఏమిటంటే, పిల్లలు మనోభావపరంగా ఆధారపడే తత్వాన్ని ప్రేమగా భావిస్తూ గందరగోళానికి గురవ్వడమే. తల్లిదండ్రులకు పిల్లల అవసరం ఉన్నప్పుడు మాత్రమే పిల్లలను

ప్రేమిస్తున్నారనే భావన చాలామంది పిల్లల్లో ఉన్నది. నిజానికి తల్లిదండ్రుల హృదయంలో ఉన్న ఖాళీని పూరించాలని పిల్లలు ప్రయత్నిస్తున్నారు. తల్లిదండ్రులు వారిని వారు సరిగ్గా పట్టించుకోకపోవడం వలనే ఈ ఖాళీ ఏర్పడినది. దీని లోపలకి పిల్లవాడు అడుగు వేసినప్పుడు, అతను తనకుతానుగా తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయ తల్లి–తండ్రిగా మారుతాడు. తల్లిదండ్రులు వారి అంతరంలో కోల్పోయిన ప్రేమ మరియు సహకారాన్ని, పిల్లవాడు అందించడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా అతను తల్లిదండ్రులను సంతృప్తిపరచాలని కోరుకుంటాడు మరియు అతనికి కావల్సిన ప్రేమను పొందడం కోసమే ఇదంతా చేస్తాడు. కాని ఈ విధమైన సేవ నిజమైన ప్రేమ కాదు. ఇది తల్లి/తండ్రి మరియు బిడ్డ యొక్క ఇరువురి శక్తులు ప్రమాదకరమైన చిక్కులలో ఇరుక్కుపోవడాన్ని సూచిస్తుంది. తర్వాత వీరి ఇరువురి మధ్య ఉండే బంధంలో చాలా కష్టాలు ఏర్పడతాయి. ఆ పిల్లవాడు పెద్దయిన తర్వాత, అతను కొత్తగా ప్రవేశించే బంధాలలో కూడా సమస్యలను ఎదుర్కొంటాడు.

చాలామంది తల్లిదండ్రులు వారి బాల్యదశలో అపరిమితమైన ప్రేమ కొరతను అనుభవించారు. వీరి తల్లిదండ్రులు కూడా వీరిని నిజంగా స్వాగతించలేకపోయారు. అందువలన వీరి వ్యక్తిత్వంలో లోతైన బాధ మరియు వదిలివేయబడిన భావనలు ఏర్పడ్డాయి. వీరు పిల్లలకు జన్మనిచ్చినప్పుడు, వీరు కూడా వీరి పిల్లలను మిశ్రమ భావనల యొక్క కలయికతో కౌగిలించుకుంటారు. ఒకవైపు వీరిలో నిజాయితీ ఐన ప్రేమ ఉన్నప్పటికీ, మరొకవైపు వీరు కోల్పోయిన దానిని తిరిగి పొందాలనే అచేతనావస్థపు కోరికను కలిగిఉంటారు. తల్లిదండ్రులు తరచూ పిల్లలతో వీరికి ఉన్న బాంధవ్యం ద్వారా, వీరి యొక్క మనోభావసంబంధిత గాయాలను నయం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. వీరు దీనిని అచేతనావస్థలో చేసినప్పుడు, వీరు పిల్లలను "ప్రత్యామ్నాయ తల్లిదండ్రులుగా" ఉపయోగించుకుంటారు. అప్పుడు తల్లిదండ్రులు బాల్యంలో కోల్పోయిన ప్రేమను పిల్లలు వారికి అందించాల్సి వస్తుంది.

ఈ విధంగా జరిగినప్పుడు "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" మరియు "నువ్వు నాకు అవసరం" అనే సందేశాలు రెండూ పూర్తిగా కలుస్తూ పిల్లలకు అందించబడుతాయి. అప్పుడు పిల్లల యొక్క సొంతశక్తి ఏమాత్రం ఉండదు. ఎందుకంటే ఆ శక్తి తల్లిదండ్రుల యొక్క అవసరాలతో పీల్చబడుతున్నట్లు అనుభూతి చెందుతారు కనుక. ఈ విధంగా పీల్చబడడం అనేది నిజానికి పిల్లలు మంచిగా అనుభూతి చెందుతారు! ఈ అనుభూతి పిల్లలలో అవాస్తవపు భద్రతా భావనను కలిపిస్తుంది. వీరు యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత ఆమె/అతని శక్తి వేరొకరిచే క్షీణింపబడుతూ మరియు వారి ద్వారా సొంతం

చేసుకోబడుతునప్పుడు కూడా, ఈ భావన ఆమె లోతుగా ప్రేమించబడుతున్నట్టు అనుభూతి చెందేలా చేస్తుంది. ఆమె తన హద్దులను అతిక్రమించి అధికంగా ఇస్తూ కూడా, ఆమె ప్రేమించబడుతున్నాను మరియు ప్రశంసించబడుతున్నాను అనే భావనలో ఉంటుంది. ఆమె మనోభావపరంగా ఆధారపడే తత్వాన్ని, అసూయను మరియు స్వాధీనపరుచుకోవాలనే మనస్తత్వాన్ని కూడా ప్రేమ యొక్క ప్రతిరూపంగా భావిస్తుంది. కాని ఈ శక్తులు ప్రేమకు పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. ఈ స్థితిలో 'అవసరంతో ప్రేమ' కలవడం వలన వ్యక్తిత్వాన్ని కోల్పోయాననే విషాదకరమైన భావన పుడుతుంది.

మీరు భూమి మీదకు ఒక శిశువుగా వచ్చినప్పుడు మరుపు యొక్క సముద్రంలో మునిగిపోతారని, భ్రమల యొక్క మాయపొరతో చుట్టబడతారని నేను మీకు చెప్పాను. ఆత్మస్థితిలోనే మీకు మీరుగా దారి తప్పిపోవడానికి స్పృహతోనే మిమ్మల్ని మీరు అనుమతించుకున్నారు. మీరు భూమి మీద జన్మించినప్పుడు మీ అంతరంలో పరిష్కారాన్ని మరియు ఈ త్రోవ నుంచి బయటకు వచ్చే మార్గాన్ని కనుగొంటారని మిమ్మల్ని మీరు విశ్వసించారు. మీ యొక్క ప్రధాన లక్ష్యం: ఈ భ్రమల నుంచి బయటకు వచ్చే మార్గాన్ని కనుగొనడం మరియు ఈ ప్రపంచంలోకి "పరిష్కారం యొక్క శక్తిని", ప్రేమ మరియు స్పష్టత యొక్క శక్తిని తీసుకువస్తూ ఇతరులకు అందుబాటులో ఉంచడమే.

మీ జీవితంలోని కొన్ని ప్రత్యేక సమయాలు, ఈ లక్ష్యాన్ని చేరడానికి అవకాశాలను మరియు సామర్థ్యాలను కలిగిఉంటూ మీకు సహాయం చేస్తాయి. మీరు ఎదుగుతున్నప్పుడు కొంతమంది వ్యక్తులను లేదా పరిస్థితులను కలుస్తారు – ఇవి మీకు నిజానికి మీరు ఎవరనే దానిని కనుగొనడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నట్టుగాను లేదా సవాలు చేస్తున్నట్టుగాను ఉంటాయి. వీటి ద్వారా మీరు సున్నితంగా నెట్టబడతారు, లేదా మీరు మొండివారు అయినట్లయితే, మీరు చిక్కుముడులను విప్పడానికి జీవితం మిమ్మల్ని కష్టాల ద్వారా రెచ్చగొడుతుంది. మీ పెంపకంలోను మరియు మీ తల్లిదండ్రుల శక్తులలోను భాగంగా ఉన్న ప్రేమ యొక్క అవాస్తవపు భ్రమలను మీ నుండి విడుదల చేయవలసిన అవసరం ఉంది. ఇది మీ గుర్తింపును కోల్పోయే స్థితికి కారణం కావచ్చు. ఇలాంటి స్థితి, అహం నుంచి హృదయం వైపు పరివర్తనం చెందుతున్న మొదటి దశలో సంభవిస్తుందని నేను వివరించాను. ఈ స్థితిలో ఏదీ నిజమైనది కాదని మరియు మీరు నమ్మిన ప్రతీ దానిని కూడా సూక్ష్మంగా పరీక్షించాలని మీకు అనిపిస్తుంది. నిజానికి మీ ఆత్మ మిమ్మల్ని ఇంటికి చేర్చే ఏదో ఒక మార్గాన్ని వెతుకుతుంది. మీ ఆత్మ, మీ అంతట మీరుగా స్వేచ్ఛను

పొందేంతవరకూ మరియు మీ హృదయ ద్వారాన్ని తెరిచేంత వరకూ కూడా మీ తలుపును నిరంతరం కొడుతూనే ఉంటుంది.

మీ జీవితంలోని కొన్ని ముఖ్యమైన సంఘటనలు, మీరు ఎదగడానికి మరియు మీరు ఎవరనేది తెలుసుకోవడానికి అవకాశాలను ఎల్లప్పుడూ అందిస్తాయి. కాని ఈ అన్వేషణ యొక్క లోతులను తెలుసుకోవడానికి మరియు మీరు కొత్తగా జన్మ తీసుకున్నప్పుడు పోగొట్టుకున్న శక్తులను మళ్ళీ పొందడానికి, మీకు ధైర్యం మరియు పట్టుదల చాలా అవసరం. ఈ శక్తులనేవి ప్రేమ, ఏకత్వం మరియు ఆధిపత్యాలను కోల్పోయాననే భ్రమలకు ఏమాత్రం అంటకుండా స్వచ్ఛంగా ఉంటాయి. కొన్నిసార్లు మీరు మీ ఆత్మశక్తిని నిరాకరిస్తున్నారనే విషయాన్ని కనుగొంటారు. ఎందుకంటే మీ ఆత్మ, మీరు సహజమైనవి మరియు మీకు తగినవి అని భావించిన వాటి యొక్క మార్గం నుంచి మిమ్మల్ని బయటకు వచ్చేలా చేస్తుంది కాబట్టి. మీ ఆత్మ మీతో తప్పుగా ప్రవర్తించే ఒక అతిథిలా మీకు అనిపించవచ్చు, ఎందుకంటే మీరు మీ ప్రపంచం యొక్క పద్ధతులకు, మీరు జన్మించిన కుటుంబం యొక్క పద్ధతులకు అటవాటుపడినారు కాబట్టి.

మీ ఆత్మ అహం ఆధారిత చైతన్యం నుంచి మీ అంతట మీరుగా స్వేచ్ఛగా విడుదల అవ్వడానికి, ఇది పురుష లక్షణాలైన వ్యక్తిగత-చైతన్యం మరియు గమనికలను, మరియు స్త్రీ లక్షణాలైన ప్రేమ మరియు అవగాహనలను సమంగా స్వీకరిస్తుంది. గమనిక అంటే, మీ తల్లిదండ్రుల ద్వారా మీకు అందించబడిన భయపూరిత మరియు పరిమితమైన శక్తుల నుంచి మీ అంతట మీరు దూరంగా ఉండడమే. నేను ఈ ఛానెలింగ్ మొదట్లో చెప్పిన “ఖడ్గపు శక్తి” యొక్క ప్రాముఖ్యతను గుర్తుంచుకోండి. ఆధ్యాత్మికభావన ప్రకారం మీరు జన్మించిన కుటుంబాన్ని విడుదల చేయడమంటే అర్థం, మీ తల్లిదండ్రుల శక్తికి మరియు మీ సొంత శక్తికి మధ్య ఉన్న తేడాను గుర్తించడం మరియు మిమ్మల్ని పరిమితం చేస్తున్న మరియు మీకు ఊపిరాడకుండా చేస్తున్న “బంధపు తీగల నుండి విముక్తిని పొందడం అని”.

ముఖ్యంగా ఇది మీ తల్లిదండ్రులకు, మీ కోపం మరియు నిరాశల గురించి వ్యక్తపర్చడానికి సంబంధించిన విషయం ఎంతమాత్రం కాదు లేదా మీ పట్ల వారు ఎక్కడ చెడుగా స్పందిస్తున్నారో తెలియజేయడానికి సంబంధించిన విషయం కూడా కాదు. మీ తల్లిదండ్రుల పట్ల మీ అనుభూతులను, లేదా పరిస్థితుల పట్ల మీ అవగాహనను వారికి స్పష్టంగా తెలియజేయడం అన్నది కొన్నిసార్లు మంచి విషయంగా మీకు అనిపించవచ్చు. కాని చాలా వరకూ మీరు ఏం చెబుతున్నారనేది వారు అర్థం

చేసుకోలేకపోవచ్చు. మీ తల్లిదండ్రులు మీ యొక్క "భిన్నమైన" భాగంతో స్పందించలేకపోవచ్చు మరియు జీవితంపట్ల వారి యొక్క దృక్పథం మీ వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండవచ్చు. తల్లిదండ్రుల శక్తులకు సంబంధించిన బంధాలను విడుదల చేయడమంటే అర్థం, మొట్టమొదటిగా మీరు మీ మనసు మరియు మనోభావాల నుంచి వారి యొక్క శక్తిని విడుదల చేయడమే. క్లుప్తంగా చెప్పాలంటే మీ తల్లిదండ్రుల యొక్క భ్రమల మీద, ఇది చేయమని మరియు ఇది చేయవద్దని చెప్పే వారి యొక్క భయం మరియు తీర్పు ఆధారిత అభిప్రాయాల మీద ఆధారపడుతూ మీరు ఎంతవరకూ జీవిస్తున్నారనేది ఒకసారి మీ అంతరంలో వెతకండి.

ఒకసారి మీరు దీని గురించి స్పష్టతను పొందినప్పుడు మరియు మీ అంతట మీరుగా దీనిని విడుదల చేయడానికి అనుమతించినప్పుడు, మీరు వారిని సులభంగా క్షమిస్తారు. ఆ తర్వాత మీరు నిజంగా "తల్లిదండ్రుల ఇంటిని వదిలివేస్తారు". మీరు మీ అంతర్‌స్థాయిలో బంధాల తీగలను త్రెంచినప్పుడు మరియు మీ జీవితం యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించినప్పుడు మాత్రమే, నిజంగా మీ తల్లిదండ్రులను యధాతధంగా స్వీకరించగలరు. మీరు వారి యొక్క భయాలకు మరియు భ్రమలకు "తిరస్కారాన్ని" (గమనిక యొక్క ఖడ్గంతో) స్పష్టంగా తెలపగలరు. అదే సమయంలో, మీ తల్లిదండ్రులు వారి యొక్క భయాలు మరియు భ్రమలకు తగినట్టుగా జీవించడం లేదనే విషయాన్ని మీరు చూడగలరు. వారు కూడా దైవం యొక్క పిల్లలేనని మరియు వారి ఆత్మ లక్ష్యాన్ని నెరవేర్చడానికి వారు కూడా ప్రయత్నిస్తున్నారని మీరు తెలుసుకుంటారు. ఒకసారి మీరు దీనిని అనుభూతి చెందినట్లయితే, మీరు వారి యొక్క అమాయకత్వాన్ని అనుభూతి చెందగలరు మరియు మీరు వారిని క్షమించగలరు.

మీరు, మీ తల్లిదండ్రుల యొక్క బాధితులుగా ఉన్నారు – మీ తల్లిదండ్రులు మీ బాల్యంలో అహం ఆధారిత చైతన్యానికి ప్రతినిధిగా వ్యవహరించారు. మీరు వారి యొక్క భ్రమల ప్రకారం తాత్కాలికంగాను మరియు పాక్షికంగాను జీవించారు. ఒక విధంగా చెప్పాలంటే, మీరు శిశువుగా ఉన్నప్పుడు మీకు మరొక ఎంపిక లేకపోయింది. బాధితుడిగా ఉండడం యొక్క మీ భావనను అధిగమించాలనుకోవడం అనేది మీ జీవితంలో మీరు సాధించబోయే అతి శక్తివంతమైన విజయాలలో ఇది కూడా ఒకటిగా ఉంటుంది. మీ బాల్యంలో మీలో ఏర్పడిన లోతైన శక్తివంతపు ముద్రలను గుర్తించి, వాటిలో మీకు ఏవి ఉపయోగకరమైనవో జాగురుకతతో నిర్ణయించుకుని మిగిలిన వాటిని విడుదల చేసినప్పుడు మాత్రమే, మీరు స్వేచ్ఛా జీవిగా తయారవుతారు. ఇదే ఆధిపత్యం అంటే.

మీ సొంతం కాని మీ తల్లిదండ్రుల కోరికలను మరియు వాంఛలను అచేతనావస్థ నుండి తొలగిస్తారు.  అదే సమయంలో మీరు వారితో ఏమాత్రం ఘర్షణ పడకుండాను ఉంటారు. మీ తల్లిదండ్రులు అందించిన అవాస్తవ భ్రమలను సులభంగా మీకు 'సంబంధించని వాటిగా' చూస్తారు. మీ తల్లిదండ్రులు ఈ లక్షణాల ద్వారా మీపై భారాన్ని మోపారని వారిని నిందించనక్కర్లేదు. మీరు ప్రేమించగలరు మరియు అదే సమయంలో తేడాలను గమనించగలరు కూడా.

మీ తల్లిదండ్రుల ద్వారానే మీరు అహం ఆధారిత చైతన్యానికి పరిచయం చేయబడ్డారని మరియు అదే విధంగా వారి ద్వారానే మీరు ఈ చైతన్యాన్ని అధిగమించాలని మీకు ఎవరైనా చెప్పవచ్చు. మీరు వారిని ప్రేమ మరియు క్షమాపణలతో విడుదల చేయడం ద్వారాను మరియు మిమ్మల్ని మీరు ఒక స్వతంత్రమైన మాస్టర్‌గా గుర్తించడం ద్వారాను, మీరు ఈ అహం చైతన్యాన్ని అధిగమించవచ్చు.

## లైట్‌వర్కర్స్ మరియు వారి తల్లిదండ్రులు

ముఖ్యంగా నేను ఇప్పుడు లైట్‌వర్కర్ ఆత్మలకు వారి జన్మ కుటుంబంతో ఉన్న బంధం గురించి చెప్పాలని అనుకుంటున్నాను. తరచూ లైట్‌వర్కర్స్ వారి కుటుంబం యొక్క అదనపు బాధ్యతను వారి అంతరంలో మోస్తుంటారు.  లైట్‌వర్కర్స్ భూమి మీదకి వచ్చినప్పుడు మేల్కొల్పును పొందాలనే వాంఛను, అహం ఆధారిత చైతన్యం నుంచి వీరికి వీరుగా స్వేచ్ఛను పొందాలని మరియు భూమి మీద క్రీస్తు చైతన్యం యొక్క విత్తనాలను నాటాలనే ప్రత్యేకమైన వాంఛను కలిగి ఉంటారు. లైట్‌వర్కర్స్ మిగతా వారికంటే ఎక్కువగా, ఇతరులకు బోధించాలని మరియు వారిని హీల్ చెయ్యాలని కోరుకుంటారు మరియు హృదయాధారిత చైతన్యం వైపు ఎదగడంలో ఇతరులకు సహాయం చేస్తుంటారు.

ఈ కారణం వలన, చాలా వరకూ లైట్‌వర్కర్స్ ఆత్మలు అహం ఆధారిత చైతన్యం యొక్క వాస్తవంలో ఎక్కువగా కూరుకుపోయిన కుటుంబాలలో జన్మిస్తారు. ఎందుకంటే ఈ చైతన్యంలో కూరుకుపోయిన మరియు సులభంగా మార్పు చెందని శక్తి పద్ధతులను ధ్వంసం చెయ్యాలన్నదే వీరి యొక్క వాంఛ కాబట్టి. లైట్‌వర్కర్స్ తరచూ మార్గం మూసుకుపోయి శక్తి నిలిచిపోయిన "క్లిష్టమైన పరిస్థితులకు" ఒక అయస్కాంతంలా ఆకర్షింపబడతారు.

లైట్‌వర్కర్స్ ఒక ప్రత్యేకమైన ఎరుకతోను మరియు ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక

భావనతోను భూమి మీదకు వస్తారు. ఇది వీరిని వారి కుటుంబాల యొక్క ఆశించడాలకు లేదా ఆశయాలకు వ్యతిరేకంగా తయారయ్యేలా  చేస్తుంది. లైట్‌వర్కర్–శిశువు తన నిజతత్వాన్ని ప్రసరింపజేస్తూ లేదా వ్యక్తపరుస్తూ జీవితంపట్ల వారి కుటుంబానికి ఉన్న ప్రాథమికమైన అభిప్రాయాలను తరచూ సవాల్ చేస్తుంది. ఆ శిశువు చాలావరకూ శక్తి తిరిగి ప్రవహించడం కోసం ప్రతీ పనిని సహజమైన ఇంగితజ్ఞానంతో చేస్తుంది.

లైట్‌వర్కర్–ఆత్మ తనను కుటుంబంలో భిన్నంగా చూస్తున్నప్పటికీ కూడా, అది తల్లిదండ్రులకు మరియు కుటుంబానికి సేవ చెయ్యాలనే కోరుకుంటుంది. లైట్‌వర్కర్–శిశువు యొక్క అంతర్ సౌందర్యం మరియు స్వచ్ఛత గుర్తించబడనప్పుడు, ఆ శిశువు ఒంటరితనం మరియు నిరాశ యొక్క మనోభావాలలో తాత్కాలికంగా మునిగిపోవచ్చు.

లైట్‌వర్కర్స్ జన్మను ఆరంభిస్తున్న మొదట్లో, జన్మ కుటుంబం యొక్క భ్రమల నుంచి బయటకు వచ్చే మార్గాన్ని కనుగొంటాననే నమ్మకాన్ని మరియు ఆ కుటుంబం యొక్క పరిమితమైన శక్తిని అధిగమిస్తాననే లోతైన ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉంటారు. వీరు భూమి మీద జన్మ తీసుకుని పెరిగి పెద్దవారు అవుతున్నప్పుడు, ఇతర పిల్లల మాదిరిగానే గందరగోళానికి మరియు సందేహాలకు లోనవుతారు. ముఖ్యంగా కొన్ని పరిస్థితులలో వీరు ఈ గందరగోళాన్ని చాలా లోతుగాను మరియు తీవ్రంగాను అనుభవిస్తారు. ఎందుకంటే వీరు వీరి తల్లిదండ్రుల కంటే కూడా పురాతనమైనవారు మరియు లోతైన ఆధ్యాత్మిక అనుభవజ్ఞానపు ఎరుక గల ఆత్మలు కాబట్టి. వీరి కుటుంబ వాతావరణానికి సంబంధించిన శక్తిలో “ఏదో సరిగ్గా లేదనే” దాని యొక్క ఎరుకను పొందుతారు. పిల్లలు తమ యొక్క మనస్తత్వాన్ని లేదా ప్రవర్తనను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వలన, వీరు వీరి యొక్క  అంతర్‌స్థాయిలలో తల్లిదండ్రుల యొక్క శక్తులతో ఘర్షణ పడుతుంటారు. లైట్‌వర్కర్స్ సున్నితత్వాన్ని మరియు నిజాయితీని కలిగి ఉండడం వలన, ఈ ఘర్షణ వీరి అంతరంలో గొప్ప నిరాశను రేకెత్తిస్తుంది. వీరు వీరి యొక్క తల్లిదండ్రులను ప్రియాతి ప్రియంగా ప్రేమించడంలోను మరియు అదే సమయంలో వీరికి నచ్చినట్టుగా వీరు  ఉండడంలోను సమర్థవంతంగా వ్యవహరించే మనోభావపరమైన జీవన మార్గాన్ని వీరు కనుగొనాలి. దీని వలన లైట్‌వర్కర్స్‌లో అనేక రకాల మానసికపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఇవి ఒటంరితనం, అభద్రతాభావం మరియు భయాలుగా మొదలై – వ్యసనం, నిరాశ మరియు వ్యక్తిగత వినాశనానికి దారి తీస్తాయి.

భూమి మీదకు మరియు మీ శక్తి ఇరుక్కుపోయిన చీకటి ప్రదేశాలకు మీ ప్రయాణం అనేది చాలా అపాయకరమైనది. ఇది ఒక ప్రమాదకరమైన లక్ష్యం. ఈ కారణం వలనే నేను మిమ్మల్ని ధైర్యవంతమైన యోధులుగా పిలుస్తాను. మీరు దీనిని మర్చిపోవద్దు! మీరు ప్రధాన అన్వేషకులుగా తెలియని కొత్త ప్రదేశాలలోకి ప్రవేశిస్తారు. అక్కడ ఎటువంటి గుర్తులుగాని లేదా చిహ్నాలుగాని ఉండవు. మీరు మీ ప్రయాణాన్ని మొదలు పెట్టే ప్రాంతం మీకు పరిచయం లేనిదిగా ఉంటుంది. మీ సొంత అనుభూతులను మరియు ఇంగితజ్ఞానాన్ని ఒక దిక్సూచికగా ఉపయోగించుకుని, మీకోసం మీరు ఇంటి యొక్క శక్తిని సృష్టించాలి. ప్రధాన అన్వేషకులైన లైట్‌వర్కర్స్‌గా మీరు పాతదనం యొక్క అడ్డులను, ఊపిరాడనట్టి ఆలోచనా పద్ధతులను చేధించాలని మరియు వాటిలో ఇరుక్కుపోయిన శక్తిని విడుదల చేయాలని కోరుకుంటారు. మీ కుటుంబంలో ఇది చేసే మొదటి వ్యక్తిగా మీరే ఎల్లప్పుడూ ఉంటారు. అప్పటి వరకూ మీరు మీ ఆత్మ బంధువులను కూడా కలుసుకోలేరు. మీ అంతట మీరుగా కష్టపడి మార్గాన్ని కనుగొనడం వలన మీరు ఒక నిజమైన యోధుడిగా గుర్తింపబడతారు. మీ అంతట మీరు ఈ మార్గాన్ని కనుగొన్న తర్వాత, మీరు మీ జీవితంలో మీలాంటి మేల్కొల్పు స్థితిని ప్రతిబింబించే ఆత్మలను ఆకర్షిస్తారు.

మీ అందరూ మీ కాంతిని కనుగొనడానికి ఒంటరిగా పడిన ఘర్షణ అనేది మీకు చాలా భారంగా ఉంటుంది. కాని ఈ మార్గాన్ని ఆత్మస్థాయిలో జాగురుకతతోనే ఎంపిక చేసుకున్నారు. కాని ఈ ఎంపికను నెరవేర్చుకోవడానికి రక్తమాంసాలు కలిగిన ఒక శిశువుగా దీని ద్వారా పయనించడం ఆరంభించినప్పుడు, అది మిమ్మల్ని చాలా లోతుగా గాయపరుస్తుంది. మీ అంతరంలోని ఈ గాయాన్ని గుర్తించి అనుభూతి చెందమని నేను మిమ్మల్ని కోరుతున్నాను. ఎందుకంటే ఆ గాయంతో బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడే మీరు పరివర్తనం చెందుతారు మరియు ఆ గాయాన్ని విడుదల చేయగలరు. మీ అంతరంలో గాయపడిన శిశువు తన భుజాల మీద భారాన్ని మోస్తోందని తెలుసుకున్నప్పుడే, మీరు ఆ భారం యొక్క మూలంలోనికి చేరగలరు. మీరు మూలానికి చేరిన వెంటనే పరిష్కారం మీకు సన్నిహితంగా ఉంటుంది. మీరు స్వచ్ఛమైన మరియు లోతైన ఎరుకతో, ఆ శిశువు యొక్క బాధను కౌగిలించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఎరుక నుంచి కరుణ మరియు లోతైన గౌరవభావాలకు సంబంధించిన శక్తి ఆ శిశువును చేరుతుంది. మీతో మీరు ఉంటూ మరియు మీ యొక్క భిన్నమైన భాగాన్ని ప్రేమిస్తూ దానిపై వాత్సల్యాన్ని చూపించడం ద్వారానే, మీరు ఆ శిశువుపై ఉన్న భారాన్ని తీసివేయగలరు. ఈ విధంగానే మీరు శిశువును తిరిగి ఇంటికి తీసుకువస్తారు మరియు మీరు ఒక ప్రధాన అన్వేషకుడిగా మీ లక్ష్యాన్ని సాధిస్తారు.

## మీ కుటుంబ కర్మను పరిష్కరించడం

లైట్‌వర్కర్స్ వారు జన్మించిన కుటుంబానికి చేయవలసిన పని ఏమిటంటే: వారు వారుగా తయారవ్వడమే. ఈ విధంగా చేసినప్పుడు, లైట్‌వర్కర్స్ వారి యొక్క లక్ష్యాన్ని సాధిస్తారు. వారి కుటుంబాన్ని మార్చడం అన్నది వారి కర్తవ్యం కాదు; మీకు బాహ్యంగా ఉన్న వాటిని మార్చడం మీ ఉద్యోగం కాదు. ప్రపంచాన్ని అద్భుతమైన ప్రదేశంగా రూపొందించడానికి మీరు ఇక్కడ లేరు. మిమ్మల్ని మీరు మేల్కొల్పు కోవడానికే మీరు ఇక్కడ ఉన్నారు. మీరు ఈ విధంగా చేసినప్పుడే ప్రపంచం అద్భుతమైన స్థలంగా రూపొందుతుంది. ఎందుకంటే మీ కాంతి దానిపై ప్రకాశిస్తుంది మరియు అదే విధంగా ఇతరులలో కూడా ఆనందాన్ని మరియు ఎన్‌లైటెన్‌మెంట్‌ను తీసుకువస్తుంది. కాబట్టి ప్రపంచం మీద దృష్టి పెట్టవద్దు, అది మీ కుటుంబమైనా లేదా మీరు ప్రవేశించిన ఏ బంధమైనా కూడా దానిపై దృష్టి పెట్టవద్దు.

మీ నిజమైన కర్తవ్యం ఏమిటంటే మీరు ఒక శిశువుగా ఉన్నప్పుడు, మీకు మీరుగా చాలా లోతుగా సంగ్రహించిన అహం ఆధారిత భయాలను మరియు భ్రమలన్నింటిని విడుదల చేయడమే. పాక్షికంగా మీ వ్యక్తిత్వాన్ని సృష్టించిన ఈ శక్తివంతమైన ముద్రల గురించి తెలుసుకుంటూ, మరియు దానిలో మీకు సంబంధం లేని భాగాలను విడుదల చేయడమనేది ఒక సాహసవంతమైన ప్రక్రియ. ఇది ఉల్లిపాయ యొక్క పొరలన్నింటిని ఒలిచివేయడం లాంటిది; ఇదే శరీరంలో రెండవసారి జన్మించడం లాంటిది.

అంతర్ ప్రక్రియ మరియు రెండవ జన్మ యొక్క తీవ్రత గురించి చెప్పి మిమ్మల్ని నిరాశ పరచాలన్నది నా ఉద్దేశ్యం కాదు. మీ పట్ల మీరు లోతైన గౌరవభావాన్ని కలిగి ఉండడాన్ని నేను మరింతగా ఇష్టపడతాను. మీరు ధైర్యవంతమైన యోధులని నాకు తెలుసు. మీరు ప్రధాన అన్వేషకులుగా మీ కాంతిని 'చీకటి మరియు పరిచయంలేని' ప్రదేశాలలో ప్రసరింపజేస్తూ, భూమి మీద ఒక కొత్త చైతన్యం కోసం మార్గాన్ని ఏర్పరుస్తున్నారు.

ఇతరుల యొక్క హృదయంలో కాంతిని వెలిగించడం అనేది మీ కర్తవ్యం కాదు. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. వీరికి మీరు ఒక కాంతి మెరుపును అందించవచ్చు, మీరు ఒక ఉదాహరణగా కనిపించవచ్చు. కాని మీరు ఇతరుల యొక్క మేల్కొల్పుకు ఎంతమాత్రం బాధ్యులు కారు. ముఖ్యంగా మీరు జన్మించిన కుటుంబానికి కూడా ఇదే వర్తిస్తుంది. మీరు ఒక శిశువుగా ఉన్నప్పుడు అచేతనావస్థలోను

మరియు పెద్దవారైన తర్వాత చేతనావస్థలోను, మీ తల్లిదండ్రులను వారి యొక్క భయాలు మరియు భ్రమల నుంచి కాపాడాలని తరచూ అనుభూతి చెందుతుంటారు. మీరు ఈ కర్తవ్యంలో విఫలమయ్యారని తరచూ ఆలోచిస్తుంటారు. మీరు ఊహించిన విధంగా మీ తల్లిదండ్రులకు సహాయం చేయలేకపోయారని బాధపడుతుంటారు.

'నిజంగా సహాయం చేయడం అంటే ఏమిటి మరియు మీ తల్లిదండ్రుల పట్ల మీ బాధ్యత ఏమిటి' అనే విషయాలపై తప్పుడు అభిప్రాయాలు ఉండడం వలనే ఈ ఆలోచనారీతి ఏర్పడినది. నిజానికి వాస్తవంలో ఇదే జరుగుతోంది. మీరు జన్మించినప్పటి నుంచి, మీ తల్లిదండ్రుల యొక్క శక్తులను మీ సొంత శక్తులుగా భావిస్తూ వాటిని బలంగా సంగ్రహిస్తున్నారు. మీరు ఎక్కడ మొదలయ్యారు మరియు వారు ఎక్కడ ఆగిపోయారు అనే విషయాలను సులభంగా విభజించలేరు. ఎందుకంటే మీరు మీ తల్లిదండ్రుల యొక్క భయాలను మరియు భ్రమలను సంగ్రహిస్తున్నారు అదే విధంగా మీరు వారి యొక్క మనోభావ సంబంధిత భారాలతో సన్నిహితంగా ఉంటున్నారు కాబట్టి. ఈ భారాలనేవి తరతరాలుగా కుటుంబం యొక్క ఇరువైపు వర్గాల ద్వారా మీకు సంక్రమించి ఉండవచ్చు. దీనికి కర్మ సంబంధిత లక్షణం ఉండవచ్చు, అంటే "కర్మను ఛేధించేంత వరకూ" కూడా అవే సమస్యలు మళ్ళీ మళ్ళీ ఏర్పడతాయి. దీనినే మీరు కుటుంబకర్మగా పిలవవచ్చు. ఈ సమస్యలు సమన్వయం లేని స్త్రీ లేదా పురుష శక్తికి సంబంధించినవి కావచ్చు. ఈ శక్తులనేవి పాత బానిసత్వపు సంప్రదాయాలు, కొన్ని ప్రత్యేకమైన వ్యాధులు లేదా మొదలైన కారణాల ఫలితంగాను ఏర్పడి ఉండవచ్చు. ఈ విధమైన కర్మ భారాలలో ఇరుక్కుపోయిన శక్తిని విడుదల చేసినప్పుడే, వీటికి పరిష్కారం లభించగలదు. అప్పుడే ఈ భారాలు రాబోయే తరాల వారికి సంక్రమించకుండా ఉంటాయి. కుటుంబంలోని ఏ ఒక్క వ్యక్తి అయినా, బాల్యంలో తను సంగ్రహించిన మనోభావసంబంధిత భారం నుంచి తనకుతానుగా స్వేచ్ఛను పొందుతూ మరియు ఆ కుటుంబంతో తనకు ఉన్న బంధాన్ని ఛేధించినప్పుడు మాత్రమే, ఆ కుటుంబ కర్మ పరిష్కరింపబడుతుంది. వారి యొక్క జన్యుకణాలలో ఉన్న భారం నుంచి కూడా వారు స్వేచ్ఛను పొందవచ్చు.

కుటుంబంలోని ఏ వ్యక్తి అయినా తనకుతాను సహాయం చేసుకోవడం ద్వారానే "కర్మను ఛేధించుకోగలడు". ఇది మీ అంతర్ ఎదుగుదల మరియు విస్తరణ మీద దృష్టిని కేంద్రీకరించడానికి సంబంధించిన విషయం. ఈ ఎదుగుదల మరియు విస్తరణ "కుటుంబం యొక్క శక్తిపై" ప్రభావాన్ని చూపుతాయి. అదే విధంగా ఆ కుటుంబంలోని వ్యక్తులు కర్మ నుంచి బయటకు రావడానికి కూడా ఇది అవకాశాలను

కలిపిస్తుంది. మనోభావపరమైన శక్తి అడ్డుల నుంచి తనకుతానుగా స్వేచ్ఛను పొందిన లైట్‌వర్కర్ తన కుటుంబంలోని మిగతా వ్యక్తులకు ఒక శక్తివంతమైన మార్గాన్ని అందిస్తాడు. దీనిని ఇతరులపై ఒత్తిడిని కలుగజేస్తూ వారిని మార్చాలని ప్రయత్నించడం ద్వారా కాకుండా, కేవలం అతను అతని అంతర్ పని ద్వారాను మరియు అతను ప్రసరింపజేసే శక్తి ద్వారాను సాధిస్తాడు. అతను శక్తిపరంగా తను జన్మించిన కుటుంబానికి అందించేది: కేవలం మార్పు యొక్క అవకాశాన్ని మాత్రమే. అతని యొక్క శక్తి ఇతరులకు మార్పు యొక్క అవకాశాన్ని చూపిస్తుంది. నిజానికి ఇదే అతను చేయాల్సినది.

కుటుంబ సభ్యులు ఈ మార్గాన్ని ఎంపిక చేసుకుంటారా లేదా అన్నది వారి వ్యక్తిగతానికి సంబంధించిన విషయం. ఇతరుల మార్పుపై మీ ఆధ్యాత్మిక లక్ష్యం ఆధారపడి ఉండదు, దానికి ఎంతమాత్రం మీరు బాధ్యులు కాదు. మీ అంతట మీరుగా మీ కుటుంబం కలిగిఉన్న కర్మసంబంధిత భారం నుంచి స్వేచ్ఛను పొందినప్పటికీ, మీరు మీ కుటుంబం ద్వారా తిరస్కరింపబడవచ్చు లేదా అవమానింపబడవచ్చు లేదా పరిహసింపబడవచ్చు. అయినప్పటికీ కూడా మీరు మీ లక్ష్యాన్ని విజయవంతంగా సాధించినట్లే. మీరు కుటుంబంలో ఉన్న కర్మ సంబంధిత పద్ధతులను ధ్వంసం చేస్తారు మరియు మీరు పిల్లలను కలిగి ఉన్నట్లయితే ఈ మనోభావసంబంధిత భారం వారికి సంక్రమించదు. ఇదే మీ ఆత్మ యొక్క ప్రధానలక్ష్యం.

మీరు నిస్సారమైన మరియు ఎండిపోయిన ఒక లోయలో జీవిస్తున్నట్టు ఊహించుకోండి. మీ సమాజం మీరు ఈ లోయ దాటి బయటకు వెళ్ళలేరని – అంతా ఇక్కడే ఉందని మీకు చెబుతుంది. మీ ఒక్కరికి మాత్రమే దీని కన్నా పచ్చటి సారవంతమైన భూములు ఉన్నాయనే జ్ఞాపకం రావచ్చు. ఈ విషయం గురించి బాగా ఆలోచించిన తర్వాత, మీ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకుని, మీరు ఆ లోయ పై భాగాన్ని చేరడానికి ఎక్కడం మొదలుపెడతారు. ఈ లోయను అధిరోహించడానికి ఎక్కువగా బలం మరియు శక్తి అవసరం. అధిరోహించే మార్గం చాలా దట్టంగా ఉండడమే కాకుండా ఏ విధమైన మార్గ సూచికలుగాని లేదా గుర్తులు గాని ఉండవు. మీరు ఈ లోయ నుంచి పైకి వస్తున్నప్పుడు, మీ వెనుక ఒక త్రోవను వదులుతూ వస్తారు. ఒకానొక స్థితి దగ్గర మీరు ఈ లోయ నుంచి బయటకు వస్తారు మరియు మీ ముందు ఒక అద్భుతమైన ప్రదేశం ఆనందం మరియు గుర్తింపు యొక్క భావనలతో మిమ్మల్ని ప్రభావితం చేస్తుంది. అక్కడ ఏదో ఉందని మీకు తెలుసు, అది మీ జన్మస్థలం కన్నా కూడా మీ అసలైన ఇంటికి చాలా దగ్గరగా ఉ

న్నట్లు మీరు అనుభూతి చెందుతారు. మీరు అత్యుత్సాహంగా ఆ లోయలోకి చూస్తూ మీ కుటుంబం కోసం ఎదురుచూస్తారు. వారు మీతో కలవాలని మరియు ఈ గొప్పదృశ్యాన్ని చూసి ఆశ్చర్యానికి లోనవ్వాలని కోరుకుంటారు. మీ విజయాన్ని వారితో పంచుకోవాలని అనుకుంటారు. కానీ ఆ లోయ నుంచి బయటకు వచ్చేవారు ఎవరూ లేరని మీరు గమనిస్తారు. మీకు దూరంగా కొన్ని గుంపులను మీరు గుర్తిస్తారు, కాని వారు మీ ప్రయాణంపై ఏవిధమైన ఆసక్తిని చూపించరు.

ఇదే తరచుగా లైట్‌వర్కర్ ఆత్మలకు జరుగుతోంది. దయచేసి మీ కుటుంబాన్ని కోల్పోవడం గురించి దు:ఖించవద్దని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరు ఆ లోయ నుంచి బయటకి రావడం ద్వారానూ, మార్గాన్ని ఏర్పరుస్తూ ఒక త్రోవను వదలడం ద్వారానూ, మీరు మీ కుటుంబానికి గొప్ప సేవ చేశారు. ఈ త్రోవ అక్కడే ఉంటూ, ఏదో ఒక రోజు ఆ లోయ నుంచి బయటకు రావాలని అనుకున్న వారికి ఉపయోగపడుతుంది. ఈ త్రోవ అనేది ఒక శక్తితలం. దీనిని వారికి అందుబాటులో మీరు ఉంచారు.

మీరు ఈ తల్లిదండ్రులకు మరియు ఈ కుటుంబంలోను జన్మించినపుడు, ఈ త్రోవను నిర్మించడం అనేది మీ యొక్క లక్ష్యంగా ఉంటుంది. అదే పనిగా మీ కుటుంబాన్ని పైకి తీసుకురావడమే మీ లక్ష్యం కాదు లేదా మీ భుజాల మీద వారిని మోస్తూ ఆ లోయ నుంచి బయటకు తీసుకురావాలనేది కూడా మీ లక్ష్యం కాదు! ఇది మీ కర్తవ్యం ఎంతమాత్రం కాదు. ఎప్పుడైతే మీరు మీ తల్లిదండ్రులను లేదా మీ కుటుంబాన్ని ఆ దట్టమైన కొండల్లోంచి పైకి లాక్కు రావాలని ప్రయత్నిస్తారో, అప్పుడు మీరు మీ అంతర్ ఎదుగుదలను ఆటంకపరుస్తారు మరియు దీని వలన మీరు నిరాశకు లోనవుతారు. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకు మరియు పరివర్తనానికి మార్గం కాదు.

మీరు ప్రేమిస్తున్నవారు మరియు మీరు మీ కాంతిని పంచుకోవాలని అనుకుంటున్నవారు – ఇంకా అదే లోయలో మరొక వంద సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు జీవించాలని అనుకుని ఉండవచ్చు. ఇది పూర్తిగా వారికి సంబంధించిన విషయం. కాని వారు ఏదో ఒక సమయంలో ఈ చిన్న త్రోవను చూసి దాని దగ్గరకు వెళ్ళి దాని గురించి ఆలోచిస్తారు: “ఇది ఆసక్తికరంగా ఉంది, దీనిలో ముందుకి వెళ్ళి దీనిని ప్రయత్నిద్దామని అనుకుంటారు; ఈ లోయలో ఎంతమాత్రం నాకు మంచి సమయం లేదని అనుకుని బయటకు వస్తారు”. వారు వారి అంతర్ ఎదుగుదల యొక్క ప్రయాణాన్ని మొదలుపెడుతూ, వారి సొంత మార్గంలో కాంతి వైపు పయనిస్తారు. వారు ఈ త్రోవలో నడుస్తూ, ఆ మార్గంలో మీరు పెట్టిన

గుర్తులను వారు కనుగొనడం అనేది అద్భుతం కాదా, గొప్ప విలువైనది కాదా? వారు వారి సొంత ఇబ్బందుల ద్వారా పయనించాలి, కాని వారి ప్రయాణానికి ఒక దీపస్తంభం కాంతిని వెదజల్లుతూ ఉంటుంది. మీరు ప్రధాన అన్వేషకుడిలా తెలియని దట్టమైన ప్రదేశాలలో పయనిస్తూ మార్గాన్ని ఏర్పరుస్తారు. మీ ద్వారా వేయబడిన ఈ మార్గాన్ని గౌరవంతోను మరియు కృతజ్ఞతతోను వారు ఉపయోగించుకుంటారు.

స్వతంత్రత కలిగిన ఒక ఆధ్యాత్మికవేత్తలా స్వేచ్ఛగా జీవించడానికి మరియు మీ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి, మీరు జన్మించిన కుటుంబాన్ని విడుదల చేయాలి. మీరు వారి యొక్క "శిశువు"గానే కాకుండా, వారి యొక్క "తల్లి-తండ్రి"గా కూడా వారిని విడుదల చేయాలి. నన్ను ఈ "ద్విపాత్రలను" విశదీకరించనివ్వండి. మీ అంతరంలోని శిశువు, మీ తల్లిదండ్రులు అపరిమితమైన ప్రేమ మరియు భద్రతలను అందిస్తారనే ఆశను మీ అంతర్ శిశువు విడుదల చేయాలి. అది వీటి కోసం మీ వైపు మరలాలి. మీ అంతర్ శిశువు, మీ తల్లిదండ్రుల ద్వారా ద్రోహానికి గురయ్యానని భావిస్తోంది. మీరు ఆ శిశువు భాగంలోని కోపం, బాధ మరియు నిరాశలను విడుదల చేయడానికి సహాయం చేయాలి. ఇదే అంతర్‌శిశువు భాగం అంటే.

మీ తల్లిదండ్రులకు తల్లి-తండ్రిగా ఉండాలనుకున్న మీ యొక్క భాగాన్ని కూడా విడుదల చేయాలి. ఇది లైట్‌వర్కర్ ఆత్మలకు చాలా కష్టమైన పని. మీరు పెరిగి పెద్దవారైన తర్వాత, ఒకానొక స్థితి దగ్గర మీరు తల్లిదండ్రులకే తల్లి-తండ్రిగా అనుభూతి చెందుతారు. మీరు "జన్మతహా బోధించాలి – హీల్ చేయాలి అనే వాంఛను" మరియు "అభివృద్ధి చెందిన ఆధ్యాత్మిక ఎరుకను" కలిగి ఉండడం వలన, మీ తల్లిదండ్రుల యొక్క భయాలను మరియు భ్రమలను స్పష్టంగా చూస్తారు మరియు వారిని నయం చేయాలని అనుకుంటారు. దీని వలన మీరు మీ తల్లిదండ్రులతో చాలా సమస్యలను ఎదుర్కొంటారు. ఎందుకంటే వీరికి సహాయం చేయాలనే మీ కోరిక అన్నది తరచూ నిజానికి మీరు ఎవరనేది గుర్తింపబడాలనే అచేతనావస్థపు కోరికతో ముడిపడి ఉంటుంది కనుక. వేరే విధంగా చెప్పాలంటే, మీ తల్లిదండ్రులకు మీరు సహాయం చెయ్యాలని ప్రయత్నించినప్పుడు మీ ద్వారా గాయపడిన శిశువు మాట్లాడుతుంది. మీ యొక్క గాయపడిన భాగాల ద్వారా ఇతరులకు సహాయం చెయ్యాలని ప్రయత్నిస్తే అది విపత్తుకి దారి తీస్తుంది. తుదికి మీరు మరింతగా గాయపడతారు మరియు మీ తల్లిదండ్రులు నిరాశకు లేదా గందరగోళానికి గురవుతారు.

మీ తల్లిదండ్రులను విడుదల చేయమంటే అర్థం వారిని మార్చాలనే మీ కోరికను విడుదల చేయడమే. వారిని ముందుకు నడిపించడమనేది మీ కర్తవ్యం కాదని మీరు తెలుసుకోవాలి. మీ సొంత మార్గంతో వ్యవహరించడమే మీ ప్రధాన లక్ష్యం. నిజంగా మీ తల్లిదండ్రులతో విడిపోయిన తర్వాత, ఈ ద్విపాత్రలను విడుదల

చేసిన తర్వాత – మీకు వారికి మధ్య మరింత స్వేచ్ఛతో కూడిన ఒక కొత్త సంబంధం ఏర్పడడాన్ని మీరు కనుగొంటారు. వారు ఇంకా జీవించి ఉన్నట్లయితే, మీ తల్లిదండ్రులతో ఉన్న బంధం తేలికగా తయారవుతుంది. ఎందుకంటే మందలింపు మరియు తప్పు చేశాననే భావనల యొక్క శక్తులు మీ నుంచి విడుదల అవుతాయి కాబట్టి. వేరే విధంగా చెప్పాలంటే, మీ ఇరువురూ సమ్మతించే విషయాలు మీ మధ్య లేకపోవడం వలన మీకు వారిని ఎక్కువగా కలవాలని అనిపించకపోవచ్చు. ఈ బంధంలో మీరు మరింత స్వేచ్ఛను అనుభూతి చెందుతారు. మీ తల్లిదండ్రుల ఆమోదం యొక్క అవసరం లేకుండానే, మీరు మీ సొంతంగా నిర్ణయాలను తీసుకుంటారు. లేదా మీతో వారు ఏకీభవించకపోయినా కూడా, మీరు కోపం మరియు నిరాశలకు లోనుకాకుండా మీ సొంత మార్గంలో పయనిస్తారు.

మీ జీవితంలో మీరు మీ "ఆధ్యాత్మిక కుటుంబానికి" సంబంధించిన మనుష్యులను కలుసుకుంటారు. నిజానికి మీ ఆధ్యాత్మిక కుటుంబానికి శారీరకపరమైన, జన్యుపరమైన లేదా వంశపారంపర్యమైన మొదలైన వాటితో ఎటువంటి సంబంధం ఉండదు. ఈ కుటుంబం ఒకే విధమైన లక్ష్యాలు కలిగిన ఆత్మలకు సంబంధించినది. గతజన్మల నుంచి వారు మీకు స్నేహితులుగాను, ప్రేమికులుగాను లేదా ఒకే ఆశయంపై పని చేసిన వారిగాను తెలిసి ఉండవచ్చు. వారితో వ్యవహరించడం చాలా సులభం. ఎందుకంటే మీరు మీ అంతర్ ఇష్టాన్ని పంచుకుంటారు కాబట్టి; మీరు ఒకే కుటుంబానికి సంబంధించిన వారు. మీరు ఒక రకంగా ఇంటికి చేరిన అనుభవాన్ని పొందుతారు. మీరు మొదట్లో ఇతరుల మధ్య ప్రత్యేకంగాను మరియు ఒంటరిగాను అనుభూతి చెందిన అనుభవం, ఇప్పుడు మీ బంధానికి మరియు పరస్పర గుర్తింపులకు పునాదిగా తయారవుతుంది. మీ ఆధ్యాత్మిక కుటుంబంతో బంధం అన్నది భూమి మీద ఉన్న మీ జీవితంలోని ఆనందానికి నిజమైన మూలంగా ఉంటుంది. మీ జీవితంలోకి దీనిని అనుమతించడానికి మీరు చేయవలసినది ఏమిటంటే, ఆ లోయ నుంచి బయటకు వచ్చే మార్గాన్ని మీ సొంతంగా కనుగొనాలి మరియు మీ అంతరంలోని కాంతిని గుర్తించాలి. మీ కాంతిని తిరిగి ప్రతిబింబించని వాతావరణంలో మీ సొంత కాంతిని మీరు గుర్తించినప్పుడే, మీరు స్వేచ్ఛా జీవిగాను మరియు స్వతంత్రకుడిగాను రూపొందుతారు. మీ చరిత్రలో మిమ్మల్ని పట్టి ఉంచిన భయాలు మరియు భ్రమలకు సంబంధించిన కర్మ బంధాల నుంచి విడుదల అవ్వాలి. ప్రేమ మరియు గౌరవం ఆధారంగా ఉన్న బాంధవ్యాలను మరియు మీ అంతరంలో మేల్కొన్న దివ్యత్వాన్ని ప్రతిబింబించే బాంధవ్యాలను మీ జీవితంలో ఆకర్షిస్తారు.

* * * *

# కొత్తశకం యొక్క పిల్లలు

డియర్ ఫ్రెండ్స్, నేను మీకు హృదయపూర్వక స్వాగతాన్ని పలుకుతున్నాను. మీ అందరిలో నా శక్తి ప్రవహిస్తోంది. మీరు దీనిని ఇంటి యొక్క శక్తిగా గమనిస్తారు. ఇది మీ యొక్క మూలానికి సంబంధించినది. ప్రస్తుతం మీరు ఈ ఇంటి వైపుగా పయనిస్తున్నారు. నా శక్తి అనేది కేవలం భూమి మీద రెండువేల సంవత్సరాల క్రితం జీవించిన ఒక మనిషికి సంబంధించిన శక్తి మాత్రం కాదు. మీరందరూ భాగంగా ఉన్న మూల శక్తికి నేను ప్రతినిధిగా ఉన్నాను మరియు ఈ శక్తిలో మీ ప్రజ్ఞాత్మలన్నీ ఒకటిగాను మరియు ఒకే సమూహపు శక్తిగాను ఉన్నాయి.

ఈ ఏకత్వపు స్థితిలోనే మూలచైతన్యం ఉంటుంది, దీనిని మీరు క్రీస్తుశక్తిగా పిలువవచ్చు. ఇది నాతో(జెషువా) సహా మనందరిని కప్పి ఉంచే ఒక గొడుగులా ఉంటుంది. ఈ శక్తి నుంచే భూమి మీద ఉన్న మీకు మేము సందేశాలను అందిస్తున్నాం. మిమ్మల్ని మీరు తాత్కాలికంగా కోల్పోయినప్పుడు మరియు మీ మార్గాన్ని తెలుసుకోలేక పోయినప్పుడు, మేము ఈ శక్తినే మీకు అద్దంపడుతూ చూపిస్తాం. ఇది మీ మూలచైతన్యం, మీ ఆత్మ కుటుంబం మరియు మీ ప్రజ్ఞాత్మల యొక్క శక్తి. మేము ఈ శక్తినే మీకు చూపించాలని అనుకుంటున్నాం. మీరు ఈ మూలం నుంచే క్రిందకు దిగి వచ్చారని మరియు ఇక్కడ నుంచే మీ లోతైన ఉత్తేజం ఆవిర్భవిస్తోందని మేము మీకు గుర్తుచేస్తున్నాం.

ఈ ఉత్తేజం మిమ్మల్ని అందరిని కలుపుతూ భూమి మీదకి కాంతిని తీసుకువచ్చేలా చేస్తుంది. ఇది కొత్త శకం యొక్క రాకకు సంబంధించినది. భూమి మీద ఇప్పుడు మరియు ఇక్కడ మీ ప్రస్తుత జన్మ అనేది మీరు జీవిస్తున్న పరివర్తన స్థితి యొక్క కాలంతో లోతైన బంధాన్ని కలిగి ఉంటుంది. నేను ఈ రోజు భూమి మీదకి వస్తున్న కొత్తతరం పిల్లల యొక్క రాక గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. ఈ పిల్లలు మీ కంటే  భిన్నమైన లక్షణాలను చూపిస్తారు. ఇది ఎలా జరుగుతుంది? ఈ సంఘటన ఎక్కడి నుంచి సంభవిస్తుంది? దీని గురించి నేను మిమ్మల్ని సమయం ద్వారా గతానికి తీసుకు వెళ్ళి, మీరు ఈ పిల్లలు తీసుకువస్తున్న కొత్త తరంగపు శక్తికి ప్రధాన అన్వేషకులుగా ఉన్న సంఘటనను మీకు చూపిస్తాను.

భూమి మీద జరిగిన కొన్ని కాలాలలో, 'శక్తి' భారంగాను మరియు జడత్వంగాను ఉండేది. ప్రతీ విషయం నియమ నిబంధనల ద్వారా నడుపబడుతుండేది. ప్రేమ మరియు ఆహ్లాదపు శక్తులను తీసుకువచ్చే ఊహాశక్తికి మరియు సృజనాత్మక

శక్తికి చాలా తక్కువ ప్రాముఖ్యత ఉండేది. చాలా యుగాలలో, ఈ భారపు శక్తే భూమిని అదుపు చేసింది. ఊపిరాడకుండా చేస్తున్న ఈ శక్తిని ఛేధించడంలోనూ, అధికారం మరియు అదుపులతో నిండి ఉన్న చీకటి వాస్తవంలోకి కాంతిని తీసుకురావడంలోనూ – నేను ప్రధాన అన్వేషకుడిగా పని చేశాను. ఆ రోజుల్లో ఊహాశక్తిని, స్వేచ్ఛగా వ్యక్తపరిచే వ్యక్తిగత స్వతంత్రతను మరియు హృదయం యొక్క శక్తిని అణచి వేస్తుండేవారు.

ఈ చరిత్రలో రెండవ ప్రపంచ యుద్ధం అనేది ఒక గొప్ప మలుపుగా మారింది. ఈ యుద్ధం జరుగుతున్న సమయంలో కొత్త శకం మరియు ఆత్మ సమయం జన్మించడం ఆరంభమయ్యింది. ఇది 60వ దశాబ్ధంలో జరిగిన విప్లవంగా మీకు తెలుసు. దీనిని ఆధ్యాత్మిక విప్లవంగా కూడా పిలుస్తారు. ఆ సమయంలోనే హృదయం యొక్క శక్తి మళ్ళీ పుట్టింది. కొంతవరకూ 60వ దశాబ్ధంలో శక్తి స్వేచ్ఛగా ప్రవహించింది మరియు ఇది జడత్వాన్ని కలిగిఉండేది. అయినప్పటికీ ఈ శక్తి ముందుకు పయనిస్తూ గొప్ప మలుపుకి నాంది పలికింది. ఇది కొత్తదనంతో కూడిన ప్రకంపన శక్తి యొక్క రాకను తెలియజేసింది.

ఆ సమయంలోను మరియు రెండవ ప్రపంచయుద్ధం తర్వాత జన్మించిన మీరందరూ కొత్తశకం యొక్క ప్రధాన అన్వేషకులుగా ఉన్నారు. మీ ద్వారా సృష్టింపబడిన ఆధ్యాత్మిక పునాది నుంచే ఇప్పుడు కొత్త తరం పిల్లలు వస్తున్నారు. ఈ పిల్లలు మీ హృదయం యొక్క గీతాన్ని గుర్తిస్తూ దానిని ముందుకు తీసుకువెళ్తారు. నేను ఇప్పుడు ఈ పిల్లల గురించి మాట్లాడదల్చుకున్నాను.

ఈ పిల్లలు ముందెన్నడూ లేని స్వచ్ఛమైన మరియు ఉన్నతమైన శక్తితో ఇక్కడకు వస్తారు. ఉన్నతమైన శక్తి అంటే, వీరు భూమి మీదకి వచ్చిన తర్వాత కూడా ఆత్మ శక్తితో మరింత బంధాన్ని కలిగి ఉండగలరు. దీనిని వేరే విధంగా చెప్పాలంటే, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత దశాబ్ధాలలో మీరు మరియు మీ లాంటి చాలామంది ప్రధాన అన్వేషకులుగా చేసిన పని వలన, మీ భౌతిక వాస్తవానికి మరియు ఆధ్యాత్మిక తలానికి మధ్య ఉన్న మాయపొర పల్చబడింది.

ఆ రోజులలో చాలా విషయాలు బయటకు వచ్చాయి; సంప్రదాయకరమైన అధికారాలు ప్రశ్నించబడ్డాయి, కొత్త భావాలు పైకి రావడం ఆరంభించాయి మరియు వీటికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సామూహిక మానవచైతన్యం ప్రభావితం చేయబడింది. మొదట్లో ఇవి తీవ్ర గందరగోళానికి మరియు అలజడులకు గురి చేసాయి. కాని

హృదయం యొక్క శక్తి ఎల్లప్పుడూ నియమాలను మరియు ఆదర్శాలను ప్రేమిస్తున్న వారి యొక్క కళ్ళల్లోను మరియు సత్యాన్ని బోధించే పండితులను గౌరవిస్తున్న మనుష్యులలోను తీవ్రగందరగోళాన్ని మరియు అలజడులను రేకెత్తిస్తుంది. ఆ రోజులు గతించాయి. మీరు, మీ అంతరంలో స్పష్టత మరియు నిజం యొక్క శక్తిని కనుగొనాలని మరియు దానిని అనుభూతి చెందాలని కాంక్షిస్తున్నారు. ఈ అంతర్ పనే భూమి మీద కొత్తశకం రావడానికి మార్గాన్ని ఏర్పరుస్తున్నది. మీరందరూ ఒక అడుగును పాత శకంలోను మరియు ఇంకొక అడుగును కొత్తశకంలోను ఉంచుతున్నారు. కొత్తదనానికి అనుగుణంగా మార్పు చెందడం అన్నది క్రమక్రమంగా జరిగే ఒక సుధీర్ఘమైన పరివర్తనం. ఇప్పుడు జన్మిస్తున్న పిల్లలు, మీ కన్నా ఎక్కువగా కొత్తశకంలో ఉంటున్నారు. అయినప్పటికీ మీకు మరియు వారికి మధ్య ఒక ముఖ్యమైన సంబంధం మరియు గుర్తింపు ఉన్నాయి.

దీని గురించి స్పష్టంగా వివరించే ముందు, నేను ఇప్పుడు భూమి మీదకు ప్రవేశిస్తున్న వివిధ సమూహాలకు సంబంధించిన పిల్లల గురించి చెప్పదల్చుకున్నాను. ఇక్కడ ఉన్న మీరందరూ మరియు ముఖ్యంగా ఈ సందేశానికి ఆకర్షింపబడుతూ అనుభూతి చెందుతున్న వారందరూ కూడా లైట్‌వర్కర్స్ ఆత్మలే. మీరు చాలా ప్రాచీనమైన వారు. మీరు చాలా జన్మల యొక్క అనుభవాన్ని మరియు మేధాసంపత్తిని కలిగిఉన్నారు. మీరు ఈ అనుభవాల ద్వారా పయనించడం వలన మీ ఆత్మలో సున్నితత్వం అభివృద్ధి చెందింది. ఈ సున్నితత్వం మిమ్మల్ని కరుణ మరియు అనుభవజ్ఞానం గల వారిగా రూపొందించింది మరియు అదే సమయంలో ఇది మిమ్మల్ని గాయపర్చింది కూడా. చాలాసార్లు మీరు భిన్నమైనవారని మరియు ఈ సామాజిక వాతావరణానికి తగిన వ్యక్తి కాదని అనుభూతి చెందారు. ఆదేశాలు, క్రమశిక్షణ మరియు అణచివేతల యొక్క అనుభూతులన్నవి సర్వసాధారణమైన విషయాలుగా చలామణి ఐన కాలాల వలన, మీరు లోతైన బాధకు గురయ్యారు మరియు ఇవి మీ అనుభూతి కేంద్రాలను గాయపరచాయి. మీ యొక్క సున్నితత్వపు గుణం, ప్రస్తుతం భూమి మీద జన్మిస్తున్న లైట్‌వర్కర్ శిశువుల యొక్క కళ్ళల్లో కూడా ప్రతిబింబించడాన్ని మీరు స్పష్టంగా చూడగలరు.

ఇప్పుడు నేను “కొత్తయుగం పిల్లల” యొక్క మొదటి సమూహం గురించి చెప్పాలని అనుకుంటున్నాను. ఈ పిల్లలు లైట్‌వర్కర్స్ ఆత్మలు. వీరు చాలా వరకూ మీలాగే ఉంటారు, కాని వీరు వేరే ప్రవేశద్వారం లేదా పొర నుంచి భూమి మీదకు ప్రవేశిస్తారు. మీరు అనుభవించినట్టుగా, వీరు పాతశకపు శక్తి యొక్క భారాన్ని

అనుభవించరు. మీరు పాత విద్యాపద్ధతులతో వ్యవహరించాల్సి వచ్చింది. కాని పిల్లల ఎదుగుదలకు ఉపయోగించే ఈ పద్ధతులు తరచూ పిల్లల యొక్క సహజ గుణాలైన ఊహాశక్తి, ఆత్మాభిమానం మరియు ఆలోచించే శక్తులను అణచి వేస్తున్నాయి. కాని ఈ పద్ధతులన్నీ కొన్ని దశాబ్దాలుగా మార్పు చెందుతున్నాయి. ఇప్పుడు అనుభూతులకు మరింత స్వేచ్ఛను మరియు మరింత స్థానాన్ని కలిపిస్తూ, మనోభావాల యొక్క ప్రాముఖ్యతను మరింతగా అర్ధం చేసుకుంటూ, ప్రతీ మనిషి యొక్క వ్యక్తిగత స్వభావానికి మరింత గౌరవాన్ని అందిస్తున్నారు.

ఇప్పుడు భూమి మీదకు ప్రవేశిస్తున్న లైట్‌వర్కర్స్ ఆత్మలను కొత్త పద్ధతిలో ప్రత్యేకమైన శక్తితో స్వాగతిస్తున్నారు మరియు ఇది మాయపొర ద్వారా వీరి యొక్క ఆత్మశక్తిని మరియు విశ్వకాంతిని మరింతగా తీసుకువచ్చే అవకాశాన్ని వీరికి కలిపిస్తుంది. అందువలన వీరి సున్నితత్వం చాలా స్పష్టంగా కనపడుతుంది మరియు ఇది సమన్వయా లోపాలకు కూడా దారి తీయవచ్చు. నేను దీని గురించి తర్వాత వివరంగా చెబుతాను.

లైట్‌వర్కర్స్ ఆత్మలు ఇతర తలాలలో చాలా చాలా జన్మలను ఎత్తిన తర్వాతనే భూమి మీద జన్మించారు. ఈ బేధమే వీరిని "భూమి ఆత్మల" నుంచి విభజిస్తుంది. అందువలన మనం మిగతా ఆత్మలను మన సదుపాయం కోసం భూమి ఆత్మలుగా పిలుస్తున్నాం. భూమి ఆత్మలు ప్రత్యేకమైన చైతన్యాలుగా ఏర్పడినప్పటి నుంచి కూడా, భూమి మీద మానవశరీరాలలో జన్మిస్తూనే ఉన్నారు. వీరి ఆత్మలు బాల్యదశ నుంచే భూమి మీద జీవితచక్రాన్ని ఆరంభించాయి. అప్పటికే లైట్‌వర్కర్ ఆత్మలు "యవ్వన ఆత్మలు"గా ఉన్నతమైన అనుభవాన్ని కలిగి ఉన్నాయి మరియు వీరు చాలా అనుభవాల ద్వారా పయనించారు. లైట్‌వర్కర్ ఆత్మలు తరచూ ఎక్కువగా భూమి ఆత్మలకు తల్లిదండ్రులుగా వ్యవహరించేవారు.

నేను "కొత్త యుగం పిల్లలకు" సంబంధించిన రెండవ సమూహం గురించి చెప్పాలనుకుంటున్నాను. వీరు భూమికి సంబంధించిన ఆత్మలు. చారిత్రాత్మకంగా వీరు మనం ముందు చెప్పుకున్న లైట్‌వర్కర్ ఆత్మల యొక్క కుటుంబానికి సంబంధించిన వారు కాదు. వీరి యొక్క ఎదుగుదల అన్నది భూమి మీద జీవితం యొక్క పరిణామక్రమంతో చాలా లోతుగా ముడిపడి ఉంటుంది. ఇప్పుడు వీరు ఒక సమూహంగా అహం ఆధారిత చైతన్యాన్ని విడుదల చేసే మొదటిదశల ద్వారా పయనిస్తూ, హృదయాధారిత చైతన్యం వైపు కదులుతున్నారు. ప్రస్తుత సమయంలో జన్మిస్తున్న భూమి ఆత్మలు అతి సున్నితత్వాన్ని ప్రదర్శిస్తాయి. ఎందుకంటే మాయపొర

పల్చబడడం వలన వీరి అంతర్ ఎదుగుదలకు మరియు మనోభావపరమైన వ్యక్తిగత భావప్రకటనకు మరింత అవకాశం లభిస్తుంది కాబట్టి. ఇప్పుడు జన్మిస్తున్న పిల్లల ద్వారా వస్తున్న కొత్త తరంగపు శక్తిలో భాగంగా వీరు కూడా ఉన్నారు.

ఇప్పుడు నేను మూడవ సమూహం గురించి చెప్పాలనుకుంటున్నాను. మీ ఆధ్యాత్మిక భావన ప్రకారం ప్రస్తుతం ఈ పిల్లల్ని "క్రిస్టల్ చిల్డ్రన్"గా పిలుస్తున్నారు. వీరు భూమికి కొత్తవారు; వీరు భూమి మీద ఎక్కువ జన్మలను తీసుకొనలేదు. అయినప్పటికీ, వీరికి వేరే తలాలు లేదా డైమెన్షన్స్ యొక్క ఉనికితో గొప్ప అనుబంధం ఉంది. ఆ తలాలలో వీరు మానవదేహం కన్నా భిన్నమైన రూపాలను ధరించారు. మీరు ఈ పిల్లల్ని 'స్టార్ చిల్డ్రన్'గా కూడా పిలువవచ్చు. వీరి శక్తి చాలా అద్భుతంగా ఉంటుంది మరియు గొప్ప సున్నితత్వాన్ని కూడా కలిగి ఉంటారు. వీరు భూమి యొక్క శక్తితోను, భౌతికవాస్తవం యొక్క సాంద్రత మరియు జడత్వాలకు తగినట్టు శృతి కావడంలోను ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీరు తరచూ ఆహార సంబంధిత లేదా చర్మ సంబంధిత వ్యాధులను కలిగి ఉండవచ్చు. భూమి మీదకి కొత్తగా రాబోతున్న ఈ ఆత్మలు తమతో పాటు స్వచ్ఛమైన ఇతర తలాల యొక్క శక్తిని కూడా తీసుకువస్తున్నారు మరియు వీరంతట వీరుగా భూమి మీద పూర్తి స్థాయిలో స్థిరపడడానికి అధిక సంరక్షణ మరియు భద్రతలు అవసరం.

మనం కొత్తయుగం పిల్లల యొక్క మూడు సమూహాలకు పేర్లు పెట్టాం. ప్రస్తుతం జన్మిస్తున్న ఈ పిల్లలందరి యొక్క స్వభావాన్ని బట్టి, వీరందరూ కొత్తశకంలో భాగంగా ఉన్నారని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇది వింటున్న మరియు చదువుతున్న మీ అందరికి లైట్‌వర్కర్ ఆత్మలతో సంబంధం ఉంది. ఎందుకంటే మీరు కూడా వారిలో ఒకరు కాబట్టి. మీరందరూ భూమి మీదకు కాంతిని తీసుకురావాలనే లోతైన ఉత్సాహంతో ఉన్నారు మరియు అదే సమయంలో మీరు పాత గాయాలైన తిరస్కరణను మరియు ఒంటరితనాన్ని మీ అంతరంలో మోస్తున్నారు. దీని వలన, మీరు భూమితో ప్రేమపూర్వకమైన మరియు సురక్షితమైన బంధాన్ని అనుభూతి చెందడం అన్నది మీకు అంత సులభం కాదు. కాని మీరు ఈ అనుభవం వలనే, కొత్త పిల్లలు వారి శక్తిని స్థిరపరుచుకోడానికి మరియు వారి జీవితాలను సమర్ధవంతంగా నడిపించుకోవడానికి సహాయం చేయగలరు. అందువలనే మీకు అధిక ప్రాముఖ్యత ఉంది. మీ అంతట మీరుగా భూ వాస్తవంతో ప్రేమపూర్వకమైన సంబంధాన్ని అనుభవించడం అనేది ఒక అర్హత లాంటిది. ఇదే ఈ పిల్లలకు శిక్షణను ఇస్తూ వారికి సహకరించడానికి మరియు వారికి అవసరమైన మనోభావసంబంధిత భద్రతను అందించడానికి మీకు ఉపయోగపడుతుంది.

ఈ పిల్లలు ఎదుర్కొనే కొన్ని సమస్యల గురించి ఇప్పుడు చెప్పాలనుకుంటున్నాను మరియు ఎప్పుడైనా మీరు ఈ పిల్లలతో తల్లి/తండ్రిగా లేదా గురువుగా లేదా థెరపిస్ట్‌గా బంధాన్ని కలిగి ఉన్నప్పుడు, మీరు వారికి ఏం చెయ్యగలరు. మీలో కొంతమంది వీరితో పని చేయడానికి పిలవబడినట్టుగా అనుభూతి చెందుతారు మరియు ఇది చాలా ప్రశంసనీయమైనది కూడా. ఎందుకంటే ముఖ్యంగా మీరు వారి యొక్క లక్ష్యాలు మరియు ఉత్తేజాల వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని గుర్తించగలిగే నైపుణ్యాన్ని కలిగిఉన్నారు కనుక. మీరు మీ బాల్యంలో లేదా పెద్దవారైన తర్వాత అణచివేతలను మరియు అదుపులను ఎదుర్కొని వాటిని హీల్ చేసుకున్నందు వలన, మీరు వీటికి సంబంధించిన లక్షణాలను ఈ పిల్లల్లో సులభంగా గుర్తించగలరు కాబట్టి. ఈ పిల్లలతో వ్యవహరించడం అనేది మిమ్మల్ని మనోభావ స్థాయిలో చాలా లోతుగా ప్రభావితం చెయ్యగలదు. ఎందుకంటే మీరు మీ యొక్క ప్రతిబింబాన్ని, మీ సొంత ప్రేమను, మీ సహజత్వాన్ని మరియు మీ బాధను కూడా వారిలో చూస్తారు. నిజానికి ఈ పిల్లలు మీలాగే భూమి మీదకి సరిగ్గా ఆహ్వానింపబడలేదనే బాధ యొక్క అనుభూతిని పొందవచ్చు. కాలాలు మారుతున్నప్పటికీ కూడా, పిల్లల ప్రకంపనానికి మరియు వారి యొక్క చైతన్యపు స్థాయికి తగిన వ్యక్తీకరణ రూపాలను కనుగొంటారా లేదా అనే విషయం ఇప్పటికి అస్పష్టంగానే ఉంది. దీనికి చాలా కారణాలు ఉన్నాయి.

మొదటి కారణం ఏమిటంటే: పిల్లల యొక్క శక్తి లేదా ప్రకంపనం, భూమి మరియు సామూహిక మానవచైతన్యం యొక్క శక్తికి తగినట్టుగా ఇప్పటికి సరిపడకపోవడమే. ఈ పిల్లలు సమయాని కన్నా ముందున్నారు. మీ అనుభవం వలన మీకు పాతదనం మరియు కొత్తదనాల మధ్య ఉన్న అవగాహనా లోపం గురించి బాగా తెలుసు. మీ అంతరంలో జ్ఞానాన్ని మరియు హృదయపూర్వక మేధాసంపత్తిని కలిగిఉన్నారు. పాత తరంవారు మీ ప్రస్తుత సామాజిక వాస్తవానికి తగినట్టుగా ఉండలేకపోతున్నారు. ఈ వాస్తవం, పాతుకుపోయిన సాంప్రదాయక విలువలు మరియు అభిప్రాయాలకు వ్యతిరేకంగా వెళ్తోంది. ఈ వాస్తవం సందేశాలకు మరియు అపనమ్మకాలకు దారి తీస్తోంది. పిల్లలు ఈ ప్రతిఘటనలతో కూడా వ్యవహరించాలి. ఎందుకంటే ఇవి ఇంకా అంతరించిపోలేదు కాబట్టి. భూమి అధిక సాంద్రతను కలిగి ఉండడం వలన భూ వాస్తవం నెమ్మదితనాన్ని కలిగి ఉంటోంది – ఇదే రెండవ కారణం. అందువలనే కలలు మరియు కోరికలు త్వరగాను లేదా సులభంగాను నెరవేరవు. మీరు నిజంగా మీ లోతైన ఉత్తేజాన్ని సాధించాలనుకుంటే, మీరు భూమికి సంబంధించిన అన్ని స్థాయిలతోను మీ అంతట మీరుగా బంధాన్ని ఏర్పరుచుకోవాలి: మనోభావ, శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక స్థాయిలు.

అప్పుడే మీ శక్తి సారవంతమైన ప్రదేశాన్ని కనుగొనగలదు మరియు ఆ తర్వాతనే మీ ఆత్మ యొక్క విత్తనాలు మొలకెత్తి వికసించగలవు.

కొత్తశకం పిల్లలు వారంతట వారుగా స్థిరపడడం అన్నది చాలా ముఖ్యం, దీని అర్థం ఈ పిల్లలు విశ్వశక్తితో బంధాన్ని ఎలా ఏర్పరుచుకోవాలనేది తెలుసుకోవాలి. ఈ శక్తే, భూవాస్తవానికి స్వచ్ఛతను, ప్రేమను మరియు ఉత్తేజాన్ని ఇస్తుంది. ఈ శక్తివంతమైన భూ తలంలోకి వీరి యొక్క ఆత్మ శక్తిని ప్రసరింపజేయాలంటే వీరు సహనాన్ని పెంపొందించుకోవడం చాలా ముఖ్యం. ఇంకా వెనుకబడే ఉన్న మానవత్వం మరియు సమాజానికి సంబంధించిన భాగాలతో సహనంగా ఉండడం అన్నది కూడా చాలా ముఖ్యం. ఇప్పటికీ ఈ భాగాలు పిల్లలు అందిస్తున్న జ్ఞానాన్ని గ్రహించలేక పోతున్నాయి, లేదా పిల్లల ప్రవర్తన మొండితనాన్ని మరియు తిరుగుబాటు వైఖరిని కలిగి ఉన్నదని ఈ భాగాలు వివరిస్తాయి కూడా.

ఇక్కడ పాతదనానికి మరియు కొత్తదనానికి మధ్య ఏర్పడుతున్న ఘర్షణలు సమస్యలకు దారి తీస్తున్నాయి. కొత్త పిల్లల యొక్క శక్తి తరచూ పాత మనస్తత్వాలు గల మనుష్యుల ద్వారా చెడుగా అర్థం చేసుకోబడుతోంది. పిల్లలకు సంబంధించిన నైపుణ్యాలు మరియు వ్యక్తిత్వం యొక్క సంపూర్ణమైన అభివృద్ధికి – క్రమశిక్షణ, పద్ధతి మరియు వినయం అవసరమని ఈ మనుష్యులు విశ్వసిస్తుంటారు. ఇప్పుడు నిజానికి మీరు ఒక్కరే పాతదనం మరియు కొత్తదనాల మధ్యలో నిలబడి ఉంటూ, వీటి మధ్య వారధిని నిర్మిస్తున్నారు. మీ నిజమైన ఆధ్యాత్మిక శక్తిని అదుపుచేస్తూ మరియు అంతరంలో ఎక్కువగా పట్టి ఉంచడం వలన, మీరు తీవ్రమైన బాధకు లోనయ్యారు. మీ వ్యక్తిగత భావప్రకటనలో ఇరుక్కుపోయిన అనుభూతి ఎలా ఉంటుందో మీకు బాగా తెలుసు. అందువలన మీరు కొత్త పిల్లలను బాగా అర్థం చేసుకుంటారు. అనుభూతులను అణచివేస్తున్న మరియు అధికారాల మీద ఆధారపడిన నియమాలను ఛేధించి వాటి నుంచి స్వేచ్ఛను పొందాలనే ఈ పిల్లల యొక్క కోరికను మీరు అర్థం చేసుకుంటారు.

ఈ పిల్లలు వారి స్వంత అన్వేషణకు మరియు వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి కావలసిన సమయాన్ని కల్పించుకోవాలి మరియు అదే సమయంలో అధికారిక క్రమశిక్షణకు వ్యతిరేకంగా ఉన్న "ప్రేమపూర్వకమైన క్రమశిక్షణ" యొక్క విలువను అర్థం చేసుకోవాలి. ఈ పిల్లలు వారిని వారు అణచివేసుకోకుండా వారి యొక్క సొంత శక్తిని ప్రసరింపజేసే విధానాన్ని మరియు దానితో వ్యవహరించే విధానాన్ని నేర్చుకోవాలి. క్లుప్తంగా చెప్పాలంటే, మీ సొంత అంతర్ మార్గంలో మీతో మీరు వ్యవహరించాలి అని. మీ విశ్వశక్తిని, మీ అంతర్ కాంతి యొక్క వెలుగును మీ

శరీరం ద్వారా భూ వాస్తవంలోకి ప్రసరింపజేయడం అనేది మీ అందరికి చాలా ముఖ్యమైన విషయం. ముఖ్యంగా దీని అర్థం, నిజంగా మీరు ఇప్పుడు-ఇక్కడ ఉండడానికి మరియు భౌతిక వాస్తవంలో మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకోవడానికి అడ్డుకుంటున్న మీ మనోభావాలతో వ్యవహరించాలి అని.

లైట్‌వర్కర్స్ ఆత్మలు ఎదుర్కొంటున్న ఒకానొక పెద్ద సమస్య: వీరి శక్తిక్షేత్రం యొక్క పై భాగంలో (భుజాలు మరియు తల) ఆధ్యాత్మిక శక్తిని ఎక్కువగా మోయడమే. ఈ శక్తి పై భాగంలో నిలిచిపోయి, క్రిందకు వెళ్ళే మార్గాన్ని కనుగొనలేకపోతోంది. ఈ శక్తి భూమితో సరైన బంధాన్ని ఏర్పరుచుకోలేకపోతోంది. మరొక రకంగా చెప్పాలంటే, మీరు మీ శక్తిని అంతరంలో నిలిపి ఉంచడం వలన, మిమ్మల్ని మీరు సంతృప్తికరంగా వ్యక్తపరుచుకో లేకపోవడాన్ని అనుభూతి చెందుతున్నారు. ఇది మీ వ్యక్తిగత బంధాలలోనూ లేదా మీ ఉద్యోగ వాతావరణంలోనూ ఏర్పడవచ్చు. మీరు ఈ విషయాలలో ఉండగలిగిన దాని కన్నా కూడా తక్కువ సంతృప్తిని మరియు తక్కువ సృజనాత్మకతను కలిగిఉన్నట్టుగా అనుభూతి చెందవచ్చు. దీనంతటికి గల కారణం మీరు భూమి మీద పూర్తి స్థిరంగా ఉండలేకపోవడమే. ఈ శక్తి క్రిందకు ప్రవహించకపోవడానికి మరియు మానవశరీరరంలో పూర్తిగా ఉండలేకపోవడానికి గల కారణం: మీ పొట్టభాగంలో ఉన్న మనోభావసంబంధిత గాయాలే ఈ శక్తి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. అందువలన మనోభావపరంగా హీలింగ్ అవసరం ఉన్న  ఈ భాగాల మీద మీ శ్రద్ధను మరియు ఎరుకను పెట్టడం అన్నది చాలా ముఖ్యం.

మీరు పూర్తి ఆకృతిని మరియు స్థిరత్వాన్ని కలిగిన ఆధ్యాత్మికతను పొందడం మరియు మీ శక్తిక్షేత్రం యొక్క పై భాగంలో శక్తిని బంధించకుండా ఉంచడం అనేది చాలా ముఖ్యం. ఈ విధంగా బంధించినట్లయితే, ఈ శక్తి ఆధ్యాత్మికత యొక్క అనుభవంలేని మరియు సమన్వయంలేని రూపానికి దారి తీయవచ్చు. ఇది అప్పుడప్పుడు మీకు గొప్ప ఆనందానుభూతిని మరియు గొప్ప ఉత్సాహాన్ని అందించవచ్చు, కాని ఇది "శరీరం" భూమితో నిజమైన బంధాన్ని ఏర్పరుచుకోనివ్వకుండా చేస్తోంది మరియు ఈ శక్తి తనను తానుగా ఒక సంతృప్తికరమైన  ఉద్యోగంగాను, ఒక స్థిరమైన మరియు ప్రేమపూర్వకమైన బంధంగాను మరియు/లేదా భౌతిక సమృద్ధిగాను బాహ్యంగా వ్యక్తీకరించుకో లేకపోతోంది. ఆధ్యాత్మిక శక్తి, మనోభావశరీరంతో తప్పక బంధాన్ని ఏర్పర్చుకోవాలి మరియు ఆ మనోభావశరీరం నుంచి భౌతిక వాస్తవంతోను బంధాన్ని ఏర్పర్చుకోవాలి. శక్తి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నవి మీ పాతగాయాలే: మనోభావాలైన

భయం మరియు కోపం, చులకనభావం యొక్క అనుభూతి, నిరాశ మరియు జీవితంపట్ల ద్వేషం. మీరు ఈ మనోభావసంబంధిత అడ్డులకు వ్యతిరేకంగా ఘర్షణ పడుతుంటారు. ఈ ప్రాథమికమైన మనోభావసంబంధిత సమస్యలతో వ్యవహరించడం అన్నది, కొత్త పిల్లలకు సహకరించడానికి అవసరమైన మార్గాలను కనుగొనడంలో ఇది ముఖ్యమైన పాత్రను పోషిస్తుందనే విషయాన్ని నేను మీకు చెబుతున్నాను. మీ మనోభావపరమైన హీలింగ్ అనేది మీకు సహకరిస్తుంది, దీని అర్థం ప్రేమతో కూడిన క్రమశిక్షణా మార్గంలో పిల్లలు వారంతట వారుగా స్థిరపడడానికి ఈ హీలింగ్ సహకరిస్తుంది అని. ఎందుకంటే ఈ విషయాలతో క్షుణ్ణంగా వ్యవహరించడం వలన, మీరు పిల్లలకి ఒక శక్తివంతమైన మార్గాన్ని ఏర్పరుస్తారు.

మనోభావసంబంధిత హీలింగ్ అంటే అర్థమేమిటి? నేను దీని గురించి మళ్ళీ మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ అంశం గురించి ముందు ఛాప్టర్‌లలో(మనోభావాలతో వ్యవహరించే విధానం ఛాప్టర్‌లో) స్పష్టంగా వివరించాను. మనోభావాలను అణిచివేసిన కాలాల గురించి మరియు వీటిని స్వల్పంగాను లేదా అధికంగాను సాంప్రదాయ విరుద్ధాంశాలుగా పరిగణించిన సమయాల గురించి మీ అందరికి బాగా తెలుసు. ముఖ్యంగా మీలో కొంతమంది పెద్దవారు మనోభావాలను అణిచి వేయడాన్ని ఆదర్శంగా తీసుకున్న తరంలో పెరిగారు. 60వ దశాబ్దాలలో ఈ విరుద్ధాంశాలను వ్యతిరేకిస్తూ, మనోభావాలకు స్వేచ్ఛను ఇచ్చారు, దీని వలన కొన్నిసార్లు విషాదానికి గురయ్యేవారు. సాంప్రదాయకపు హద్దులను స్వేచ్ఛగా పరీక్షించడం మరియు నిరాకరించడం కోసం హేతువాదాన్ని తాత్కాలికంగా ప్రక్కన పెట్టారు. ఇలా చేయడం అనేది కొంతవరకూ ఫలితాన్ని ఇచ్చింది. అణిచివేసిన మనోభావసంబంధిత శక్తులను స్వేచ్ఛగా అన్వేషించడంలో కూడా కొన్ని అడ్డులు ఉన్నాయి. ఈ మనోభావాలకు స్వేచ్ఛగా అధికారాన్ని ఇచ్చినప్పుడు మరియు మిమ్మల్ని అదుపు చేయడానికి వాటిని అనుమతించినప్పుడు, ఇవి పరివర్తనం చెందలేవు మరియు హీల్ కాలేవు.

ఆధ్యాత్మిక స్వేచ్ఛ యొక్క సారాంశం ఏమిటంటే, అన్ని మనోభావాలను గుర్తిస్తూ మరియు వాటిని మీలో ఉండడానికి అనుమతించడమే, మరియు అదే సమయంలో పూర్తి స్పృహతో అంటే మీ సొంత దివ్యత్వపు చైతన్యంతో వాటిని కౌగిలించుకోవడమే. మీ అంతరంలోని పరిష్కరింపబడని(అస్పష్టమైన) మనోభావపరమైన శక్తులు చిన్న పిల్లల్లాంటివి: అలజడి, బాధ లేదా పిరికితనం మొదలైన మనోభావాలు మీ దగ్గరకు ఓదార్పు కోసం వస్తాయి. ఇక్కడ, మీ దగ్గరకు అంటే: మీలోని దైవం

లేదా ప్రజ్ఞాత్మ అని. ఈ విధంగా మీ ప్రజ్ఞాత్మ, మీ దివ్యత్వం, మీ సొంత మనోభావశరీరాన్ని హీల్ చేయడానికి పై నుంచి దిగి వస్తుంది. ఇదే మీ ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. మీరు ఈ విధంగా చేసినప్పుడు, మీ కాంతి క్రింది వైపుగా, క్రింది మూడు చక్రాల ద్వారానూ, మీ చేతులు మరియు కాళ్ళ ద్వారానూ ఈ ప్రపంచంలోకి ప్రవహిస్తుంది. మీ దివ్యత్వం లేదా ఆత్మశక్తిని భూమి మీద స్థిరపర్చడమంటే అర్థం ఇదే.

ఈ ప్రక్రియకు వ్యక్తిగత క్రమశిక్షణ అనేది అవసరం. నేను క్రమశిక్షణ అనే పదాన్ని ఉపయోగించడానికి గల కారణం: ఇది యాంత్రికంగా జరుగదు కాబట్టి. మీరు వ్యక్తిగత హీలింగ్ ప్రక్రియలో, నిజాయితీతోను మరియు శ్రద్ధతోను మీ అంతర్ జీవితంపై దృష్టిని కేంద్రీకరించడం చాలా అవసరం. అంతరంలో ఉన్న మనోభావాలన్నింటిని ఎదుర్కొనడానికి సుముఖతను చూపాలి. దీని అర్థం వీటిని మీ సొంత వాటిగా గుర్తిస్తూ, వీటి యొక్క పూర్తి బాధ్యతను స్వీకరించడమే. గతం, ఇతరులు లేదా సమాజం యొక్క బాధితుడుగా భావించకుండా ఉండాలి. మీరు బాధితులు కాదు, మీరు ప్రజ్ఞాత్మలు. ఈ మనోభావాలను స్వీకరించి మరియు వాటిని పరివర్తనం చెందించగలిగే శక్తి మీకు ఉంది. మీ భయం, కోపం మరియు బాధల యొక్క శక్తులను – ప్రేమ, క్షమాపణ మరియు అవగాహన యొక్క శక్తులుగా పరివర్తనం చెందించడానికే మీరు భూమి మీదకు వచ్చారు. ఈ విధంగా చేయడం ద్వారా, మీ కోసం మీరు ఆనందం మరియు పరిపూర్ణత్వం కలిగిన జీవితాన్ని సృష్టించుకోగలరు మరియు భూ వాస్తవంతో ప్రశాంతంగా ఉండగలరు. ఇలా చేయడం ద్వారా, మీరు భూమి మీద జన్మించిన మరియు జన్మించబోతున్న కొత్త పిల్లల కోసం శక్తివంతమైన త్రోవను సిద్ధం చేస్తారు. వీరు ఉన్నతమైన శక్తితో ఇక్కడకి వస్తున్నారు. ప్రధాన అన్వేషకుడిగా మీరు చేసిన పనికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను, కాని ఈ శక్తి భూమి మీద స్థిరమైన ప్రదేశాన్ని కనుగొంటుందనే హామీని మాత్రం ఇవ్వలేను.

ఈ పిల్లల యొక్క కొత్తదనం మరియు ప్రత్యేక లక్షణాలను అనుమతించే ప్రదేశాన్ని మనమందరం కలిసి అతిపెద్ద ఎత్తున సిద్ధం చేయాలి. మనం ఈ పిల్లలను స్వాగతిస్తూ మరియు వీరి శక్తిని స్వేచ్ఛగా వ్యక్తపరుచుకోవడానికి అనుమతించాలి. అదే సమయంలో భూవాస్తవం మీద వీరి శక్తిని ప్రసరింపజేయడం కోసం అవసరమైన సహనాన్ని మరియు గమనికను ఎలా అభివృద్ధి చేసుకోవాలో కూడా వీరికి నేర్పించాలి. ఈ పిల్లలు వీరి యొక్క ఆత్మశక్తిని మరియు వీరి యొక్క విశ్వసంబంధిత ఉత్తేజాన్ని, భూమికి సంబంధించిన భౌతిక ఆకృతులలో వ్యక్తపరచాల్సిన అవసరం ఉంది.

అందువలన ఈ పిల్లలు వారిని వారు మనోభావ, మానసిక, సృజనాత్మక మరియు ఆధ్యాత్మికపరంగాను భాషద్వారా, సంభాషణద్వారా మరియు వ్యవస్థలలో వ్యక్తపరుచుకోవడాన్ని తప్పక అనుభూతి చెందాలి. భూ వాస్తవంలోకి వీరి శక్తిని తీసుకురావడానికి వీరు ఆహ్వానింపబడినట్లు అనుభూతి చెందడం అన్నది చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ శక్తిని తీసుకురావడంలో వీరు అంతర్ లేదా బాహ్య ప్రతిఘటనల మరియు ఇబ్బందుల ద్వారా పయనించాలి కాబట్టి.

కొత్తపిల్లల యొక్క సందేశం ఏమిటంటే వీరు భూమితో ప్రేమపూర్వకమైన బంధాన్ని ఏర్పరుచుకోవడానికి మనం ఈ పిల్లలకు సహాయం చేసినప్పుడే, వీరు వీరి యొక్క స్పష్టమైన క్రిస్టల్‌శక్తిని ఈ సారవంతమైన ప్రదేశంలోకి తీసుకురాగలరని. దీని కోసమే మీకు మీరుగా ప్రాథమికమైన పరివర్తన ప్రక్రియ ద్వారా పయనిస్తున్నారు. ఈ ప్రక్రియలో మనోభావశరీరమే అతి ముఖ్యమైనది. మీరందరూ మీ లోతైన మనోభావాల యొక్క బాధ్యతను స్వీకరించే ప్రక్రియలో ఉన్నారు మరియు క్రమక్రమంగా వీటిని మీ సొంత దివ్యత్వపు చైతన్యం యొక్క కాంతిలో విడుదల చేస్తున్నారు. ఈ భూ తలంలో మీరు అనుభవించే లోతైన భయం మరియు విచారాలపై మీ ప్రజ్ఞాత్మ కరుణను కలిగి ఉంటుంది. కరుణ అనేది క్రీస్తుశక్తి యొక్క సారాంశానికి సంబంధించినది. ఇది చీకటి కమ్ముకున్న అట్టడుగు ప్రదేశాలలోకి దిగి వస్తూ, కాంతి యొక్క ఉనికిని మీకు తెలిసేలా చేస్తుంది. ప్రేమ మరియు భద్రత యొక్క విశ్వతలాల్లో కాంతిని ప్రసరింపజేయడం అంత గొప్ప విషయమేమి కాదు.

నిజమైన క్రీస్తుశక్తి యొక్క బలం, చీకటి కణాలను ఛేదిస్తూ నిరాశ కమ్ముకుని ఉన్న ప్రదేశాలలో ప్రేమను తీసుకువస్తుంది. భూమి అనేది ఒక అందమైన మరియు విలువైన గ్రహం. ఇది ఇప్పటికీ ప్రేమ మరియు ఏకత్వం నుంచి తొలగించబడినది. అందువలన క్రీస్తుశక్తి, ఇక్కడ విత్తనాలను వెదజల్లుతూ కొత్త ప్రదేశాలను వికసించేలా చేస్తోంది. మీరందరూ ఈ విత్తనం యొక్క మొలకలు మరియు కొత్తశకం యొక్క ప్రధాన అన్వేషకులు. మీ మార్గం కష్టంగాను మరియు భారంగాను కనిపించినప్పటికీ కూడా, మీరందరూ గొప్ప విజయాన్ని సాధించారు. ఇప్పుడు భూమి మీదకి పడుతున్న కాంతి శక్తి యొక్క కొత్త తరంగం రావడానికి కారణమైన ప్రవేశద్వారాలను తెరవడానికి, మీ అంతర్ మార్పుల ద్వారానే సహకరించారు.

ఇప్పటికీ, అది అంత సులభం కాదు. ఇప్పటికీ, అధికంగా చీకటి పైకి వస్తోంది: అధికార దౌర్జన్యం, భయం, పాతదనం యొక్క శక్తి. అందువలన మీ లక్ష్యంపై విశ్వాసాన్ని ఉంచమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను: మీ మొలకెత్తిన

క్రీస్తుశక్తి యొక్క కాంతిని, మీ సొంత అంతర్‌చీకటిలోకి తీసుకురావాలి. కొత్తశకం యొక్క పిల్లలు మీకు కృతజ్ఞులై ఉంటారు. ఈ పిల్లలకి మీ అవసరం ఉంది, దీనికి బదులుగా వారు కూడా మీకు ఏదో కొత్తదనాన్ని అందిస్తారు. వీరి హృదయంలో ఆనందాన్ని, అద్భుతమైన స్వచ్ఛతను, ఇంటి యొక్క సజీవమైన జ్ఞాపకాలను కలిగిఉంటారు. వీరు వికసిస్తున్న పుష్పంలా, ఆనందం మరియు ప్రేమతో ప్రకాశిస్తుంటారు. ఈ శక్తి మీ హృదయాలను తెరుస్తూ, మీలో ఆహ్లాదకరమైన మరియు తేలికైన హృదయభావనలను రేకెత్తిస్తుంది. మీరందరూ పాతదనంలో చాలా అనుభవాల ద్వారా ప్రయాణించి విసుగు చెందారు. మీరు కొత్తవారికి మీ చేతులను అందించండి! మీ సహకారం మరియు అనుభవం వీరికి అవసరం. మీ జీవితాలలోకి ప్రేమ మరియు ఆనందాన్ని వీరు తీసుకువస్తారు. మీరు పిల్లలతో ప్రత్యక్షంగాను మరియు పరోక్షంగాను వ్యవహరిస్తున్నా కూడా ఈ ప్రక్రియ మీ అందరిని స్పృశిస్తుంది. ఇది మీ అందరిని కదిలిస్తుంది.

నేను ఈ అంశాన్ని ముగించే ముందు, ఒక్కక్షణం నిశ్శబ్ధంగా ఉంటూ భూమితో బంధాన్ని ఏర్పరుచుకోమని కోరుతున్నాను. భూమి ఒక తెలివైన వ్యక్తిత్వం గల ఆత్మ. ఇది కొత్త పిల్లల యొక్క రాక గురించి ఎదురుచూస్తోంది. ఆమె మిమ్మల్ని చూస్తున్నప్పుడు తనలో తను మురిసిపోతోంది. ఎందుకంటే మీరు ఇక్కడకు వచ్చినప్పుడు మీరు కూడా అలాంటి అందమైన పిల్లలే కాబట్టి. మీరు ప్రధాన అన్వేషకులు మరియు మధ్యవర్తులు. మీ పట్ల భూమి చూపిస్తున్న కృతజ్ఞతను అనుభూతి చెందండి. మీరు ఈ సుదీర్ఘ ప్రక్రియతో ఎక్కువగా కలుపబడి ఉన్నారు. మీరు పూర్తి ఉత్సాహం మరియు ఉత్తేజం కలిగిఉన్న కొత్తపిల్లల యొక్క రాకను అనుభూతి చెందండి. మీకు సహాయం చేయడానికే వీరు ఇక్కడ ఉన్నారు. వీరి యొక్క చురుకుదనం మరియు మేధాసంపత్తి మిమ్మల్ని ఉత్తేజపరుస్తాయి. కొత్తయుగం ఉదయిస్తోందని, మీ ఇంటికి ఇప్పుడు చేరువవుతున్నారని మరియు ప్రేమ-శాంతి యొక్క పుష్పాలు నిజంగా వికసించబోతున్నాయని ఈ పిల్లలు మీకు గుర్తుచేస్తారు.

* * * *

## మన పిల్లలకి గైడ్ చెయ్యడం

మై డియర్ ఫ్రెండ్స్,

నేను మేరీని, జెషువా తల్లిని. నేను మీకు నమస్కరిస్తున్నాను. ఇక్కడ ఈ రోజు ఇలా మీతో ఉండడం నాకు చాలా ఆనందంగా ఉంది మరియు ఈ సమయంలో మీరు భూమి మీద ఉండడాన్ని మనం ఒక వేడుకగా జరుపుకుందాం. నేను ఈరోజు అంశాన్ని చర్చించే ముందు, మీ మీద దృష్టి పెట్టాలనుకుంటున్నాను. మీరు ప్రతిరోజూ భూమి మీద మీ కాంతి మరియు అంతరాత్మల యొక్క రూపాన్ని మరింతగా నెలకొల్పడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. మీరు తరచూ మీ జీవితాలలో ఉన్న భారాన్ని అనుభవిస్తున్నారు మరియు ఇది కొన్నిసార్లు మీ శరీరంలో ఖైదు చేయబడినట్టుగాను లేదా మీకు ఊపిరాడకుండా చేస్తున్న మనస్తత్వాలు మరియు మనోభావాలలో బంధీ అయినట్లుగాను మీకు అనిపించవచ్చు.

మీ జీవితాలలో మీరు అనుభవిస్తున్న మరియు సాధిస్తున్న వాటన్నింటి పట్ల మాకు విశ్వాసం మరియు గౌరవభావం ఉన్నాయనే విషయాన్ని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. మేము మిమ్మల్ని ఉన్నదిఉన్నట్టుగా ప్రేమిస్తున్నాం. మీ పట్ల మీకు మరియు మీ జీవితంలో ఇంతవరకూ మీరు అనుభవించిన విషయాలన్నింటి పట్ల మరింత గౌరవాన్ని కలిగి ఉండాలని మేము కోరుకుంటున్నాం. మీ చుట్టూ ఉన్న కాంతి తాత్కాలికంగా తగ్గిపోతున్నప్పటికి, మీ కలలను మరియు మీ లక్ష్యాలను ఆశాజనకంగా పెంపొందించడానికి ప్రయత్నించండి, మరియు మీ ప్రగతిని నిరోధిస్తున్న వాటితో వ్యవహరించాల్సి వచ్చినప్పుడు, మీరు మీ గొప్పదనాన్ని మరియు సాటిలేని సామర్థ్యాన్ని చూపించండి. మీరు భూమి మీద కాంతి యొక్క బీజాలను నాటుతున్నారు మరియు ఇవి ఫలాలను అందిస్తాయి. మీ అంతర్ పనికి మా కృతజ్ఞతలు. భూమి మీద తమ కాంతిని ప్రకాశింపజేయడానికి జన్మిస్తున్న కొత్తతరం ఆత్మలకు మీరు వారధిని నిర్మించారు. మేము ఈ రోజు ఈ ఆత్మల గురించి మాట్లాడాలని అనుకుంటున్నాము.

నేను వీరి గురించి మాట్లాడే ముందు, మీరు ఒక కొత్త శిశువుగా భూతలంలో జన్మించిన సమయంలోకి తిరిగి వెళ్ళమని మరియు మీరు ఎవరనే దానిని అనుభూతి చెందమని మిమ్మల్ని అడుగుతున్నాను. అప్పటి మీ శక్తి యొక్క అమాయకత్వాన్ని మరియు సౌందర్యాన్ని అనుభూతి చెందండి. మీ వాంఛల యొక్క నిజాయితీని మరియు మీ శక్తి యొక్క సున్నితత్వాన్ని అనుభవించండి. ఓహ్, మీరు

చాలా కాలంగా భూమికి కలుపబడి ఉన్నారు! చాలాసార్లు మీరు భూమి మీదకి ఒక చిన్నశిశువుగా దిగివచ్చారు. ఈ సారి మీ జన్మ యొక్క వాంఛ ఏమిటనేది అనుభూతి చెందండి. మీరు పరిష్కరించుకోవాలని కోరుకున్న వ్యక్తిగత భారాన్ని ఈ జన్మలో మీతో తీసుకువచ్చారు. మీరు హీల్ చేసుకోవాలనుకున్న మరియు అధిగమించాలనుకున్న గాయాలు, మీ ఆత్మ లోతులలో ఉండి ఉండవచ్చు. మీరు ఈ లక్ష్యంతోనే కాకుండా విశాలమైన మరియు విశ్వసంబంధిత ఆదర్శం ద్వారా కూడా నడుపబడుతున్నారు. ఇది భూమి మీద ఆధ్యాత్మిక ఎరుకను మరియు అభివృద్ధిని పెంపొందించడానికి సంబంధించినది. మీరు పరివర్తనం యొక్క యుగంలో, కష్టమైన సమస్యలు అదే విధంగా అవకాశం ఉన్న యుగంలో జన్మించబోతున్నారనే విషయం మీకు ముందే తెలుసు. మీరు అక్కడ “చేయాల్సిన పని ఉందని”, అంటే అంతరంలో చేసేపని వలన ఆలోచనారీతి మరియు అనుభూతులలో కొత్తమార్గాలు తెరవబడతాయని కూడా మీకు ముందే తెలుసు. మీరు భూమి మీద సంభవిస్తున్న ఈ గొప్ప భౌగోళిక పరివర్తనంతో బంధం ఉన్నట్లు అనుభూతి చెందారు. మీరు ప్రశాంతమైన భూమి యొక్క ఈ పాత దృశ్యాన్ని నిజం చేయడానికి అవసరమైన సహాయాన్ని అందించడం కోసం, మీరు మరొకసారి భూమి మీదకి రావడానికి సిద్ధపడ్డారు: మనుష్యుల మధ్య కొత్త ఐకమత్యపు చైతన్యం మరియు భూమి మీద ఉన్న జీవులన్నింటి మధ్య సరికొత్త సమన్వయానికి సంబంధించినదే ఈ దృశ్యం.

మీరు చాలా యుగాలలో ఆలోచనారీతి మరియు అనుభూతుల యొక్క పాత సరిహద్దుల ద్వారా పయనిస్తూ వాటిని ఛేధించారు. మీరు సంప్రదాయకరమైన పద్ధతులు మరియు నియమాలలో ఊపిరాడనట్టి అనుభూతిని పొందిన ప్రతీసారి, మీరు వాటి నుంచి స్వేచ్ఛను పొందాల్సిన అవసరం ఉందని భావించేవారు. ఎందుకంటే భయం ఆధిపత్యాన్ని వహిస్తున్న వాతావరణంలో లేదా బంధాలలో, ఆత్మ వికసించలేదనే విషయాన్ని మీ లోతైన అంతరం ద్వారా తెలుసుకున్నారు కనుక. పాత పద్ధతులకి వీడ్కోలు చెప్పి, కొత్త మార్గాలలో పయనించడం మీకు చాలా బాధాకరంగా అనిపించింది. అవును, నిజానికి ఇది చాలా కష్టమైనది మరియు భారమైనది కూడా. కాని మీరు “మీకు సరిగ్గా లేదని, లేదా మీకు జ్ఞానాన్ని ఇవ్వదని లేక ఏదో కోల్పోతున్నారు అని” భావించిన మీ అంతర్ అనుభూతులతో నిజాయితీగా వ్యవహరించాల్సి వచ్చింది. ఈ ఇబ్బందికరమైన భావనలు, మీకు మీ ఆత్మ యొక్క వాంఛలను మరియు లక్ష్యాలను గుర్తుచేసాయి. మీరు సమాజం యొక్క ఆదేశాలకు మరియు పద్ధతులకు తగినట్టుగా ఉండలేకపోయారు. ఎందుకంటే, మీరు భూమి మీద ఆత్మగా జీవించాలనుకున్న పద్ధతికి అనుగుణంగా ఈ సమాజం లేదు కనుక. మీరు ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో

ఉండాలి అనే విధిరాత ద్వారా నిర్దేశింపబడ్డారు, ఇది దైవం ద్వారానో లేదా ఏ ఇతర శక్తుల ద్వారానో నిర్దేశింపబడినది కాదు, ఇది కేవలం మీ కోసం మీరు సృష్టించుకున్నది – ఎందుకంటే మీరెవరో అలాగే ఉండాలని అనుకున్నారు కనుక.

మీ ఆత్మచరిత్రకు సంబంధించిన ఒకానొక దశలో, మీరు ఒక కొత్త చైతన్యం ద్వారా ఉత్తేజింపబడ్డారు. మనం దీనిని క్రీస్తు చైతన్యంగాను, హృదయం నుంచి వచ్చే ఎరుకగాను, లేదా ప్రేమగాను పిలవవచ్చు. దీనిని మీరు ఎలా పిలుస్తున్నారు అనేది అంత ముఖ్యం కాదు. నిజానికి ఇక్కడ విషయమేమిటంటే, మీరు దీని ద్వారా స్పృశించబడుతున్నారు, అంటే మీరు ఈ ఉత్తేజం యొక్క వెలుగుచే తాకబడుతున్నారు అని. ఇది మీ చైతన్యాన్ని అన్వేషించడానికి, సాధించడానికి మరియు విస్తరింపజేయడానికి ముందుకు వెళ్ళమని మిమ్మల్ని ఎప్పటి నుంచో ప్రేరేపిస్తోంది. ఈ వెలుగు భూమి మీద కొత్త చైతన్యాన్ని ప్రసరింపజేస్తూ ప్రస్తుతం చాలామంది హృదయాలను తాకుతోంది. ఈ కారణం వలనే, "కొత్తశకం యొక్క పిల్లలు" ఇక్కడకు రమ్మని ఆహ్వానింపబడుతున్నట్లు అనుభూతి చెందుతున్నారు. ఈ కారణం వలనే, కొన్ని దశాబ్దాల నుంచి భూమి మీద జన్మిస్తున్నారు మరియు ప్రస్తుతం చాలా ఎక్కువ సంఖ్యలోను జన్మిస్తున్నారు. ఈ పిల్లలు, మీరు ఆరంభించిన దానిని పూర్తి చేయడం కోసమే ఇక్కడ ఉన్నారు.

మీరు ముందు తరానికి సంబంధించిన లైట్‌వర్కర్స్, సుమారుగా చెప్పాలంటే 1980 ముందు జన్మించిన కొత్తతరం యొక్క మార్గదర్శకులు మరియు ప్రధాన అన్వేషకులు. ఇప్పుడు ఏ ఆదర్శంతో అయితే "కొత్త పిల్లలు" వస్తున్నారో, అదే ఆదర్శంతో మీరు కూడా ఒకప్పుడు వచ్చారు; వీరు కూడా, మీరు ప్రేరేపింపబడిన అదే ఆత్మపిలుపుతోనే ఉత్తేజింపబడుతున్నారు. కాని ముఖ్యంగా 1960–70వ సమయాలలో మీ ద్వారా తెరవబడిన ప్రదేశాలు, సాంప్రదాయకమైన నమ్మకాలు మరియు లోతుగా పాతుకుపోయిన భయాల ద్వారా గుర్తించబడుతుండేవి. ఈ ప్రదేశాలు వ్యక్తిగత భావప్రకటన, మనోభావాలు, సృజనాత్మకత మరియు సంభోగం మొదలైన విషయాలకు సంబంధించినవి. ఇవన్నీ స్థిర అభిప్రాయాలు మరియు లోతైన భయాలతోనూ కప్పబడి ఉండేవి.

మీరు నలభై సంవత్సరాల వెనుకకు వెళ్ళినట్లయితే, అప్పుడు భూమి యొక్క సామూహిక శక్తిక్షేత్రం ఇప్పుడు ఉన్న దాని కంటే చాలా భిన్నంగా ఉండేది. ఇది తక్కువ పారదర్శకత్వాన్ని, మరింత సాంద్రతతోను మరియు చుట్టూ మబ్బులతోను కమ్ముకుని ఉండేది. అందువలనే భూమి మీదకి ఇప్పుడు వస్తున్నంత సులభంగా

ప్రేమపూర్వకమైన మరియు స్పష్టమైన శక్తులు ఒకానొకప్పుడు రాలేకపోయాయి. ప్రేమ మరియు స్పష్టతలు అభివృద్ధి చెందడానికి ఒకానొక కారణం: స్త్రీలు సమానహక్కుల కోసం ఉద్యమించడమే(20వ శతాబ్దం యొక్క మొదటిదశలో ఏర్పడినవి), లేదా మరొక విధంగా చెప్పాలంటే, స్త్రీశక్తి యొక్క సమానత్వం మరియు సాటిలేని లక్షణాల యొక్క ఎరుక వృద్ధి చెందడమే అని. స్త్రీశక్తి యొక్క పునరుద్ధరణ అత్యవసరంగా రూపొందడమన్నది జీవితంలోని అనుభూతి తలం యొక్క విలువ మరియు ఎరుక అభివృద్ధి చేసుకోవడానికి సహకరించింది. 1960–70వ సమయాలలో మనోభావం, ఇంగితజ్ఞానం మరియు సృజనాత్మకత యొక్క క్షేత్రాలు మరింతగా తెరవబడినాయి.

పాతతరం యొక్క లైట్‌వర్కర్స్ అధికంగా అంతర్‌పనిని చేశారు మరియు దీని కోసం వీరు ఎక్కువగా శ్రమించారు. ఎందుకంటే రాబోయే తరాలవారి కోసం కొత్త పరిధులను ఏర్పరిచే ముందు, వీరు వ్యక్తిగత సందేహం మరియు ఒంటరితనం యొక్క అంతర్ లోయలను అధిగమించాలి కనుక. మీరు ఆ పాత తరంలో భాగంగా ఉన్నట్లయితే, మీ తర్వాత వచ్చే వారికి కాంతి దీపపుస్తంభాన్ని నెలకొల్పారనే విషయాన్ని తెలుసుకోండి.

ఇప్పుడు మీరు కొత్తతరానికి వెలుగును చూపిస్తున్నారు. మీరు దీనిని ప్రసరింపజేయడం ద్వారా, మీరు వారికి సహకారాన్ని మరియు ప్రోత్సాహాన్ని అందిచగలరు. అదే సమయంలో, వీరు వీరి హృదయం యొక్క స్వచ్ఛత మరియు వీరి యొక్క ఆశయం ద్వారా మిమ్మల్ని ప్రోత్సహించగలరు. వీరు మీ కంటే కూడా చాలా భిన్నంగా ఉంటారు. నిజానికి మీకు అనుకూలంగా లేని పరిస్థితులకు కూడా మీరు పాక్షికంగాను లేదా తాత్కాలికంగాను శృతి కాగలరు, కాని ఈ పిల్లలు బాహ్యప్రవర్తన యొక్క స్థితికి కూడా శృతి కాలేకపోతున్నారు. మరొక రకంగా చెప్పాలంటే వీరు ఏ చిన్న విషయంలోనైనా సరే కృత్రిమంగా ఉండలేరు. వీరు పరిమిత శక్తులైన సాంప్రదాయకపు విద్యా పద్ధతులను లేదా పిల్లల పెంపకం యొక్క విధానాలను ఎదుర్కొంటున్నప్పుడు, వీరి మనోభావాలలోను మరియు భౌతిక శరీరం యొక్క లోతుల్లోను తీవ్ర అసమ్మతి రేకెత్తుతోంది. చాలామంది పిల్లలకు సర్దుకుపోయి ఉండడాన్ని ఇష్టపడట్లేదు. ముఖ్యంగా వీరిలో అతి సున్నితంగా ఉన్న పిల్లలు, పాతశక్తి వాతావరణాలతో శారీరకంగాను మరియు మనోభావపరంగాను ఘర్షణ పడుతుంటారు. వీరి ప్రవర్తన చాలా ఇబ్బందికరంగా తయారవుతూ, పరిస్థితులే వీరికి తగినట్టుగా మార్పుచెందాల్సిన అవసరం వస్తుంది. సమస్యలను అణచివేయడం లేదా వదిలివేయడం అన్నది ఎంతమాత్రం సాధ్యంకాదు. ఇప్పుడు జన్మిస్తున్న పిల్లలు, వీరి గురించి మరియు

జీవితం గురించి వీరు కలిగిఉన్న అభిప్రాయాలకు తగినట్టుగానే ప్రతిబింబించమని సమాజంపై ఒత్తిడిని తీసుకువస్తారు.

ఇప్పుడు జన్మిస్తున్న పిల్లలు(మరియు కొన్ని దశాబ్దాలుగా భూమి మీద జన్మించిన పిల్లలు) పూర్తి ఆత్మచైతన్యం యొక్క భాగాన్ని, మీ కంటే ఎక్కువగా భూ తలంలోకి తీసుకువస్తున్నారు. మీరు భూ తలంలోకి ప్రవేశించిన తర్వాత "అజ్ఞానపు పొర"లో పడిపోతారు. ఇది మిమ్మల్ని ప్రస్తుతం నేను మాట్లాడుతున్న డైమెన్షన్స్ నుంచి వేరుచేస్తోంది. ఈ పొర మీరు ధరించే కళ్ళజోడు లాంటిది. ఇది మీరు ధరించిన వెంటనే – "మీరు ఒక ప్రత్యేకమైన నేను" అని మిమ్మల్ని నమ్మిస్తూ శరీరంలో బంధీ అయ్యేట్టు చేస్తుంది. నిజానికి ఈ అజ్ఞానపు పొరే, భూమి మీద ద్వంద్వాన్ని అనుభవించడానికి మీకు అవకాశాన్ని కలిపిస్తోంది, అందువలన దీనికి చాలా ప్రాముఖ్యత ఉంది. నిజానికి ఇప్పుడు ఈ పొర మరింత పల్చబడడానికి మరియు ఒక వైపు నుంచి మరొక వైపు సమాచారాన్ని మరింతగా అనుమతించడానికి సరైన సమయం ఇదే. చాలామంది ప్రజలు ఈ పొర దాటి ఇతర తలాలకు వెళ్తూ, ఈ శరీరం మరియు వ్యక్తిత్వం కన్నా చాలా ఉన్నతమైన వారనే విషయాన్ని గుర్తిస్తున్నారు కూడా. ఇలా ఎంత ఎక్కువ మంది చేస్తే, అంత ఎక్కువగా ఇతర తలాలతో బంధం ఏర్పడుతుంది, దీని ద్వారా ఈ భూ తలంలోకి ప్రేమపూర్వకమైన విశ్వశక్తి సులభంగా ప్రసరింపబడుతుంది. ఈ విశ్వశక్తి తరంగంపై స్వారీచేస్తూ కొత్త పిల్లలు భూ తలంలోకి వస్తారు.

ఒక్కక్షణం ఈ పిల్లల యొక్క శక్తిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. వీరు స్వారీ చేస్తున్న విశ్వశక్తి తరంగాన్ని అనుభూతి చెందండి. దయచేసి దీని గురించి ఆలోచించవద్దు, కేవలం మీ హృదయాన్ని తెరుస్తూ, మీ దగ్గరకి వస్తున్న అనుభూతులను అనుమతించండి. ఈ అనుభూతులు ఉన్నతస్థాయిలో ప్రకంపిస్తాయి. వీరి శక్తి ఆహ్లాదకరమైన సీతాకోకచిలుకలా ఉంటుంది. కాని అదే సమయంలో వీరి శక్తి అసాధారణమైన గాంభీర్యాన్ని మరియు నిజాయితీని కలిగి ఉంటుంది. వీరు వీరి యొక్క ప్రజ్ఞాత్మకు మరియు దివ్యత్వానికి ప్రతినిధిగా భూమి మీద వ్యవహరించాలని జాగృతావస్థలో ఎంపిక చేసుకున్నారు. భూమి మీద చైతన్యపు పరివర్తనానికి సహకరించాలనే కోరికతోనే వీరు దీనిని ఎంపిక చేసుకున్నారు మరియు ఇది వీరిని ఇబ్బందులకు గురిచేస్తుందనే విషయాన్ని పూర్తిగా తెలుసుకున్నారు. వీరు వీరి యొక్క ప్రజ్ఞాత్మ స్థాయిలోనూ, వీరి గురించి పూర్తి ఎరుక కలిగిన భాగంతోనూ జాగృతావస్థలో ఈ ఎంపికను ఎంచుకున్నారు. కాని మనోభావస్థాయిలో (లేదా "అంతర్శిశువు"),

భూవాస్తవంతో ఘర్షణపడడం వలన వీరు గాయపడవచ్చు. ఈ పిల్లలు తక్కువగా అభివృద్ధి చెందిన భూవాస్తవంలో ఉండడం వలన, వీరి యొక్క సున్నితత్వాన్ని మరియు ఉన్నతమైన ప్రకంపనాన్ని ఆపలేకపోతున్నారు. అయినప్పటికీ వీరు భూ తలంలో తమను తాము కోల్పోయేట్టు చేసే ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కోవడానికి కూడా సాహసిస్తున్నారు. అందువలన వీరు, వీరి యొక్క శక్తిని సురక్షితంగాను మరియు స్వేచ్ఛగాను భూమి మీద వ్యక్తపర్చడానికి ప్రదేశాన్నైనా లేదా వీరి అంతరంలో ఉన్న తీవ్రమైన సందేహాలు మరియు గందరగోళాలతో విజయవంతంగా వ్యవహరించే పద్ధతినైనా కనుగొనాలి. సాహసం చేస్తున్న ఈ ఆత్మలు ఎంత ధైర్యవంతమైనవి మరియు ఎంత ప్రేమపూర్వకమైనవి అనే విషయాలను మీరు స్పష్టంగా చూడగలరు. మీరు భూమి మీద జన్మించినప్పుడు, మీరు కూడా ఇదే విధంగా ధైర్యాన్ని మరియు ప్రేమశక్తిని ప్రదర్శించారు.

నేను ఈ కొత్తతరం పిల్లల యొక్క కొన్ని లక్షణాలను ఇప్పుడు మీకు చెబుతాను. పిల్లలందరూ ఒకే లక్షణాలతో ఉండరు మరియు కొంతమంది పిల్లలు ఇతరుల కంటే ఎక్కువగా ఈ లక్షణాలను ప్రదర్శించవచ్చు. ఇప్పటి రోజులలోని పిల్లలందరూ ప్రత్యేకంగా ఉంటున్నారనే అనుభూతి మీకు కలుగుతోంది. వీరు ప్రత్యేకమైన (పల్చటి) మాయపొర ద్వారా ప్రవేశిస్తున్నారు మరియు ముందెన్నడూ లేనంత ఎక్కువగా వీరి ఆత్మశక్తిని వ్యక్తపర్చాలనే వాంఛతో వస్తున్నారు. కాని ప్రతీ ఆత్మ తన సొంత అభివృద్ధిని కలిగి ఉంటుంది. కొత్తతరం యొక్క పిల్లల్లో అతి సున్నితత్వం కలిగిన పిల్లలు ఉన్నారు. వీరు ఇతరుల కంటే మరింత ప్రత్యేకంగా ఉంటారు మరియు వీరు "కొత్తశకం యొక్క పిల్లలుగాను లేదా కొత్తపిల్లలుగాను" పిలవబడతారు. ముఖ్యంగా ఈ సమూహం యొక్క పిల్లల్లోని అతి ముఖ్యమైన లక్షణాలను కొన్నింటిని ఇప్పుడు మీకు చెప్పాలనుకుంటున్నాను మరియు ఈ లక్షణాలన్నీ ప్రస్తుతం ఉన్న పిల్లలందరికీ ఇంచుమించు ఒకే విధంగా వర్తిస్తాయనే విషయాన్ని మీరు మనసులో పెట్టుకోండి. నిజానికి సామూహిక స్థాయిలో చైతన్యం అభివృద్ధి చెందడం వలన భూమి మీద "కొత్త మనిషి" ఆవిర్భవిస్తున్నాడు. సామాజికస్థాయి మరియు ఆధ్యాత్మికస్థాయిలలో మరింత తెలివైన మనుష్య వర్గాలు పెంపొందింపబడే దిశగా అభివృద్ధి కొనసాగుతోంది. వీరు ప్రకృతితో సమన్వయంగా జీవించగలిగే సామర్థ్యాన్ని, వీరి చుట్టూ ఉన్న మనుష్యులతో ఐకమత్యం మరియు గౌరవభావంతో బంధాన్ని ఏర్పరుచుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. ఈ "కొత్త మనిషి" యొక్క స్థితి వైపుగా అభివృద్ధి చెందడాన్ని మనం ఈ పిల్లల ద్వారా ముందుగా గుర్తిస్తాం.

**కొత్తపిల్లల యొక్క లక్షణాలు**

– కొత్తపిల్లలు చాలా ఎక్కువగా టెలిపతీని, ఇతరుల మనోభావాలను గ్రహించే శక్తిని మరియు ఆత్మలతో సంభాషించే శక్తిని కలిగి ఉంటారు. వీరు చాలా సులభంగా ఇతరుల మనోభావాలను మరియు మనస్తత్వాలను గ్రహిస్తారు. పంచేంద్రియాల ద్వారా కనిపించే ప్రపంచానికి, అనుభూతులు మరియు శక్తుల యొక్క కనిపించని ప్రపంచానికి మధ్య హద్దును వీరు చాలా స్పష్టంగా తెలుసుకుంటారు. వీరు భౌతిక విషయాలను గమనించినంత సులభంగా అంతర్ విషయాలను కూడా గమనిస్తారు. అంతరంలో జరుగుతున్న దానిని నిజంగా ప్రతిబింబించని బాహ్య ప్రవర్తనను చూసి వీరు మోసపోరు. వీరు ఇంగితజ్ఞానం ద్వారా పరిస్థితులను బాగా అంచనా వేయగలుగుతారు.

– కొత్త పిల్లలు శాంతి దూతలు. వీరు వ్యతిరేక వర్గాల వారిని కలపాలని మరియు వారి మధ్య ఉన్న ఘర్షణలను శాంతపర్చాలని అనుభూతి చెందుతారు. వీరి వయస్సుకు మించిన ఇంగితజ్ఞానపు సామర్థ్యాలను కలిగిఉంటారు, అంటే వీరు చిన్న వయస్సులోనే బుద్ధి పరిపక్వతను పొందుతారు. వీరిని తల్లిదండ్రులు అర్థం చేసుకున్న దానికంటే కూడా చాలా లోతుగా వీరు తల్లిదండ్రులను అర్థం చేసుకుంటారు. వీరు, తల్లిదండ్రులకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తారు లేదా ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ఒక వారధిని నిర్మించడానికి ప్రయత్నిస్తారు. వీరు చాలా సులభంగా "తల్లిదండ్రులకే తల్లి-తండ్రి"గా తయారవుతారు మరియు ఇది వీరి యొక్క సహజత్వానికి, శిశుతత్వానికి మరియు స్వేచ్ఛకు దూరమయ్యేలా చేస్తుంది. వీరిని వీరు సహాయకుడి పాత్రలో అధికంగా గుర్తించినప్పుడు, వీరు గొప్ప బాధ్యతా బరువును మోయవచ్చు.

– కొత్త పిల్లలు ఆదర్శవంతులు. వీరు ఆధ్యాత్మిక వేత్తలు, వేదాంత వేత్తలు మరియు సృజనాత్మకులు. వీరు సమానత్వం, ఐకమత్యం మరియు స్వభావానికి గౌరవమిచ్చే ఆదర్శాల ద్వారా ప్రోత్సహింపబడతారు. వీరి శక్తిక్షేత్రంలో మొదటి పై రెండు చక్రాలు విశాలంగా తెరవబడి ఉండడాన్ని మీరు గమనించగలరు. పై చక్రాల ద్వారా వీరు తరచూ ఉత్సాహాన్ని, పరిశీలనా దృష్టిని మరియు ఉత్తేజాలను అధికంగా పొందుతుంటారు. కాని మరొక రకంగా చెప్పాలంటే, పై చక్రాలు విశాలంగా తెరవబడి ఉండడం వలన వీరు అవాస్తవంగాను మరియు అధికంగా కలలుకనే తత్వాన్ని కలిగిఉంటూ సులభంగా అలసటకు గురవుతారు. వీరి శక్తి భూమి మీద ఇంకా పూర్తిగా స్థిరపడలేదు; ఈ శక్తి పూర్తిగా శరీరంతోనూ మరియు భూ వాస్తవంతోనూ బంధాన్ని ఏర్పరుచుకోవల్సిన అవసరం ఉంది.

కొత్తపిల్లలు ఆలోచించేవారిగా కన్నా, ఎక్కువ అనుభూతి చెందేవారిగా ఉంటారు. వీరు స్థిరపడిన ఆదర్శాలు మరియు నియమాలకు తగినట్టుగా ఉండడంలో అధికంగా సమస్యలను ఎదుర్కొంటారు. ఎందుకంటే ఈ నియమాలలో ఇంగితజ్ఞానానికి, స్వతంత్రతకు మరియు కొత్తదనానికి అవకాశం ఉండదు కనుక. ఆలోచనారీతి మరియు విశ్లేషణలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తున్న సంప్రదాయాలను ఛేధించి, వాటి నుంచి స్వేచ్ఛను ఎలా పొందాలనే విషయాన్ని మనకు బోధించడం కోసమే వీరు ఇక్కడ ఉన్నారు. పిల్లలందరూ కొంతవరకూ ఆలోచించేవారిగా కంటే కూడా అనుభూతి చెందేవారిగా ఉంటారు. కాని అతి సున్నితత్వం కలిగిన కొత్తపిల్లలను విభజిస్తున్న లక్షణం ఏమిటంటే, స్థిరమైన మరియు ఖచ్చితమైన వాతావరణానికి తగినట్టుగా మనోభావపరంగాను మరియు భౌతికపరంగాను ఉండడమన్నది వీరికి అసాధ్యమవ్వడమే. దీని కారణంగా వీరు అనారోగ్యానికి గురవుతారు లేదా ప్రవర్తనలో అస్థిరత్వాన్ని ఎక్కువగా ప్రదర్శిస్తారు. వీరు ఎంతమాత్రం వెనుకకు తిరిగి రాలేనంతగా హృదయాధారిత చైతన్యం నుంచి నడుపబడుతున్నారు.

– వీరి యొక్క శక్తివంతమైన ఇంగితజ్ఞానపు ఎరుక వలన మరియు వీరి యొక్క సర్దుకుపోలేని గుణం వలన, ఇతరులు ఈ పిల్లలను మొండివారిగాను, పెంకివారిగాను మరియు భిన్నమైన వారిగాను చూడవచ్చు. నిజానికి పెంకితనంతో ఉండాలనేది వీరి ఉద్దేశ్యం కాదు. వీరు, కేవలం వీరు వీరిగా ఉండాలని కోరుకుంటారు. కాని ఈ విధంగా ఉండడానికి ఏమాత్రం అవకాశం లేదని వీరు భావించినట్లయితే, సమాజాన్ని వదిలి వేస్తూ ఒంటరిగా జీవిస్తారు. వీరు భయం మరియు వ్యక్తిగత సంరక్షణ యొక్క అవసరాలకు స్వల్పంగా స్పందించడం వలన, వీరు క్రమశిక్షణకు మరియు అధికారానికి అతి తక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. అయినప్పటికీ, వీరు తీవ్రంగా బాధపడతారు మరియు వీరు ఎదుర్కొంటున్న సమస్యలపై వీరికి సరైన అవగాహన లేకపోయినందు వలన గందరగోళానికి గురవుతారు. దీని వలన వీరు విడదీయబడిన భావనను మరియు ఒంటరితనాన్ని అనుభూతి చెందుతారు. భూమి మీద వీరి యొక్క ఉనికికి గల అర్థమేమిటని తరచూ ప్రశ్నించుకుంటారు. అయినప్పటికీ వీరు జీవితంలో వీరి సొంతమార్గాన్ని కనుగొంటూ మరియు భౌతిక పదార్థంలో వీరి యొక్క సృజనాత్మకను మరియు ఆధ్యాత్మిక శక్తిని వ్యక్తపర్చడం ఆరంభించినట్లయితే, వీరు అందమైన పుష్పాలుగా వికసించగలరు. ఇలా వికసించిన వీరి ఆదర్శాల యొక్క గాంభీర్యత్వానికి, సున్నితత్వానికి మరియు పోటీతత్వం లేని అంగీకారవైఖరితో ప్రజలతో వ్యవహరించే వీరి యొక్క పద్ధతికి చాలామంది ఆకర్షింపబడతారు.

## కొత్తపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు

పైన చెప్పిన లక్షణాలన్నీ కూడా కొత్తపిల్లలు ఎదుర్కొనే సమస్యలను తెలుపుతున్నాయి. వీరి యొక్క ప్రత్యేకమైన శక్తిని వీరి చుట్టూ ఉన్న మనుష్యులు గుర్తించలేకపోవడం మరియు అర్థం చేసుకోలేకపోవడం అన్నదే వీరు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. వీరి అనుభూతులను వ్యక్తపరుచుకోవడానికి ఇతరులు అవకాశాన్ని ఇవ్వనప్పుడు, వీరిరువురి మధ్యనున్న బంధంలో కొరత ఏర్పడుతూ, పిల్లల ప్రవర్తనలో అనేక రకాల లోపాలు ఏర్పడవచ్చు.

పిల్లలు మొండిగాను, పెంకిగాను తయారవ్వడం వలన వీరితో వ్యవహరించడం చాలా కష్టంగా ఉంటుంది. వీరిని ఇతరులు తప్పుగా అర్థం చేసుకుంటునట్లు మరియు వీరితో వారు సరిగ్గా ప్రవర్తించనట్లు అనుభూతి చెందుతారు. ఇతరులకి ఇలా చేయవద్దని చెప్పాలనుకుంటారు, కాని అది ఎలా చెప్పాలో వీరికి తెలియదు. వీరికి సరైన భావప్రకటన లేదా సంభాషించే సామర్థ్యం గాని ఉండవు. కొంతకాలం తర్వాత దీని వలన ఏం జరుగుతుందంటే, అంతరంలో జరుగుతున్న దేనిని వీరికి వీరుగా అర్థం చేసుకోలేరు. ఈ పిల్లల యొక్క అంతర్ ప్రపంచాన్ని మరియు వీరిని సరిగ్గా అర్థం చేసుకున్న తల్లిదండ్రులు లేదా గురువు గాని, వీరి అనుభూతులకు పేరు పెట్టి మరియు తెరవబడిన హృదయంతో వింటూ వాటిని తిరిగి ప్రతిబింబించక పోయినట్లయితే, వీరంతట వీరు అంతరంలో బంధీ అయిపోతారు. దీని వలన వీరు అసహజంగాను మరియు అదుపు చేయలేని విధంగాను ప్రవర్తించవచ్చు. ఈ స్థితిలో పిల్లలను కదిలిస్తున్నది ఏమిటో అర్థం చేసుకోవడానికి, వీరిపై అధిక శ్రద్ధను మరియు లోతుగా శృతి చేయబడిన ఎరుకను పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ పిల్లలు వారి అనుభూతులతో బంధాన్ని కోల్పోయారు కాబట్టి.

పిల్లలు సరిగ్గా స్వాగతింపబడలేదని లేదా తప్పుగా అర్థం చేసుకోబడుతున్నారనే అనుభూతుల వలన, వీరు కుటుంబం వాతావరణం నుంచి విడిపోతుంటారు. వీరు ఆగ్రహం లేదా క్రూరమైన ప్రవర్తనల ద్వారా, వీరి మనోభావాలను బయటపెట్టరు. వీరి యొక్క సొంత చిన్న ప్రపంచంలో బంధీ అవుతారు మరియు దీని నుంచి బయటకు రావడం వీరికి కష్టంగా ఉంటుంది. తరచూ ఈ పిల్లలు అతి సున్నితత్వాన్ని కలిగిఉంటూ వీరి చుట్టూ ఉన్న చెడు శక్తులకి బలంగా స్పందిస్తారు. అతి సున్నితత్వంగా ఉండడమనేది ఎలా ఉంటుందో ఊహించుకోవడానికే చాలా కష్టంగా ఉంటుంది.

దీని వలన వీరు వీరి యొక్క సరిహద్దులను సులభంగా ఉల్లంఘిస్తూ మరియు మనోభావపరంగా బ్రతకడానికి అనుభూతి కేంద్రాలను మూసివేస్తారు. సాధారణంగా ఇలా బ్రతకడాన్ని "ఆటిజం" అనే మనోవ్యాధిగా పిలుస్తారు. ఈ వ్యాధి గల పిల్లలు అతిసున్నితత్వాన్ని కలిగి ఉండడం వలన ఇతరుల యొక్క మనోభావాలను అర్థం చేసుకోలేరు. చాలామంది ఈ విషయాన్ని లోకవిరుద్ధంగా భావిస్తున్నారు. వీరి యొక్క సొంత సరిహద్దులలో జీవించడం అనేది వీరికి చాలా కష్టమైన విషయమని చెప్పవచ్చు. అందువలన వీరు ఇతరులతో సన్నిహితంగా ఉండడాన్ని అనుమతించుకోరు. ఇతరులతో కలిసి చేసే పనిలో, వీరి చైతన్యాన్ని విస్తరింపజేయడానికి వీరిని వీరు అనుమతించుకోరు. వీరు ఈ విధంగా చేసినట్లయితే, వీరి అంతర్ ప్రపంచం ఛిన్నాభిన్నమై పోతుందని మరియు వీరు గందరగోళాల్లో పడిపోతారని భావిస్తారు. మనోభావాలను గ్రహించలేని ఈ ఆటిస్టిక్ పిల్లల యొక్క ప్రవర్తన అనేది, ఇతరుల శక్తులకు సంబంధించిన అభిప్రాయాలను అధికపరిమాణంలో గ్రహించే సామర్థ్యం నుంచే ఉద్భవించినది. అతి శక్తివంతమైన ఈ సున్నితత్వంతో వ్యవహరించాల్సి వస్తుందనే భయంతో ఈ ఆటిస్టిక్ పిల్లలు తమను తాము సంరక్షించుకోవడానికి మరియు మనోభావాలను మూసివేయడానికి ప్రయత్నిస్తారు. సమాజంలో ఎలా మెలగాలో తెలియని ఈ ఆటిస్టిక్ పిల్లల యొక్క ప్రవర్తన ఒక నిర్జీవమైన జీవితంలా ఉంటుంది మరియు ఇది ఆత్మ యొక్క ప్రధానమైన లక్షణం మాత్రం కాదు.

బాహ్యంగా వ్యక్తపరచే పద్ధతిలో, సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రయత్నించే పిల్లలు (మొండివైఖరి, చిరాకు, ఏకాగ్రత లోపం), అదే విధంగా అంతరంగా సమస్యను పరిష్కరించాలని ప్రయత్నించే పిల్లలు (మనోభావాలను అణచివేయడం లేదా వదిలివేయడం) – వీరిరువురు అధిక పరిమాణంలో ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటారు.

– వీరు సరిగ్గా స్వాగతింపబడలేదని, గుర్తింపబడలేదని లేదా వీరు ఎవరనే దానిని నిజంగా ప్రశంసించలేదని అనుభూతి చెందుతుంటారు.

– భౌతికశరీరంలో వీరు పూర్తిగా స్థిరపడలేదనే విషయాన్ని, మీరు వీరి శక్తిక్షేత్రంలో స్పష్టంగా గమనించగలరు. దీని అర్థం వీరు మనోభావసంబంధిత పునాదిని కలిగిలేరు అని లేదా వీరు ఒక ప్రశాంతమైన మరియు ఒక విశాలమైన మార్గంలో ప్రపంచాన్ని అన్వేషించే అంతరాత్మ యొక్క భద్రతను కలిగిలేరు అని. "సులభంగా అనుభూతి చెందలేకపోవడం" అన్నది వీరు స్వేచ్ఛా మార్గంలో "సహజంగా ఉండడానికి" కష్టపడేలా చేస్తోంది.

– దీని ఫలితంగా వీరు కొన్ని ఆహార పదార్థాలకు లేదా వస్తువులకు తీవ్రంగా స్పందిస్తారు లేదా/ మరియు వీరు శారీరక రోగలక్షణాలను మరియు ప్రవర్తనా లోపాలను ప్రదర్శించవచ్చు.

– వీరు యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత, సమాజంలో వీరి యొక్క స్థానాన్ని కనుగొనడానికి చాలా కష్టపడతారు (వీరు తగిన విద్యను లేదా ఉద్యోగాన్ని వెతకడంలో).

ఈ పిల్లలు మరియు యువకులు మరింతగా స్వాగతింపబడిన అనుభూతిని మరియు వ్యక్తిగత భావప్రకటన యొక్క సరైన పద్ధతులను కనుగొనడానికి, వీరికి మీరు ఎలా సహకరించాలనే పద్ధతుల గురించి నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. ఇక్కడ అధిక ప్రాధాన్యత కలిగిన విషయం ఏమిటంటే, కొత్తపిల్లలు అనుభవిస్తున్న సమస్యల యొక్క కారణాలను తప్పు అనే భావనతో ఆలోచించకుండా ఉండడం అన్నది చాలా ముఖ్యం. ఈ పిల్లల యొక్క తల్లిదండ్రులు, సాధ్యమైనంత పూర్తి సహకారాన్ని మరియు భద్రతను అందించాలి. చాలామంది తల్లిదండ్రులకు వారి పిల్లల యొక్క విశేషమైన లక్షణాల గురించి బాగా తెలుసు మరియు ఈ తల్లిదండ్రులు వారి ఇంగితజ్ఞానం ద్వారా తమ పిల్లలకు తగినట్టుగా శృతి చేసుకుంటున్నారు. వీరి యొక్క అంగీకారవైఖరి మరియు సుముఖతల ద్వారా అధిక పరిమాణంలో నేర్చుకునే ప్రక్రియ జరుగుతుంది. ఇలాంటి తల్లిదండ్రులు పిల్లలతో కలిసినట్లయితే, వారు సమాజంలో ఒక కొత్తమార్గాన్ని ఏర్పరుస్తూ మరియు పిల్లలతో వ్యవహరించడానికి సంబంధించిన కొత్త పద్ధతులకు మార్గాలను సిద్ధం చేస్తారు.

భూవాస్తవంలో ఈ కొత్తపిల్లలు అనుభవిస్తున్న బాధాకరమైన ఘర్షణలన్నీ కూడా, వీరు జాగురుకతతో ఎంచుకున్న ఎంపికలే. వీరు ఏదో కొత్తదనాన్ని తీసుకురావడానికి ఇక్కడకు వచ్చారు మరియు వీరి హృదయంలో దీని యొక్క ఎరుక ఉంది. ఈ ఎరుకయే వీరి యొక్క కష్టాలను ప్రత్యేకమైన దృక్పథంలో చూసేలా చేస్తోంది. వీరు జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల యొక్క పూర్తి బాధ్యతను వీరి యొక్క ఆత్మస్థితిలో స్వీకరిస్తారు; వీరు ఓటములను మరియు అడ్డులను అంగీకరిస్తారు. సమాజం "వీరికి వ్యతిరేకంగా" లేదు. సమాజం చాలా విషయాలలో నిద్రపోతున్నది. ఇది పాత అలవాట్లకు సంబంధించిన నిద్ర మరియు ఇప్పుడు వస్తున్న పిల్లలే దీనిని మేల్కొల్పుతారు. అవును, వీరు కూడా కొంచెం మీలాగే ఉన్నారు, మీరు దీనిని అనుభూతి చెందగలరా?! ఈ పిల్లల్లాగే, ముందుతరాలకు సంబంధించిన లైట్‌వర్కర్స్ కూడా ఇలాంటి సందిగ్ధ స్థితుల్లోనే పయనించారు. దీని వలన ప్రస్తుత యుగంలోని పరిస్థితులు వేగాన్ని పొందుతున్నాయి మరియు ఇది ఒక గొప్ప మలుపుకు చేరువవుతున్నది. ఈ వేగానికి కారణం మరియు ఫలితం ఈ కొత్తపిల్లలే.

**కొత్తపిల్లలకు గైడ్ చెయ్యడం:**

కొత్తపిల్లలకు తండ్రిగాను, గురువుగాను లేదా థెరపిస్ట్‌గాను వ్యవహరించడంలో మొదటిగా చేయవల్సినది ఏమిటంటే, ఆ శిశువు యొక్క ప్రత్యేక వాస్తవంతో అంతర్‌బంధాన్ని కలిగిఉండడమే. వీరికి సహాయం చేయడానికి కావలసిన పునాది ఏమిటంటే, పిల్లలు అనుభవిస్తున్న జీవనశైలిని అంగీకరించడానికి సుముఖతను చూపడం మరియు వీరు మాటలు లేదా అనుభూతుల ద్వారా మీకు ఏం తెలియజేస్తున్నారనే దానికి శృతి కాగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉండడమే అని. ఈ పిల్లలకు శిక్షణను ఇవ్వాలని కోరుకునే వారు వినగలిగే సామర్థ్యాన్ని మరియు ఏదో ఒక కొత్తదనాన్ని అంగీకరించగలిగే వైఖరిని తప్పని సరిగా కలిగి ఉండాలి.

మీరు దీని కోసం ఏ ప్రత్యేకమైన జ్ఞానాన్ని లేదా నైపుణ్యాన్ని నేర్చుకుని ఉండాల్సిన అవసరం లేదు. ఇవే మీ మార్గంలో ఉండగలవు. కొత్తతరం పిల్లల గురించి అనుభవజ్ఞులచే తెలపబడిన సిద్ధాంతాలు, తరచూ ఈ పిల్లల యొక్క సాధారణమైన బాహ్య ప్రవర్తనలకు పూర్తి భిన్నంగా ఉంటున్నాయి. రోగలక్షణాలు మరియు వ్యాధి నిరూపణలు, బాహ్యంగా గమనించదగిన లక్షణాల మీద ఆధారపడి ఉంటాయి. కాని ఈ పిల్లల దగ్గరకు విజయవంతంగా చేరువవ్వడంలో కోల్పోతున్న అతిముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ పిల్లలు అనుభవిస్తున్న దానితో అంతర్‌బంధాన్ని ఏర్పరుచుకోలేక పోవడమే: ఈ పిల్లల బాహ్యప్రవర్తనను ప్రభావితం చేసే అనుభూతులు మరియు మనోభావాలతో బంధాన్ని ఏర్పరుచుకో లేకపోవడమే.

మీకున్న ఖచ్చితమైన అభిప్రాయాలు మరియు ఉద్దేశ్యాలను వదిలివేసి, ప్రతీ ఒక్కరిని తెరవబడిన హృదయంతో మరియు తటస్థస్థితిలో చూడాలి. మొదటిగా, మీకు ఇతరుల గురించి తెలిసిన అభిప్రాయాలన్నింటిని విడుదల చేసినట్లయితే, మీరు వారితో నిజాయితీ అయిన సంబంధాన్ని ఏర్పరుచుకోగలరు. ఆ తర్వాతే మీరు నిజమైన సున్నితత్వం మరియు సహజత్వంతో వర్తమానంలో ఉండగలరు. ఇది కూడా ఇతరులను ఆహ్వానించే ఒక అందమైన పద్ధతియే. ఎందుకంటే మీరు వారి యొక్క ఆత్మశక్తి ద్వారా స్పృశించబడడానికి మిమ్మల్ని మీరు ఇప్పుడు పూర్తిగా అనుమతిస్తారు కాబట్టి.

ఈ ప్రాథమికమైన అంగీకార వైఖరిలో ఆలోచనల కంటే, అనుభూతులకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఈ వైఖరిలో మీరు ఎవరితోనైనా సంభాషిస్తే అది మీ ఇద్దరికి చాలా ప్రయోజనకరంగాను మరియు బంధాన్ని మెరుగుపరిచే విధంగాను

ఉంటుంది. పిల్లలతో సంభాషణ అనేది కేవలం ఒక్కరి ద్వారా మాత్రమే నేర్చుకునేదిగా ఉండదు. ఈ బంధంలో మీ ఇరువురు కూడా కొన్నిసార్లు గురువుగాను మరియు కొన్నిసార్లు శిష్యుడిగాను ఉంటారు. ఇదే అర్ధవంతమైన ఆధ్యాత్మిక బంధాలన్నింటికి కూడా ఆదర్శప్రాయమైనది.

మార్గదర్శకుడు మరియు శిశువుకు మధ్య ఉన్న బంధాన్ని స్పష్టంగాను మరియు స్వచ్ఛంగాను నిర్వచించినప్పుడు, పిల్లల యొక్క అభివృద్ధికి సహకరించే చాలా అవకాశాలు దీనిలో ఉంటాయి. నేను కొన్ని సాధారణమైన మార్గాల గురించి చెప్పాలని అనుకుంటున్నాను. కాని నేను చెప్పే మార్గాలు పూర్తి స్పష్టంగా లేనప్పటికీ మీకు ఒక దిక్సూచిలా ఉపయోగపడగలవు.

*– పిల్లల యొక్క ప్రత్యేకమైన లక్షణాలకు(భిన్నంగా కనిపించేట్టు చేస్తున్న) మంచి ప్రశంసను అందించడం.*

పిల్లలకు వారెవరనే దానిని గుర్తుచేసుకోవడానికి సహాయం చేయండి. వీరి యొక్క అతి సున్నితత్వం మరియు ఆదర్శవంతం అనేవి వీరు కలిగిఉన్న అత్యంత సుందరమైన లక్షణాలుగా తెలుసుకోవడానికి వీరికి సహకరించండి. వీరు ఏ విషయాలలో ప్రత్యేకతను అనుభూతి చెందుతున్నారో వాటిని వారంతట వారే వ్యక్తపరుచుకోవడానికి అనుమతించండి. ఈ లక్షణాలు ప్రపంచాన్ని మెరుగుపరచడానికి ఎలా సహకరిస్తాయో కనుగొనమని వీరిని ప్రోత్సహించండి. వీరి అతి సున్నితత్వాన్ని వ్యక్తపరిచే సృజనాత్మకమైన మార్గాలను కనుగొనండి. పిల్లలు ఈ మార్గాలలో ఆనందాన్ని అనుభవించగలరు. ఈ పిల్లలందరిని దగ్గరకు చేరుస్తూ, వీరి అనుభవాలను మరియు వీరి శక్తులను పంచుకోవడానికి అనుమతివ్వండి.

***- ఇంగితజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం***

పిల్లల యొక్క ఇంగితజ్ఞానపు నైపుణ్యాలకు ఆహ్లాదకరమైన మార్గంలో శిక్షణనివ్వడం, మరియు వీరికి శరీరం మరియు మనోభావాలతో బంధాన్ని ఏర్పర్చుకోవడానికి సహాయం చేయడం అన్నది వీరి యొక్క వ్యక్తిగత ఎరుకను బలపరుస్తుంది. “భూమి మీద స్థిరత్వాన్ని పొందడం, అంతరంలో నుంచి సరిహద్దులను తెలుసుకోవడం మరియు ఏది సరైనదో కనుగొనడానికి ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించడం” అనే నైపుణ్యాలను – ఈ సున్నితమైన పిల్లలు యుక్తవయస్సులోను మరియు స్వేచ్ఛతోను ఉన్నప్పుడు సులభంగా నేర్చుకోగలరు. వీరు పెరిగి పెద్దవారైన

తర్వాత, ఈ పిల్లలు తమ సహజ స్వభావాలైన అనుభూతి, ఊహాశక్తి మరియు కలలుకనే తత్వాలను లోలోపల ఎక్కువగా అణచిపెట్టడాన్ని అనుభూతి చెందవచ్చు. ఇటువంటి పరిస్థితిలో వీరికి మొదటిగా చేయవలసిన ముఖ్యమైన సహాయం: ఇంగితజ్ఞానం యొక్క ప్రవాహాన్ని అడ్డుకుంటున్న మనోభావాలు లేదా పరిమితమైన నమ్మకాల యొక్క ఎరుకను పొందేలా చేయడమే. ఈ విషయంలో సమస్యలను కలిగి ఉన్నట్లయితే, చాలావరకూ క్రింది మూడుచక్రాలలో శక్తిప్రవాహం ఎల్లప్పుడూ నిలిచిపోతుంటుంది. ఈ పిల్లలలో ఉన్న భయాలు, ఆందోళనలు మరియు నిరాశల యొక్క ఫలితంగా, వీరు అభద్రతాభావాన్ని, విచారాన్ని లేదా చనిపోవాలనే వాంఛను అనుభూతి చెందవచ్చు.

### *- ఒక ఆత్మగా వీరి యొక్క పరిపక్వతను గౌరవించండి*

పిల్లల యొక్క అతిసున్నితత్వం మరియు "ప్రత్యేకంగా ఉండడం" అనేవి వీరి యొక్క జాగరుకత ఎంపికయే అని తెలుసుకోండి మరియు సమస్యలను పరిష్కరించుకోగలిగే సహజశక్తిని అంతరంలో కలిగి ఉన్నారని విశ్వసించండి. ఈ పిల్లల్ని బాధితులుగా చూడవద్దు. వీరి యొక్క సామర్ధ్యాలను మరియు బహుమతులను వారి అంతరంలో అడగమని మీరు చెప్పండి. సాధ్యమైనంతవరకూ, వీరంతట వీరుగా సొంత సమాధానాలను మరియు పరిష్కారాలను కనుగొనేలా చెయ్యండి. వీరి యొక్క ఆశయం మరియు ఉత్తేజంతో బంధాన్ని ఏర్పర్చుకునేలా ప్రోత్సహించండి. ప్రయోగాత్మకంగా, వీరి యొక్క ఉత్తేజకరమైన శక్తిని భూమి మీద ఎలా తెలియపరచాలి మరియు ఎలా వ్యక్తీకరించాలి అనే వాటిని కనుగొనడానికి మీరు సహాయం చెయ్యండి.

### *- వ్యక్తిగత భావప్రకటనకు అవకాశాన్ని కల్పించండి*

కొత్తపిల్లలు లేదా యువకుల యొక్క శక్తి గమనించలేనంత సున్నితంగాను మరియు ఆదర్శవంతంగాను ఉండగలదు. ఈ పిల్లలు, వీరి గురించి వీరు భౌతికపదార్ధంలో వ్యక్తపరుచుకోవడం చాలా ముఖ్యం. ఈ వ్యక్తపరుచుకోవడం అనేది పెయింటింగ్ లేదా సంగీతాన్ని నేర్చుకోవడం, లేదా క్రీడలు లేదా ఆటలు మొదలైన సృజనాత్మక రూపాలలో ఉండవచ్చు. నిజానికి ఇక్కడ విషయమేమిటంటే, వీరి శక్తిని భూమి మీద ఎలా స్థిరపరుచుకోవాలి మరియు దీనిని ఇతరులకు కనబడేలా ఉంచడం తెలుసుకోవాలి అని. ఈ విధంగానే వీరి శక్తిని భూమి మీద ప్రసరింపజేస్తారు. ఈ విషయాలన్నింటిలో, మొదటిగా పాటించాల్సినది ఏమిటంటే వీరి గురించి వీరు ఆనందంగా భౌతికపదార్ధంలో వ్యక్తపరుచుకోవడమే. వీరు స్వేచ్ఛగా అన్వేషించడానికి

మరియు ప్రయోగాలు చేయడానికి ప్రోత్సహింప బడినట్లయితే, వీరు వీరికి తగిన నైపుణ్యాలను సొంతంగా కనుగొంటారు.

### - *ప్రత్యామ్నాయ మందులు*

ఒక్క భాగంపై మాత్రమే దృష్టిపెట్టకుండా, పూర్తి అంశంపై దృష్టి పెట్టే సున్నితమైన చికిత్స యొక్క రూపాలైన చదవడం, హీలింగ్ మరియు ప్రత్యామ్నాయ మందులు అనేవి ఈ పిల్లలలోని శారీరక రోగలక్షణాలతో వ్యవహరించడంలో సహకరిస్తాయి. ఈ శారీరక రోగలక్షణాలు, వీరి పూర్తి శక్తికి మరియు మానసికపరమైన స్థితికి సంబంధించినవి. ఈ పిల్లలు శక్తిపరంగా అతి సున్నితత్వాన్ని కలిగి ఉండడం వలన, మొదటిగా శక్తిస్థాయిల మీద (మనస్సుకు సంబంధించిన) మరియు ఆ తర్వాత శరీరం మీద దృష్టిసారించే చికిత్సలకు సులభంగా స్పందిస్తారు. ఇటువంటి పిల్లల విషయంలో కేవలం బాహ్యపు రోగలక్షణాల మీద మాత్రమే ఆధారపడి కాకుండా, ఆ పిల్లల యొక్క ప్రత్యేకమైన పరిస్థితితో అంతర్ సంబంధాన్ని ఏర్పరుచుకునే చికిత్సను ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఒక తల్లి–తండ్రిగా లేదా థెరపిస్ట్‌గా అంతర్‌స్థాయిలలో ఈ చికిత్స ప్రయోజనకరంగా ఉందా లేదా అనేది పిల్లల్ని అడగాలి. ఈ పిల్లలకు పరిపక్వత వచ్చినట్లయితే, ఈ పిల్లలు వారంతట వారు ఎంపికలో పాల్గొనే అవకాశాన్ని కలిపించాలి.

### - *చదువు*

వీరు మొదటగా అంతర్ ప్రపంచానికి తీసుకువెళ్ళే ఎన్‌లైటెండ్ విద్యలను ఎంపిక చేసుకోవాలి. గతంలో జ్ఞానం అన్నది పెద్దవారి నుంచి పిల్లలు నేర్చుకునే విధంగా ఉండేది. ఈ పిల్లల్ని ఖాళీ పాత్రలుగా పరిగణిస్తూ, ఉపయోగకరమైన జ్ఞానం మరియు నైపుణ్యాలతో వీరిని నింపవలసిన అవసరం ఉందని భావించేవారు. సొంత ఇష్టాలు మరియు లక్ష్యాలు కలిగిన పరిణత గల ఆత్మలుగా పిల్లలను గుర్తించినట్లయితే, అప్పుడు విద్య అనేది చాలా ప్రత్యేకమైన రూపాన్ని దాలుస్తుంది. పిల్లల్లో ముందు నుంచే సహజంగా ఉన్న లక్షణాన్ని మేల్కొల్పుతూ, దానికి స్వేచ్ఛను ఇవ్వడం అనేదే నిజమైన సవాల్; ఇది వీరిని ఖాళీ పాత్రలుగా పరిగణిస్తూ వీరిలో ఏదో నింపాలనుకోవడం మాత్రం కాదు. వీరి యొక్క సహజమైన ఆత్మశక్తి భౌతికప్రపంచంలో తనను తాను తెలియపరుచుకోవాలని మరియు వ్యక్తీకరించుకోవాలని కోరుకుంటోంది. పిల్లల్లో నేర్చుకోవాలనే, అన్వేషించాలనే మరియు ప్రపంచం గురించి

ఏదో కనుగొనాలనే సహజమైన ధోరణి ఉంటుంది. పిల్లలు పరిస్థితులను అనుభవిస్తున్న మార్గానికి తగినట్టుగా లేని జ్ఞానాన్ని నేర్చుకొనమని వారిని బలవంతం చేసినట్లయితే, వీరు మొండి వైఖరిని మరియు అయిష్టతను చూపిస్తారు. పిల్లలు నేర్చుకోవడానికి సహజంగా ఆసక్తిని చూపుతున్న వాటి మీద పని చేయడం మరియు వాటిని సంరక్షించడం అన్నది కొత్త విద్యకు పునాదిగా ఉంటుంది. ఈ రకమైన ధోరణిలో, గురువు యొక్క పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మొట్టమొదటిగా గురువులను అడుగుతున్నది ఏమిటంటే, అంగీకారం మరియు ఇంగితజ్ఞానం యొక్క వైఖరితో పిల్లల దగ్గర ఉ ండమని. ప్రతి పిల్లవాడిలో ఉన్న సహజమైన మరియు ప్రత్యేకమైన సామర్థ్యాలను విశ్వసించగలననే నమ్మకం నుంచే గురువు ఆరంభమవ్వాలి. పిల్లలు వారి సొంత మార్గానికి నాయకత్వం వహించడానికి గురువు అనుమతించాలి. పిల్లలు లక్ష్యాలను సాధించడానికి కావలసిన జ్ఞానాన్ని మరియు వస్తువులను అందిస్తూ వారికి మీరు సహకరించ గలగాలి.

## మీ శిశువు యొక్క బాధతో వ్యవహరించే విధానం

మీరు అతి సున్నితత్వం కలిగిన శిశువుకు తల్లిదండ్రులుగా ఉన్నప్పుడు మరియు వీరు ప్రపంచంతో వ్యవహరించే విధానంలో కష్టాలను ఎదుర్కొంటారని మీరు గమనించినప్పుడు, మీరు శిశువుని ఆపదల నుంచి కాపాడాలని లేదా రక్షించాలని కోరుకుంటారు. మీరు బాహ్యప్రపంచాన్ని ఒక శత్రువుగాను మరియు మీ శిశువుని గాయపడిన బాధితుడిగాను మీకు తెలియకుండానే చూస్తారు. మీరు లేకుండా మీ శిశువు బ్రతకగలుగుతుందా లేదా అని మీరు భయపడవచ్చు. మీ శిశువు యొక్క బాధను చూసినప్పుడు, అది మీ సొంత లోతైన భయాలు, బాధలు మరియు నిరాశలలో తిరిగి పడిపోయేలా మిమ్మల్ని చేస్తుంది. అయినప్పటికీ మీ జీవితంలో ఈ శిశువు యొక్క ఉనికి ఎల్లప్పుడూ ఒక రహస్యంతో కూడిన తర్కాన్ని కలిగిఉంటుంది. ఇది ఒక మంచి ఉద్దేశ్యంతో కూడిన లోతైన అర్థాన్ని కలిగి ఉంటుంది. ఈ తర్కాన్ని మరియు అర్థాన్ని ఛేధించడానికి ఒకానొక మార్గం ఏమిటంటే మీ శిశువును మీ యొక్క ప్రత్యేకమైన దృష్టితో చూడడమే. ఈ శిశువుని నిస్సాహయ స్థితిలో ఉన్న చిన్నప్రాణిగా చూడకుండా, మీకు సందేశాన్ని తీసుకువచ్చిన ఒక గురువుగాను, ఒక ఏంజెల్‌గాను చూడవచ్చు. ఇప్పుడు నేను చెప్పే ధ్యానంలో నాతోపాటు పయనించమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. మీకు పిల్లలు లేనట్లయితే, మీరు ఒక చిన్న ఊహా శిశువును మీ దగ్గరకు రమ్మని ఆహ్వానించండి.

మీరు ఒక అందమైన తోటలో నడుస్తున్నట్లు ఊహించుకోండి. ఈ ప్రపంచంలో ఉన్న ప్రశాంతతను మరియు నిశ్శబ్దాన్ని మీరు మీ యొక్క తెరవబడిన హృదయంతో గమనించండి. మీ దృష్టిని అన్ని వైపులా స్వేచ్ఛగా విహరించనివ్వండి. ఈ తోటలో చాలా అందమైన మొక్కలు మరియు పుష్పాలు ఉన్నాయి. ఋతువుల యొక్క లయబద్ధతను, నెమ్మదిగాను మరియు సున్నితంగాను మారుతున్న కాలాలను అనుభూతి చెందండి. ఇప్పుడు మీ వైపు దృష్టిని కేంద్రీకరిస్తూ, మీ ప్రక్కన ఒక శిశువు నడవడాన్ని గమనించండి. మీ ఊహలో మొదటిగా వచ్చిన శిశువును తీసుకోండి. ఆ శిశువు నెమ్మదిగా మీ చేతిని పట్టుకుంటోంది. మీ ఇద్దరూ కలిసి ఆ తోటలో నడుస్తూ ప్రకృతి యొక్క అందాన్ని ఆనందిస్తున్నారు.

కొంత సమయం తర్వాత కూర్చోవడానికి ఒక ప్రదేశాన్ని మీరు గుర్తిస్తారు, అది ఒక అందమైన చిన్న బెంచ్‌గాని లేదా ఒక విశాలమైన ప్రదేశంగాని కావచ్చు. మీ ఇద్దరూ కలిసి అక్కడ కూర్చున్నారు. ఇప్పుడు మీరు ఆ శిశువును స్పష్టంగా చూస్తారు. ఆమె లేదా అతని చిన్న ముఖాన్ని చూస్తూ, ఆమె కళ్ళల్లోకి లోతుగా చూడండి. కొంత సమయం తర్వాత మీరు పరివర్తనం సంభవించడాన్ని గమనిస్తారు. నెమ్మదిగా శిశువు యొక్క ముఖం ఒక ఏంజెల్‌గా మారుతుంది. మీరు ఆ శిశువు వేరే ప్రపంచానికి సంబంధించిన ఏంజెల్‌గా రూపొందుతూ మరియు మరింత ప్రకాశవంతమైన కాంతిని పొందడాన్ని మీరు చూస్తారు. మీరు ఏంజెల్- శిశువు చుట్టూ ఉన్న కాంతులను గమనిస్తారు.

నిశ్శబ్దంగా ఈ ఏంజెల్‌ని చూస్తారు మరియు ఆమె మీకు అక్కడ కనబడడాన్ని మరింత గౌరవభావంతో చూస్తారు. అప్పుడు మీరు కూడా మళ్ళీ ఒక చిన్న శిశువులా మారిపోవడాన్ని అనుభూతి చెందుతారు. కొంత సమయం, పెద్దవారిగా ఉండడంలో ఇమిడి ఉండే భారాన్ని విడుదల చేయండి మరియు శిశువుగా ఉన్నప్పుడు మీరు కలిగిఉన్న సహజ స్వభావాన్ని తిరిగి పొందడాన్ని అనుభూతి చెందండి. మీరు విశాలమైన కన్నులతో అందమైన కాంతులను వెదజల్లుతున్న ఏంజెల్ మీ ఎదురుగా ఉండడాన్ని చూస్తారు. ఆ తర్వాత ఆమె లేదా అతను మీకు ఏదో చెప్పాలనుకోవడాన్ని మీరు అనుభూతి చెందుతారు. మొదటిగా ఆమె కన్నుల ద్వారా తన సందేశాన్ని అందిస్తుంది. మీరు ఆ శక్తిని గ్రహిస్తూ, దాని యొక్క సారాంశాన్ని అనుభూతి చెందండి.

ఆ తర్వాత మీరు ఆ శిశువును ఒక ప్రశ్నను అడగండి. "నువ్వు భూమి మీదకి ఎందుకు వచ్చావు?" "నువ్వు ఏ బహుమతిని నీతో తీసుకువచ్చావు?" అని

మీరు అడగండి. ఇప్పుడు ఆ ఏంజెల్‌ని మాట్లాడనివ్వండి. ఇక్కడ సంభాషణ మాటల రూపంలో ఉండదు, ఆమె తన ఫీలింగ్స్ ద్వారా కూడా మాట్లాడగలదు. మాటలు లేదా ఊహాలతో సంబంధం లేకుండా ఆకస్మాత్తుగా భావాన్ని గ్రహించడాన్ని మీరు గమనిస్తారు.

మీరు సమాధానాన్ని అందుకున్నట్లు, ఆ ఏంజెల్‌ను తెలుసుకోనివ్వండి మరియు ఆమెను అడగనివ్వండి: "నేను చేయగలిగే ఉన్నతమైన పని ఏమిటి? మీ లక్ష్యంలోను, మీ గొప్పప్రయత్నంలోను నేను మీకు ఎలా సహకరించగలను?"

ఆ ఏంజెల్–శిశువును మాటలు లేదా అనుభూతుల ద్వారా మీకు చెప్పన్వివండి.

చివరిగా మీ ఇద్దరి హృదయాల మధ్య విడిపోని బంధం ఏర్పడినట్లు అనుభూతి చెందిన తర్వాత, మీరు ఆ శిశువుకి వీడ్కోలు చెప్పండి.

ఈ శిశువు తరచూ మీ నుంచి ఎక్కువగా కోరుకుంటున్న విషయమే మీకు కూడా సహాయం చేస్తుంది. పిల్లలకు సహకరించడానికి ఎక్కువగా అవసరమయ్యే గుణం లేదా శక్తియే, మీ ఆత్మస్థాయిలో మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోవడానికి మరియు మాస్టర్‌గా తయారవ్వడానికి సహకరిస్తుంది. దీనికి సంబంధించిన కొన్ని ఉదాహరణలను మనం ఇప్పుడు చెప్పుకుందాం.

ఉదాహరణకు మీరు ముభావంగా ఉండే శిశువును కలిగి ఉండవచ్చు. ఈ శిశువు తరచూ తన అనుభూతులను దాచి వేస్తుంది మరియు ఆమెతో వ్యవహరించడం మీకు చాలా కష్టంగా ఉండవచ్చు. ఈ శిశువు మిమ్మల్ని అడుగుతున్నది ఏమిటంటే, మీ ఇంగితజ్ఞానం ద్వారా ఈ పిల్లలకు తగినట్టుగా శృతి చేసుకోవడం నేర్చుకోమని మరియు మీ పట్ల మీరు సహనంగా ఉంటూ మీ సొంత అనుభూతుల లోతుల్లోకి చూడడానికి సుముఖతను చూపమనే. నిజానికి, ఇదే శిశువుకి సహాయం చేస్తుంది. పిల్లలకు సహాయం చేయడంలో అభివృద్ధి చేసుకునే లక్షణాలే మీకు కూడా మీ సొంత అంతర్ అభివృద్ధికి సహాయం చేయగలవు. బహుశా మీరు చాలా విషయాల పట్ల ఖచ్చితమైన నమ్మకాలను కలిగిఉండవచ్చు లేదా మీరు చాలా ఆచరణాత్మకమైన వారు లేదా నైపుణ్యం గలవారు కావచ్చు, మరియు మీరు మనోభావం మరియు అనుభూతుల యొక్క తలాలను ఎప్పుడూ అంత లోతుగా అన్వేషించి ఉండకపోవచ్చు. మీరు సమన్వయాన్ని పున: స్థాపించుకోవడానికే, మీ శిశువు మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. మీ శిశువు బాహ్యంగా ఒక సమస్యతో మాత్రమే మీ ముందు కనిపిస్తున్నప్పటికీ, ఆ

సమస్య లోతుల్లో లోతైన అర్థం దాగి ఉంటుంది: అభివృద్ధి చేసుకోవడంలో మీకు సవాల్‌గా ఉంటున్న కొన్ని లక్షణాలన్నవి, మీ సొంత అంతర్ ఎదుగుదల యొక్క ప్రత్యేకమైన మార్గానికి కూడా అన్ని విధాల అనుకూలంగా ఉంటాయి.

మరొక ఉదాహరణ, మీరు చాలా చురుకైన మరియు బలమైన ఇచ్ఛను కలిగిన శిశువును కలిగి ఉండవచ్చు. ఆ శిశువు మీ సరిహద్దులను సులభంగా అధిగమిస్తూ, మీరు ఏం అంగీకరిస్తారో మరియు ఏం అంగీకరించరో స్పష్టంగా చెప్పమని మీపై ఒత్తిడిని కలుగజేస్తుంది. ఈ శిశువు తరచూ మిమ్మల్ని నిరాశకు గురిచేయవచ్చు మరియు చాలాసార్లు ఈ శిశువు యొక్క ఉనికి ద్వారా మీరు తీవ్రంగా ప్రభావితం చెందుతున్నట్లు అనుభూతి చెందవచ్చు. ఈ శిశువు మిమ్మల్ని అడుగుతున్నది ఏమిటంటే, మీరు మీ సరిహద్దులు ఏమిటనేవి స్పష్టంగా తెలుసుకోవాలని, అప్పుడే మీరు మీ అవసరాలను మరియు కోరికలను స్థిరమైన మరియు వ్యక్తిగత జాగురుకత మార్గంలో తెలపగలరు అని. మీ ఇద్దరి మధ్యలో చాలా ఎక్కువగా ఘర్షణలు ఏర్పడుతున్నట్లయితే, నిజానికి ఆ ఘర్షణలు మీరు ఏది సహిస్తారు మరియు ఏది సహించరు అనే వాటికి తగినట్టుగా మీ మనసును ఇంకా సిద్ధం చేసుకోలేదనే విషయాన్ని సూచిస్తాయి. మీ సొంత సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించుకోమని మరియు తనతో ఉన్న బంధంలో మీ స్థానం ఎక్కడ ఉన్నదో తెలుసుకోమని, ఆ శిశువు మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. ఈ విషయం మీ యొక్క అన్ని బంధాలపై కూడా కాంతిని ప్రసరింపజేస్తుంది. ఈ శిశువు యొక్క ప్రవర్తన (మరియు దీనిపై మీ యొక్క స్పందన) అన్నది ముందు నుంచే ఉన్న సమస్యను మరింత పెద్దదిగా చేసి చూపిస్తుంది. మీ శిశువు జన్మించక ముందు, మీరు స్వతంత్రంగా భావాలను వ్యక్తపరిచే విషయంలో సమస్యలను కలిగి ఉండవచ్చు. ఇప్పుడు నిజానికి మీరెవరనే దాని యొక్క ఎరుకను పొందమని మరియు మీ సొంత కాళ్ళ మీద మీరు నిలబడమని మీ శిశువు మిమ్మల్ని అడుగుతోంది. మీ సొంత అంతర్ ఎదుగుదల యొక్క మార్గంలో ఏది అవసరమో మీకు క్లుప్తంగా తెలియజేస్తోంది.

శిశువుకు సహకరించే లక్షణాలను మీరు అభివృద్ధి చేసుకున్నప్పుడు, దీని ద్వారా మీ ఇరువురూ కూడా సహాయాన్ని పొందుతారు. మీ అదనపు అవగాహన, ప్రేమ, స్వతంత్రత మరియు వ్యక్తిగత ఎరుక ద్వారా మీరు పిల్లలకి ఆదర్శవంతంగాను మరియు కాంతిని వెదజల్లే ఒక దీపస్తంభంగాను తయారవుతారు. ఈ విధమైన ఎదుగుదల మరియు హీలింగ్ యొక్క ప్రక్రియలో, ఒకరినొకరు పరస్పరం ఉత్తేజ పర్చుకోవడం ద్వారా భూమి మీద కొత్తశక్తి జనియిస్తుంది. తరతరాల వారికీ, ఈ

కాంతి యొక్క వెలుగు ప్రసరింపబడుతూనే ఉంటుంది మరియు ఇది ముందుకన్నా మరింత కాంతివంతంగా ప్రకాశిస్తుంది.

మీ అంకితభావం, ప్రేమ మరియు వాగ్దానాలను మేము ప్రసంశిస్తున్నాం. మీరు మరియు కొత్తపిల్లలు చేస్తున్న ఈ అన్వేషణ యొక్క ప్రక్రియలో ఆనందాన్ని మరియు ఆహ్లాదాన్ని రుచిచూడాలని మేము కోరుకుంటున్నాం. ఈ పిల్లల మీద మరియు ముఖ్యంగా మీరు తప్పకుండా చేసే పొరపాటుల మీద కరుణను కలిగి ఉంటారని మేము ఆశిస్తున్నాం. (ముఖ్యంగా ఈ పొరపాట్లు అనేవి ఎల్లప్పుడూ మీకు నేర్పించే ఆయుధాలుగా ఉంటాయని గుర్తుంచుకోండి). మీ కాగడ నిరంతరం వెలుగుతూ ఉంటుందని మరియు ఇది మీ తర్వాత వచ్చేవారికి వెలుగును ప్రసరింపజేస్తుందని మేము నమ్ముతున్నాం. మీరు ఏం చేసినా లేదా ఏం చేయకపోయినా, మీరు ఆనందాన్ని లేదా విచారాన్ని అనుభవిస్తున్నా, మీరు కరుణను లేదా తప్పొప్పుల నిర్ణయాలను కలిగి ఉన్నా, మీరు తెరవబడిన హృదయం మరియు విశ్వాసంతోనూ లేదా నిరాశ మరియు నిస్పృహలతోనూ ఉన్నా కూడా, మేము మిమ్మల్ని ఎల్లప్పుడూ ప్రేమిస్తూనే ఉంటాం. మేము మీకు మా సహకారాన్ని మరియు ప్రోత్సాహాన్ని నిరంతరం అందిస్తూనే ఉంటాం. మీరు ఎల్లప్పుడూ ఆహ్వానితులే.

* * * *

## కొత్త భూమి

ఈ యుగంలో మరియు ఈ ప్రస్తుత సమయంలో, భూమి మీద పరివర్తనం సంభవిస్తున్నది. ఇప్పుడు ఒక కొత్త చైతన్యం ఉదయిస్తున్నది, ఇది త్వరలోనో లేదా ఆ తర్వాతనో భౌతిక ఆకృతిని దాలుస్తుంది. ఈ పరివర్తనం ఎలా సంభవిస్తుంది మరియు ఏ రూపాన్ని దాలుస్తుంది అనేది ఏమాత్రం ఖచ్చితంగా ఉండదు. భవిష్యత్తు అనేది ఎల్లప్పుడూ అస్థిరంగాను మరియు నిరంతర మార్పులతోను ఉంటుంది. నిజంగా మీకు అందజేయబడే ఏకైక వస్తువు ఈ ప్రస్తుత క్షణం మాత్రమే: “వర్తమానం”. వర్తమానం నుంచే లెక్కకట్టలేనన్ని అద్భుతమైన మార్గాలు, భవిష్యత్తు యొక్క అనంతమైన సామర్థ్యాలు ఉదయిస్తాయి.

మనం గతం యొక్క ఆధారంగా భవిష్యత్తులో మిగతా విషయాలన్నింటి కంటే ముఖ్యంగా ఇదే విషయం జరుగవచ్చని అంచనా వేస్తుంటాం, కాని “ఎంపిక అనేది ఎల్లప్పుడూ మీ చేతుల్లోనే ఉంటుంది”. మీ భవిష్యత్తుని నిర్దేశించడానికి గతాన్ని అనుమతిస్తారా లేదా అనేది మాత్రం మీరే నిర్ణయిస్తారు! భవిష్యత్తు యొక్క అంచనాలనేవి ఎల్లప్పుడూ సాధ్యాసాధ్యాల మీద ఆధారపడి ఉంటాయి. సాధ్యాసాధ్యాలు అనేవి గతానికి సంబంధించినవి. మీరు ఒక వ్యక్తిగా గతంతో తెగత్రెంపులు చేసుకుని పూర్తి సరికొత్త మార్గంలో పయనించగలిగే శక్తి మీ అంతరంలో ఉంది. మీరు స్వేచ్ఛా ఎంపిక అనే బహుమతిని కలిగిఉన్నారు. మిమ్మల్ని మీరు మార్చుకోగలిగే మరియు పున:సృష్టి చేసుకోగలిగే సామర్థ్యాన్ని కలిగిఉన్నారు. ఈ సామర్థ్యంలో మీ దివ్యత్వం ఇమిడి ఉంది. శూన్యం ద్వారా సృష్టించగలిగేదే ఈ సామర్థ్యం. ఈ దివ్యత్వపు సామర్థ్యం మీరు ఎవరనే దాని యొక్క మూల సారాంశానికి సంబంధించినది.

ఈ యుగంలోని ఈ ప్రస్తుత సమయాన్ని పరివర్తనం యొక్క కాలంగాను మరియు మీ సొంత వాస్తవానికి మీరే మాస్టర్ అని మర్చిపోవద్దని గుర్తు చేసే కాలంగాను చెప్పవచ్చు. మీ ప్రత్యేకమైన ఆత్మ మార్గాన్ని లేదా మీ వాస్తవాన్ని సృష్టించే మీ ప్రత్యేకమైన సామర్థ్యం మీద ఆధిపత్యాన్ని చూపించే విశ్వశక్తి గాని లేదా ముందే నిర్దేశింపబడిన ప్రణాళిక గాని ఏమీ లేవు. ఇటువంటివి ఏమీ లేవు. భూమి మీద ఉన్న ప్రతీ ఆత్మ తన యొక్క అంతర్ వాంఛలకు తగిన మార్గంలో ఈ పరివర్తనాన్ని అనుభవిస్తుంది. ఈ పరివర్తనంలో చాలా వాస్తవాలు ఉంటాయి. మీరు ఎంపిక చేసుకున్న వాస్తవమే మీ అంతర్ అవసరాలకు మరియు కోరికలకు సమాధానాన్ని ఇస్తుంది.

ఈ సమయానికి (సుమారుగా 1950–2070) ప్రాముఖ్యతను కలిపించినది ఏమిటంటే, రెండు ప్రత్యేకమైన చైతన్యాల యొక్క చక్రాలు చివరిదశకు రావడమే: వ్యక్తిగత కాలచక్రం (లేదా వ్యక్తిగత కాలచక్రాల సమూహం) మరియు గ్రహసంబంధిత కాలచక్రం. ఈ రెండు కాలచక్రాల యొక్క సంపూర్తి(ముగింపు) ఒకే సమయంలో

సంభవిస్తున్నాయి, అందువలన ఇవి ఒకదానినొకటి బలపరుచుకుంటున్నాయి.

కొంతమంది మనుష్యులకు భూమి మీద జన్మలకు సంబంధించిన వ్యక్తిగత కాలచక్రం యొక్క ముగింపు దగ్గరపడింది. ఈ ముగింపులో ఎక్కువగా పాల్గొన్న ఆత్మలు లైట్‌వర్కర్స్. మేము ఈ లైట్‌వర్కర్ ఆత్మల యొక్క సమూహం గురించి మరింత వివరంగా చెప్పాలని అనుకుంటున్నాం. ఇక్కడ మేము ఈ వ్యక్తిగత కాలచక్రం యొక్క స్వభావాన్ని విశదీకరించాలని అనుకుంటున్నాం: దీని ద్వారా పయనించడానికి గల అర్థమేమిటి మరియు భూమి మీద ఈ కష్టతరమైన జన్మలన్నింటిని జీవించడం యొక్క ఆశయం ఏమిటి అనే వాటి గురించి.

## వ్యక్తిగత కర్మసంబంధిత కాలచక్రం

మీరు భూమి మీద ఎత్తిన మరియు అనుభవించిన జన్మలన్నీ కూడా, మీ ఆత్మ యొక్క అతిపెద్ద కాలచక్రంలో భాగంగా ఉన్నాయి. ఈ చక్రం పూర్తిగా ద్వంద్వాన్ని అనుభవించడం కోసమే రూపొందించబడింది. మీరు ఈ చక్రంలో – స్త్రీ మరియు పురుషుడిగా ఉండడం, ఆరోగ్యం మరియు అనారోగ్యంగా ఉండడం, ధనవంతుడు లేదా బీదవాడిగా ఉండడం, “మంచి” మరియు “చెడు”గా ఉండడం అన్నది ఎలా ఉంటుందో అనుభవించారు. మీరు కొన్ని జన్మలలో చాలా ఎక్కువగా భౌతిక ప్రపంచంతోనే కలుపబడి ఉన్నారు, ఉదాహరణకి ఒక రైతుగాను, కూలివాడిగాను లేదా శిల్పిగాను ఉన్నారు. మీరు ఎక్కువగా ఆధ్యాత్మికపరమైన జన్మలను ఎత్తారు, ఈ జన్మల్లో మీ ఆధ్యాత్మిక మూలాల యొక్క శక్తివంతమైన ఎరుకను మీ అంతరంలో మోస్తుండేవారు. ఈ జన్మలలో మీరు మతపరమైన వృత్తుల వైపు తరచూ ఆకర్షింపబడేవారు. మీరు  అధికారం, రాజకీయాలు మొదలైన ప్రాపంచిక విషయాలను అన్వేషించే జన్మలను కూడా ఎత్తారు. మీ యొక్క కళాత్మకమైన భావప్రకటనకు అంకితమైన జన్మలను కూడా ఎత్తారు.

తరచూ ఆత్మలు ఈ జన్మలన్నింటిలో ఏదో ఒక దాని మీద ప్రావీణ్యతను పొందుతాయి. కొన్ని క్షేత్రాల పట్ల సహజమైన అవగాహనను బహుమతిగా కలిగిఉన్న మనుష్యుల ద్వారా, మీరు ఈ ప్రావీణ్యతను స్పష్టంగా గుర్తించవచ్చు. వీరు ఒక శిశువుగా ఉన్నప్పటికీ ఆ క్షేత్రంలో సామర్థ్యాన్ని కలిగిఉన్నట్లు కనిపించవచ్చు, కాని ఈ సామర్థ్యం సరైన సమయంలో మేల్కొనాల్సిన అవసరం ఉంది మరియు ఆ తర్వాత ఇది సులభంగా అభివృద్ధి చెందుతుంది.

లైట్‌వర్కర్స్ ఆత్మలు తరచూ మతపరమైన జీవితాలకు ఆకర్షింపబడేవారు. వీరు సాధువులు, మతగురువులు, సన్యాసినులు, ఆధ్యాత్మిక వేత్తలు మొదలైన అనేకరకాల జన్మలను ఎత్తారు. వీరు భౌతిక ప్రపంచం మరియు ఆధ్యాత్మిక తలాలకు మధ్య మధ్యవర్తులుగా ఉండడానికి ఎక్కువగా ఆకర్షింపబడేవారు. అందువలన వీరు ఈ

ప్రదేశంలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్నారు. మీ నిత్యజీవితంతో సరిపడక పోయినప్పటికీ కూడా, మీరు ఆధ్యాత్మకతలో నిమగ్నమై ఉండాలనే బలమైన వాంఛను మరియు ప్రధానలక్ష్యాన్ని అనుభూతి చెందుతున్నట్లయితే, మీరు చాలావరకూ ఈ లైట్‌వర్కర్స్ యొక్క కుటుంబంలో భాగమే అని చెప్పవచ్చు.

భూమి మీద జీవించడం అనేది మీకు మానవుడిగా ఉండడం అంటే ఎలా ఉంటుందనే దాని యొక్క పూర్తి అనుభవాన్ని పొందే అవకాశాన్ని అందిస్తుంది. ఇప్పుడు మీరు ఇలా అడగవచ్చు: మానవుడిగా ఉండడంలో ఉండే ప్రత్యేకత ఏంటి? నేను దీని యొక్క అనుభవాన్ని ఎందుకు పొందాలనుకున్నాను?

మానవజీవితం యొక్క అనుభవం ప్రత్యేకంగాను మరియు అసాధారణంగాను ఉంటుంది. మీరు మానవ జీవితాన్ని జీవిస్తున్నప్పుడు, మీరు తాత్కాలికంగా భౌతిక ఇంద్రియాలు, ఆలోచనలు మరియు అనుభూతుల యొక్క శక్తివంతమైన క్షేత్రంలో మునిగిపోవచ్చు. ఈ క్షేత్రంలో ద్వంద్వం ఇమిడి ఉండడం వలన, మీరు ఇక్కడ పొందే అనుభవాలలో గొప్ప వ్యత్యాసాన్ని మరియు తీవ్రతను రుచి చూస్తారు, ఈ అనుభవాలు మీరు ఆస్ట్రల్ తలాలుగా పిలుస్తున్న వాటిలో పొందిన దాని కంటే కూడా చాలా గొప్పగా ఉంటాయి. (ఆస్ట్రల్ తలాలు అంటే మీరు చనిపోయిన తర్వాత ప్రవేశించే తలాలు మరియు మీరు ఇక్కడ జన్మకి–జన్మకి మధ్య ఉన్న సమయంలో ఉంటారు.) దీనిని ఊహించడం మీకు కష్టంగా ఉండవచ్చు, కాని మా వైపు ఉన్న చాలా ఆత్మలు భౌతిక జన్మలలో ఉండడానికి ఇష్టపడతాయి. ఈ ఆత్మలు మానవులుగా ఉండడాన్ని, మానవ అనుభవాన్ని పొందడాన్ని ప్రేమిస్తారు. మానవ అనుభవం ఒక విధమైన నిజతత్వాన్ని కలిగి ఉంటుంది, ఇది వీరికి చాలా అమూల్యమైనది. వీరి ఊహాశక్తి ద్వారా లెక్కలేనన్ని వాస్తవాలను సృష్టించినప్పటికీ కూడా, భూమి మీద ఒక "నిజమైన" వాస్తవం యొక్క సృష్టి ఇచ్చే గొప్ప సంతృప్తి కంటే చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి.

భూమి మీద సృష్టి ప్రక్రియ అనేది తరచూ ఒక పోరాటంగా ఉంటుంది. మీ కలలను నిజం చేసుకోవడంలో మీరు చాలా అడ్డులను ఎదుర్కొనవలసి వస్తుంది. ఆస్ట్రల్ ప్రపంచంలో మనసు పరమైన సృష్టి చాలా సులభంగా ఉంటుంది. ఏదైనా ఒక ఆలోచనకు మరియు దీని యొక్క నిజమైన సృష్టికి మధ్య సమయం ఎక్కువ పట్టదు. అవి వెనువెంటనే వాస్తవరూపాన్ని ధరిస్తాయి. మీరు కోరుకున్న లేదా ఆలోచించిన ఏ వాస్తవాన్నైనా సృష్టించగలరు. అక్కడ ఎటువంటి హద్దులు ఉండవు. అక్కడ మీరు ఒక అందమైన తోటను ఊహించిన క్షణంలోనే అది సృష్టింపబడి, మీరు ప్రవేశించడానికి మీ ముందు సిద్ధంగా ఉంటుంది.

భూమి మీద ఒక ఆలోచనకు లేదా ఒక ఉద్దేశ్యానికి జన్మను ఇవ్వడానికి మరియు దానిని భౌతిక ప్రపంచంలో వాస్తవంగా రూపొందించడానికి గట్టి ప్రయత్నం

చెయ్యాలి. ఇది బలమైన వాంఛను, స్థిరత్వాన్ని, మనసు యొక్క స్పష్టతను మరియు విశ్వసించే హృదయాన్ని బలంగా కోరుతుంది. భూమి మీద మీరు భౌతిక ప్రపంచం యొక్క నెమ్మదితనంతోను మరియు స్థిరత్వం లేదా దృఢత్వాలతోను వ్యవహరించాలి. మీ పట్ల మీకున్న వ్యతిరేక భావాలతోనూ వ్యవహరించాలి: సందేహం, నిరాశ, అజ్ఞానం, అవిశ్వాసం మొదలైన వాటితో వ్యవహరించాలి. ఈ భావాలు సృష్టి ప్రక్రియను నిరోధించవచ్చు లేదా అపజయాన్ని పొందేలా చేయవచ్చు. ఈ శక్తివంతమైన సమస్యలు, ఈ అపజయాలు అనేవి భూమి మీద జీవితం యొక్క అనుభవం మరింత విలువైనదిగా తయారుచేస్తున్నాయి. ఈ ప్రక్రియలో మీరు ఎదుర్కొనే సవాళ్ళు మీకు గొప్ప గురువులుగా ఉంటున్నాయి. ఈ సవాళ్ళు అనేవి భూమి మీద అనుభవానికి గాంభీర్యత్వాన్ని కలుగజేస్తూ, అంటే ఆస్ట్రల్ తలాలలోని సులభమైన సృష్టి ప్రక్రియ కంటే కూడా మరింత లోతుగాను మరియు విస్తృతంగాను ఉండడాన్ని అనుభూతి చెందేలా చేస్తున్నాయి. ఈ విధమైన సులభత్వం ఒక రకమైన అర్థరాహిత్యాన్ని సృష్టిస్తుంది. ఇప్పటివరకూ భూమి మీద జీవితాన్ని అనుభవించని ఆస్ట్రల్ ఆత్మలకు, 'భూమి మీద జీవితం' యొక్క విలువ తెలుసు.

మీ జీవితంలో జరుగుతున్న సంఘటనలను తిరస్కరించడం వలన మీరు తరచూ నిరుత్సాహానికి మరియు నిరాశకు లోనవుతారు. చాలా తరచుగా ఈ సంఘటనలు మీ కోరికలకు మరియు మీ ఆశలకు సమాధానమివ్వవు. బాధ మరియు నిరాశలలో మీ యొక్క సృజనాత్మకమైన వాంఛలు అంతమవుతున్నట్లు మీకు అనిపించవచ్చు. కాని ఏదో ఒక స్థితిలో మీరు ప్రశాంతత మరియు ఆనందాలకు మార్గాన్ని కనుగొంటారు. మీ సొంత హృదయంలోనే ఆ మార్గాన్ని కనుగొంటారు. మీరు ఈ విధంగా కనుగొన్నప్పుడు, ఆస్ట్రల్ తలాలలో సృష్టింపబడిన ఏ సంఘటనతోనూ పోల్చలేనంత అమితమైన ఆనందం మీ ముందు సంభవిస్తుంది. ఇది మీ ఆధిపత్యం, మీ దివ్యత్వం యొక్క పుట్టుకగా ఉంటుంది.

మీ దివ్యత్వం మేల్కొంటున్నప్పుడు మీరు అనుభవించే ఆనందానుభూతి, మిమ్మల్ని మీరు హీల్ చేసుకునే సామర్థ్యాన్ని మీకు అందిస్తుంది. ఈ దివ్యత్వపు ప్రేమ, మీరు భూమి మీద జీవించిన జన్మలన్నింటి ద్వారా  పొందిన లోతైన గాయాల నుంచి ఉపశమనాన్ని పొందడంలో మీకు సహాయం చేస్తుంది.

దీని తర్వాత, మీరు ఇవే బాధలు మరియు ఇవే త్రోవల ద్వారా పయనిస్తున్న వారికి హీల్ చేసుకోవడంలో సహాయం చేయగలరు. మీరు వారి యొక్క బాధను గుర్తిస్తారు. మీరు ఈ బాధను వారి కళ్ళల్లో చూస్తారు. మీరు ఇతరులకు వారి సొంత మార్గంలో దివ్యత్వాన్ని చేరడానికి గైడ్ చేయగలరు.

**ద్వంద్వం ద్వారా పయనించడం యొక్క ఆశయం**

దయచేసి భూమి మీద ఉన్న మీ జన్మల యొక్క అర్థాన్ని తక్కువగా అంచనా

వేయవద్దు. మీరు మూల చైతన్యం యొక్క అత్యంత సృజనాత్మకతమైన, ఉన్నతమైన మరియు సాహసోపేతమైన భాగానికి సంబంధించిన వారు. మీరు తెలియని ప్రదేశాలను కనుగొనే అన్వేషకులు మరియు కొత్తదనం యొక్క సృష్టికర్తలు. ద్వంద్వం యొక్క తలం ద్వారా మీరు చేసిన అన్వేషణలు అన్నవి మీ ఊహాశక్తిని అధిగమించి ఉన్న ఆశయానికి సహకరించాయి. మీ ప్రయాణాల యొక్క లోతైన అర్థాన్ని మీకు విశదీకరించి చెప్పాలంటే చాలా కష్టం, కాని మీరు ముందెన్నడూ లేని ఒక కొత్తరకపు చైతన్యాన్ని సృష్టించారనే విషయాన్ని మేము మీకు చెప్పగలం.

మొదటిగా ఈ చైతన్యం క్రీస్తు ద్వారా అంటే అతను భూమి మీద జీవించినప్పుడు అతని ద్వారా ప్రసరింపబడింది. ఈ చైతన్యాన్ని నేను క్రీస్తు చైతన్యంగా పిలుస్తాను, ఇది ఆధ్యాత్మిక ఆల్కెమి నుంచి పుట్టినది. భౌతికపరమైన ఆల్కెమి అనేది లోహాన్ని బంగారంగా పరివర్తనం చెందించే ఒక కళ. ఆధ్యాత్మిక ఆల్కెమి అనేది చీకటి శక్తిని "మూడవశక్తి"గాను, ఆధ్యాత్మిక బంగారంగాను పరివర్తనం చెందించే ఒక కళ. ఈ మూడవశక్తి, ఈ ఆధ్యాత్మిక బంగారం క్రీస్తుశక్తిలో ఉంటాయి.

మేము చీకటిని వెలుగుగా, చెడును మంచిగా పరివర్తనం చెందించే ఆశయం గురించి చెప్పడం లేదనే విషయాన్ని దయచేసి గమనించండి. చీకటి మరియు వెలుగు, మంచి మరియు చెడు అనేవి సహజమైన వ్యతిరేకాలు; ఇవి ఒకదాని ఆకర్షణను మరొకటి కలిగి ఉంటాయి.

నిజమైన ఆధ్యాత్మిక ఆల్కెమి "మూడవశక్తిని", ఒక విధమైన చైతన్యాన్ని పరిచయం చేస్తుంది. ఈ చైతన్యం ప్రేమ మరియు అవగాహన యొక్క శక్తులతో, పూర్తి వ్యతిరేకాలైన చీకటి-వెలుగుల రెండింటిని హత్తుకుంటుంది. మీ ప్రయాణం యొక్క నిజమైన ఆశయం: చీకటిని వెలుగు ఆక్రమించడం ఎంతమాత్రం కాదు, ఈ వ్యతిరేకాల రెండింటిని అధిగమిస్తూ మరియు చీకటి-వెలుగుల రెండింటి మధ్య ఐకమత్యాన్ని పెంపొందించ గల ఒక కొత్త రకమైన చైతన్యాన్ని సృష్టించడమే.

ఈ కష్టమైన అంశాన్ని ఒక పోలిక ద్వారా వివరించాలని అనుకుంటున్నాను. లోతైన సముద్రంలో ముత్యాలను అన్వేషించే ఒక గజఈత గాడిగా మిమ్మల్ని మీరు ఊహించుకోండి. మీరు ఈ ప్రత్యేకమైన ముత్యం కోసం అన్వేషించడానికి సముద్రంలో మళ్ళీ మళ్ళీ దూకుతుంటారు. ఈ ముత్యం గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడే వారేగాని నిజానికి చూసిన వారు ఎవరూ లేరు. ప్రధాన ఈతగాడైన ఆది దైవం కూడా ఈ ముత్యాన్ని స్పృశించలేదనే పుకార్లు అంతటా వ్యాపించాయి.

సముద్రంలో దూకడం అన్నది పూర్తి అపాయకరమైన అంశం. ఎందుకంటే మీరు మీ ప్రాణాన్ని కోల్పోవచ్చు లేదా మీరు సమయానికి శ్వాసను తీసుకోలేనంత లోతుకి వెళ్ళవచ్చు. అయినప్పటికీ మీరు పట్టు వదలకుండా ఈ సముద్రంలో మళ్ళీ మళ్ళీ దూకుతున్నారు. ఎందుకంటే మీరు దీనిని సాధించాలనే పట్టుదలను మరియు

ఉత్తేజాన్ని కలిగి ఉన్నారు కాబట్టి. మీరు మానసిక రోగులా?

కాదు, మీరు కొత్తదనం యొక్క అన్వేషకులు.

రహస్యం ఏమిటంటే: మీరు ముత్యాన్ని అన్వేషించే ప్రక్రియలో మీరే ముత్యాన్ని సృష్టిస్తున్నారు. ముత్యం అనేది క్రీస్తు చైతన్యం యొక్క ఆధ్యాత్మిక బంగారం. ద్వంద్వం యొక్క అనుభవం ద్వారా పరివర్తనం చెందిన ముత్యం మీరే.

మనం ఇక్కడ ఒక నిజమైన విరుద్ధాంశాన్ని కలిగి ఉంటున్నాం: కొత్తదనాన్ని అన్వేషించడంలో, మీరే కొత్తదనాన్ని సృష్టించడం. "మీరే దివ్యత్వపు సృష్టి యొక్క ముత్యంగా రూపొందడం".

దీనిని దైవం లేదా దివ్యత్వం మరొక మార్గంలో చేసే అవకాశం లేదు. ఎందుకంటే మీరు అన్వేషించడానికి ప్రయత్నిస్తున్న దాని యొక్క ఉనికి లేదు కాబట్టి; ఇది మీ ద్వారా సృష్టింపబడాలి. దైవం ఏదో కొత్తదనాన్ని సృష్టించడంలో ఎక్కువ ఇష్టాన్ని ఎందుకు చూపించాడు? సాధ్యమైనంత సులభమైన మార్గంలో దీనిని మనం చెప్పుకుందాం.

మొదటిది, దైవం పూర్తిగా 'మంచివాడు'. ఈ మంచితనం ప్రతీచోట మరియు విశ్వమంతటా వ్యాపించి ఉన్నది. నిజానికి ఇది తప్ప మరేదీ లేకపోవడం వలన పరిస్థితులు ఒక విధమైన స్థిరత్వాన్ని కలిగి ఉండేవి. అందువలన అతని యొక్క సృష్టి సజీవత్వాన్ని కోల్పోయింది; ఇది ఎదుగుదల మరియు విస్తరణల యొక్క అవకాశాన్ని కోల్పోయింది. దీనిని మీరు స్థంభన దశగా చెప్పవచ్చు.

దైవం కదలిక మరియు విస్తరణల కోసం మార్పును, అవకాశాన్ని సృష్టించడానికి – విశ్వమంతటా వ్యాపించి ఉన్న తన మంచితనానికి పూర్తి వ్యతిరేకంగా ఉండే ఒక లక్షణాన్ని తన సృష్టిలో పరిచయం చేశాడు. ఇది దైవానికి చాలా కష్టతరంగా ఉండేది. ఎందుకంటే 'మీరు–కాని' దానిని మీరు ఎలా సృష్టించగలరు? మంచితనం, చెడుతనాన్ని ఎలా సృష్టించగలదు? ఇది అసాధ్యం. అందువలన దైవం ఒక గారడీని ప్రదర్శించాల్సి వచ్చింది. ఈ గారడీనే అజ్ఞానంగా పిలువవచ్చు.

అజ్ఞానం అన్నది మంచితనాన్ని వ్యతిరేకించే ఒక గుణం. ఇది మంచితనానికి ఆవలివైపు ఉన్నాననే భ్రమను మరియు దైవం నుంచి వేర్పడి ఉన్నాననే భ్రమను సృష్టిస్తుంది. మీ విశ్వంలోని మార్పు, ఎదుగుదల మరియు విస్తరణల వెనుకనున్న ప్రోత్సాహం: "మీరు ఎవరో తెలియకపోవడమే". అజ్ఞానం భయాన్ని సృష్టిస్తుంది, భయం అదుపు యొక్క అవసరాన్ని సృష్టిస్తుంది, అదుపు యొక్క అవసరం అనేది అధికారం కోసం పోరాటాన్ని సృష్టిస్తుంది మరియు అక్కడ చెడు వికసించడానికి కావలసిన పరిస్థితులన్నింటిని మీరు కలిగిఉంటారు. ఈ విధంగా మంచి మరియు చెడు మధ్య పోరాటం కోసం రంగస్థలం ఏర్పాటు చేయబడింది.

దైవం తన సృష్టిలో “చలనాన్ని” తీసుకురావడం కోసం అతనికి చురుకైన వ్యతిరేకాల యొక్క అవసరం ఏర్పడింది. అజ్ఞానం మరియు భయాల ద్వారా మీలో ఏర్పడిన బాధలన్నింటి వలన, దీనిని అర్థం చేసుకోవడం మీకు చాలా కష్టంగా అనిపించవచ్చు. కాని, దైవం ఈ శక్తులలో గొప్ప విలువను పొందుపరచాడు, ఎందుకంటే అవి అతనిని/ఆమెను అధిగమించి వెళ్ళే మార్గాన్ని అతనికి అందించాయి కాబట్టి.

దైవం తన యొక్క అత్యంత సృజనాత్మకతమైన, ఉన్నతమైన మరియు సాహసోపేతమైన భాగానికి సంబంధించిన మిమ్మల్ని అజ్ఞానం యొక్క పొరను స్వీకరించమని అడిగింది. సాధ్యమైనంత క్షుణ్ణంగా చురుకైన వ్యతిరేకాలను అనుభవించడం కోసం మీరు మీ నిజస్వభావం యొక్క మరుపులో తాత్కాలికంగా మునగాల్సి వచ్చింది. మీరు ఈ అజ్ఞానంలోకి దూకడానికి సమ్మతించారు, కాని మరుపు అనే పొర అధికంగా కమ్ముకుని ఉండడం వలన మీరు ఈ నిజాన్ని కూడా మర్చిపోయారు. అందువలన మీరు ఇప్పుడు ఈ స్థితిలో ఉ ండడానికి కారణమైన దేవుడిని తరచూ తిట్టుకుంటారు: కష్టాలు మరియు అజ్ఞానాన్ని కలిగి ఉన్నందువలన – మేము దీనిని అర్థం చేసుకోగలం. నిజానికి మూల సారాంశం ఏమిటంటే: మీరే దైవం, దైవమే మీరు.

సమస్యలు మరియు బాధలు ఉన్నప్పటికీ, మీ లోతైన అంతరంలో ద్వంద్వంలో జీవించడం, కొత్తదనాన్ని అనుభవించడం మరియు సృష్టించడానికి సంబంధించిన ఉ త్తేజం మరియు ఆశ్చర్యం యొక్క భావనలు ఇంకా అలాగే ఉన్నాయి. ఇది దైవం యొక్క అసలైన ఉత్తేజం, ఈ ఉత్తేజం వలనే దైవం మొదటిగా మీ ద్వారా తన ప్రయాణాన్ని ఆరంభించాడు.

మీరు ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టినప్పుడు, మీ మనసులో ఉన్న అస్పష్టమైన మంచి(ఇంటి) యొక్క జ్ఞాపకంతోనే చెడును(భయం, అజ్ఞానం) ఎదుర్కొన్నారు. మీరు ఇంటికి చేరాలనే కోరిక వలన భయం మరియు అజ్ఞానంతో ఘర్షణ పడడం మొదలుపెట్టారు. మీరు గతంలో అనుభూతి చెందిన మీ ఇంటికి తిరిగి చేరలేరు. ఎందుకంటే మీ ప్రయాణం వలన సృష్టి మార్పుచెందింది కాబట్టి.

మీరు మంచి–చెడు, చీకటి–వెలుగుల కంటే ఉన్నతంగా తయారయినప్పుడే మీ ప్రయాణం ముగుస్తుంది. మీరు పరస్పర వ్యతిరేకాల రెండింటిని (చీకటి–వెలుగు) హత్తుకునే మరియు అధిగమించే మూడవశక్తిని, క్రీస్తుశక్తిని సృష్టిస్తారు. మీరు దైవం యొక్క సృష్టిని విస్తరింపజేస్తున్నారు. మీరు దైవం యొక్క కొత్త సృష్టిగా ఉ ంటారు. భూమి మీద క్రీస్తు చైతన్యం పూర్తిగా జన్మించినప్పుడే, దైవం తనను తాను అధిగమించి ముందుకు పయనిస్తుంది.

“మానవ అనుభవానికి” ముందు క్రీస్తు చైతన్యం లేదు. క్రీస్తు చైతన్యం

అంటే, ద్వంద్వం యొక్క చాలా పొరల ద్వారా అనుభవాన్ని పొందిన వ్యక్తి యొక్క చైతన్యమే. ద్వంద్వాన్ని పూర్తిగా అనుభవించి అవగాహన చేసుకున్న వ్యక్తే "ఇతర తలాలకు" వెళ్ళగలడు. అతడే కొత్తభూమిలో నివసించగలడు. అతనే ద్వంద్వాన్ని విడుదల చేయగలడు. అతను తన సొంత దివ్యత్వాన్ని గుర్తిస్తూ దానిని హత్తుకోగలడు. అతను తన ప్రజ్ఞాత్మతో ఐక్యమవ్వగలడు. కాని అతని యొక్క ప్రజ్ఞాత్మ ఇంతకుముందు కంటే భిన్నంగా ఉంటుంది. చైతన్యం అది జన్మించిన స్థితి కంటే చాలా ఉన్నతంగాను మరియు గంభీరంగాను ఉంటుంది. లేదా దైవం, ద్వంద్వం యొక్క అనుభవం ద్వారా ప్రయాణించడం వలన తనను తాను అభివృద్ధి చేసుకున్నాడని కూడా చెప్పవచ్చు.

ఈ కథ ఏమాత్రం వక్రభాష్యం లేకుండా సులభంగా చెప్పాను. ఎందుకంటే మేము ఏం చెప్పినా కూడా అది కాలం మరియు వేర్పాటు యొక్క భ్రమల వలన తప్పుగా అర్థం చేసుకోబడుతుంది కాబట్టి. ఈ భ్రమలు ఒక విలువైన ఉద్దేశాన్ని అందించాయి. కాని వీటి అన్నింటిని అధిగమించి ముందుకు వెళ్ళే సమయం ఆసన్నమైంది. దయచేసి మా మాటలు, కథలు మరియు ఊహాలకు వెనుకనున్న శక్తిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. ఈ శక్తి మీ సొంతమనే భావనలో ఉండండి. ఇది "మీ భవిష్యత్తు యొక్క క్రీస్తుతత్వపు శక్తి" నా ద్వారా(జెషువా) మీతో మాట్లాడుతున్నది. మీరు మాతో కలవడానికి మేము ఎదురుచూస్తున్నాం.

## ద్వంద్వాన్ని ఎలా అధిగమించాలి - కర్మచక్రం యొక్క ముగింపు

మీ మీద ద్వంద్వం యొక్క ఆట ప్రభావం లేనప్పుడు, భూమి మీద మీరు జీవించిన జన్మలన్నింటి యొక్క కాలచక్రం ముగుస్తుంది. పరస్పర విరుద్ధాంశాల యొక్క రంగస్థలంలోని ఏదో ఒక పాత్ర ద్వారా మిమ్మల్ని మీరు గుర్తించుకోవడం అన్నది ద్వంద్వం యొక్క ఆటకు అత్యవసరం. ధనిక లేదా పేద, పొగరు లేదా వినయం, ఆడ లేదా మగ, హీరో లేదా విలన్‌గా ఉన్న ఏదో ఒక పాత్రలో మిమ్మల్ని మీరు గుర్తిస్తారు. నిజానికి మీరు ఏ పాత్రను పోషిస్తున్నారనేది ఇక్కడ అంత ముఖ్యం కాదు. రంగస్థలంలో పోషిస్తున్న ఆ ఒక్క పాత్రనే మీరుగా భావించినట్లయితే, ద్వంద్వం మీపై ఇంకా గట్టి ప్రభావాన్ని చూపిస్తున్నట్లే.

నిజానికి ఇది ఏమాత్రం తప్పు కాదు. ఇది ఈ రకంగానే తయారు చేయబడింది. మీరు ఈ ఆటలో మీ నిజతత్వం గురించి మర్చిపోవాలని అనుకున్నారు. ద్వంద్వం యొక్క అన్ని లక్షణాలను అనుభవించడానికి, మీరు భూమి మీద జీవితం యొక్క నాటకంలోని ఒక ప్రత్యేక పాత్రకు తగినట్టుగా మీ చైతన్యాన్ని కుదించుకున్నారు.

మీరు ఈ నాటకాన్ని బాగా పోషించారు. మీ జీవిత చక్రం ఆరంభమవ్వడానికి కారణమైన ఆశయం మరియు లక్ష్యాల గురించి పూర్తిగా మర్చిపోయేంతగా, మీరు మీ పాత్రలలో నిమగ్నులయ్యారు. మీరు ద్వంద్వం యొక్క ఆటలు మరియు నాటకాలకు

సంబంధించిన వాస్తవం మాత్రమే ఉందని బలంగా నమ్ముతూ, మీ గురించి మీరు పూర్తిగా మర్చిపోయారు. చివరికి ఇది మిమ్మల్ని ఒంటరిగాను మరియు పూర్తి భయపూరితంగాను తయారు చేసింది. ఇది ఎంతమాత్రం ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే, ముందు చెప్పినట్టుగా ద్వంద్వం యొక్క ఆట మొదలైనప్పటి నుంచి, ఈ ఆట అజ్ఞానం మరియు భయం యొక్క లక్షణాల మీదే ఆధారపడి ఉన్నది కాబట్టి.

మీ నిత్య జీవితంలో ద్వంద్వం యొక్క పనితీరును అర్థం చేసుకోవడానికి మేము ద్వంద్వం ఆట యొక్క

ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలను ఇక్కడ చెప్పాలనుకుంటున్నాను.

## ద్వంద్వం ఆట యొక్క ప్రత్యేక లక్షణాలు

1) ముఖ్యంగా మీ మనోభావపరమైన జీవితం చాలా అస్థిరంగా ఉంటుంది.

మనోభావపరమైన భద్రతను కలిగి లేకపోవడం వలన, మీరు ఎల్లప్పుడూ ఒకానొక మన:స్థితి యొక్క పై వైపునో లేదా క్రింది వైపునో ఉంటారు. మీరు కోపం లేదా క్షమించడం, సంకుచిత స్వభావం లేదా విశాలవైఖరి, నిరాశ లేదా ఉత్సాహం, సంతోషం లేదా దు:ఖం మొదలైన వాటిలో ఏదో ఒక వైపున మాత్రమే ఉంటారు. మీ మనోభావాలు వీటి అంచుల మధ్య నిరంతరం అటూ-ఇటూ కదలాడుతుంటాయి. మీరు ఈ కదలికలపై పరిమితమైన అదుపును మాత్రమే కలిగి ఉన్నట్లు మీకు అనిపించవచ్చు.

2) మీరు బాహ్య ప్రపంచంలో అత్యధికంగా పాల్గొంటారు.

ఇతరులు మిమ్మల్ని ఎలా నిర్ణయిస్తున్నారు అనేది మీకు చాలా ముఖ్యమైన విషయం. మీరు ఎవరనే దాని గురించి మీ బాహ్యప్రపంచం (సమాజం లేదా మీరు ప్రేమించిన వారు) మీకు ఏదైతే తిరిగి చూపిస్తోందో దాని మీదే మీ ఆత్మగౌరవం ఆధారపడి ఉంటుంది. ఇతరుల యొక్క మంచి-చెడుల ఆదర్శాలకు అనుగుణంగా మీరు జీవించడానికి ప్రయత్నిస్తున్నారు. మీరు దీనిని మీకు సాధ్యమైనంత గొప్పగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

3) ఏది మంచి, ఏది చెడు అనే వాటిపై మీకు బలమైన అభిప్రాయాలు ఉన్నాయి. ప్రతీ దానిని విశ్లేషిస్తూ నిర్ణయించే వారిగా ఉండడం అనేది మీకు భద్రతా భావనను కలిపిస్తుంది. ఎవరైతే పనులను, ఆలోచనలను లేదా మనుష్యులను తప్పొప్పులుగా విభజిస్తారో, వారి యొక్క జీవితం చాలా ఉన్నతంగా ఉన్నట్టు అనిపిస్తుంది.

ఈ లక్షణాలన్నింటిలో సాధారణంగా ఉండే విషయం ఏమిటంటే, మీరు చేస్తున్న లేదా అనుభూతి చెందుతున్న వాటిలో మీ చైతన్యం నిజంగా ఉండకపోవడమే. “మీ చైతన్యం” అనేది మీ ఉనికి యొక్క బాహ్యపు పొరలలో నివసిస్తుంది, ఇక్కడ మీ చైతన్యం భయపూరిత ఆలోచనారీతి మరియు ప్రవర్తనల యొక్క పద్ధతుల ద్వారా నడుపబడుతుంది.

ఇక్కడ నేను మీకు ఒక ఉదాహరణను ఇవ్వాలనుకుంటున్నాను. మీరు ఎల్లప్పుడూ మంచిగాను మరియు అంగీకార వైఖరితోనూ ఉండడానికి అలవాటు పడినట్లయితే, మీరు ఒక విధమైన ప్రవర్తనా పద్ధతిని ప్రదర్శిస్తుంటారు. కాని ఈ ప్రవర్తన మీ అంతర్ ఉనికి నుంచి చిగురించినది మాత్రం కాదు. నిజానికి మీరు మీ యొక్క అంతర్భాగం నుంచి వచ్చే సంకేతాలను అణచి వేస్తున్నారు. మీరు ఇతరుల యొక్క ప్రేమ, వాత్సల్యం లేదా భద్రతలను పోగొట్టుకోకూడదనే ఉద్దేశ్యంతో, మీరు వారి అంచనాలకు తగినట్టుగా జీవించడానికి ప్రయత్నిస్తుంటారు. ఇక్కడ మీరు భయం నుంచి ప్రతిస్పందిస్తున్నారు. మీ వ్యక్తిగత భావప్రకటన విషయంలో మిమ్మల్ని మీరు అదుపు చేస్తుంటారు. ఇచ్చను వ్యక్తపర్చని ఈ మీ యొక్క భాగం తన సొంతంగా రహస్యపు జీవితాన్ని గడుపుతూ, మీ ఉనికిలో అసంతృప్తిని మరియు అలసటను సృష్టిస్తుంది. దీని వలన మీ అంతరంలో కోపం మరియు చిరాకు ఉన్నాయనే విషయం ఎవ్వరికీ తెలియక పోవచ్చు, నిజానికి మీకు కూడా తెలియక పోవచ్చు!

ఈ వ్యక్తిగత–తిరస్కరణ యొక్క స్థితి నుంచి బయటకు వచ్చే మార్గమేమిటంటే, మీ అంతరంలో అణచివేసిన మరియు రహస్యంగా దాగిఉన్న భాగాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడమే.

మీ అంతరంలోని అణచివేసిన మరియు రహస్యంగా దాగిఉన్న భాగాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అంత కష్టమైన విషయమేమి కాదు, ఎందుకంటే ఇది చేయడానికి ఎటువంటి ప్రత్యేక నైపుణ్యాలు లేదా జ్ఞానం యొక్క అవసరం లేదు కనుక. “అంతరంలోకి వెళ్ళడాన్ని” కష్టమైన ప్రక్రియగా తయారు చేయవద్దు, అంటే ఈ ప్రక్రియను ఇతరులు మీకు బోధించాలి లేదా వారు మీకోసం చేయాలి అనే విధంగా తయారు చేయవద్దు. మీరు ఈ ప్రక్రియను మీ అంతట మీరుగా చేయగలగాలి మరియు దీనిని చేయడానికి మీ సొంత మార్గాలను కనుగొనాలి. ఈ ప్రక్రియలో నైపుణ్యాలు మరియు పద్ధతుల కంటే కూడా ఉద్దేశ్యం మరియు తపనలే అధిక ప్రాముఖ్యను కలిగి ఉంటాయి. నిజంగా మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనే తపనను కలిగి ఉన్నప్పుడు, మీ లోతైన అంతరంలోకి వెళ్ళాలని మరియు మీ సంతోషకరమైన మరియు సంతృప్తికరమైన జీవితం యొక్క మార్గాన్ని అడ్డుకుంటున్న భయపూరిత ఆలోచనలు మరియు మనోభావాలను మార్చాలని నిర్దేశించుకున్నప్పుడు, మీరు ఈ ప్రక్రియను మీ మార్గంలో ఎదురయ్యే ఏ పద్ధతి ద్వారానైనా కూడా చేయగలరు.

మేము ఒక సులభమైన ధ్యాన పద్ధతిని మీకు అందించాలని అనుకుంటున్నాము, ఇది మీ మనోభావాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి సహాయం చేయవచ్చు.

మీ భుజాలు మరియు మెడలోని కండరాలలో ఎటువంటి బిగింపులు లేకుండా వదులుచేయండి, మీ వెన్నుముకను నిటారుగా ఉంచుతూ కూర్చోండి మరియు మీ పాదాలను నేలకు తాకేటట్టు ఉంచండి. ఒకసారి లోతైన సుదీర్ఘ శ్వాసను తీసుకోండి.

ఒక విశాలమైన మార్గంలో నడుస్తున్నట్లు మిమ్మల్ని మీరు ఊహించుకోండి. మీరు ప్రకృతి యొక్క ధ్వనులను వింటున్నారు మరియు మీ కేశాల యొక్క తాకిడి ద్వారా గాలిని అనుభూతి చెందుతున్నారు. మీరు స్వేచ్ఛగాను మరియు సంతోషంగాను ఉన్నారు. మీరు ఆ మార్గంలో క్రిందకు పయనిస్తున్నప్పుడు మీరు అకస్మాత్తుగా మీ వైపు కొంతమంది పిల్లలు పరిగెత్తుకుని రావడం చూస్తారు. వారు మీకు సన్నిహితంగా వస్తున్నారు. మీ హృదయం ఈ దృశ్యానికి ఎలా స్పందిస్తోంది?

మీ ముందు పిల్లలు ఉన్నారు. వారు ఎంత మంది ఉన్నారు? వారు చూడడానికి ఎలా ఉన్నారు? వారు ఆడపిల్లలా, మగపిల్లలా లేదా ఇద్దరూనా?

మీరు వారందరిని పలకరించండి. మీరు వారిని చూసినందుకు ఎంత సంతోషంగా ఉన్నారనేది వారికి తెలపండి. ఆ తర్వాత ముఖ్యంగా మీ కళ్ళలోకి చూస్తున్న పిల్లవాడితో బంధాన్ని ఏర్పరుచుకోండి. ఆమె లేదా అతను మీ కోసం ఒక సందేశాన్ని కలిగిఉంది. ఆ సందేశం ఆ శిశువు కళ్ళల్లో రాసి ఉంది. మీరు దానిని చదవగలరా? అది మీకు ఏం చెప్పాలనుకుంటోంది? ప్రస్తుతం మీకు అవసరమైన ఒక శక్తిని మీ కోసం తీసుకువచ్చింది. ఈ అంతర్ శిశువు మీకు అందించిన శక్తికి పేరు పెట్టండి. దానిని నిర్ణయించవద్దు. ఆమె లేదా అతనికి కృతజ్ఞతలు తెలపండి. ఆ తర్వాత ఆ దృశ్యాన్ని విడుదల చేయండి.

మీ పాదాల క్రింద భూమి స్థిరంగాను మరియు దృఢంగాను ఉండడాన్ని మళ్ళీ అనుభూతి చెందండి మరియు ఒక క్షణం లోతుగా శ్వాసను తీసుకోండి. మీరు ఇక్కడ మీ యొక్క రహస్యపు భాగంతో బంధాన్ని ఏర్పరుచుకున్నారు.

మీరు ఎప్పుడైనా ఈ దృశ్యానికి తిరిగి వెళ్ళగలరు మరియు అదే విధంగా అక్కడ ఉన్న వేరే పిల్లలతో కూడా మాట్లాడగలరు.

అంతరంలోకి వెళుతూ మీ యొక్క అణచివేయబడిన మరియు రహస్యంగా దాగిఉన్న భాగాలతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా మీ యొక్క ఉనికిలో మరింతగా ఉండగలుగుతారు. మీరు చాలాకాలం అనుమతించిన భయప్రేరిత ఆలోచనారీతి మరియు ప్రవర్తనల యొక్క పద్ధతులను మీ చైతన్యం ఇప్పుడు అధిగమించగలదు. మీ చైతన్యం తన బాధ్యతను తాను స్వీకరిస్తుంది. ఒక తండ్రి తన బిడ్డని సంరక్షించినట్టుగా,

ఇది అంతరంలోని బాధ, కోపం మరియు విచారం యొక్క భద్రతను స్వీకరిస్తుంది.

### ద్వంద్వాన్ని విడుదల చేయడం యొక్క లక్షణాలు

1) మీ ఆత్మ యొక్క భాషను వినాలి, ఇది మీ అనుభూతుల ద్వారా మీతో మాట్లాడుతుంది.

2) మీరు ఈ భాషకు తగినట్టుగా నటించాలి మరియు మీ ఆత్మ కోరుకున్న మార్పులను మీరు సృష్టించాలి.

3) మీరు ఒంటరిగా నిశ్శబ్ధంలోఉండడానికి అధిక ప్రాముఖ్యతను ఇవ్వాలి, ఎందుకంటే మీరు నిశ్శబ్ధంలోనే మీ ఆత్మ యొక్క గుసగుసలను వినగలరు కాబట్టి.

4) మీ నిజమైన ఉత్తేజం మరియు లక్ష్యాల యొక్క స్వేచ్ఛా భావప్రకటనను అడ్డుకుంటున్న ప్రవర్తనా నియమాలను లేదా అదుపు చేసే ఆలోచనారీతిని మీరు ప్రశ్నించాలి.

### ద్వంద్వాన్ని విడుదల చేయడంలో ఉన్న గొప్పమలుపు

మీ చైతన్యం ఆత్మకేంద్రంలో సంపూర్ణంగా ఉంటూ మరియు ద్వంద్వం యొక్క అనుభవాలన్నింటిని తన గుప్పిట్లో పెట్టుకోగలిగినప్పుడే, మీరు భూమి మీద ఎత్తిన మీ జన్మలన్నింటి యొక్క జీవిత కాలచక్రం ముగింపు దశకు వస్తుంది. మీరు ద్వంద్వం యొక్క ఏదో ఒక పాత్రతోనే (వెలుగు వైపు ఉంటూ చీకటిని, సంపద వైపు ఉంటూ బీదరికాన్ని వ్యతిరేకించడం లాంటి మొదలగునవి) గుర్తింపబడినట్లయితే, మీ చైతన్యం ఊగిసలాడుతూ ఉంటుంది. కర్మ అంటే మరేదో కాదు ఊగిసలాటలను సహజంగా సమన్వయం పొందేలా చేసేదే. మీ చైతన్యం ఈ ఊగిసలాటలలో నిమగ్నమై పనిచేస్తుంది. మీ చైతన్యం ఊగిసలాటల యొక్క మధ్యభాగంలో ఏమాత్రం చలనంలేని స్థిరమైన ప్రదేశాన్ని కనుగొన్నప్పుడే, మీరు మీ కర్మచక్రంతో ఉన్న బంధాన్ని విడుదల చేస్తారు. (అయితే మంచి వైపు లేదా చెడు వైపు కాకుండా మధ్యస్థానాన్ని లేదా తటస్థస్థితిని కనుగొనడమే.)

ఈ మధ్యభాగమే కర్మచక్రం నుంచి బయటకు వచ్చే మార్గం. ఈ మధ్యభాగంలో నిశ్చలస్థితి, కరుణ, నిర్మలమైన ఆనందం అనే అధిక ప్రభావవంతమైన అనుభూతి స్వరాలు ఉంటాయి.

నిర్ణయించడం మరియు భయం అనే శక్తులు మిమ్మల్ని ఎక్కువగా కేంద్రం నుంచి బయటకు వచ్చేలా చేస్తాయి. మీరు ఈ శక్తులను ఎంత ఎక్కువగా విడుదల చేస్తే అంతగా మీరు అంతర్ ప్రశాంతతను మరియు అంగీకార వైఖరిని పొందుతారు. అప్పుడే మీరు నిజంగా వేరే ప్రపంచంలోకి, వేరే చైతన్యం యొక్క తలంలోకి ప్రవేశిస్తారు.

ఇది మీ బాహ్యప్రపంచంలో కూడా కనపడుతుంది. ఇది తరచూ మార్పు

యొక్క సమయంగాను మరియు "మిమ్మల్ని" ఏమాత్రం ప్రతిబింబించని మీ జీవితంలోని గుణాలకు వీడ్కోలు చెప్పే సమయంగాను ఉంటుంది. పని మరియు బంధాల యొక్క క్షేత్రంలో పెనుమార్పులు సంభవించవచ్చు. కొన్నిసార్లు మీ సంపూర్ణ జీవనశైలి తీవ్ర గందరగోళంగా మారుతుంది. మా దృక్పథం ప్రకారం ఇది చాలా సహజమైనది. ఎందుకంటే అంతర్ మార్పులనేవి ఎల్లప్పుడూ మీ బాహ్య ప్రపంచంలోని మార్పులకు సూచనగా ఉంటాయి కాబట్టి. మీ అంతర్ స్థితికి తగినట్టుగా మీ చైతన్యం, మీరు నివసిస్తున్న భౌతికవాస్తవాన్ని సృష్టిస్తుంది. ఇది ఎల్లప్పుడూ ఈ విధంగానే జరుగుతుంది.

ద్వంద్వం యొక్క పట్టును విడుదల చేయడానికి సమయం పడుతుంది. చీకటి (ఎరుక లేని స్థితి) యొక్క అన్ని పొరలను చేధించడం అన్నది క్రమక్రమంగా జరిగే ప్రక్రియ. ఒకసారి ఈ మార్గంలో అంతరాత్మ వైపు పయనించడం మొదలుపెట్టినట్లయితే, మీరు ద్వంద్వం యొక్క ఆట నుంచి మీకు మీరుగా క్రమక్రమంగా దూరమైపోతారు. పైన చెప్పిన మధ్యభాగం యొక్క నిజమైన అర్థాన్ని రుచి చూసినప్పుడే, అది ఒక గొప్పమలుపుగా రూపొందుతుంది. "మీతో మీరు ఉంటూ" అంతటా వ్యాపించి ఉన్న ఆనందాన్ని నిశ్శబ్దంగా అనుభూతి చెందినప్పుడే, మీరు చాలాకాలంగా అన్వేషిస్తున్నది దీని కోసమేనని తెలుసుకుంటారు. మీరు మళ్ళీ మళ్ళీ మీ లోపలకి పయనిస్తూ అంతరంలోని ఈ ప్రశాంతతను అనుభవిస్తారు.

మీరు ప్రాపంచికమైన ఆనందాల నుంచి దూరంగా ఉండడానికి ఏమాత్రం సంకోచించరు. కాని మీరు మీ అంతరంలో దివ్యత్వం వైపు నడిపించే మార్గదర్శకుడిని కనుగొంటారు, మరియు మీరు ఆహ్లాదపు స్థితి నుంచి ప్రపంచాన్ని మరియు దాని యొక్క సౌందర్యాన్ని అనుభవిస్తారు. నిజానికి మొదటి నుంచీ కూడా ప్రాపంచిక విషయాలలో ఆహ్లాదం లేదు. మీరు వీటిని అనుభవించే తీరులోనే ఆహ్లాదం ఇమిడి ఉంటుంది. మీ హృదయంలో ఆనందం మరియు ప్రశాంతత ఉన్నప్పుడే మీరు కలిసే మనుష్యులు మరియు పరిస్థితులు మీకు ఆనందాన్ని మరియు ప్రశాంతతను ఇస్తాయి.

ఈ యుగం మరియు ఈ ప్రస్తుత సమయంలో కొంతమంది ఆత్మల సమూహం కర్మ నుంచి విడివడాలని తమంతట తాముగా సిద్ధపడుతున్నాయి. కేవలం ఇప్పుడు ఈ మానవ ఆత్మల సమూహం యొక్క వ్యక్తిగత పరివర్తనపు కాలచక్రం మాత్రమే ముగింపుకు చేరడం లేదు. దీనితో పాటు మీరు జీవిస్తున్న భూమి కూడా లోతుగాను మరియు సంపూర్ణంగాను పరివర్తనం చెందుతోంది. అదే విధంగా గ్రహ కాలచక్రం కూడా ముగింపుకు చేరింది. ఈ గ్రహ కాలచక్రం మరియు భూ సంబంధిత కాలచక్రం రెండూ ఒకే సమయంలో ముగింపు దశకు చేరడం వలన ఈ శకం అత్యున్నతమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. మనం ఇప్పుడు గ్రహ కాలచక్రం గురించి మాట్లాడుకుందాం.

**గ్రహ కాలచక్రం**

ఈ కాలచక్రాలలోని ప్రతీ విషయం అంటే గ్రహాలు అదే విధంగా మానవులు క్రమక్రమంగా పరిణామం చెందుతుంటారు. సమయంలోని ఏదో ఒక స్థితి దగ్గర, ప్రతీ మనిషి లేదా మానవ ఆత్మల సమూహాలన్నీ కూడా కర్మ సంబంధిత చక్రం నుంచి విడిపోవాల్సిందే. ఈ శకాన్ని ప్రత్యేకంగా తయారు చేస్తున్నది ఏమిటంటే, భూమి తనకుతానుగా అతిపెద్ద కర్మచక్రాన్ని పూర్తి చేయడమే. భూమి అంతర్ పరివర్తనంలో నిమగ్నమై ఉండడం వలన, ఇది ఒక గ్రహంగా తన ఉనికిలో ఒక కొత్తరకపు చైతన్యాన్ని దీనికి ఫలితంగా పొందుతోంది. ఆత్మలు వారి యొక్క సొంతచక్రంలోని ఏ దశలో ఉన్నా కూడా, వీరిపై భూమి యొక్క పరివర్తన ప్రక్రియ ప్రభావాన్ని చూపిస్తుంది.

భూమి మీ ఇల్లు. దీనిని మీరు నివసిస్తున్న ఇంటితో పోల్చుకోండి. ఇది పున:నిర్మితం అవుతున్నట్లు ఊహించుకోండి. ఇది మీ నిత్యజీవితాన్ని గొప్పగా ప్రభావితం చేస్తుంది. మీరు దీనిని మార్పును తీసుకువచ్చేదిగా అనుభవిస్తారా, లేక నిరాశ మరియు నిస్పృహల యొక్క సంఘటనగా అనుభూతి చెందుతారా అనేది పూర్తిగా మీ మానసికస్థితి మీద ఆధారపడి ఉంటుంది. మీరు ఏదో ఒక రకంగా మీ ఇంటిని పున:నిర్మించడానికి ప్రణాళికను వేస్తూ దాని కోసం ఎదురుచూస్తున్నట్లయితే, మీరు మార్పుల యొక్క సహజ ప్రవాహానికి అలవాటుపడుతూ మరియు దానికి అనుగుణంగా ప్రవహించగలరు. భూమి యొక్క పరివర్తన ప్రక్రియ, మీ వ్యక్తిగత పరివర్తన ప్రక్రియకు సహకరిస్తూ మరియు దానిని మెరుగుపరుస్తుంది.

మీ ఇంటిని పున:నిర్మించడం మీకు ఏమాత్రం ఇష్టం లేకపోయినట్లయితే, మీరు మీ చుట్టూ ఉన్న గందరగోళాల ద్వారా ఆందోళనకు గురవుతారు. భూమి యొక్క అంతర్‌మార్పులు మీరు మీ సమన్వయాన్ని కోల్పోయేలా చేస్తాయి.

మీ భూగ్రహం యొక్క అంతర్‌మార్పులను స్వాగతించే వారికి, ఇది చాలా శక్తివంతమైన సమయంగా ఉంటుంది. మీ విశ్వంలో ప్రవహిస్తున్న కాంతి యొక్క తరంగం ద్వారా మీరు అభివృద్ధి చెందుతారు.

ప్రస్తుతం భూమి, మానవత్వం యొక్క కర్మభారాన్ని చేధిస్తోంది. ఈ కర్మభారం నుంచి ఉద్భవిస్తున్న నిరుత్సాహం మరియు క్రూరత్వం అన్నవి ఒక విధమైన శక్తివంతపు వ్యర్థపదార్థంగా రూపొందుతున్నాయి. దీనిని తటస్థంగా రూపొందించడంలోనూ లేదా ఐక్యం చేయడంలోనూ భూమి చాలా కష్టపడుతోంది.

ఒక క్షణం భూమి యొక్క హృదయంపై మీ చైతన్యాన్ని కేంద్రీకరించండి. దీనిపై ప్రశాంతంగా దృష్టిని కేంద్రీకరించండి.... మీరు అక్కడ ఏదో ఉందని అనుభూతి చెందగలరా? భూమి అధిక ఉద్రిక్తతకు ఎలా లోనవుతోందో అనుభూతి చెందగలరా, ఆమె మీద ఎంతగా దౌర్జన్యాలు జరుగుతున్నాయో అనుభూతి చెందగలరా?

ఒకే సమయంలో భూమి అధికారహీనతను మరియు ప్రతిఘటనను అనుభూతి చెందుతోంది. భూమి తన ఉనికి కోసం కొత్త పునాదిని సృష్టించుకోవడం యొక్క అంశంపై పని చేస్తోంది. భూమి అంతర్ మరియు బాహ్యపొరలలో ఉన్న పోరాటం, పోటీతత్వం మరియు నాటకం యొక్క శక్తులను విడుదల చేయబోతోంది. ఆమె అంతరంలో కొత్తపునాదిగా ఉదయిస్తున్నవి హృదయం యొక్క శక్తి, సమన్వయం మరియు ఐకమత్యం యొక్క శక్తి : సజీవమైన క్రీస్తుశక్తి.

భూమి కూడా మనుష్యులలాగే అనుభవాన్ని పొందే ప్రక్రియలో నిమగ్నమై ఉంది. మనుష్యుల యొక్క చైతన్యంలాగే ఆమె చైతన్యం కూడా దానంతట అది పరిణామం చెందుతున్నది మరియు పరివర్తనం చెందుతున్నది. మానవులతో పాటు, ఆమె కూడా ఒక విధమైన అజ్ఞానపు స్థితిలోను లేదా తన ఉనికి గురించి ఎరుకలేని స్థితిలోను తన ప్రయాణాన్ని ఆరంభించింది.

ఒకప్పుడు భూమి "చీకటి గ్రహం"గా ఉండేది, ఇది తన చుట్టూ ఉన్న శక్తులను మింగివేస్తుండేది లేదా సంగ్రహిస్తుండేది. ఆమెకు ఎదురుపడిన శక్తులను లేదా జీవులను స్వీకరిస్తూ వాటిని తనలో పూర్తిగా విలీనం చేసుకునేది; ఆమె వాటి యొక్క ప్రత్యేక తత్వాన్ని తొలగిస్తూ వాటిని హతమార్చేది. ఇది విస్తరణ యొక్క కోరిక నుంచే ఉద్భవించింది. భూమి కూడా తన అంతరంలో కొరతను లేదా అసంతృప్తి యొక్క భావనను అనుభూతి చెందింది. అందువలన ఆమె ఇతర శక్తులను ఆక్రమిస్తూ వాటిని తనలో విలీనం చేసుకోవడాన్ని ఒక అవసరంగా భావించింది. దీనికి బదులుగా భూమి ఈ శక్తులకు ఏమి తిరిగి ఇవ్వకపోవడం వలన, వీటి మధ్య నిజానికి ఎటువంటి పరస్పర స్పందన లేకుండా పోయింది. ఇది ఒక విషాదకరమైన మరణ ప్రక్రియగా ఉండేది.

ఒకానొక సమయంలో భూమి ఈ ప్రక్రియ తనను ఎంతమాత్రం సంతృప్తి పరచలేదనే ఎరుకను పొందింది. ఈ విధంగా సంగ్రహించే ప్రక్రియలో భూమి ఏదో కొరతను తనకుతానుగా అనుభూతి చెందింది. దీని ద్వారా ఆమె తన యొక్క అసంతృప్తి భావన నుంచి ఉపశమనాన్ని పొందలేకపోయింది. ఆమె యొక్క విస్తరణ కాంక్ష, శక్తిని నిర్జీవం చేయడం ద్వారా సంతృప్తిని పొందలేదు.

ఈ స్థితి దగ్గర, భూమి చైతన్యం యొక్క అంతరంలో ఉత్సాహపూరితమైన జీవనం యొక్క కోరిక జనియించింది. భూమికి దీనికి సంబంధించిన పూర్తి ఎరుక లేదు. ఆమెకు ఏదో కావాలని, ఏదో కొత్తదనం కావాలని, భూమి శక్తిలో క్షీణించిపోకుండా ఉండే విధంగా ఇతరశక్తులతో ఒక రకమైన పరస్పర స్పందనను పెట్టుకోవాలని మాత్రం తెలుసు. భూమి "తన కన్నా భిన్నంగా ఉండే మరొక దాని యొక్క అనుభవం కోసం", తన చైతన్యంలో ఒక ప్రదేశాన్ని సృష్టించింది.

శక్తిపరంగా ఇదే భూమి మీద జీవితం ఆరంభమయ్యేలా చేసింది.

లోతుగా అనుభూతి చెందిన కోరికలను సాధించడానికి అవసరమైన వనరులను అవి తుదకు సమకూర్చుకుంటాయి అన్నది విశ్వసంబంధిత నియమం. కోరికలు అనేవి "సృజనాత్మకమైన శక్తులు", ఇవి ముఖ్యంగా ఆలోచన మరియు అనుభూతుల యొక్క కలయికగా ఉంటాయి. ఇవి గ్రహాలకు అదే విధంగా మనుష్యులకు కూడా సమానంగా వర్తిస్తాయి. ఒక గ్రహంగా భూమి యొక్క అంతరంలో జీవితాన్ని అనుభవించాలనే కోరిక ఉద్భవించింది. ఈ కోరిక జీవితాన్ని నాశనం చేయకుండా, జీవితాన్ని సంరక్షిస్తూ మరియు దానిపై వాత్సల్యాన్ని చూపించడానికి సంబంధించినది.

అందువలనే ఇది సంభవించింది.

భూమి మీద జీవితం ఆవిర్భవించినప్పుడు, భూమి తనకుతానుగా పుష్పిస్తూ వికసించడం మొదలుపెట్టింది. ఆమె తనను ఆశ్చర్యం మరియు సంతృప్తి యొక్క భావనలతో నింపే కొత్త అనుభవం యొక్క ప్రదేశంలోకి ప్రవేశించింది. ఒక చిన్న కోరిక, అస్పష్టంగా అనుభూతి చెందిన ఒక అవసరం, ఆమెను ఉన్నతమైన మరియు అసాధారణమైన అభివృద్ధిల వైపు తీసుకువెళ్ళడం చూసి ఆశ్చర్యపోయింది.

భూమి మీద జీవరూపాల గురించి గొప్ప ప్రయోగం కొనసాగుతూనే ఉంటుంది. చాలా జీవరూపాలు భూమి మీద తమను తాముగా వ్యక్తీకరించుకోవడానికి మరియు ఇక్కడ ఉన్న శక్తులతో ప్రయోగం చేయడానికి ఆకర్షింపబడేవి. భూమి కొత్తదనం కోసం ఏర్పడిన ప్రదేశంగా రూపొందింది. ఇక్కడ కొత్త దారులను, కొత్త సామర్థ్యాలను అన్వేషించడానికి స్వేచ్ఛ ఉండేది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కూడా, భూమి మీద అన్ని జీవులకి స్వతంత్రత ఉంది.

జీవితం యొక్క సృష్టి ద్వారా, భూమి మరియు దాని మీద ఉన్న జీవరాశులు అంతర్ అభివృద్ధి యొక్క ఒకానొక ప్రత్యేక శైలిని అన్వేషించడం మొదలుపెట్టాయి. ఈ అనుభవం యొక్క మార్గం అంతరంలో ఒకానొక ముఖ్యోద్దేశాన్ని కలిగి ఉండేది: "ఇవ్వడం మరియు తీసుకోవడం మధ్య ఉండే సమన్వయం".

చైతన్యం యొక్క అంతర్ స్థాయిల్లో, భూమి చాలా యుగాల నుంచి ఇవ్వడం మరియు తీసుకోవడం మధ్య సరైన సమన్వయాన్ని కనుగొనాలని తపిస్తూనే ఉంది. ఒక గ్రహంగా భూమి జీవితాన్ని ఇస్తుంది మరియు తీసుకుంటుంది. భూమి తన యొక్క "చీకటి దశ"లో శక్తులను సంగ్రహిస్తూ వాటిని నిర్వీర్యం చేసేది. ఈ దశలో భూమి కేవలం "స్వీకరించడానికే" ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చేది.

ప్రస్తుతం భూమి "ఇవ్వడం" అనే మరొక అంచు దగ్గర గాయపడింది: ఆమె తన దగ్గర ఉన్నదంతా అదే పనిగా అందిస్తోంది కాబట్టి.

భూమి చాలా కాలం మనుష్యుల యొక్క దౌర్జన్యాలను మరియు దుర్వినియోగాలను భరించింది. ఎందుకంటే ఇది కర్మ ప్రకారం సరైనదే కాబట్టి. భూమి అధికారం మరియు అణచివేతల యొక్క మరొక వైపును అన్వేషించింది. ఒక నేరస్థురాలిగా భూమి యొక్క చర్యలు, బాధితురాలిగా ఉండడం యొక్క వ్యతిరేక అనుభవాన్ని రెచ్చగొట్టాయి. ఈ విధంగానే కర్మ పని చేస్తుంది; ఇది ఏమాత్రం శిక్షకు సంబంధించిన విషయం కాదు. అధికారం యొక్క సమస్యను నిజంగా అర్థం చేసుకోవాలన్నా మరియు దీనితో రాజీపడాలన్నా, మీరు దీని యొక్క రెండు వైపుల అనుభవాన్ని పొందాలి. మీరు పోరాడుతున్న లేదా అధికారాన్ని చూపించాలనుకున్న విషయంలో మీరు ఏ పాత్రను ఐతే పోషించారో, దానికి పూర్తి వ్యతిరేకమైన పాత్రను కూడా తిరిగి పోషించాలి. మీరు బాధితుడి లేదా నేరస్థుడి పాత్రలు రెండూ మీవేనని, అవి ఒక దివ్యత్వపు శక్తి యొక్క రెండు భాగాలని గుర్తించేంత వరకూ మళ్ళీ మళ్ళీ ఈ పాత్రలను ఎదుర్కొనవలసి వస్తుంది.

ప్రస్తుత కాలంలో, భూమి మీద సంభవిస్తున్న క్రూరమైన దౌర్జన్యాలు కొంతవరకూ కర్మపరంగా సరైనవే. ఎందుకంటే ఇవి భూమికి ఇవ్వడం మరియు తీసుకోవడం మధ్య సమన్వయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఒక అవకాశాన్ని అందించాయి కాబట్టి.

అగౌరవం మరియు దుర్వినియోగం అనే వాటి యొక్క హద్దులు కర్మపరంగా సరైనవే అని భూమి ఒక అవగాహనకు వచ్చింది. భూమి సమన్వయాన్ని ఎలా పొందాలనేది అర్థం చేసుకుంది మరియు తన చైతన్యం యొక్క కర్మచక్రాన్ని పూర్తి చేస్తోంది. ఆమె ఇప్పుడు ప్రేమ మరియు ఎరుక యొక్క స్థితికి చేరింది. దీని వలన ఆమె ఎక్కువ కాలం మానవ దౌర్జన్యాలను భరించదు. భూమిని సమన్వయం మరియు గౌరవాలతో ఆహ్లాదపరిచే శక్తులను ఆకర్షించే విధంగాను మరియు తనను ధ్వంసం చేయాలనుకునే ఉద్దేశ్యం కలిగిఉన్న శక్తులను తిరస్కరించే విధంగాను ఈ చైతన్యపు స్థితి తయారు చేస్తుంది.

ఇవ్వడం మరియు తీసుకోవడం మధ్య కొత్త సమన్వయం ఏర్పడడానికి సమయం ఆసన్నమైంది. కొత్త భూమిలో, భూగ్రహానికి మరియు ఆమె మీద జీవించే జీవరాశులకు మధ్య ప్రశాంతత మరియు సమన్వయం ఉంటాయి: మానవులు, వృక్షాలు మరియు జంతువులు. అన్ని జీవరాశుల మధ్య ఉండే సమన్వయం మరియు హృదయపూరిత ఐకమత్యం అనేవి గొప్పఆనందం మరియు సృజనాత్మకతల యొక్క మూలంగా ఉంటాయి.

పాతభూమి నుంచి కొత్తభూమి వైపు జరిగే పరివర్తనం అనేది ఒక ప్రక్రియ. ఇది కాలానికి గాని, గుణానికి గాని పరిమితమై ఉండదు. మనుష్యులు ఎంచుకునే

ఎంపికల మీద, ప్రత్యేకమైన వ్యక్తులుగా మీరందరూ ప్రస్తుతం ఎంచుకునే ఎంపికల మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

ఈ పరివర్తనా సమయం గురించి చాలా అంచనాలు ఎప్పటి నుంచో ప్రచారంలో ఉన్నాయి. ఈ విధంగా అంచనాలు వేయడం అనేది ఎల్లప్పుడూ సందేహించదగినదే. విషయమేమిటంటే, మీకు కనబడుతున్న భౌతిక వాస్తవం అంతర్ సామూహిక చైతన్యపు స్థితి యొక్క వ్యక్తీకరణయే. చైతన్యం అన్నది స్వేచ్ఛగాను మరియు సృజనాత్మకంగాను ఉంటుంది. ఏ సమయంలోనైనా, ప్రత్యేకంగా ఆలోచించడం మరియు అనుభూతి చెందడం ద్వారా మీ భవిష్యత్తును మార్చుకోవాలని నిర్ణయించుకోవచ్చు. ఏ సమయంలోనైనా కూడా, మీరు హద్దులను, విధ్వంసకరమైన ఆలోచనలను లేదా అనుభూతులను తిరస్కరించవచ్చు. ఇది వ్యక్తిగత స్థాయికి మాత్రమే కాకుండా, అతిపెద్ద మానవ సమూహాలకు కూడా వర్తిస్తుంది.

అతిపెద్ద వ్యక్తిగత సమూహాలు ద్వేషం మరియు విధ్వంసాలకు బదులుగా స్వేచ్ఛ మరియు ప్రేమలను ఎంచుకున్నప్పుడు, ఇవి మీ భౌతికవాస్తవంలో వాటంతటవిగా వ్యక్తీకరించబడగలవు. భూమి దీనికి ప్రతిస్పందిస్తుంది. ఆమె మనుష్యుల యొక్క అంతరంలో జరుగుతున్న దానిపై సున్నితంగా స్పందిస్తుంది. ఆమె మీ అంతర్ కదలికలకు కూడా ప్రతిస్పందిస్తుంది.

అందువలన కొత్తభూమి ఎలా జన్మిస్తుందనేది మా వైపున గాని, మీ వైపున గాని ఎవరూ ఖచ్చితంగా అంచనా వేయలేరు. ఇప్పుడు ఆత్మల యొక్క సమూహం వారి యొక్క కర్మచక్రాన్ని పూర్తి చేస్తున్నారనేది, శక్తిపరంగా కొత్త భూమితో సన్నిహితమైన సంబంధాన్ని ఏర్పరుచుకుంటున్నారు అనే విషయాన్ని చాలా స్పష్టంగా తెలియజేస్తోంది. ఎవరైతే తరచూ కొత్త భూమిలోని ఆదర్శాలతో లోతైన బంధాన్ని అనుభూతి చెందుతారో వారు ఎదుగుదల మరియు విడుదలకు సంబంధించిన అందమైన అవకాశాలను కలిగి ఉంటారు. ఎందుకంటే గ్రహ కాలచక్రం మరియు వ్యక్తిగత కాలచక్రం ఒకే సమయంలో ముగింపు దశకు చేరుతున్నాయి కనుక.

* * * *

## హృదయం నుంచి పొట్ట వైపు

### ఆత్మ యొక్క ప్రయాణాన్ని పూర్తి చేయడం

ప్రియమైన మానవ శిశువులారా,

నేను భూమిని మీతో మాట్లాడుతున్నాను. నేను మీ తల్లిని మరియు మీరు జీవించి ఉన్నంత కాలం మిమ్మల్ని నా ఒడిలో మోస్తాను. మీకు ఇది తెలియక పోయినప్పటికీ మరియు మీరు మీ నిత్యజీవితంలోని సంఘటనలలో నిమగ్నమై ఉన్నప్పటికీ కూడా, మీరు నా ద్వారా పోషింపబడుతూనే ఉన్నారు. నేను మిమ్మల్ని నా చేతులతో పట్టుకున్నాను. నేను మీ జ్ఞాపకాలను కదిలిస్తూ మీకు ఏదో గుర్తు చేయాలని అనుకుంటున్నాను, అందువలన నాతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ఇది ఆధునిక ప్రపంచం మర్చిపోతున్నట్టుగా కనిపిస్తున్న ప్రాచీనమైన మరియు అతి విలువైన విషయం గురించి. ఇది భూమి మీద ఉనికి యొక్క సహజమైన భద్రత గురించి.

ఉనికి యొక్క సహజమైన భద్రతను గుర్తు తెచ్చుకోవడానికి మీ చుట్టూ ఉన్న ప్రకృతిని చూడండి. ఋతువులు ఎలా వస్తున్నాయి మరియు వాటంతటవి ఎలా పయనిస్తున్నాయి అనే విషయాలను ఒకసారి గమనించండి. మొక్కలు మరియు జంతువుల యొక్క నిత్యజీవితాన్ని ఒకసారి చూడండి. గాలి లేదా నీటి యొక్క శబ్దాన్ని ఒకసారి వినండి. ప్రకృతి తన పని తాను చేయడం వలనే, జీవితంలోని అతి ముఖ్యమైన విషయాలు సహజంగా సంభవిస్తున్నాయి అనే దానిని క్లుప్తంగా మీకు గుర్తు చేశాను. ప్రకృతి మీ చుట్టూ ఉంది మరియు అదే విధంగా మీలోనూ ఉంది. ఎందుకంటే మీరు కూడా ప్రకృతిని కలిగిఉన్నారు మరియు అదే విధంగా మీరూ ఈ అనంతమైన ప్రకృతిలో భాగం కాబట్టి.

ముఖ్యంగా పశ్చిమ దేశాలలో, మీ మెదడు లేదా మనసు నుంచి జీవించడానికి అలవాటు పడినారు, వృక్షాలు మరియు జంతువుల్లాగా మీరు కూడా ఒక సహజమైన జీవి అనే విషయాన్ని మర్చిపోయారు. జంతువులు వాటి జీవితానికి ఎలా ఆధీనమవుతాయో ఒకసారి గమనించండి. అవి మరొక రకంగా జీవించలేవు. వాటికి కూడా భయం మరియు ప్రతిఘటనలు మొదలైన మనోభావాల గురించి తెలుసు, కాని మనుష్యుల్లా వాటి జీవితాన్ని అవి తిరస్కరించవు. మానవులు అతిగా ఆలోచించడం ద్వారా, తమ స్వంత స్వభావానికి ఒక పరిధిని సృష్టిస్తున్నారు మరియు వీరు కొంతకాలం తర్వాత సమస్యలకు గురవుతున్నారు. మానవ ఆలోచనారీతి ద్వారా జీవితాన్ని క్రమబద్ధీకరించలేరు మరియు అదుపు చేయలేరు. ఈ ఆలోచనారీతి

కంటే కూడా ప్రకృతి యొక్క ప్రాథమిక శక్తులు విశాలమైనవి. మీరు ప్రకృతికి ఆధీనమయ్యే సమయం వస్తుంది.

మీరు కష్టమైన సమస్యలు లేదా పరిస్థితుల ద్వారా ఈ క్షణానికి చేరుతారు. మీరు ఈ పరిస్థితుల్లో చిక్కుకునిపోతారు మరియు ఇవి మిమ్మల్ని అదుపును విడుదల చేయమని అడుగుతుంటాయి, ఎందుకంటే అంతరంలో లేదా మీ చుట్టూ ఉన్న పరిసరాల మీద మీకు ఏమాత్రం పట్టులేనందు వలన. అదుపుకు సంబంధించిన గాయాలను విడుదల చేయండి మరియు ఇది మీకు ఒక పోరాటంగా ఉండవచ్చు. అయినప్పటికీ, ఇది మిమ్మల్ని మీ ఇంటికి చేరుస్తుంది. మీరు ఏదో పోగొట్టుకున్నట్టు మరియు గందరగోళంలో పడిపోయినట్టు మీకు అనిపించవచ్చు. కాని నిజానికి మీరు మీ ఉనికి యొక్క సహజమైన భద్రతకు సన్నిహితమవుతున్నారు. జీవితం మిమ్మల్ని పట్టుకుని ఉంటోంది మరియు ప్రేమిస్తోంది. కష్టాలు లేదా ప్రమాదకరస్థితి ఎల్లప్పుడూ క్రూరంగాను మరియు అన్యాయంగాను అనిపించవచ్చు. కాని నిజానికి ఇవి ఎల్లప్పుడూ వీటి అంతరంలో ప్రకృతి యొక్క లేదా దైవం యొక్క ఆహ్వానాన్ని మోస్తుంటాయి. ఈ ఆహ్వానం మీకు చెబుతున్నది ఏమిటంటే: “ఇంటికి రండి, ఇంటికి తిరిగి రండి”. కష్టమైన పరిస్థితుల్లోనే మార్గదర్శకత్వాన్ని అందించే చేయి కూడా ఉంటుంది, ఇది మీకు సహకరించడానికి మరియు మార్గాన్ని చూపించడానికి ప్రయత్నిస్తుంది.

ఇది చదువుతున్న మీరందరూ ఆత్మ యొక్క సంపూర్ణత్వాన్ని పొందే అంతర్ ప్రయాణంలో ఉన్నారు. మీరు మీ రక్తమాంసాల యొక్క మానవ శరీరంలోకి మీ ఆత్మను సజీవంగా తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మార్గంలో మీరు వివిధ రకాల దశల ద్వారా పయనిస్తున్నారు. ఆత్మ భౌతికరూపాన్ని పొందుతుంది, లేదా శరీరంలోనికి వివిధ రకాల దశల ద్వారా క్రిందకు దిగి వస్తుంది. మీరు అంతర్ ప్రయాణాన్ని ఆరంభించిన తర్వాత మాత్రమే, మీ మనసు ద్వారా ఆత్మతో పరిచయాన్ని పెంచుకోగలరు. ఉదాహరణకి మీరు నిజమని భావించిన ఆలోచనలు మరియు విలువల మీద భిన్నమైన కాంతిని ప్రసరింపజేసే పుస్తకాలకు లేదా మనుష్యులకు మీరు ఆకర్షింపబడవచ్చు. వీరి యొక్క కొత్త ఆలోచనలకు మీరు వణికిపోవచ్చు, అయినప్పటికీ మీరు వీటికి వింతగా ఆకర్షింపబడతారు. వీటి గురించి మరింతగా చదవాలి మరియు వినాలి అనేంతగా వీటికి ఆకర్షింపబడతారు. మీ ఆలోచనారీతి యొక్క స్థిర అభిప్రాయాలను విడుదల చేస్తూ మరియు ఏదో కొత్తదనాన్ని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉంటారు. ఈ విధమైన మనస్తత్వం కలిగిన మనుష్యులతో మాట్లాడడం మరియు వారి గురించి చదవడం అనేవి మీరు ఈ ప్రక్రియలో

ఉత్తేజింపబడడానికి మీకు సహాయం చేయగలవు. ఈ విధంగానే చాలామందిలో అంతర్ ప్రయాణం ఆరంభమవుతుంది. మీరు ఆధ్యాత్మిక పుస్తకాలను మధురమైన పదార్థాలుగా స్వీకరిస్తారు. మీ లోతైన అంతరం ఏదో మేల్కొనాలని మరియు మార్పుచెందాలని కోరుకుంటుంది, మరియు మొదటిగా ఇది కొత్త ఆలోచనారీతి యొక్క అవసరంగా తనను తాను అనువదించుకుంటుంది.

కొంతకాలం తర్వాత, మీరు మరింతగా కోరుకోవడం మొదలుపెడతారు. మీరు ఈ విధంగా ఆలోచించడం మొదలుపెతారు: అవును, ఈ పుస్తకాలలో వీరు ఏం మాట్లాడుతున్నారనేది నాకు అర్థమయ్యింది, కాని నేను దీనినంతటిని నా జీవితానికి ఎలా వర్తింపజేయాలి? ఈ జ్ఞానం ఎలా సజీవంగా ఉంటుంది మరియు నేను నిజంగా దీనిని భూమి మీద ఉన్న నా అనుభూతులలోకి మరియు చర్యలలోకి ఎలా అనువదించగలను? ఈ ప్రశ్నే మిమ్మల్ని వెంటాడుతూ మిమ్మల్ని ఒత్తిడిలోకి పడిపోయేలా చేయవచ్చు, కాని మీరు జీవితాన్ని ఎంతమాత్రం ఒత్తిడి చేయలేరు. అయినప్పటికీ ఒకానొక క్షణంలో మీ జీవితంలో ఏదో సంభవించి, అది మీరు మనసు నుంచి హృదయం వైపు విజయవంతంగా పయనించేందుకు మీకు సహాయం చేస్తుంది. తరచూ ఇది ఒక కష్టమైన పరిస్థితిగా ఉండవచ్చు. పని, బాంధవ్యాలు, ఆరోగ్యం లేదా ప్రేమించినవారిని కోల్పోవడం లాంటి మొదలైన విషయాలలో మార్పులు సంభవించవచ్చు. అవి ఏవైనప్పటికీ కూడా, ఒకానొక సమయంలో మీ అంతరంలో తీవ్రమైన అనుభూతులు రేకెత్తుతాయి. మీరు వాటిని ఏమాత్రం వదిలి వేయలేరు. మీరు వాటిని లోపలకి అనుమతిస్తూ, వాటిలో పరివర్తనం జరగడానికి సమ్మతించాలి. అప్పుడే మీ ఆత్మ మీ హృదయం లోతుల్లోకి ప్రవేశించగలదు.

మొదటిగా మీ ఆత్మ మీ మనసులోకి దిగి వచ్చి – పుస్తకాలు, సంభాషణలు మొదలైన వాటి ద్వారా మీరు కొత్త ఆలోచనలను గ్రహించేలా మిమ్మల్ని ఉత్తేజపరుస్తుంది. ఆ తర్వాత ఆత్మ లోతైన స్థాయిల్లో, అనుభూతి యొక్క స్థాయిల్లో మీ తలుపును తడుతుంది. మీకు ముందెన్నడూ తెలియని మనోభావాల యొక్క పొరలతో బాగా పరిచయం ఏర్పడుతుంది. కష్టమైన పరిస్థితులు వీటిని పైకి వచ్చేలా ప్రోత్సహిస్తాయి; ఇవి మీ బాల్యం నుంచి ఉన్న పాత మనోభావాలను మరియు మీ గతజన్మల నుంచి ఉన్న జ్ఞాపకాలను పైకి వచ్చేలా చేస్తాయి. మీరు ఈ మనోభావాల యొక్క పొరలను అన్వేషిస్తారు మరియు ఈ విధంగానే మీ హృదయం యొక్క కేంద్రం తెరవబడుతుంది. మీ ఆత్మ మరింతగా ప్రవేశిస్తూ హృదయచక్రాన్ని తన శక్తితో నింపుతుంది.

ఈ పరివర్తనం సంభవించే దశలో అనేక రకాల సమస్యలు తలెత్తవచ్చు. మీరు ప్రత్యేకమైన దృష్టితో ప్రపంచాన్ని చూడడం మొదలుపెడతారు మరియు అదే విధంగా ఇతరులతో మీ బాంధవ్యాలు మార్పుచెందుతాయి. మీ లోతైన అంతరంలో ఏకత్వం యొక్క ఎరుక మేల్కొంటుంది. ఏకత్వపు ఎరుక అంటే అర్థం మనమందరం, మనుష్యులు, జంతువులు, వృక్షాలు, ప్రకృతి మొదలైనవన్నీ ఒకే దివ్యత్వపు శక్తి ద్వారా సన్నిహితంగా కలుపబడి ఉన్నాయని, మనం ప్రతీ ఒక్కరితో బంధాన్ని కలిగి ఉన్నామని, ప్రతీ ఒక్కరూ ఇతరులకి ప్రతిబింబమేనని మీరు తెలుసుకుంటారు. ఈ ఎరుక అదుపు చేయలేని విధంగా ఉండగలదు మరియు మీలో చాలా మందికి మనసు నుంచి హృదయం వైపు పయనించడమన్నది, అంతరంలో అతిసున్నితత్వం ఏర్పడడానికి కారణమవుతుంది. ఈ అతిసున్నితత్వం సమన్వయా లోపాలను సృష్టించవచ్చు. మీకు ఇతరులతో ఉన్న సరిహద్దులు అస్పష్టంగా ఉండడం వలన మీరు వారి యొక్క మనోభావపరమైన విషయాలను స్వీకరించవచ్చు, వాటిని ఎలా విడుదల చేయాలో మీకు తెలియకపోవచ్చు. మీ మనస్తత్వాలు అతి ఉన్నతస్థితి నుంచి అతి నీచస్థితికి పడిపోగలవు. మనసు నుంచి హృదయం వైపు విజయవంతంగా పయనించడం అనేది శక్తివంతమైనది మరియు అతి ముఖ్యమైనది. అయినప్పటికీ కూడా, ఇది ఆత్మ ప్రవేశంలోని చివరిదశ కాదు. ఆత్మ మరింత లోతుల్లోకి, పొట్ట భాగంలోకి చేరాలనుకుంటోంది.

ఆత్మ, మీ హృదయం యొక్క స్థాయికి చేరినప్పుడు మీరు పాక్షికంగా మేల్కొనట్టే. మీరు మీ అనుభూతుల యొక్క ఎరుకను పొందుతారు, మీ మనోభావాలను చూడడానికి సాహసిస్తారు, మీరు అంతరంలోకి వెళ్తూ మీ అంతర్ గాయాలను ఎదుర్కొనడానికి సిద్ధపడతారు. కాని ఈ ప్రయాణం వలన ఉద్భవించే అతిసున్నితత్వం మరియు అస్థిరత్వం ద్వారా మీరు బలహీనపడుతున్నట్లు అనుభూతి చెందుతారు. మీ హృదయం పూర్తిగా అనుభూతులతో నిండి ఉండడం వలన, భూమి మీద స్థిరంగా ఉండాలనే ఆశను కొన్నిసార్లు కోల్పోతారు. ఇది చాలా కష్టంగా ఉండగలదు. ఇది మీలో చాలామందికి జరిగింది. హృదయచక్రం పూర్తిగా తెరుచుకున్నప్పుడు, మీ సున్నితత్వం మీకు అతి తీవ్రంగా అనిపించవచ్చు మరియు మీరు ప్రపంచం నుంచి వెళ్ళిపోవాలని అనుకోవచ్చు. మిమ్మల్ని మీరు ఏమాత్రం సృజనాత్మకంగా వ్యక్తపరుచుకోలేరు, ఎందుకంటే ఇదంతా అతి తీవ్రంగాను మరియు భరించలేని విధంగాను ఉండడం వలన. ఇది మిమ్మల్ని ఆందోళనకు మరియు నిరాశకు గురయ్యేలా చేస్తుంది.
ఈ సమస్యకు సమాధానం ఏమిటంటే మీ మనసులోకి తిరిగి వెళ్ళకుండా ఉండడమే. మీ పొట్టలోనే సమాధానం ఉంది. మీరు ఆత్మ ప్రవేశించే ప్రక్రియలోని తర్వాతి

దశకు సిద్ధమవుతున్నారు: హృదయం నుంచి పొట్టవైపుకు జరిగే పరివర్తనానికి. ఆత్మ మీ శరీరంలోకి మరింత లోతుగా పయనించాలని కోరుకుంటోంది. మీ పొట్ట యొక్క మధ్యభాగంలో నిశ్శబ్దం యొక్క ప్రదేశం లేదా స్థలం ఉంటుంది. నేను చెబుతున్న ఈ సమయంలోనే మీ చైతన్యంతో అక్కడకు వెళ్ళండి. ఆ ప్రదేశంలో భాషగాని, ఆలోచించడం గాని, భావాలు గాని ఏమి ఉండవు. మీరు గాలికి వీస్తున్న ఆకుల శబ్దాన్ని లేదా ధ్వని తరంగాల యొక్క చప్పుడులను వినవచ్చు. ఈ శబ్దాలు, మీకు ఈ కేంద్రంలో ఉన్న నిశ్శబ్దపు ఎరుకను అనుభూతి చెందడానికి సహాయం చేస్తాయి.

ఈ స్థితిలో, మీ ఆధ్యాత్మిక జ్ఞానం మరియు అనుభూతులు సహజంగా తయారవుతాయి లేదా దీనినే రెండవ స్వభావంగా కూడా పిలువవచ్చు. దీని గురించి ఆలోచించవలసిన అవసరంగాని లేదా అనుభూతి చెందవలసిన అవసరంగాని లేదు. ఇక్కడ లోతైన అంతర్జ్ఞానం ఉంటుంది, దీని నుంచే మీరు నటిస్తూ మరియు మీరు జీవితాన్ని సులభంగా గడుపుతారు. ఆ తర్వాత మీ ఆత్మే మీ స్వభావంగా మారుతుంది, ఇది సహజమైన ఎరుక యొక్క స్థితికి చేరుతుంది. ఈ ఎరుక మీకు అవసరమైన సమన్వయాన్ని అందిస్తుంది! సవాళ్ళు మరియు గందరగోళ వాతావరణంలో ఉన్నప్పటికీ కూడా, మీరు వాటన్నింటి మధ్యలో ఉంటూ ప్రశాంతంగా ఉండగలరు. మీ అనుభూతి కేంద్రం (మీ హృదయం) భూమి మీద నిజంగా స్థిరపడడానికి మరియు మీరు ఇక్కడ సురక్షితంగా ఉన్నారనే అనుభూతిని పొందడానికి, ఇది మీ పొట్టభాగంతో కలవాలని అనుకుంటోంది.

మనం ఇప్పుడు మీ పొట్టభాగంలోని ఆ ప్రదేశాన్ని సందర్శిద్దాం. అది అక్కడ ఉందని విశ్వసించండి. మీ ఆత్మను అక్కడకు రమ్మని స్వాగతం పలకండి. మీ ఆత్మను మీ తల భాగం ద్వారా ప్రవహింపజేస్తూ, మీ ఆలోచనారీతిని ఉత్తేజపరుస్తూ, అక్కడ నుంచి మీ హృదయ భాగానికి చేరడానికి అనుమతివ్వండి. ఆ తర్వాత మీ హృదయం నుంచి, ప్రేమ మరియు కరుణలను ప్రసరింపజేస్తూ పొట్టభాగంలోకి ప్రవహించడానికి అనుమతివ్వండి. ఇది మీకు విశ్వాసం, ఆత్మ గౌరవం, మీరు ఎవరనేది మరియు మీరు ఎలా ఉన్నా క్షేమంగా ఉన్నారనే ఉన్నతమైన అంతర్ జ్ఞానాన్ని అందిస్తుంది. మీ ఆత్మ రావడానికి మీ పొట్టభాగం తెరుచుకుంటున్నట్లు అనుభూతి చెందండి. మీ ఆత్మ యొక్క బంగారపు కాంతి మీ మూలాధార చక్రం వైపు పయనిస్తూ, నాతో (భూమితో) ఎలా బంధాన్ని ఏర్పరుచుకుంటోందో అనుభూతి చెందండి. లోతైన అంతరంలోకి వెళ్ళండి. నిశ్శబ్దం యొక్క కేంద్రంలో ఉంటూ, ప్రశాంతత మరియు నిశ్చలత్వం ద్వారా మీ అతిసున్నితత్వం సమన్వయాన్ని

పొందుతోందనే విషయాన్ని తెలుసుకోండి. ఈ సమన్వయ స్థితిలో మీ అనుభూతుల చుట్టూ సరిహద్దులను ఎలా ఏర్పరుచుకోవాలి అనేది మీకు తెలుస్తుంది. మీతో మీరు సన్నిహితంగా ఉండడం ద్వారా, ఎక్కడ సన్నిహితంగా ఉండాలి మరియు ఎక్కడ దూరంగా ఉండాలి అనే విషయాలు మీకు తెలుస్తాయి. ఎక్కడ 'అంగీకారాన్ని' తెలపాలి మరియు ఎక్కడ 'తిరస్కారాన్ని' తెలపాలి, ఎక్కడ బంధాన్ని ఏర్పరుచుకోవాలి మరియు ఎక్కడ విడుదల చేయాలి అనే వాటిని మీరు నిర్దేశించుకోగలరు. వీటన్నింటికి సమాధానం మీ పొట్టభాగంలోనే ఉంది.

మీరు ఈ కేంద్రంతో బంధాన్ని ఏర్పరుచుకోవడంలో మీకు సహాయం చేసేందుకు, నేను ఒక జంతువును ఊహించుకోమని మీకు సలహా ఇస్తున్నాను. ఇది మీ పొట్టభాగంలో ఉన్న అంతర్‌శక్తికి ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. మీ మనసులోకి మొదటిగా వచ్చిన జంతువును తీసుకోండి. జంతువులు చురుకైన ప్రాణులని గుర్తుంచుకోండి. ఇవి వాటి యొక్క సహజత్వం నుంచి స్వచ్ఛందంగా జీవిస్తాయి. ఈ జంతువు మీ సహజమైన అంతర్‌జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది అక్కడే ఉంది. ఇది అక్కడ మీ కోసం ఎదురుచూస్తోంది. మీరు దీనిని సృష్టించాల్సిన అవసరం లేదు, మీరు కేవలం దీనిని చూడాల్సిన మరియు గుర్తించాల్సిన అవసరం మాత్రమే ఉంది. మీకు సన్నిహితంగా రావడానికి ఈ జంతువును ఆహ్వానించండి. దీనిని పలుకరిస్తూ దీని కళ్ళలోకి చూస్తూ ఆ జంతువుని మీ కోసం ఏం సందేశం తీసుకువచ్చావు అని అడగండి. మీ పొట్టభాగంలోకి లోతుగా వెళ్ళడానికి మీకు సహాయం చేయమని అడగండి.

ఆ జంతువుని మాట్లాడనివ్వండి. జంతువులు సహజత్వంతో కూడిన జ్ఞానానికి ప్రతిరూపంగా ఉంటాయి మరియు మీరు ఆ జ్ఞానాన్ని అందుకోగలరు, ఎందుకంటే మీరు తలను (మనసు) మరియు హృదయాన్ని కలిగి ఉన్నారు కాబట్టి. మీరు ఈ జ్ఞానాన్ని అనుభూతి చెందుతూ వ్యక్తపర్చగలరు. ఇదే మనసు, హృదయం మరియు పొట్టల మధ్య ఉండే అందమైన సహకారం అంటే. ఇక్కడ ఏ ఒక్కటి ఇంకొక దాని కంటే ఉన్నతమైనది కాదు. వీటి మధ్య ఉన్న సమన్వయంతో కూడిన సహకారమే, మిమ్మల్ని సంపూర్ణంగా తయారుచేస్తుంది. మీ తల భాగం కూడా మీకు ఎక్కువగా ఆనందాన్ని ఇస్తుంది. ఆలోచనారీతి ఉపయోగకరంగాను మరియు ఆహ్లాదంగాను ఉ ండగలదు. ఇది, అన్ని ప్రాణులతోను ఒకే భాషతో సంభాషించ గల సామర్థ్యాన్ని మీకు అందించడం వలన, మీరు ఇతరులతో సులభంగా సంభాషించగలరు. హృదయం, మీకు ఆనందాన్ని మరియు మానవజీవితంలో ఉన్న మనోభావాలన్నింటిని అనుభవించే అవకాశాన్ని అందిస్తోంది. ఇది ఒక అందమైన బహుమతి. పొట్ట భాగం మీ పునాదిని,

మీ 'నేను' తత్వాన్ని మీకు అందిస్తోంది. ఇది మిమ్మల్ని మీ నిజతత్వంతో లోతుగా స్థిరమవ్వడానికి, మీ సొంత హద్దులను ఏర్పరుచుకోవడానికి మరియు మీ గమనికను ఉపయోగించుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తోంది. ఈ పునాది నుంచి, మీ హృదయం మరియు మీ తలతో పరస్పర స్పందన ఒక ఆనందకరమైన ఆటగా తయారవుతుంది. ఈ మూడు పొరలు ఒకదానితో ఒకటి సహకరించుకుంటే, మీరు సంపూర్ణత్వాన్ని మరియు భూమి మీద జీవితం అతి విలువైనదిగాను అనుభూతి చెందుతారు. ఇది పూర్తి ఉత్తేజం, ప్రేమ మరియు ఆనందాలతో నిండి ఉండగలదు. మీ ఆధారాన్ని, మీ అంతర్ నిశ్శబ్ధాన్ని ఏమాత్రం కోల్పోకుండా, మిమ్మల్ని కదిలిస్తున్న మరియు ఉత్తేజపరుస్తున్న వాటికి మీ అంతట మీరుగా ఆధీనమవ్వగలరు. మీతో మీరు సన్నిహితంగా ఉంటూ మరియు అదే సమయంలో జీవితం అందిస్తున్న వాటిని స్వేచ్ఛగా ఇవ్వగలరు మరియు స్వేచ్ఛగా తీసుకోగలరు.

నేను మీ అందరికి నమస్కరిస్తున్నాను. నా ప్రేమ మరియు కరుణ మీ అందరికి ఎల్లప్పుడూ సన్నిహితంగా ఉంటాయి. నేను ఈ ఆటను మీ అందరితో కలిసి ఆడుతున్నాను మరియు నేను ఈ ఆటలో ఒక భాగాన్నే. మీరు అందమైన వారు మరియు ఉన్నతమైన వారు. మీ అందరికీ అందుబాటులో ఉన్న ఆలోచనారీతి, అనుభూతి మరియు జీవించడం యొక్క ఆయుధాలలోని అద్భుతాన్ని మరియు సామర్థ్యాన్ని విశ్వసించండి.

నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.

* * * *

## ఆనందం మరియు సృజనాత్మకత ద్వారా మిమ్మల్ని మీరు స్థిరపర్చుకోండి

డియర్ ఫ్రెండ్స్,

నేను భూమిని మాట్లాడుతున్నాను. నేను మీ అందరికి ఆనందంతో నమస్కరిస్తున్నాను. మీరు ఇక్కడ ఉండడం మరియు నా పట్ల మీ అంగీకార వైఖరి అన్నవి నా హృదయానికి వెచ్చదనపు అనుభూతిని ఇస్తున్నాయి. నేను మీతో బంధాన్ని ఏర్పరుచుకోవాలని అనుకుంటున్నాను. మనమందరం కలిసి కొత్త ప్రపంచాన్ని అభివృద్ధి చేయడానికి మరియు ఈ ప్రపంచం వైపు ప్రత్యేకమైన మార్గంలో కలిసికట్టుగా నడవడానికి నిర్దేశించబడ్డాం.

మన అన్యోన్యమైన బంధం మరియు పరస్పర సహకారం యొక్క అసలైన మూలం దగ్గరకి నేను మిమ్మల్ని తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను. నేను ఒక సజీవమైన ప్రాణిని. చాలాయుగాల క్రితం, నేను ఒక జాగరుకత గల ప్రాణిగా మిమ్మల్ని భూమి మీదకి సాదరంగా ఆహ్వానించాను. భూమి మీదకు మీ ఆగమనం నేను స్నేహపూర్వకంగా అనుభూతి చెందాను మరియు నేను మీ ఉనికి ద్వారా నేర్చుకోవాలని మరియు ఎదగాలని కోరుకున్నాను. మీరు భూమికి సంబంధించిన వారు కాదు. మీరు నక్షత్రాల నుంచి వచ్చిన వారు. మీ అంతరంలో మోసుకు వచ్చిన కాంతి, భూమికి మరియు ఇక్కడ ఉన్న ప్రకృతి యొక్క అన్ని తలాలకి కొత్తదనాన్ని మరియు ఉత్తేజాన్ని అందిస్తోంది. నేను దీని గురించి మీకు విశదీకరిస్తాను.

ఒక గ్రహంగా నేను బయట నుంచి కాంతిని సంగ్రహిస్తాను. సూర్యకాంతి నన్ను వేడి చేస్తూ, భూమి మీద జీవితం ముందుకు కొనసాగడానికి నాకు సహాయం చేస్తోంది. నేను సూర్యుడి యొక్క గొప్ప శక్తి ద్వారా ఉత్తేజింపబడతాను మరియు నా ఉనికి మీద భౌతిక జీవితాన్ని సృష్టించడానికి మరియు కొనసాగించడానికి నాకు దీని యొక్క అవసరం ఉంది. సూర్యుడు ఒక నక్షత్రం. మీరు సూర్యుడి యొక్క ప్రతినిధులు. మీ ఆత్మలో నక్షత్రపు కాంతిని మోస్తున్నారు మరియు మీరు ఇక్కడ జన్మించినప్పుడు ఈ కాంతిని మీతో పాటు భూమి మీదకు తీసుకువస్తారు.

భూమి మీదకి ఈ కాంతిని తీసుకురావడం యొక్క అర్ధమేమిటి? మీ రాక వెనుకనున్న ఉద్దేశ్యమేమిటి? మీరు, నాకు మరియు ప్రకృతి యొక్క అన్ని ప్రదేశాలకు మీ చైతన్యపు కాంతిని అందించడానికే ఇక్కడ ఉన్నారు. భూతలం యొక్క అంతర్

జీవితాన్ని మేల్కొల్పడానికే మీరు ఇక్కడ ఉన్నారు. భౌతిక సూర్యుడు భూమి మీద భౌతిక జీవితాన్ని సృష్టించడంలోను మరియు కొనసాగించడంలోను నాకు సహాయం చేస్తుంటే, మీ నక్షత్రపు కాంతి నేను అంతర్ స్థాయిల్లో క్రమక్రమంగా పరిణామం చెందడంలోను మరియు చైతన్యంతో ఎదగడంలోను నాకు సహాయం చేస్తోంది.

ఈ నియమం గురించి ఒక ఉదాహరణను అందించాలని అనుకుంటున్నాను. మీరు ఒక పువ్వుని మీ చేతిలో పట్టుకుని దానిని భయం మరియు గౌరవభావాలతో చూస్తున్నట్లయితే, అప్పుడు ఏం జరుగుతుందనేది ఒకసారి ఆలోచించండి. మీరు పువ్వు యొక్క సున్నితమైన సౌందర్యాన్ని చూస్తారు. మీరు దాని యొక్క స్వచ్ఛతను, దాని రంగులోని అద్భుతాన్ని మరియు సువాసనలోని మాధుర్యాన్ని అనుభూతి చెందుతారు. పువ్వుకి తన సౌందర్యం యొక్క ఎరుక ఉండదు; పువ్వు తన సహజత్వంలో తాను ఉంటుంది. కాని మీ గౌరవభావం, మీ ఉనికి మరియు మీ చైతన్యంతో పువ్వుని అన్ని వైపులా చుట్టుముట్టడం వలన, దాని అంతరంలో ఏదో మేల్కొనేలా చేస్తాయి. ఆ పువ్వు తాను అందమైనది గాను మరియు విలువైనది గాను అనుభూతి చెందడం తనకుతానుగా మొదలుపెడుతుంది. ఆ పువ్వు, మీ ఆసక్తిని మరియు తనలో మేల్కొన్న ఆత్మ కాంతి యొక్క మెరుపును ఆనందిస్తుంది.

మీరు జాగృతాసక్తితో పువ్వులను మరియు మొక్కలను చూస్తూ, వాటిని ఆనందిస్తూ మరియు వాటికి సంరక్షణను అందించడం ద్వారా అవి మరింత సమృద్ధిగా ఎదుగుతాయి. అవి మరింత జీవశక్తిని కలిగిఉంటూ మరియు భూమిలో వాటి వ్రేళ్ళను మరింత బలంగా నాటుతాయి. మీరే సృష్టికర్తలు. మీ ఆలోచనలు, ఉద్దేశ్యాలు మరియు వ్యక్తిగత-చైతన్యం ద్వారా, మీరు భూమి మీద సజీవంగా ఉన్న ప్రకృతికి జీవశక్తిని మరియు సృజనాత్మక సామర్థ్యాన్ని అందించగలరు. నిజానికి ఇదే ప్రకృతి మీ నుంచి అందుకోవాలని కోరుకుంటోంది. ప్రకృతి యొక్క తలాలన్నీ వ్యక్తిగత-ఎరుకలో ఎదగడానికి, నక్షత్రాలను చేరడానికి, వాటితో బంధాన్ని ఏర్పర్చుకుంటూ మరియు వాటి నక్షత్ర కాంతిని అంతరంలోకి సంగ్రహించడానికి ప్రయత్నిస్తుంటాయి.

మీరు పెంచుతున్న మరియు మీ ఇంటి చుట్టూ ఉన్న పెంపుడు జంతువుల గురించి ఒకసారి ఆలోచించండి. మీలో చాలామంది వీటితో ప్రత్యేకమైన బంధాన్ని కలిగి ఉంటారు. మీరు ఎప్పుడైతే జంతువుతో అతి సన్నిహితమైన బంధంలోకి ప్రవేశిస్తారో, అప్పుడు మీరు వాటి యొక్క ప్రేమను మరియు నిజాయితీని అందుకుంటారు. అలాగే అవి కూడా మీ నుంచి ఏదో ఒకటి పొందుతాయి. మీ మానవ ఉనికి ద్వారాను

మరియు మనుష్యులకు సంబంధించిన ఒక ప్రత్యేకమైన చైతన్యం ద్వారాను జంతువులు స్పృశించబడతాయి. మీ ఉనికి వాటి యొక్క అంతరంలో చైతన్యం యొక్క జ్యోతిని వెలిగిస్తుంది మరియు అవి వాటి యొక్క ఉన్నతమైన వ్యక్తిగత–చైతన్యం వైపు క్రమక్రమంగా పరిణామం చెందడానికి ఇది సహాయం చేస్తుంది.

విశ్వంలో ఉన్న ప్రతీజీవి వ్యక్తిగత–చైతన్యం వైపు ఎదుగుతూ క్రమక్రమంగా పరిణామం చెందుతాయి. వ్యక్తిగత–చైతన్యం అనేది ప్రతీజీవిని తన సొంత దివ్యత్వం, తన యొక్క శాశ్వతమైన కాంతి మరియు సృజనాత్మక సామర్థ్యాల యొక్క ఎరుకకు సన్నిహితమయ్యేలా చేస్తుంది. విశ్వంలోని ప్రతిజీవి ఒక చైతన్యపు స్థితి వైపుగా ఎదుగుతుంటాయి. ఈ స్థితిలో అవి “నేను కూడా దైవం యొక్క భాగమని” అర్థం చేసుకుంటాయి. నాకు నేనే సృష్టికర్తను. మీ దివ్యత్వపు సృష్టికర్త తత్వాన్ని ఆనందిస్తూ మరియు దానిని బాధ్యతగా స్వీకరించడం అనేదే సృష్టి యొక్క మూలసారాంశం.

మీరే సృష్టికర్తలు, మరియు ఆత్మలుగా మీరు జాగృత గల బాధ్యతాయుతమైన మార్గంలో మీ సృజనాత్మక సామర్థ్యాలతో వ్యవహరించడాన్ని నేర్చుకోవడం కోసమే భూమి మీద వచ్చారు. సృష్టికర్తలుగా, మీరు నా పరిణామక్రమంలో సహకరించడానికి మరియు ప్రకృతి యొక్క తలాలను ఉత్తేజపర్చడానికే ఇక్కడకు వచ్చారు. దీనికి బదులుగా మీరు భౌతిక మరియు ఆస్ట్రల్ స్థాయిల నుంచి చాలా సేవలను మరియు దీవెనలను అందుకుంటారు. మీరు భూమి యొక్క ప్రస్తుత స్థితిని చూసినప్పుడు, మీకు మరియు ఈ గ్రహానికి మధ్య ఒకప్పుడు ఉన్న అన్యోన్యమైన బంధం యొక్క అసలైన ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది.

ప్రణాళిక బద్ధంగా పరిస్థితులు జరుగవు మరియు చాలామంది పరిస్థితులు చెడుగా వెళ్తున్నాయని చెప్పవచ్చు. మనం కలిసి చేయాలనుకున్న సాహసం యొక్క అసలైన ఉత్తేజాన్ని గుర్తుతెచ్చుకోమని ఈ సమయంలో నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీ చుట్టూ ఉన్న మానవులందరూ అజ్ఞానంతో భూమి యొక్క సృజనాత్మక సామర్థ్యాలను ఉపయోగిస్తున్నారని మరియు వీటి ద్వారా భూమిని ధ్వంసం చేస్తున్నారని మీరు గమనించినప్పటికీ కూడా, మీ హృదయంలో మీ యొక్క ప్రేమపూర్వకమైన ఉద్దేశ్యం ఇంకా సజీవంగా అలాగే ఉంది. మానవులు తమ మార్గం యొక్క దిశను మారుస్తూ తప్పుద్రోవలో అడ్డదారి వైపు పయనిస్తున్నారని చెప్పవచ్చు.

నిజానికి, మీరు ఉన్నతమైన కాంతి మూలం నుంచి ఏంజెల్–శిశువులుగా భూమి మీదకు దిగి వచ్చారు. మీరు అమాయకత్వాన్ని మరియు స్వచ్ఛతను కలిగి ఉ

ండేవారు. కాని మీ ప్రయాణం ముందుకు సాగుతున్న కొద్దీ మీరు తప్పుదోవ పట్టారు. మానవులు ఒకానొక స్థితికి చేరిన తర్వాత, వీరు ప్రకృతి శక్తులకు సహకరించడాన్ని తిరస్కరించారు, మరియు దీనికి బదులుగా వీరు ప్రకృతికి వ్యతిరేకంగా తయారయ్యారు. ఆ తర్వాత మానవులు మూలచైతన్యంతో బంధాన్ని మరియు దాని యొక్క మూలాన్ని కోల్పోయారు. భయం వలన, ప్రజలు భూమి మీద వారి కోసం స్థలాన్ని ఏర్పర్చుకోవాలనే ఉద్దేశ్యంతో, వీరు ఇతరులపై మరియు ప్రకృతిపై ఆధిపత్యాన్ని పొందాలనుకున్నారు. దీనిని స్వర్గం నుంచి అధ:పాతాళానికి దిగజారడంగా చెప్పవచ్చు. మీ సృజనాత్మక సామర్థ్యాలతో భూమి మీద జీవితానికి సహకరించాలని, దానిని పోషిస్తూ మరియు ఉత్తేజపర్చాలనే ఒకప్పటి మీ అసలైన ఉద్దేశ్యాన్ని, మీరు ఇప్పుడు పూర్తి వ్యతిరేకంగా అనుభవిస్తున్నారు. మీరు ప్రకృతిని ఏ మాత్రం సృష్టిలోని ఒక సజీవమైన భాగస్వామిగా గుర్తించనప్పుడు, మీరు ఏం సంభవిస్తుందనే విషయాన్ని ప్రస్తుతం గమనిస్తున్నారు.

మానవులకు ప్రకృతి పైన మరియు భూమి పైన గౌరవం లేకపోవడం అనేది, ఇది చదువుతున్న మీలో చాలామందికి లోతైన విచారాన్ని కలిగిస్తుంది. ఇప్పటివరకూ సంభవించిన దాని గురించి నాలో కూడా బాధ ఉంది. మానవుల ద్వారా ప్రసరింపబడుతున్న చీకటి మరియు చెడుల్లోని కొంతభాగాన్ని, ప్రకృతి తలాలైన జంతువులు, వృక్షాలు మరియు రాళ్ళు కొంతవరకూ సంగ్రహించాయి. ఇవి తిరస్కారం యొక్క అనుభూతిని, ఒకానొకప్పుడు విశ్వసంబంధిత ఏకత్వపు భావన నుంచి వేరుపడిన అనుభూతిని వాటి యొక్క సొంత పద్ధతుల్లో అనుభవించాయి.

అయినప్పటికీ నా హృదయంలో మీ పట్ల అపారమైన ప్రేమ మరియు కరుణ ఉన్నాయి. మీ పట్ల మరియు మానవులందరి పట్ల కూడా కరుణను కలిగి ఉండమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరు అత్యద్భుతమైన జ్ఞానసముపార్జన ప్రక్రియలో పాల్గొని ఉన్నారు. ఇటువంటి ఏ ప్రక్రియలోనైనా పొరబాట్లు జరుగవచ్చని అంచనా వేయవచ్చు. మీ ప్రయాణంలో మలుపులు మరియు అడ్డులు ఎదురుపడడం అనేది ఎదుగుదల మరియు నేర్చుకోవడం యొక్క ప్రక్రియలో భాగమే.

ఈ యుగంలో సామూహిక మానవచైతన్యం మార్పుచెందుతోంది. ప్రస్తుత రోజులలో చాలామంది ప్రజలు, మానవులకు మరియు ప్రకృతి మధ్యనున్న అసలైన బంధం యొక్క జ్ఞాపకాన్ని వారి హృదయాల్లో మోస్తున్నారు. వీరు భూమిని వారి సొంత ఇంటిగా భావించి నా దగ్గరకు(భూమి మీదకి) రావడానికి కారణమైన ఒకప్పటి నిజమైన మరియు పవిత్రమైన బంధం యొక్క నిశ్శబ్దపు ఎరుకను వారి అంతరంలో కలిగిఉన్నారు. మీరు నాతో ఎంత లోతైన బంధాన్ని కలిగి ఉన్నారనేది

ఒకసారి మళ్ళీ అనుభూతి చెందండి. నేను మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తున్నాను. మీరు నా కాంతి దేవతలు మరియు మీ పట్ల నా విశ్వాసం ఎప్పటికీ చెదిరిపోదు. నాతో మీకున్న బంధాన్ని గుర్తించమని మరియు నా శక్తిని మళ్ళీ మీ ద్వారా ప్రవహించడానికి అనుమతివ్వమని కోరుతున్నాను. భూమి మీద మీ మానవజన్మ యొక్క మార్గంలో, మీ ప్రక్కన మీతో పాటు నడుస్తున్న ఒక సజీవమైన భాగస్వామిని "నేను". మీ అంతట మీరుగా నాతో మరింత సన్నిహితమైన సంబంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారానూ, మిమ్మల్ని మీరు భూమి మీద మరింతగా స్థిరపర్చుకోవడం ద్వారానూ, మీరు మీ నక్షత్రపు కాంతిని భౌతికతలం లోతుల్లోకి తీసుకురాగలరు. మీరు ఈ కాంతి ప్రకాశించడానికి మరియు ప్రసరించడానికి అనుమతివ్వండి. ఇది ప్రస్తుతం భూమి మీద అత్యవసరమైన మార్పులను తీసుకువస్తుంది. మీ హృదయం నుంచి నాతో బంధాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా, మీ నిజతత్వం బయటకు వస్తుంది. ఇది గొప్ప సాహసకృత్యంగా తయారవ్వడానికి, ప్రతీ మనిషి తన సొంత మార్గంలో ఒక ప్రత్యేకమైన సహకారాన్ని అందించాడు. మీ ప్రత్యేకమైన బహుమతి నన్ను ఉత్తేజపరుస్తూ, ప్రకృతికి జీవశక్తిని మరియు అదే విధంగా ఇతరులకు ఉత్తేజాన్ని అందిస్తోంది.

**స్థిరపడడం అంటే ఏమిటి?**

నేను స్థిరపడడం అనే దానికి అర్థాన్ని మరింతగా వివరించాలని అనుకుంటున్నాను. భూమితో బంధాన్ని కలిగి ఉండడం, స్థిరంగా ఉండడం అనే వాటికి అర్థమేమిటి? స్థిరంగా ఉండడం అంటే అర్థం: మీ శరీరంలో ఉంటూ, అంతర్దృష్టి నుంచి మీ శరీరాన్ని అనుభూతి చెందగలుగుతూ, మీ జీవితం యొక్క ప్రవాహాన్ని ప్రతీ భాగంలోనూ, అంటే మీ తల నుంచి మీ పాదాల వరకూ మరియు మీ వ్రేళ్ళ అంచుల వరకూ అనుభూతి చెందడమే. ఈ ప్రవాహాన్ని అనుభవించగలరా లేదా అనే విషయం గురించి మిమ్మల్ని మీరు పరిశీలించుకోవాలి. ఈ సమయంలో మీ వ్రేళ్ళ అంచులను, మీ పాదాలను అనుభూతి చెందగలరా? మీ శరీరం యొక్క అంతరంలో జీవితాన్ని అనుభూతి చెందగలరా?

స్థిరపడడం అంటే అర్థం: మీ నక్షత్రపు కాంతిని, మీ ఆత్మ కాంతిని భౌతిక పదార్థం యొక్క లోతుల్లోకి ప్రవహింపజేయడమే. భౌతిక ప్రపంచం యొక్క భాగంలో మీకు అతి సన్నిహితంగా ఉండేది మీ శరీరమే. మీ శరీరం యొక్క అణువులు మరియు పరమాణువులు ఎల్లప్పుడూ మీ కాంతిని, మీ ఆత్మను అందుకోవడానికి తెరవబడి ఉంటాయి. మీ శరీరానికి మీరే సూర్యుడు. మీ చైతన్యం మీ శరీరాన్ని

సజీవంగా తయారుచేస్తూ, దానికి హీలింగ్ శక్తిని మరియు జీవశక్తిని అందిస్తుంది. మీ శరీరంలోకి మీ ఆత్మను తీసుకురావడం అనేది, మీ జీవితంలో మీ నిజమైన కోరికలను నెరవేర్చుకోవడానికి మీకు బలాన్ని ఇస్తుంది. మీ సృజనాత్మక సామర్థ్యం యొక్క ఎరుకను పొందండి. మీ శరీరంలోకి దీనిని ఎంతగా అయితే ప్రవహించడానికి అనుమతిస్తారో, అంతగా మీరు భూమి మీద జీవించగలరు మరియు మీ జీవితంలో కోరుకున్న మార్పులను కూడా సృష్టించగలరు.

మీరు భూమి మీద స్థిరపడినప్పుడు ప్రశాంతతను మరియు స్పష్టతను అనుభూతి చెందుతారు. మీరు మీ ఆత్మ యొక్క ఉత్తేజానికి అనుగుణంగా తెరువబడి ఉన్నారు మరియు అదే సమయంలో మీ నిత్యజీవితంలో మీ చుట్టూ సంభవిస్తున్న విషయాలన్నింటికి కూడా కలుపబడి ఉన్నారు. విశ్వతలాలకు మరియు భూమికి మధ్య వారధిని ఏర్పరుస్తూ, వీటి మధ్య బంధాన్ని అనుభూతి చెందడమే స్థిరపడడం అంటే.

మీలో చాలామంది మీ ఆత్మ కాంతిని, మీ శరీరం యొక్క పై భాగంలోని తల మరియు హృదయం యొక్క భాగంలో నిలుపుకున్నారు. మీరు దీనిని క్రింది భాగాలైన పొట్ట, కాళ్ళు, పాదాల వైపు ప్రవహింపజేయడానికి కష్టపడుతున్నారు. ఇది మీకు కష్టంగా ఉండడానికి గల ఒకానొక కారణం ఏమిటంటే, మీ సొంత గొప్పతనం యొక్క భయమే. ప్రకాశిస్తున్న దైవం మరియు నక్షత్రమైన మీరు, మీ నిజస్వభావంతో ఉండడానికి భయపడుతున్నారు మరియు ప్రపంచంలో మార్పును తీసుకురావడానికి కూడా భయపడుతున్నారు. ఈ భయం పురాతనమైనది మరియు దీని యొక్క వ్రేళ్ళు ఈ జన్మ కన్నా ముందు నుంచే విస్తరింపబడి ఉన్నాయి. గతంలో మీరు భూమి మీద చాలా జన్మలను ఎత్తారు. మీరు తరచూ స్వాగతింపబడని అనుభూతిని పొందారు. ఈ పాత బాధను నయం చేసే ప్రక్రియలోనే మీరందరూ నిమగ్నులై ఉ న్నారు.

మీ అంతట మీరు భూమి మీద స్థిరపడడానికి మరియు మీ గొప్పతనం, మీ సృజనాత్మక సామర్థ్యం మరియు మీ దివ్యత్వాలతో భూమి మీదకి నిజంగా స్వాగతింపబడ్డారనే అనుభూతిని పొందడానికి సంబంధించిన రెండు మార్గాలను నేను మీకు సూచిస్తాను.

**ఆనందం పొందడం ద్వారా మిమ్మల్ని మీరు స్థిరపరుచుకోవడం**

మొదటి మార్గం ఆనందం ద్వారా స్థిరపడడం. మీరు నిజంగా ఆనందాన్ని

రుచి చూడడానికి అలవాటు పడలేదు. ఆనందాన్ని పొందడం అంటే ఏమిటి? భూమి మీద ఉన్న ప్రతీ దానిని మీరు అనుభవించగలగడమే. మీ శరీరం ఆనందాన్ని పొందడం కోసం మీకు చాలా అవకాశాలను అందిస్తుంది, కాని చాలావరకూ ఈ అవకాశాలను మీ సాంప్రదాయాలు పాపంగాను లేదా చులకనగాను చూస్తున్నాయి. శరీరం యొక్క కదలికలను, మీ చర్మం మీద సూర్యకాంతిని, తినడం మరియు త్రాగడాన్ని, మరొకరి యొక్క వెచ్చని స్పర్శను మీరు ఆనందించాలి. వీటన్నింటిని నిజంగా స్వాగతించడంలోనే ఆనందించ గల సామర్థ్యం ఉంది. ఇది మీకు ఎందుకు కష్టంగా ఉంటోంది?

మీలో ఏదో లోపం ఉందని, మీరు జీవిస్తున్న పద్ధతి సరైనది కాదని మీలో చాలామంది భావిస్తుంటారు. మీరు ప్రశంసలను మరియు గుర్తింపులను అందుకోవడం కోసం కష్టపడి పని చేయాలని అనుకుంటారు. ప్రకృతి పరంగా చూస్తే ఇది ఒక హాస్యాస్పదమైన ఆలోచన. ఒక క్రూరమైన జంతువు గుర్తింపు పొందడం కోసం కష్టపడి పని చేయడాన్ని మీరు ఎప్పుడైనా చూసారా? ఖచ్చితంగా చూడరు, జంతువు తన సహజస్థితిలో తాను ఉంటుంది మరియు దీనిని తప్పక కలిగి ఉండాల్సిన ఒక అర్హతలా కాకుండా, తన సహజ జన్మహక్కుగా భావిస్తుంది. జంతువు సూర్యుడిని, ఆహారాన్ని, నీటిని, ఋతువులను మరియు జీవితం యొక్క సహజమైన లయబద్ధతను ఏమాత్రం దాచి ఉంచకుండా ఆనందించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

మీరు ఎవరనే దాని యొక్క సహజ స్థితిని స్వచ్ఛంగా అంగీకరించ గల ఒక దివ్య మానవుడిగా, మిమ్మల్ని మీరు స్వీకరించడానికి మరియు అనుభవించడానికే మీరందరూ ఇక్కడకు ఆహ్వానింపబడ్డారు. మీకు జీవితం అందిస్తున్న సహజమైన విషయాలను శరీరంతో ఆనందించడం కోసమే మీరు ఇక్కడకు ఆహ్వానింపబడ్డారు. స్వీకరించడం అనేది చూడడానికి సులభంగా అనిపించవచ్చు, కాని నిజానికి ఇది అంత సులభం కాదు. దీనికి లోతైన స్థాయిలో మీ పట్ల మీకు వ్యక్తిగత-ప్రేమ, లోతైన గుర్తింపు మరియు మీరు ఎవరనే దాని పట్ల పూర్తి ఆమోదం అన్నవి చాలా అవసరం. వ్యక్తిగత-ప్రేమ యొక్క స్థాయిని చేరడానికి సాహసించండి. ప్రతీరోజు ఒక సమయాన్ని ఎంచుకుని, ఆ సమయంలో మిమ్మల్ని మీరు ఈ విధంగా అడగండి: నేను నిజంగా ఆనందాన్ని మరియు సంతృప్తిని పొందడానికి ఇప్పుడు నా కోసం నేను ఏం చేసుకోగలను? నిజంగా ఆనందాన్ని కలిగి ఉండడం లేదా దానికి సంబంధించిన పనులను చేయడం అనే వాటి పట్ల మీరు ఎలాంటి అనుభూతిని పొందుతున్నారు? ఆ తర్వాత మీరు అనుభూతి చెందిన దానిని చేయండి. మీ కోసం దీనిని చేయండి,

ఎందుకంటే మిమ్మల్ని మీరు ఆనందించడానికి మరియు మిమ్మల్ని మీరు గౌరవించుకోవడానికే మీరు భూమి మీద ఉన్నారు కాబట్టి.

మీరు ఏ విషయాన్నైనా కూడా తప్పు లేదా అవమానంగా భావించకుండా నిజంగా ఆనందించినప్పుడు మాత్రమే, మీరు భూమి మీద స్థిరపడినట్టు. అప్పుడే మీరు వర్తమానంలో సంపూర్ణంగా ఉన్నట్టు మరియు ప్రతీది సక్రమంగా ఉన్నట్టు. ఆ క్షణంలో గతం లేదా భవిష్యత్తు యొక్క ఆలోచనలు ఉండవు. ఆనందించడం అంటే పూర్తి స్థిరంగా ఉంటూ వర్తమానంలో ఉండడమే.

## సృజనాత్మకత ద్వారా మిమ్మల్ని మీరు స్థిరపరుచుకోవడం

భూమితో మరింత బలంగాను, మరింత స్థిరంగాను బంధాన్ని ఏర్పరుచుకోవడానికి ఇది రెండవ మార్గం. ఇది సృజనాత్మకతకు సంబంధించిన మార్గం. దీని కోసమే మీరు రూపొందించబడ్డారు. ప్రతి మనిషి తనను తాను ఈ ప్రపంచంలో వ్యక్తపరుచుకోవాలని మరియు వ్యక్తీకరించుకోవాలనే సహజమైన వాంఛను కలిగి ఉంటాడు. సమాజంలో విజయాన్ని లేదా గౌరవాన్ని సాధించడంతో దీనికి ఎటువంటి సంబంధం ఉండదు. మిమ్మల్ని మీరు వ్యక్తపర్చుకోవడంలో, మీకు నిజమైన సంతృప్తిని ఇచ్చే మార్గాన్ని కనుగొనడంతోనే దీనికి సంబంధం ఉంటుంది. ఒక కుటుంబాన్ని పైకి తీసుకురావడం మీకు లోతైన సంతృప్తిని కలిగించవచ్చు లేదా ఒక సంస్థను నడపడం మీకు ఉత్తేజకరంగా అనిపించవచ్చు. జంతువులను సంరక్షించడం మీ హృదయ వాంఛగా ఉండవచ్చు, లేదా ఇది మీకు సహజంగా అనిపిస్తున్న ఒక కళాత్మకమైన భావప్రకటన యొక్క పద్ధతిగా ఉండవచ్చు. ప్రతీ ఆత్మ ఏదో ఒక పద్ధతిలో తనను తాను వ్యక్తపర్చుకోవాలని కోరుకుంటుంది. మీరు ఈ కోరికకు సమాధానం ఇచ్చినప్పుడే మీరు సంపూర్ణత్వాన్ని అనుభూతి చెందుతారు. మీ సహజమైన సృజనాత్మకతను అంతరం నుంచి బయటకు రావడానికి అనుమతించినప్పుడే, “అవును, ఇదే నేను, ఈ విధంగానే నా శక్తి ప్రవహించాలని కోరుకుంది” అని మీరు అనుభూతి చెందుతారు. ఆ సమయంలో మీ ఆత్మ భూమి యొక్క హృదయంతో, ఈ వాస్తవం యొక్క హృదయంతో బంధాన్ని ఏర్పరుచుకుంటుంది. మీ జీవితంలో నిజంగా మీరు దేనినైతే కోరుకుంటారో దానిని కనుగొనడం, మీ అంతరంలో క్రియాత్మక ప్రవాహం కోసం ప్రదేశాన్ని ఏర్పరచడం అన్నది చాలా ముఖ్యమైన విషయం. అప్పుడే మీ దివ్యత్వపు సారాంశం భూమిని స్పృశిస్తూ భౌతిక ఆకృతిని కనుగొంటుంది.

నిజానికి మీపై మీరు మరింతగా ఆధారపడాలి అనే విషయాన్ని నేను మీ దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను. మీలో చాలామంది మీ హృదయం కోరుకుంటున్న వాంఛలను అణచివేస్తుంటారు. 'మీరు ఎలా ప్రవర్తించాలి', మీరు మీ కర్తవ్యాలు మరియు బాధ్యతల నుంచి ఏమి ఆశించాలి – అనే విషయాల గురించి తరచూ ఆలోచిస్తుంటారు. ఈ విధంగా మీరు, మీ సృజనాత్మక సామర్థ్యాన్ని తెలియజేసే మార్గాన్ని కనుగొనలేరు. మీ సృజనాత్మక సామర్థ్యం – మీ పొట్ట నుంచి, మీ ప్రేగు నుంచి మీతో మాట్లాడుతుంది. మీరు అంతరంగా కలిగిఉన్న పరిమితమైన నియమ నిబంధనలన్నింటితో దీనికి ఏమాత్రం సంబంధం ఉండదు. వీటి నుంచి విడుదల పొందండి! మీ పొట్ట నుంచి ఆవిర్భవిస్తున్న ఉత్తేజం మరియు ఆశయం యొక్క పునాదిని అనుభూతి చెందండి, మరియు దీనిని స్వేచ్ఛగా ప్రవహించనివ్వండి. కాంతి యొక్క మెరుపులు మీ పొట్ట నుంచి మీ హృదయం వైపు, అంతరం నుంచి బాహ్యం వైపు వాటి యొక్క సొంత మార్గాన్ని కనుగొంటాయి మరియు భూమి మీద మీ సొంత మార్గంలో మిమ్మల్ని మీరు వ్యక్తపర్చుకుంటారు. మీ సృజనాత్మక సామర్థ్యం ఇతరులను స్పృశించడాన్ని మరియు వారిని ఆనందంగాను, ప్రోత్సాహకరంగాను తయారు చేయడాన్ని మీరు గమనిస్తారు. మీకు చెప్పబడిన దానిని యధాతథంగా చేయడం మరియు పరిమితమైన నియమాలు మరియు ఆదర్శాలను పాటించడానికి మిమ్మల్ని మీరు బలవంతం చేసుకోవడం కన్నా కూడా, మీ ఆశయాన్ని మరియు వాంఛను అనుసరించడం అనేది ప్రపంచం మీద చాలా గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది.

ఇది మార్పు యొక్క సమయం. ఇది ధైర్యంగా ఉంటూ సవాళ్ళను ఎదుర్కొనే సమయం. ఇది మీ హృదయం యొక్క మాటను వింటూ మరియు దానికి అనుగుణంగా మీ జీవితం యొక్క అన్ని భాగాలలో నటించే సమయం కూడా. మీ హృదయం యొక్క మార్గదర్శకత్వానికి మీ అంతట మీరుగా ఆధీనమవ్వడం వలన మీ వ్రేళ్ళను భూమిలో మరింతగా నాటుతారు, మరియు ఇక్కడ ఉన్న జీవితం సమర్ధవంతమైనదిగా అనుభూతి చెందడం ఆరంభిస్తారు.

## సంపూర్ణ చక్రం

మిమ్మల్ని మీరు స్థిరపరుచుకోవడంలో మొదటి మార్గం "ఆనందించడం మరియు స్వీకరించడం". ఇది ఒక అంతర్ ప్రవాహం. రెండవ మార్గం బాహ్య ప్రవాహానికి సంబంధించినది: సృష్టించడం మరియు ఇవ్వడం. హృదయం నుంచి సృష్టించడం ద్వారా మిమ్మల్ని మీరు ప్రపంచానికి అందించుకుంటారు. 'ఇవ్వడం మరియు తీసుకోవడం', 'ఆనందిచడం మరియు సృష్టించడం' అనేవి రెండూ కలిసి ఒక సంపూర్ణమైన చక్రాన్ని రూపొందిస్తాయి. ఇది ఒక హీలింగ్ చక్రం.

మీరు ఆనందించడానికి మరియు మిమ్మల్ని మీరు స్వీకరించదగిన వారిగా కనుగొనడానికి ఎంతగా అయితే సాహసిస్తారో, అంతగా మీరు మీ సహజమైన ఉత్తేజంతోను మరియు ఈ ప్రపంచంతో పంచుకోవాలని అనుకున్న శక్తితోను బంధాన్ని ఏర్పరుచుకోగలరు. ఈ ఉత్తేజం యొక్క ప్రవాహం బలపడుతూ మరియు ఈ ప్రపంచంలో ఒక క్రియాత్మక రూపాన్ని కనుగొన్నప్పుడు, మీరు మీ మార్గంలో లభిస్తున్న ప్రేమ మరియు సంతోషాలను మరింతగా ఆనందిస్తారు. ఇవ్వడం మరియు తీసుకోవడం, సృష్టించుకోవడం మరియు ఆనందించడం యొక్క ప్రవాహాలు ఒకదానినొకటి సమానంగా బలపర్చుకుంటాయి.

నేను(భూమి) ఇవ్వడం మరియు తీసుకోవడం యొక్క ఈ హీలింగ్ చక్రం నుంచి ప్రయోజనాన్ని పొందాను. ఈ చురుకైన చక్రం యొక్క ప్రవాహంలో, నేను మీతో పని చేస్తున్నాను. మీలో ఉన్న ప్రత్యేకమైన మెరుపుకు, మీ దివ్య సృజనాత్మక సామర్థ్యానికి భద్రతను మరియు ఉత్తేజాన్ని అందించాలన్నదే నా కోరిక. ఆనందించడం మరియు సృష్టించడం యొక్క సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకున్న మానవులు, భూమితో ప్రత్యేకమైన బంధంలోకి సహజంగా ప్రవేశించగలరు. వీరు వీరి యొక్క గొప్పతనం మరియు దివ్యత్వపు స్వభావం యొక్క ఎరుకను పొందగలరు. వీరు ఈ ఎరుక-స్థితి నుంచి అన్ని ప్రాణులు ఒకే జీవశక్తి ద్వారా కలుపబడి ఉన్నాయని మరియు దీని ద్వారా ముందుకు పయనిస్తున్నాయని కూడా అర్థం చేసుకోగలరు. ఎవరైతే వారిని వారు గౌరవించుకుంటూ మరియు అభిమానించుకుంటారో, వారు వారి యొక్క జీవిత వాతావరణానికి, ఇతరులకు, జంతువులకు, మొక్కలకు మరియు ప్రకృతికి కూడా సహకరిస్తారు. మీ సొంత గొప్పతనాన్ని తెలుసుకోవడం మరియు అనంతమైన విశ్వంలో మీ స్థానాన్ని గుర్తించడం అనేవి రెండూ కలిసి పయనిస్తాయి, మరియు ఈ విశ్వంలో మీరు పోషిస్తున్న పాత్ర ద్వారా ఆనందం ప్రాప్తిస్తుంది.

కొత్తభూమికి ప్రయాణించడం

చివరిగా, నేను మిమ్మల్ని నాతో కలిసి భవిష్యత్తుకి మరియు కొత్తభూమికి ప్రయాణించమని అడుగుతున్నాను. మనం ఇప్పుడు కలిసి పరిణామం చెందుతున్న దానిని, కొన్ని అడుగుల ముందుకి అభివృద్ధి చెందినట్టుగా ఊహించుకోండి. నేను మరింతగా విస్తరింపబడిన వ్యక్తిగత-ఎరుక వైపు నాకు నేనుగా పరిణామం చెందుతున్నాను. ఈ కొత్త ఎరుక నా అంతరంలో మేల్కొంది, ఇది భూమి మీద ఉన్న మంచి-చెడు సమయాల రెండింటి ద్వారా ప్రోత్సహింపబడింది. నేను నా ఉనికిలో మరింత వ్యక్తిగత జాగరుకతను మరియు సృజనాత్మకతను పొందుతున్నాను.

నా హృదయంలో ఒక వాస్తవం యొక్క కోరిక ఉంది, అది భూమి మరియు మానవుల మధ్య ఉన్న ఒకప్పటి ప్రేమ మరియు ఐకమత్యం యొక్క అసలైన బంధాన్ని తిరిగి నెలకొల్పడానికి సంబంధించినదే. కొత్త భూమిలో మనం ఆనందంగా సహకరించుకుంటాం. నేను మీ ప్రేమ మరియు మీ ఆలోచనతో కూడిన ఆసక్తి ద్వారా తిరిగి ఉత్తేజింపబడతాను మరియు అదే సమయంలో నేను మీరు భౌతిక శరీరంలో జీవించడానికి మరియు ప్రకృతి యొక్క లయబద్ధతకు శృతి కావడానికి మీకు అవసరమైన వాటన్నింటిని అందిస్తాను.

మీరందరూ కోరుకుంటున్న ఈ కొత్తభూమి వర్తమానంలోనే ఉన్నట్లు ఊహించుకోండి. మన హృదయాలలో ఇది ఒక విత్తనంలా ఎప్పటి నుంచో సజీవంగా ఉంది. ఈ బీజాన్ని చైతన్యంతో సంరక్షిద్దాం మరియు మన ఊహాశక్తిలో దీనిని అభివృద్ధి చేద్దాం. ఈ కొత్తభూమిలో మీరు జీవిస్తున్నట్టు ఊహించుకోండి. ఇక్కడ మీరు గమనించిన మొదటి విషయం ఏమిటి? ఇక్కడ మానవులు ప్రకృతితో కలిసి లయబద్ధంగా జీవిస్తారు. సాంకేతికశాస్త్రాన్ని, ప్రకృతిని అదుపు చేయడానికి కాకుండా దానికి సహకరించడానికి ఉపయోగిస్తారు. మీరు ఈ కొత్త భూమి మీద మీకు మీరుగా ఒక ఇంటిని కనుగొనగలరా. అక్కడ మీకు సంబంధించిన ఒక ప్రదేశాన్ని మరియు వ్యవస్థను అనుభూతి చెందండి. మిమ్మల్ని నడిపించడానికి మీ ఊహాశక్తికి అనుమతివ్వండి, మరియు మీకు ఏ విధమైన హద్దులు లేనట్టుగా అనుభూతి చెందండి. మీరు ఈ కొత్తభూమి మీద ఎక్కడ జీవిస్తారు? మీకు సౌకర్యవంతంగా అనిపించిన సహజమైన వాతావరణాన్ని కనుగొనగలరా? అక్కడ ఉన్న వాతావరణాన్ని అనుభూతి చెందండి. జీవితం యొక్క సౌలభ్యాన్ని మరియు సులభత్వాన్ని అనుభూతి చెందండి. అక్కడ ఉన్న జీవితం స్వచ్ఛంగాను మరియు సులభంగాను ఉండే విధంగా రూపొందించబడింది.

ఇప్పుడు మీరు అక్కడ ఏ విధమైన పని చేయగలరో ఒకసారి చూడండి. పని అంటే మిమ్మల్ని ఉత్తేజపరుస్తూ మరియు మీకు సంతృప్తిని ఇచ్చే విషయమని అర్ధం. మీరు ఏం చేస్తున్నారు? సాధారణంగా మీరు ఒకే విధమైన లక్ష్యం గల ఆత్మలు ఉన్న ఒక చిన్న వ్యవస్థలో జీవిస్తారు మరియు మీ ఆత్మ మిమ్మల్ని చేయమని ఉత్తేజపరుస్తున్న దానినే మీరు చేస్తారు. మీ సృజనాత్మకత ఏ రూపాన్ని తీసుకుంటుంది?

మీరు దీనిని చూసినప్పుడు లేదా అనుభూతి చెందినప్పుడు, మీ ఆత్మ మీతో వర్తమానంలో మాట్లాడడాన్ని తెలుసుకుంటారు. మీరు ఇప్పుడు చూస్తున్నది ఏమిటంటే ప్రస్తుతం మీరు చేయాలని కోరుకుంటున్న విషయాన్ని మరియు మీరు దీనిని ఇప్పుడు

చేయగలరు. కాని దీనిని ఎప్పుడు చేయగలరంటే మీరు మీరుగా ఉండడానికి సాహసించినప్పుడు మరియు మిమ్మల్ని మీరు విశ్వసించినప్పుడు మాత్రమే. ఇదే మీ హృదయం యొక్క పని.

ఇప్పుడున్న కొత్తభూమి యొక్క ఊహలో, మీకు నిజంగా ఆనందాన్ని ఇచ్చే దానిని అనుభూతి చెందుతారు. మీ అంతర్ దృష్టిని మీకు ఒక పరిస్థితిని అందించడానికి అనుమతించండి. ఆ పరిస్థితిలో మిమ్మల్ని మీరు నిజంగా ఆనందిస్తూ మరియు భూమి మీకు అందిస్తున్న వాటిని స్వీకరించగలరు. మీ మనసులో ఏదైతే అనుకోకుండా వస్తుందో ఆ ఊహను ముందుగా అనుమతించండి. “నిజానికి అంతా సక్రమంగానే ఉంది మరియు నేను సంతోషంగా ఉన్నాను” అని మిమ్మల్ని అనుభూతి చెందేలా చేస్తున్నది ఏది.

ఈ ప్రదేశంలో, ఈ కొత్త వాస్తవంలో ఇవ్వడం మరియు తీసుకోవడం యొక్క ప్రవాహాలను అనుభూతి చెందండి. మనం వర్తమానంలోకి తిరిగి వచ్చినప్పటికీ కూడా దీనిని పట్టుకుని ఉండండి.

భూమి పరివర్తన దశలో ఉంది. ఎంత ఎక్కువమంది అయితే వారి ఉత్తేజం ఏమిటని, వారు ఏమి తీసుకోవడానికి మరియు ఏమి ఇవ్వడానికి ఇక్కడ ఉన్నారనేది గుర్తిస్తారో, అంత త్వరగా కొత్తభూమి ఒక వాస్తవంగా రూపొందుతుంది. ఈ వాస్తవానికి మీరే జన్మనిస్తారు. దీని గురించి నేను మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను మరియు మీ ఉనికిలో నేను ఆనందాన్ని పొందుతున్నాను.

* * * *

# మరణం మరియు ఆవలివైపు

డియర్ ఫ్రెండ్స్, అత్యంత ప్రేమపూరితమైన కాంతి దేవతలారా, నేను మీకు నా అభినందనలను తెలుపుతున్నాను.

నేను జెషువాని, క్రీస్తుశక్తి యొక్క హృదయం నుంచి నా చేతులను చాపుతూ మిమ్మల్ని హత్తుకుంటున్నాను.

మీ అంతరంలోని ప్రేమపూరితమైన దైవానికి మీరు వాత్సల్యాన్ని పొందుతారనే విషయం తెలుసు. ప్రస్తుతం మీరు రక్తమాంసాలు కలిగిన శరీరంలో నివసిస్తున్నప్పటికీ కూడా ఏ విధమైన షరతులు లేకుండా ప్రేమించబడతారని కూడా తెలుసు. మీరు ఈ తాత్కాలికమైన ఇంటి యొక్క సరిహద్దులలో జీవిస్తున్నప్పటికీ కూడా, మీరు ఏ విధమైన షరతులు లేని ఈ దైవం లేదా ఇంటి యొక్క భాగమే. నిజానికి మీరు ఇంటిని వదలలేదు, మీరు ఇప్పటికీ మీ ఉనికిలో నిరంతరం వెలుగుతున్న శాశ్వతమైన కాంతిని గుర్తించడం లేదు. ఈ క్షణంలో ఆ కాంతితో బంధాన్ని ఏర్పరుచుకుంటూ, మీ పట్ల మీరు వాత్సల్యాన్ని చూపిస్తూ, మీరు ఎవరనేది తెలుసుకోండి. మీ అంతరంలో వెలుగుతున్న కాంతి చాలా అందమైనది మరియు స్వచ్ఛమైనది. మీరు దీనిని ఎందుకు సందేహిస్తున్నారు?

నేను ఈ రోజు 'మరణం' గురించి మాట్లాడుతున్నాను. మరణానికి సంబంధించి మీలో చాలా భయం ఉంది. వినాశనం యొక్క భయం, మరుపు యొక్క భయం, మరణంతో కలుపబడి ఉన్న అతిపెద్ద నల్లటి శూన్యంతో గ్రహించబడతారనే భయం. అందువలన చాలా తరచుగా మీరు భూ తలంలోని పరిస్థితులను గందరగోళంగా తయారు చేస్తుంటారు మరియు ఆ పరిస్థితులు ఉన్న స్థితి కన్నా పూర్తి వ్యతిరేకంగా వాటిని ప్రదర్శిస్తుంటారు. వాస్తవంలో మరణం అనేది ఒక విముక్తి, ఇంటికి చేరడం మరియు మీరు ఎవరనే దాని యొక్క జ్ఞాపకం.

మీరు మరణించినప్పుడు అతి సులభంగా మీ సహజస్థితికి తిరిగి చేరుతారు. మీ చైతన్యం, మీ నిజతత్వమైన కాంతి యొక్క వెలుగుతో కలుస్తుంది. భూ సంబంధిత భారాలన్నీ మీ భుజాల నుంచి తొలగింపబడతాయి. భౌతిక శరీరంలో నివసించడం అనేది మీకు పరిమితులను ఏర్పరుస్తుంది. నిజానికి మీకు మీరుగా ఈ పరిమితమైన స్థితిలోకి రావాలని ఎంపిక చేసుకున్నారు. ఎందుకంటే అప్పుడే మీరు ఈ స్థితి మీకు అందించే వాటిని అనుభవించే అవకాశం ఉంటుంది కాబట్టి. అయినప్పటికీ ఇది మీ

సహజమైన దైవత్వపు స్థితిని తిరిగి నెలకొల్ప గల ఆనందం యొక్క అనుభూతిగా ఉంటుంది. మీ అంతరంలోని దైవం స్వేచ్ఛగా ఉంటూ విహరించడాన్ని మరియు విశ్వానికి ఆకృతిని ఇస్తున్న ప్రపంచాలను స్వేచ్ఛగా పరిశోధించడాన్ని ఇష్టపడుతుంది. మీరు అన్వేషించడానికి మరియు అనుభవించడానికి చాలా ఉంది. మీరు భౌతికశరీరంలో జన్మించినప్పుడు, మీరు స్వల్పంగానో లేదా అధికంగానో ఈ దైవత్వపు స్వేచ్ఛతో మరియు హద్దులు లేని ఈ దివ్యత్వపు ఉనికితో బంధాన్ని కోల్పోతారు.

దయచేసి ఇప్పుడు నాతో కలవండి. మీరు ఈ ప్రస్తుత జన్మలోకి ప్రవేశించే ముందు సమయానికి తిరిగి మనం వెళదాం. మీరు మీ అంతర్ స్థాయిల్లో ఈ భూసంబంధిత జీవితాన్ని మొదలుపెట్టడానికి మిమ్మల్ని మీరు అనుమతించారు. ఇది జాగరుకతతో కూడిన ఎంపికయే. బహుశా మీరు దీనిని మర్చిపోయి ఉండవచ్చు మరియు మీరు నిజంగా ఇక్కడ ఉండాలని కోరుకున్నారా లేదా అనే దానిని మీరు సందేహించవచ్చు. మీరు దీనిని ఒకానొక సమయంలో 'అంగీకరించారు'. ఇది ఒక సాహసోపేతమైన ఎంపిక. మానవుడిగా ఉండడమనే సాహసం కోసం మీ దైవత్వపు స్వేచ్ఛను మరియు అపరిమితమైన భావనను తాత్కాలికంగా వదిలి వేయడం

అనేది ఒక గొప్ప ధైర్యవంతమైన చర్య. ఆ సాహసం ఒక ఒప్పందాన్ని పట్టుకుని ఉంది, ఇది అన్నింటిని అర్థవంతమైనవిగా తయారుచేస్తుంది. మీ ఆత్మ నుంచి ఉద్భవించిన 'అంగీకారాన్ని' అనుభూతి చెందండి. భూమికి ఆకర్షింపబడడాన్ని కూడా గుర్తు తెచ్చుకోండి. మీరు భూవాస్తవానికి ఎలా కలుపబడి ఉన్నారో అనుభూతి చెందండి, మరియు మీరు మీ తల్లి గర్భంలోని మూలకేంద్రంలోకి దిగి వచ్చిన క్షణాన్ని అనుభూతి చెందండి. మీరు భూమి చుట్టూ ఉన్న భారాన్ని, ఒక విధమైన మురికిని లేదా మందాన్ని గమనించవచ్చు.

భూమి మీద చాలా బాధలు ఉన్నాయి. భూమి యొక్క సామూహిక వాతావరణంలో భాగంగా బాధ, నష్టం, భయం, చెడు ఆలోచనలు ఉన్నాయి. కొత్తగా జన్మించిన ఆత్మగా మీరు వీటి ద్వారా పయనించారు. ఈ చీకటి ద్వారా మీ కాంతి తన మార్గాన్ని తాను కనుగొంది మరియు ఈ విధంగా చేయడం వలన, మీ అసలైన దైవత్వపు ఎరుక మీద తప్పించుకొన సాధ్యంకాని అజ్ఞానపు పొర యొక్క ప్రభావం పడింది. ఆ సంఘటన యొక్క బాధను, మరియు దాని వెనుకనున్న మీ సాహసాన్ని మరియు ధైర్యాన్ని అనుభూతి చెందండి. మీరే ఈ విధంగా నిర్దేశించుకున్నారు: "నేను ఇది చేయబోతున్నాను. మరొకసారి, నా సొంత కాంతిని కనుగొనడానికి, దానిని గుర్తించడానికి, దానిని తిరిగి అన్వేషించడానికి మరియు ఈ ప్రపంచంలో

కాంతి యొక్క అవసరం ఉన్న చోట దానిని ప్రసరింపజేయడానికి నాకు నేనుగా భూవాస్తవంలో నా మూలాన్ని నెలకొల్పబోతున్నాను అని."

అవును, ఇది అజ్ఞానంలోకి దూకడమే. మీరు ఎవరనే దానిని తాత్కాలికంగా మర్చిపోతారు. మీ అపరిమిత స్థితి గురించి జ్ఞాపకం లేకపోవడం అన్నది మానవుడిగా ఉండడానికి సంబంధించిన భాగమే. మీరు ఎక్కడ ఉన్నా కూడా, మీరు సురక్షితంగాను మరియు స్వేచ్ఛగాను ఉన్నారనే విషయాన్ని మర్చిపోతారు. మీ సహజమైన స్వేచ్ఛ మరియు భద్రత యొక్క భావనను తిరిగి పొందడానికే మీరు మానవుడిగా ఉన్నారు. మీ లక్ష్యంలో భాగంగా, "మీరు అన్వేషిస్తున్న వాటిని మీకు అందిస్తాయి" అని అనిపించిన సామర్థ్యాల పట్ల మీరు శ్రద్ధను వహించగలరు, కాని నిజానికి ఈ సామర్థ్యాలు మీకు బాహ్యంగా ఉన్న వాటిపై ఆధారపడేలా చేస్తాయి. మీరు బయట నుంచి వచ్చే నిర్ణయాలపై ఆధారపడవచ్చు, ఇవి మీరు ప్రేమించబడడానికి ఎలా ప్రవర్తించాలి అనే దానిని మీకు చెబుతుంటాయి. ఇంటి యొక్క ఈ అవాస్తవపు భ్రమలు, ఈ ప్రత్యామ్నాయాలు మిమ్మల్ని నిరాశకు మరియు బాధకు గురయ్యేలా చేస్తాయి. నిజానికి స్వర్గం నుంచి భూమికి దిగి వచ్చిన మీ ప్రయాణం చాలా కష్టంగా ఉంటుంది. మరణం మిమ్మల్ని శాశ్వతమైన ప్రేమ మరియు భద్రతల యొక్క తలానికి తిరిగి పంపిస్తుంది. మీరు మరణించిన తర్వాత, మీరు ఎల్లప్పుడూ కలిగిఉన్న దానికి ఆధీనమవుతారు. మీరు జాగురుకతతో చనిపోయినా లేదా మీరు మరణాన్ని అంగీకరిస్తూ దానికి ఆధీనమైనా, మరణించడం అనేది ఒక ఆనందకరమైన సంఘటనగా మారుతుంది.

మీరు మరణించినప్పుడు ఏం జరుగుతుంది? మీరు మరణించే ముందు, వేర్పాటు మరియు విడుదల యొక్క దశ ద్వారా పయనిస్తారు. ఈ దశలో మీరు భూమి మీద జీవితానికి మరియు మీరు ప్రేమించిన వారికి వీడ్కోలు పలుకుతారు. ఇది చాలా కష్టంగా ఉండవచ్చు. కాని, అదే సమయంలో మరణం మీరు ఎవరనే దానిని, మీ జన్మలో భూమి మీద నేర్చుకున్న మరియు సాధించిన వాటిని లోతుగా తెలుసుకునే అవకాశాన్ని కూడా అందిస్తుంది. మీరు ప్రేమించిన వారిని వదిలివేయడం వలన బాధను అనుభవించవచ్చు, ఈ బాధ, మిమ్మల్ని వారితో కలిపి ఉంచుతున్నది ఏమిటనే దాని పట్ల మీరు ముందెన్నడూ లేనంత స్పష్టతను పొందేలా చేస్తుంది. ఈ ప్రేమ యొక్క బంధం శాశ్వతమైనది. ఈ బంధం చాలా శక్తివంతమైనది, ఇది మరణం అనే వారధిని సులభంగా దాటిస్తుంది. ప్రేమ అనేది ఎల్లప్పుడూ కొత్త జీవితాన్ని సృష్టించే ఒక శాశ్వతమైన మూలం. మీరు ప్రేమించిన వారిని కోల్పోతున్నారని భయపడవద్దు. ఎందుకంటే వీరికి వీడ్కోలు చెప్పే సమయంలోనే అపరిమితమైన

ప్రేమ యొక్క బంధం మరింతగా బలపడుతూ మీకు కొత్త జీవితాన్ని ఇస్తుంది కాబట్టి. మీరు ప్రేమతో విడిపోయినట్లయితే, మీరు మళ్ళీ కలవడం తప్పక జరుగుతుంది. మీరు సులభంగా ఒకరినొకరు మళ్ళీ కలుసుకుంటారు, ఎందుకంటే దీనికి సన్నిహితమైన మరొక మార్గం ఎల్లప్పుడూ హృదయం యొక్క మార్గమే కాబట్టి.

మీరు ప్రేమించిన వారు చనిపోయినట్లయితే, వారు మీ హృదయానికి అతి సన్నిహితంగా ఉంటారనేది మీరు ఖచ్చితంగా నమ్మవచ్చు. వారి యొక్క ఉనికిని అనుభూతి చెందండి, వారు ఇక్కడ మన మధ్యలోనే ఉన్నారు, వారి యొక్క అభినందనలను మీకు తెలియజేస్తున్నారు. వారు గౌరవింపబడినట్టు మరియు స్వేచ్ఛను పొందినట్టు అనుభూతి చెందుతున్నారు. వీరు భూమి మీద ఉన్న మనుష్యులు కలిగిఉన్న సందేహాల నుంచి స్వేచ్ఛను పొందారు మరియు వీరు మీకు అన్ని వేళలా అందుబాటులో ఉండే ప్రేమను మరియు కరుణను మీతో పంచుకోవాలని కోరుకుంటారు.

మరణిస్తున్న వారికి సంబంధించిన బంధువులు కూడా, వీరు చనిపోయే ముందు దశలో బాధ మరియు పోగొట్టుకోవడమనే అనుభూతులను పొందుతారు. ప్రేమించిన వారు చనిపోవడం అనేది సహజంగా బాధకు గురిచేస్తుంది; ప్రేమించిన వారిని కోల్పోవడం మరియు వారు భౌతికంగా ఉండాలని కోరుకోవడం అనేది సహజం. వీరి యొక్క ఎడబాటు కొత్త డైమెన్షన్ యొక్క ద్వారాన్ని తెరుస్తున్నట్టుగా అనుభూతి చెందమని మేము మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాము, ఈ డైమెన్షన్‌లోని సంభాషణ చాలా స్వచ్ఛతను మరియు భూమి మీద సాధారణంగా ఉపయోగించే సంభాషణ కంటే చాలా స్పష్టంగాను ఉంటుంది. వీరు చనిపోయిన తర్వాత, మీ హృదయం నుంచి వారి హృదయంతో బంధాన్ని ఏర్పరుచుకుని ప్రత్యక్షంగా సంభాషించగలరు. ఈ పద్ధతిలో ఒకరితో ఒకరు సంభాషించుకున్నట్లయితే, మీ ఇద్దరి మధ్య ఉన్న అవగాహనా లోపాలు సులభంగా తొలగిపోతాయి. మీ సందేశం ఎల్లప్పుడూ వారికి అందుతుంది.

మీరు మరణించిన తర్వాత, భూమి మీద జీవిస్తున్న ప్రజలను ప్రత్యేకమైన ధోరణితో చూస్తారు. మీరు మరింత విశాలమైన మనస్తత్వంతోనూ, సున్నితంగానూ ఉంటారు మరియు మీ మేధాసంపత్తిని పెంచుకోవడం ద్వారా మిమ్మల్ని మీరు కనుగొంటారు. ఒకేసారి మీరు పూర్తి సమన్వయాన్ని పొందలేరు, ఎందుకంటే మీతో పాటు మనోభావాలను మరియు అనుభూతులను తీసుకువెళ్తారు మరియు మీరు వీటితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది కాబట్టి. మీరు భౌతిక జీవితాన్ని విడుదల

చేసిన తర్వాత, మీరు సంపూర్ణంగాను లేదా సర్వజ్ఞుడిగాను ఉండరు. నిజానికి ఇది ఏమి తప్పు కాదు. ఎందుకంటే ఆవలి వైపు మీరు అనుభవం పొందాల్సినవి మరియు కనుగొనాల్సినవి చాలా ఉన్నాయి! అయినప్పటికీ, మీలో చాలా మందికి ఒక కొత్తదృక్పధం ఉంటుంది. ఆది, అంతం లేని ఈ డైమెన్షన్ తెలుసుకొనదగినది. ఈ డైమెన్షన్, మిమ్మల్ని ఆక్రమించి ఉన్న మనోభావాలు మరియు అనుభూతుల పట్ల మరియు మీరు భూమి మీద నివసించినప్పుడు మీతో ప్రత్యక్షంగా జీవించిన మనుష్యుల పట్ల మీ దృష్టి క్రమక్రమంగా క్షీణించేలా చేస్తుంది.

మీరు మరణం యొక్క వారధిని దాటిన తర్వాత మీకు ఏం సంభవిస్తుంది? మీరు దు:ఖపు స్థితిని అంటే వీడ్కోలు దశను దాటిన తర్వాత, మీకు మరణం అతి సన్నిహితంగా రావడాన్ని అనుభూతి చెందుతారు. మీ చైతన్యం యొక్క దృష్టి ఇప్పుడు మార్పు చెందుతుంది. బాహ్య ప్రపంచాన్ని, మనుష్యులను, మీ శరీరాన్ని విడుదల చేస్తూ మీ లోతైన అంతరంలోకి ఇప్పుడు మరలుతారు. బాహ్య ప్రపంచం యొక్క మీ ఎరుక క్షీణిస్తుంది. మీ ఎరుక, మీరు ప్రారంభించబోయే అంతర్ ప్రయాణానికి సిద్ధమయ్యేందుకు మిమ్మల్ని అనుమతిస్తుంది. మీరు జాగరుకతతో మరణాన్ని అంగీకరించినట్లయితే, మీరు నిజంగా విడుదల అవ్వడానికి "సిద్ధమవుతున్న" అనుభూతిని పొందుతారు. మీరు ప్రేమించిన వారిని విడుదల చేసే క్షణం ఇదే, ఎందుకంటే మీ శక్తిని అంతా అంతరంలోకి మరలుస్తూ మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది కాబట్టి.

మరణం అనేది ఒక బాధాకరమైన ప్రక్రియగా ఉండవలసిన అవసరం లేదు. నిజానికి ఇక్కడ అత్యద్భుతమైన మరియు అతి ఉన్నతమైన ప్రక్రియ సంభవిస్తోంది. మరణం అనేది ఒక పవిత్రమైన సంఘటన, ఈ సంఘటనలో ఆత్మ తనతో తాను అతి సన్నిహితమైన పద్ధతిలో కలుస్తుంది. చివరిదశలో మరణించే వ్యక్తి భూమి యొక్క డైమెన్షన్‌తో విడిపోతున్నట్టు అనుభూతి చెందుతాడు: శరీరం, సువాసన, రంగులు మరియు ఇతర భౌతిక స్పర్శలను. వీరి యొక్క ఎరుకలోకి మరింత సమర్ధవంతమైన మరియు ఆకర్షణీయమైన తేజస్సు గల మరొక డైమెన్షన్ ప్రవేశిస్తుంది. భూమికి సంబంధించిన విషయాలన్నింటిని వదిలివేస్తూ దీనికి ఆధీనమవ్వడం అనేది ఏమాత్రం కష్టంగా ఉండదు. మీరు ప్రేమించిన వారి యొక్క ఉనికి కూడా ఇప్పుడు మిమ్మల్ని అక్కడకు వెళ్ళనివ్వకుండా ఆపలేదు. ఇంటి యొక్క శక్తి – దైవం, స్వర్గం లేదా మీరు దీనిని ఏ విధంగా పిలిచినా కూడా – అత్యంత కరుణను, వెచ్చదనాన్ని కలిగి ఉంటుంది. ఈ శక్తి, మీ యొక్క అలసిపోయిన మరియు శిధిలమైన శరీరాన్ని భూమికి

తిరిగి ఇవ్వడం మరియు దానిని విడుదల చేయడం అనేది చాలా సులభమని మీకు హామీ ఇస్తుంది.

మీరు ప్రశాంతతతో శరీరాన్ని విడుదల చేసినప్పుడు, మీ ఆత్మ మీ శరీరరం నుంచి ఒక సున్నితమైన ప్రవాహంలా బయటకు వస్తుంది. విశ్వశక్తులైన మేధాసంపత్తి మరియు ప్రేమ మీకు సహాయం చేస్తున్నట్లు అనుభూతి చెందుతారు. మీరు ఏ విధమైన ప్రతిఘటన లేకుండా చనిపోయినట్లయితే, మీ చుట్టూ ఉన్న పరిసరాలు వెచ్చదనంతోనూ మరియు ప్రేమ పూర్వకమైన శక్తితోనూ నింపబడి ఉంటాయి. మీరు మాటల్లో చెప్పలేని ఒక విధమైన ఉపశమనాన్ని అనుభవిస్తారు. మీరు స్వేచ్ఛను పొందుతారు మరియు ప్రతీది మీకు చాలా స్పష్టంగా ఉంటుంది. మీరు సర్వవ్యాపకమైన ప్రేమను ఒక ఊహలా కాకుండా స్పష్టమైన వాస్తవంగా గుర్తుతెచ్చుకుంటారు. భూమి మీద నివసించినప్పుడు ఈ విధమైన ప్రేమనే దైవంగా పిలిచారు, మరియు "ఈ దైవం మీ నుంచి ఏదో కోరుకుంటోందనే" అసహజమైన మానవ ఊహాలను ఈ దైవం పై మీరు మోపారు. ఈ దైవం కొన్ని ఆదేశాలను మీపై నియమించాడని మీకు మీరుగా భావించారు, ఈ ఆదేశాలు మీరు సులభంగా సాధించలేనివి. కాని ఇక్కడ ఈ డైమెన్షన్‌లో నిజానికి దైవం అంటే ఏమిటో మీరు జ్ఞాపకం తెచ్చుకోగలరు: మీలో ఆత్మ స్థిరంగా ఉండడం, మిమ్మల్ని ఉత్తేజపర్చడం, మీ ద్వారా సృష్టిని అనుభవించడం మరియు చివరిగా మీ భావప్రకటనలో తనను తాను తెలుసుకోవడం. మీ ద్వారా దైవం మనిషిగా తయారవ్వాలని కోరుకుంది. విశ్వం యొక్క పరిణామక్రమం యొక్క లక్ష్యం మీరే: దైవం మనిషిగా తయారవ్వడమే!

దైవమే సృష్టి యొక్క మూలం, మీరే దాని యొక్క సంతృప్తికరమైన నిర్వాహకులు. దైవం యొక్క కాంతికి మానవరూపాన్ని ఇచ్చిన మిమ్మల్ని, మానవుడిగా ఉండడాన్ని ఎవరూ నిర్ణయించరు. దీనికి బదులుగా మీరు గౌరవించబడతారు. 'దైవం క్షమించడు అనే ఊహ' మరొక అవాస్తవమైన భ్రమ. ఇది భయం ద్వారా ప్రోత్సహింపబడిన అవాస్తవం. మీరు ఏం చేసినా లేదా ఏం చెయ్యకున్నా, దైవం తనను తాను మీలో గుర్తిస్తాడు. మీరు ఆవలివైపుకి తిరిగి వచ్చిన తర్వాత మీరు మళ్ళీ దీని యొక్క ఎరుకను పొందుతారు మరియు వ్యక్తిగత-దూషణ యొక్క అనేక రకాల అభిప్రాయాలను మరియు అభద్రతాభావం యొక్క అనుభూతుల భారాన్ని మీ భుజాల నుంచి తొలగిస్తారు. మీరు జీవించడంలో ఉండే అసలైన ఆనందాన్ని, దైవం చేతిలో ఉండే భద్రతను మళ్ళీ అనుభూతి చెందుతారు.

మీరు ఇక్కడకి తిరిగి వచ్చిన వెంటనే, మీ చుట్టూ కాంతి జీవులు

ఉండడాన్ని గమనిస్తారు. మీకు సహాయం చేసే మార్గదర్శకులు మరియు మీ కన్నా ముందు చనిపోయిన మీకు తెలిసిన మనుష్యులు ఇక్కడ ఉండడాన్ని మీరు గుర్తిసారు. కొన్నిసార్లు మీరు వారి దగ్గరకి పరిగెత్తుకు వెళ్ళడం అనేది మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు: కొంతమంది మనుష్యులు మిమ్మల్ని చాలా తక్కువగా కలిసినప్పటికీ, వీరు మీ హృదయాన్ని చాలా లోతుగా స్పృశించి ఉండవచ్చు, కాని వీరు జీవితాంతం స్నేహితులుగాను మరియు బంధువులుగాను మీ ప్రక్కన ఉన్న అనుభూతిని పొందవచ్చు. మీలో ఎవరైన ప్రేమ ఆధారంగా బంధాన్ని కలిగి ఉంటే, వారు ఏదో ఒక సమయంలో మిమ్మల్ని పలకరించడానికి వస్తారు. వీడ్కోలు చెప్పడం అనేది ఒక భ్రమే అని, హృదయ బంధం శాశ్వతమని మీకు మరొకసారి చాలా స్పష్టంగా తెలుస్తుంది. మీరు ఈ అపరిమితమైన ప్రేమ మరియు మేధాశక్తి యొక్క తలంలోకి ప్రవేశించిన వెంటనే, కృతజ్ఞతాభావాన్ని మరియ గౌరవభావాన్ని అనుభవిస్తారు.

మీరు ఆవలి వైపుకు వచ్చిన తర్వాత ఒక విధమైన సర్దుబాటు దశ ఉంటుంది. ఈ దశలో మీరు కొత్త వాతావరణానికి అలవాటుపడుతూ మరియు భూమి జీవితంతో మీ బంధాన్ని నెమ్మదినెమ్మదిగా విడుదల చేస్తారు. మీరు దీనికి అలవాటుపడాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో నైపుణ్యం గల మార్గదర్శకులు మీకు సహాయం చేస్తారు. మీరు ఆవలి వైపు శరీరాన్ని కలిగి ఉన్నా కూడా, ఇది భౌతికశరీరం కన్నా మరింత తేలికగా ఉండడాన్ని మీరు అనుభూతి చెందుతారు. ఇది చాలావరకూ మీరు ఇంతకు ముందు వదిలివేసిన భౌతికశరీరంలానే కనిపిస్తుంది. మీరు కోరుకున్న ఆకృతిని తీసుకునే స్వేచ్ఛ మీకు ఉన్నప్పటికీ, చాలామంది ప్రజలు కొంతకాలం దీనిని కొనసాగించడానికి ఇష్టపడతారు. మీ సొంత జీవిత పరిస్థితులను సృష్టించుకోవడానికి కూడా మీకు ఇక్కడ స్వేచ్ఛ ఉంటుంది. ఉదాహరణకి మీరు భూమి మీద సహజమైన వాతావరణంలో ఇష్టపడిన ఒక అందమైన తోట గల ఇంటిని ఇక్కడ సులభంగా సృష్టించుకోగలరు. ఈ తలంలో భూసంబంధిత ఉత్తేజకర అనుభూతులకు అనువుగా జీవించడం అనేది సరైనదే. నేను ఇక్కడ చెబుతున్నది "ఆస్ట్రల్ తలాల గురించి." ఈ తలం లేదా డైమెన్షన్, భూమి యొక్క డైమన్షన్ పోలికను మరియు భూమికి అతి సన్నిహితంగా కలుపబడి ఉన్నప్పటికీ కూడా, ఈ తలం మరింత సృజనాత్మకమైన స్వేచ్ఛను అనుమతించేందుకు వీలుగా ఉంటుంది.

కొంతమంది మనుష్యులకు భూమి మీద మరణాన్ని అంగీకరించడం అనేది చాలా కష్టంగా ఉంటుంది మరియు ఆవలివైపుకు వీరి యొక్క ప్రయాణం తక్కువ ప్రశాంతతను కలిగి ఉండవచ్చు. కొత్త జీవితపు పరిస్థితులకు అలవాటు పడడానికి, వీరికి సాధారణంగా చాలా ఎక్కువ సమయం అవసరమవుతుంది. కొన్నిసార్లు వీరు

చనిపోయారనే విషయాన్ని నిజంగా తెలుసుకోవడానికి కొంత సమయం పట్టవచ్చు. కొంతమంది ప్రజలు దీర్ఘకాలిక రోగాలతో బాధపడతారు మరియు అనారోగ్యంగా ఉన్నాననే ఆలోచనను మర్చిపోవడానికి వీరికి చాలా కష్టతరమవుతుంది. వీరు తిరిగి ఆరోగ్యాన్ని పొందారనే విషయాన్ని పూర్తిగా నమ్మలేరు. వీరు పాత శరీరాన్ని విడుదల చేయడానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుల యొక్క ఓర్పు మరియు సున్నితమైన సహకారం వీరికి అవసరమవుతుంది. పాత శరీరం అనేది ఆత్మకి ఒక భావనగా, ఒక ఆలోచనా రూపంగా అతికించబడి ఉండగలదు. ఇదే పద్ధతి మనోభావపరమైన అలవాట్లకు మరియు ప్రవర్తనలకు వర్తిస్తుంది కూడా. ఆత్మ వీటిని విడుదల చేయడానికి మరియు కొత్తదనాన్ని స్వీకరించడానికి, అది తన సామర్థ్యాన్ని మరియు స్వేచ్ఛను తిరిగి కనిపెట్టేంత వరకూ కూడా, అవే చర్యలు మళ్ళీ మళ్ళీ ఆస్ట్రల్ తలాల్లో కూడా సంభవిస్తాయి.

మరొక అవకాశం ఏమిటంటే ఎవరైనా అకస్మాత్తుగాను లేదా యవ్వనంలోను చనిపోయినట్లయితే, వారి యొక్క ఆత్మ భూతలానికి మరియు ముఖ్యంగా ప్రేమించిన వారికి కలుపబడి ఉంటుంది. ఇది ప్రమాదాలు మరియు ప్రకృతి వైపరిత్యాలలో చనిపోయిన వారి విషయంలో సంభవించవచ్చు లేదా ఆ వ్యక్తి, జీవితం యొక్క మొదటి దశలో ఉన్నా సంభవించవచ్చు. ఇటువంటి పరిస్థితులలో ముఖ్యంగా ఆత్మ పైకి వెళ్ళడానికి సిద్ధంగా ఉండదు. ఈ విధంగా మరణించడం స్వల్పంగాను లేదా అధికంగాను బాధకరంగా ఉంటుంది. ఈ విధంగా గాయపడిన ఆత్మలకు ఎల్లప్పుడూ ఈ వైపు ప్రేమపూర్వకమైన సహకారం ఉంటుంది. త్వరలోనైనా లేదా ఆ తర్వాతనైనా ఆత్మ ఈ పరిస్థితిని అంగీకరిస్తూ అర్థం చేసుకునే స్థితికి చేరుతుంది. భూతలం నుంచి అకస్మాత్తుగా వదిలి వెళ్ళిపోవడానికి తరచూ ఒక ముఖ్యమైన కారణం ఉంటుంది. మరణించడం అనేది అకస్మాత్తుగా సంభవించేది ఎంతమాత్రం కాదు.

మీరు ఆవలివైపు ఉండే సమయాన్ని పొడిగించుకున్నట్లయితే, మీ ప్రజ్ఞాత్మ ఎరుకను లోతైన మరియు విశాలమైన స్థాయిలలో విస్తరింపజేస్తుంది. మీరు భూమి మీద ఉపయోగించిన ఆలోచనా పద్ధతులను మరియు అనుభూతులను మరింతగా విడుదల చేస్తారు. ముఖ్యంగా మీరు ఎవరనే దాని యొక్క మూలానికి, మీ ఆత్మ, మీ అంతరంలోని దివ్యత్వపు తేజస్సుకు మీరు తిరిగి క్రమక్రమంగా చేరుతారు. మీరు ఎంతగా అయితే ఈ చైతన్యపు స్థితిలోకి ప్రవేశిస్తారో లేదా తిరిగి వెళ్తారో, అంతగా మీరు భూసంబంధిత వ్యక్తిత్వం నుంచి మరియు భూమి యొక్క డైమెన్షన్ నుంచి మిమ్మల్ని మీరు విడుదల చేసుకోగలరు. భూమి మీద మీ జన్మ యొక్క పాత్రను అధిగమించే ఉనికి యొక్క ప్రవాహాన్ని అనుభూతి చెందగలరు. మీరు భూమి మీద

జీవించిన ఇతర జన్మలతోను, మీ ఆత్మ ఇతర తలాలలో ఎత్తిన జన్మలతోను బంధాన్ని ఏర్పర్చుకుంటారు. అవధులు లేని మీ ఆత్మ యొక్క తలానికి సంబంధించిన ఎరుకను పొందుతారు. మీరు విశ్వంలో చేసిన ప్రయాణం ద్వారా చాలా అనుభవాలను ప్రోగుచేసుకున్నారనే విషయాన్ని తెలుసుకుంటారు.

భూమి మీద మనుష్యులు మీకు ఇప్పుడు కలుపబడి ఉన్నట్లయితే, వారు వారికి సంబంధించిన ఒక వ్యక్తి మేధాసంపత్తిని మరియు ఆధ్యాత్మిక ప్రేమను పొందాడనే విషయాన్ని అనుభూతి చెందగలరు. నిజానికి మీ ఆత్మ యొక్క మూలానికి సన్నిహితమవుతూ దాని వైపుగా కదులుతున్నట్లయితే, మీరు ఆస్ట్రల్ తలాన్ని వదిలివేస్తూ, మీ మూల సారాంశం యొక్క తలంలోనికి ప్రవేశిస్తారు. నేను దీనినే అతి ముఖ్యమైన తలంగా పిలుస్తాను. చాలామంది చనిపోయిన తర్వాత ఎక్కువ సమయం ఆస్ట్రల్ తలాలలో ఉంటారు. భూమి మీద వీరి జీవితంలో పొందిన అనుభవాలన్నింటి యొక్క ప్రతిబింబాలను ఆస్ట్రల్ తలాలలో మళ్ళీ చూస్తారు. ఆస్ట్రల్ తలాలలో మీరు ఆనందం మరియు విచారాల రెండింటిని, మంచి మరియు చెడుల మనోభావాల రెండింటిని అనుభవించగలరు. మీ చుట్టూ ఉన్న పరిస్థితులు మీ అంతర్ మానసిక వాస్తవాన్ని అద్దం పడతాయి. మీరు కలిగిఉన్న మనోభావాలను అంగీకరించడానికి, మీరు వాటికి సంబంధించిన రూపాలను, ప్రదేశాలను మరియు సంఘటనలను అక్కడ ఏర్పరుచుకోగలరు. తరచూ మీరు మీ కలలలో ఆస్ట్రల్ తలాలను సందర్శిస్తారు, అందువలన ఈ ప్రదేశం యొక్క ఎరుక మీకు బాగా పరిచయం ఉన్నదే. మీ రహస్యమైన పురాణాలలో మరణం తర్వాత జీవితంలోని పొరలు లేదా ప్రదేశాల గురించి, లేదా స్వర్గ-నరకాల గురించి చెబుతున్నవన్నీ కూడా ఈ ఆస్ట్రల్ తలాలకు సంబంధించినవే.

ఆస్ట్రల్ తలాలలో భూమి మీద ఉన్న మీ ప్రస్తుత జన్మ నుంచి మోసుకు వచ్చిన మనోభావసంబంధిత భారం నుంచి మీకు అక్కర్లేని వాటిని తొలగిస్తారు. ఈ విషయంలో మీకు చాలామంది ప్రేమపూర్వకమైన మార్గదర్శకులు సహాయం చేస్తారు. ఒకానొక స్థితి దగ్గర మీ బంధాలను మరియు మనోభావసంబంధిత బాధలన్నింటిని విడుదల చేస్తూ ఆస్ట్రల్ తలాన్ని పూర్తిగా అధిగమించడానికి సిద్ధమవుతారు. అప్పుడు మీరు మూల సారాంశం యొక్క తలం వైపు పయనిస్తారు. ఇది సంభవించినప్పుడు మీకు ఇది రెండవ మరణంగా ఉంటుంది. మీకు సంబంధం లేని ప్రతీ విషయాన్ని మీ వెనుక వదిలివేస్తూ, మీ దివ్యత్వపు మూలంతోను, ప్రజ్ఞాత్మతోను ఐక్యమవ్వడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకుంటారు. మీరు అతి ముఖ్యమైన తలానికి చేరిన

వెంటనే, మిమ్మల్ని నడిపిస్తున్న అతిపెద్ద సామర్థ్యం యొక్క ఎరుకను పొందుతారు. దైవంతో మీ ఏకత్వాన్ని అనుభవిస్తారు.

మూలసారాంశం యొక్క తలం లేదా మీ శాశ్వతమైన తలం అనేవి దివ్యత్వపు చైతన్యానికి స్థానంగా ఉంటుంది. ఇక్కడ నుంచే సృష్టి అంతా ఆవిర్భవిస్తోంది. ఇప్పుడే ఒక క్షణం ఈ తలంతో బంధాన్ని ఏర్పరుచుకోమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఇది ఏ మాత్రం దూరంగా లేదు. ఇది అన్నింటిలోనూ, అంటే ఆస్ట్రల్ మరియు భూతలాల రెండింటిలోనూ వ్యాపించి ఉంటుంది. ఇది విశ్వ తలాలన్నింటికీ అతీతంగా ఉంటుంది. ఈ మూలసారాంశం యొక్క తలంలో, మీరు ఉండడాన్ని స్వచ్ఛమైన మరియు స్పష్టమైన దైవం యొక్క ఉనికిగా అనుభూతి చెందుతారు. మీరు ఈ తలాన్ని జీవం మరియు సృజనాత్మకతలతో నింపబడిన పూర్తి ప్రశాంతత గల ఒక లోతైన నిశ్శబ్ధంగాను అనుభూతి చెందవచ్చు. ఈ మూలం నుంచే సృష్టి అంతా ఆవిర్భవిస్తోంది మరియు ఈ మూలానికే సృష్టి అంతా తిరిగి చేరుతుంది.

మీరు మరణం తర్వాత జీవితంలో ఈ అతిముఖ్యమైన తలాన్ని చేరినప్పుడు, మీ భవిష్యత్తు గమ్యానికి సంబంధించిన ఎంపికలను జాగరుకతతో ఎంచుకోగలరు. ఈ తలంలో మీరు మీ లక్ష్యాల ఆధారంగానూ, టీచర్స్ మరియు మార్గదర్శకుల సహాయంతోనూ భూమి మీద మరొక జీవితానికి లేదా కొత్త ప్రయాణానికి ప్రణాళికను సిద్ధం చేసుకోవచ్చు. మీరు ఈ అతిముఖ్యమైన తలంలో మీ ఆత్మ యొక్క పిలుపును స్పష్టంగా వినగలరు. ఈ తలం నుంచే ఒకప్పుడు మీ జీవితానికి “అంగీకారాన్ని” తెలపడం వలనే ఇప్పుడు మిమ్మల్ని మీరు ఇక్కడ కనుగొన్నారు.

ఈ తలంలో ఉండడమనేది ఎలా ఉంటుందో ఒకసారి గుర్తు తెచ్చుకోండి. మీరు భూమి మీద జీవితంలోనే ఈ డైమెన్షన్ యొక్క ఎరుకను ఎక్కువగా పొందినట్లయితే, మీరు ప్రశాంతంగా మరణిస్తూ, ఆ తర్వాత చాలా సులభంగా ఆస్ట్రల్ తలాలను అధిగమిస్తూ ఈ మూలసారాంశం యొక్క తలాన్ని చేరగలరు.

మరణం అంటే మరేదో కాదు, కేవలం పరివర్తనమే. మీ జీవితంలో మీరు పయనించిన అనేక పరివర్తనాలలో ఇదీ ఒకటి. జన్మ అనేది ఒక పరివర్తనమే. భూమి మీద జీవితానికి చాలా పరివర్తనాల గురించి, వాటి ద్వారా పయనించడం మరియు విడుదల చేయడం గురించి కూడా తెలుసు. దీని గురించి ఒకసారి ఆలోచించండి. మీరు ఇప్పుడు జీవిస్తున్న శరీరం ఒకానొకప్పుడు చాలా చిన్నగాను,

నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక చిన్న శిశువుగాను ఉండేది. మీ ఆత్మ, మీ అంతరంలోని దివ్యత్వపు మూలసారాంశం, మీరు ఒక నిస్సహాయ స్థితిలో శిశువుగా ఉన్నప్పటి నుంచి కూడా మీ ద్వారా పని చేస్తున్నాయి. మీరు యవ్వనానికి చేరిన తర్వాత, మీ ద్వారా భూమి మీద ఏర్పడిన జీవితం యొక్క ఒత్తిడులచే మీరు సంగ్రహింప బడుతుండేవారు మరియు మీరు భయాలను మరియు సందేహాలను ఎదుర్కొనేవారు. దీని వలన మీ దివ్యత్వపు మూలం, మీ ఆత్మ యొక్క ఎరుక వెనుకకు నెట్టివేయబడ్డాయి. అయినప్పటికీ మీ జీవితంలో వచ్చిన కొన్ని సమయాలు, ఈ దివ్యత్వపు ఎరుక యొక్క డైమెన్షన్‌ని తిరిగి తెరుచుకునేలా చేసాయి. మీరు తరచూ వీడ్కోలు చెప్పాల్సి వచ్చిన సమయంలోనూ మరియు విడుదల చేయాల్సి వచ్చిన సమయంలోనూ ఇదే సంభవిస్తోంది.

ఉదాహరణకి: మీరు ప్రేమించిన వ్యక్తికి వీడ్కోలు చెప్పడం కావచ్చు, మీ ఉద్యోగాన్ని విడుదల చేయడం కావచ్చు; ఏ పరిస్థితైనా కావచ్చు. ఇటువంటి సంఘటనలు పరివర్తనాలుగా ఉంటూ, మరణాన్ని భౌతికస్థాయిలో కాకుండా, మానసికపరమైన స్థాయిలో మీకు గుర్తుచేస్తాయి. ఇవి మిమ్మల్ని లోతైన స్థాయిలో విడుదల చేయమని అడుగుతుంటాయి. మీరు వీటిని విడుదల చేయాల్సి వచ్చిన క్షణాలలో, మీరు మీ శాశ్వతమైన ఉనికిని మరియు అంతరంలో వెలుగుతున్న దివ్యత్వపు కాంతి యొక్క వాస్తవాన్ని అనుభూతి చెందడం మొదలుపెట్టగలరు. మీ చుట్టూ ఉన్న ప్రతీది ధ్వంసమై పోతున్నప్పటికీ కూడా ఈ వాస్తవం మీతో ఏమాత్రం షరతులు లేకుండా ఉంటుంది. భౌతికపరంగా మరణించడంలో కూడా ఇదే సంభవిస్తుంది. మీరు ధైర్యంగా ఆ క్షణంలో ముందుకు పయనించినట్లయితే, శాశ్వతమైన తలం మిమ్మల్ని హత్తుకుంటుంది మరియు నిజానికి మీరు ఎవరనే దాని యొక్క బలమైన ఎరుకను అనుభవిస్తారు.

జాగరుకతతో మరణానికి ఆధీనమవ్వడం అన్నది ఒక పవిత్రమైన సంఘటన. ఇది జీవంతోనూ మరియు సౌందర్యంతోనూ నింపబడి ఉంటుంది. వైభవోపేతంగా మరణాన్ని హత్తుకోవడం అనేది ఇతరులు గమనించే విధంగా ఉంటుంది. ఎవరైతే "ఈ విధమైన మరణాన్ని సజీవంగా ఉన్నప్పుడే" అనుభవిస్తారో, వారు గమనిస్తున్న ఈ మరణం యొక్క పరివర్తనాన్ని భయం మరియు గౌరవభావాలతో నింపుతారు.

సృష్టిలో మీకు అందుబాటులో ఉన్న అన్ని పరివర్తనలు, అంటే మీ జీవితంలోని భౌతిక జనన-మరణాల నుంచి తీవ్రమైన మనోభావాలతో విడిపోయే క్షణాల వరకూ ఉన్న పరివర్తనలలో, ఎల్లప్పుడూ ఉండే అతి ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే: కేవలం

మీ సొంత దివ్యత్వపు మూలంతో బంధాన్ని ఏర్పర్చుకోగలరా అనేదే కాని, మీరు నిర్జీవంగా బ్రతుకుతారా అని మాత్రం కాదు. మీరు మూలసారాంశం యొక్క తలంతోనూ, మీ మూలాలతోనూ, సృష్టి యొక్క హృదయ సవ్వడితోనూ బంధాన్ని ఏర్పరుచుకోగలరా? మీ జీవితంలో అత్యవసరమైన తలంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది మీ అంతట మీరు మరణానికి వైభవోపేతంగా సిద్ధమవ్వడానికి మరియు దాని తర్వాత ఉన్న దానిని తెలుసుకోవడానికి ఒకానొక గొప్ప మార్గంగా ఉంటుంది. మీరు ఎవరనే దాని యొక్క మూలం, మీ ప్రస్తుత భౌతిక శరీరంపై గాని, మీ ప్రపంచం సూచిస్తున్న గుర్తింపులపై గాని ఆధారపడడం లేదనే ఎరుకను మీరు మరణానికి ముందే పొందడం వలన, మరణం వచ్చినప్పుడు మీ అంతట మీరు శరీరం నుంచి సులభంగా విడుదలవుతారు.

అతిముఖ్యమైన తలంతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది మీరు ఎంచుకోవాల్సిన ఎంపికయే. మరణం దానంతట అది మిమ్మల్ని అతిముఖ్యమైన తలం దగ్గరకు చేర్చలేదు. మీరు మరణించిన తర్వాత కూడా, మీరు చాలా వరకూ ముందు ఉన్న మనిషిగానే ఉంటారు. అయినప్పటికీ కూడా మీకు భిన్నమైన అవకాశాలు మరియు విశాలమైన దృక్పథం బహుమతిగా అందజేయబడతాయి. ఒక క్లిష్టతరమైన ప్రశ్న ఏమిటంటే: మీరు ఎవరనే దానిని గుర్తుంచుకుంటారా? నిజానికి మీ ద్వారా ప్రవహిస్తున్న తలంతో మరియు మిమ్మల్ని ఉత్తేజపరుస్తూ సమయానికి అతీతంగా ఉన్న అతిముఖ్యమైన తలంతో మీరు బంధాన్ని జాగరుకతతో ఏర్పరుచుకోగలరా?

మీరు శాశ్వతమైనవారు, కాంతి యొక్క ప్రేమపూర్వకమైన దేవతలు. దీనిపై విశ్వాసాన్ని ఉంచండి. మీరు మరణించాల్సి వచ్చినప్పుడు ఈ జ్ఞానం ద్వారా సౌకర్యాన్ని మరియు సహకారాన్ని అందుకోవడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి. ఇప్పుడు మీ జీవితంలో అనుభవిస్తున్న కష్టాల విషయంలో కూడా ఈ విధంగానే ప్రోత్సాహాన్ని పొందవచ్చు.

ప్రశాంతంగా చనిపోవాలంటే, భూసంబంధిత ఉనికి యొక్క బంధాలన్నింటి నుంచి మీరు అంతర్ స్థాయిలో విముక్తిని పొందాలి. మీరు బ్రతికి ఉన్నప్పుడే ఈ విధమైన విముక్తిని నిరంతరం సాధన చేసినట్లయితే, మీరు వైభవోపేతంగా మరణించడానికి సిద్ధమవ్వగలరు.

జీవితం యొక్క మధ్యదశలో ఉన్నప్పుడు మీ అంతట మీరుగా జీవితం నుంచి విముక్తిని పొందడం అనేది విషాదకరంగా ఉండదా అని మీరు అడగవచ్చు.

ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటంటే: "కాదు. నిజానికి ఇది సమర్ధవంతమైన ప్రజ్ఞాత్మకి సాక్షిగా ఉంటుంది."

విముక్తి అంటే అర్థం ఏమిటి? దీని అర్థం మీరు అనవసరమైన విషయాలను పట్టుకోకుండా, మూలసారాంశం పై శ్రద్ధను వహించగలగడమే. దీని అర్థం మీరు అనవసరమైన మనోభావసంబంధిత నాటకాలను సృష్టించవద్దని; దీని అర్థం మీ జీవితంలోని సహజమైన విషయాలను ఆనందంగా అనుభవించమని. విముక్తిని సాధన చేయడం మరియు మూలసారాంశం యొక్క తలానికి శృతి చేయబడడం అంటే, మీకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న విషయాల క్రింద మరియు వెనుక దాగి ఉన్న డైమెన్షన్ యొక్క ఎరుకను పొందడమే. దీని అర్థం మీరు మంచి-చెడులుగా నిర్ణయించడాన్ని తిరస్కరిస్తూ మరియు మానవ మనసుని అధిగమించి ఉన్న విశ్వసంబంధిత మేధాశక్తిని నమ్మడమే అని.

మీలో చాలామంది ఆలోచించే అలవాటు యొక్క జ్వరంతో బాధపడుతున్నారు. మీరు జీవితాన్ని అతిగా పట్టించుకుంటున్నారు; సమస్యలను ఎలా పరిష్కరించాలి, మీరు తప్పుని సరిగా చేయాలని భావిస్తున్న విషయాలను ఎలా సాధించాలి. మీ ఇచ్ఛా మరియు మీ మనసు ద్వారా జీవితాన్ని క్రమబద్ధంగా నడిపించాలనే ఉద్దేశానికి స్థిరమైనారు. విముక్తి అంటే మీ ఆలోచనారీతి యొక్క ఈ లక్షణాన్ని అంతగా పట్టించుకోకుండా ఉండడమే. ఇలా చేయడం అనేది విషాదకరమైన విషయమా? కాదు, నిజానికి ఇది మీ జీవితానికి తేలికతనాన్ని మరియు తాజాదనాన్ని అందిస్తుంది.

అధికంగా అదుపు చేయాలనే మీ కాంక్ష వలనే మీ జీవితం ఘర్షణకి, అలసటకు మరియు భారానికి లోనవుతున్నది. విముక్తి అనేది మనసుకి ప్రశాంతతను, ఆహ్లాదాన్ని మరియు సరైన ఆలోచనారీతిని అందిస్తుంది. జీవితానికి సంబంధించిన అపరిమిత-తత్వం యొక్క ఎరుకను పొందడం వలన జీవితాన్ని ఆహ్లాదించాలనే సహజమైన కోరిక ఉత్తేజింపబడుతుంది. మీ అతిముఖ్యమైన తలానికి సంబంధించిన మీ దివ్యత్వపు మూలం అన్నది, మీ ద్వారా ఆ తలం నుంచి ఈ భూ వాస్తవానికి సులభంగా ప్రవహించగలదు. ఇది సంభవించినట్లయితే, మీరు చనిపోయే ముందే మరణాన్ని అన్ని వైపుల నుంచి ప్రేమతో హత్తుకోగలరు.

* * * *

## తెలియని ప్రదేశాలకు భయమే ఒక దిక్సూచి

డియర్ ఫ్రెండ్స్,

నేను మేరీని, జెషువా తల్లిని. నేను మిమ్మల్ని చేరడానికి మరియు క్రీస్తుశక్తి యొక్క ఆడతత్వాన్ని మీకు అందించడానికే ఇక్కడ ఉన్నాను. ప్రస్తుతం మీలో చాలామంది దీనినే తీవ్రంగా కోరుకుంటున్నారు. మీరు ఒక లోతైన పరివర్తనా ప్రక్రియ ద్వారా పయనిస్తున్నారు.

ప్రస్తుతం భూమి మీద లైట్‌వర్కర్స్ యొక్క అతిపెద్ద సమూహం ఉంది. వీరు పాక్షికంగా మేల్కొన్నారు మరియు వీరు ఎవరనే దానిని పాక్షికంగా గుర్తు తెచ్చుకున్నారు. లైట్‌వర్కర్స్‌ను మూడు సమూహాలుగా విభజించి చెప్పవచ్చు, లేదా లైట్‌వర్కర్స్ పరివర్తన ప్రక్రియలోని మూడు దశల్లో ఎక్కడ ఉన్నారనేది వారిని వారు కనుగొనవచ్చు.

లైట్‌వర్కర్స్ యొక్క మొదటి సమూహం ఇంకా మేల్కొనలేదు. వీరు ఎవరనే దాని యొక్క అవగాహనను వీరు పొందలేదు మరియు దీనివలన వీరు అధికంగా పోగొట్టుకున్న భావనను మరియు ఒంటరితనాన్ని అనుభూతి చెందుతున్నారు. వీరు భిన్నమైనవారిగాను మరియు మానవ సమాజానికి సరిపడనట్టుగాను భావిస్తున్నారు. సమాజం పయనిస్తున్న దారి నుంచి విడదీయబడిన భావనను మరియు ఒంటరితనాన్ని అనుభూతి చెందుతున్నారు. ఈ లైట్‌వర్కర్స్ చాలా కష్టపడుతున్నారు మరియు వీరు ఓడిపోతున్నట్టుగా భావిస్తున్నారు. వీరు అతి సున్నితత్వంతో ఉంటారు, మీ అందరిలాగానే వీరు కూడా కలలుకనే స్వభావంతో ఉంటారు: వేరొక ప్రపంచం యొక్క కలను కంటూ, దానిని వారి యొక్క ఆత్మ లోతుల నుంచి గుర్తు తెచ్చుకుంటారు, కాని ఆ కలను నిత్యజీవితపు వాస్తవంతో కలపలేక పోతున్నారు. అందువలన వీరు ప్రపంచాన్ని వదిలివేస్తూ వీరి యొక్క అంతర్ ప్రపంచంలో జీవిస్తారు.

వీరి కాంతి బాహ్యంగా ప్రసరించక పోవడం వలన అసంతృప్తికి మరియు నిరాశకు గురవుతారు.

రెండవ సమూహానికి సంబంధించిన లైట్‌వర్కర్స్, వీరు ఎవరనే దానిని గుర్తు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. వీరు నెమ్మది నెమ్మదిగా వీరి యొక్క నిజమైన శక్తిని, మరియు భూమి మీదకు కాంతిని తీసుకురావడం కోసం మానవశరీరంలో జన్మించిన నిజమైన ఏంజెల్స్ అని గుర్తు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కాంతి యొక్క అవసరం చాలా ఉంది. మీరు భూమికి పరిమితం కాదని, అనంతమైన విశ్వానికి సంబంధించిన ఆత్మ అని మీరు అవగాహన పొందిన వెంటనే బలాన్ని పొందుతారు. ఇప్పటికీ మీరు ప్రత్యేకంగాను మరియు బయటవారిగాను అనుభూతి చెందవచ్చు. కాని ఇప్పుడు మీరు మరొక ప్రపంచానికి, అంటే సౌందర్యం మరియు సమన్వయం యొక్క ప్రపంచానికి కలుపబడుతున్నట్లు అనుభూతి చెందవచ్చు. ఇదే మీ ఇల్లు, నిజానికి మీరు వచ్చిన ప్రపంచం ఇదే. మీరు దీనిని తెలుసుకున్నట్లయితే, మీరు ఒంటరివారనే అనుభూతిని పొందవలసిన అవసరం లేదు. ఈ రోజు మేము మీకు ఇంటి యొక్క శక్తిని గుర్తు చేయాలని అనుకుంటున్నాం.

ఈ ఛానెలింగ్‌లో ప్రత్యక్షంగా ఉన్నవారు, ఈ ఛానెలింగ్‌ని వింటున్న వారు కూడా మేల్కొన్న లైట్‌వర్కర్స్ యొక్క సమూహంలో భాగమే. ఈ లైట్‌వర్కర్స్ వీరి యొక్క నిజతత్వంతోను మరయు వీరి యొక్క ఆత్మతోను ఎప్పటినుంచో బంధాన్ని కలిగి ఉన్నారు. వీరు ఇక్కడ ఉండడానికి గల కారణం వీరికి తెలుసు, భూమి మీద అభ్యుదయాన్ని తీసుకురావడం కోసమే ఇక్కడ ఉన్నారని వీరికి తెలుసు. భూమి మీదకి కాంతిని తీసుకురావాలనే మీ ఉద్దేశ్యాన్ని, మీ వాంఛను మేము అభినందిస్తున్నాం. మీరు తీసుకువచ్చే ఒక విధమైన శక్తికి హానికరంగా అనిపిస్తున్న వాస్తవం యొక్క మధ్యలో మీతో మీరు నిజాయితీగా ఉండడమన్నది ఎంత కష్టమైన విషయమో మాకు తెలుసు.

మూడవ సమూహం యొక్క లైట్‌వర్కర్స్. మేము వీరిని సీనియర్ (అనుభవజ్ఞానం గల) లైట్‌వర్కర్స్‌గా పిలుస్తాం. వీరు చాలా కాలంగా మేల్కొల్పు ప్రక్రియలో ఉన్నారు. ఈ లైట్‌వర్కర్స్ కొన్ని సంవత్సరాలుగా, కొన్ని దశాబ్ధాలుగా వీరి మీద వీరు పని చేస్తున్నారు. వీరు అంతర్ పరివర్తన యొక్క వివిధ రకాల దశల ద్వారా పయనించారు. అంతర్ స్థాయిలో మార్పుచెందడం, లోతుగా–పాతుకుపోయిన మనోభావపరమైన భారాలు మరియు చెడునమ్మకాల యొక్క ఎరుకను పొందడం అనేది ఎలా ఉంటుందో వీరికి తెలుసు. పాత గుర్తింపును వదిలివేసి కొత్తదనాన్ని స్వీకరించడం మరియు వీరి యొక్క నిజతత్వానికి సన్నిహితంగా ఉండడం అన్నది ఎలా ఉంటుందనే విషయాన్ని వీరు అనుభవించారు. ఈ సందేశాన్ని వింటున్న లేదా చదువుతున్న మీలో చాలామంది ఈ మూడవ లైట్‌వర్కర్స్ సమూహంలో భాగమే. మీ అంతరంలో మీరు ప్రాచీనమైనవారుగా అనుభూతి చెందుతున్నారు. మీరు ఈ జన్మలోనూ మరియు గతజన్మల్లోనూ చాలా అనుభవాల ద్వారా పయనించారు. మీ ధైర్యాన్ని మరియు గంభీరమైన మేధాసంపత్తిని మేము అమితంగా గౌరవిస్తున్నాం. మీరు పాతదనాన్ని మరియు అలసటను అనుభూతి చెందినప్పటికీ కూడా, మీరే భూమి యొక్క విలువైన సంపద. మేము ముఖ్యంగా మాట్లాడుతున్నది మీ గురించే.

మీ జీవితంలో ఎక్కువగా మీరు మనోభావస్థాయిలో పయనించారు. మీరు భయాన్ని మరియు కష్టమైన ఇతర మనోభావాలను – మీ చైతన్యం యొక్క పై భాగంలోకి రావడానికి మరియు వాటి కళ్ళలోకి చూస్తూ వాటిని విడుదల చేయడానికి అనుమతించారు. మీ మార్గంలో ఆధ్యాత్మిక అనుభవాలను పొందారు. దీని ఫలితంగా పొందే ఆనందం యొక్క అనుభూతుల్లో మీరు మూలచైతన్యం యొక్క ఏకత్వంలోకి విలీనమయ్యేవారు. మీలో చాలామంది ఇతరుల యొక్క ఆధ్యాత్మిక మార్గానికి టీచర్‌గా మరియు హీలర్‌గా ఉండడం యొక్క మీ జీవిత

లక్ష్యాన్ని ఎప్పటి నుంచో చేయడం ఆరంభించారు. మీరు ఒక ఆత్మగా చేయాలనుకున్న కాంతి పనిని మీ నిత్యజీవితంలో సాధన చేస్తున్నారు.

నేను ఈ రోజు లైట్‌వర్కర్స్ యొక్క మూడవ సమూహానికి సంబంధించిన మీ గురించి మాట్లాడబోతున్నాను మరియు మీరు రెండవ సమూహంలో కూడా ఉన్నారని కూడా చెప్పబోతున్నాను. ఈ రెండు సమూహాల మధ్య ఎటువంటి ఖచ్చితమైన బేధం లేదు; ఒకదాని నుంచి మరొకటి క్రమక్రమంగా అభివృద్ధి చెందుతాయి. మీరు ఏ సమూహం యొక్క భాగం అనే దాని గురించి ఎక్కువగా ఆలోచించవలసిన అవసరం లేదు; మేము ఇక్కడ గ్రేడ్స్‌ని ఇవ్వడం లేదు. ఇక్కడ అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ అంతర్ ఎదుగుదల యొక్క ప్రక్రియలో హృదయం మరియు ఆత్మకు కట్టుబడి ఉన్న వారిగా మిమ్మల్ని మీరు గుర్తించడమే. కొన్నిసార్లు ఈ జాగరుకత ప్రక్రియ మీ అందరికి ఎందుకు కష్టంగా అనిపిస్తోందో, నేను ఇప్పుడు మీకు వివరించి చెబుతాను.

ఆధ్యాత్మిక ఎదుగుదల లేదా పరిణామక్రమం ఎల్లప్పుడూ ఒకే దిశలో పయనించదనే విషయాన్ని మీరు గమనిస్తారు. ఇది మీరు ఒక్కొక్క మెట్టు అధిరోహించే విధంగా కూడా ఉండదు. ఎదుగుదల మరియు పరిణామక్రమం అనేవి వృత్తాకార వలయాలలో సంభవిస్తాయి. ఉదాహరణకి పగలు మరియు రాత్రి యొక్క చక్రంగా చెప్పవచ్చు. మీరు రాత్రి వేళలో మీ యొక్క అచేతనావస్థలో మునిగిపోతారు. అచేతనావస్థకు సంబంధించిన చీకటి తనను తాను కలల రూపంలో ప్రదర్శించుకుంటుంది. ఈ కలలు మిమ్మల్ని సాధారణస్థితి నుంచి మరియు మీకు తెలిసిన వాటి నుంచి బయటకు తీసుకువస్తాయి. అందువలన ఇది లోతైన అంతరంలోకి వెళ్ళడానికి మరియు జాగృతావస్థలో సులభంగా కనిపించని అంతర్ అనుభూతులను మరియు మనోభావాలను కనుగొనడానికి మీకు అవకాశాన్ని అందిస్తుంది. మీరు భూవాస్తవంలో పాల్గొంటున్న అనుభవాలను పగటి సమయంలో ప్రోగుచేస్తారు. రాత్రి,

మీ అంతరంలోకి వెళ్ళేందుకు మరియు మీరు పగటివేళలో ఎరుక పొందలేకపోయిన మనోభావసంబంధిత శక్తులను ఎదుర్కొనేందుకు మీకు సహాయం చేస్తుంది.

మనసు కన్నా లోతైన స్థాయిలలో ఉన్న అనుభవాలను కలుపుకోవడానికి, మీకు పగలు మరియు రాత్రి యొక్క చక్రం అవకాశాన్ని అందిస్తుంది. మీకు మీ కలల యొక్క జ్ఞాపకం లేకపోయినప్పటికీ కూడా, ఈ పరివర్తన చక్రం వలన ఎదుగుదల సంభవిస్తున్నది. నిరంతరం జరిగే ఈ వృత్తాకార వలయాలలో ఎదుగుదల సంభవిస్తోంది మరియు ఇదే ఆధ్యాత్మిక ఎదుగుదల విషయంలో కూడా జరుగుతోంది. నేను ఇప్పుడు మాట్లాడుతున్న వారికి – అంతరంలోకి వెళ్ళడం, పాత మనోభావ సంబంధిత బాధను మరియు భయాన్ని గుర్తిస్తూ దానిని ఎలా విడుదల చేయాలనేది తెలుసు. పాత బాధలో మునిగిపోవడం మరియు దానిని విడుదల చేయడంలో ఉండే ఆనందం ఎలా ఉంటాయో మీకు తెలుసు. ఆ తర్వాత మీరు మరింత స్వేచ్ఛను మరియు బలాన్ని అనుభూతి చెందుతారని కూడా మీకు తెలుసు. నేను ఇప్పుడు మాట్లాడుతున్న వారు అనుభవజ్ఞానం ఉన్నవారు; మీరు చాలా అభివృద్ధి చెందినప్పటికీ కూడా మీకు వెలుగు తర్వాత చీకటి వస్తోంది. ఎందుకంటే, ఎరుక లేని చైతన్యపు స్థితి యొక్క కొత్త పొరలు గమనించబడాలని, గుర్తించబడాలని మరియు విడుదల చేయబడాలని కోరుకుంటున్నాయి. ఈ సమయంలో, మీలో చాలామంది 'చీకటిరాత్రి' యొక్క మధ్యలో ఉన్నారు. ఈ చీకటిరాత్రి, భయం యొక్క లోతైన పొరను పైకి రమ్మని ఆదేశిస్తోంది. ఈ పొర 'పగటివెలుతురులో' గమనించబడాలని కోరుకుంటోంది. మీ కాంతి ఈ ప్రపంచం మీద మరింత తేజోవంతంగాను మరియు ప్రశాంతంగాను ప్రకాశించడానికి ఈ పొర విడుదలవ్వాలని కోరుకుంటోంది.

మీ వయస్సు, లింగబేధం మరియు ఆత్మ ఒప్పందాల ఆధారంగా, మీ జీవితంలో మీరు సొంత అభివృద్ధి యొక్క వ్యక్తిగత చక్రం ద్వారా ప్రభావితం చేయబడుతున్నారు. మీరు విశాలమైన శక్తి ప్రవాహాల ద్వారా కూడా ప్రభావితం చేయబడుతున్నారు. ఈ ప్రవాహాలు, భూమి మరియు మానవులు కలిసి సంపూర్ణంగా పాల్గొని ఉన్న ప్రక్రియలతో పని చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ శక్తి ప్రవాహాలే పని చేస్తూ, పాతదనాన్ని మరియు చీకటి శక్తులను పైకి వచ్చేలా చేస్తున్నాయి. మీరు ఈ ప్రక్రియను విశ్వసించకపోతే, ఇదంతా మీకు కఠినంగా అనిపించవచ్చు. చాలామందికి లోతైన మనోభావసంబంధిత బాధతోనూ మరియు దాని ఫలితంగా వచ్చే విధ్వంసపు శక్తితోనూ ఎలా వ్యవహరించాలో తెలియదు. మీరు దీనిలో ప్రావీణ్యులు. అయినప్పటికీ ఇది మిమ్మల్ని ప్రభావితం చేయవచ్చు. మీకు ఎలా వ్యవహరించాలో తెలియనటువంటి మీ యొక్క లోతైన పొరలలో మీరు మునిగిపోవచ్చు. మీరు పిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు అనిపించవచ్చు. మీ జీవితంలో మీరు ఎదుర్కోవాలనుకున్న సంఘటనలన్నింటిని మీరు ముందే పరిష్కరించినట్టుగా మీకు అనిపించవచ్చు, కాని ఇప్పుడు మీరు ఊహించని భయం లేదా చీకటి యొక్క మరొక పొర మీ తలుపును గట్టిగా కొడుతున్నది. దీని వలన మీరు కోపానికి గురికావచ్చు, మీరు సరిపడినంత అభివృద్ధి చెందినట్టు మరియు మీరు సులభమైన జీవితవిధానం వైపు పయనించడానికి సిద్ధంగా ఉన్నట్టు అనుభూతి చెందవచ్చు. అందువలన ఈ కొత్త తరహా చీకటితో వ్యవహరించడం చాలా కష్టంగా అనిపించవచ్చు.

మీ హృదయాన్ని మరియు మీ ప్రయాణంపై విశ్వాసాన్ని కోల్పోవద్దని చెప్పడానికే నేను ఈ రోజు ఇక్కడకు వచ్చాను. మీరు ఇప్పుడు అభివృద్ధి యొక్క దశలోకి ప్రవేశిస్తున్నారు. ఈ దశలో మీరు మీ ఎదుగుదలను ఏమాత్రం అదుపు చేయలేరు. మీరు ప్రవేశిస్తున్న చైతన్యపు విస్తరణ యొక్క ప్రదేశం ఆధీనం మరియు విడుదలకు

సంబంధించినదే. ఇది కొన్ని అభ్యాసాలను లేదా ఊహా చిత్రాలను అనుసరించడం గురించి కాదు, అంటే ఒక విధమైన ఆహారపు అలవాటును అనుసరించడం లేదా జీవితాన్ని అదుపు చేయడం కోసం ఉపయోగించే క్రమశిక్షణను పాటించడం గురించి ఎంతమాత్రం కాదు. ఇప్పుడు మీ ద్వారా ప్రవహించాలని కోరుకుంటున్న అతిపెద్ద శక్తి తరంగాన్ని అదుపు చేయడం అసాధ్యం.

మీ ఆత్మ ఈ శక్తి ప్రవాహానికి తగినట్టుగా మిమ్మల్ని శృతి చేయాలని కోరుకుంటోంది. ఎందుకంటే ఇది సరైన ప్రవాహమనే ఎరుక మీ ఆత్మకు ఉంది కాబట్టి. ఈ ప్రవాహం ఎటువైపు ప్రవహిస్తోందనే విషయాన్ని మాత్రం మీ మానవ వ్యక్తిత్వం గమనించలేదు. ఆత్మ ప్రవాహం ఎటువైపు తీసుకువెళ్తోందో మీ మనసుకి అర్థం కాదు. అందువలన మీరు నిరాశకు లోనవుతూ మీ ఇంగితజ్ఞానం, మీ ఆశయం మరియు అంతర్ ప్రవాహాలతో బంధాన్ని కోల్పోతారు. మీరు ఈ విధంగా అనుభూతి చెందుతున్నట్లయితే, దయచేసి తెలుసుకోండి మీరేమి తప్పు చేయడం లేదని. మీరు కొత్తదనంలోకి ప్రవేశించే ముందు ఎల్లప్పుడూ అలజడి మరియు ఆందోళన యొక్క భావనలు ఉంటాయి. నిజానికి కొత్త ఆరంభాలు ఎల్లప్పుడూ గందరగోళం మరియు ప్రమాదకర పరిస్థితుల ద్వారా నడుపబడుతుంటాయి. పాతదనం శిథిలమయ్యేంత వరకూ కొత్తదనం ప్రవేశించదు. మీరు చాలా విషయాలను విడుదల చేశానని భావించవచ్చు, కాని ఇప్పుడు మీరు మరింత ఎక్కువగా విడుదల చేయండి. దయచేసి ఇది ఒక అర్థవంతమైన ప్రక్రియ అనే ఎరుకను పొందండి, కాని మీకు అలా అనిపించక పోవచ్చు. విశ్వాసం మరియు ఆధీనం యొక్క ప్రదేశంలో ఉండడానికి ప్రయత్నించండి. ఎందుకంటే మీరు ఈ విధంగానే మీ ఆత్మ ప్రవాహంతో మిమ్మల్ని మీరు కలుపుకోగలరు మరియు మీకోసం మీరు ఈ ప్రయాణాన్ని మరింత సులభం చేసుకోగలరు.

మీరే గురువులు. మీరు చీకటిలో ఉన్నట్టు భావిస్తున్నప్పటికీ, మీరు నిరుత్సాహానికి మరియు నిరాశకు లోనవుతున్నప్పటికీ, మీరు ఎక్కడకు వెళ్తున్నారనే జాడ మీకు తెలియక పోయినప్పటికీ కూడా, ప్రస్తుతం మీరే భూమి మీదకు కొత్త శక్తిని తీసుకువస్తున్నారు. మీరు ఏ కాంతి పని కోసమైతే వచ్చారో ఆ పనినే చేస్తున్నారు. కాంతి పని అంటే, మీకు ఏం జరుగుతుందో తెలియని మీ ఆత్మ యొక్క చీకటి మూలల్లోకి మీరు రాత్రి ప్రయాణించడమే అని అర్థం. మీరు ఎటువంటి మార్గదర్శకాలు లేకుండా చీకటి ద్వారా ప్రయాణిస్తారు. మీరు చీకటిలోకి విసిరివేయబడ్డారు మరియు నిజానికి మీరు చేయగలిగినది ఏమిటంటే అనుభవానికి ఆధీనమవుతూ, చీకటి ద్వారా పయనించగలరని మరియు దీనికి ఒక అర్థం ఉందని విశ్వసించడమే.

మీరు చీకటి నుంచి బయటకు వస్తూ మరియు మళ్ళీ వెలుతురులోకి తిరిగి వచ్చిన వెంటనే, మీరు మీ ప్రయాణం యొక్క అర్థాన్ని మనసుతో కాకుండా మీ హృదయంతో తెలుసుకుంటారు. ఎల్లప్పుడూ చీకటి మీ కోసం ఒక విలువైన సంపదను పట్టుకుని ఉంటుంది. చీకటి మనోభావాలు అనేవి మీలో తిరిగి ఐక్యం కావాలనుకుంటున్న మీ యొక్క రహస్యపు భాగాలు. మీరు మీ అంతరంలో ఎదుర్కొంటున్న చెడు అనేది మీ శక్తి యొక్క భాగమే, కాని ఇది చాలా కాలంగా ప్రవహించకుండా నిలిచిపోయిన శక్తి. మీరు ఒక ఆత్మగా భూమి మీద, అదే విధంగా విశ్వంలోని ఇతర ప్రదేశాలలోనూ చాలా చాలా జన్మలను ఎత్తారనే విషయాన్ని దయచేసి అర్థం చేసుకోండి. ఇప్పుడు భూమి మీద మీ జీవిత కాలచక్రం ముగింపుకు దగ్గరలో ఉంది, మీ ఆత్మ యొక్క అతి బాధాకరమైన భాగాలు చాలా జన్మలలో ఇరుక్కుపోయి ఉన్నాయి. అవి ఇప్పుడు విడుదల మరియు విముక్తి కోసం ప్రస్తుత శకంలో మీ దగ్గరకు వస్తున్నాయి. మనోభావసంబంధిత గాయాలన్నీ ఎక్కడ నుంచి వస్తున్నాయనేది మీరు తెలుసుకోలేరు. కాని

చివరికి ఇదంతా ఒకే విషయం గురించి, అంటే భయం మీ ద్వారా గుర్తింపబడాలని కోరుకోవడం గురించే. భయం తన కళ్ళలోకి చూడాలని కోరుకుంటోంది మరియు ఇది స్వాగతింపబడాలని కోరుకుంటోంది. నిజానికి ఇది మీ యొక్క విలువైన భాగం. విశ్వంలో ఒక మూలన ఉన్న ఈ భూమి మీద మీరు ఆడుతున్న ద్వంద్వాల యొక్క ఆటలో భాగంగా ఈ భయం ఉన్నది.

మీరు దీనిని అలాగే ఉండడానికి అనుమతించినప్పుడు, మీ సొంత భయానికి భయపడకుండా ఉన్నప్పుడు, మీరు దీనిని కీడు చేయనిదిగా చూస్తారు. ఈ విషయం చెప్పడానికి వింతగా అనిపించవచ్చు, ఎందుకంటే భయం మిమ్మల్ని చాలా లోతుల్లోకి పాతుకుపోయేలా చేయవచ్చు కాబట్టి. కాని భయం ప్రమాదకరమైనది కాదు. ఇది ఒక శిశువులా అమాయకమైనది. భయం కేవలం తెలియని దానికి ప్రతిస్పందిస్తుంది. శిశువు తనకు తెలియని దానిని ఏదైనా ఎదుర్కొంటున్నట్లయితే, అది భయంతో స్పందిస్తుంది: ఇది కొత్తదనానికి అలవాటు పడాలి. ఇది కొత్తదనాన్ని అన్వేషిస్తూ దానితో సౌకర్యవంతంగా ఉంటూ మరియు దానిని విశ్వసించడం నేర్చుకోవాలి. నిజానికి భయం అమాయకమైనది. మీకు తెలియని దానితో మీరు ప్రత్యక్షంగా ఇంటిలో ఉన్న అనుభూతిని పొందలేరనేది అర్థం చేసుకోదగిన విషయం. భయంలో ఎటువంటి తప్పు లేదు. మీరు ఈ భయాన్ని నిర్ణయించినా, మీరు భయంతో అసౌకర్యాన్ని అనుభూతి చెందుతూ దానిని తిరస్కరించినా, ఇది అతిపెద్ద చీకటి విషయంగాను, మిమ్మల్ని భయపెట్టే ఒక భూతంగాను మరియు ఇది మిమ్మల్ని మీ ఇచ్ఛకు వ్యతిరేకంగాను తయారుచేస్తుంది. భయాన్ని మీ శత్రువుగా తయారు చేయవద్దు. ఎందుకంటే, మీరు దానిని చీకటిగా మరియు తెలియని శక్తిగా తయారుచేస్తారు కాబట్టి. భయం యొక్క అసలైన రూపం చీకటి కాదు. ఇది కేవలం కొత్తదనానికి అలవాటుపడడంలో ఏర్పడే మనోభావపరమైన ప్రతిస్పందన యొక్క అనుభూతి మాత్రమే.

డియర్ ఫ్రెండ్స్, మీరు ధైర్యవంతులు. మీ లోతైన మూలం నుంచి, మీరు ఒక ప్రజ్ఞాత్మగాను, ప్రకాశించే కాంతిగాను మరియు అనంతమైన ప్రేమకు ప్రతినిధిగాను ఉంటూ మీ అంతరంలోని భయం దగ్గరకి చేరగలగాలి. మీరు మీ భయం కన్నా ఉన్నతమైనవారు మరియు శక్తివంతులు. మీరు శిశువుని ఎలా దగ్గరకు తీస్తారో అదే విధంగా దీనిని చేరదీయగలరు మరియు "నేను నీతో సురక్షితంగా ఉన్నానని" మీరు భయానికి చెప్పండి. మీరు దానికి భయపడవద్దు. మీ సొంత భయానికి మీరు భయపడవద్దు. దీనిని వదిలివేయడానికి ప్రయత్నించవద్దు, ఎందుకంటే భయాన్ని తొలగించాలనే ఉద్దేశ్యంలో ఒక నిర్ణయం దాగి ఉంటుంది కాబట్టి. మీరు మీ యొక్క భయపూరిత భాగంతో యుద్ధం చేసినట్లయితే, అది మరింత భయపూరితంగా తయారవుతుంది. ఎందుకంటే ఈ భాగం మంచి దాన్ని కాదని మరియు అర్హత లేని దాన్ని అని సందేశాన్ని పొందుతుంది కాబట్టి.

దయచేసి అర్థం చేసుకోండి, భయం అనేది విశ్వంలో ఒక అవసరమైన లక్షణం. ఇది లేకపోతే, కొత్తదనాన్ని అన్వేషించడం మరియు అనుభవించడం సాధ్యం కాదు. మీరు దేనినైతే సురక్షితంగాను మరియు మీకు పరిచయమున్నదిగాను అనుభూతి చెందుతున్న వాటికి, మరియు మీకు తెలియని వాటికి మధ్య హద్దును భయం సూచిస్తుంది. ఈ హద్దుకు అతీతంగా, మీకు ఇంకా తెలియని లేదా మీరు ఇంకా అనుభవించని ఏదో కొత్తదనం ఉంటుంది. మీరు భయాన్ని ఈ రకంగా చూసినట్లయితే, దీని పట్ల మీకు ఉన్న నిర్ణయాన్ని విడుదల చేస్తారు మరియు ఇది ఆనందం యొక్క సామర్థ్యాన్ని కూడా పట్టుకుని ఉంటుంది. ఎందుకంటే భయం, మీ కాంతిని ప్రకాశింపజేసే కొత్త ప్రదేశాన్ని కనుగొంటానని మీకు వాగ్దానం చేసింది కాబట్టి. అందువలన భయాన్ని నమ్మండి, దీనిని మీ కాంతిగా ఉండనివ్వండి! మీ జీవితంలో భయాన్ని కలిగించే ఏదైనా సంఘటన ఏర్పడినట్లయితే, కేవలం దానిని గుర్తించండి చాలు.

మీ చైతన్యం యొక్క కాంతిని మీ భయం మీద ప్రకాశింపజేయండి. భయం వెనువెంటనే కరిగిపోదు, కాని మీరు దానిని భయపెట్టే శక్తిగా చూడకుండా ఉన్నట్లయితే, మీరు మరింత విశ్రాంతిని పొందుతారు. దీని వలన మీరు భయంలో దాగి ఉన్న విలువైన సంపదను మీకోసం అందుకునే అవకాశాన్ని పొందుతారు.

మీకు తెలుసా, భయం ఎల్లప్పుడూ ఉంటుంది. ఇది సృష్టిలో భాగం. మీరు ఉన్నతంగా పరిణామం చెందినప్పటికీ కూడా, మీకు తెలియనిది మరియు మీరు అన్వేషించాల్సిన అంశం ఎల్లప్పుడూ ఏదో ఒకటి ఉంటుంది. ఈ విధంగా జరగక పోయినట్లయితే, విశ్వం స్థంబించిపోతుంది మరియు తన శక్తిని మరియు సజీవత్వాన్ని కోల్పోతుంది. ఇది ఒక అందమైన ప్రేమపూర్వకమైన ప్రదేశంలో జీవించడంలా ఉంటుంది, మీరు నిజానికి ఈ ప్రదేశాన్ని ఆనందించగలరు మరియు దీనికి స్పందించగలరు. కాని ఈ అన్వేషణ యొక్క హద్దులను దాటి బయటకు వెళ్ళలేరు మరియు దీనికి అతీతంగా చేరలేరు. మీరు కొత్త ప్రదేశాలను ఎప్పటికీ కనుగొనలేరు. ఇది మీ సుదీర్ఘ ప్రయాణంలో మీకు లోతైన సంతృప్తిని అందివ్వగలదా? మీరు కొత్తదనాన్ని అన్వేషించడం యొక్క వాంఛను ప్రేమిస్తున్నారనే విషయాన్ని మీ అంతట మీరుగా గుర్తిస్తారని కూడా నాకు తెలుసు. మీరందరూ సాహసోపేతమైన ఆత్మలు. అందువలన దయచేసి మీ భయాన్ని విమర్శించవద్దు. ఎందుకంటే చివరికి ఇది మీ యొక్క సాహసోతపేతమైన మరియు అన్వేషణకు సంబంధించిన భాగమే కనుక. భయం మీకు కనుగొనాల్సిన కొత్త ప్రదేశం ఎక్కడ ఉ ందో చూపిస్తుంది. ఒకసారి మీరు భయం యొక్క చేతులు పట్టుకుని ఈ కొత్త ప్రదేశానికి ప్రయాణించినట్లయితే, మీ ప్రస్తుత అవగాహనకు మించిన అద్భుతాన్ని మరియు ఆనందాన్ని అనుభవిస్తారు. ఇక్కడ రహస్యమేమిటంటే: మీరు కనుగొనేదేమిటో మీకు ఎప్పటికి ముందుగా తెలియదు, అలా కాకపోతే ఇది మీకు కొత్తగా ఉండదు కాబట్టి.

మీరు భయం యొక్క వాస్తవాన్ని మరియు తెలియని దాని యొక్క వాస్తవాన్ని అంగీకరించినప్పుడే, కొత్త ప్రదేశంలోకి ప్రవేశించడం యొక్క ఆహ్లాదకరమైన అనుభవం అన్నది సరికొత్తదనాన్ని మరియు లోతైన అనుభవాలతో కూడిన ప్రేమ, సౌందర్యం మరియు ఆనందాలను కలిగి ఉంటుంది. ఇది మీ యొక్క ప్రస్తుత జ్ఞానం మరియు అనుభవం యొక్క అంచులను దాటి ఉంటుంది. భయం అకారణంగా కనిపించినప్పటికీ మరియు మీకు కారణం తెలియకపోయినప్పటికీ కూడా అంతరంలో భయాన్ని ఆహ్వానించండి. మీ లోపల ఉన్న భయం ఎక్కువగా మీ యొక్క ప్రాచీనమైన భాగాల నుంచి మరియు మీ గతజన్మల నుంచి వస్తోంది. ఈ భాగాలు మీరు ఇంకా కనుగొనని ఏదో కొత్త అవగాహనల యొక్క వాగ్దానాన్ని పట్టుకుని ఉన్నాయి. ఇవన్నీ కూడా మీరు క్రూరంగా తిరస్కరింపబడిన అనుభవానికి సంబంధించినవై ఉండవచ్చు, అంటే మీరు భయపడిన మరియు అనుభూతి చెందకూడదని కోరుకున్న భాగాలకు సంబంధించినవి కావచ్చు. మీరు వీటిని అనుభవించడానికి భయపడకుండా ఉన్నట్లయితే, మీరు బలవంతంగా తిరస్కరింపబడడం ఎలా ఉంటుందో అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించినట్లయితే, మనోభావాన్ని పైకి రావడానికి అంగీకరించినట్లయితే, మీ పట్ల మీరు కరుణను అనుభూతి చెందుతారు.

ఈ విషయాలు ఎందుకని కష్టంగా ఉన్నాయనేది కూడా మీరు అర్థం చేసుకుంటారు. దీని గురించి మిమ్మల్ని మీరు క్షమించుకోగలరు. మీ పట్ల మీరు ఏ మాత్రం కఠినమైన నిర్ణయాలు తీసుకోరు. వ్యక్తిగత-క్షమాపణ యొక్క అనుభవమే మిమ్మల్ని ఎన్‌లైటెన్ చేస్తుంది. అందువలన బాహ్యంగా మీకు చెడుగా అనిపిస్తున్న అనుభవాన్ని కౌగిలించుకోవడానికి మిమ్మల్ని మీరు అనుమతించినట్లయితే, మీరు విశ్వాసంతోను మరియు ఏ విధమైన నిర్ణయం లేకుండా ఈ అనుభవం ద్వారా పయనించినట్లయితే, అప్పుడు ఈ అనుభవమే మిమ్మల్ని మరింత

ఆనందంగాను, మరింత జ్ఞానవంతంగాను తయారు చేయవచ్చు. ఇది, వ్యక్తిగత-అంగీకారం ద్వారా మీరు విముక్తిని మరియు విశ్రాంతిని రుచి చూడడానికి అవకాశాన్ని అందించవచ్చు. ఈ విధంగానే విశ్వం మరియు అనుభవం కొత్తదనంలోకి పరిణామం చెందుతున్నాయి.

మీరు మీ జీవితంలో భయాన్ని అనుభవిస్తున్నట్లయితే, దీనికి వేరొక వైపు ఉన్న ప్రేమ, సౌందర్యం మరియు ఆనందాలను అనుభవించడానికి సంబంధించిన అతిగొప్ప సామర్థ్యం ఉంటుందని తెలుసుకోండి. ఇది ఎంతో దూరంలో లేదు. నేను సూచించినట్టుగా ప్రతీ అడుగులోనూ కొద్దికొద్దిగా భయాన్ని విడుదల చేయడానికి ఇది ఒక క్రమబద్ధీకరమైన ఆధ్యాత్మిక ఎదుగుదల ప్రక్రియ మాత్రం కాదు. ప్రతీ అడుగులో ఉన్న భయాన్ని పూర్తిగా విడుదల చేయనట్లయితే, భయం యొక్క పరిమాణం పెరుగుతూ పెరుగుతూ చివరికి ఇది మీ జీవితాన్ని అతి తీవ్రమైన ప్రమాదకరస్థితికి చేరుస్తుంది మరియు ఇకపై మీరు మీ నిత్యజీవితంలో ఏమాత్రం వ్యవహరించలేనట్టుగా అనుభూతి చెందుతారు. ఈ స్థితిలో తలెత్తిన మీ భయంతో ప్రత్యక్షంగా ఎదుర్కోవాల్సి వస్తుంది; మీరు ఎక్కువ కాలం ఈ భయాన్ని అణచివేయలేరు లేదా మీరు దీనికి పరిష్కారాన్ని కనుగొనలేరు. ఇది మీ ద్వారా ప్రవహిస్తూ మీరు అదుపును కోల్పోయేలా చేస్తుంది. ఈ స్థితిలో మీరు ఓడిపోయినట్టుగా మీకు అనిపించవచ్చు. ఆనకట్ట తెగిపోతుంది మరియు మీరు ఏ మాత్రం నీటిని బయటకు రాకుండా ఆపలేరు. ఇది ఒక విధ్వంసంగా అనిపించవచ్చు, నిజానికి ఇది ఒక విధ్వంసం కాదు!

మిమ్మల్ని శాశ్వతంగా అణచివేసిన మరియు ఖైదు చేసిన 'ద్వారాలను' భయం పగలుగొట్టాలని అనుకుంటోంది. భయం మీ ద్వారా ప్రవహించాలని కోరుకుంటోంది, మరియు మీరు దీనితో ప్రవహించినట్లయితే, ప్రస్తుతం మీరు జీవిస్తున్న దాని కన్నా మరింత

ఎక్కువ విముక్తిని కలిపించే మరొక వాస్తవాన్ని ఇది మీకు అందిస్తుంది. మీ భయాన్ని మీరు అదుపు చేయలేనట్లు అనుభూతి చెందుతున్నా, దీనికి ఎటువంటి అర్థం లేనట్లు అనిపించినా, మీకు అభినందనలు! మీరు ఎక్కడ ఉండాలని కోరుకున్నారో అక్కడే ఉన్నారు. మీరు ప్రస్తుతం కొత్తదనం యొక్క ప్రవేశ ద్వారం దగ్గర ఉన్నారు మరియు మీరు విజయావకాశానికి అతి సన్నిహితంగా ఉన్నారు.

భయాన్ని అలాగే ఉండనివ్వండి, దీనిని అలాగే ఉండనివ్వండి, దయచేసి దీనితో పోరాడవద్దు. దయచేసి ఆలోచించవద్దు: "నేను ఏం తప్పు చేశాను? నా ఆధ్యాత్మిక మార్గంలో చేసిన ప్రతీది వ్యర్థమేనా? నేను ఎందుకని పూర్తిగా కోల్పోయిన భావనను మరియు నేను తప్పు చేసిన అనుభూతిని పొందుతున్నాను?" ఇదంతా మనసు యొక్క సంభాషణ. మనసుతో గ్రహించలేని విషయానికి అర్థాన్ని ఇవ్వాలని మీ మనసు ప్రయత్నిస్తోంది. మీ ఆత్మకు తెలుసు నిజానికి అది ఏం చేస్తోందో. మీ ఆత్మ లోతైన స్థాయిలో ఉన్న బాధను విడుదల చేయాలని కోరుకుంటోంది. మీరు మీ ఆత్మను విశ్వసిస్తూ మరియు దీనిని అదుపు చేయడానికి ప్రయత్నించకుండా ఉన్నప్పుడే ఇది జరుగుతుంది. మీ ఆత్మతో మీరు ఎంతగా అయితే అనుసంధానం అవుతారో, అంతగా మీరు జీవితాన్ని స్వేచ్ఛతో నింపగలరు, అంటే జీవితం పట్ల అదుపుని తక్కువ కలిగిఉంటారు అని. ఇది మీకు తెలుసా? ఇదే ఒక విముక్తిలా ఉంటుంది అని! విడుదల అనేది కొత్తదనాన్ని తీసుకువస్తుంది మరియు ఇది అందమైన మరియు స్వచ్ఛమైన శక్తితో కూడిన మీలోని స్వేచ్ఛా జీవిని మీకు అందిస్తుంది. ప్రస్తుతం భూమి మీద జన్మించాలని కోరుకుంటున్న మీ యొక్క ఉన్నతమైన రూపానికి "భయం" అనేది ప్రవేశద్వారంగా ఉంటుంది.

మీ అంతర్ ప్రక్రియ మిమ్మల్ని చీకటిలోకి నడిపిస్తున్నా, దీనికి సంబంధించిన అన్ని తర్కాలు అదృశ్యమై పోయినట్టుగా అనిపిస్తున్నా

కూడా, మీ ప్రక్రియపట్ల గౌరవాన్ని కలిగి ఉండమని నేను మిమ్మల్ని కోరుతున్నాను. మీ ప్రస్తుత మన:స్థితి ద్వారా అర్ధం చేసుకోలేని అవకాశాన్ని అందుకోవడానికి మీరు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండండి. దీనిని మీరు అర్ధం చేసుకోవలసిన అవసరం లేదు మరియు దీని యొక్క అర్ధం మీకు తర్వాత తెలియజేయ బడుతుంది. మీ ఆత్మ యొక్క ఉన్నతమైన వాస్తవాన్ని అందుకోవడానికి సిద్ధంగా ఉండండి. మీరు నిజంగా కావాలని కోరుకుంటున్న చైతన్యం యొక్క అన్వేషకుడిగా ఉండండి!

మార్పు మరియు గందరగోళానికి సంబంధించిన ఈ సమయంలో మీరు భూమి మీద ఉండడమనే సాహసాన్ని కౌగిలించుకున్నందుకు మేము మిమ్మల్ని అభినందిస్తున్నాం. మీరు ధైర్యవంతులు; మీరు నిరాశను మరియు ఒంటరితనాన్ని అనుభూతి చెందుతున్నప్పటికీ కూడా మీ జీవితాన్ని మీరు ప్రేమిస్తున్నారు. జీవితం పట్ల మీకు ప్రేమ లేకపోయినట్లయితే, ప్రస్తుతం మీరు ఇక్కడ ఉండేవారే కాదు.

మేము మీకు అతి సన్నిహితులం. నేను క్రీస్తుచైతన్యం యొక్క మాతృత్వపు శక్తికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాను. ఈ శక్తి మిమ్మల్ని హత్తుకున్నట్టు అనుభూతి చెందండి. మీరు ఈ శక్తిని సున్నితమైన ప్రకాశం గల లేత ఎరుపు రంగుగాను, ఆహ్లాదకరమైన భద్రతా శక్తిగాను, మృదువైన మరియు సున్నితమైన స్పర్శగాను అనుభూతి చెందవచ్చు. మీ శక్తి తలంలోకి దీనిని అనుమతించండి మరియు ఇది మీకు హీలింగ్‌ను అందించగలదు. హీలింగ్ అంటే నా ఉద్దేశ్యం "మీ భయాన్ని తొలగించడం ఎంత మాత్రం కాదు". ఈ భయాన్ని అంగీకరించమని, దీనిని మరింత ప్రేమపూర్వకమైన మరియు తేలికైన మరొక వాస్తవానికి మార్గదర్శకుడిగా అంగీకరించమనే నా ఉద్దేశ్యం.

మీ సహజస్థితిలో మీతో మీరు ఉండండి. మిమ్మల్ని మీరు మార్చుకోవాలని ప్రయత్నించవద్దు. మీరు ముందే సంపూర్ణంగా ఉన్నారు.

మీరు ప్రేమస్వరూపులు. మేము మిమ్మల్ని చూస్తున్నాం, మరియు మీ కష్టాలను గుర్తిస్తున్నాం. మీ పట్ల మేము మరింత గౌరవాన్ని కలిగిఉన్నాం. మీకు ఉపశమనాన్ని అందించడానికి దయచేసి నా శక్తిని అనుమతించండి. ఎకూడా మీ అంతరంలోని దేనిని మార్చాలని అనుకోవడం లేదు. మిమ్మల్ని మీరు ఒక కొత్త తరహాలో చూడమని నేను మిమ్మల్ని కోరుతున్నాను. మీరు కష్టాల మధ్యలో ఉన్నప్పటికీ, మీరు ఒక దైవమే. మీరు అందంగా ఉన్నారు.

మీరు గుర్తుంచుకోండి, ప్రతీ  రాత్రి తర్వాత ఒక కొత్తరోజు వస్తుందని. సూర్యుడు మళ్ళీ ప్రకాశిస్తాడు. దీనిని ఊహించవచ్చు. జీవితం తన సహజమైన పద్ధతిలో ముందుకు కొనసాగుతుంది. మీరు ఎలా అయితే రాత్రిని లేదా చీకటిని పతనం కాకుండా ఆపలేరో, అలాగే వెలుతురు లేదా పగలు కూడా రాకుండా ఆపలేరు. అందువలన ఈ కదలికలో ప్రయాణించడానికి మిమ్మల్ని మీరు అనుమతించండి మరియు అద్భుతమైన ఒక కొత్త ఉదయంలో మిమ్మల్ని మీరు కనుగొంటారు.

మీరు ఈ అంతర్ ప్రయాణం యొక్క బాధ్యతను తీసుకోవడం ద్వారా, స్వేచ్ఛ వైపు తమ సొంత మార్గాన్ని కనుగొనాలని ప్రయత్నిస్తున్న చాలామంది మనుష్యులకి మీరు సహాయం చేసినవారు అవుతారు. మీరు మేల్కొల్పు యొక్క మొదటిదశల్లో ఉన్న ఇతర లైట్‌వర్కర్స్‌కు మార్గాన్ని ఏర్పరుస్తున్నారు. దీనికి బదులుగా వీరు అతిసున్నితంగా తయారవుతున్న మనుష్యులకు మరియు ఆత్మ యొక్క వాస్తవానికి తగినట్టుగా తెరవబడాలని కోరుకుంటున్న మనుష్యులకు సహాయం చేస్తారు.

ప్రస్తుతం మీరు భూమి మీద చేస్తున్న మీ పనికి, మీ కాంతి పనికి మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము, మేము వేరే వైపు నుంచి వచ్చి మిమ్మల్ని కలుస్తున్నాం, దయచేసి మా ప్రేమను అంగీకరించండి. మీరు ఎవనేది గుర్తుజేయడం మాకు గొప్ప ఆనందాన్ని ఇస్తుంది.

# కొత్తశకంలో టీచర్‌గా ఉండడం

డియర్ ఫ్రెండ్స్,

నేను జెషువాని, నేను రెండు వేల సంవత్సరాల క్రితం క్రీస్తు చైతన్యానికి ప్రతినిధిగా వ్యవహరించాను మరియు ఇప్పుడు ఆ కాంతి యొక్క కాగడాకు మీరే ప్రతినిధులుగా ఉన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం మార్పు అవసరమైన ప్రదేశాలలో ఈ కాంతి యొక్క కాగడా మార్పును తీసుకువస్తుంది. మీరు సందిగ్ధస్థితి లేదా క్లిష్టమైన పరిస్థితుల యొక్క యుగంలో జీవిస్తున్నారు. ప్రస్తుతం ఆర్థికపరమైన సందిగ్ధస్థితులు సంభవిస్తున్నాయి మరియు వీటితో పాటు గ్రహాలు మరియు వాతావరణం యొక్క సందిగ్ధస్థితులు కూడా సంభవిస్తున్నాయి. మీరు సందిగ్ధస్థితి యొక్క మధ్యలో జీవిస్నున్నారు, ఇది మీకు మార్పు యొక్క అవకాశంగా కూడా ఉంటుంది. పరిస్థితులు ఎల్లప్పుడూ ప్రాథమికమైన మార్గంలో మార్పు చెందుతున్నట్లయితే, ముఖ్యంగా పాత విషయాలన్నీ ఆకస్మిక పతనానికి లోనవ్వాల్సిన అవసరం ఉంది.

మీలో ఎవరైతే నా సందేశాలకు ఆకర్షింపబడతారో వారు ఇతరులకు మార్గదర్శకత్వాన్ని చూపిస్తారు. అవును, మీరు ఈ ఆశయం కోసమే ఈ సమయంలో జన్మించారు; మీరు మార్పును తీసుకురావాలని మరియు మానవులకు అవసరమైన మార్పుకు ప్రతిరూపంగా మీరు ఉండాలని కోరుకున్నారు. మీరే కొత్తశకం యొక్క టీచర్స్. నేను మీకు ప్రోత్సాహాన్ని అందించే ఒక ఆసక్తికరమైన సందేశాన్ని మీ కోసం తీసుకువచ్చాను. మీరు మీ టీచర్ యొక్క పాత్రను స్వీకరించేలా నేను మిమ్మల్ని ప్రోత్సహించాలనుకున్నాను. చాలా జన్మలలో, మీరు ఈ సమయం కోసమే భూమి మీద గడిపారు. ఎందుకంటే ఇప్పుడు గ్రహం మరియు మానవులు, భూమి మీద నివసిస్తున్న మరియు శ్వాసిస్తున్న అన్నింటిలో ఉన్న ఏకత్వాన్ని గుర్తిస్తూ హృదయాధారిత చైతన్యం వైపు పరిణామక్రమం మరియు పరివర్తనం కోసమే సిద్ధమవుతున్నారు కాబట్టి. మీరు చాలా శతాబ్ధాలుగా ఈ ఏకత్వపు భావనకు వాహకులుగా ఉన్నారు, ఇంతకు ముందు కూడా మీరు భూమి మీద లైట్‌వర్కర్స్‌గా ఉన్నారు, మరియు ఇప్పుడున్న సమయం మీదే. బయటకు కనపడుతున్న చీకటి మరియు చెడు వార్తల వెనుక ఉన్న దానిని చూడండి. వీటన్నింటి వెనకాల ఏముందో చూడండి. ఇదే మార్పుకు గొప్ప అవకాశం.

మానవులను లోతైన అంతరంలోకి వెళ్ళమని మరియు సందిగ్ధ సమయాలలో లేదా కష్టమైన పరిస్థితులలో పైకి వచ్చే చెడు మనోభావాలను మరియు భయాలను గుర్తించమని అడుగుతున్నాం. ముందెన్నడూ లేనంతగా మానవులకి ఇప్పుడు హీలింగ్ అవసరముంది మరియు వీరు కూడా హీలింగ్‌ని అందుకోవడానికి సిద్ధంగా

ఉన్నారు. మీరే ఈ మార్గాన్ని నడిపిస్తున్నారు. మీరే కొత్తశకం యొక్క టీచర్స్ మరియు దయచేసి మిమ్మల్ని మీరు సంకోచించవద్దని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఇంతకు ముందు మీరు భూమి మీద కలిగిఉన్న అనుభవాలన్నింటి వలన, "మీరు ఎవరనే దానిని" మరియు మీరు అంతరంలో మోస్తున్న కాంతిని సంకోచిస్తూ వదిలి వేస్తున్నారు. మీ హృదయం మరియు మీ ఆత్మలో ఒక ఆశయం ఉంది. మీరు ప్రకాశిస్తున్న కాంతిగా ఉండాలని కోరుకున్నారు, కాని మీరు మీ సొంత సామర్థ్యానికి కనపడకుండా దాక్కుంటున్నారు. ఎందుకంటే ఈ సామర్థ్యం వలన మీరు తిరస్కరింపబడుతూ, హింసింపబడిన మరియు చంపబడిన వాటి యొక్క పాత జ్ఞాపకాలను మీ అంతరంలో మోస్తున్నారు కనుక. నేను మీ భయాలను మరియు మీ అభద్రతా భావాన్ని చూడగలను, కాని మిమ్మల్ని మీరు విశ్వసించినప్పుడే, మీరు ఉన్నతంగాను మరియు సమర్ధవంతంగాను ఉండగలరు. మీరు చాలా దూరం ప్రయాణించారు, చాలాసార్లు మీరు భూమిని సందర్శిస్తూ అనుభవాలను పొందారు. ఇప్పుడు మీరు పరిపక్వత కలిగిన ఒక ప్రాచీనమైన ఆత్మ. మీరు మీ హృదయం యొక్క మేధాసంపత్తిని పంచుకోవాలని అనుకుంటున్నారు. నేను మిమ్మల్ని మీ అంతరంలోకి చూడమని మరియు భూమి మీద మార్పును తీసుకురావాలనే మీ జన్మ యొక్క ఆశయాన్ని అనుభూతి చెందమని కోరుతున్నాను. ఇకపై ఏ విషయాన్ని దాచిపెట్టవద్దని నేను మిమ్మల్ని అడుగుతున్నాను.

మీరు ఎలా బోధిస్తారు? నేను మాట్లాడుతున్న ఈ బోధన ఏమిటి? ఇది పుస్తకాల ద్వారా ఇతరులకు అందజేసే జ్ఞానం లేదా సిద్ధాంతం గాని కాదు; ప్రజలు ఏమి చెయ్యాలో చెప్పేది లేదా ప్రబోధించేది కాదు. ఇదంతా మీరు ఈ ప్రపంచంలోకి తీసుకువస్తున్న ప్రకంపనం గురించే. ఈ ప్రకంపనం కరుణ మరియు అంతర్ ప్రశాంతతలకు సంబంధించినది. ఎప్పుడైతే మీరు మీ సొంత చీకటి భాగాలను, మీ మనోభావాలైన భయం, కోపం, నిరాశలను గుర్తిస్తూ మరియు వాటిపై మీ కాంతిని ప్రకాశింపజేస్తారో, అప్పుడే మీ యొక్క ప్రకంపనం ఎదుగుతుంది మరియు ఆ తర్వాతే మీరు ఈ ప్రపంచంలోకి కొత్త కాంతిని తీసుకురాగలరు. మీరు ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు లేదా వారి మాటలను వింటున్నప్పుడు, మీ కళ్ళలో ఈ ప్రకంపనం కనిపిస్తుంది. దయచేసి ఈ ప్రకంపనాన్ని దాచవద్దు, మీకు సాధ్యమైనంతగా దీనిని తెరిచి ఉంచండి, ఎందుకంటే మీరు కాంతిస్వరూపులు కనుక. మీరు ప్రపంచంలోకి ఈ ప్రకంపనాన్ని తీసుకువస్తున్నప్పుడు మీకు ప్రజలు ఆకర్షింపబడతారు. ఎందుకంటే మీకు సత్యం తెలుసు అని కాదు, లేదా వారికి ఏం జరగబోతోందో కూడా మీకు తెలుస్తుందని కాదు, కేవలం మీ చుట్టూ భద్రతతో కూడిన స్నేహపూర్వకమైన స్థలం ఉండడం వలనే. వారు మీ చుట్టూ ఉండడానికి అంగీకరింప బడుతున్నట్లు అనుభూతి చెందుతారు. కొత్తశకం యొక్క టీచింగ్ అంటే ఇదే: ఇతరుల యొక్క చీకటి మరియు

వెలుగు భాగాల రెండింటిని పూర్తిగా అంగీకరిస్తూ, వారి యొక్క అంతర్ సౌందర్యాన్ని, ఆశయాన్ని మరియు వారి అమాయకత్వాన్ని చూడడం మరియు వారిని వారు ఈ విధంగా చూసుకోవడానికి ప్రోత్సహించడమే.

కొత్తశకంలో టీచర్‌గా ఉండడమనేది, మీరు ఊహించిన దానికి పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. ఇదంతా మీ లోతైన అంతరంలోని ప్రశాంతతను కనుగొనడానికి సంబంధించినదే గాని, మీ చుట్టూ ఉన్న చెడు ద్వారా మిమ్మల్ని మీరు కోల్పోవడం ఎంతమాత్రం కాదు. దీని అర్థం ప్రపంచానికి సంబంధించిన వారిగా ఉ ండకుండా, ప్రపంచాన్ని విడుదల చేయడమే అని మరియు మరొక రకంగా చెప్పాలంటే, ప్రతీ ఒక్కరిని అంగీకరించడం మరియు మీరు ప్రపంచంలోకి ప్రసరింపజేస్తున్న ప్రకంపనాన్ని రుచి చూడడానికి వారిని అనుమతించడమే. ప్రపంచంలో ఉండండి, కాని దానికి సంబంధించిన వారుగా ఉండవద్దు.

మీ బోధన ఎలా ఉండాలి మరియు ఇది ఏ రూపం తీసుకుంటుంది అనేది ప్రతి ఒక్కరి విషయంలోను ఒక్కొక్క విధంగా ఉంటుంది. మీలో ప్రతి ఒక్కరూ ఒకానొక ఆశయాన్ని, ఒక సామర్థ్యాన్ని మరియు ఇతరుల కంటే ప్రత్యేకమైన పనిని చేయాలనే కాంక్షను కలిగి ఉంటారు. మీ శక్తి మరియు మీ కాంతి చాలా రూపాలను ధరించగలదు మరియు ఇది ఏ రూపాన్ని ధరించిందనే దానికి నేను అంత ప్రాముఖ్యతను ఇవ్వను. మీరే టీచర్ అని మరియు మీరు సుదీర్ఘ ప్రయాణం చేశారనే దాని యొక్క ఎరుకను పొందమని, నేను ఈరోజు మిమ్మల్ని కోరుతున్నాను. ముఖ్యంగా ఈ సమయాలలో మీ సామర్థ్యాన్ని దాచకుండా, మీ మేధాసంపత్తిని ఇతరులతో పంచుకోమని మరియు మీ ఆశయాన్ని సజీవంగా ఉంచమని నేను మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను. ఈ ప్రపంచంలోకి కొత్త శక్తిని తీసుకురావడమంటే ఇదే.

## అత్యున్నతమైన సున్నితత్వంతో వ్యవహరించడం

మీరందరూ అతి సున్నితంగా తయారయ్యారు. మీ హృదయాలు తెరవబడి ఉన్నాయి. మీరు ఒక్కరే మొదటిగా హృదయాధారిత చైతన్యానికి తెరవబడి మరియు మీరు అన్ని జీవులలో ఉన్న ఏకత్వాన్ని గుర్తిస్తున్నందు వలన, ఈ శకంలో స్త్రీశక్తి చాలా పద్ధతులలో మీ ద్వారా తిరిగి జన్మించబోతోంది. మీ హృదయాన్ని తెరిచి ఉ ంచడం వలన, మీరు మీ చుట్టూ ఉన్న చెడు అనుభూతులను, మనోభావాలను మరియు భూమి చుట్టూ ఉన్న వాతావరణంలోని అనుభూతులను సంగ్రహిస్తున్నారు. కొన్నిసార్లు ఈ సున్నితత్వం చాలా భారంగా ఉండగలదు. కొన్నిసార్లు మీరు అధికంగా చెడును సంగ్రహించడం వలన, మీరు నిరాశకు మరియు ఒత్తిడికి లోనవుతున్నారు మరియు నిజానికి ఇది ఎక్కడి నుంచి వస్తోందో కూడా మీకు తెలియదు.

మీ హృదయాన్ని తెరిచి ఉంచడం, మీ స్త్రీ తత్వపు భాగాన్ని వృద్ధి చేయడం మరియు మీ చుట్టూ ఉన్న శక్తులను అంగీకార వైఖరితో స్వీకరించడం అనేవి మీరు పయనిస్తున్న అభివృద్ధి పథంలో భాగమే. కాని మీ పురుషశక్తిని సాంప్రదాయకరమైన భావనలో కాకుండా, అత్యున్నతమైన సరికొత్త పద్ధతిలో కౌగిలించుకోవడం కూడా అతి ముఖ్యమైన విషయమే. గతంలో పురుషశక్తి అతి కఠినంగా ఉంటూ మీ చరిత్రను పరిపాలించేది. ఈ శక్తి, అధికారాన్ని పొందాలని మరియు వాస్తవాన్ని అదుపు చేయాలనే కాంక్షతో ఉండేది. సాధారణంగా, మీరు పురుషశక్తితో చెడు సంబంధాన్ని కలిగి ఉన్నారు; మీరు ఈ శక్తిని అణచివేసేది గాను, హింసాత్మకమైనది గాను మరియు అహంభావంగలది గాను భావిస్తున్నారు. మీకు పురుషశక్తి యొక్క కొత్త నిర్వచనం అవసరం ఉంది. మీ స్త్రీతత్వపు సున్నితత్వాన్ని సమన్వయపర్చడానికి, మీకు పురుషశక్తి యొక్క అవసరం ఉంది. ఉన్నతమైన ఆకృతి గల పురుషశక్తి, తన యొక్క దృష్టికేంద్రీకరణ ద్వారా మీ చుట్టూ సరిహద్దులను నిర్మించాల్సిన అవసరం ఉంది మరియు మీ శక్తిక్షేత్రంలోకి మీరు ఏది ప్రవేశింపజేయాలో మరియు ఏది ప్రవేశింపజేయకూడదో స్పష్టంగా నిర్ధారించాల్సిన అవసరం కూడా ఉంది. ఉన్నతమైన పురుషశక్తి మీ చుట్టూ ఉన్న చెడు ద్వారా, మీరు పూర్తిగా సంగ్రహింపబడి పోకుండా మిమ్మల్ని కాపాడుతుంది. ఇది మీ చుట్టూ సరిహద్దులను నిర్మించుకోవడానికి మీకు సహాయం చేస్తుంది. పురుషశక్తి యొక్క ఉన్నతమైన రూపం, మీ శక్తిక్షేత్రం యొక్క ద్వారం దగ్గర ఒక వీరుడిగా నిలబడి ఉంటూ – మిమ్మల్ని ఏది పోషిస్తుంది మరియు మిమ్మల్ని ఏది వృద్ధి చేస్తుంది, మరియు మీకు ఏది సహాయం చెయ్యదు అనే వాటిని విభజిస్తుంది. మీ యొక్క అతి సున్నితత్వపు స్త్రీశక్తిని వృద్ధి చేయడానికి, మీ అంతరంలో పురుషశక్తి యొక్క అవసరం చాలా ఉంది. అందువలన నేను మిమ్మల్ని పురుషశక్తి గురించి మళ్ళీ ఆలోచించమని మరియు దీనికి కొత్త నిర్వచనాన్ని, కొత్త అనుభూతిని మీ అంతరంలో కనుగొనమని అడుగుతున్నాను. వీరుడు లేదా ప్రశాంతమైన యోధుడి యొక్క ఊహను మీరు ఏర్పరుచుకోగలరు. ఇతను మీకు ఏది సరైనదో, ఏది సరికాదో విభజిస్తాడు. మీ ఉన్నతమైన ఆదర్శాలకు సహకరించని పరిస్థితులను, మనుష్యులను ఉపసంహరించు కోవడంలో మీకు సహాయం చేస్తాడు.

లైట్‌వర్కర్‌గా మరియు టీచర్‌గా ఉండడం అంటే అర్థం: ఒకవైపున ప్రపంచంలో ఉంటూ, మీ ప్రకంపనాన్ని అడిగిన వారికి అందించడంలో సుముఖతను చూపాలి. కాని మరొక వైపున, పరిస్థితుల నుంచి ఎప్పుడు ఉపసంహరించుకోవాలి మరియు వాటిని ఎప్పుడు తిరస్కరించాలి, మరియు మీ పట్ల మీరు జాగ్రత్తను ఎప్పుడు వహించాలి అనేది కూడా మీకు తెలియాలి. మీ శక్తి అధిక భారాన్ని మరియు కష్టాన్ని అనుభూతి చెందుతున్న సమయాలలో పరిస్థితులను మరియు మనుష్యులను వదిలివేస్తూ, మీ పట్ల మీరు శ్రద్ధను వహించాల్సిన అవసరం ఉంది.

మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. మీ నిజతత్వాన్ని తిరిగి పొందడానికి, మీరు ఎవరనే దానిని అనుభూతి చెందడానికి, ప్రతీరోజూ మీకోసం మీరు ఒక ప్రదేశాన్ని సృష్టించుకోండి. మీకోసం మీరు ప్రదేశాన్ని సృష్టించుకోవడం అంటే, ఎక్కడైతే మీతో మీరు సంపూర్తిగా ఉంటూ మరియు స్వేచ్ఛను అనుభూతి చెందగలరో, అటువంటి ప్రదేశాన్ని మీ ఇంటిలో గాని లేదా బయట ప్రకృతిలో గాని భౌతికపరంగా కనుగొనడమే అని. అలాంటి ప్రశాంతమైన ప్రదేశంలో, మీరు మీ అంతరంలోకి సులభంగా ప్రవేశించగలరు. ఇది చాలా ముఖ్యం. నిజానికి మీ అంతరంలో ఒక విధమైన చైతన్యపు ప్రదేశం ఉంది. ఇదే మీ యొక్క ఉనికి, మీరు ఎవరనే దాని యొక్క మూలం. మీరు దీనిని మాటల్లో వ్యక్తపరచలేరు. ముఖ్యంగా మీరు ఈ చైతన్యాన్ని నిశ్శబ్ధంగాను మరియు ఒంటరిగాను ఉన్న సమయంలో మాత్రమే అనుభూతి చెందగలరు. బాహ్యంగా జరుగుతున్న సంఘటనలు, పరిస్థితులు, శబ్ధాలు మరియు మిమ్మల్ని ప్రక్కదోవ పట్టించే పలు విషయాలు – మీపై దాడి చేసినప్పుడు, మీరు ఈ చైతన్యాన్ని అనుభూతి చెందలేరు. మీరు ఎవరనే దాని యొక్క ఎరుకను, అంటే ఈ వాస్తవంలోకి కాంతిని తీసుకువచ్చే వాహకులు అని మరియు మీరు ఒక టీచర్ అనే దాని యొక్క ఎరుకను పొందడానికి, మీ అంతరంలో ప్రతీరోజు నిశ్శబ్ధాన్ని కనుగొనడం చాలా ముఖ్యం. అందువలన మీతో మీరు ఉండడం మరియు ప్రపంచంలో ఉండడానికి మధ్య సమన్వయాన్ని కనుగొనమని, మరియు మీకు శృతి కాబడే లయబద్ధతను అనుభూతి చెందమని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీకు ఏది సరైనదో నిర్ణయించుకోవడానికి మరియు నిర్దేశించుకోవడానికి పురుషశక్తిని ఉపయోగించుకోండి.

## పురుషశక్తిని తిరిగి నిర్వచించడం

లైట్‌వర్కర్స్ తమ అంతరంలో స్త్రీ–పురుష శక్తులను సమన్వయ పర్చుకోవడానికి ఇదే సరైన సమయం. నిజానికి మీరు మీ సొంత సామర్థ్యానికి భయపడుతున్నారు. ఒకానొక కాలంలో మీ అంతట మీరుగా మీ శక్తిని దుర్వినియోగం చేశారు, మీరు దీని గురించి ఆ తర్వాత బాధపడ్డారు. నేను భూమి మీదకు రాకముందు మరియు క్రీస్తుపూర్వపు యుగాలలో ఇది సంభవించింది; ఇది అట్లాంటిస్ మరియు అంతకు ముందు కాలాలకు సంబంధించినది. ఇప్పటికి మీరు ఈ యుగం యొక్క జ్ఞాపకాలను కలిగి ఉన్నారు, మరియు మీరు తిరిగి మీ శక్తిని ఎప్పుడూ దుర్వినియోగం చేయకూడదని కోరుకున్నారు. కాని దీనిపై మీ ప్రతిస్పందన చాలా తీవ్రస్థితికి చేరింది. మీ కోసం మీరు నిలబడలేకపోవడాన్ని, మీరు ఎవరనేది మరియు మీరు ఏమి చెయ్యాలి లేదా ఏమి చెయ్యకూడదు అనే వాటి పట్ల స్పష్టమైన అవగాహన లేకపోవడాన్ని తరచూ అనుభూతి చెందడం వలన, మీరు మీ సామర్థ్యాన్ని వదిలివేయాలని అనుకున్నారు.

మీరు ఆ తర్వాత మీ చుట్టూ జరుగుతున్న వాటి ద్వారా అలసటకు మరియు నిరాశకు గురికావడం వలన, మీరు ఈ సామర్థ్యాన్ని స్వాగతించ లేకపోయారు. దీని వలన మీరు మీ సామర్థ్యాన్ని ఇతరుల పట్ల నిర్ణయాన్ని తీసుకునే విషయంలోనే కాకుండా, మీ సహజమైన ఆశయం, మీ సహజమైన లక్షణాలు మరియు మీ అంతర్ జ్ఞానంతో బంధాన్ని ఏర్పర్చుకునే విషయంలో కూడా తిరస్కరిస్తున్నారు. మీరు పురుషశక్తికి సరైన నిర్వచనాన్ని కనుగొనడానికి కష్టపడుతున్నారు, కాని ఏదో ఒక నిర్వచనాన్ని కనుగొనమని మరియు దానిని కౌగిలించుకోమని నేను మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను. ఎందుకంటే మీరు మీ నిజమైన సామర్థ్యాన్ని తిరిగి కనుగొనడం అనేది పురుషశక్తి యొక్క పునర్జన్మ ద్వారానే సాధ్యమవుతుంది కనుక.

స్త్రీశక్తి, మిమ్మల్ని మీ ఆత్మతో కలుపుతుంది. మీ ఆత్మ మీతో అనుభూతుల ద్వారా మాట్లాడుతుంది, స్త్రీశక్తి వీటిని అంగీకార వైఖరితో స్వీకరిస్తుంది. కాని స్త్రీశక్తి యొక్క అంతర్జ్ఞానాన్ని బాహ్య ప్రపంచంలోకి తీసుకురావడానికి మరియు ఈ ప్రపంచంలో మీ ఆత్మ యొక్క ఆశయాన్ని వ్యక్తీకరించడానికి ముందు, మీకు మీ యొక్క స్త్రీశక్తిని ఎలా సంరక్షించాలనేది తెలియాల్సిన అవసరం ఉంది. స్త్రీశక్తిని సంరక్షించడం అంటే ఇతరులతో ఎలా వ్యవహరించాలి, మీతో శృతి కాని శక్తుల మధ్యలో నిశ్శబ్దంగాను మరియు ప్రశాంతంగాను ఎలా ఉండాలి అనే వాటి గురించి మీరు తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. మీరు టీచర్‌గాను మరియు ప్రధాన అన్వేషకుడిగాను ఉండడానికి, మీరు మీ యొక్క స్త్రీ-పురుష తత్వాల రెండింటిని హత్తుకోవాల్సిన అవసరం ఉంది.

మీరు దీనిని చేయడానికి సాహసించండి. పరిస్థితులు మార్పు చెందుతున్నాయి మరియు మీరు ఒంటరి వారు కాదు. ప్రపంచంలోని చాలామంది ఇదే ప్రక్రియ ద్వారా పయనిస్తున్నారు. ఇప్పుడు చాలామంది లైట్‌వర్కర్స్ భూమి మీద జీవించి ఉన్నారు. మీరు వీరితో హృదయం నుంచి బంధాన్ని ఏర్పర్చుకున్నట్లయితే, మీరు వారిని మీ తోబుట్టువులుగా అనుభూతి చెందగలరు. దూరం, కాలం మరియు ప్రదేశం లేదా దేశం మరియు కుల-మతాలు అనే వాటితో ఇక్కడ సంబంధం లేదు. ఇప్పుడు భూమికి దగ్గరగా వస్తున్న క్రీస్తుచైతన్యం యొక్క క్షేత్రాన్ని అనుభూతి చెందండి. మీరు వార్తలలో వింటున్న వాటిలోనూ లేదా మీరు టీవిలలో చూస్తున్న వాటిలోనూ ఇది కనిపించక పోయినప్పటికీ కూడా, ఈ క్షేత్రం ఉంది. ప్రస్తుతం కొత్తచైతన్యం మేల్కొంటున్నది.

నేను మిమ్మల్ని పిలుస్తున్నాను. నేను మీలాగే ఈ అతిపెద్ద శక్తిక్షేత్రంలో భాగంగా ఉన్నాను. ఈ శక్తిక్షేత్రంలో మనమంతా ఒక్కటే. మనమందరం సమానమే

మరియు నేను మిమ్మల్ని ఇంటికి పిలుస్తున్నాను. మీరు ఎవరనేది గుర్తు తెచ్చుకున్నా, లేదా మీ దివ్యత్వాన్ని మరియు మీ ద్వారా ప్రవహిస్తున్న దివ్యత్వపు కాంతిని నిజంగా అనుభూతి చెందగలిగినా, మీరు ఈ క్షణంలోనే భూమి మీద మీ ఇంటిని అనుభూతి చెందగలరు.

నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.

నా శక్తిని అంగీకరించండి.

నా శక్తిని స్వీకరించినందుకు మీకు నా కృతజ్ఞతలు.

* * * *

## అతి సున్నితత్వం నుంచి అత్యున్నత సున్నితత్వం వైపు
## మీరే ఏంజెల్‌గా రూపొందడం

ఈ ఛాప్టర్ గెరిట్ గెలన్ ద్వారా చెప్పబడినది. ఈయన జీసస్‌ను ఛానెలింగ్ చేస్తున్న పమెలా క్రిబ్బి భర్త. వీరి గురించి ఇతర వివరాల కోసం www.jeshua.net చూడండి.

చాలామంది మనుష్యులు అతి సున్నితంగా ఉన్నారు. వీరు ఆధునిక సమాజం యొక్క అలజడులను, ఘర్షణలను మరియు పోటీతత్వాన్ని ఎదుర్కొనలేక పోతున్నారు. తరచూ వీరు మానసికపరమైన గందరగోళాలు మరియు నిద్రలేమి వలన బాధపడుతుంటారు. ఇతరులు వేటినైతే సులభంగా అనుమతిస్తారో, అవి వీరికి చాలా భారంగా ఉంటాయి, ఉదాహరణకి కుటుంబ వేడుకలు. ఇతరులు వేటినైతే సాధారణంగా పరిగణించి చేస్తుంటారో, అవి వీరికి చాలా విషాదకరంగా మారుతుంటాయి.

ఒక శిశువుగా వీరు తరచూ తప్పుగా అర్థం చేసుకోబడుతూ చులకన చేయబడతారు. అందువలన వీరిపై వీరు ఆధారపడడం అనేది వీరికి చాలా కష్టంగా ఉంటుంది. వీరు వీరి కలలను నెట్టివేస్తుండడం వలన వీరికి విద్యాభ్యాసం చాలా కష్టంగా ఉంటుంది. సమాజం యొక్క ఆదర్శాలకు అనుగుణంగా వృత్తిని నిర్మించుకోవడంలోనూ మరియు దానిని విజయవంతంగా నిర్వహించడంలోనూ వీరు విఫలమవుతారు. సమాజం యొక్క హద్దులలోని గందరగోళాన్ని వీరు ఎక్కువగానైనా లేదా తక్కువగానైనా అనుభవిస్తారు. సామాజిక కార్యకలాపాలలో పాల్గొన్నప్పుడు, వీరు అలసటను మరియు శక్తి హీనతను అనుభూతి చెందుతారు. వీటన్నింటి వలన వీరి యొక్క వ్యక్తిగత గౌరవం సరిగ్గా ఉండదు; వీరు తరచూ అభద్రతా భావాన్ని మరియు తక్కువ హోదాను అనుభూతి చెందుతారు. వీరి ఆలోచనలు నిరాశను కలిగించేవిగా ఉంటాయి మరియు ఇవి వాటంతటఅవి మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉండవచ్చు.

నిజానికి ఈ గౌరవం ఒక దృశ్యం లాంటిది. అయినప్పటికీ చాలామంది ప్రజలు పాక్షికంగా వారిని వారు దీనిలో గుర్తిస్తున్నారు. అతి సున్నితత్వం గల మనుష్యుల యొక్క కొన్ని మంచి లక్షణాల మీద ఇప్పుడు మనం దృష్టిని కేంద్రీకరిద్దాం. వీరు ప్రశాంతతను, నిశ్శబ్దాన్ని మరియు వీరి తోటి మనుష్యుల మధ్య సమన్వయంతో జీవించడాన్ని ఇష్టపడుతుంటారు. వీరు సౌందర్యానికి, ముఖ్యంగా ప్రకృతి యొక్క సౌందర్యానికి సున్నితంగా స్పందిస్తారు. వీరు కరుణను మరియు ఆధ్యాత్మికపరమైన

అంగీకార వైఖరిని కలిగిఉంటారు. వీరు ఉన్నతమైన ఊహాశక్తిని కలిగి ఉంటారు. కష్టాలలో ఉన్న మనుష్యులు వీరికి సహజంగా ఆకర్షింపబడడాన్ని మరియు వీరి దగ్గరకు మార్గదర్శకత్వం కోసం రావడాన్ని చూసి వీరు ఆశ్చర్యానికి లోనవుతారు.

నిజానికి వీరిలో ఉన్న సామర్థ్యం ఏమిటి? దీనికి సమాధానం ఏమిటంటే వీరు అతి సున్నితత్వాన్నే కాకుండా, అత్యున్నతమైన సున్నితత్వాన్ని కూడా కలిగి ఉన్నారు. నిజానికి వీరు ముసుగులో ఉన్న దేవతలు.

**అత్యున్నత సున్నితత్వం అంటే ఏమిటి?**

ప్రతీ జీవి ఒక ప్రత్యేకమైన ప్రకంపనాన్ని లేదా శక్తిక్షేత్రాన్ని ప్రసరింపజేస్తుంది: పువ్వులు, సూర్యుడు, ప్రజలు, జంతువులు, వృక్షాలు మరియు సామూహిక మానవసమాజం కూడా. మీ ప్రకంపనం లేదా మీ శక్తిక్షేత్రం మానవసమాజం యొక్క ప్రకంపనం కన్నా మరింత స్వచ్ఛంగాను మరియు సున్నితంగాను ఉన్నప్పుడు, మీరు అత్యున్నత సున్నితత్వంగా ఉంటారు.

ప్రకాశవంతమైన మరియు అందమైన ఒక దేవత స్వర్గం నుంచి దిగి వచ్చి, ఆధునిక సమాజంలో మానవశరీరంలో జన్మించడాన్ని ఊహించుకోండి. ఈమెకు తన చుట్టూ ఉన్న ప్రపంచం యొక్క అలజడులతో, గందరగోళాలతో మరియు అందవికారాలతో వ్యవహరించడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రకృతి యొక్క ప్రశాంతత మరియు సౌందర్యం ఎక్కడ ఉన్నాయి, పువ్వులు ఎక్కడ ఉన్నాయి? లోతైన అంతర్జ్ఞానం, విశ్వతలాలతో ఉన్న ఐకమత్యపు భావన ఎక్కడ ఉన్నాయి? ఈ దేవత విడిపోయినట్టుగాను మరియు వేర్పడినట్టుగాను అనుభూతి చెందుతోంది. తన చుట్టూ ఉన్న ప్రపంచం ఆమె లేదా అతనికి వాత్సల్యాన్ని లేదా గుర్తింపును అందించడం లేదు. ఈ దేవత తనలో ఏదో లోపం ఉందని ఆలోచించడం మొదలుపెడుతూ, బాధ మరియు నిరాశలకు లోనవుతుంది. ఇక్కడ ఇంటిలో లేని అనుభూతిని పొందడం వలన, ఆమె సమాజాన్ని వదిలి వేస్తూ మరొక అస్పష్టమైన వాస్తవాన్ని కోరుకుంటుంది. ఆమె చుట్టూ ఉన్న మనుష్యులు, ఆమెను జీవితపు వాస్తవాలను ఎదుర్కొనడానికి ఇష్టపడని వ్యక్తిగాను మరియు ఊహలలో జీవించే మనిషిగాను పరిగణిస్తారు. ఆమె దైవత్వం యొక్క కాంతి క్రమక్రమంగా క్షీణిస్తుంది. ఆరంభంలో అత్యున్నత సున్నితత్వాన్ని కలిగి ఉన్న ఈమె ఇప్పుడు అతి సున్నితత్వంగా తయారయ్యింది.

ఈ దేవత భూమి మీద ఎందుకు జన్మ తీసుకుందా అని మీరు ఆశ్చర్యపోవచ్చు.

భూమి మీద చాలా దేవతలు జన్మ తీసుకుంటున్నారు మరియు ఇక్కడ

ఉండడానికి ప్రతీ దేవత తన సొంత లక్ష్యాన్ని కలిగి ఉంది. వీరు అందరూ కలిగి ఉన్న సాధారణమైన లక్ష్యం: భూమికి సహాయం చెయ్యడమే. ఈ దేవతలు ఇక్కడ ఉండడం ద్వారా, సామూహిక మానవసమాజం కాంతిని మరియు సున్నితత్వాన్ని పొందుతున్నాయి. ఈ దైవత్వం యొక్క ఉనికి, ప్రపంచం యొక్క ప్రకంపనాన్ని వృద్ధి చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ దేవతలు వారు ఎవరనేది గుర్తించినప్పుడు మరియు వీరి ఆత్మ విశ్వాసం తిరిగి నెలకొల్పబడినప్పుడు మాత్రమే ఇది సంభవిస్తుంది. అప్పుడే వీరి యొక్క కాంతి నిజంగా ప్రకాశిస్తుంది.

ఇప్పుడు మీరే ఆ దేవతని ఊహించుకోండి.

మీరు మళ్ళీ ప్రకాశవంతంగా రూపొందడానికి, అతి సున్నితత్వం నుంచి అత్యున్నత సున్నితత్వంగా పరివర్తనం చెందడానికి మీరు ఏం చెయ్యగలరు? (కరుణ)

## మొదటి అడుగు - మీరే ఒక దేవతని గుర్తించండి

మీరే ఒక దేవతని గుర్తించండి మరియు దానిని చూపించడానికి భయపడవద్దు. మీ సొంత కాంతిని, మీ సృజనాత్మక సామర్థ్యాలను విశ్వసించండి మరియు మిమ్మల్ని మీరు ప్రదర్శించుకోవడానికి మీ భయాన్ని అధిగమించండి. ఇదే మొదటి అడుగు.

మీరు ఇది ఎలా చేస్తారు? ఆధ్యాత్మికతతో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది చాలా ముఖ్యం. ఆధ్యాత్మిక దృక్పథం నుంచి ప్రపంచాన్ని చూడండి. మీరు ఆవిర్భవించిన మరియు మీకు సంబంధించిన సమయానికి అతీతంగా ఉన్న ప్రేమ మరియు అద్భుతం యొక్క తలాన్ని గుర్తుతెచ్చుకోండి. మీరు ఎల్లప్పుడూ ఈ సున్నితమైన, శాశ్వతమైన వాస్తవంతో కలుపబడి ఉంటారు. ఇప్పుడు మరొక అడుగు ముందుకు వేస్తూ, మీరు ఆ తలంలో నిజంగా ఉండడాన్ని విశ్వసించండి. మీరు ఈ తలంతో కలుపబడినప్పుడు, మీరు మీ అంతర్ మూలంతో కూడా బంధాన్ని ఏర్పరుచుకోగలరు మరియు మీరు ఎవరనే దానిని కూడా గుర్తించడం ప్రారంభించగలరు. మీ చైతన్యం అనంతమైనది అని, మరియు ఇది కాంతి మరియు సృజనాత్మకత యొక్క వైభవోపేతమైన మూలమని గుర్తుతెచ్చుకోగలరు.

నిజానికి మీ సొంత ఇల్లు అయిన, ఈ వేరే తలంలో మీరు భాగమని అనుభూతి చెందినప్పుడు, మానవసమాజం మీపై మోపే నిర్ణయాలు మీకు అతి తక్కువ భారాన్ని కలిగిస్తాయి. మీరు ఇక్కడ ఉండేది కేవలం తాత్కాలికమేనని మరియు ఏదో ఒక రోజు ఈ గజిబిజి గందరగోళ సమాజం మాయమైపోతూ మరియు

మరింత ప్రశాంతమైన, మధురమైన మరియు ఆనందకరమైన సమాజానికి స్థానాన్ని కల్పిస్తుందని మీరు గుర్తించగలరు. ప్రస్తుత సమాజం మీ గురించి ఏమి ఆలోచిస్తోంది మరియు ఇది మీ నుంచి ఏమి ఆశిస్తోంది అనేవి ఎంతమాత్రం ముఖ్యం కాదు. మీరు ఏం చెయ్యడానికి ఇక్కడ ఉన్నారు, ఈ ప్రపంచంలో మీ కాంతిని ఎలా వ్యక్తీకరించబోతున్నారు అనే విషయాలే అతి ముఖ్యమైనవి.

మీ అసలైన మూలాన్ని గుర్తించడం ద్వారానే మీరు మీ కాంతిని వెలిగించగలరు. కాంతి అనేది సృజనాత్మకమైనది మరియు రూపాంతరం చెందేది. మీ వాతావరణం మీపట్ల ప్రత్యేకంగా స్పందించడాన్ని మీరు గమనించగలరు. జీవితం మరింత సులభంగా ప్రవహిస్తుంది మరియు మానవులు మీకు మరింత ప్రాముఖ్యతను ఇస్తారు. మీరు అతి సున్నితత్వం నుంచి అత్యున్నత సున్నితత్వం వైపు పయనించడంలో మొదటి అడుగును వేసారు.

**రెండవ అడుగు - మీ పురుషశక్తి యొక్క ఎరుకను పొందడం**

కొందరికి మీ కాంతిని ఇవ్వడం కుదరదు అని ఖచ్చితంగా మీరు చెప్పినప్పుడే, మీ కాంతిని ఇతరులకు నిజంగా పంచగలరు. మీరు "కాదు" అని ఇతరులకు చెప్పలేక పోయినట్లయితే, మీ "అవును" అనే దానికి అర్థం ఉండదు. సరిహద్దులను నిర్మించుకోవడం మరియు మీ మీద మీరు ఆధారపడడం అనే విషయాలను నేర్చుకోవడం చాలా ముఖ్యం. మీరు ఇది చేయలేక పోయినట్లయితే, మీ శక్తి ప్రవాహం వృధాగా బయటకు ప్రవహించబడుతుంది మరియు మీరు నిరంతరం బలహీనతను మరియు అవిశ్రాంతిని అనుభూతి చెందుతారు.

ఇది జరగకుండా నిరోధించడానికి, మీ పురుషశక్తితో బంధాన్ని ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉంది. ఆధ్యాత్మికత వైపు ఆసక్తిని చూపే చాలామంది మనుష్యులు, పురుషశక్తిపై చెడు అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. ఈ పురుషశక్తి – దౌర్జన్యం, అధికారం మరియు హింసలతో కలుపబడి ఉందని మరియు ఇది ఆధ్యాత్మికతకు సంబంధించినది కాదని భావిస్తుంటారు. పురుషశక్తి పట్ల ఉన్న ఈ చెడు అభిప్రాయం యొక్క ఫలితంగా, 'ఆధ్యాత్మిక ఆసక్తిని మరియు అతిసున్నితత్వాన్ని' కలిగిన మనుష్యులు అధికారలేమిని మరియు వారిపై వారు ఆధారపడ లేకపోవడాన్ని అనుభూతి చెందుతున్నారు.

పురుషశక్తిలో ఎటువంటి చెడు లేదని అర్థం చేసుకోవడమే దీనికి అసలైన పరిష్కారం. స్త్రీ-పురుష శక్తుల మధ్య ఉన్న సమన్వయా లోపమే ఈ సమస్యలకు కారణం. పురుషశక్తిని తక్కువ హోదాతో పరిగణించడం వలన, చాలామంది వారి

యొక్క సొంత శక్తిని బలహీనపరుస్తున్నారు. ముఖ్యంగా ఇది సున్నితత్వం కలిగిన ఆడవాళ్ళలో సంభవిస్తోంది. ముఖ్యంగా మీరు ఆధ్యాత్మిక ప్రక్రియ ద్వారా పయనిస్తున్నప్పుడు, మీ పురుషశక్తితో బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది అత్యంత ముఖ్యమైనదిగా ఉంటుంది.

మీరు మొదటి అడుగును వేసిన తర్వాత మరియు నిజంగా మీరు ఎవరనే దాని యొక్క ఎరుకను పొందిన తర్వాత, మిమ్మల్ని మీరు మీ పరిస్థితుల నుంచి సమర్ధవంతంగా విభజించుకోగలుగుతారు. మీ కాంతిని ఇతరులు గుర్తిస్తారు. దీని వలన మీ శక్తిని దొంగిలించే వారు మీకు ఆకర్షింపబడతారు, నేను వీరినే రక్త పిశాచాలుగా పిలుస్తాను. వీరు మానవులు లేదా ఇతర గ్రహవాసులు కూడా కావచ్చు. ఉదాహరణకి మీరు పని చేసే వ్యవస్థలోని మనుష్యులు, మీ శక్తిని దొంగిలిస్తూ వారిని వారు పోషించుకుంటారు. వీరు మీకు తిరిగి ఏమి ఇవ్వకుండానే మీ శక్తిని దొంగిలిస్తారు. ఈ విధమైన వాతావరణంలో మిమ్మల్ని మీరు సంరక్షించుకోకపోతే, మీ శక్తి స్తంభించిపోతుంది.

ఈ స్థితిలో, మీరు మీ పురుషశక్తి యొక్క బలాన్ని ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. మీలోని పురుషభాగాన్ని, మీ అంతర్ పురుషుడిని హత్తుకోండి మరియు దీనిని విశ్వసించండి. మీ చేతిలో ఉండే ఖడ్గంగా రూపొందడానికి ఈ పురుషశక్తిని అనుమతించండి, ఇది మీకు మరియు మీ శక్తిని దొంగిలించే వారికి మధ్య ఉన్న బంధాన్ని విడదీస్తుంది.

మీ పురుషశక్తి యొక్క ఖడ్గాన్ని సమర్ధవంతంగా ఉపయోగించడంలో మీరు సాధారణంగా ఎదుర్కొనే ఆటంకం: సమానత్వం యొక్క అభిప్రాయాన్ని. "మనమందరం సమానమే కాబట్టి నన్ను నేను ఇతరుల నుంచి విభజించుకోను, మరియు నేను కలిగిఉన్న దానిని ఇతరులతో పంచుకుంటాను". సమానత్వం యొక్క ఆలోచన కొంతవరకూ సమంజసమే. ఆత్మ స్థాయిలో మనమందరం సమానమే. వ్యక్తీకరణ స్థాయిలలో మాత్రం మనమందరం సమానం కాదు. కొంతమంది, ఇతరుల కంటే మరింత ఎక్కువగా వీరి అంతర్ కాంతిని ప్రకాశింపజేసే సమర్ధతను కలిగిఉంటారు. దీనిని గుర్తించకపోవడం వలన, మన శక్తిని హరించేవారికి యదేచ్ఛగా అవకాశాన్ని ఇస్తున్నాము. ముఖ్యంగా కాంతిని ఎక్కువగా ప్రసరింపజేసే వారు మరియు అధికంగా ఇచ్చే గుణాన్ని కలిగిన వారు, వీరిని వీరు తప్పక సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మీరు ఎవరికి లేదా దేనికి మీ శక్తిని ఇస్తున్నారనే విషయం యొక్క ఎరుకను పొందండి. మీరు అందిస్తున్న దానిని స్వీకరించడానికి ప్రతీ వ్యక్తి సిద్ధంగా లేడు. మీ ప్రకంపనానికి శృతి కాని మనుష్యులు లేదా వ్యవస్థల ద్వారా, మీ అతి విలువైన

బహుమతి హరింపబడకుండా మీరు శ్రద్ధను వహించండి. ఈ ఆశయం కోసం మీ పురుషశక్తిని ఉపయోగించుకోండి.

**మూడవ అడుగు - భూమాత మీ స్నేహితురాలనే విషయాన్ని గుర్తించండి**

అతి సున్నితత్వం గల చాలా మంది మనుష్యులు భూమి మీద జీవితం పట్ల ప్రతిఘటనను అనుభూతి చెందుతున్నారు. నిజానికి ఈ ప్రతిఘటనకు కారణం ఆధునిక సమాజంలో ఇంటి దగ్గర ఉన్న అనుభూతిని పొందలేకపోవడమే. సమాజం యొక్క శక్తి వీరి సొంత శక్తికి తగినట్టుగా లేకపోవడం వలన, వీరు వేర్పాటు భావనను అనుభూతి చెందుతున్నారు మరియు వీరు సమాజాన్ని వదిలి వేయాలనుకున్నారు; వీరు అచేతనావస్థలో వీరి యొక్క ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుర్తుంచుకోవడం వలన వీరు తిరిగి ఇంటికి చేరాలని కోరుకుంటున్నారు. వీరు స్వర్గతలాలైన ప్రశాంతత మరియు సమన్వయాలకు తిరిగి చేరాలని కోరుకుంటున్నారు. ఈ తలాలు, ప్రస్తుత మానవ సమాజంలోని భయాలు, హింసలు మరియు శత్రుత్వాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి.

సున్నితత్వం గల మనుష్యులు, భూమి మీద జీవితం పట్ల ప్రతిఘటనను అనుభూతి చెందడమే కాకుండా, వారు వారి గతజన్మలలో సంభవించిన విషయాల పట్ల కూడా అనుభూతులను కలిగి ఉన్నారు. తరచూ వీరి అంతరంలో ఘర్షణలు, వేధింపులు మరియు ఆత్మ యొక్క ఇతర రూపాలలోని హింసాత్మక దాడుల జ్ఞాపకాలను మోస్తున్నారు. వీరు భూమి మీద మంచిగా ఉంటూ మరియు ఇతరులకు మంచి చెయ్యడానికి ప్రయత్నించడం వలన, వీరు క్రూరంగా తిరస్కరింపబడ్డారనే విషయాన్ని గుర్తుంచుకున్నారు.

భూమి మీద జీవితం పట్ల మీ ప్రతిఘటనను అధిగమించడానికి, మీరు మానవసమాజం యొక్క శక్తికి మరియు భూమి యొక్క శక్తికి మధ్య తేడాను గుర్తించడం చాలా ముఖ్యం. ఈ విధంగా చెయ్యడానికి ప్రకృతిలో ఒక అందమైన ప్రదేశాన్ని కనుగొనండి. మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు అక్కడకు వెళ్ళండి. అక్కడ ఉన్న ప్రశాంతతను మరియు నిర్మలత్వాన్ని అనుభూతి చెందండి. విశాలమైన హృదయంతో ఈ ప్రదేశాన్ని అంగీకరిస్తూ, అక్కడ ఉన్న శక్తులన్నింటిని అనుభూతి చెందండి. కేవలం మీరే కాకుండా, ఇతర ప్రకృతి ఆత్మలు అంటే రెక్కలతో ఎగిరి వచ్చే దేవదూతలు మరియు అద్భుత శక్తులు గల జీవులన్నీ కూడా భూమితో చాలా సన్నిహితంగా పని చేస్తున్నాయి. ఇప్పుడు భూమిని అనుభూతి చెందండి. మిమ్మల్ని హత్తుకోవాలని మరియు మీకు సహకరించాలని కోరుకునే భూమికే మీరు వచ్చారని అనుభూతి చెందండి. ఆమె శక్తిని మరియు ప్రేమను అందుకోవడానికి మీ హృదయాన్ని తెరిచి ఉంచండి.

మీరు భూమితో బంధాన్ని ఏర్పరుచుకుని, ఆ బంధంలో ప్రవేశించడం వలన, మీరు నిజంగా మీ స్థానాన్ని స్థాపించుకోగలరు మరియు ఈ ప్రపంచంలో మీ కాంతిని ప్రకాశింపజేయగలరు. మీరు ప్రపంచాన్ని మార్పు చెందిస్తూ, దీనిని మరింత అందంగా తయారు చేయగలరు. భూమి మీద మీకు ఒక ప్రదేశం ఉంది, అక్కడ మీరు మీ ఇంటిని అనుభూతి చెందగలరు. ఈ ప్రదేశం మీ చుట్టూ ఉన్న ప్రపంచానికి మీ కాంతిని విస్తరింపజేసే దీపపు స్థంబంలా తయారవుతుంది.

అతి సున్నితత్వం గల మనుష్యులు ప్రపంచానికి కనపడకుండా దాక్కుని ఉన్నారు. అత్యున్నత సున్నితత్వం గల మనుష్యులు ప్రపంచంలోకి స్వేచ్ఛగా వీరి శక్తిని ప్రసరింపజేస్తారు.

## నాలుగవ అడుగు - మీరు మరింత సున్నితత్వాన్ని పొందడానికి మీ స్త్రీశక్తిని ఉపయోగించుకోండి

మీరు ఇతరులకు భయపడడం మరియు ఇతరులను ప్రేమించడానికి మధ్య ఉన్న తేడాను మీ స్త్రీశక్తి గుర్తించగలదు. ఈ శక్తి ఇతరులు ధరించిన ముసుగుల వెనుక దాగిఉన్న దానిని మరియు వారి యొక్క బలహీనతలను చూడగలిగే సామర్థ్యాన్ని మీకు ఇస్తుంది. మన హృదయాలలో మనమందరం మంచి వాళ్ళమే. దైవం ప్రతీ ఒక్కరి హృదయంలోను ఉంది. మీరు మరింత సున్నితత్వాన్ని పొందడానికి మీ స్త్రీశక్తిని ఉపయోగించుకోండి. ఇతరుల స్థానంలో మీరు ఉంటే ఎలా ఉంటుందనేది మీరు నిజంగా అర్థం చేసుకోవడానికి, మనోభావాలను చదవగలిగే మీ సామర్థ్యాన్ని ఉపయోగించుకోండి. అంతరం నుంచి ఇతరులను అర్థం చేసుకోవడం అనేది, ఇతరుల యొక్క చెడు ప్రవర్తనలను లేదా బాధ కలిగించే అభిప్రాయాలను విశాల దృక్పథంతో చూసేందుకు మీకు సహాయం చేస్తుంది. వీటిని విడుదల చేయడానికి కూడా ఇది మీకు సహాయం చేయవచ్చు.

మీ అంతరంలో పురుషశక్తి బలంగా ఉన్నప్పుడే మీ స్త్రీశక్తిని సంరక్షించడం సాధ్యమవుతుంది. ఇతరులు మనకు చెబుతున్న వాటి వలన మనం బాధపడినట్లయితే, దీనికి కారణం మన అంతరంలోని అతి సున్నితత్వంతో ఈ మాటలకు అర్థాలను వివరించుకోవడం వలననే కాని, కేవలం వారి మాటల వలన మాత్రం కాదు. ఇతరులు మిమ్మల్ని వ్యక్తిగతంగా బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో ఇది చేయడం లేదు, కేవలం వారిలోని ఏదో బాధను ఈ విధంగా బయటకు వ్యక్తపరుస్తారు. మీరు పరిస్థితులను వ్యక్తిగతంగా తీసుకోనివ్వకుండా, మీ పురుషశక్తి సహాయం చేస్తుంది. ఇతరులలో సంభవిస్తున్న వాటిని మీరు అనుభూతి చెందేందుకు మీ స్త్రీశక్తి సహాయం

చేస్తుంది. స్త్రీశక్తి యొక్క బహుమతి అయిన సున్నితత్వాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, మన చుట్టూ ఉన్న ఈ చీకటి ప్రపంచంలో మనం ఇప్పుడు చాలా కాంతులను చూడగలం. మరింత సున్నితంగా తయారవ్వడం వలన, మనం మన చుట్టూ ఉన్న మనుష్యుల యొక్క హృదయాలను స్పృశించగలం. ఇది మనం అనుకున్న దాని కంటే చాలా వెచ్చగాను మరియు కాంతివంతంగాను ఉంటుంది. ఇతరుల యొక్క హృదయంలోని కాంతిని గుర్తించడం ద్వారా, ఈ కాంతి మరింతగా ప్రకాశిస్తుంది.

మరింత సున్నితంగా రూపొందడం అనేది రెండు దిశలలో పని చేస్తుంది: మీరు ఇతరులు ఎవరనే దాని యొక్క లోతైన అవగాహనను పొందడమే కాకుండా, వారు కూడా మీరు ఎవరనే విషయాన్ని గొప్పగా అర్థం చేసుకొనగలరు. ఇతరులు ముందెన్నడూ మీలో గమనించని సున్నితత్వాన్ని, వెచ్చదనాన్ని మరియు అద్భుతాన్ని అనుభూతి చెందుతారు; మీరు ఇతరులను గుర్తించడం వలన, వారు కూడా మిమ్మల్ని గుర్తిస్తారు. ఈ విధంగానే మీరు భూమి మీద ఇంటి దగ్గర ఉన్న అనుభూతిని పొందడం మొదలుపెడతారు.

## దేవతగా ఉండడం అంటే సమన్వయంతో ఉండడమే

ప్రతీ మనిషి ఇచ్చే ప్రవాహాన్ని మరియు తీసుకునే ప్రవాహాన్ని కలిగి ఉంటాడు. మీరు ఆధ్యాత్మికపరంగాను మరియు భౌతికపరంగాను ఆరోగ్యంగా ఉండాలంటే, మీరు వాతావరణంతో సమన్వయంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇచ్చే ప్రవాహం మరియు తీసుకునే ప్రవాహాలు రెండూ సమన్వయంగా ఉండాల్సిన అవసరం కూడా ఉంది. మన కాంతిని మరింతగా ప్రసరింపజేసినప్పుడు, మనం అతి సున్నితత్వం నుంచి అత్యున్నత సున్నితత్వం వైపు పరివర్తనం చెందుతాం మరియు మనమే దేవతలని తెలుసుకుంటాం. అప్పుడు ఇచ్చే ప్రవాహం అధికమవుతుంది. మనకు తెలియకుండానే, మనం సృజనాత్మకమైన మరియు అందమైన కాంతిని ప్రసరింపజేస్తూ మన చుట్టూ ఉన్న వాతావరణంతో పంచుకుంటాం. ప్రపంచంలోకి ప్రవహింపజేస్తున్న మన శక్తి తిరిగి మన దగ్గరకు సమృద్ధి(భౌతిక) రూపంలో రావాలని కోరుకుంటోంది.

అతి సున్నితత్వం గల మనుష్యులకు ఇది సమస్యలను సృష్టిస్తుంది. వీరు జీవితం అందంగాను, ఉన్నతంగాను మరియు సమృద్ధిగాను ఉండదని విశ్వసిస్తుంటారు. జీవితం సరిగ్గా ఉండదని మరియు సమృద్ధిని అందుకునే అర్హత వీరికి లేదని వీరు అనుభూతి చెందుతారు. అందువలన వీరి దగ్గరకి రావాలనుకుంటున్న 'తీసుకునే ప్రవాహాన్ని', వీరు తరచూ నిరోధిస్తుంటారు. మతపరమైన సంప్రదాయాలు స్వీకరించడం

కన్నా కూడా ఇవ్వడమే గొప్పదని మీకు బోధిస్తున్నాయి, లేదా మీతో మీరు ఆనందంగా గడపడమనేది పాపమని తెలిపే ఆలోచనారీతికి ఇవి సహకరిస్తున్నాయి. భయం మరియు సందేహం, మీ మార్గంలోకి రావాలనుకుంటున్న సహజమైన సమృద్ధిని అడ్డుకుంటాయి.

వీటి పట్ల జాగ్రత్త వహించండి. విశ్వం మీకు ఇవ్వాలనుకుంటున్న వాటిని నిజంగా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా లేదా అనే విషయాన్ని మీ అంతట మీరు పరిశీలించుకోండి మరియు విశ్వం మీకు అందిస్తున్న ప్రేమను స్వీకరించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా లేదా అన్నది కూడా పరిశీలించుకోండి. విశ్వం మీ మార్గంలోకి పంపించాలనుకుంటున్న వాటికి మీరు 'అంగీకారాన్ని' చెప్పనంత వరకూ కూడా, మీరు మీ నిజతత్వానికి 'అంగీకారాన్ని' తెలపనట్లే అవుతుంది. మీకు మీరు, మీ యొక్క అన్ని భాగాలకు బిగ్గరగాను మరియు ప్రేమపూర్వకంగాను అంగీకారాన్ని తెలపండి. మీ జీవితంలో అందుకునే ప్రవాహాన్ని అంగీకరించడం వలన, ఇది మీకు కొంతకాలం తర్వాత సహజంగా తయారవుతుంది.

* * * *

## శక్తి హరులు

హాయ్, ఈ ప్రత్యేకమైన గ్లోబల్ టెలీక్లాస్ చూస్తున్న ప్రతీ ఒక్కరికి నేను స్వాగతం పలుకుతున్నాను. నేను క్రిమ్‌సన్ సర్కిల్ తరపు నుంచి జాఫ్రీహోపిని మాట్లాడుతున్నాను మరియు ఈ రోజు(11-11-2010) నేను నా భార్య లిండబెన్యోతో కలిసి ఇక్కడకు వచ్చాను. లిండా ఈ రోజు ఈ రాత్రి ఇక్కడ ఉండడం నీకు ఎలా అనిపిస్తోంది.

**లిండా: ఇక్కడ ఉండడం నాకు చాలా ఆనందంగా ఉంది.**

జాఫ్రీ: సరే, మనం ఈ రోజు మీ శక్తిని తీసుకుంటున్న శక్తి హరుల గురించి మాట్లాడుకోబోతున్నాం. మీరు తరచూ అవిశ్రాంతిని, అలసటను, గందరగోళాన్ని మరియు అలజడులను అనుభూతి చెందుతున్నారా? దీనికి ఒకానొక కారణం మీ జీవితంలో శక్తి హరులు ఉండడమే. వీరు మీ శక్తి ద్వారా పోషింపబడుతున్నారు మరియు నిజానికి వీరు మీ శక్తిని హరిస్తున్నారు. దీనిని ఆపడానికి ఇదే సరైన సమయం. దీనిని ఆపడం వలన ఆరోగ్యకరమైన, ఆహ్లాదరమైన బాంధవ్యాలు ఏర్పడతాయి మరియు మీలో శక్తివంతమైన ఆత్మ విశ్వాసం వృద్ధి చెందుతుంది. ఇది అన్నింటికంటే ముఖ్యంగా మీ జీవితంలో ఆనందాన్ని తిరిగి తీసుకువస్తుంది.

మనం ఈ అంశంలోకి వెళ్ళే ముందు, మేము మిమ్మల్ని లోతైన శ్వాసను తీసుకోమని ఆహ్వానిస్తున్నాం. ఈ శక్తి హరులు అనే పదం పలకడానికి వింతగా అనిపించవచ్చు, కాని నిజానికి ఇది జరుగుతోంది, అంటే నా ఉద్దేశ్యం మీ శక్తిని హరిస్తున్న వారు నిజంగా ఉన్నారని. నేను ఇప్పుడు దీని గురించే మాట్లాడబోతున్నాను. నేను దీనికి సంబంధించిన లక్షణాల గురించి, వీటిని ఎలా గుర్తించాలి మరియు వీటితో ఎలా వ్యవహరించాలి అనే దాని గురించి కూడా ఇప్పుడు వివరిస్తాను.

ఇది నిజంగానే ఒక ఆసక్తికరమైన అంశం, దీని గురించి మనం రోజుల తరబడి మాట్లాడుకోవచ్చు. మనమందరం చైతన్యం యొక్క స్వరూపాలమనే విషయం మీకు తెలుసు, నా ఉద్దేశ్యం మన అందరి యొక్క మూలం స్వచ్ఛమైన చైతన్యమే అని. మనం కేవలం ఎముకలతో కూడిన భౌతిక శరీరమో లేదా మనసో కాదు. నిజానికి మనందరి యొక్క మూలం, చైతన్యమే. చైతన్యం యొక్క స్వరూపాలుగా, మనం మన వాస్తవాన్ని సృష్టించుకోవడానికి మన నిత్యజీవితాలలో శక్తిని వినియోగించు కుంటున్నాం. మన చుట్టూ ఉన్న మనుష్యులందరూ చైతన్యం యొక్క స్వరూపాలే, వీరు కూడా వీరి వాస్తవాలను అంటే ఉదాహరణకి ఉద్యోగాలు, బంధాలు, ఆశయాలు మరియు ఇష్టాలు మొదలైన వాటిని సృష్టించుకోవడానికి శక్తిని ఉపయోగిస్తున్నారు.

మనం ఈ రోజు అంశం చర్చించుకోబోయే ముందు, నేను మీకు కొన్ని విషయాలను చెప్పాలని అనుకుంటున్నాను. సాధారణంగా చాలామంది మనుష్యులు శక్తిని తీసుకుంటారు మరియు శక్తిని దొంగిలిస్తుంటారు. మేము వీరినే "శక్తి హరులు"గా పిలుస్తాం, దీనిని వీరు ఎరుకతో చేయడం లేదు, వీరు మీకు ఏదో హాని తలపెట్టాలనే ఉద్దేశ్యంతో ఈ పనిని చేయడం లేదు. వీరు శక్తిని హరించే పద్ధతికి అలవాటు పడినారు, మనం ఇప్పుడు దీని గురించి మాట్లాడుకుందాం.

నిజానికి ఇది చాలా పెద్ద అంశం మరియు కష్టమైన అంశం కూడా. సాధారణంగా మానవులు వారి జీవితంలో చాలా సమస్యలను కలిగి ఉంటారు మరియు నిజానికి ఈ సమస్యలు ఎక్కడ నుంచి వస్తున్నాయనేది వీరికి ఖచ్చితంగా తెలియదు. శక్తిపరంగా తరచూ ఇతరులు మీ శక్తిని తీసుకోవడం వలనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పుడు మేము దీని పట్ల ఎరుకను మరియు దీనిని కొత్త పద్ధతిలో చూడగలిగే దృక్పథాన్ని, మీకు అందించగలమని ఆశిస్తున్నాం.

మొదటిగా మా గురించి తెలియని వారికి, అంటే క్రిమ్‌సన్ సర్కిల్, లేదా లిండా మరియు నా గురించి తెలియని వారికి, మమ్మల్ని మేము పరిచయం చేసుకోవాలని అనుకుంటున్నాం. నేను, లిండా గత 10సం॥గా ఆధ్యాత్మికత మరియు దివ్యత్వం యొక్క అంశాలపై వర్క్‌షాప్స్‌ను మరియు సెమినార్స్‌ను నిర్వహిస్తున్నాం. మేము ఈ 10సం॥గా 25 దేశాలలో పర్యటించాం మరియు మేము సంవత్సరానికి 1,25,000 మైళ్ళు ప్రయాణిస్తున్నాం. మేము ఈ వర్క్‌షాప్స్‌లో ఆధ్యాత్మిక మేల్కొల్పు గురించి, న్యూ ఎనర్జీలో జీవించడం గురించి, మానవుడు-దివ్యత్వం-ఉన్నతమైన చైతన్యాల యొక్క కలయిక గురించి మాట్లాడుతుంటాం. మేము ఈ గడిచిన కాలంలో చాలామంది మనుష్యులతో పని చేశాం మరియు వారి జీవితంలో వారు అనుభవించిన శారీరక, మానసిక మరియు మనోభావపరమైన దౌర్జన్యాలకు సంబంధించిన వారి కథలను మాతో పంచుకున్నారు. అందువలన మేము 2006లో శారీరక దౌర్జన్యానికి గురైన బాధితుల కోసం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్‌ని ఏర్పాటుచేశాం. మేము ఇప్పుడు ఈ వర్క్‌షాప్‌నే "సెక్సువల్ ఎనర్జీ స్కూల్"గా పిలుస్తున్నాం. ఈ వర్క్‌షాప్ పట్ల మీరు అభిప్రాయాన్ని ఏర్పర్చుకునే ముందు, మేము ఇది సెక్స్ గురించి కాదని, ఇది మన అంతరంలోని స్త్రీ-పురుష తత్వాల మధ్య ఉన్న సమన్వయాలోపం గురించి అని మీకు తెలియజేస్తున్నాం. ఈ సమన్వయాలోపం వలన ఉద్భవించే అనుభూతులే ఈ దౌర్జన్యకరపు శక్తులకు కారణమవుతున్నాయి. మేము ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు, మేము అర్థం చేసుకున్న విషయం ఏమిటంటే, ఈ "సెక్సువల్ ఎనర్జీ స్కూల్" అనేది సెక్సువల్ పరమైన దౌర్జన్యాలకు గురైన వారికే కాకుండా, ఇది భౌతిక, మానసిక లేదా మనోభావపరమైన దౌర్జన్యాలకు గురైన వారికి కూడా ఉపయోగపడుతోందని

మేము స్పష్టంగా తెలుసుకున్నాం. మేము ఈ వర్క్‌షాప్‌ను చాలా దేశాలలో చేశాం, దీనిలో 20,000మంది పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న 70శాతం మంది ఇది వారి జీవితాన్ని మార్చేదిగా ఉందని మాకు తెలియజేసారు. అందువలన నేను క్రిమ్‌సన్ సర్కిల్ తరపున చెప్పదల్చుకున్నది ఏమిటంటే, మేము వివిధ రకాల దౌర్జన్యకరమైన సమస్యలకు గురైన మనుష్యులతో వ్యవహరించడంలో మాకు చాలా అనుభవం ఉందని మరియు ఈ సమస్యలకు కారణం వీరి జీవితాలలో వీరి శక్తి హరింపబడడమే అని మేము తెలుసుకున్నాం.

మనం చర్చించుకోబోయే అంశంలో ఉపయోగించే పదాల గురించి ఇప్పుడు మాట్లాడుకుందాం. మేము హరించడం అనే పదాన్ని ఉపయోగిస్తాం, దీని అర్థం మరొక వ్యక్తి మీ నుంచి శక్తిని తీసుకోవడమే, దీనిని వారు ఉద్దేశ్యపూర్వకంగా చేయవచ్చు లేదా చేయకపోవచ్చు. వారి యొక్క శక్తిత్రాడులు మీలో ఉంటాయి. వీటి ద్వారానే వారు మీ శక్తిని హరిస్తున్నారనే విషయాన్ని మీరు తెలుసుకోండి. ఇది వారికి తాత్కాలికమైన ఉపశమనాన్ని లేదా సంతృప్తిని అందిస్తుంది, కాని ఈ సంతృప్తి అనేది చాలాకాలం ఉండదు మరియు వీరు ఆ తర్వాత తిరిగి శక్తిని హరించడం కొనసాగించాలి.

ఇప్పుడు మనం ఉపయోగించబోయే "ఎనర్జీ వైరస్" అనే పదం గురించి మాట్లాడుకుందాం. నిజానికి మనం దీని గురించి చాలా ఎక్కువ సేపు మాట్లాడుకోవచ్చు. మీరు దీనిని చైతన్యం యొక్క వైరస్‌గా కూడా పిలువవచ్చు. ఇది భౌతిక శరీరానికి జలుబు/దగ్గు ఎలాంటిదో, చైతన్యానికి ఈ ఎనర్జీ వైరస్ అలాంటిది. మీ ప్రతి ఒక్కరిలో ఉన్న స్త్రీ-పురుష శక్తుల యొక్క సమన్వయాలోపం వలనే ఇది ఏర్పడింది. ఈ వైరస్ అన్నది ఏ ఒక్కరికో సంబంధించినది కాదు, ఇది విశ్వమంతటా వ్యాపించి ఉంది. ఇది సర్వసాధారణమైనది. నిజానికి ఇదే మనుష్యులు ఇతరుల యొక్క శక్తిని హరించడానికి కారణమవుతోంది. ఈ విషయం వారికి తెలిసినా లేదా తెలియకపోయినా కూడా ఇదే అసలైన కారణం.

మనం ఈ అంశంలో బాధితుడు మరియు నేరస్థుడు అనే పదాలను కూడా ఉపయోగిస్తాం. కొంతమంది మసుష్యులు ఈ పదాలను ఉపయోగించామని వాదించవచ్చు, కాని సులభంగా అర్థమవ్వడం కోసమే వీటిని ఉపయోగిస్తున్నాం, బాధితుడు అంటే తన జీవితంలో దౌర్జన్యానికి గురైనవాడు, మరియు నేరస్థుడు అంటే దౌర్జన్యాన్ని బయటకు ప్రదర్శించేవాడు. ప్రతీ మనిషి ఏదో ఒక రకంగా బాధితుడుగాను మరియు నేరస్థుడిగాను కూడా ఉంటాడు.

మేము ఆత్మ అనే పదం గురించి కూడా మాట్లాడబోతున్నాం, ఆత్మలు అంటే మా ఉద్దేశ్యం, భౌతిక ఆకృతి లేని జీవులు. ఇవి మన చుట్టూ ఉంటాయని నేను నమ్ముతాను. మన చుట్టూ దివ్యాత్మలు ఉంటాయి. వీటిలో కొన్ని చాలా చాలా ఉన్నతమైన చైతన్యంతో ఉంటాయి, ఇవి మనకు సహాయం చేయడానికే ఉంటాయి మరియు ఇవి మనతో కలిసి పని చేస్తాయి. కాని, కొన్ని ఆత్మలు భౌతిక ఆకృతిలో లేనప్పటికీ మన చుట్టూ వ్రేళ్ళాడుతూ మన శక్తిని హరిస్తుంటాయి. ఇవి ఒక విధమైన మానసిక ఒత్తిడిని కలుగజేస్తాయి. మాతో మాట్లాడిన చాలామంది, ఇటువంటి అనుభవాలను కలల ద్వారా పొందామనే విషయాన్ని మాకు చెప్పారు. ఈ ఆత్మలు మీ కలల్లోకి రాగలవు. అలాగే వేరే మనుష్యులు కూడా మీ కలల్లోకి రాగలరు. ఇవన్నీ వివిధ రకాల మానసికపరమైన దౌర్జన్యాలకు కారణమవుతున్నాయి.

నేను వ్యక్తిగత ప్రేమ మరియు కరుణ గురించి కూడా మాట్లాడబోతున్నాను. వ్యక్తిగత ప్రేమ అంటే మిమ్మల్ని మీరు అంగీకరించుకోవడమే, మరియు మీరు ఎవరనే దానిని, మీరు చేసే ప్రతీ పనిని, మీ యొక్క ప్రతీ అంశాన్ని ప్రేమించుకోగలగడమే. దీని అర్థం నిజానికి మీ ప్రేమలో మీరు పడడమే అని. మొదటిగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోనట్లయితే, మీరు ఇతరులను ఎలా ప్రేమించగలరు మరియు ఇతరులతో మీ ప్రేమను ఎలా పంచుకోగలరు. నేను ఇప్పుడు కరుణ అంటే ఏమిటో మీకు వివరిస్తాను. నా ఉద్దేశ్యంలో కరుణ అంటే సృష్టిలో ఉన్న విషయాలన్నింటిని ఉన్నదిఉన్నట్టుగా అంగీకరించడమే. మిమ్మల్ని మీరు పూర్తిగా అంగీకరించడం అంటే, మీరు మంచి లేదా చెడుగా నిర్ణయిస్తున్న విషయాలన్నింటిని యధాతథంగా అంగీకరించడమే మరియు అదే విధంగా ఇతరుల యొక్క మార్గాన్ని కూడా పూర్తిగా అంగీకరించడమే. అడామస్ సేంట్ జెర్మైన్ చెప్పినట్టుగా: 'సృష్టి అంతా సరిగానే ఉంది' అనే విషయాన్ని మనం అర్థంచేసుకోవాలి. ఈ పైన చెప్పుకున్న పదాలన్నింటిని మనం ఉపయోగించబోతున్నాం.

ఇక్కడ రెండు ముఖ్యమైన గమనికలు ఏమిటంటే, మనం మీ జీవితంలో ఉన్న కొంతమంది శక్తి హరులను ఇప్పుడు అన్వేషించబోతున్నాం మరియు మేము మిమ్మల్ని వారు ఎవరనే దాని గురించి ఆలోచించి పేపర్ మీద వ్రాయమని అడుగుతున్నాం. కాని, దయచేసి వారిని నిందించ వద్దని మిమ్మల్ని అడుగుతున్నాం, ఎందుకంటే ఇలా నిందించడం కూడా మీ శక్తి హరించడానికి కారణమవుతుంది కనుక. మీరు ఇతరులను నిందించడం మొదలుపెట్టినప్పుడు, మీరు పూర్తిగా బాధితుడి యొక్క వలయంలో ఇరుక్కుపోతారు. మేము ఇక్కడ చెప్పడానికి ప్రయత్నిస్తున్నది ఏమిటంటే, శక్తి హరించడాన్ని లేదా శక్తి హరులను ఏ మాత్రం నిందించకుండా, దీని పట్ల పూర్తి ఎరుకను మిమ్మల్ని పొందమనే. ఈ విధంగా చేయడానికి వారిని

అనుమతిస్తున్నది ఒక విధంగా మీరే అని చెప్పవచ్చు. కాబట్టి మీరు వారిని ఎలా నిందించగలరు.

మీరు ఒక శక్తి హరుడిగా ఎలా ఉన్నారనే విషయం మీద ఇప్పుడు మనం దృష్టిని కేంద్రీకరిద్దాం. మీ శక్తిని ఎవరైనా హరిస్తున్నట్లయితే, త్వరలోనే మీరు కూడా ఇతరుల శక్తిని హరించడం ఆరంభిస్తారు. ఇది శక్తిని సంగ్రహించడానికి మానవులు ఉపయోగించే ఒక పద్ధతి. మీరు శక్తిని హరించడానికి ఉపయోగించే కొన్ని మార్గాలను పరిశీలించినప్పుడు, 'నేను శక్తిని హరించడం కోసం ఇంత భయంకరమైన వ్యక్తిగా వ్యవహరించానా' అని మీపై మీరు కోపాన్ని తెచ్చుకోవద్దని లేదా మిమ్మల్ని మీరు నిర్ణయించుకోవద్దని లేదా బాధించుకోవద్దని మేము మిమ్మల్ని అడుగుతున్నాం. ప్రతి ఒక్కరూ చేసేది ఇదేనని మీరు తెలుసుకోండి. మేము మిమ్మల్ని చేయమని అడుగుతున్నది ఏమిటంటే, దీనికి పూర్తి వ్యతిరేకంగా అంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం ఆరంభించమని.

ఇప్పుడు లోతుగా ఒకసారి శ్వాసను తీసుకుంటూ, మీ పట్ల మీరు ప్రేమను అంతరంలో అనుభూతి చెందండి. ఇక్కడ పరిగణలోకి తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన సిద్ధాంతాలు. మొదటి సిద్ధాంతం, సృష్టిలో ఉన్న మానవులు తప్ప మిగతావన్నీ శక్తి రూపాలే. మనం చైతన్యం లేదా ఎరుక యొక్క ప్రతిరూపాలం. కాని మన చుట్టూ ఉన్న ప్రతీది కూడా శక్తి స్వరూపమే. మన చుట్టూ ఉన్న గాలిలో శక్తి ఉంది, మన చుట్టూ భౌతిక ప్రపంచమంతా శక్తి ద్వారానే తయారు చేయబడింది. మన ఆలోచనలలో, మన ఊహాశక్తిలో, మన కలల్లో శక్తి ఉంటుంది, ఇవన్నీ కూడా శక్తి స్వరూపాలే. మీరు వీటిని చూడగలితే, ఇవి శక్తి తరంగాలుగా మన చుట్టూ తిరుగాడుతుంటాయి. ప్రస్తుతం ఈ టెలీక్లాస్‌లో కూడా అధిక పరిమాణంలో శక్తి తిరుగాడుతోంది. లిండా మరియు నేను, మా శక్తిని మీతో పంచుకుంటున్నాం. ఈ శక్తి, తరంగాల రూపంలో వస్తుంది. ఇది మీ దగ్గరకు కరుణ, గౌరవం యొక్క తరంగాలుగా వస్తుంది. ఇప్పుడు మీరు కూర్చుని ఆలోచిస్తున్నది ఏదైనప్పటికీ కూడా, అది శక్తి తరంగాల రూపంలో బయటకు వస్తుంది. మీ చుట్టూ ఉన్న గాలిలో శక్తి ఉంది, సామూహిక చైతన్యంలో కూడా శక్తి ఇమిడి ఉంది. సృష్టి అంతటా శక్తి ఉంది. ఇతరులు మీ దగ్గరకు వస్తూ మీ శక్తిని ఎలా సంగ్రహిస్తున్నారనేది మీరు అర్థం చేసుకోవడానికి, ఈ మొదటి సిద్ధాంతం మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

రెండవ సిద్ధాంతం, మన చుట్టూ అధిక పరిమాణంలో శక్తి ఉంది. మన చుట్టూ శక్తి పుష్కలంగా ఉంది. ఈ సృష్టి అంతా అనంతమైన శక్తితో ఏర్పడింది. కాబట్టి ఈ సందర్భంలో మేము శక్తి గురించి చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే,

మీకు అవసరమైన దాని కంటే ఎక్కువ శక్తి ఉందని భయపడవద్దు మరియు మీరు కలిగి ఉన్న శక్తి 2 లేదా 5 సంIIలలో మాయమై పోతుందేమోనని కూడా భయపడవద్దు. మన సృష్టిలో అనంతమైన శక్తి ఉంది, ఇది ప్రతి ఒక్కరికి అధిక పరిమాణంలో అందుబాటులో ఉంది.

మరొక ముఖ్యమైన సిద్ధాంతం ఏమిటంటే, మీకు అవసరమైన ప్రతీది మీ అంతరంలోనే ఉంది. దీని అర్థం మీకు కావలసిన శక్తి, సమాధానాలు, పరిష్కారాలు, మీ ప్రజ్ఞాత్మతో మరియు మూలచైతన్యంతో బంధం మొదలైనవన్నీ కూడా మీలోపలే ఉన్నాయి. మన ప్రయాణంలో అతి ముఖ్యమైన భాగం, మన ప్రజ్ఞాత్మతో లేదా మూలచైతన్యంతో బంధాన్ని తిరిగి కనుగొనడమే, లేదా మన నిజతత్వాన్ని తెరుస్తూ దానిని విస్తరింపజేయడమే. కాబట్టి ప్రతీది మన అంతరంలోనే ఉందని, మనకు కావలసిన వాటికోసం బాహ్యంగా ప్రయత్నించవలసిన అవసరం లేదనే విషయాన్ని మరొకసారి మనం గుర్తించాలి. నిజానికి ఇదంతా ప్రతీది అంతరంలోనే ఉందనే విషయాన్ని గుర్తుచేసుకోవడం గురించే.

మరొక సిద్ధాంతం: మీరు అనుమతిస్తే గాని, మీ నుంచి ఇతరులు శక్తిని తీసుకోలేరు. ఎవరైతే మీ శక్తి ద్వారా పోషింపబడుతున్నారో, వారే మీ జీవితంలోని శక్తి హరులు. వారు కేవలం మీ శక్తిని హరించడమే కాకుండా, వారు మీ డబ్బుని మరియు మీ సంతృప్తికరమైన స్థితిని కూడా హరిస్తున్నారు. మీరు ఏదో ఒక స్థాయిలో మీ అంతరంలో అనుమతిస్తున్నందు వలనే ఇది జరుగుతోంది.

ఆఖరి సిద్ధాంతం, మీరు ఏ స్థితిలోనైనా కూడా ఎరుకతో ఈ శక్తి హరింపు ఆగిపోవాలని ఎంచుకోవచ్చు. ఇతరులు మీ శక్తిని లేదా మీరు ఇతరుల శక్తిని హరిస్తున్నా కూడా, మీరు ఈ శక్తి హరింపు ఆగిపోవాలని ఎరుకతో ఎంచుకోవచ్చు. ఇది చాలా సులభం. కాని మీరు ఈ ఎంపిక పట్ల జాగ్రత్త వహించండి, ఎందుకంటే దీని వలన మీ జీవితం మార్పు చెందుతుంది కనుక. మీరు ఎరుకతో గమనిస్తే చాలు ఈ శక్తి హరింపులో మార్పులు రావడం ఆరంభమవుతాయి. ఇది మీ బాంధవ్యాలను మార్పు చెందిస్తుంది. ఎందుకంటే ఇకపై మీ బాంధవ్యాలు ఈ శక్తి హరింపుపై ఆధారపడి ఉండవు కాబట్టి. మీ నుంచి ఇతరులు లేదా ఇతరుల నుంచి మీరు శక్తిని హరించే ఈ పద్ధతి పైన, ఇకపై బాంధవ్యాలు ఆధారపడి ఉండకపోవడం వలన, మీ మొత్తం బంధాలన్నీ మార్పు చెందడం మీరు గమనిస్తారు. మీరు ఈ మనుష్యులను ఇకపై మీ ద్వారా పోషింపబడడానికి అనుమతించక పోవడం వలన, వారిని వారు పోషించుకోవడానికి మరొక వ్యక్తి దగ్గరకి వెళ్తూ మరియు ఆ వ్యక్తి నుంచి శక్తిని హరించడం ఆరంభిస్తారు. ఈ ఎంపిక వలన నిజానికి మీ బాంధవ్యాలన్నీ ఉన్నతంగా

రూపొందుతాయి లేదా మీరు ఈ విధమైన హరింపు ప్రక్రియనే అధిగమిస్తారు మరియు మీ బాంధవ్యాలలో మీరు ముందెన్నడూ చూడని సంపూర్ణమైన సౌందర్యాన్ని కనుగొంటారు. ఈ శక్తి హరింపు ఆగిపోవాలని ఎరుకతో ఎంపిక చేసుకోమని చెప్పడం చాలా చిన్న విషయంగా అనిపించవచ్చు. కాని దీనివలన మీ జీవితం మొత్తం మార్పు చెందుతుంది.

శక్తి హరులు అంటే ఎవరు? మనం ముందు చెప్పుకున్నట్టుగా ఈ పదం వినడానికి కొంచెం వింతగా ఉంటుంది. కాని శక్తి హరులు అంటే మీ నుంచి శక్తిని హరించేవారు అని, ఈ మనుష్యుల యొక్క శక్తి త్రాడులు మీలో ఉంటాయి. ఈ త్రాడుల ద్వారా వీరు మీ శక్తిని హరిస్తారు. మనం ముందు చెప్పుకున్నట్టుగా వీరు దీనిని జాగరుకతావస్థలో చేయవలసిన అవసరం లేదు. వీరు శక్తిని పొందడం కోసం ఇలాంటి పద్ధతులను అవలంభిస్తున్నారు. మీరు మీ భౌతిక శరీరాన్ని పోషించుకోవడానికి ఆహారాన్ని ఎలా అయితే తీసుకుంటారో అదే విధంగా మీ యొక్క చైతన్యం భూమి మీద జీవించడానికి శక్తిని పొందాల్సిన అవసరం ఉంది. కాని దీని కోసం తరచూ మానవులు ఇతరుల యొక్క శక్తులను హరిస్తున్నారు. వీరు శక్తిని హరించడానికి వివిధ రకాల రూపాలలో మీ దగ్గరకు వస్తారు. మీ జీవితంలో మీరు అతి సన్నిహితులుగా భావిస్తున్న వ్యక్తులు, మీరు కలిసి పనిచేస్తున్న వ్యక్తులు మరియు భౌతిక శరీరంలో లేని ఆత్మలు – ఇలాంటి రూపాలలో మీ దగ్గరకు రావచ్చు.

కాబట్టి మీ జీవితంలో, మీ శక్తిని వేరొకరు హరిస్తున్నట్లయితే దానిని మీరు ఎలా తెలుసుకోగలరు మరియు మీ జీవితంలో శక్తి హరులు ఉన్నట్లయితే వారిని మీరు ఎలా గుర్తించగలరు? దీనిని గుర్తించడంలో మొదటి లక్షణం, ఈ మనుష్యులతో మీరు గడిపిన తర్వాత అలసటను మరియు అవిశ్రాంతిని అనుభూతి చెందుతారు. మీరు గతంలో ఎవరితోనైనా సంభాషించినప్పుడు, దీనిని అనుభూతి చెందారా? నేను దీనిని సంభాషణ అని కూడా పిలవాలని అనుకోవడం లేదు. వీరు మీతో మాట్లాడి వెళ్ళిన తర్వాత, మీరు అలసటను అనుభూతి చెందుతారు మరియు మీరు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటూ హమ్మయ్య వీరు వెళ్ళిపోయారు అని అనుకుంటారు. వీరు చెబుతున్న మాటలకు మీరు ప్రభావితం చెందుతున్నప్పుడు, వీరు ఏదో ఒక స్థాయిలో మీ అంతరంలోకి వెళ్తూ మీ శక్తిని హరిస్తారు. అందుకనే మీరు, ఈ మనుష్యులు వెళ్ళిన తర్వాత అలసటను మరియు అవిశ్రాంతిని అనుభూతి చెందుతారు.

మీరు ఎల్లప్పుడూ అలసటను పొందడం అనేదే ఈ శక్తి హరింపుకు ఒకానొక అతిపెద్ద సంకేతంగా ఉంటుంది. ఇటువంటి మనుష్యులతో మీరు ఉన్నప్పుడు మరియు

వీరు వెళ్ళిన తర్వాత, మీరు తీవ్రమైన అలసటను అనుభూతి చెందడం మీకు స్పష్టంగా తెలుస్తుంది. నిజానికి ఇక్కడ మనం పరిగణించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఇదే. మీరు అలసటను పొందినప్పుడు, మీరు కూడా కొంత శక్తిని సంగ్రహించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. మీరు దీనిని జాగరుకతతో చేయవచ్చు లేదా చేయకపోవచ్చు.

మనం ఎరుకను పొందాల్సిన మరొక లక్షణం, మరొక విషయం. మీరు ఎవరితోనైనా కొంత సమయం గడిపిన తర్వాత లేదా ఎవరితోనైనా ఉన్నప్పుడు, మీ ఒళ్ళంతా చల్లబడుతూ మరియు అంతరంలో ఖాళీ అయిపోతున్న అనుభూతిని పొందుతున్నట్లయితే, మీ నుంచి శక్తి మళ్ళీ హరింపబడుతోందని అర్థం. ఇది మీ శక్తిని క్షీణింపజేస్తూ, మిమ్మల్ని మీ ఆత్మ కేంద్రం నుంచి బయటకు వచ్చేలా చేస్తుంది. చాలామంది బలానికి విటమిన్స్ తీసుకుంటారని మీకు తెలుసు. ఈ మనుష్యులు వారిని వారు తిరిగి శక్తివంతం చేసుకోవడం కోసమే ఇటువంటి ప్రత్యామ్నాయ విటమిన్‌లను తీసుకుంటారు. కాని, ఎవరైనా మీ దగ్గరకు వస్తూ మీ శక్తిని పీలుస్తున్నట్లయితే, ఇటువంటి విటమిన్స్ మీకు ఏ మాత్రం సహాయం చేయలేవు.

మరొక లక్షణం, మీ జీవితంలోని కొంతమంది వ్యక్తులు మీకు ఇష్టంలేని పనులను మీ చేత బలవంతంగా చేయిస్తారు. ఈ పనులు మీకు ఇష్టం లేకపోయినప్పటికీ, వీటిని మీరు బలవంతంగా కొనసాగిస్తారు. 'నన్ను నేను ఎందుకు ప్రేమించుకోలేకపోతున్నాను లేదా నేను ఈ విషయాల్లోకి బలవంతంగా ఎందుకు తోయబడుతున్నాను' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటూ ఒక విధమైన నిరాశకు లోనవుతారు. ఎందుకంటే నిజానికి ఈ వ్యక్తులు మిమ్మల్ని ఒక విధమైన శక్తి హరింపుకు మరియు ఒత్తిడికి లోనయ్యేలా చేస్తారు కనుక మరియు మీరు వీటి ద్వారా పయనిస్తున్నారు.

మరొక లక్షణం, ఇతరుల యొక్క బాధ్యత లేదా భద్రతకు అధికంగా ప్రభావితం చెందడమే. చాలాసార్లు, మీపై ఇతరులు భారాన్ని వేస్తుంటారు, కాని ఇది మీకు సంబంధించినది కాదని మీరు తెలుసుకోండి. ఉదా: నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నట్లయితే, నా కోసం ఇది చెయ్యాలి లేదా నువ్వు చేసినట్టుగా ఎవ్వరూ నా కోసం చేయలేరు అని మీ భాగస్వామి మీపై భారాన్ని వేయవచ్చు. ఇదే శక్తిని హరించడమంటే. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు ఇటువంటి పరిస్థితి నుంచి బయటకు రాలేనట్టుగా అనుభూతి చెందుతున్నట్లయితే, ఈ శక్తి హరింపు కొనసాగుతోందని అర్థం. దీని వలనే మీరు అలజడిని లేదా గందరగోళాన్ని అనుభూతి చెందుతారు. మీరు మీ జీవితంలో కొన్ని మార్పులను సృష్టించుకోవాలని కోరుకుంటారు, కాని మీకు వాటిని ఎలా వాస్తవంలోకి తీసుకురావాలో తెలియదు. మీరు ఈ సందిగ్ధ

స్థితిలో ఇరుక్కుపోయినట్టుగా అనుభూతి చెందవచ్చు. మీకు దీని పట్ల మానసికపరమైన స్పష్టత లేదు. ఎందుకంటే, హరించడం అనేది మానసిక, భౌతిక, మనోభావపరమైన స్థాయిలలో సంభవిస్తోంది కాబట్టి. అందుకనే మిమ్మల్ని మీరు ఒక సందిగ్ధ స్థితిలో కనుగొంటారు.

"ఈ శక్తి హరులు ఎవరై ఉండవచ్చు?" అనే దాని గురించి ఇప్పుడు మనం మాట్లాడుకుందాం. ఇక్కడ ముఖ్యమైన హెచ్చరిక ఏమిటంటే, ఇది కేవలం మీ జీవితంలోని బాంధవ్యాలను పరిశీలించడానికి సంబంధించినదే గాని, ఇది ఇతరులను నిందించడానికి సంబంధించినది కాదు. మీ జీవితంలో మీరు తరచూ ఆకర్షిస్తున్నది మీ భాగస్వామినే. మిమ్మల్ని మీరు అసంపూర్తిగా భావించడం వలన మీరు పెళ్ళి చేసుకుని ఒక బంధంలోకి ప్రవేశించాలని అనుకుంటారు. మీ భాగస్వామి మిమ్మల్ని ప్రేమిస్తున్నప్పటికీ, వీరు కొన్ని విషయాలలో మీ నుంచి శక్తిని హరిస్తూ ఉంటారు. దీనిని వీరు ఉద్దేశ్యపూర్వకంగా చేయాలని అనుకోనప్పటికీ కూడా, ఇది సంభవిస్తోంది.

మీరు మీ పిల్లల్ని ప్రేమిస్తారని నాకు తెలుసు. ఈ ప్రేమ, మిమ్మల్ని కొన్నిసార్లు పిచ్చిగా ప్రవర్తించేలా చేస్తుంది. మీ పిల్లలు కూడా మీ శక్తిని హరించే మార్గాన్ని కలిగి ఉంటారు. మీ హృదయంలో పిల్లల పట్ల ప్రేమను కలిగి ఉండడం వలన, మీరు దీనిని అనుమతిస్తున్నారు. ఈ రోజు ఈ టెలీక్లాస్‌ను వింటున్న మీలో చాలామంది ఈ విధంగా అనుకోవచ్చు: నేను అదనపు శక్తిని కలిగి ఉండడం వలనే నా నుంచి శక్తిని తీసుకోవడానికి ఇతరులను అనుమతిస్తున్నాను అని. మనం ఈ శక్తి హరింపును అనుమతిస్తున్నందు వలనే ఇది అధికంగా సంభవిస్తోందనే విషయాన్ని మీ మనసులో ఉంచుకోండి. పిల్లలు దీనిని ఉద్దేశ్యపూర్వకంగా చేయవలసిన అవసరం లేదు. ఇది సహజంగానే సంభవిస్తుంది మరియు మనమే దీనిని అనుమతిస్తున్నాం.

నిజానికి తల్లిదండ్రులు కూడా పిల్లల నుంచి శక్తిని హరిస్తుంటారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వృద్ధులైన తర్వాత వారి పిల్లల నుంచి శక్తిని హరించడం మొదలుపెడతారు. తల్లిదండ్రులు వారి పిల్లలకే పిల్లలుగా ప్రవర్తిస్తూ, వారి మీద భారాలను లేదా బాధ్యతలను మోపుతూ, పిల్లల శక్తిని హరిస్తారు. అందువల్ల తల్లిదండ్రులు తరచూ మీ నుంచి శక్తిని హరించే మార్గాన్ని కలిగి ఉంటారు. నా సొంత వ్యక్తిగత జీవితమే దీనికి ఒక ఉదాహరణ, నేను చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు, నేను నా కుటుంబ భారాన్ని మోసాను. నేను నా జీవితంలో నాకు ఆనందాన్ని ఇచ్చే నిర్ణయాలను కాకుండా, నా తల్లిదండ్రులకు సహాయం చేయడానికి ఉపయోగపడే నిర్ణయాలను తీసుకున్నాను. కాని చివరిగా ఎవరి బాధ్యత వారే తీసుకోవాలని నేను తెలుసుకున్నాను. నేను కొంతకాలం ఈ విధమైన శక్తి హరింపులో ఇరుక్కుపోయి ఉన్నాను. నేను ఈ

హరింపును విడుదల చేసిన తర్వాత నా తల్లిదండ్రులను పూర్తి ప్రత్యేకమైన పద్ధతిలో చూడడం నేర్చుకున్నాను. నేను కేవలం శక్తి హరింపును అనుమతించక పోవడం ద్వారా, నిజానికి వారు ఎవరనే దానిని నేను అర్ధం చేసుకున్నాను.

మీరు ప్రాణ స్నేహితులుగా భావిస్తున్న వారి దగ్గర, శక్తి హరింపు చాలా సార్లు సంభవిస్తుంది. ముఖ్యంగా స్నేహితులు వారి యొక్క భారాన్ని మీపై పడవేస్తూ, అంటే వారి సమస్యలు మరియు వారి వాగ్దానాల గురించి మీకు చెబుతూ వారి యొక్క భారాన్ని మీపై పడవేస్తుంటారని తెలుసుకోండి! మీరు వీటిపట్ల ఎలా అనుభూతి చెందుతున్నారు అని వారు మిమ్మల్ని అడగడం మీరు ఎప్పుడైనా గమనించారా? వారు వారి సమస్యలకు పరిష్కారాలను కలిగి ఉన్నారా, లేక వారు వారి సమస్యలను మీపై పడవేయాలని ప్రయత్నిస్తున్నారా? వారు మీతో మాట్లాడుతున్నప్పుడు మీ కళ్ళలోకి వారు చూస్తున్నారా, లేదా మీరు అక్కడ ఉన్నట్టు కనీసం వారు ఎరుకలో ఉన్నారా? తరచూ ఈ శక్తి హరులకు వారు ఎవరి నుంచి శక్తిని హరిస్తున్నారన్నది వారికి అంత ముఖ్యం కాదు. ఈ మనుష్యులకు కేవలం వారి భారాలను పడవేయడానికి ఎవరో ఒకరు కావాలి మరియు ఇది చేయడానికి మీరే వారిని అనుమతిస్తున్నారు.

మీరు పని చేసే ఆఫీసులు ఈ హరింపు జరగడానికి అద్భుతమైన స్థలంగా ఉంటున్నాయి. అంటే నా ఉద్దేశ్యం, వ్యాపార ప్రపంచానికి సంబంధించిన వ్యవహారాలన్నీ ఇక్కడ చురుకుగా జరుగుతుంటాయి. మీరు ఇక్కడ రకరకాల మనుష్యులతో పని చేస్తారు. ఒకానొకప్పుడు, నేను ఒక బాస్ క్రింద పని చేసాను, అతను పెద్ద ఎత్తున ఇతరుల శక్తిని హరిస్తుండేవాడు. నేను ఈ శక్తి హరింపు నుంచి బయటకు వచ్చిన తర్వాత, నిజానికి ఇది ఏమిటనేది అర్ధం చేసుకున్నాను. అతను ఇతరులపై ఒత్తిడిని కలుగజేస్తూ శక్తిని హరిస్తుండేవాడు. అతను కంపెనీలో మనుష్యుల మీద ఒత్తిడిని కలుగజేయడాన్ని చాలా ఇష్టపడేవాడు మరియు దీని వలన వీరు ఒక విధమైన అసౌకర్యానికి లోనయ్యేవారు, ఈ స్థితియే వీరి యొక్క శక్తిని హరించడానికి అతనిని అనుమతిస్తోంది. ఈ శక్తి హరింపే అతడిని గొప్పవాడిలా అనుభూతి చెందేలా చేసేది. అతను కంపెనీలో మనుష్యులను చులకన చేస్తూ, వారిని అవమానపరుస్తుండేవాడు. ఎప్పుడైతే మనుష్యులు ఈ విధమైన చులకన భావనలో ఉంటారో అప్పుడు ఏమి జరుగుతుందనేది మీ అందరికి తెలుసు! మీరు ఇటువంటి మాటలకు గాయపడినప్పుడే, ఇతరులు మీ శకిన్తి హరించడం సాధ్యమవుతుంది.

ఇక్కడ ఒకసారి లోతుగా శ్వాసను తీసుకోండి. మీకు తెలిసిన వారు లేదా మీ బంధువులు చనిపోయిన తర్వాత వేరే తలాలకు వెళతారు. చనిపోయిన వారి యొక్క ఆత్మలు కూడా మన నుంచి శక్తిని హరిస్తుంటాయి. వీరు చనిపోయినప్పటికీ,

వీరి యొక్క కుటుంబం లేదా భూమి మీద జీవితానికి సంబంధించిన వ్యవహారాలను పట్టుకుని వ్రేళ్ళాడుతుంటారు. వీరు ఒక విధమైన మానసికపరమైన శక్తి హరింపును కొనసాగిస్తూనే ఉంటారు. వీరు ఆవలివైపుకు వెళ్ళినప్పటికీ, మీరు వీరికి సంబంధించిన ఆశ్చర్యకమైన కలలను పొందుతున్నా, లేక వీరి ఉనికిని ప్రేమపూర్వకమైన మార్గంలో కాకుండా అవసరమనే రీతిలో మీరు అనుభూతి చెందుతున్నా, మీరు శక్తి హరింపుకి లోనవుతున్నట్టే.

మీకు తెలియని ఆత్మలు మీ చుట్టూ కదలాడుతుంటాయి. ఇవి కూడా చాలాసార్లు మీ శక్తిని హరిస్తుంటాయి. ఇవి మీ జీవితంలోకి మానసికపరమైన పద్ధతి ద్వారా చొరబడుతుంటాయి. మీలో ఒక భాగం ఇది జరగడానికి అనుమతిస్తోంది. దీని వలనే ఈ ఆత్మలు మీ శక్తిని హరిస్తున్నాయి. ఆత్మలు మీ లోపలకి వచ్చి మీ శరీరాన్ని ఆక్రమించడం గురించి మీరు వినే ఉంటారు, కాని నేను ఇటువంటి ఆత్మల గురించి ఇక్కడ మాట్లాడడం లేదు. మనం ఈ అంశం గురించి మరొక టెలీక్లాస్‌లో మాట్లాడుకుందాం. నిజానికి ఇటువంటి ఆత్మలు మీ నుంచి అధికంగా శక్తిని హరిస్తాయి.

మీరు ప్రశాంతంగా కూర్చుని, మీ జీవితంలో మీరు ఎవరి నుంచైతే శక్తిని హరిస్తున్నారో వారిని ఇప్పుడు గుర్తించడానికి ప్రయత్నించండి. మీ భారాలను మరియు మీ సమస్యలను మోస్తున్న వ్యక్తులు ఎవరైనా మీ జీవితంలో ఉన్నారా, మీరు పరిష్కారాలను వెతక్కుండా ఎవరి దగ్గరకైనా వెళ్తున్నారా, మీరు అనుకోకుండా ఎవరినైనా ఒత్తిడికి గురిచేస్తున్నారా మరియు మీరు మీ జీవితంలో ఎవరినైనా బాధపెడుతున్నారా – ఈ వ్యక్తులందరిని గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నించండి.

లిండా: ఇప్పుడు ఒకసారి లోతైన శ్వాసను తీసుకుంటూ, మీ జీవితంలో ఎక్కడైతే ఇటువంటి పరిస్థితులు సంభవించాయో అటువంటి వాటిని అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించుకోండి.

జాఫ్రీ: ఇవి ఎక్కడ సంభవించాయి, మీరు పని చేసే ఆఫీసుల్లోనా? మిమ్మల్ని ప్రేమించేవారి దగ్గరా? ఇక్కడ ఏదో ఒక రకంగా శక్తి హరింపు సంభవిస్తోందా? మీరు ఏదో ఒక స్థాయిలో బాధితులుగా ఉంటున్నట్లయితే, అంటే మీ శక్తిని హరించే వారి బాధితులుగాను, లేక భౌతికపరమైన దౌర్జన్యాలు–క్రూరత్వాల బాధితులుగాను, లేక శృంగారపమైన దౌర్జన్యాల బాధితులుగాను మీరు ఉంటున్నట్లయితే – మీరు కూడా ఇతరుల యొక్క శక్తిని దొంగిలిస్తారు, మీరు కూడా నేరస్థుడిగా ఉంటారు. ఎందుకంటే ఇతరులు మీ నుంచి శక్తిని హరిస్తున్నట్లయితే, త్వరలోనో లేదా ఆ తర్వాతనో మీరు కూడా ఇతరుల నుంచి శక్తిని లాక్కోవలసిన అవసరం ఉందని

అనుభూతి చెందుతారు కాబట్టి. ఇది చాలా సహజమైన సిద్ధాంతమని మీరు తెలుసుకోండి. మీరు దీనిని ఉద్దేశ్యపూర్వకంగా చేయడం లేదు, మీరు జీవించడం కోసమే శక్తిని హరిస్తున్నారనే విషయాన్ని మరొకసారి నేను మీకు చెబుతున్నాను.

లిండా: ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలని అనుకుంటున్నాను. అది ఇప్పుడున్న అంశానికి సరిగ్గా సరిపోతుంది. ఒకామె నాకు ఇంటర్‌నెట్ ద్వారా మెయిల్ పంపించింది, ఆమె ఇలా చెబుతోంది: "నేను దౌర్జన్యాలకు గురైన స్త్రీలకు ఆశ్రయాన్ని ఇచ్చే ఒక నివాసగృహంలో కౌన్సిలర్‌గా పని చేస్తున్నాను. నేను ఈ గృహంలో స్త్రీలు ఒకరి శక్తిని ఒకరు ఎలా హరిస్తున్నారనేది నేను గమనిస్తున్నాను, అదే విధంగా నేను వీరికి కౌన్సిలింగ్ చేస్తున్నప్పుడు, లేదా వీరితో ఒక గంట మాట్లాడిన తర్వాత మరియు నేను ఈ బాధితులతో పని చేసిన తర్వాత, లేదా వీరు ఆఫీస్‌ని వదిలి వెళ్ళినప్పుడు నేను మనోభావపరంగాను మరియు భౌతికపరంగాను అలసటను అనుభూతి చెందుతున్నాను." ఈ కౌన్సిలర్ స్పష్టంగా ఈ శక్తి హరింపును అనుభూతి చెందుతోంది. ఇక్కడ ఆమె ఎవరికైతే సహాయం చేయాలని ప్రయత్నిస్తోందో వారే శక్తిని హరిస్తున్నారు. అందువలన ఆమె తన శక్తి వీరి ద్వారా హరించుకుపోవడాన్ని అనుభూతి చెందుతోంది మరియు ఇక్కడ వారు ఒకరి శక్తిని ఒకరు హరించుకుంటున్నారు.

జాఫ్రీ: ఇది నిజమే. మనుష్యులు ప్రతిరోజు శక్తిని హరిస్తూనే ఉంటారు. వారు తరచూ ఈ శక్తి హరింపు యొక్క పద్ధతిలోకి మరియు వలయంలోకి పడిపోతుంటారు. దీర్ఘకాలిక రోగాలకు గురైన వ్యక్తుల విషయంలో ఇది తరచూ సంభవించడాన్ని మనం చూడవచ్చు. వారు వారి కుటుంబం నుంచి మరియు వారి స్నేహితుల నుంచి శక్తిని హరించడాన్ని మనం చూడవచ్చు. "ఓహ్, నేను పాపం చేసాను, అందువలనే నేను ఈ అనారోగ్యాన్ని పొందాను" అని చెబుతూ వారు ఇతరుల నుంచి శక్తిని హరిస్తారు. ప్రతీ అనారోగ్యపు మనిషి ఈ విధంగానే ప్రవర్తిస్తాడని నేను చెప్పడం లేదు, మీకు మీరుగా అక్కడున్న పరిస్థితిని అనుభూతి చెందుతూ తెలుసుకోవాలి. నిజానికి కొంతమంది మాత్రం శక్తి హరింపు కోసమే ఇటువంటి మాటలను ఉపయోగిస్తారు. మీరు దీనికి ప్రతిస్పందించకపోతే, వారు మిమ్మల్ని ఏదో తప్పు చేశారని భావించేలా చేస్తారు. నిజానికి ఆమె రాసినట్టుగా శృంగారపరమైన దౌర్జన్యాలకు గురైన వారితో పనిచేసినప్పుడు, వారు బాధితులుగాను మరియు నేరస్థులుగాను ఉండడాన్ని మీరు చూడగలరు. వారు వివిధ రకాలైన పద్ధతుల ద్వారా, అంటే తప్పు లేదా నేరం లేదా పాపం చేశాననే భావనల ద్వారా శక్తిని హరిస్తుంటారు. ఇది బయటకు తెలియకపోవచ్చు, ఇది మీ మొహంలో కనిపించకపోవచ్చు, కాని ఈ శక్తి హరింపు యొక్క పద్ధతులు సంభవిస్తూనే ఉంటాయి. ఈ శక్తి హరింపు అనేది మరింతగా శక్తిని హరించడానికి కారణమవుతోంది.

లిండా మరియు నేను, ఈ శక్తి హరింపు గురించి చాలా క్లాసులలో మాట్లాడాం. ఈ శక్తి హరింపు అనేది కేవలం ఏ ఇద్దరి మధ్యనో జరగడం లేదు, నిజానికి ఇది అతిపెద్ద పరిమాణంలో జరుగుతోంది. మేము దీనిని చాలాచోట్ల గుర్తించాం.

నిన్న రాత్రి టీ.వి. న్యూస్‌లో 'రియాల్టీ షో సెలబ్రిటీ' యొక్క ఆత్మహత్యా సంఘటనను మేము చూశాం. శక్తి హరింపుకు మరియు రియాల్టీ షోకి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ప్రతి ఒక్కరూ రియాల్టీ షో సెలబ్రిటీగా ఉండాలని ఎందుకు కోరుకుంటారో మీకు తెలుసా! మొదటి కారణం, గుర్తింపు మరియు శక్తి కోసమే. ఎందుకంటే వీరి యొక్క టీ.వి. షోలు కొనసాగినంత వరకూ ప్రజలు వీరిని చూస్తారు కనుక. ఈ షోలు ఆగిపోయినప్పుడు, వీరు చేసే శక్తి హరింపు ఆగిపోతుంది. వీరు ఇకపై ఏ మాత్రం శక్తి హరింపు కొనసాగించలేరు. అందువలన, ఈ షో బిజినెస్‌లలో ఉన్న సెలబ్రిటీస్ చాలా అధికశాతంలో ఆత్మహత్యలను చేసుకుంటున్నారు. ఆటగాళు ్ళ, ముఖ్యంగా రిటైర్ అయిన ఆటగాళ్ళు ఏదో ఒక స్థాయిలో అధికంగా శక్తి హరింపు చేయాలని ప్రయత్నిస్తారు. వీరు టీ.వి. ఛానెళ్ళ ద్వారా గుర్తింపును పొందాలని కోరుకుంటారు. ప్రజలు వీరికి కరచాలనం ఇవ్వాలని, వీరి ఆటోగ్రాఫ్ తీసుకోవాలని మరియు ఉన్నతమైన స్థానంలో వీరిని చూడాలని, తరచూ వీరు కోరుకుంటారనే విషయం మీకు తెలుసా! ఈ టీ.వి. ప్రోగామ్స్ ఆగిపోయినట్లయితే, వీరి యొక్క శక్తి హరింపు కూడా ఆగిపోతుంది. అందువలన వీరు నిరాశకు లోనవుతూ మత్తుపదార్థాలకి అలవాటు పడుతుంటారు మరియు వీరు శృంగారపరమైన సమస్యలకు కూడా లోనవుతుంటారు. మనం దీని గురించి మరొక టెలీక్లాస్‌లో వివరంగా చర్చించుకుందాం.

కాని నేను మిమ్మల్ని ఇతరులతో మీకున్న శారీరకపరమైన బంధాన్ని ఒకసారి గమనించమని అడుగుతున్నాను. నిజానికి ఇదే అధిక శాతంలో శక్తి హరింపు జరగడానికి స్థానంగా ఉంటోంది. మీరు ప్రేమపూర్వకమైన మార్గంలో ఇతరులతో అతిసన్నిహిత శారీరక అనుభవాన్ని పంచుకుంటున్నప్పుడే, ఈ శక్తి హరింపు సంభవిస్తుంది. ఈ సమయంలోనే ఇతరులు దీనిని సులభంగా చేయగలరు. మరొక విధంగా చెప్పాలంటే, మీరు ఈ అనుభవాన్ని ప్రేమపూర్వకంగా అనుభూతి చెందుతున్నారా, ఇది మీ ఇద్దరికి సంతృప్తిని ఇస్తోందా, ఇది ప్రేమను పంచుకున్నట్టుగాను మరియు ఆనందకరంగాను ఉందా, లేక మీరు ఈ సమయంలో శక్తి హరింపు జరుగుతున్నట్టుగా అనుభూతి చెందుతున్నారా? ఎందుకంటే ఈ అత్యంత సన్నిహితమైన సమయంలోనే అధికంగా శక్తి హరింపు జరుగుతుంది కనుక.

లిండా: ఇక్కడ కొంతమంది కొన్ని ప్రశ్నలను ఇంటర్‌నెట్ ద్వారా అడుగుతున్నారు, అవేమిటంటే: "భార్య మరియు భర్త, తల్లిదండ్రులు మరియు పిల్లల

మధ్య ఉన్న బంధాలు సాధారణమైన బాంధవ్యాలా లేక శక్తిని హరించే బాంధవ్యాలా అనే దానిని ఎలా గుర్తించాలి? మనల్ని శక్తి హరింపు చేయమని ప్రేరేపించేది ఏమిటి?"

జాఫ్రీ: మీరు ఇతరులతో బంధాన్ని మీ మనసు ద్వారా కాకుండా, మీ హృదయం మరియు పొట్ట ద్వారా అనుభూతి చెందండి. ఇతరులు మీపై ఒత్తిడిని కలుగజేస్తున్నారా, వారు మిమ్మల్ని తప్పు చేశారని అనుభూతి చెందేలా చేస్తున్నారా, మీరు వారికి తగినట్టుగా ఉండడం లేదని భావించేలా వారు మీతో ప్రవర్తిస్తున్నారా, మీ జీవితంలో మీరు ఏం చెయ్యాలి లేదా ఏం చెయ్యకూడదు అనే వాటిని మీకు చెబుతున్నారా, లేక వారు మిమ్మల్ని ఉన్నదిఉన్నట్టుగా అంగీకరిస్తూ ప్రేమిస్తున్నారా – అనే వాటిని మీ హృదయం ద్వారా, మీ పొట్ట ద్వారా అనుభూతి చెందండి. నా ఉద్దేశ్యం ప్రకారం, మిమ్మల్ని ఉన్నదిఉన్నట్టుగా అంగీకరిస్తూ ప్రేమించడం అనేదే నిజమైన బంధానికి పునాది. కాని మీ చుట్టూ చాలా కుతంత్రాలు జరుగుతున్నా, లేక ఇతరులు మిమ్మల్ని విశ్వసించలేకపోతున్నా, లేదా ఇతరులు ఎల్లప్పుడూ మీపై భారాన్ని మోపుతున్నా, లేదా వారు మిమ్మల్ని ఎల్లప్పుడూ కించపరుస్తున్నా, లేదా మీపై సమస్యలను రుద్దుతున్నా, లేదా వారి యొక్క బాధ్యతను తీసుకోమని, వారికి సహాయం చేయమని మిమ్మల్ని తరచూ అడుగుతున్నా – నిజానికి అక్కడ జరుగుతున్నది శక్తి హరింపే. ఇది అన్నిచోట్ల సంభవిస్తోందని మీరు తెలుసుకోండి. నా ఉద్దేశ్యం, ఈ శక్తి హరింపు అనేది మీ యొక్క అన్ని బంధాలలో సంభవిస్తూనే ఉంది. మీరు ఈ శక్తి హరింపు జరుగుతున్న ప్రదేశాల పట్ల ఇప్పటి నుంచి ఎరుకను పొందడం ఆరంభిస్తూ, మీరు దీనిని ఆపుతారని మేము ఆశిస్తున్నాం. కాబట్టి మనం దీనిని చేయడం ఇప్పటి నుంచే ఆరంభిద్దాం. మనకి ఇంకా మరొక ఇరవై నిమిషాలే ఉంది, అందువలన నేను దీని గురించి ఇప్పుడు మాట్లాడి ఆ తర్వాత మిగతా ప్రశ్నలకు సమాధానమిస్తాను.

ఈ శక్తి హరింపు జరుగకుండా ఎలా అరికట్టాలి, ఇతరులు మీ నుంచి లేదా మీరు ఇతరుల నుంచి శక్తిని హరించకుండా మీరు ఎలా ఆపాలి? నిజానికి ఇది చాలా సులభం. మీరు కేవలం ఈ శక్తి హరింపు ఆగాలని ఎరుకతో ఎంపిక చేసుకుంటే చాలు, ఇది ఆగిపోతుంది. మీరు దీని కోసం పూజలు లేదా వ్రతాలు చేయవలసిన అవసరం లేదు, నిజానికి మీరు దీని కోసం ఏమీ చేయవలసిన అవసరం లేదు. కేవలం ఎరుకతో కూడిన స్పష్టమైన ఎంపికను ఎంచుకుంటే చాలు – "నేను ఈ శక్తి హరింపుని ఆపాలని అనుకుంటున్నాను, ఇకపై నేను ఇతరుల శక్తిని హరించను మరియు అదే విధంగా ఇతరులు నా శక్తిని హరించడానికి అనుమతించను." ఆ తర్వాత ఏం సంభవిస్తుందంటే, ఇతరులు మీ శక్తిని హరిస్తున్న దాని పట్ల మరియు మీరు ఇతరుల శక్తిని హరిస్తున్న దాని పట్ల ఎరుకను పొందడం ఆరంభిస్తారు. మీరు

ఎప్పుడెప్పుడు ఈ శక్తి హరింపుకి లోనయ్యారు అన్నది మీకు స్పష్టంగా తెలియడం ఆరంభమవుతుంది. ఉదాహరణకి చిన్న చిన్న విషయాలైనా కూడా, అంటే మీరు ఒక రోజు రాత్రి టీ.వి న్యూస్ చూస్తున్నప్పుడు అకస్మాత్తుగా మీకు మీరు ఈ విధంగా చెప్పుకుంటారు – "ఒకప్పుడు ఈ టీ.వి. న్యూస్ ద్వారా నా శక్తి హరింపబడినది" అనే విషయాన్ని మీరు తెలుసుకుంటారు.

నిజంగానే ఈ టీ.వి.న్యూస్ ద్వారా మీ శక్తి హరిస్తుంది. ఈ టీ.వి.న్యూస్‌ల్లో చాలా కుట్రలు, కుతంత్రాలు ఉంటాయి. అయినప్పటికీ ఇది వ్యక్తిగతమైనది కాదు, ఇది ఒక విధమైన సామూహిక చైతన్యానికి సంబంధించినది. నిజానికి ఈ చైతన్యం మీ శక్తిని హరిస్తూ మీలో ఆందోళనలను సృష్టిస్తుంది. నేను ఆఖరిసారి ఆనందంగా న్యూస్‌ని ఎప్పుడు చూశానన్నది నాకు సరిగ్గా గుర్తులేదు, ఎందుకంటే ఈ న్యూస్‌లు తరచూ ఆందోళనను, అలజడిని, గందరగోళాన్ని మరియు సందేహాలను సృష్టిస్తూ మన శక్తిని హరిస్తుంటాయి కనుక. ఇక్కడ మళ్ళీ ఒకసారి గుర్తుచేస్తున్నాను, ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరుగట్లేదు, కేవలం సహజంగా సంభవిస్తోంది.

మీ శక్తిని ఇతరులు హరిస్తున్నారనే దాని యొక్క ఎరుకను పొందండి. ఈ శక్తి హరింపును గుర్తించడానికి సంబంధించిన ఒకానొక సులభమైన సంకేతం ఏమిటంటే, మీరు ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు, వారు మీ సొంత పరిధిలోకి మిమ్మల్ని వెళ్ళనివ్వకుండా మీ చేయి పట్టుకుని ఆపుతున్నట్లయితే, అక్కడ శక్తి హరింపు జరుగుతున్నట్టే అని అర్థం. కేవలం మీరు ఈ శక్తి హరింపు ఆగాలని ఎరుకతో ఎంపిక చేసుకుంటే చాలు, ఇతరులు మీ నుంచి శక్తిని హరిస్తున్నారనే దాని పట్ల ఎరుకను పొందడం మొదలుపెడతారు.

లిండా: ఒక స్పష్టమైన ఉదాహరణ ఏమిటంటే, అధికారం, రాజకీయాలు మరియు రాజకీయనాయకుల యొక్క రంగస్థలం. వీరు అతి స్పష్టంగా శక్తి హరింపును చేస్తారు, వీరు గుర్తింపు మరియు పేరు-ప్రతిష్ఠల ద్వారా ఈ శక్తి హరింపును చేస్తారు మరియు ముఖ్యంగా వీరు ఎన్నికల సమయంలో వీరి మాటల ద్వారా ఈ శక్తిని హరిస్తుంటారు.

జాఫ్రీ: అవును, ఇంతకు ముందే మనకు U.S లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి కదా! ఆ సమయంలో ఛానల్స్ ద్వారా మరియు ప్రకటనల ద్వారా శక్తి హరింపు సంభవించింది. ఇలా చెబుతున్నందుకు క్షమించండి: రాజకీయాలు మరియు రాజకీయనాయకులు, వారిని పోషించుకోవడానికి ఇతరుల యొక్క శక్తిని హరిస్తుంటారు. కాని మీరు ఈ హరింపు ఆగాలని ఎరుకతో ఎంపిక చేసుకున్నట్లయితే, మీరు ఇకపై దీనిలో ఏ మాత్రం ఉండబోరు. మీరు ఈ నాటకం నుంచి బయటకు రావడం ఆరంభిస్తారు. మీరు ఈ నాటకం నుంచి విడిపోతారు.

ఇక్కడ ఏం సంభవిస్తోందంటే, శక్తి హరులు మీ అంతరంలో జరుగుతున్న దానిని అనుభూతి చెందగలరు. మొదట్లో, మీరు ఎందుకు ఇలా ఉన్నారనేది తెలుసుకోవడానికి వారు పదే పదే ప్రయత్నిస్తారు. "ఈ మనిషికి ఏమైంది, నేను వచ్చిన ప్రతీసారి నాకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించేవాడు కదా, ఇప్పుడు నాకు ఏమీ లభించట్లేదే" అని మీ గురించి తెలుసుకోవడానికి వారు ప్రయత్నిస్తారు. మీరు ఇటువంటి సమయాలలో కేవలం బ్రీతింగ్ చేస్తే చాలు. మీరు దీని గురించి మీ చుట్టూ తెల్లని కాంతిని పెట్టుకోవాల్సిన అవసరం లేదు, మీరు ప్రత్యేకమైన బట్టలనుగాని లేదా ప్రత్యేకమైన వస్తువును గాని ధరించవలసిన అవసరం లేదు. మీరు ఇక్కడ కేవలం ఎరుకతో కూడిన ఎంపికను ఎంచుకుంటే చాలు, నిజానికి వారికి వారుగానే వెనక్కి తగ్గుతారు. వీరు ఈ ఆట నుంచి విడిపోవడం వలన, వీరు శక్తి హరింపు కోసం మరొక మనిషిని వెతుక్కుంటారు. మీరు కూడా ఏదో ఒక సమయంలో ఈ శక్తి హరింపు అవసరమని అనుభూతి చెందుతారు. మీరు ఈ విధంగా అనుభూతి చెందినప్పుడు ఒక్క నిమిషం వెనుకకు తగ్గుతూ, మీ అంతరంలోకి వెళ్ళి లోతైన శ్వాసను తీసుకోండి. మనం ముందు చెప్పుకున్న దానిని గుర్తుంచుకోండి: మీకు కావలసిన ప్రతీది మీ అంతరంలోనే ఉంది, మీరు మరొక వ్యక్తి దగ్గర నుంచి పొందాల్సిన అవసరం లేదు, మీరు వేరే ఎక్కడి నుంచో పొందాల్సిన అవసరం మీకు ఏమాత్రం లేదు.

మీ బ్యాటరీ, మీ అంతర్‌శక్తి బ్యాటరీ తనకుతానుగా రీచార్జ్ అవ్వగలదు. మీరు దీని గురించి బయటకు వెళ్ళాల్సిన అవసరం లేదు, మరొక వ్యక్తి దగ్గర నుంచి లేదా మరొక ప్రదేశం నుంచి పొందవలసిన అవసరం ఏమాత్రం లేదు. ఇది మీలోనే ఉంది. మీరు దీనిని విశ్వసించలేక పోతున్నట్లయితే, కనీసం ఒకసారి ప్రయత్నించి చూడండి, లేదా ఒక లోతైన శ్వాసను తీసుకుంటూ మీ అంతరంలోకి వెళ్ళడానికి ప్రయత్నించండి. దీనినే మేము "నేను తత్వంగా" పిలుస్తాం – ఇది మీ అంతరంలోనే ఉంది.

మీరు మీ "నేను తత్వాన్ని" తిరిగి గుర్తించడం మొదలుపెట్టినట్లయితే, ఇది మీ అంతరంలో శక్తిని పుట్టిస్తుంది మరియు ఇది క్రమక్రమంగా అభివృద్ధి చెందడం మొదలుపెడుతుంది. మీరు ఎటువంటి నాటకాలను లేదా కుతంత్రాలను ప్రదర్శించవలసిన అవసరం లేదని, మీరు గుర్తించడం మొదలుపెడతారు. ఇతరులు మిమ్మల్ని ఇకపై ఏమాత్రం ఆడించలేరు. నాకు తెలిసి ఇదే అతి సులభమైన పరిష్కారం. మనం దీని గురించి చాలాసేపు మాట్లాడుకోగలం. ఈ శక్తి హరింపు యొక్క వలయం ఆగిపోవాలని ఎరుకతో ఎంపిక చేసుకోండి. ఆ తర్వాత, ఇతరులు మీ నుంచి శక్తి హరించడాన్ని ఎరుకతో గమనించడం మొదలుపెట్టండి. దీని అర్థం, మీరు వెంటనే

దీనిని చేయనివ్వకుండా ఇతరులను ఆపమని కాదు మరియు వారికి ఇలా చెప్పమని కాదు: "నువ్వు నా శక్తిని హరిస్తున్నావు, అందుకనే నేను నిన్ను తిరస్కరించబోతున్నాను." మీరు కేవలం ఇక్కడ చేయాల్సినది ఏమిటంటే, లోతుగా శ్వాసను తీసుకుంటూ ఈ శక్తి హరింపు యొక్క బంధం నుంచి బయటకు రావాలని ఎంపిక చేసుకోండి. దీనినే మరొక విధంగా చెప్పాలంటే, మీ లోపల ఇతరుల యొక్క శక్తిత్రాడులు ఉన్నట్లయితే, వారి లోపల కూడా మీ శక్తిత్రాడులు ఉంటాయి.

ఈ బంధం నుంచి విడిపోవాలని ఎప్పుడైతే మీరు అనుకుంటారో, అప్పుడు ఎవరి శక్తిత్రాడులు వారి దగ్గరకు చేరుతాయి. మీరు ఈ బంధం నుంచి విడిపోతూ, మీ శక్తిత్రాడులను మీరు తిరిగి వెనుకకు తీసుకోండి. మీ లోపల ఉన్న ఇతరుల శక్తిత్రాడులను విడుదల చేయండి. మనమందరం పూర్తి స్వతంత్రం కలిగిన స్వేచ్ఛా జీవులమనే విషయాన్ని మనం మర్చిపోయాం. మనం మన బాంధవ్యాలను ఈ శక్తి హరింపుపై ఆధారపడి ఉంచాల్సిన అవసరం లేదు. బాధితుడుగాను మరియు నేరస్థుడిగాను ఉంటూ మన బాంధవ్యాలను కొనసాగించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతీది మీ అంతరంలోనే ఉంది కనుక. మీరు ఇతరులతో బంధాన్ని కలిగి ఉండే పద్ధతి, మీరు ప్రపంచానికి స్పందించే పద్ధతి మార్పు చెందుతాయనే విషయాన్ని – మీరు తెలుసుకుంటారు. ప్రపంచం, ఇకపై మీ నుంచి శక్తిని హరించలేదు. అలాగే మీరు కూడా ప్రపంచం నుంచి శక్తిని హరించాల్సిన అవసరం లేదు. ప్రజలు వారి సొంత స్వేచ్ఛను, వారి సొంత వ్యక్తిగత ప్రేమను మరియు వ్యక్తిగత గౌరవాన్ని గుర్తించిన ప్రపంచాన్ని మీరు ఒకసారి ఊహించండి. అప్పుడు ఈ శక్తి హరింపు యొక్క చక్రం పూర్తిగా ఆగిపోతుంది. ఓహ్, ఇది చాలా అద్భుతంగా ఉంటుంది.

లిండా: మీరు ఎరుకను పొందడం మొదలుపెట్టిన వెంటనే ఇటువంటి ప్రపంచం తయారవ్వడం మొదలుపెడుతుంది.

జాఫ్రీ: ఈ "సెక్సువల్ ఎనర్జీ స్కూల్" ద్వారా ఇది సంభవిస్తుంది. అందువలనే దీనిని మేము చేయడం ఆరంభించాం. ఈ వర్క్‌షాప్‌ను నిర్వర్తించే టీచర్స్‌ను మేము ప్రపంచమంతటా కలిగి ఉన్నాం. లిండా దీనిని చాలాసార్లు చేసిన తర్వాత, ఆమె ఒకరోజు నాకు చెప్పిన విషయం ఏమిటంటే, "నేను విషయాలు ఒకే విధంగా ఉ ండకుండా నిరంతరం మార్పుచెందడాన్ని ఇకపై చూస్తాను." ఆమెకు ఇది చాలా నచ్చింది. ఎందుకంటే, మీరు ఎక్కడ హరింపు సంభవిస్తోందనే దానిని సులభంగా గుర్తించడం మొదలుపెడతారు కనుక. మీరు ఇతరులను అధికంగా ప్రేమిస్తుంటారు, మీరు దీనిని ఏ మాత్రం ఎరుక లేకుండా చేస్తారు. ఇది ఒక పాత పద్ధతి మరియు ఇది ఒక పాత ఆట. దీనిని ఆపడానికి ఇదే సరైన సమయం.

లిండా: ఓహ్, ఇక్కడ చాలా రకాల విషయాలు ఉన్నాయి. నేను ఇప్పుడు మీకు చదివి వినిపిస్తాను.

ప్రశ్న: నా భర్త మా పెళ్ళైన 45 సంవత్సరాల నుంచి, అతను నన్ను బద్ధకస్తురాలు అని పిలుస్తున్నాడు, కాని నేను తరచూ ఊపిరి తీసుకోలేనంతగా అలసిపోతుంటాను. నా భర్త బయటకు వెళ్ళినప్పుడు నేను ప్రశాంతతను మరియు పూర్తి శక్తిని అనుభూతి చెందుతాను. ఆ సమయంలో నేను ఇంటి పనులన్నింటిని చేయగలుగుతున్నాను, కాని అతను ఇంటికి వచ్చిన వెంటనే నేను విచ్ఛిన్నమైపోయినట్టుగా అనుభూతి చెందుతాను. నేను దీనిని మార్చడానికి ఏం చేయాలి?

జాఫ్రీ: ఇది శక్తి హరింపుకి సరైన ఉదాహరణ మరియు ఇది రాసిన వ్యక్తికి నేను ఇచ్చే సమాధానం ఏమిటంటే, మీరే ఇది జరగడానికి అనుమతిస్తున్నారు. మీరు చాలా సంవత్సరాలుగా ఈ సమస్యను గుర్తిస్తున్నారు. మీరు ఇలా సంభవిస్తోందని గుర్తించడం చాలా మంచి విషయం. కాని ఇప్పుడు ఈ సమయంలో మీతో మీరు ఈ విధంగా చెప్పుకోవాలి: "ఇకపై నేను ఏ మాత్రం శక్తి హరింపుని అనుమతించను." మీరు దీని గురించి అతనికి చెప్పవలసిన అవసరం లేదు. మీరు దీని గురించి ఎవరితోను చెప్పవలసిన అవసరం లేదు. కేవలం మీకు మీరు ఈ విధంగా చెప్పుకుంటే చాలు: "ఇకపై నా నుంచి శక్తి హరింపు జరుగదు." ఇప్పుడు దీనిని అతను మానసికపరమైన స్థాయిలో అనుభూతి చెందగలడు మరియు అతను దీనిని ఇష్టపడకపోవచ్చు. కాని ఇక్కడ అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు నిజానికి మీ సొంత కాంతిలో ఉంటూ సంతోషంగా ఉండగలరు. ఆ తర్వాత, అతను ఈ ఆటను అదే విధంగా కొనసాగిస్తాడా లేక ఆపుతాడా అన్నది అతని ఇష్టం.

మీరు మొట్టమొదటిగా ఈ ఉత్తరంలో, అతను మిమ్మల్ని బద్ధకస్తురాలు అని పిలుస్తున్నట్టుగా చెప్పారు. మీ దగ్గరకు ఒక వ్యక్తి వస్తూ అతను మిమ్మల్ని మూర్ఖురాలిగా పిలిస్తే ఎలా ఉంటుందనే దానిని ఒక్కక్షణం ఊహించుకోండి. అది మీకు ఒక విధమైన ఇబ్బందిగా ఉంటుంది. ఈ విధంగా మిమ్మల్ని ఇతరులు పిలిచినప్పుడు, మీరు మీ సరిహద్దులన్నీ అకస్మాత్తుగా పడిపోయినట్టు అనుభూతి చెందుతారు. ఇటువంటి సమయంలో ఈ వ్యక్తులు మీ అంతరంలోకి చొరబడుతూ మీ శక్తిని హరించడం ఆరంభిస్తారు. నిజానికి అప్పుడే ఇది సంభవిస్తుంది. ఈ టెలీక్లాస్ వింటున్న మీ అందరిని నేను అడిగే ప్రశ్న: ఇతరులు మిమ్మల్ని ఈ విధంగా పేర్లు పెట్టి పిలుస్తున్నప్పుడు, లేదా మీ తల్లిదండ్రులు లేదా మీ భాగస్వామి లేదా వేరెవరైనా మిమ్మల్ని పేర్లు పెట్టి పిలుస్తున్నప్పుడు, మీరు ఇటువంటి బంధాలను ఎందుకని పట్టుకుని ఉంటున్నారు

మరియు ఈ బంధాన్ని మీరు ఎలా అనుభూతి చెందుతున్నారు అనేవి మీరు తెలుసుకోండి.

**లిండా: నిజానికి ఇదీ ఒక బంధమేనా?**

జాఫ్రీ: అవును, ఇది బంధమే. కాని మీరు కోరుకుంటున్నది ఇటువంటి బంధమేనా? ప్రేమ, గౌరవం మరియు ఆనందంతో కూడిన బంధాన్ని మీతో మీరు పెట్టుకుంటే, అది ఎలా ఉంటుంది? ఈ విధంగా బాధపడే బంధంలో మీరు ఎందుకు ఉంటున్నారు అనే విషయాన్ని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. అతను మీతో ఉన్నప్పుడు, మీరు శక్తి క్షీణతను మరియు అలసటను అనుభూతి చెందుతున్నారు. అతను బయటకు వెళ్ళగానే మీరు మీ సొంత ఆనందంలో ఉంటున్నారు. నిజానికి మీ సొంత బానిసత్వం కూడా ఒక విధమైన శక్తి హరింపుగా ఉంటూ, మీరు ఇతరుల శక్తిని హరించడానికి ఎలా కారణమవుతోందనే విషయాన్ని గమనించడానికి ఇదే సరైన సమయం. దీనిని మరొక రకంగా చెప్పాలంటే, నిజానికి మీరు ఇక్కడ నేరస్థురాలిగా కూడా ఉంటున్నారు. మీలో ఒక భాగం అతని నుంచి శక్తిని హరిస్తోంది, కాని ప్రస్తుతం మీరు దానిని చూడలేకపోవచ్చు. అతను బయటకి వెళ్ళిన వెంటనే, అతను కూడా ఈ విధంగా అనుకోవచ్చు: “ఆహ్, నేను ఇంటి నుంచి బయటకు రాగానే నాకు చాలా ప్రశాంతంగా ఉంటుంది అని.” వాస్తవానికి, మనమందరం చేస్తున్నది ఇదేనని తెలుసుకోండి. మనమందరం బాధితులుగాను మరియు నేరస్థులుగాను కూడా ఉంటున్నాం. మీ అంతరంలోనే ప్రతీది ఉందని గుర్తించడమే – దీనికి నిజమైన పరిష్కారం. మీరు శక్తిని సంగ్రహించడానికి బయటకు వెళ్ళవలసిన అవసరం లేదు, అదే విధంగా మీ నుంచి శక్తిని సంగ్రహించడానికి ఇతరులను అనుమతించవలసిన అవసరం కూడా లేదు. మీకు కావలసిన ప్రతీది మీ అంతరంలోనే ఉంది.

లిండా: “ఆత్మలకు సంబంధించిన శక్తి హరింపుకు ఇది ఎలా వర్తిస్తుంది?” అని చాలామంది అడుగుతున్నారు.

జాఫ్రీ: ఆత్మలకు సంబంధించిన విషయంలో, ఈ శక్తిహరింపు అనేది చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఆత్మలైనంత మాత్రాన మనుష్యుల కంటే ఎక్కువగా ఆలోచనలను చదవలేవనే విషయాన్ని గుర్తించండి. వాటికి ఏ ఇతర ప్రత్యేక శక్తులు ఉండవు. కాని వాటికి ఆ శక్తులు లేకపోయినా, వాటికి ఉన్నట్లుగా మిమ్మల్ని నమ్మించడానికి ప్రయత్నించవచ్చు. ఎందుకంటే వారు చనిపోయారు, అంటే నా ఉద్దేశ్యం వారికి భౌతిక శరీరం లేదు అని. అందువలన మీరు ఎరుకతో స్పష్టమైన ఎంపికను ఎంచుకుంటూ ఈ విధంగా మీతో మీరు చెప్పుకోండి: “ఏ ఇతర జీవులు,

ఆత్మలు, జంతువులు మొదలైనవి ఏవైనా సరే నా నుంచి ఏ మాత్రం శక్తిని హరించలేరు" అని. మీ అంతరంలో మీ సొంత ఉత్తేజాలు ఆకస్మికంగా మార్పుచెందుతాయి. 'హే, నా నుంచి శక్తిని మీకు దమ్ముంటే దొంగిలించండి' అని మీరు ఒక పెద్ద జెండాను ఎగురవేయనక్కర్లేదు. ఈ ఆత్మలు మీ చుట్టూ వ్రేలాడుతూ మీరు ఏం చేస్తున్నారనేది చూస్తాయి. మీరు బాధితుడి పాత్రలోకి వెళ్ళడాన్ని ఇవి చూడగలవు. అంటే నేను తప్పు లేదా పాపం చేశాను అనే భావనను మీరు అనుభూతి చెందిన వెంటనే అవి మీ లోపలికి వస్తూ శక్తిని హరిస్తాయి. అవి వీటినేమి పట్టించుకోమని మరియు మిమ్మల్ని వదిలి వెళ్ళనని మీకు తిరిగి చెప్పినప్పటికీ కూడా, మీరు వీటితో ఈ విధంగా స్పష్టంగా చెప్పండి: 'నేను ఇకపై ఏమాత్రం శక్తి హరింపుని అనుమతించను' అని. అలాగే మీతో మీరు ఈ విధంగా చెప్పుకోండి: "నేను స్వేచ్ఛా జీవిని, నేను దైవాన్ని కూడా", ఇకపై నేను దీనిని ఏ మాత్రం అనుమతించను. ఆ తర్వాత వారికి వారుగా మిమ్మల్ని వదిలి వేస్తారు. వారు నిజంగా ఇది చేస్తారు. ఎందుకంటే, వారు సులభంగా శక్తిని ఇచ్చే మరొక వ్యక్తిని ఎంచుకుంటారు కనుక. మీరు ప్రాథమికంగా చేయవల్సినది ఏమిటంటే, "నేను ఇది జరగడానికి ఇకపై అనుమతించను" అని. త్వరలోనో లేదా ఆ తర్వాతనో వారు మిమ్మల్ని వదిలి వేస్తారు.

లిండా: 'నువ్వు నా నుంచి శక్తిని హరిస్తున్నావు' అని మనం ఇతరులకి తెలియజేయడం అనేది సరైనదేనా?

జాఫ్రీ: నిజానికి ఇలా చేయడం సరైనది కాదు. ఎందుకంటే వారు దీనిని తిరస్కరించవచ్చు లేదా ఇది మరొక రకమైన శక్తి హరింపుకు దారి తీయవచ్చు. వారు దీని పట్ల మరింత నీచ బుద్ధితోను మరియు వేరొక ప్రత్యేక స్థాయిల్లోను మీపై ఒత్తిడిని కలుగజేస్తారు. అందువలనే ఇది సరైనది కాదు అని నేను మీకు చెబుతున్నాను. నిజానికి ఇది మనలో ప్రతీ ఒక్కరికి వర్తిస్తుంది. మనం మన సొంత ఆధిపత్యాన్ని తీసుకోవాలి. మనం మన జీవితాలలో శక్తి హరింపుని ఇకపై అనుమతించమనే స్పష్టమైన ఎంపికను ఎంచుకోవాలి.

నేను చాలా త్వరితంగా జరిగే మరొక శక్తి హరింపు యొక్క ఉదాహరణను ఇప్పుడు బయటపెట్టాలని అనుకుంటున్నాను. నాకు తెలిసి దీనిని ప్రతి ఒక్కరూ అనుభూతి చెందుతారు. మీరు షోరూమ్స్‌లోకి షాపింగ్ కోసం వెళ్తుంటారు. మీరు ఆ రోజు చాలా ఆనందంగా ఉండవచ్చు మరియు మీకు ప్రతీది అద్భుతంగా కనిపించవచ్చు, కాని మీరు షాపింగ్‌మాల్‌లోకి వెళ్ళిన వెంటనే మీకు తలనొప్పి రావచ్చు మరియు మీరు అలసిపోయినట్టుగాను, అవిశ్రాంతికి గురైనట్టుగాను అనుభూతి చెందవచ్చు. మీరు కొద్దిపాటి అలజడిని కూడా అనుభూతి చెందవచ్చు. మీరు నిజానికి ఇక్కడ ఏం

చేస్తున్నారంటే, ఇతరుల యొక్క అనుభూతులను మరియు శక్తులను సంగ్రహిస్తున్నారు. ఈ విధంగా మీరు, మీ శక్తిని హరించడానికి మీకు తెలియని వారిని కూడా అనుమతిస్తుంటారు. కాని ఎప్పుడైతే మీరు స్పష్టమైన ఎరుకతో కూడిన ఎంపికను ఎంచుకుంటూ ఇకపై ఇది జరగడానికి ఏ మాత్రం అనుమతించను అని మీతో మీరు చెప్పుకుంటారో, అప్పుడు ఇటువంటి శక్తి పద్ధతులన్నీ మీ నుంచి విడుదల అవ్వడం మొదలుపెడతాయి.

లిండా: నేను ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న సర్వ సాధారణమైనది మరియు ఇది చాలా అంశాలకు వర్తిస్తుంది. సమస్య ఏమిటంటే, “మా అమ్మ మరియు అక్కల ద్వారా, నా జీవితంలో శక్తి హరింపు సంభవిస్తోంది. కాని నేను వారి నుంచి శక్తిని హరిస్తున్నానా లేదా వారు నా నుంచి శక్తిని హరిస్తున్నారా అనేది నాకు తెలియడం లేదు, దీనిని ఎలా గుర్తించాలి?”

జాఫ్రీ: సాధారణంగా మీ నుంచి ఎవరైనా శక్తిని హరిస్తున్నప్పుడు, మీరు కూడా మరొక వ్యక్తి నుంచి శక్తిని హరిస్తారు. ఇప్పుడు మీరు వీరి నుంచి కాకపోయినా, మీ జీవితంలో ఉన్న మీ స్నేహితులు లేదా ఇతర మనుష్యుల నుంచి మీరు శక్తిని హరించవచ్చు. మీరు బాధితురాలి పాత్రలో ఉంటే, మీరు నేరస్థురాలి పాత్రలో కూడా ఉన్నట్టే. ఈ రెండు పాత్రలు ఒకదానితో ఒకటి బంధాన్ని కలిగి ఉంటాయి. మీరు ఈ శక్తి హరింపుకి లోనైనప్పుడు, మీరు బయటి నుంచి శక్తిని గ్రహించడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే మీరు అలసటకు మరియు అవిశ్రాంతికి లోనవుతారు కనుక. మీ జీవితంలో సంభవించే ప్రతీ సమస్యకు ఇదే కారణమని నేను చెప్పడం లేదు. కాని మేము గత పది సంవత్సరాలుగా ప్రపంచమంతా తిరుగుతూ వర్క్‌షాప్స్‌ని నిర్వర్తించినప్పుడు గమనించిన విషయం: ఈ శక్తి హరింపుయే ఒకానొక అతిపెద్ద సమస్యగా ఉంటోందని.

లిండా: ఇక్కడ చాలామంది ఆందోళనపడుతూ అడుగుతున్న విషయం: “నిజానికి మా పిల్లలకు మరియు మాకు మధ్య ఉన్న శక్తులను ఎలా సమన్వయపర్చుకోవాలి?”

జాఫ్రీ: నిజానికి మీ పిల్లలతో బంధాన్ని మరింత ఉన్నతమైన స్థాయిలో ఏర్పర్చుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం. ఎందుకంటే మీ పిల్లలను మీ జీవితంలోకి మరియు ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చినప్పుడు, శక్తిని ఇచ్చేవారిగాను మరియు తీసుకునే వారిగాను కూడా ఉన్నారు. మీ పిల్లలు ఈ విషయాన్ని వారి ఇంగితజ్ఞానం ద్వారా గుర్తించారు మరియు వారు కూడా దీనిని స్వీకరించారు. మీ అంతరంలో

మీరు ఎరుకతో కూడిన ఎంపికను ఎంచుకున్నప్పుడు మరియు "నాకు నేనే మరియు నేను స్వేచ్ఛా జీవిని, నాకు శక్తి హరింపు అవసరం లేదు" అని మీతో మీరు చెప్పుకున్నప్పుడు, దీనిని కూడా మీ పిల్లలు వారి ఇంగితజ్ఞానం ద్వారా గుర్తిస్తారు. దీని వలన మీకు, వారికి మధ్యనున్న బంధం మార్పు చెందుతుంది. మీరు ఇక ఎంతో కాలం ఒకరిపై ఒకరు ఆధారపడరు. శక్తి హరింపు అంటే ఒకరిపై ఒకరు ఆధారపడడమే.

లిండా: మీరు మీ యొక్క సంపూర్ణత్వాన్ని మరియు మీ పట్ల మీరు ప్రేమను నిజంగా అనుభూతి చెందినప్పుడు, శక్తి హరింపు జరగడం చాలా కష్టం. ఎందుకంటే ఈ విధంగా అనుభూతి చెందినప్పుడు శక్తి హరింపుకి అవకాశం ఉండదు కనుక. ఇటువంటి దౌర్జన్యాలకు గురవుతున్న వారికి మా సలహా ఏమిటంటే, సెక్సువల్ ఎనర్జీ వర్క్‌షాప్‌కు హాజరవ్వమని.

జాఫ్రీ: మొదట్లో, సెక్సువల్ ఎనర్జీ స్కూల్ అనేది శృంగార పరంగా దౌర్జన్యాలకు గురైన వారి కోసం సృష్టింపబడింది. కాని ఆ తర్వాత మేము ఇది శృంగార పరమైన దౌర్జన్యాలకు గురైన వారికి మాత్రమే కాదని, ఇది భౌతిక, శారీరక, మనోభావ, మానసిక పరమైన దౌర్జన్యాలకు గురైన ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని మేము తెలుసుకున్నాం.

ఈ దౌర్జన్యాలకు సంబంధించిన చాలా వివరాలు ఈ వర్క్‌షాప్‌లో చెప్పబడతాయి. ఈ వర్క్‌షాప్ మూడు రోజుల పాటు జరుగుతుంది. ప్రపంచమంతటా ఉన్న టీచర్స్ ఈ వర్క్‌షాప్‌ను నిర్వర్తిస్తున్నారు. ఈ వర్క్‌షాప్ జీవితాన్ని మార్చేదిగా ఉంటోందని, దీనిలో పాల్గొన్న 70శాతం మంది మాకు చెప్పారు. సెక్సువల్ ఎనర్జీ వర్క్‌షాప్ అనేది సెక్స్‌కి సంబంధించినది కాదని మళ్ళీ మీకు చెబుతున్నాం. ఈ వర్క్‌షాప్‌లో స్త్రీ-పురుష శక్తుల మధ్య సమన్వయం గురించి, ఈ శక్తుల మధ్య సమన్వయాలోపాలు ఎందుకు ఏర్పడ్డాయి అనే దాని గురించి, ఈ శక్తి హరింపు ఎలా మొదలైనది అనే దాని గురించి మేము మాట్లాడతాం. నిజానికి ఈ స్కూల్‌లో మేము మీ పట్ల మీరు ప్రేమను తిరిగి ఎలా పొందాలి అనే దాని గురించి చెబుతాం. ఎందుకంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నప్పుడే ఈ శక్తి హరింపు విడుదలవుతుంది కాబట్టి. దీని అర్థం మీ బాధితుడు మరియు నేరస్థుడి పాత్రల యొక్క శక్తులు మీ నుండి విడుదలవుతాయి. మీరు దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని www.crimsoncircle.com లో చూడవచ్చు.

ఈ 60నిమిషాలు చాలా త్వరగా గడిచిపోయాయనే విషయాన్ని నేను నమ్మలేకబోతున్నాను. నేను చివరిగా చెప్పేది ఏమిటంటే, దయచేసి మీ జీవితాన్ని

పరిశీలిస్తూ, శక్తి హరింపు జరుగుతున్న ప్రదేశాలను తెలుసుకోండి. దయచేసి, ఇతరులను మరియు అదే విధంగా మిమ్మల్ని నిందించవద్దు. మీ శక్తిని హరింస్తున్న వారి పట్ల ఎరుకను పొందండి. 'ఇకపై నా శక్తిని ఇతరులు హరించడానికి నేను అనుమతించను' అని మీరు ఎరుకతో ఎంపిక చేసుకున్నట్లయితే, మీ శక్తిని ఇతరులు ఏమాత్రం హరించలేరు. మీరు మీ అంతరంలో ప్రతీ దానిని కలిగి ఉన్నారని మరియు మీరు దేని కోసం బయట అన్వేషించవలసిన అవసరం లేదనే స్పష్టమైన ఎరుకతో కూడిన ఎంపికను ఎంచుకోండి. మేము ఈ అందమైన Colorodo సిటీ (US) నుంచి మా ప్రేమను మరియు కరుణను మీకు పంపిస్తున్నాం. ఈ టెలీక్లాస్‌ను చూస్తున్న ఒక్కరికీ మేము కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాం. ఈ ప్రపంచాన్ని అద్భుతమైన స్థలంగా తయారు చేయడానికి మీరు చేస్తున్న పనికి మేము కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాం. థాంక్యూ అండ్ గుడ్ నైట్.

* * * *

## మౌన ప్రార్ధన

నా హృదయంలో, నేను నా స్వచ్ఛమైన ఉనికిని అంగీకరిస్తాను.

నా జీవితంలో, నేను కోరుకుంటున్న ఆనందం ఎప్పటి నుంచో నాలోనే ఉందని అంగీకరిస్తాను.

నేను కోరుకుంటున్న ప్రేమ, నా అంతరంలో ఎప్పటి నుంచో ఉందని నేను అంగీకరిస్తాను.

నేను అడుగుతున్న ప్రశాంతత, నా వాస్తవంలో ఎప్పటి నుంచో ఉందని నేను అంగీకరిస్తాను.

నేను పొందాలని ప్రయత్నిస్తున్న సమృద్ధి, ఎప్పటి నుంచో నా జీవితాన్ని నింపుతోందని నేను అంగీకరిస్తాను.

నా సొంత వాస్తవం ద్వారా, నేను నా స్వచ్ఛమైన ఉనికిని అంగీకరిస్తాను.

నేను నా సొంత సృష్టిలన్నింటిని మరియు నా జీవితంలో ఉన్న విషయాలన్నింటి యొక్క బాధ్యతను స్వీకరిస్తాను.

నేను నా అంతరంలోని ప్రజ్ఞాత్మ యొక్క శక్తిని గుర్తిస్తాను మరియు అన్ని విషయాలు సక్రమంగా ఉన్నాయనే విషయాన్ని తెలుసుకుంటాను.

నా మేధాసంపత్తి ద్వారా, నేను నా స్వచ్ఛమైన ఉనికిని అంగీకరిస్తాను.

నా జీవితంలోని పాఠాలను, నేను నా సొంతంగా మరియు జాగ్రత్తగా ఎంపిక చేసుకున్నాను మరియు ఇప్పుడు పూర్తి అనుభవం కోసం వీటన్నింటి ద్వారా పయనిస్తున్నాను.

నా మార్గం నన్ను దివ్యత్వపు ఆశయంతో కూడిన పవిత్రమైన ప్రయాణం వైపుగా నడిపిస్తోంది.

నా అనుభవాలన్నీ మూలచైతన్యంలో భాగంగా రూపొందుతాయి.

నా జ్ఞానం ద్వారా, నేను నా స్వచ్ఛమైన ఉనికిని అంగీకరిస్తాను.

ఈ క్షణంలో నేను బంగారు వర్ణపు ఆసనంలో కూర్చుని మరియు నేను కాంతి యొక్క దేవతనని తెలుసుకుంటాను.

నేను ప్రజ్ఞాత్మ యొక్క బహుమతిని అందుకుంటూ మరియు నా కోరికలన్నీ నెరవేరాయని తెలుసుకుంటాను.

నన్ను నేను ప్రేమించుకోవడం ద్వారా, నా స్వచ్ఛమైన ఉనికిని అంగీకరిస్తాను.

నన్ను నేను నిర్ణయించుకోను లేదా నాపై నేను భారాలను పడవేసుకోను.

నా గతంలో నాకు అందజేయబడిన ప్రతీది ప్రేమపూర్వకంగా ఇచ్చినదేనని నేను అంగీకరిస్తాను.

ఈ క్షణంలో నా దగ్గరకు వస్తున్న ప్రతీది ప్రేమ నుంచే వస్తోందని నేను అంగీకరిస్తాను.

నాకు భవిష్యత్తులో అందజేయబడే ప్రతీది ఉన్నతమైన ప్రేమను పెంపొందిస్తుందని నేను అంగీకరిస్తాను.

నా ఉనికిలో, నేను నా సంపూర్ణత్వాన్ని అంగీకరిస్తాను.

ఇదే అసలైన విషయం!

* * * *

# ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడం

## "మూల సారాంశాన్ని భౌతిక వాస్తవంగా మార్పు చెందించడం"

ప్రశ్న: "నమస్తే, నాకు ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడం పట్ల స్పష్టత లేదు. నేను అనుభవం పొందాలనుకుంటున్న విషయాన్ని ఎలా సృష్టించాలి? దీనిని ఏ విధంగా సృష్టించాలి అనే దాని పట్ల నాకు అవగాహన లేదు. దీని గురించి మీరు నాకు గైడెన్స్‌ను ఇవ్వగలరా? థాంక్యూ."

సమాధానం:

డియర్ ఫ్రెండ్, మేము 'సేంట్ జర్మైన్ మరియు జెషువా'లము.

దయచేసి, ఒక్కక్షణం మాతో కలిసి ఒకసారి లోతైన శ్వాసను తీసుకోండి. మీ మూల సారాంశం యొక్క ప్రేమను అందుకోండి. నిశ్చలంగా ఉంటూ మీ ఆత్మ యొక్క గుసగుసలను వినండి.

మీరు ఎన్నో సార్లు మీ ప్రజ్ఞాత్మతో బంధాన్ని పెట్టుకోవాలని అనుకున్నారు. మిమ్మల్ని ఉత్తేజపర్చే బంధం కోసం, జీవితం పట్ల ఆశను మరియు ఆసక్తిని మీలో నింపే బంధం కోసం మీరు ఎదురు చూస్తున్నారు. మీరు ఈ బంధం ఏర్పడుతున్న అనుభవాన్ని కొద్ది కొద్దిగా పొందుతున్నప్పటికీ, ఇది కొంతకాలం తర్వాత మళ్ళీ మాయమై పోతున్నట్టుగా మీరు అనుభూతి చెందుతున్నారు. ఇక్కడ ఏం సంభవిస్తోంది అనేది మీకు అర్థం కావడం లేదు!

### గైడెన్స్‌ను పొందడం

బహుశా మీరు వాస్తవాన్ని సృష్టించడానికి సంబంధించిన గైడెన్స్ అనేది ఒక కాంతిలా పై లోకం నుంచి క్రిందికి దిగి వస్తుందని మీరు ఆశించవచ్చు. కాని అది ఎప్పుడూ మీ యొక్క నిశ్చలస్థితిలో, మీ అంతరం నుంచి వినపడే గుసగుసల నుంచి వస్తుంది. ఇదే మీ ఆత్మ యొక్క గొంతు. ఇది మీ అంతర్వాణి. మీరు మీ ప్రస్తుత పరిస్థితులను మెరుగుపర్చుకోవాలనే కోరికలకు మరియు ఆందోళనలకు ప్రభావితం కానప్పుడు, మీరు మీ ఆత్మ యొక్క గొంతును వినగలుగుతారు.

మీ మనసులోని అంచనాలు మీరు సృష్టించాలనుకునే బలమైన కోరికలతో కలిసినప్పుడు అవి మిమ్మల్ని అలజడికి మరియు అవిశ్రాంతికి లోనయ్యేలా చేస్తాయి. ఇవి మీరు ఏం చేయాలనే దాని పట్ల మీరు స్పష్టతను పొందనివ్వకుండా, మీ

మనసును ఆందోళనకు గురిచేస్తూ మీ మనోభావాలను తీవ్రతరం చేస్తాయి. ఇది విసుగు, అపజయం మరియు అలసట యొక్క అనుభూతులను సృష్టిస్తుంది. ఇది కొత్తదనం మరియు సమన్వయంతో కూడిన సరైన చర్యలను చేయనివ్వకుండా అడ్డుపడుతుంది.

మీ ఆత్మ యొక్క పిలుపును వినడానికే మీరు ఇక్కడకు వచ్చారు. ఇది ప్రేమను మరియు మేధాసంపత్తిని మీకు అందిస్తుంది. ఈ విషయాన్ని మీ ఆత్మకు విడిచిపెట్టండి. ఏం చేయాలనేది దీనికి ఖచ్చితంగా తెలుసు. మీరు కేవలం చేయాల్సినది ఏమిటంటే, అది చెబుతున్న దానిని నిశ్శబ్ధంగా వినడమే.

మీ ఆత్మ యొక్క మాటను వినడానికి మీరు మొదటిగా మీ మనసును ప్రశాంతం చేసుకోవాలి మరియు మీ కోరికల యొక్క తీవ్రతను శాంతపర్చాలి. నిశ్చలంగా లేని నీటి పై భాగంలో ప్రతిబింబించేవి అస్పష్టంగా ఉంటాయి లేదా క్రింది భాగపు లోతులను తెలియనివ్వదు. ఇదే మీ సంభాషణకు కూడా వర్తిస్తుంది. మిమ్మల్ని మీరు కనుగొనడానికి మీ అంతరంలో నిశ్శబ్ధాన్ని అనుమతించండి, దయచేసి దీని కోసం ప్రయత్నించవద్దు. ఇది ఒక సహజమైన స్థితి. మీ మనసు నిశ్శబ్ధంగా ఉన్నప్పుడు మరియు మీ మనోభావాలు ప్రశాంతంగా ఉన్నప్పుడు, మీ నిజమైన కోరికలన్నింటిని నెరవేర్చుకోవడంలో మీకు సహాయం చేసే గైడెన్స్‌ను మీరు పొందుతారు.

నిశ్చలస్థితిని పొందడం

నిశ్చలస్థితిని చేరుకోవాలనుకున్నా మరియు మీ ఆత్మ నుంచి గైడెన్స్‌ను పొందాలనుకున్నా, మీ చుట్టూ ఉన్న ప్రతీ విషయంతో మిమ్మల్ని మీరు గుర్తించుకోకుండా, మీరు ప్రతీ విషయాన్ని అనుభూతి చెందగలగాలి. మీరు దేనినైనా అనుభూతి చెందడానికి భయపడుతున్నట్లయితే, ఈ భయం మిమ్మల్ని మీ చుట్టూ ఉన్న దివ్యత్వం యొక్క ఉనికిని అనుభూతి చెందే మీ సామర్థ్యంతో కలవనివ్వకుండా ఆటంకపరుస్తుంది.

మీరు మీ ఆత్మతో తిరిగి బంధాన్ని ఏర్పర్చుకోవాలనుకుంటే, మీరు మొదటిగా మీ అంతరంలో ఉన్న పాత మనోభావ సంబంధిత గాయాలతో బంధాన్ని ఏర్పర్చుకోవడానికి సుముఖతను చూపాలి. ఇవన్నీ మీ అంతర్భాగాలే, ఈ భాగాలు మిమ్మల్ని గతంలో వేర్పాటు భావనను మరియు ద్వేషింపబడిన అనుభూతిని పొందేలా చేసాయి. మీరు విచ్ఛిన్నమైన మీ భాగాలన్నింటిని తిరగి కలుపుతూ మరియు మీ సంపూర్ణత్వాన్ని అనుభూతి చెందాలంటే, మీరు మీ గాయాలను తిరిగి అనుభవించాలి,

కాని వాటితో మిమ్మల్ని మీరు గుర్తించుకోకుండా వీటిని అనుభవించగలగాలి.

ఈ విధంగా మీ పాత గాయాలను అనుభూతి చెందడానికి మిమ్మల్ని మీరు అనుమతించు కున్నప్పుడు, మీరు గతంలో ద్వేషింపబడిన, తిరస్కరింపబడిన మరియు వేరుచేయబడిన అనుభూతులను పొందిన మీ యొక్క భాగాలను సురక్షితంగా ఇంటికి రమ్మని స్వాగతించగలరు. మీరు వీటిని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరిస్తూ, ఇవి ఉన్నతంగా పరివర్తనం చెందడానికి మీ ప్రేమను వీటికి అందించాలి. మీ గతాన్ని హీల్ చేసినప్పుడు, మీరు భయం లేకుండా మీ మనోభావాలను అనుభూతి చెందగలిగే సామర్థ్యాన్ని తిరిగి పొందగలుగుతారు, మరియు దీని వలన మీ ఆత్మ నుంచి వచ్చే గైడెన్స్ యొక్క ప్రవాహాన్ని గ్రహించ గల మీ సామరధ్యం అభివృద్ధి చెందుతుంది.

మీరు మీ పాత గాయలను స్పృశించినప్పుడు, దయచేసి మీ పట్ల మీరు చాలా సున్నితత్వంతో వ్యవహరించండి మరియు మీ సొంత దివ్యత్వం నుంచి వస్తున్న ప్రేమను అంగీకరించండి. ఇది మిమ్మల్ని హత్తుకోవడానికి మరియు మిమ్మల్ని పట్టుకోవడానికి అనుమతించండి. మీరు ఒంటరి వారు కాదని మరియు మీరు నిజంగా ప్రేమించబడుతున్నారని, మీరు సురక్షితంగాను మరియు క్షేమంగాను ఉన్నారనే విషయాన్ని ఇది మీకు గుర్తుచేస్తుంది.

మీ గతాన్ని నిందించకుండాను, అంచనావేయకుండాను, నిర్ణయించకుండాను – మిమ్మల్ని మీరు యధాతధంగా ప్రేమించుకున్నప్పుడు, మీరు మీ ఆత్మ నుంచి సహాయాన్ని విస్తృతంగా పొందుతారు. మీరు మీ అంతరంలోని నిశ్శబ్దపు ప్రదేశంలోకి ప్రవేశిస్తారు. ఇదే మీ ఆత్మతో తిరిగి బంధాన్ని ఏర్పర్చే స్థలం. ఇక్కడ నుంచే మీ ఆత్మ, మీ గతానికి సంబంధించిన బాధలు మరియు ఒంటరితనం వలన ఏర్పడిన అడ్డులకు అతీతంగా చేరే స్థితికి మిమ్మల్ని తీసుకువెళ్తుంది. మీరు మీ ఆత్మతో తిరిగి కలుపబడినట్టుగా మరియు మీరు ఉత్తేజింపబడుతున్నట్టుగా అనుభూతి చెందుతారు.

## ఆత్మప్రవాహంలోకి ప్రవేశించడం

ఈ నిశ్చలస్థితి యొక్క ప్రదేశం నుండే, ప్రేమ మరియు సమన్వయం గల మీ ఆత్మ ప్రవాహంలోకి ప్రవేశిస్తారు. సృజనాత్మకత, బాంధవ్యాలు లేదా ఏ విషయంలోనైనా మిమ్మల్ని మీరు ఉన్నతంగా వ్యక్తపర్చుకునే పద్ధతిని ఇది మీకు చూపిస్తుంది. మీ నిశ్చలస్థితి యొక్క అనుభవం నుంచి ఉద్భవించిన సులభత్వం యొక్క ప్రవాహం మీకు ఆనందాన్ని మరియు ఉత్తేజాన్ని అందించే విషయాలను సృష్టించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది, మరియు ప్రపంచం యొక్క సత్యాన్ని మరియు

సౌందర్యాన్ని స్వేచ్ఛగా అన్వేషించడానికి, ఇది ఒక సురక్షితమైన ప్రదేశమని ఈ ప్రవాహం మీకు హామినిస్తుంది.

మీరు ఇకపై మీకు సంతృప్తినివ్వని పరిస్థితుల్లోకి, లేదా మిమ్మల్ని ఉత్తేజపర్చడానికి బదులు అవిశ్రాంతికి లోనయ్యేలా చేసే పరిస్థితుల్లోకి పడిపోరు. మీరు భౌతికపరంగా, మనోభావపరంగా, లేదా ఆర్థికపరంగా బ్రతకడానికి మీకు సంతృప్తినివ్వని లేదా అవిశ్రాంతికి లోనయ్యే పనులను తప్పనిసరిగా చేయాలనే నమ్మకాలను మీ నుంచి ఎప్పుడైతే విడుదల చేస్తారో, అప్పుడు మీరు ఇవే అనుభవాలను అదే పనిగా సృష్టించడం ఆపివేస్తారు.

మీ బాంధవ్యాలు కూడా మార్పు చెందుతాయి. మీరు ముందే స్థిరపర్చుకున్న విషయాలను కోల్పోతాననే భయాన్ని లేదా కొత్తదనాన్ని సృష్టించడం పట్ల ఉన్న భయాన్ని విడుదల చేసినప్పుడు, మీ బాంధవ్యాలు కూడా మార్పు చెందుతాయి. మీరు ఈ భయాలను విడుదల చేసినప్పుడు, మీరు సురక్షితంగా ఉన్నారనే అనుభూతిని పొందేలా చేసే వాతావరణాన్ని నిర్మించడం అవసరం అనే భ్రమ ద్వారా చూస్తారు. మరియు మీరు సరికొత్త విశ్వాసంతోను మరియు నమ్మకంతోను మీ జీవితాన్ని గడపడం ఆరంభిస్తారు.

### ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడం

ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడం యొక్క ప్రక్రియలో మీరు ప్రాథమికంగా వేయాల్సిన అడుగులు ఎన్నో ఉన్నాయి. మీకు వీటి గురించి ముందుగానే తెలిసి ఉండవచ్చు, కాని ఇప్పుడు మేము వీటిని మీతో మళ్ళీ పంచుకోవాలని అనుకుంటున్నాం.

1) మొట్టమొదటిగా, మీ ప్రపంచం పట్ల మరియు మీ పట్ల మీరు కలిగిఉన్న నమ్మకాలకు తగిన వ్యక్తులను, విషయాలను మరియు అనుభవాలను – మీ జీవితంలోకి ఆకర్షిస్తారనే విషయాన్ని మీరు గుర్తించాలి.

2) మీరు తరచూ వీటిని అచేతనస్థితిలో ఆకర్షిస్తున్నారు, కాని మీరు వీటిని ఎరుకతో కూడా ఆకర్షించగలరు.

3) మీరు వీటిని అచేతనస్థితిలో సృష్టిస్తున్నట్లయితే, మీరు పరిష్కరింపబడని భయాలకు, లేదా మీ జీవితంలో ఏదో కోల్పోయాననే లేదా ఏదో సాధించలేదనే నమ్మకాలకు ప్రతిస్పందించవచ్చు.

4) కాని మీరు ఎరుకతో సృష్టించినప్పుడు, మీరు మీ మనసులో ఉన్న కొరత భావనను నిరాకరిస్తారు. మీరు దైవం యొక్క శిశువు అని మరియు దైవం కూడా అని గుర్తుంచుకోండి. మీరు ఏవిధమైన హృదయ వాంఛలనైనా కలిగి ఉండవచ్చు, ఎందుకంటే మీరే అంతా.

5) మీకు కావలసిన ప్రతీది ఇప్పుడు మీ అంతరంలో ఉందని విశ్వసించండి. అది ఏదైనప్పటికీ, ఒక ఆనందకర అనుభవమైనా, ప్రేమపూరిత క్షణమైనా లేదా కరుణతో కూడిన పదమైనా కూడా.

6) మీరు దేనిని నిరాకరించడం లేదనే దృఢచిత్తంతో, మిమ్మల్ని మీరు చూసుకోండి మరియు మీరు సృష్టించాలని అనుకున్న దాని యొక్క మూలసారాంశాన్ని మీరు ముందు నుంచి ఎలా అనుభవిస్తున్నారో గమనించండి – ఇది సంపద, బాంధవ్యం లేదా మరేదైనా కావచ్చు.

7) మీరు కోరుకుంటున్న వాటి యొక్క సారాంశాన్ని, మీరు ముందు నుంచి ఎలా అనుభవిస్తున్నారనే దానిని గుర్తించిన తర్వాత, మీరు అంతకన్నా ఎక్కువ కావాలని ఎంపిక చేసుకోండి.

8) ఇదే ఎరుకతో వాస్తవాన్ని సృష్టించడానికి అతి ముఖ్య సూత్రం: మీరు ఆనందిస్తున్న దానిని మరింత ఎక్కువగా కావాలని అడగండి. మీ జీవితంలో వీటి యొక్క మూలసారాంశాన్ని, మీరు ఎప్పటి నుంచో కలిగి ఉన్నారనే విషయాన్ని గుర్తించండి.

9) మీరు ఈ విధంగా చేసినప్పుడు, మీరు ఈ మూలసారాంశాన్ని వాస్తవరూపంలోకి సులభంగా పరివర్తనం చెందించగలరనే విషయాన్ని కనుగొంటారు. మీరు కావాలనుకుంటే దీనిని చాలా కొత్త మార్గాలలో చేయవచ్చు, లేదా ఇప్పుడు మీరు ఆనందిస్తున్న దానిని పెంచుకోవచ్చు లేదా ఉన్న దానితో సంతృప్తి పడవచ్చు.

10) వీటి యొక్క వివరాల్లోకి వెళ్ళే ముందు, వీటి మూల సారాంశంపై దృష్టి పెట్టండి.

11) ఉదాహరణకు మీరు మీ జీవితంలో మరింత ప్రశాంతతను పొందాలని కోరుకుంటున్నట్లయితే, మీరు ప్రస్తుతం అనుభూతి చెందుతున్న ప్రశాంతతను గుర్తిస్తూ దానికి మీ కృతజ్ఞతలను తెలపండి మరియు మరింత ప్రశాంతత కావాలని అడగండి. మీరు ఈ మరింత ప్రశాంతతను ఎలా ఆనందించాలని అనుకుంటున్నారో దాని

గురించి మీ మూలసారాంశానికి తెలియజేయండి. కాని మీకు అందజేయబడిన దానిని అంగీకరించడానికి సుముఖతను చూపండి. మీ ఆత్మ మీకు తగిన వాటిని అందిస్తుందని విశ్వసంచండి.

12) మీరు దైవం యొక్క శిశువు అని, మీరు కూడా దైవమని, మీరే అంతా అనే దానిని ఎన్నటికీ మర్చిపోవద్దు. మీరే దైవం అయినందు వలన, ప్రస్తుతం మీరు కోరుకుంటున్న దాని యొక్క మూలసారాంశాన్ని ఆనందించగలరు. ఆ తర్వాత మిగతా పరిస్థితులన్నీ మీ ఆకర్షణ మరియు విస్తరణలపై ఆధారపడి ఉంటాయి.

13) మీరు కొరత యొక్క భ్రమను నిరాకరించినప్పుడు, మీరు సమృద్ధి యొక్క వాస్తవాన్ని ధృవీకరిస్తారు.

14) ఇది వ్యక్తీకరణ యొక్క మార్గాన్ని తెరుస్తుంది, మరియు మీ హృదయం కోరుకున్న దానిని సృష్టించడానికి ఇది మిమ్మల్ని అనుమతిస్తుంది.

ఇది www.joyandclarity.com నుంచి సేకరించబడినది.

* * * *

## విరాళాలు

ఇంతకు ముందు చెప్పిన విధంగా నేను 2007 జూన్‌లో నా ఆడిటర్ ప్రాక్టీస్‌ను ఆపివేసి న్యూ ఎనర్జీ కాన్సెప్ట్‌ను ప్రచారం చేయడం మొదలుపెట్టాను. అప్పటి నుంచి నాకు సొంత ఆదాయమంటూ ఏమీ లేదు. నాకు ఇప్పటి వరకూ ధన సహాయం చేసి, ఈ న్యూ ఎనర్జీ కాన్సెప్ట్ గురించి దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి అవకాశం కల్పించిన వారందరికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

మీరు చేసిన ధన సహాయము వలన నేను డబ్బు తీసుకోకుండా క్లాస్‌లు చెప్పగలిగాను. ఈ కాన్సెప్ట్‌ను మరింతగా ప్రచారం చెయ్యడం కోసం, నేను జూలై 2009 నుంచి ఫ్రీ క్లాస్‌లతో పాటు, పెయిడ్ క్లాసెస్‌ను మరియు వర్క్‌షాప్స్‌ను కూడా నిర్వహిస్తున్నాను.

నేను న్యూ ఎనర్జీ మాస్టర్‌ని, నేను ఎన్నో అద్భుతాలు సాధించాను. ఈ మార్గంలో రావాలని అనుకుంటున్న వారికి ప్రోత్సాహాన్ని ఇస్తున్నాను. మీరు చేయబోయే ధన సహాయం ఈ క్రింది చెప్పిన ఖర్చులకు ఉపయోగపడుతుంది.

1. భారతదేశం అంతటా తిరిగి న్యూ ఎనర్జీ కాన్సెప్ట్ ప్రచారం చేయడానికి.

2. న్యూ ఎనర్జీ మెటీరియల్‌ను తెలుగులోను మరియు ఇతర భారతీయ భాషలలోను అనువదించాలని అనుకుంటున్నాము. నా సీ.డి.లు, నా క్లాస్‌లు విన్నాక చాలా మంది భారతీయ భాషలలోకి అనువదించి పంపమని కోరుతున్నారు.

3. www.darmam.com అనే వెబ్‌సైట్‌ను నడపడానికి, వివిధరకాల భాషలలో అనువదించిన వాటిని ఈ వెబ్ సైట్‌లో పెట్టడానికి మరియు ఉచితంగా వాటిని అందరికి అందుబాటులోకి తీసుకురావడానికి మీ ధన సహాయం మాకు అవసరం.

My account details :

| | |
|---|---|
| Name | : P. Sreedhar |
| A/c type | : Savings bank |
| Account number | : 30603897922 |
| Bank | : State bank of India (SBI) |
| Branch | : Hanumakonda |
| Branch code | : 3422 |
| City | : Hanumakonda, Warangal District, Andhra Pradesh,India. |
| My Mobile No | : +91 - 9390151912 |
| My Email Id | : sreedharnewenergy@gmail.com |
| Visit my website | : www.darmam.com |

మాకు మీ సహాయము: ప్రోత్సాహాన్ని, ఉత్తేజాన్ని మరియు ఆనందాన్ని కలిగిస్తుంది.

బై ఫ్రెండ్స్....

* * * *

www.darmam.com

# న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్స్

www.darmam.com

**1.** హైదరాబాద్
న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్, వరంగల్.
♦ పి.శ్రీధర్ (న్యూ ఎనర్జీ కాన్షియస్‌నెస్ మాస్టర్)
ఫోన్ నెం: +91-9390151912.
**e-mail: sreedharshaumbra@yahoo.com**

**2.** హైదరాబాద్
న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్, హైదరాబాద్.
♦ కె.ప్రసన్న, ఫోన్ నెం : +91-9032431443
**e-mail: prasannashaumbra@yahoo.com**

**3.** బళ్ళారి
న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్, బళ్ళారి.
♦ పి.బి.వినుత, ఫోన్ నెం: +91-9743753716
**e-mail: vinutha.shaumbra@gmail.com**

**4.** రాజమండ్రి - అర్తమూరు
న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్, అర్తమూరు.
♦ సురేష్, ఫోన్ నెం: +91-8919055847

**5.** పులివెందుల
న్యూ ఎనర్జీ స్పిరిచువల్ నాలెడ్జ్ సెంటర్, పులివెందుల.
♦ పి.వెంకట రామిరెడ్డి, ఫోన్ నెం: +91-8919055847

www.darmam.com



* * * *